# భారతీయ సమాజము - నిర్మితి మరియు మార్పు

## ఎం.ఏ. - సమాజశాస్త్రము , మొదటి సంవత్సరం - నాల్గవ పేపరు


**రచయితలు:**

**ఆచార్య సి. నటరాజన్ (రిటైర్డు)**
ఎమ్.ఎస్. విశ్వవిద్యాలయం
తిరునైవేలి
తమిళనాడు

**డా॥ సి. గణేష్**
అసోసియేట్ ప్రొఫెసర్
సమాజశాస్త్ర విభాగం
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్

**జి. రామారావు,** ఎం.ఏ.
సమాజశాస్త్ర ఉపన్యాసకులు
ఎ.ఎస్.ఎన్. డిగ్రీ కళాశాల, తెనాలి.

**ఎమ్. కుసుమ కుమారి,** ఎం.ఏ.,
సమాజశాస్త్ర ఉపన్యాసకులు
వి.ఎస్.ఆర్. & ఎన్.వి.ఆర్. కళాశాల, తెనాలి.

**యం.డి. క్రిష్టఫర్,** ఎం.ఏ.,
సామాజిక శాస్త్ర ఉపన్యాసకులు
ఆంధ్రక్రైస్తవ కళాశాల, గుంటూరు.

**రచయితలు:**

**యన్. సుబ్రమణ్యం**
సమాజశాస్త్ర ఉపన్యాసకులు
మాంటిస్సోరి మహిళా కళాశాల
విజయవాడ

**అనువాదకులు:**

**డా॥ ఎమ్.ఎస్. పార్థసారథి**
విజిటింగ్ ప్రొఫెసర్, ఛైర్మన్ బోర్డాఫ్ స్టడీస్ సోషియాలజీ
సోషియాలజీ, సోషల్ వర్క్ & ఐ.ఆర్.పి.ఎమ్. విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**సంపాదకులు:**

**యన్. సుబ్రమణ్యం,** ఎం.ఏ.
సమాజశాస్త్ర ఉపన్యాసకులు
మాంటిస్సోరి మహిళా కళాశాల, విజయవాడ.

**ప్రధాన సంపాదకులు:**

**ఆచార్య సి.హెచ్. ఉమామోహన్**
ఛైర్మన్, బోర్డాఫ్ స్టడీస్, సమాజశాస్త్ర విభాగం
శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం అనంతపూరు - 515003, ఏ.పి.

**సమన్వయకర్తలు**

**ఆచార్య ఎం. లక్ష్మీపతి రాజు,** ఎం.ఏ., ఎం.యస్.డబ్ల్యు., పి.హెచ్.డి.
విజిటింగ్ ప్రొఫెసర్, సోషియాలజీ, సోషల్ వర్క్ మరియు ఐ.ఆర్.పి.ఎమ్. విభాగం.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ వై. వెంకటేశ్వర్లు,** ఎం.ఏ., పి.హెచ్.డి.
సమాజశాస్త్ర విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

Director
**Dr. NAGARAJU BATTU**
M.B.A., M.H.R.M., L.L.M., M.Sc. (Phy), M.A. (Soc.), M.Ed., M.Phil., Ph.D.
Dept. of HRM



## దూర విద్యా కేంద్రము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.
Ph: 0863-2293299, 2293356 (08645), 211023, 211024 (Study Material)
Cell : 98482 85518
E-mail : Info@anucde.ac.in
Website: www.anucde.ac.in (or) www.anucde.info

**M.A. Sociology : Indian Society Structure and Change**

Edition: 2021

No. of Copies: 246

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Printed at:

**Romith Technologies**

Guntur.

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతిపథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.

కులపతి (FAC)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# 104SO21: INTRODUCTION TO INDIAN SOCIETY

**Course Objectives**: The main objective of this paper is : To Provide/disseminate knowledge on theoretical Approaches regarding foundation of Indian Society, the Significance of social institutions i.e. marriage, family and tribal development.

**Course Outcomes**: Train up the students to gain knowledge on theories, and significance of social institutions, Social Stratification and tribal development.

**Unit I:**

1. Theoretical Approaches to the Study of Indian Society (Indological, Structural, Functional Dialectical, Subaltern)
2. Composition of Indian Society: Unity in Diversity (Racial, Ethnic, Religious, Linguistic and Cultural Groups)
3. Understanding Indian Society through Traditional Values (Hindu view of life – Varna, Purusharthas, Ashrama, concepts of Karma and Rebirth)

**Unit II:**

1. Caste System (Concept of Varna, Jathi - Features of caste system, Theories of Origin)
2. Caste, Class and Power, Caste as a form of Social Inequality
3. Social stratification and Inequality: Issues and Emerging Trends in India

**Unit – III**

1. Marriage in India : Types of Marriages
2. Forms of Hindu Marriage
3. Marriage among Muslims and Christians

**Unit - IV:**

1. Family in India : Types of Family
2. Advantages and disadvantages of Joint Family
3. Modern Family in Rural and Urban Setting

**Unit - V:**

1. Tribals: Who are they? Their features
2. Tribal Heritage
3. Tribal Development.

**<u>Recommend books:</u>**


1. Prabu Padarinath : Hindu Social Organization
2. M.N. Sreenivas : Social change in Modern India
3. J.H. Huttan : Caste in India
4. Mandle Baum, David : Society in India
5. Ahuja Ram : Indian social system
6. Yogendra singh : Modernization of Indian tradition

## విషయ సూచిక


**యూనిట్ 1- భారతీయ సమాజ అధ్యయనము**

| | | | |
|---|---|---|---|
| పాఠం | 1. | భారతీయ సమాజ అధ్యయనమునకు సిద్ధాంతపరమైన దృక్పథాలు | 1.1 - 1.9 |
| పాఠం | 2. | భారతీయ సమాజపు సమ్మిశ్రమము - భిన్నత్వంలో ఏకత్వం | 2.1 - 2.20 |
| పాఠం | 3. | భారతీయ సమాజాన్ని సాంప్రదాయక విలువల ద్వారా అర్థం చేసుకొనుట | 3.1 - 3.13 |
| పాఠం | 4. | కుల వ్యవస్థ | 4.1 - 4.29 |

**యూనిట్ 2 - ముఖ్యమైన సామాజిక సంస్థలు**

| | | | |
|---|---|---|---|
| పాఠం | 5. | కులము - వర్గము మరియు శక్తి | 5.1 - 5.5 |
| పాఠం | 6. | సాంఘీక అసమానతా రూపముగా కులము | 6.1 - 6.6 |
| పాఠం | 7. | సామాజిక స్తరీకరణ మరియు అసమానత | 7.1 -7.9 |
| పాఠం | 8. | అసమానత - శాశ్వతత్వము | 8.1 - 8.6 |
| పాఠం | 9. | వివాహము | 9.1 - 9.12 |
| పాఠం | 10. | హిందూ వివాహ వ్యవస్థ | 10.1 - 10.11 |
| పాఠం | 11. | ముస్లిములలో వివాహ వ్యవస్థ | 11.1 - 11.8 |
| పాఠం | 12. | క్రైస్తవ వివాహ వ్యవస్థ | 12.1 - 12.3 |
| పాఠం | 13. | కుటుంబ వ్యవస్థ | 13.1 - 13.6 |
| పాఠం | 14. | ఉమ్మడి కుటుంబ వ్యవస్థ | 14.1 - 14.9 |
| పాఠం | 15. | గిరిజన సామాజిక వ్యవస్థ (ఆదిమ తెగ) | 15.1 - 15.6 |
| పాఠం | 16. | గిరిజన సామాజిక వ్యవస్థ మరియు లక్షణాలు | 16.1 - 16.8 |
| పాఠం | 17. | గిరిజన సామాజిక వ్యవస్థ (గిరిజన కుటుంబం) | 17.1 - 17.7 |
| పాఠం | 18. | గిరిజన సామాజిక వ్యవస్థ (ఆదిమ తెగ - మతము) - సంక్షేమ కార్యక్రమాలు | 18.1 - 18.9 |


---------------

**యూనిట్ - 1**

# భారతీయ సమాజ అధ్యయనము

**పాఠం-1**

# భారతీయ సమాజ అధ్యయనమునకు సిద్ధాంత పరమైన దృక్పథాలు

విషయక్రమం:


1.1 ఉద్దేశ్యము

1.2 పరిచయము

1.3 ఇండోలాజికల్ ఉపగమము

1.4 సబాల్టరన్ ఉపగమము

1.5 నిర్మితి రూపక పద్ధతి

1.6 ప్రకార్య ఉపగమము

1.7 గతితార్కి ఉపగమము

1.8 భారతదేశంలో గతితార్కిక అధ్యయనాలు

1.9 ముఖ్యపదములు

1.10 ప్రశ్నలు

1.11 చదవదగిన గ్రంథాలు


## 1.1 ఉద్దేశ్యము:

భారతీయ సమాజ అధ్యయనమునకు ఉపకరించు వివిధ సిద్ధాంతపరమైన దృక్పథాలను వివరించుట. అవి:

1) ఇండోలాజికల్ ఉపగమము (Indological Approach)

2) సబాల్టరన్ ఉపగమము (Subaltern Approach)

3) నిర్మితి పూర్వక ఉపగమము (Structural Approach)

4) ప్రకార్యవాద ఉపగమము (Functional Approach)

5) గతి తార్కిక ఉపగమము (Dialectical Approach)

## 1.2 పరిచయము:

భారత సమాజ అధ్యయనము ఇటీవలనే ఆరంభమయ్యిందని చెప్పవచ్చు. ఆంగ్లేయుల పరిపాలనా కాంలో అధికారులు క్రైస్తవ మిషనరీలు తమ పరిపాలన సక్రమంగా సాఫీగా కొనసాగడానికి భారతీయ సంస్కృతి, భారతీయ సమాజ పరిజ్ఞానము అవసరమని కనుగొనడం జరిగింది. భారతీయ సమాజ అవగాహనకై విద్యావంతుల, స్థానిక పండితుల సహాయంతో భారత ప్రజల సంస్కృతి, వారి యొక్క జీవన విధానాలను తెలుసుకునేటట్లు ఆంగ్లేయులను అప్పటి పరిస్థితులు చేశాయి. అప్పుడప్పుడు తయారు చేయబడ్డ ఇతివృత్తాలు కొన్ని దశాబ్దాల తర్వాత శాస్త్రీయ పద్దతుల ద్వారా రచించిన వాటికి నాందీవాక్యం పలికాయి. ఉదా: మైసూరులో నివసించిన అబిడుబాయిస్ (Abbedubois) 1816లో రచించిన హిందూ మేనర్స్, కస్టమ్స్ అండ్ పెర్మోనీస్ అను గ్రంథము ఈ నాటికీ ఆధార గ్రంథంగా భావించబడుతుంది. తను నివసించిన భారతదేశ ప్రజల జీవన విధానాలను, ఆచారాలను, మతపరమైన కర్మకాండలను సవిస్తరంగా వివరించాడు. కులాన్ని, కులాల మధ్య సంబంధ బాంధవ్యాలను అధ్యయనం చేసిన మొదటి వ్యక్తులలో ఈయన ఒకరు. ఇరవైయ్యవ శతాబ్ది ప్రారంభంలో భారతదేశ సమాజ అధ్యయనము వృత్తి పర శాస్త్రీయత సంతరించుకుంది. ప్రయోగాత్మక పరిశోధనలపై ఆధారపడి చేసిన అధ్యయనాలు, విశ్లేషణాత్మక అధ్యయనాలు భారతీయ సమాజ అధ్యయనానికి వృత్తిపరమైన దృక్కోణమునిచ్చినాయి. భారతీయ సమాజ ప్రాథమిక లక్షణాలను సామాజిక సంఘటనలకు వృత్తిపరమైన పద్దతిలో విశ్లేషించారు. సైద్ధాంతికి పరమైన దృక్పథాల పరిచయము మరియు వినియోగముల వలన భారతీయ సామాజిక అధ్యయనము వృత్తి పరమైన దృక్కోనము గలదిగా సంస్కరించబడినది.

ఇండోలాజికల్, సబ్అల్టరన్, నిర్మితి పూర్వక, ప్రకార్యాత్మక, గతి తార్కి దృక్పథములు వీటిలో ముఖ్యమైనవి.

## 1.3 ఇండోలాజికల్ ఉపగమము:

భారతీయ సామాజిక వ్యవస్థ మరియు సిద్ధాంతములు భారతదేశ పరిసరాలకు మాత్రమే సరిపోతాయనే అభిప్రాయం మీద ఇండోలాజికల్ ఉపగమము ఆధారపడి ఉంటుంది. ఇది భారతదేశ భూభాగానికి మాత్రమే వర్తిస్తుంది. స్థూలంగా మిగతా పరిసరాలకు విస్తరింపజేయడానికి వీలుపడదు. దాని ప్రాముఖ్యత, అర్థాలు భారతదేశానికి మాత్రమే సరిపోతాయి. భారతదేశ పరిసరాల అవతల ఇది సరిగా అర్థం చేసుకోబడదు. భారత భూభాగం నుంచి వేరుచేస్తే భారత సామాజిక వ్యవస్థలు, సిద్ధాంతాలు వాటి యొక్క ఉనికిని, ప్రాధాన్యతను కోల్పోతాయి. భారతీయ సామాజిక నేపథ్యంలో మాత్రమే వాటి యొక్క ప్రాముఖ్యత అర్థమవుతుంది. విశ్వవ్యాప్త సిద్ధాంతాలకు, భావనలకు వీటిని అన్వయింపచేస్తే వాటి యొక్క సహజత్వము, ఉనికి అర్థంకావు.

ఈ అంశం మీద ఆధారపడి భారత సామాజిక వ్యవస్థను, సిద్ధాంతాలను, భారతదేశ భావనలను వివరించి, విశ్లేషించాలని ఇండోలాజికల్ ఉపగమము నొక్కివక్కాణిస్తుంది. హిందూ గ్రంథాలు భారతదేశ భావనలను వివరిస్తాయి. భారతీయ సమాజ వ్యవస్థలను, భావనలను అర్థం చేసుకోవడానికి ఇండోలాజికల్ ఉపగమము ప్రాంతీయ భాషలో రచింపబడిన గ్రంథాలపై దృష్టి సారించింది.

భారతదేశంలో అనేక భాషలు మాట్లాడతారు. పాళి, ప్రాకృతం, సంస్కృతం, తమిళం అందులో పునాతనమైనవి మరియు గుర్తింపబడినవి. తమిళ భాషకు సంస్కృతంలో సమానమైన సాహితీ సంపద ఉన్నప్పటికీ తమిళం కంటే సంస్కృత సాహిత్యం ఎక్కువగా వ్యాప్తి చెందింది. దాని కాంతి భారతీయ సామాజిక జీవనాన్ని ప్రకాశింపచేసింది.

సంస్కృతం వ్యాపించని చోటులేదంటే అతిశయోక్తి కాదు. భారతదేశమంతటా వ్యాపించిన దీని విస్తృతత్వాన్ని బట్టి భారతీయ సామాజిక వ్యవస్థలు, సిద్ధాంతాలు అధ్యయనం చేయడంలో 'ఇండోలజిస్ట్లు' ఆధారలకై సంస్కృత గ్రంథాలపై దృష్టి కేంద్రీకరించారు. భారతీయ సామాజిక నిర్మితిలోని వివిధ అంశాలను, భారతీయ సామాజిక జీవనంలోని వివిధ కోణాలను అర్థం చేసుకోవడంలో సంస్కృత సాహిత్యం మూలంగా నిలిచింది. సంస్కృత సాహిత్యంలోని ఈ నిర్మాణాత్మక అంశమే భారతీయ సమాజ అధ్యయనానికి ఇండాలజిస్టులు సంస్కృతంపై ఆధారపడేటట్లు చేసింది.

సంస్కృత సాహిత్యంలో అనేక రకాలైన గ్రంథాలు కలవు. శ్రీతులు, స్మృతులు, ఇతిహాసాలు, ఆగమాలు, దర్శనములు సంస్కృత సాహిత్యములో పొందుపరచబడ్డవి.

**శృతులు:**

ఋషులు, మునులు దివ్యజ్ఞానంతో ప్రపంచాన్ని గురించి చెప్పిన నిజాలే ఈ వేదాలు. వేదాలు నాలుగు. రుగ్, యజుర్, సామ, అధర్వణ వేదాలు. ఈ వేదాలలో ఒక్కొక్కటి నాల్గు రకాలుగా వర్గీకరించబడింది. (1) మంత్ర సంహిత, (2) బ్రాహ్మణ, (3) అరణ్యక, (4) ఉపనిషత్తు. శాంతికి, సంతోషకర జీవితానికి దేవతలనుద్దేశించి ప్రార్థించే వైదిక శ్లోకాలే మంత్ర సంహితాలు. దేవతల అనుగ్రహం కోసం చేసే మతపరమైన కర్మకాండలు నిర్వహించే పద్ధతి తెలియజెప్పేదే బ్రాహ్మణాలు.

**స్మృతులు:**

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిష్యము, కల్పము అనేవి ఆరు వేదాంగాలు. ఇవి వేదాల అర్థాన్ని వివరంచడానికి సహాయపడతాయి. సూత్ర వాఙ్మయం శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రములని మూడు విధములు. వేదములందు చెప్పబడిన ధర్మాధర్మమలు సామాన్యులకు తెలియజెప్పడానికి స్మృతులు వ్రాయబడ్డాయి. స్మృతులలో మనుస్మృతి, యజ్ఞవల్క్య స్మృతి ప్రసిద్ధమైనవి.

**ఇతిహాసాలు:**

భారతదేశములో రెండు ఇతిహాసాలున్నాయి. అవి రామాయణం, మహాభారతం. రామాయణమును వాల్మీకి రచించెను. మహాభారతమును వ్యాసుడు రచించెను. ఇవి మహాకావ్యములు. ప్రాచీన భారతదేశములోని ప్రజల జీవితాన్ని, కార్యకలాపాలను వివరిస్తాయి. ఈ గ్రంథంలో ప్రజల ఆచారాలు, విలువలు. వారి జీవనశైలి, కళలు, సంస్కృతి చక్కగా చిత్రీకరించబడినవి.

**పురాణాలు:**

పురాణాలు కూడా ఇతిహాసాల తరగతికి చెందినవే. ఇతిహాసాలను, పురాణాలను పంచమ వేదాలంటారు. పురాణాలు మత పరమైన జ్ఞానాన్ని, సృష్టి యొక్క చరిత్రను, దైవశక్తి గురించి, జీవిత తత్వాన్ని గురించి కథల ద్వారా, కల్పనల ద్వారా విశదపరుస్తాయి.

**ఆగమాలు:**

ఇవి దైవ పరమైన ఉద్గ్రంథములు. ఆరాధనా పద్ధతులు తెలియజేస్తాయి. జ్ఞానానికి, ఆత్మ సాక్షాత్కారానికి మార్గాలను తెలియజేస్తాయి.

**దర్శనములు:**

తత్వ శాస్త్రము యొక్క రూపమే దర్శనములు. తర్క శాస్త్రమును వివరిస్తుంది.

ఈ మతపరమైన గ్రంథాలు విలువలు, సిద్ధాంతాలు, భారతీయ సమాజ వ్యవస్థల గురించి వివరిస్తాయి. భారతీయ సమాజ నిర్మితి గురించి విజ్ఞానాన్ని, సిద్ధాంతపరమైన, విలువైన సమాచారాన్ని అందిస్తాయి. ఇవి గొప్ప ఋషులచే రూపొందించబడినవి. కాబట్టి భారతీయ సమాజాన్ని, దానిలోని అంశాలను గూర్చిన జ్ఞానాన్ని ఏమాత్రం ప్రశ్నించకుండా వీటిని అంగీకరించడం జరిగింది.

భారతీయ సామాజిక వ్యవస్థల లక్షణాలను శాస్త్ర గ్రంథ సాహిత్యంలో ఈయబడ్డ భావనల, వివరణల ద్వారా అర్థం చేసుకోవడానికి, వివరించడానికి ప్రయత్నించింది. వివాహము, కుటుంబం, విద్య, సామాజిక స్తరీకరణ, స్త్రీ అంతస్తు లేక భారతీయ సమాజానికి చెందిన ఏ అంశాన్నైనా వివరించేందుకు శాస్త్ర గ్రంథాలపైనే ఆధారపడింది.

సంస్కృత గ్రంథ సాహిత్యంలో భారతీయ సమాజం వివిధ అంశాల గురించిన పరిజ్ఞానము, తగినంత సమాచారం ఉంది. వివిధ భావనల్లోని సున్నితమైన భేదాలను అర్థం చేసుకోవడానికి సంస్కృత సాహిత్యం ఎంతైనా ఉపయోగపడుతుంది.

ధర్మమనే భావన విశిష్టమైనది. ఆంగ్లభాషలో దీనికి సమానమైన పదం న్యాయము లేదా నైతిక విలువ. అయితే ఈ పదాలు ధర్మాన్ని గురించిన నిర్దిష్టమైన భావనను తెలియజేయలేదు. ధర్మం అనేది న్యాయం, నైతిక విలువల కంటే లోతైనది. ఇది సజీవ సాంప్రదాయాలను, ఉత్కృష్టమైన బాధ్యతలను తప్పనిసరిగా చేయు విధులను తెలియజేయు పదము. ధర్మము, ఇందులో నైతికములైన అనేక అంశాలు నడవడిక, సాంస్కృతిక ఐక్యత మొదలైనవి అన్నీ ధర్మము అనే పదములో యిమిడియున్నవి. ఈ భావనలోని విభిన్న దృక్కోణాలను సంస్కృత ధర్మ సాహిత్యము నుంచి మాత్రమే అర్థం చేసుకోగలం.

**విమర్శ:**

భారతీయ సమాజాన్ని, భావనలను అర్థం చేసుకోవడానికి సంస్కృత సాహిత్యం మూలగ్రంథంగా ఉపయుక్తమవుతుందనుటలో సందేహం లేదు. భారతీయ సమాజ పునాదులను, భారతీయ సమాజ వ్యవస్థ లక్షణాలను అర్థం చేసుకోవడంలో పూర్తిగా సంస్కృత సాహిత్యంపై ఆధారపడడం లోపభూయిష్టమవుతుంది. భారతీయ సమాజాన్ని అన్ని దృక్కోణాల నుంచి ప్రతిబింబింపజేయలేదు.

అగ్రవర్ణాలలోని శ్రేష్ఠ వర్గం మాత్రమే సంస్కృత భాషను వినియోగించేది. పామర జనానికి, తక్కువ వర్ణం వారికి, అవర్ణులకు సంస్కృతము అందుబాటులో ఉండేదికాదు. వారికి విద్యార్హత లేని కారణంగా సంస్కృత నేర్చుకోలేకపోయారు. అగ్రవర్ణాల వారికి, శ్రేష్టులకు విద్య పరిమితమైనది. కనుక వారు సంస్కృతంలో పాండిత్యం సంపాదించి గ్రంథాలు రచించారు.

ఈ విధంగా సంస్కృతం అగ్రవర్ణాల వారికి, శ్రేష్టులకు పరిమితమయింది. కాబట్టి వారి భావాలు, ఉద్దేశ్యాలు మాత్రమే అందులో ప్రతిబింబించాయి. కనుక సంస్కృత సాహిత్యం శ్రేష్ఠ వర్గం వారికి యొక్క అభిప్రాయాలను వ్యక్తం చేసే దానిగా భావించవచ్చును. అందుచేత సమాజంలోని అందరి అభిప్రాయాలను వ్యక్తం చేసేది కాదని వాదం.

వివాహం పవిత్ర బంధమని, ఆ బంధము విడదీయరానిదని, సంస్కృత సాహిత్యంలో వివరించబడింది. కనుక విడాకులను శాస్త్రాలు అంగీకరించవు. సంస్కృత శాస్త్రాలు వ్యక్తం చేసిన వివాహ వ్యవస్థ పవిత్రత బ్రాహ్మణులకు, బ్రాహ్మణ ఆచారాలను పాటించే వారికి మాత్రమే పరిమితమైంది. బ్రాహ్మణ కుల ప్రభావం లేని మిగతా అనేక కులాలు సంస్కృత గ్రంథాలు వ్యక్తం చేసినట్లుగా వివాహ వ్యవస్థను పరిగణించలేదు. కొన్ని కులాల్లో వివాహాన్ని రద్దు చేసుకునేవారు.

ఇదేవిధంగా సంస్కృత గ్రంథాలు వివాహ నిబంధనలు వివరించాయి. సప్రవర, సగోత్ర వివాహాలను యజ్ఞవల్క్యుడు నిషేధించాడు. మిగిలిన ధర్మ శాస్త్రాలు కూడా ఈ విషయాన్ని బలపరిచాయి. కానీ, వాస్తవానికి ఈ నియమం బ్రాహ్మనులకు మాత్రమే వర్తిస్తుంది. మిగిలిన కులాల వారికి వర్తించదు. సంస్కృత గ్రంథాలు చక్కగా రచింపబడినప్పటికీ, ఇవి తప్పు త్రోవ పట్టించేవిగా ఉన్నాయని ఎస్.సి.దూబె అభిప్రాయం. ఇవి ఒకే ఒక విషయమును అనేక కోణాల్లో చూడడం జరిగింది. ఇవి ప్రాథమికంగా ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. దీనికి ఉదామరణగా మహాభారతాన్ని చూపిస్తారు. మహాభారతంలోని స్త్రీలను రెండు భిన్న కోణాల్లో చూపడం జరిగింది. కట్టుబాట్లకు లోనైన ఒక వర్గం స్త్రీలు, కట్టుబాట్లు లేని సామాన్య స్త్రీలు. కట్టుబాట్లు లేని వారు ఎక్కువ స్వేచ్ఛను కలిగి ఉండుటచే వారిని తేలికగా చిత్రీకరించారు. ఇటువంటి పరిస్థితుల్లో స్త్రీల స్థాయిని మనం నిర్దిష్టంగా చెప్పలేము.

పైన పేర్కొనబడిన సంస్కృత సాహిత్య వినియోగంలో పరిస్థితులు దాని యొక్క వినియోగం విలువను ఇండోలాజికల్ ఉపగములో తగ్గించలేకపోయాయి. భారతీయ సమాజాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి సంస్కృత సాహిత్యం ప్రధాన మూలంగా పరిగణించలేకపోయినా, ఇవి భారతీయ సమాజంలోని ఒక భాగం యొక్క లక్షణాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి.

## 1.4 సబాల్టరన్ ఉపగమము:

భారతీయ సమాజం విశిష్టమైన, ప్రత్యేకమైన లక్షణాలను, అంశాలను కలిగిఉందని, భారతీయ సమాజ అధ్యయనానికి అన్వయింపజేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని కొంతమంది విశ్లేషకుల అభిప్రాయము. ప్రత్యేకించి భారత సమాజానికి

మాత్రమే నిర్దేశింపబడినది. కాబట్టి భారతీయ సామాజిక వ్యవస్థలను, సిద్ధాంతాలను సక్రమంగా, సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ పద్ధతియే సరైనదని కొందరు భావించారు. కానీ, ఈ పగమము సంస్కృత సాహిత్యంపై ఆధారపడి ఉండుటచే కొంత మంది దీనియొక్క నిబద్ధతను ప్రశ్నించారు. సంస్కృత సాహిత్యం శ్రేష్టుల వర్గంచే (అగ్రవర్ణాలు, జాతులు) రూపొందించబడినవి. గనుక వారి యొక్క అభిప్రాయాలను మాత్రమే ఇది ప్రతిబింబిస్తుంది. కానీ, సమాజంలో మిగిలిన వర్గాల వారి అభిప్రాయాలను వ్యక్తం చేయదని కొందరి అభిప్రాయం. ఈ అంశం కారణంగా భారతీయుల సమాజ వ్యవస్థ అధ్యయన విషయంలో సంస్కృత సాహిత్యంపై ఆధారపడ్డ ఇండోలాజికల్ ఉపగమము యొక్క విలువ ప్రశ్నించబడింది. శ్రేష్ట వర్గపు పక్షపాతంతో ఏర్పడిన ఇండోలాజికల్ అప్రోచ్‌కు ప్రత్యామ్నాయంగా సబాల్టరన్ ఉపగమము ప్రవేశపెట్టబడినది. భారతీయ సమాజాన్ని అన్ని వర్గాల సామాన్య ప్రజలు దృక్పథము నుంచి విశ్లేషించే పద్ధతి సబాల్టరన్ ఉపగమము. చరిత్ర కాలం నుంచి కూడా భారతీయ సమాజము ముఖ్యముగా రెండు తరగతులుగా విభజింపబడింది. 1) శ్రేష్ట వర్గము 2) పామర జనము: కాలాన్ని బట్టి పేరు మారినప్పటికీ అన్ని కాలములలోనూ సమాజము రెండు తరగతులుగా విభజింపబడింది. ఈ విభజనకు ఆధారం వర్గము, పుట్టుక, విద్య, శక్తి లేక మరేదైనా కారణము అయినప్పటికీ స్థూలంగా సమాజం శ్రేష్టులు మరియు అధికార వర్గము ఒక వైపు. మరొకవైపు శ్రేష్టులు కాని వారు మరియు అణగద్రొక్కబడిన వారు అను రెండు తరగతులుగా విడగొట్టబడినది. శ్రేష్టులు సంఖ్యా పరంగా తక్కువ ఉన్నప్పటికినీ సామాజిక వ్యవస్థలోని ప్రతి రంగంలోనూ ఉన్నారు. శ్రేష్టులు వాని వారు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ వారు అధికారములోని మరియు తక్కువ స్థితిలో అణగద్రొక్కబడిన వారు ప్రక్కకు నెట్టివేసి, తొలగించబడ్డారు. కాబట్టి తక్కువ స్థాయిలో ఉంచబడ్డారు. కాబట్టి వారు సమాజంలో క్రింద స్తరీయములుగా ఏర్పరచబడ్డారు.

ఏ సమాజానికైనా క్రింది స్తరం వారే పునాదులు దృగ్గోచరము కానప్పటికీ వారు సమాజానికి ఆత్మ వంటివారు. వీరి ద్వారా మాత్రమే సమాజ లక్షణాలను అర్థం చేసుకోగలం.

శ్రేష్ట అధ్యయన వేత్తలు సమాజంలోని అన్ని అంశములను శ్రేష్ట వర్గ దృక్కోణం నుంచి మాత్రమే అధ్యయనం చేస్తారు.

ఉదా: శ్రేష్టులు, చారిత్రక దృక్కోణం నుంచి విశ్లేషించు వారు. శ్రేష్ట వర్గం వారు మాత్రమే భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని స్వాతంత్ర్యాన్ని సాధించారని భావించారు. రంజీత్ గుహా మొదలైన సామాజిక వేత్తలు ఈ రకమైన చారిత్రక విశ్లేషణను ఖండించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో సబాల్టరన్ వర్గాలు పోషించిన పాత్రను విస్మరించడం జరిగింది. స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో సబాల్టరన్ వర్గాల వారు లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. 1919 'రౌలత్' వ్యతిరేక ఉద్యమంలోను, 1942 'క్విట్ ఇండియా' ఉద్యమంలోను వలస రాజ్య పాలనకు వ్యతిరేకంగా సబాల్టరన్ వర్గాల వారు స్వచ్ఛందంగా, సామూహికంగా పాల్గొన్నారు. కానీ, చరిత్రకారులు సబాల్టరన్ వర్గాల పాత్రను తక్కువ చేసి శ్రేష్ట వర్గాల పాత్రను మాత్రమే గొప్పగా చిత్రీకరించడం జరిగింది. ఇంతేకాక సబాల్టరన్ వర్గాలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి శ్రేష్టులే కారణమని చెప్పడం జరిగింది.

రంజీత్ గుహా అభిప్రాయంలో రాజకీయాలలో సబాల్టరన్ వర్గాల వారికి ప్రత్యేక పరిధి ఉంది. వారికి రాజకీయ కార్యనిర్వహణ కలదని, వారంతట వారే రాజకీయ కార్యకలాపాలను వారే స్వతంత్రంగా నిర్వహించారని అతని అభిప్రాయము. వారి రాజకీయ పరిధి శ్రేష్ట వర్గ రాజకీయ పరిధికి సమాంతరముగా కలదు. అది స్వతంత్ర్యముగా వ్యవహరించినది. సబాల్టరన్ తిరుగుబాటు దారులను పట్టించుకోకపోవడం వారికి అన్యాయం చేసినట్లేనని గుహా అభిప్రాయపడినారు. సబాల్టరన్ వర్గాలు అధిక సంఖ్యలో కలిగి ఉండి సమాజానికి పుష్టి చేకూర్చడమే కాక, వారి యొక్క జీవనశైలి, సంస్కృతి భారత సమాజపు సంస్కృతిని ప్రతిబింబింపచేస్తాయి. సబాల్టరన్ దృక్పథ వాదుల దృష్టిలో శ్రేష్ట వర్గము సమాజానికి కేవలం పై స్తరం వారు మాత్రమే. సబాల్టరన్ వర్గం వారు సమాజానికి మూలాధారము. భారత సమాజాన్ని అర్థం చేసుకోవడానికి పై పొరను మాత్రమే చూడకూడదని క్రింది స్తరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని కొందరి అభిప్రాయం.

## 1.5 నిర్మితి రూపక పద్ధతి:

నిర్మితి రూపక ఉపగమము: భారతదేశము ప్రత్యేక, విశిష్ట లక్షణాలను కలిగిఉన్నది. కొన్ని లక్షణాలు భారతదేశానికి మాత్రమే పరిమితమై ఉన్నాయి. ఈ కారణము వలన మిగిలిన దేశాల నుంచి వేరు పడక మిగిలిన సమాజాల వలెనే కొన్ని సారూప్య లక్షణాలను కలిగి ఉంటుంది. అటువంటి ముఖ్యమైన లక్షణము నిర్మితి.

భారతదేశంలో గ్రామీణ సమాజము మరియు దాని సంస్థలు విశ్లేషణలో ప్రకార్య పద్ధతి ఉపయోగకరంగా పరిణమించింది. కులము, కుటుంబము, మతము మొదలైన సంస్థల అధ్యయనంలో ఇది ఒక క్రొత్త దృక్పథమును తెచ్చింది.

1.7 గతితార్కిక ఉపగమము:

భారతీయ సమాజ అధ్యయనములో గతితార్కిక వాదన చోటుచేసుకుంది. విషయం గురించి స్థూలంగా సూక్ష్మంగా సంభాషించుకొనుటయే ఈ పద్ధతిలో ప్రాధాన్యత వహిస్తుంది. జర్మన్ తత్వవేత్త హెగెల్ దీనికి తత్వశాస్త్ర స్థాయిని కల్పించాడు. దీనినతడు తార్కిక శాస్త్ర పద్ధతిగా వినియోగించాడు. గతితార్కిక వాదం ప్రవచించిన వారిలో హెగెల్ కూడా ముఖ్యుడుగా పరిగణించబడతాడు. హెగెల్ ప్రకారం మానసిక సామాజిక అభివృద్ధి అంతా కూడా వ్యతిరేక వక్తుల వలన జరుగుతుంది. అతని అభిప్రాయంలో జీవాత్మ పదార్ధాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. జీవాత్మ స్వేచ్ఛగా ఉంటుంది. పదార్థం యొక్క కట్టుబాటు ఈ రెండింటి మధ్య పోరాటంలో ఒక క్రొత్త పరిస్థితి ఏర్పడుతుంది. జీవాత్మ పదార్ధాల కంటే ముందు ఉంటుంది. ఈ రెంటికీ మధ్య పోరాటం మూలాన్నే క్రొత్త ఆలోచనలు, క్రొత్త పద్ధతులు అభివృద్ధి చెందుతాయి.

మార్క్స్ యొక్క గతితార్కి భౌతిక వాదం హెగెల్ తాత్వాకి సిద్ధాతం నుంచి ఉత్పన్నమయింది. ఈ రెండింటి మధ్య తేడా ఏమిటంటే హెగెల్ ప్రాథమికంగా ఆదర్శవాది. కార్ల్‌మార్క్స్ ప్రాథమికంగా భౌతికవాది. కార్ల్‌మార్క్స్, హెగెల్ గతి తార్కి వాదాన్ని అంగీకరించాడు. కానీ, అతని ఆదర్శ వాదాన్ని మాత్రం తిరస్కరించాడు. కార్ల్‌మార్క్స్ శాస్త్రీయ పద్ధతిని అనుసరించాడు. అతను సమీకరించిన యదార్ధాలను ఆధారం చేసుకొని గతితార్కి భౌతిక వాదాన్ని రూపొందించాడు. అతని గతితార్కిక వాదంలో భావాలకు ఊహాపరమైన అంచనాలకు తావులేదు. హెగెల్ సిద్ధాంతానికి తార్కిక ఆధారాన్ని కల్పించడానికి మార్క్స్ ప్రయత్నించాడు.

మార్క్స్ సిద్ధాంతాన్ని ఎంగెల్స్ విశదీకరించాడు. ఏ వస్తువులో అయినా పద్ధతిలో అయినా పరస్పర విరుద్ధంగా ఉండే ఉద్దేశాలు ఉంటాయి. ఈ అంతర్గత వైరుధ్యం లేకుండా ఏ వస్తువు, పద్ధతి లేవు. పాత కొత్తలు తప్పనిసరిగా పోరాడుకుంటాయి.

ఈ పరస్పర వైరుధ్యము, వ్యతిరేకంగా ఉండే వాటి పోరాటమే అభివృద్ధికి మూలము. దీని మూలంగా చాలా భౌతిక మార్పులు వచ్చిన తరువాత వీలైన పరిస్థితులు వ్యక్తమవుతాయి.

1.8 భారతదేశంలో గతితార్కి అధ్యయనాలు:

భారతదేశంలోని విద్యా రంగాన్ని సామాజిక పరంగా వివరించడానికి మార్క్సిస్ట్ గతితార్కిక పద్ధతిని చాలా వరకు వినియోగించారు. భారతదేశంలోని సమాజ శాస్త్రాన్ని మార్&క్స్ సిద్ధాంతం చాలా ప్రభావితం చేసింది. అయితే, మార్క్స్ సిద్ధాంతం యొక్క ప్రభావం గట్టిగా లేదు. బహుశా ఇది ప్రకార్య పద్ధతికి లోనైన బ్రిటీష్ ప్రభావం మూలన కావొచ్చు. అయినప్పటికీ కొంతమంది భారతీయ సామాజిక శాస్త్రవేత్తలు మార్క్స్ సిద్ధాంతాల వల్ల, దాని పద్ధతుల వల్ల ప్రభావితులైనారు.

వారలో డి.పి.ముఖర్జీ ఒకరు. ఆయన రచనలలో భారతీయ పద్ధతులు విశ్లేషించేటప్పుడు గతితార్కిక పద్ధతి ప్రభావాన్ని గమనించవచ్చు. అతడు మన భారతీయ సంప్రదాయాలు పాశ్చాత్య సంప్రదాయాలను ఎట్లా ఎదుర్కొనవలసి వచ్చిందో చెప్పి మధ్యతరగతి కొత్తగా ఎలా వృద్ధి చెందిందో అనే వాటి మీద కేంద్రీకరించాడు. ఈ శక్తులచే గతితార్కిక విధానాన్నే విధంగా సృష్టిస్తుంది. ఏ విధంగా వాటి సంయోగం ఏర్పడుతుంది అనే వాటిని ఆయన విశ్లేషించాడు.

విలువల క్రమము మరియు వర్గం ఒకదానితో ఒకటి ఢీకొంటాయని డి.పి.ముఖర్జీ గమనించాడు. చివరికి వీటిలో యీ గతితార్కిక సమన్వయము వలన సామాజిక మార్పు ఉద్భవిస్తుందని ఆయన నమ్మాడు. ఇది భారతదేశంలో 'ముస్లీం' పరిపాలనలో ప్రారంభమయిందని ఆయన చెప్పాడు. బ్రిటీషు వారి పాలనలో కొత్త మధ్యతరగతి సృష్టించి కొత్త చారిత్రక పరిస్థితికి సంధిని సృష్టించారని ఆయన పేర్కొన్నాడు. దీనితో భారత సమాజము తెరువబడకుండా మూయబడిన సమాజముగా ఉండటానికి తెలుపబడింది.

మార్క్సిస్ట్ సిద్ధాంతాలలో ముడిపడ్డ మరొక గొప్ప సామాజిక శాస్త్రవేత్త ఎ.ఆర్.దేశాయ్ (A.R.Desai). దేశభక్తి ఆవిర్భవించడానికి అతడు గతితార్కిక సిద్ధాంతాన్ని అన్వయింపచేశాడు. భారతదేశములో దేశబక్తి వాదన బ్రిటీషు వారు సృష్టించిన భౌతిక పరిస్థితులలోంచి ఉదర్భవించినదని అతడు వాదిస్తాడు. దేశభక్తి పెరగడానికి విద్యకు ప్రాధాన్యతనిచ్చే వాదనతో అతడు ఏకీభవించడు. ఈ సందర్భములో విద్యకెక్కువగా ప్రాధాన్యతనివ్వడాన్ని అతడు అతిశయోక్తిగా భావిస్తాడు. కొత్తగా భారతదేశములో బ్రిటీషు వారి పాలన మూలాన వచ్చిన కొత్త భౌతిక మార్పులు భారత సమాజంలో ఆవిర్భవించిన కొత్త సామాజిక శక్తుల మూలంగా దేశభక్తి ఉద్యమం మొదలైన వాటి యొక్క ఫలితమని ఆయన ఉద్దేశపడ్డారు. అతడు విద్య అభివృద్ధి దోహదకమని అంగీకరిస్తాడు. కానీ, స్వాతంత్రోద్యమానికి దేశభక్తి వాదానికి విద్య మూలబిందువనడాన్ని తిరస్కరిస్తాడు.

బ్రిటీషు పాలనకు ముందు దేశభక్తి వాదముందన్న వాదాన్ని ఎ.ఆర్.దేశాయ్ గట్టిగా ఖండిస్తాడు. అదిలేదని అతడి ప్రగాఢ విశ్వసము. బ్రిటీషు పాలన ఒకేసారి ఆర్థిక వ్యవస్థను శిథిలం చేయడం, కొత్త ఆర్థిక సంస్కరణలు, కొత్త సాంఘీక అవసరములు, కొత్త పరిస్థితులు, కొత్త పరిజ్ఞానము కొనితెచ్చింది. వాటి మూలాన్న దేశభక్తి వాదము చోటుచేసుకుంది. దేశాయ్ ఈ క్రింది విధంగా వ్రాశాడు.

"బ్రిటీషు వారి పాలన కాలంలో" భిన్న వర్గాల వారికి బ్రిటీషు వారిపై వారి నిర్దిష్ట బాధలు వారికున్నాయి. పారిశ్రామిక వేత్తలు అంతరాయము లేకుండా భారతదేశాన్ని పారిశ్రామికీకరణ చేయడంతో స్వదేశ పరిశ్రమలకు రక్షణ వారు కోరుకున్నారు. చదువుకొన్న భారతీయులు ప్రభుత్వ సేవలు భారతీయుల పరం చేయాలని కోరుకున్నారు. వ్యవసాయదార్లు భూమి శిస్తు తగ్గించాలని కోరారు. కార్మికులు మెరుగైన పరిస్థితులు, మంచి వేతనాలు కోరుకున్నారు. మొత్తం దేశమంతా కలుసుకోవడానికి స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, ఎన్నుకోబడ్డ శాసనసభ, చవరకు పూర్తి స్వాతంత్ర్యము కోరుకొంది.

అప్పటి బౌతిక పరిస్థితులు బహుశా కుల వ్యవస్థను కూడా శిళితము చేయడానికి దోహదం చేస్తాయని దేశాయ్ అన్నారు. ఆర్థిక సంబంధాలు చాలా వరకు భారతదేశంలోని సాంప్రదాయక సంస్థలు నిలకడగా ఉండేందుకు దోహదం చేస్తాయని దేశాయ్ అన్నాడు. ఆర్థిక సంబంధాలు మారితే సాంప్రదాయక సంస్థలు కూడా మారతాయి. ఇది ముఖ్యంగా కులాన్ని గురించి నిజం. పరిశ్రమలు స్థాపించడం, ఆర్థిక స్వాతంత్ర్యం రావడం, కొత్త సాంఘీక భౌతిక పరిస్థితులు నెలకొనడం మొదలైన వాటితో కులము క్రమంగా శిథిలమౌతుందని అతడు అభిప్రాయపడ్డాడు.

**వ్యాఖ్యానము:**

భారతదేశంలో సామాజిక మార్పును అధ్యయనం చేయడంలో గతితార్కి పద్ధతిని వినియోగించడం మీద వ్యాఖ్యానిస్తూ యోగేంద్రసింగ్ ఇటువంటి వాటికి తగినంత ప్రయోగాత్మక దత్తాంశ పూరక ఆధారము లేదని అభిప్రాయపడ్డాడు. ఈ పరిమితి ఉన్నప్పటికీ తగితార్కిక పద్ధతిలో సామాజిక మార్పుపై చేసిన అధ్యయనాలు భవిష్యత్తులో వాటిని ఎక్కువగా పరీక్షించడానికి వీలైన పరికల్పనలు ఇచ్చాయి. భారతదేశంలో సామాజిక మార్పు అధ్యయనంలో గతితార్కి పద్ధతిని వినియోగించడంపై వ్యాఖ్యానిస్తూ సిద్ధాంత పరంగా సామాజిక మార్పు సంఘర్షణలోని భిన్న పద్ధతుల్ని అధ్యయనం చేయడానికి గతితార్కిక పద్ధతి చాలా ఉపయోగమైనది. వీలుగా ఉండేది అని అన్నారు. అయితే, శాస్త్రీయ పరమైన పరిశోధనల మీద ఆధారపడి ఉన్నప్పటికీ గతితార్కిక పద్ధతి ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. లేకపోతే ఉండదని ఆయన హెచ్చరిక.

## 1.9 ముఖ్య పదములు:

| | | |
|---|---|---|
| అవర్ణ (Avarna) | : | నాలుగు వర్ణముల నుండి వదిలివేయబడిన వారు. |
| సాంస్కృతిక విశ్లేషణ (Cultural Analysis) | : | సమాజంలో వాస్తవంగా వున్న విలువలు, ఆచారములు మొదలైన సాంస్కృతిక రూపముల విశ్లేషణ. |
| గతితార్కికత (Dialectics) | : | ఒకే కాలంలో వుండే అంతర్గత వైరుధ్యాలున్న విషయం చర్చించినప్పుడు కొత్త పద్ధతి ఏర్పడేందుకు దోహదం చేసే చర్చా ప్రక్రియ. |
| శ్రేష్ట వర్గం (Elites) | : | సమాజంలో పుట్టుక ద్వారా కాని లేక వేరేదైనా లక్షణం వలన ఉన్నత శ్రేణిలో ఉన్న వర్గం. |
| ప్రకార్యం (Function) | : | ఏదైనా ఒక మొత్తంలోని భాగం మొత్తానికంతటికీ ఉపయోగంగా వుండేటట్టు చేసే పని. |
| చరిత్ర వ్రాయడం (Historiography) | : | ఒక చారిత్రక పరమైన అంశాన్ని వివరించేట్టు వ్రాసిన చరిత్రలోని ఒక భాగం. |
| ఇండోలాజికల్ ఉపగమము (Indological Approach) | : | భారతదేశంలోని సామాజిక వ్యవస్థలు, విలువలు, ఆచారాలు మొదలైనవి అంతటా వ్యాపించి ఉన్న భాష (సంస్కృతం)లో వున్న పుస్తకాలను భారతదేశ పరిధిలో అధ్యయనం చేసే ప్రయత్నాన్ని ఇండోలాజికల్ ఉపగమము అంటారు. |
| జాతి (Jati) | : | కులానికి దేశీయము. |
| నిర్మితి (Sturucture) | : | ఒకే మొత్తంలోని భాగాలను ఒకదానికొకటి సంబంధం కలిగేలాగా ఏర్పాటు చేయడం. |
| అడుగు వర్గాలు (Subaltern Classes) | : | సమాజములో అణగతొక్కబడిన సమూహములు లేక వర్ణములు. |
| వర్ణం (Varnas) | : | పురాతన భారతీయ క్రమంలో నేటి కులానికి నాంది పలికినవి. |

## 1.10 ప్రశ్నలు:

1. భారత సమాజపు అధ్యయనములో 'ఇండోలాజికల్' ఉపగమము పాత్రను మదింపుచేయుము?
2. భారతీయ సమాజమునర్థం చేసుకోవడంలో 'ఇండోలాజికల్' ఉపగమము యొక్క పరిమితులు పేర్కొనుము?
3. భారతీయ సమాజపు అధ్యయనములో 'సబర్‌ఆల్టరన్' (Subaltern) ఉపగమము యొక్క ప్రధాన్యతను వివరించుము?
4. భారతీయ సమాజ అధ్యయనములో 'నిర్మితి' ఉపగమము యొక్క ప్రాధాన్యతను వివరించుము?
5. సమాజాన్ని, దానిలోని భాగాల్ని ప్రకార్య వాదులు చూసే విధానాన్ని వివరించుము?
6. భారతీయ సమాజాన్ని అర్థం చేసుకోవడంలో 'ప్రకార్యవాదం' ఎంత వరకు వినియోగపడుతుంది?

## 1.11 చదవదగిన గ్రంథాలు:


1. Guha, Ranjit: Subaltern Studies 1 : Writing on South Asian History and Society, Delhi:Oxford University Press,1992.

2. Gupta, Giri Raj (Editor) : Main currents in Indian Sociology-1, Contemporary India Some Sociological Perspectives: New Delhi, Vikas Publishing House, 1978.

3. Singh, Yogendra : Modernization of Indian Tradition (A Systematic Study of Social Change) Jaipur, Rawat Publications, 1996.

4. Singh, Yogendra : Indian Sociology, New Delhi; Vistar Publications, 1986.

5. Unnithan, T.K.N.Deva, Indra; and Singh, Yogendra (Editors) : Sociology for Inda, New Delhi, Prentice Hall of India, 1967.

## పాఠం-2

# భారతీయ సమాజపు సమ్మిశ్రమము-భిన్నత్వంలో ఏకత్వము

**విషయక్రమం:**


**2.1 ఉద్దేశ్యము**

**2.2 పరిచయము**

**2.3 భిన్నత్వము**

**2.4 జాతుల సమ్మిశ్రమము**

**2.5 నవవర్గ నమూనా సమ్మిశ్రమము**

**2.6 మతపరమైన సమ్మిశ్రమము**

**2.7 సాంస్కృతిక సమూహములు**

**2.8 ఉన్నత, అల్ప సంప్రదాయాలు**

**2.9 ముఖ్య పదములు**

**2.10 ప్రశ్నలు**

**2.11 చదవదగిన గ్రంథములు**


## 2.1 ఉద్దేశ్యము:

భారతదేశములో జనాభా సమ్మిశ్రమము మరియు భిన్నత్వంలో ఏకత్వము వివరించుట.

## 2.2 పరిచయం:

భారతదేశము విశాలమైన ద్వీపకల్పము. భారతదేశ భూభాగ విస్తీర్ణము సుమారు 32.87 లక్షల చదరపు కి.మీ. ఇది ఉత్తరము నుంచి దక్షిణానికి 3214 కి.మీ మరియు తూర్పు నుంచి పడమరకు సుమారు 2933 కి.మీ వరకు వ్యాపించియున్నది. భూభాగానికి తగినట్లు గానే, భారతదేశ జనాభా కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. భారతదేశ జనాభా 100 కోట్లు దాటినది. సువిశాల భూభాగాన్ని మరియు అధిక జనాభాను కలిగి ఉండుటచే భారతదేశాన్ని ఒక ఉపఖండంగా భావిస్తున్నాము.

సింధూనది (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న ఇండస్ నది) వలన భారతదేశానికి ఆ పేరు వచ్చినది. ఈ సింధూనది చాలా పెద్దది. ఇది నైలు నదికి రెండు రెట్లు. టైగ్రిన్ మరియు యుఫ్రేట్స్ (Euphrates) రెండూ కలిపిన నదులకు మూడు రెట్లు ఎక్కువ కలిగిన నీటి ప్రవాహము సింధు నదికి కలదు. భారతదేశంలో స్థిరపడిన ఆచర్యులు ఈ నదిని చూచి ఆశ్చర్యపడి, ఈ నదిని సింధూ నదిగా పిలిచారు. సింధూ నది అనగా అధిక నీటి ప్రవాహము గల నది. అప్పుడప్పుడు సముద్రానికి ప్రత్యామ్నాయ పదంగా ఈ పదాన్ని ఉపయోగిస్తారు.

518 బి.సి.లో పర్షియన్ రాజైన డేరియస్ 1, సింధూ నదీతీర ప్రాంతాన్ని జయించి, తన రాజ్యంలో కలుపుకున్నాడు. పర్షియన్లు 'ఎస్' (S) హెచ్ (H)గా ఉచ్చరించేవారు. కనుక సింధు అను పదము హిందూ అన్న పదముగా మార్పు చెందింది.

తరువాత భారతదేశం పైకి దండెత్తి వచ్చిన గ్రీకులు 'హిందూ' పదాన్ని 'ఇండియా'గా మార్చినారు. విదేశీయులు, హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు గల మొత్తం దేశాన్ని 'ఇండియా'గా వ్యవహరించినారు.

ప్రాచీన భారతీయులు మహాభారతంలో పేర్కొనబడిన రాజైన భరతుని పేరు మీదుగా, తమ దేశాన్ని 'భరతవర్ష'గా పిలిచారు. తరువాత దండెత్తి వచ్చిన ముస్లీములు భారతదేశాన్ని 'హిందుస్థాన్'గా వ్యవహరించారు. ఆంగ్లేయ పరిపాలకులు దీనిని ఇండియా అని పిలిచారు.

భారతదేశ విభజన జరిగి, ఆగస్టు 15,1947లో స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కూడా 'ఇండియా' అను పేరు నిలబడింది.

## 2.3 భిన్నత్వము:

భారతదేశపు నాగరికత అతి పురాతనమైనది. భారతదేశంలో ఒక విశిష్టమైన భిన్నత్వము కలదు. భారతదేశంలో అనేక భాషలు మరియు స్థానిక భాషా భేదములు (Dialects), మత పరమైన పూజా పద్ధతులు, జాతి సమూహాలు, సాంస్కృతి పద్ధతులు ఉన్నాయి. ఈ విధమైన స్పష్టమైన భిన్నత్వము ఉన్నప్పటికీ, భారతదేశంలోని ప్రజల మధ్య ఏకత్వము కలదు. 'మన మందరమూ ఒకటే' అనే భావన భారతదేశంలో అన్ని మూలలా వ్యాపించి ఉంది.

## 2.4 జాతుల సమ్మిశ్రమము (Racial Composition)

భారతదేశము వివిధ జాతుల ప్రదర్శనశాల వంటిది. భారతదేశంలో వివిధ రకాల జాతుల సమూహాలు కలవు. భారతదేశంలో అనేకమైన జాతుల సమూహాలు ఉండుట వలన, జాతుల అధ్యయన శాస్త్రవేత్తలు జాతుల వర్గీకరణలో తత్తరపాటు (Confusion) పడుతుంటారు.

హెర్బర్ట్ రిస్లే (Herbert Risley) భారతదేశంలో ఈ క్రింద పేర్కొనబడిన ఏడు రకాలైన జాతులను గుర్తించారు.

1. ఇండో ఆర్యన్ (Indo Aryan):

   తూర్పు పంజాబు, రాజస్థాన్ మరియు కాశ్మీరులలో ఈ జాతి వారు కనిపిస్తారు.

2. ద్రవిడియన్ (Dravidian):

   దక్షిణ భారతదేశంలోను, మధ్యప్రదేశ్‌లోను ఈ జాతి వారు కనిపిస్తారు.

3. మంగోలాయిడ్ (Mongoloid):

   హిమాలయ పర్వత ప్రాంతాలలోను, అస్సాము, సిక్కిము, బెంగాల్ ప్రాంతములోని డార్జిలింగ్‌లోను ఈ జాతి వారు కనిపిస్తారు.

4. ఆర్యో ద్రవిడియన్ (Aryo Dravidian):

   ఉత్తర ప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలోను, బీహార్‌లోను ఈ జాతి వారు కనిపిస్తారు.

5. మంగోలో-ద్రవిడియన్ (Mongolo-Dravidian):

   బెంగాల్ మరియు ఒరిస్సాలలో ఈ జాతి వారు కనిపిస్తారు.

6. స్కైతో-ద్రవీడియన్ (Scytho-Dravidian):

   మధ్యప్రదేశ్‌లోని పర్వత ప్రాంతాలలో, సౌరాష్ట్ర, కూర్గ్‌లలో ఈ జాతి వారు కనిపిస్తారు.

7. టర్కో-ఇరానియన్ (Turko-Iranian):

ఉత్తర పశ్చిమ సరిహద్దులలోను, బెలూచిస్థాన్ (పాకిస్తాన్‌లో ఇప్పుడు ఉన్నది) లోను ఈ జాతి వారు కనిపిస్తారు.

ఈ ఏడు జాతుల రకాలు మూడు ప్రధాన రకాలుగా కుదించబడినవి. అవి:

1). ఇండో ఆర్యన్

2). మంగోలియన్

3). ద్రవిడియన్

భారతదేశంలోని ఆదిమ జాతులుగా భావించబడే వారు మంగోలియన్లు, ద్రవిడియన్లు.

1931 జనాభా లెక్కల ఆధారంగా J.H.హట్టన్ (Hutton) భారతదేశ జనాభాలో ఎనిమిది రకాల జాతులను గుర్తించినాడు. అవి:

1. నీగ్రిటో (Negrito)

2. ప్రోటో-ఆస్ట్రలాయిడ్ (Proto-Australoid)

3. ఎర్లీ-మెడిటరేనియన్ (Early Mediterranean)

4. ఎడ్వాన్స్‌డ్ మెడిటరేనియన్ (Advanced Mediterranean)

5. ఆర్మినాయిడ్ (Armenoid)

6. ఆల్పైన్ (Alpine)

7. వేదిక్ ఆర్యన్ (Vedic Aryan)

8. మంగోలాయిడ్ (Mongoloid)

బి.ఎస్.గుహ (B.S.Guha) వివరణాత్మక విశ్లేషణతో భారతదేశ జనాభాను ఆరు రకాల జాతులుగా వర్గీకరించారు. అవి:

**1. నీగ్రిటో:**

భారతదేశ ద్వీపకల్పంలో నీగ్రిటోలు అతి పురాతనమైన జాతి వారుగా J.H.హట్టన్ (J.H.Hutton) మరియు A.H.కీన్ (Keane)లు భావించారు. వీరు ఆఫ్రికా నుంచి అరేబియా, ఇరాన్, బెలూచిస్థాన్‌ల మీదుగా భారతదేశానికి వచ్చినారు. వీరి శరీరపు రంగు నలుపు. వీరు గిరజాల జుట్టును, మందపాటి పెదవులను, నల్లటి దిబ్బముక్కును కలిగియుంటారు. వీరు పొట్టిగా ఉంటారు.

నీగ్రిటోలు భారత సమాజంలో వివిధ ప్రదేశాలలో వివిధ పేర్లతో నివసిస్తున్నారు. అస్సాంలోని అంగోమా, నాగా జాతులు, ఆంధ్రప్రదేశ్‌లోని యానాది జాతులు, తమిళనాడులోని ఎరుంబలు, కొచ్చిన తీర ప్రాంతంలోని ఫనియానులు ఈ జాతికి చెందినవారు. అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఈ జాతి లక్షణములు గలవారు ఉన్నారు.

**2. ప్రోటో-ఆస్ట్రలాయిడ్స్:** (Proto-Australoid)

ఈ జాతి వారు నీగ్రిటోల అనంతరం పశ్చిమ ఆసియా ప్రాంతాల నుంచి భారతదేశంలోకి ప్రవేశించి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరికి గోధుమ రంగు శిరోజాలు, దట్టమైన వెంట్రుకలతో పొడవైన తల, వెడల్పయిన నాసిక, ఉబ్బెత్తుగా ఉన్న దవడ, చిన్నగడ్డం ఉంటాయి. ఈ జాతి లక్షణాలు కలవారు భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో ఉన్నారు. నాగరికతా సంస్కృతులలో

వీరు నీగ్రిటో జాతి కంటే మెరుగుగా ఉంటారు. నేడు భారతీయ సమాజంలోని ఆటవిక జాతులలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఉదా: మధ్య భారతదేశంలోని సంతాలులు, ముండారీలు, కొరవలు, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలోని గబదలు ఈ జాతికి చెందినవారు. కదళీ, నారికేళ, నింబ మొదలైన ఈ జాతిలోని భాషా పదాలని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. మాతృదేవతారాధన వీరితో ప్రారంభమైంది.

**3. మంగోలాయిడ్** (Mongoloid):

భారతదేశంలోకి వచ్చి స్థిరపడిన విదేశీయ జాతులలో వీరు కడపటి వారు. వీరు కేవలం ఈశాన్య సరిహద్దు ప్రాంతాలకే పరిమితమైనారు. వీరి రాక ఫలితంగా భారత సమాజంలో ఏవిధమైన ప్రభావం ఏర్పడలేదు. ఈ జాతి వారు లేత గోధుమ రంగు కలిగిన శరీరాన్ని కలిగివుంటారు. వీరి కన్నుల చివర రెండు సన్నని చీలికల వలె ఉంటాయి. ఈ లక్షణాలు కలవారు నేటికీ భారత సమాజంలో అస్సాం, నాగాలాండ్, హిమాలయ పర్వత ప్రాంతాలలో, బెంగాల్, త్రిపుర, సిక్కిం, భూటాన్ ప్రాంతాలలో ఉన్నారు.

ఈ మంగోలాయిడ్ జాతులలో రెండు విభాగాలు ఉన్నాయి. అవి: 1) పేలియో మంగోలాయిడ్ (Palaeo Mongoloid). 2) టిబెటో మంగోలాయిడ్ (Tibeto Mongoloid ). మంగోలాయిడ్ ఉపవిభాగాల మధ్య కొన్ని భౌతికమైన విభిన్నతలు కలవు. పేలియో మంగోలాయిడ్ జాతి వారి తల పొడవుగానైను, వెడల్పుగానైనను ఉండవచ్చు. వారి శరీరపు రంగు ముదురు గోధుమ రంగు నుంచి లేత గోధుమ రంగులో ఉంటుంది. ముఖము పొట్టిగా, బల్లపరుపుగా ఉంటుంది. టిబెటో మంగోలాయిడ్స్ ప్రజలు వెడల్పైన తల కలిగిఉంటారు. వీరి శరీరపు రంగు లేత గోధుమ రంగు, వీరి తల పొడవుగా, బల్లపరుపుగా ఉంటుంది.

**4. మెడిటరేనియన్** (Mediterranean):

ఈ జాతి సమూహంలో మూడు ఉప విభాగాలు కలవు. అవి:

1) పేలియో మెడిటరేనియన్ (Palaeo Mediterranean)

2) మెడిటరేనియన్ (Mediterranean)

3) ఓరియంటల్ మెడిటరేనియన్ (Oriental Mediterranean)

పేలియో మెడిటరేనియన్లు నల్లటి రంగు గల శరీరము, పొడుకువచ్చిన తల వెనుక భాగమును, కుంచించుకుపోయిన ముఖమును, వెలడ్పయిన ముక్కును, ముఖముపై, శరీరముపై కొద్దిపాటి జుట్టును కలిగి మధ్యరకమైన ఆకారముతో ఉంటారు. తెలుగు మరియు తమిళ బ్రాహ్మణులు ఈ విధంగానే ఉంటారు.

మెడిటరేనియన్లు అసమైన మెడిటరేనియన్లుగా పరిగణింపబడతారు. వీరు ముదురు గోధుమ రంగు శరీరపు రంగును, పొడవు తలను, ముఖమును, కుంచించుకుపోయిన ముక్కును, సన్నముగాను, శరీరముపై ఎక్కువ జుట్టును, వెడల్పయిన కనులను కలిగివుంటారు.

ఓరియంటల్ మెడిటరేనియన్లు మెడిటరేనియన్లలో ఒక భాగము. వీరిని ద్రవిడియన్లు అందురు. వీరు సింధూ నది లోయ ప్రాంతంలో నాగరికతను అభివృద్ధి చేశారు.

ద్రవిడులు మెడిటరేనియన్ జాతులలోని ఒక విభాగం. వారు భారత సమాజంలో ఆర్యులు రాకమునుపే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరి ప్రధాన భాష ద్రావిడమగుటచే వీరికి ఆ పేరు వచ్చినది. వీరు శారీరక లక్షణాలలో దాదాపు ప్రోటో ఆస్ట్రాలాయడ్స్, నీగ్రిటో జాతుల పోలికలను కలిగియుంటారు.

**5. వెస్టర్న్ బ్రాక్ సిఫాల్స్** (Western Brachephal):

వీరు మూడు విభాగాలుగా విడగొట్టబడినారు. అవి:

1) ఆల్పినోయిడ్స్ (Alpioids )

2) డైనారిక్స్ (Dinarics)

3) ఆర్మినోయిడ్స్ (Armenoids)

ఆల్పినోయిడ్స్ దక్షిణ బెలూచిస్థాన్‌కి చెందిన వారు. వీరు భారతదేశానికి దక్షిణ బెలూచిస్థాన్ నుంచి సింధు ద్వారా వచ్చి, గంగానదీ తీరప్రాంతాల నుండి బెంగాల్ వరకు వ్యాపించి యున్నారు.

వీరు లేత శరీరపు రంగును, వెడల్పు తలను, గుండ్రని ముఖమును, ఒత్తైన జుట్టును శరీరముపై, ముఖముపై కలిగి, మధ్యరకపు ఎత్తును కలిగియుంటారు. సౌరాష్ట్రలోని కాతిస్, గుజరాత్‌లోని బనియాస్, బెంగాల్లఓని కాయస్థులు ఈ జాతికి చెందినవారు.

డైనారిక్స్ తమ స్వంతమైన జాతి లక్షణాలను కలిగియున్నారు. వీరి శరీరపు రంగు కొంచెం ముదురు. వారి నుదురు కొంచెం లోపలికి ఉన్నట్లుగా ఉంటుంది. ముఖము పొడవుగా ఉంటుంది. ముక్కు పొడవుగా ఉండి, మనుష్యులు పొడవుగా ఉంటారు.

బెంగాలు, ఒరిస్సాలలో బ్రాహ్మణులు, కర్ణాటకలోని కూర్గులు ఈ జాతికి చెందినవారు.

ఆర్మినోయిడ్స్ తెల్లటి శరీరమును, పొట్టి నుంచి మధ్యస్థ ఎత్తును, వెడల్పు తలను కలిగియుంటారు. ముంబాయిలోని పారశీకులు, బెంగాలీ వైదర్యులు, కాయస్థులు ఈ లక్షణాలను కలిగియుంటారు.

**నార్డికులు (ఇండో ఆర్యనులు లేదా ఆర్యులు):**

వీరు నార్డిక్ జాతికి చెందిన వారు కావున 'నార్డిక్ ఆర్యన్స్' అని కూడా అంటారు. వీరు భారతదేశానికి వలసన వచ్చిన ఇండో ఇరానియన్లు, చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం వీరు క్రీస్తు పూర్వం 2000-1500 సం॥ల మధ్య కాలంలో భారతదేశానికి వలస వచ్చి పశ్చిమ ఉత్తర పంజాబులలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరి రాకతో భారత సంస్కృతి నాగరికతలలో సాంఘీక ఆర్థిక రంగాలలో వినూత్న మార్పులు చోటుచేసుకున్నవి. వీరు అందమైన వారు, తెల్లని శరీర ఛాయను కలిగియుండి, ఆజానుబాహువై పసిడి రంగు శిరోజాలతో, నీలి నేత్రాలతో బలిష్టమైన శారీరక నిర్మాణాన్ని కలిగివుంటారు.

పేన పేర్కొన్న జాతులన్నీ స్పష్టమైన, ప్రత్యేకమైన భౌతిక లక్షణాలను కలిగియున్నవి. కానీ, భారతదేశానికి సంబంధించినంత వరకు జనాభా స్పష్టమైన, ఖచ్చితమైన జాతుల తరగతులుగా విభజింపబడలేదు. భిన్న జాతుల కలయిక నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఇటువంటి పరిస్థితులలో సహజంగా జాతుల మధ్య తేడాలు స్పష్టంగా తెలియవు. జనాభా జాతుల పరంగా కలిసిపోయి ఉంటుంది.

## 2.5 నరవర్గ సమూహ సమ్మిశ్రమము (Ethnic Composition):

నరవర్గ సమూహము అను పదము చాలా తరచుగా సమాజ శాస్త్రములలో ఉపయోగించబడుచున్నది. కానీ, ఈ పదము యొక్క అర్థం స్పష్టముగా లేదు. Neil Smelser ప్రకారం ఉదాహరణకు అమెరికాలోని బ్లాక్స్ (Blacks) హిస్పానిక్స్ (Hispanics) ఏషియన్ అమెరికన్లు (Asian Americans), మెక్సికన్ అమెరికన్లు (Mexican Americans) మరియు నేటివ్ అమెరియన్లు (Native Americans) తరచుగా నరవర్గ సమూహముగా భావించబడతారు. కానీ, జర్మన్ అమెరియన్లు, స్కాటిష్ అమెరికన్లు నరవర్గ సమూహాలుగా భావింపబడరు. ఉదాహరణకు జర్మన్ అమెరికన్లకు వారి పూర్వీకుల గురించి వారికి తెలిసియుండవచ్చు. కానీ, సాధారణంగా వారిని ఆవిధంగా పరిగణించరు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని మిల్టన్ ఇంగర్ (Milton Yinger) నరవర్గ సమూహమును ఈ క్రింది విధముగా నిర్వచించినారు.

నరవర్గ సమూహము ఒక పెద్ద సమాజములో భాగముగాను, ఆ పెద్ద సమాజము యొక్క సంస్కృతిని నరవర్గ సమూహము వారు కలిగి యుంటారని భావింపబడుచున్నది.

నరవర్గ సమూహము భౌతికముగా ఇతర సమూహముల నుండి వేరుచేయబడతారు. పైన ఉదహరించిన పరిస్థితులు నుండి వేరుచేయబడతారు. పైన ఉదహరించిన పరిస్థితులు వారిలో వారంతా ఒక్కటేనన్న భావన, అంత:సమూహ భావన వారిని ఒక్కటిగా గట్టి బంధంగా కట్టివేస్తుంది.

సాధారణంగా నరవర్గ సమూహము తక్కువ సంఖ్య గల సమూహము. తక్కువ సంఖ్య గల సమూహము కాబట్టి, సాధారణంగా తమ యొక్క గుర్తింపును, మరియు ఏకత్వమును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తారు.

ఇంగర్ (Yinger) ప్రకారము నరవర్గ సమూహము ఈ క్రింది లక్షణాలను కలిగివుంటుంది.

1. ఈ సమూహము మిగిలిన సమూహాల నుండి ఈ క్రింద పేర్కొనబడిన ఒకటిగానీ, అంతకన్నా ఎక్కువ విధాలుగా గానీ భిన్నంగా ఉంటుంది. ఉదా: భాష, మతము, జాతి, పుట్టిన దేశం.
2. ఈ సమూహ సభ్యులు తమను తాము పెద్ద సమాజం నుంచి భిన్నంగా చూసుకుంటారు.
3. నరవర్గ సమూహ సభ్యులు వారి యొక్క సాంస్కృతి కార్యకలాపాలలో నిమగ్నమవుతారు. ఉదా: వారి సమూహాల లాంటి సమూహాలచే దర్శించుటకు వెళ్లుట మరియు వారి ప్రత్యేకమైన శలవలను కలిగియుంటారు.
4. ఈ నరవర్గ సమూహ లక్షణాలను, స్వభావమును పరిశీలించిన మీదట భారతదేశంలో నరవర్గ సమూహాలు కలవని స్పష్టమౌవుతంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వలె నరవర్గ సమూహ సమ్మిశ్రమము ఎక్కువగా లేనప్పటికీ, భారతదేశంలో కూడా కొన్ని నరవర్గ సమూహాలు ఉన్నవి.

**పారశీకులు (Parisis):**

భారతదేశంలోని నరవర్గ సమూహాలలో బహు పారశీకులు ఒకరు. పారశీకులు వలస వచ్చిన ప్రజలు. పారశీకులు పర్షియా దేశానికి చెందిన వారు. వారి మతము జోరాష్ట్రియనిజము. 6వ శతాబ్దపు ఎ.డి.లో నివసించిన జోరాష్టర్ ఈ మత స్థాపకుడు. ఇస్లామిక్ అరబ్బులు పర్షియాను ఆక్రమించినప్పుడు ఒక జోరాస్ సమూహము భారతదేశములోనికి ప్రవేశించింది. మొదట వారు ప్రస్తుతము పాకిస్థాన్‌లో ఉన్న 'దివ్' (Div) అను ప్రాంతంలో ఉండి, అక్కడి నుండి పడమట తీరానికి వెళ్లినారు. ప్రస్తుతం భారతదేశంలో 72,000 మంది పర్షియనులు బొంబాయిలోను, బొంబాయి చుట్టుప్రక్కల నివసిస్తున్నారని చెప్పవచ్చు.

భౌతిక లక్షణాలలో పారశీకులు మిగిలిన ప్రజల కంటే భిన్నంగా ఉంటారు. వారు ఆర్మోనియిడ్ జాతి లక్షణాలను కలిగియుంటారు. తెల్లటి శరీరపు వర్ణము, పొట్టి ముక్కు, నల్లటి కనుబొమ్మలు ఈ నరవర్గ సమూహము వారు కలిగివుంటారు.

పారశీకులను మిగిలిన ప్రజల నుండి విభేధీకరించేది వారి మతము. ఈ నాటికీ వారు సనాతన వారసత్వపు మతాచారాలనే పాటిస్తున్నారు. పారశీకులు భగవంతుని పేరు 'ఆహు మజ్దా' 'తెలివిగల భగవంతుడు' (Wise Lord)

పారిశీకుల భగవంతునికి ఆకారము లేదు. పవిత్ర అగ్నిని భగవంతుని గుర్తుగా భావిస్తారు. ఈ అగ్నిని పెద్ద పాత్రలో ఉంచుతారు. భక్తులు దేవాలయాల తలుపుల వద్దకు వెళ్లి, నుదిటితో నేల తాకి, ఒక్క చెక్కను అగ్నిలో వేసి, మతాధికారి గరిటెలో ఉంచిన బూడిదను చిటికెడు తీసుకుంటారు. తరువాత వ్యక్తిత్వంగా ప్రార్థనలు జరుపుకుంటారు.

పారశీకులకు కొన్ని ప్రత్యేకమైన ఆచారాలు కలవు. అందులో ఒకటి 'నౌజోట్' (Naujote) అనే మత పరమైన శిక్షణా కార్యక్రమము. లేక ఉపదేశ కార్యక్రమము. ఈ మతపరమైన కర్మకాండ సంప్రదాయికంగా తొమ్మిదవ ఏట ప్రవేశించిన ఆడపిల్లలకు, మగపిల్లలకు యవ్వన దశలోనికి చేరిన గుర్తుగా జరుపబడుతుంది. వారు మత పరమైన సముదాయ జీవితంలో పూర్తిగా పాల్గొనవచ్చునని చెప్పుటయే ఈ మత పరమైన కర్మకాండ ఉద్దేశ్యము.

ఈ ఆచారములో ఉపదేశము పొందే వారికి ఒక పవిత్రమైన చొక్కా (Shirt) పవిత్రమైన దారము ఇవ్వబడతాయి. ఈ చొక్కా మత పవిత్రతకు గుర్తుగా తెల్లగా ఉంటుంది. నూలుతో తయారు చేయబడుతుంది. దారము గొఱ్ఱెపిల్ల యొక్క ఉన్నితో

తయారుచేయబడుతుంది. ఈ త్రాడును మంత్ర సహితంగా పేని అయిదు సార్లు ముడిచేస్తారు. ప్రార్థన చేస్తున్నప్పుడు వారి దేవుని యొక్క పేరు ఉచ్చరిస్తూ తలను గౌరవసూచికంగా వంచుతారు.

మరొక ప్రత్యేకత పారశీకుల సముదాయ లక్షణము వారు జరుపు మరణ కర్మకాండా కార్యకలాపము. మరణమును పారశీకులు చెడు యొక్క తాత్కాలిక విజముగా భావిస్తారు. కనుక మరణించిన శరీరములో చెడు శక్తులు ఉంటాయని పారశీకుల భావన. ఈ చెడును వ్యాపింపచేయుటను నిరోధించుటకు, చనిపోయిన శరీరాన్ని సాధ్యమైనంత త్వరగా తొలగిస్తారు. దీనిని ఒక ప్రత్యేకమైన, విచిత్రమైన పద్ధతిలో తొలగిస్తారు.

ప్రార్థనల తదనంతరం శవమును 'డాఖ్మా' (Dakhma) లేక నిశ్శబ్ద గోపురము (Tower of Silence)నకు తీసుకువెళతారు. ఈ గోపురము ఎత్తయిన గోడలను కలిగి, గుండ్రముగా ఉంటుంది. ఈ స్తంభము ఆకాశం వైపుకు తెరువబడి ఉంటుంది. శవమును గోపురము పైన పెడతారు. గ్రద్దలు మాంసమును తినాలనే ఉద్దేశ్యముతో పారశీకులు ఆ విధంగా శవమును పైన పెడతారు. మూడవ రోజున ఎముకలను తీసి, ఒక కుండలో వేస్తారు.

భూమి, నీరు దేవుని యొక్క పవిత్రమైన సృష్టి అని పారశీకులు నమ్ముతారు. అవి చెడు యొక్క పని అయిన చావు లేదా మరణముతో పాతి పెట్టడము ద్వారా మలినము కారాదు. అగ్ని కూడా పవిత్రమైన సృష్టియే కాబట్టి ఈ శవమును దహనము చేసి అగ్నిని మలినము చేయరాదని పారశీకుల నమ్మకము. కనుక శవమును పారశీకులు దహనము చేయరు, పాతిపెట్టరు. గ్రద్దలు శవమును తినాలనే ఉద్దేశ్యముతోనే భగవంతుడు వాటిని సృష్టించాడని పారశీకుల నమ్మకము. ఈ కారణం చేతనే పారశీకులు శవాన్ని గ్రద్దలకు ఆహారంగా వేస్తారు.

**యూదులు (Jews):**

యూదులు (జ్యూస్) మరొక నరవర్గ సమూహము. యూదులు కూడా వలస వచ్చిన వారే. వీరు మధ్య పశ్చిమ ప్రాంతం నుంచి భారతదేశానికి వలస వచ్చిన ప్రజలు. యూదులు ఇప్పుడు వ్యాపార వాణిజ్యాలను చేసుకుంటూ కేరళలోని కోచిలోను, మాల్టంచరీ దీవి ( Maltan Chery Island)లోను చిన్న సమూహాలుగా జీవిస్తున్నారు.

యూదులు వారి యొక్క మతము, భాషల వలన మిగిలిన వారి కంటే భిన్నముగా ఉంటారు. యూదుల మతము జూడాయిజమ్ (Judaism). వారి భాష హిబ్రూ. భాష కంటే అధికముగా వారి మతము వారిని ఐకమత్యంగా ఒకటిగా ఉంచుతుంది.

జూడాయిజమ్ అతి పురాతనమైన మతము. ఈ మతము క్రైస్తవ మతము కంటే ముందు మతము. చరిత్రకారులు 2000-1600 బి.సి. మధ్య ఈ మతము ఉందని కనుగొన్నారు. ఈ మతము యొక్క పేరు జాకోబ్ యొక్క నాలుగవ కుమారుడైన జూడాది. అయినప్పటికీ జూడాయిజమ్‌కి మూలపురుషుడు లేడు. ఈ మతము మెజస్ (Moses) మొదలైన మత ప్రకవర్తల బోధనల వలన రూపొందింది.

జూడాయిజమ్ ఒక దేవుణ్ణి మాత్రమే గుర్తించింది. ఆ దేవుని పేరు జహోవా (Jahovah Or Yahweh). యూదులు తమను తాము దేవునిచే ఎన్నుకోబడిన ప్రజలుగా భావిస్తారు. భగవంతుడు వారికి బోధనలు చేశాడని, మానవత్వానికి ఉదాహరణగా లేక కాంతిగా వారు ఎన్నుకోబడినారని యూదుల అభిప్రాయము.

భగవంతుని యొక్క బోధనలు బైబిల్ యొక్క జెనిసిస్ (Genesis), ఎక్సోడస్ (Exodus), లెవిటికస్ (Leviticus), నెంబర్లు (Numbers), డ్యూటోరానమి (Deutoronomy)లలో పొందుపరచబడి యున్నాయని యూదులు నమ్ముతారు. యూదులు ఈ బైబిలు యొక్క అయిదు గ్రంథాలకు 'టోరాహ్' (Torah) అని పేరు పెట్టారు. టోరాహ్ అను పదమునకు ఆంగ్లములో సరిసమానమైన అర్థము బోధనలు లేక చట్టము. 'టోరాహ్'లో 613 ఆజ్ఞలు ఉంటాయి. ఈ టోరాహ్ దైనందిన జీవనంలోని ప్రతి అంశాన్ని పౌరచట్టము నుంచి వ్యక్తిగత పరిశుద్ధత మరియు ఆహారము వరకు కలిగియుంటుంది.

యూదులు శనివారము నాడు ప్రార్థనా స్థలము వద్ద ప్రార్థనలు చేస్తారు. టోరాహ్ బోధనలు వ్రాయబడిన కాగితపు చుట్టలను ప్రార్థనా స్థలంలో ఒక పెట్టెలో ఉంచుతారు. అవి హిబ్రూ భాషలో పొట్టేలు చర్మంపై వ్రాయబడి ఉంటాయి.

జీవిత ప్రధాన ఘట్టాల సమయంలో యూదులు కొన్ని ప్రత్యేకమైన మతపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. మగపిల్లలు జన్మించిన వెంటనే 'సుంతి' చేస్తారు. యూదుల మతగురువైన అబ్రహాంకు, దేవునికి మధ్య ఒప్పందాన్ని ఈ కార్యక్రమము గుర్తుగా తెలియజేస్తుంది. భగవంతునికీ అబ్రహాంకు జరిగిన ఒప్పందంలో భగవంతుడు అబ్రహాంను అతని తరాల వారినీ గొప్ప దేశానికి వారసునిగా చేస్తానని మాట ఇచ్చాడని, దాని ప్రకారం ఇజ్రాయిల్ భూభాగాన్ని ఇచ్చాడని, దీనికి ప్రతిగా అబ్రహం తరాలలోని ప్రతి వ్యక్తీ సుంతీ చేయించుకోవాలని భగవంతుడు ఆదేశించాడనీ, అందువలన 'సుంతీ' పద్ధతి అమలులోకి వచ్చిందనే ఒక పెద్ద కథ యూదులలో ప్రచారంలో ఉంది.

యవ్వన వంతులైనప్పుడు మగవారికి బార్‌మిత్వా (Bar Mitzvah), ఆడవారికి బాత్ మిత్వా (Bat Mitzvah) అను మత పరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవారు వారి 13వ సంవత్సరములో వారు పెద్ద మననుష్యుల సముదాయంలో చేరిన దానికి చిహ్నంగా నిర్వహిస్తారు.

యూదుల జాతిలో ఏక వవాహ పద్ధతే న్యాయంగా ఉంది. అంతేకాక యూదులది అంతర్వివాహ సమూహము. యూదులు యూదులు కాని వారిని వివాహమాడరు. యూదులు యూదుల కానివారిని వివాహమాడితే, వారికి పిల్లలు పుట్టినప్పుడు యూదు మత సనాతనులు వారు చనిపోయినట్లుగా భావించి శోకిస్తారు.

భారతదేశంలో అనేక రకాల జాతులు ఉన్నప్పటికీ, నరవర్గ సమూహాల యొక్క సంఖ్య పరిమితమైనది. ప్రస్తుతం ఆధునిక కాలంలో వలస వచ్చేవారి సంఖ్య పరిమితంగానే ఉండిపోయింది. ప్రాచీన కాలంలో భారతదేశానికి వలస వచ్చిన సమూహాలు ఒకదానితో ఒకటి మరియు స్థానిక ప్రజలతో కలిసిపోయి, వారి ప్రత్యేక లక్షణాలు, గుర్తింపు పోగొట్టుకోబట్టి ఏ సమూహమూ కూడా నరవర్గ సమూహముగా ప్రస్తుతము లేదు.

## 2.6 మతపరమైన సమ్మిశ్రమము:

భారతదేశము లౌకిక పద్ధతిని అనుసరించింది. భాతరదేశం మతపరమైన దేశం కాదు. భారతదేశంలోని ప్రజలకు వారి వారి మత విశ్వాసాలను అనుసరించే స్వేచ్ఛ ఉంది. భారతదేశంలో అనేక మతాలను అనుసరించే ప్రజలు జీవిస్తున్నారు. దాదాపుగా ప్రపంచంలోని అన్ని మతాలనూ అనుసరించే ప్రజలు భారతదేశంలో ఉన్నారు.

భారతదేశంలో ప్రధాన మతాలు హిందూ మతము, ఇస్లాం మతము, క్రైస్తవ మతము, సిక్కు మతము. 1991 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 697.4 మిలియన్ల ప్రజలు లేదా మొత్తం జనాభాలో 82.6 శాతం ప్రజలు హిందూ మతస్థులు. హిందూ మతం తరువాతి స్థానము ఇస్లాం మతము ఆక్రమిస్తుంది.

అయితే ఈ మతస్థులు 95.8 మిలియన్లు లేదా మొత్తం జనాభాలో 11.35 శాతం ప్రజలు మాత్రమే ఉన్నారు. జమ్మూ కాశ్మీరులో ఇది ఒక ప్రముఖ మతము. కాశ్మీరు రాష్ట్రములోని మొత్తం జనాభాలో 64% ముస్లిము మతానికి చెందిన ప్రజలు గలరు. లక్ష ద్వీపాలలో కూడా ముస్లిం మతానికి అధిక ప్రాధాన్యత గలదు. పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా ముస్లిములు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఇస్లాం మతం తరువాతి స్థానము క్రైస్తవ మతానిది. ఈ మతాన్ని అవలంభించే వారు 20.5 మిలియన్ల ప్రజలు లేక మొత్తం జనాభాలో 1.96 శాతం ప్రజలు ఉన్నారు. పంజాబు రాష్ట్రంలో సిక్కు మతము ప్రబలమైన మతము.

ఈ ప్రధాన మతాలతో పాటు బౌద్ధ మతము, జైన మతము కూడా భారతదేశ మత పటములో చోటుచేసుకున్నాయి. భారతదేశంలోని 5.9 మిలియన్ల ప్రజలు లేక మొత్తం జనాభాలో 0.71% ప్రజలు ఈ బౌద్ధ మతాన్ని ఆనుసరించేవారు ఉన్నారు. భారతదేశంలో ఉండే బౌద్ధ మతస్థులలో 85% ప్రజలు మహారాష్ట్రలో ఉన్నారు. భారతదేశంలో 4.1 మిలియన్ల ప్రజలు లేక 0.48 శాతం ప్రజలు జైన మతావలంబీకులు ఉన్నారు. సంఖ్యాపరంగా అంతగా ప్రాధాన్యత లేని మతాలు భారతదేశంలో మరొకొన్ని ఉన్నాయి. అవి లామాయిజమ్ (Lamaism), బాహై (Bahai), జోరాష్ట్రియనిజమ్ మరియు జూడాయిజమ్. ఈ మతాలన్నింటినీ మొత్తంగా అనుసరించే వారు 3.5 మిలియన్ల ప్రజలు లేదా 0.3% ప్రజలు భారతదేశంలో ఉన్నారు.

**హిందూ మతము:**

అధిక సంఖ్య వలనను మరియు దాని యొక్క సంక్లిష్టత వలనను అన్ని మతాలకంటే హిందూ మతము భారతదేశంలో ప్రాధాన్యతను కలిగియున్నది. కొన్ని నిర్వచింపబడిన భావనల ద్వారా హిందూ మతమును విశ్లేషించడము సాధ్యం కాదు. హిందూ మతము నిర్వహించడానికి వీలుగాని ధర్మాలు, ఆచారాలు, సిద్ధాంతాలు, నమ్మకాలు అనే వివిధ పొరలతో నిండి ఉన్నట్లు ఉంటుంది. ఈ కారణం వల్లనే కొందరు పండితులు హిందూ మతానికి నిర్వచనాన్నిచ్చే సమస్యను తప్పించుకోవడానికి, ఆ పదాన్ని మొత్తం మీద తప్పించలేక హిందూ మతము ఒక మతము కాదని, అదొక జీవన విధానమని పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాలలో ఉండే తూర్పు దేశస్తులు భారతదేశ మతానికి ఒక పేరునివ్వలేకపోయారు. ఇక్కడ ఉండే మతపరమైన నమ్మకాలకు, ఆచారాలకు సనాతన ధర్మమనే పదాన్ని ఉపయోగించుట తప్పించి వేరే పదాన్ని, పేరును ఇవ్వలేకపోయారని ఈ సమస్యను గురించి వివరించుట జరిగింది. పాశ్చాత్య దేశ వాసులు దీనికి వేరే పేరేమీ ఇవ్వలేక ఇక్కడ ఉండే మత నమ్మకాలకు హిందూయిజమ్ అని పేరు పెట్టడం జరిగిందని చౌదరి పేర్కొన్నారు. ఆ దేశం పేరు మీద వారిని హిందువులన్నారు. వారి మతపరమైన నమ్మకాలను, విధానాలను హిందూ మతం అన్నారు.

హిందూ మతంలో బహుదేవతారాధన కలదు. ఒక అంచనా ప్రకారం దేవుళ్ళు, దేవతలు, వాళ్ల అవతారాలు, స్థానిక దేవతలు, దేవతా స్వరూపాలు మరియు దైవ లక్షణాలు గల మునులు మొదలైన వారంతా కలిపి 330 మిలియన్లని ఒక అంచనా. వేదాలు, మత గ్రంథాలు 33 మంది దేవతలున్నారని చెప్పినా, హిందూ మతం ప్రస్తుతం ఉన్న మతాలన్నింటిలో ఎక్కువ దేవతా గణాన్ని కలిగియుందని పై వివరణ వలన తెలుస్తుంది.

దేవాలయం హిందువుల పవిత్రమైన ఆరాధనా స్థలము. దేవాలయము మతపరమైన కార్యక్రమాలకు కేంద్రబిందువు. దేవాలయాలో ఒకరు గానీ, అంతకంటే ఎక్కువగా గానీ దేవతలుంటారు. ఈ దేవతా విగ్రహాలు అనేక దేవాలయాలలో అనేక పద్ధతులలో పూజింపబడతాయి. ఈ దేవతలతో పాటు హిందువులు చెట్లను, జంతువులను కూడా పూజిస్తారు. హిందువులు వేపచెట్టు లాంటి కొన్ని చెట్లను, పాము, ఆవు, కోతి మొదలైన వాటికి దేవతా లక్షణాలు కలవని నమ్మి వాటికి పూజలు, ప్రార్థనలు చేస్తారు. కొండలను, నదులను కూడా పూజిస్తారు. ఏదైతే పవిత్రంగా వారికి గోచరిస్తుందో ఆ వస్తువును తప్పనిసరిగా ప్రార్థిస్తారు, పూజిస్తారు.

**ఇస్లాం (Islam):**

ఇస్లాం మతము భారతీయ సమాజంలో ఉద్భవించినది కాదు. అరేబియా దేశంలో పుట్టి, ముస్లిముల దండయాత్రలలో భారతదేశంలోకి 8వ శతాబ్దంలో వచ్చింది.

ఇస్లాం మత స్థాపకుడు మహమ్మదు ప్రవక్త. ప్రవక్త 570-632 ఎ.డి. కాలము నాటివారు. అల్లా అను భగవంతుడు ఒక్కడే గలడనీ, మహమ్మదు ప్రవక్త భగవంతుని దూత అని ఇస్లాం నొక్కి వక్కాణిస్తుంది. ఇస్లాం మతమును పాటించువారు ముస్లిములు. ముస్లిముల పవిత్ర మత గ్రంథం ఖురాను. అల్లాను తప్ప బీపమరెవరినీ ప్రార్థించరాదని, మహమ్మదు ప్రవక్త తప్ప మరెవరూ దేవుని యొక్క దూత కాదని ఖురాను బోధిస్తుంది.

ఖురాను ముస్లిములను ఈ క్రింది నియమాలను తప్పకుండా పాటించాలని నిర్దేశిస్తుంది. అవి:

1) అల్లాయే దేవుడు. అల్లా తప్ప మరి ఏ ఇతర దేవుడూ లేడు.

2) రోజుకు అయిదు సార్లు అల్లాకు ప్రార్థన (నమాజు) చేయాలి.

3) రంజాన్ మాసములో ఉపవాసములు చేయవలెను.

4) పేదలకు దానధర్మములు చేయవలెను.

5) మహమ్మద్ ప్రవక్త జన్మస్థలమైన పవిత్రమైన మక్కాకు కనీసం ఒక్కసారైనా తీర్థయాత్ర చేసిరావాలి.

ఎవరైతే ఈ ప్రమాణాలకు కట్టుబడి ఉంటారో వారు స్వర్గంలో సత్కరింపబడతారని ఖురానులో చెప్పబడింది.

ఖురాన్ నిర్దేశించిన మార్గములోనే ముస్లిములు నడుస్తారు. పాటించే మత కార్యక్రమాలలోని దివ్యజ్ఞాన వివరణను ఇచ్చుటలోని విభిన్నతల మీద ఆధారపడి ముస్లిములలో అనేక తరగతులు ఉన్నాయి. అయినప్పటికీ వాటిలో ముఖ్యమైనవి సున్నీలు, షియాలు. ఈ రెండు తరగతులలోనూ కూడా భారతదేశంలో సున్నీల తెగవారు అధికముగా గలరు.

**క్రైస్తవ మతము:**

ఇస్లాము వలెనే క్రైస్తవ మతము కూడా విదేశాలలో ఆవిర్భవించినది. క్రైస్తవ మతము మధ్య పాశ్చాత్య దేశాలలో ఆవిర్భవించింది. 16వ శతాబ్దంలో పోర్చుగీసు వారు గోవా, డయ్యు, డామన్‌లను ఆక్రమించినప్పుడు, తరువాత 17వ శతాబ్దములో ఆంగ్లేయుల రాకతోను క్రైస్తవ మతం భారతదేశంలోనికి ప్రవేశించింది.

క్రైస్తవ మత స్థాపకుడు జీసస్ క్రీస్తు. ఆయన పేరు మీదుగా క్రైస్తవ మతానికి ఆ పేరు వచ్చినది. క్రైస్తవ మతం జూడాయిజమ్ మతం నుంచి అభివృద్ధి చెందింది. క్రైస్తవ మతం కూడా జూడాయిజమ్ వలెనే ఒకే భగవంతుణ్ణి నమ్మాలని నొక్కి వక్కాణిస్తుంది. క్రైస్తవ మతం భగవంతుణ్ణి త్రిమూర్తిగా భావిస్తుంది. భగవంతుడు, తండ్రి, సృష్టికర్త. జీసస్ క్రైస్ట్, దేవుని తనయుడు మరియు పవిత్ర ఆత్మ, దేవుని యొక్క ప్రత్యక్షత గూర్చి క్రైస్తవుల వ్యక్తిగత అనుభవం.

క్రైస్తవులకు బైబిల్ ఒక్కటే పవిత్ర మత గ్రంథము. బైబిలులో దేవుని సూక్తులు గలవనీ, బైబిలు దైవ ప్రేరణచే రూపొందిందనీ క్రైస్తవుల నమ్మకం. బైబిలు క్రైస్తవులందరినీ ఉమ్మడిగా కలిపిఉంచే శక్తి. క్రైస్తవులలో అనేక తరగతులున్నవి. వీటిలో ముఖ్యమైన తరగతులు కాథలిక్కులు, ప్రొటెస్టెంటులు. వీరిలో కాథలిక్కు తరగతికి చెందిన వారి సంఖ్య అధికము. భారతదేశంలోని 21 మిలియన్ల క్రైస్తవులలో సుమారు 73 శాతం మంది కాథలిక్కులే.

**సిక్కు మతము:**

భరత భూమిలోనే సిక్కు మతం యొక్క వ్రేళ్లు, మూలాలు ఉన్నాయి. అనగా సిక్కు మతం భారతదేశంలోనే ఆవిర్భవించింది. గురునానక్ (1469-1539) సిక్కు మత స్థాపకుడు. గురునానక్ ఆధ్యాత్మిక పరమైన, మతపరమైన బోధనలు చేసే మత గురువు. నానక్ భగవంతుడొక్కడేనని, మరియు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని బోధించాడు. గురునానక్ దేవతారాధనను, మూఢనమ్మకాలను, మత కర్మకాండలను ఖండించాడు.

గురునానక్ మరణం తరువాత అయిదవ గురు అయిన గురు అర్జున్ నానక్ బోధనలను క్రోడీకరించగా, అతని తరువాతి వారు దానిని ఒక గ్రంథముగా రూపొందించారు. అదియే ఆది గ్రంథ్ లేక గ్రంథ సాహెబ్‌గా పిలువబడే సిక్కుల పవిత్రమత గ్రంథము. చివరి గురువు, పదవ గురువు అయిన గురు గోవింద సింగు సిక్కు మతాన్ని సిద్ధాంత పరంగా, వ్యవస్థాపరంగా బలపరిచినాడు. గురు గోవిందసింగ్ 'ఖల్సా' అను మిలటరీ, రాజకీయ వ్యవస్థను స్థాపించినాడు. ఖల్సా వ్యవస్థలో అతని అనుచరులందరూ చేరినారు. ఖల్సాలోనే అకాలీ (మరణము లేని వారు) స్థాపించబడినది. అకాలీల ప్రకారము వారి ప్రార్థనా స్థలమైన గురుద్వారాలను రక్షించుట, సిక్కు మత ఆచార సంప్రదాయాలను పరిరక్షించుట.

పేరులోని సింగు అను పదము ద్వారా సిక్కులను గుర్తించుట సాధ్యపడుతుంది. 'సింగు' అనగా సింహము. ఈ క్రింది విధముగా కూడా గుర్తించవచ్చును.

సిక్కులు అయిదు 'కె' (K)లను పాటిస్తారు.

కె-కేశ్-జుట్టు

కంగా-దువ్వెన

కాలా-కంకణం

కృపాన్-కత్తి

కచ్చా-పొట్టి లాగూ

**బౌద్ధ మతము:**

భారతదేశం బౌద్ధ మతానికి పుట్టినిల్లు. అయినా ఈ మతానికి ప్రపంచమంతటా గుర్తింపు ఉంది. ఈ మతము అనేక ఆసియా దేశాలలో వ్యాపించింది. ఈ మతానుయాయులు 300 మిలియన్ల ప్రజల కంటే ఎక్కువే ఉన్నారు. అయితే భాతరదేశంలో కేవలం ఆరు మిలియన్ల బౌద్ధ మతస్థులే ఉన్నారు. అయినప్పటికీ భారతదేశంలో బౌద్ధ మతం గొప్ప గౌరవం పొందింది. భారతదేశము యొక్క చిహ్నము ధర్మచక్రము, అశోకుడు స్థాపించిన సారనాథ్ అశోక స్తంభము నుంచి గ్రహించబడినది.

గౌతమ బుద్ధుని బోధనలే బౌద్ధ మతము. మానవ జీవనానికి దైవము అనే భావననే బౌద్ధ మతము వ్యతిరేకించింది. దైవమనే భావనను బౌద్ధులు అంగీకరించరు. బాధల నుంచి ఆత్మవిమోచనే (నిర్వాణము) మానవ జీవిత గమ్యమని బౌద్ధ మతం వివరించి, దానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఆ విధమైన గమ్యం చేరడానికి బౌద్ధ మతం దారి చూపింది. కోరికలే దు:ఖానికి మూలమని బౌద్ధ మతం భావించింది. ఈ కోరికలను జయించిన నాడు ఆత్మ విముక్తి సాధ్యము. కోరికలను జయించడానికి బౌద్ధ మతము అష్టాంగ మార్గాన్ని బోధించింది. అవి:

1) సమ్యక్ దృష్టి తేడా విశ్వాసం

2) సమ్యక్ ఆలోచన

3) సమ్యక్ వాక్కు

4) సమ్యక్ క్రియ

5) సమయ్యాక్ జీవనం

6) సమ్యక్ శ్రమ

7) సమ్యక్ నిశ్చయం

8) సమ్యక్ ధ్యానం

బౌద్ధమతంలో రెండు విభాగాలున్నాయి. అవి:

1) హీనయానము

2) మహాయానము

బుద్ధుని బోధనల, తత్వముల, పద్ధతుల మీద బలమైన నమ్మకము కల్గి నిలిచిన వారు హీనయాన తరగతి వారు. బుద్ధుని బోధనలలో ఏవిధమైన మార్పును కూడా వీరు అంగీకరించరు. మహాయానము కొంచెము స్వేచ్ఛా తత్వము గలది. అవసరాన్ని బట్టి కాలానుగుణంగా బుద్ధుని బోధనలలో మార్పులను మహాయానులు ప్రవేశపెడతారు.

**జైన మతము:**

జైన మతము కూడా భారతదేశంలోనే పుట్టింది. జైన మతం ఏ ఒక్క గురువు యొక్క బోధనల సారం వలన ఉద్భవించలేదని జైనుల నమ్మకం. జైనమతం 24 'జినుల' బోధనల వలన ఉద్భవించింది. 'జిన' అనగా జయించినవాడని అర్థము. ఈ జినులనే తీర్థంకరులని అంటారు. అనగా ఏర్పరచినవారు. మొదటి తీర్థంకరుడు వృషభదేవుడు. చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు. తీర్థంకరుల బోధనలను వ్యవస్థీకరించి ఒక మతముగా ఏర్పరచినది వర్ధమాన మహావీరుడు.

**జైన మత సిద్ధాంతం:**

జైన మతం వేదాల ఆధిక్యతను, వైదిక కర్మకాండలను, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తిరస్కరించింది. జైన మతం భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడని విశ్వసించలేదు. మానవుడు విముక్తి కోసం భగవంతుని అనుగ్రహంపై ఆధారపడకూడదని, తన భవిష్యత్తుకు తానే కర్తయని బోధించినాడు. సమానత్వ సిద్ధాంతానికి ప్రాధాన్యతనిచ్చినాడు. జనన మరణాల నుండి విముక్తి పొందడమే మానవ జీవిత లక్ష్యం. మానవుని కర్మలే అతని భవిష్యత్తును నిర్ణయిస్తాయి. కర్మ ఆత్మను అంటిపెట్టుకుని ఉంటుంది. కామ, క్రోధ, లోభ, మోహాలు, అజ్ఞానం కర్మకు కారణం. కర్మల ఫలితాలను బట్టి ఆత్మ జన్మ పునర్జన్మలను ఎత్తవలసి ఉంటుంది. ఈ కర్మ మార్గాల నరికట్టి పూర్వార్జిత కర్మను నాశనం చేసుకున్నప్పుడు జీవుడు బంధ విముక్తుడవుతాడు. బ్రహ్మచర్యము, మనోవాక్కాయ కర్మలలో పవిత్రత కనబరచడం, ఉపవాసం, నగ్నత, సల్లేఖన వ్రతమనే ఆమరణోపవాసం, ఈ పంచ వ్రతాలను పాటించుట వలన కర్మ నాశనమై జీవకైవల్యం పొందవచ్చును. సమ్యక్ చరిత్ర, సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం అనే త్రి రత్నాలను జైనమతం బోధించింది.

జైనమతం అహింసా సిద్ధాంతానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. క్రైస్తవ మతం దైవమనే భావనను తిరస్కరించినప్పటికీ, జైనులకు దేవాలయములు కలవు. ఈ దేవాలయాలలో తీర్థంకరుల ప్రతిమలుంటాయి. ఈ ప్రతిమలకే ప్రార్థనలు చేస్తుంటారు.

ఈ మతాలే కాక, భారతదేశంలో ఇంకా అనేక మతాలు కలవు. ఈ మతాలన్నీ భారతదేశంలో భిన్నతను చూపిస్తాయి. ఈ మతాలన్నీ భారతదేశంలో కలిసి జీవిస్తున్నప్పటికీ, సమాజంలో కొంత ఉద్రిక్తతను కలిగిస్తున్నవి. ఫలితంగా భారతదేశం విడగొట్టబడిన సమాజంగా ఉన్నది.

**భాషా సమ్మిశ్రమము:**

అనేక రకాల భాషలు కలిగిన దేశముగా భారతదేశం ప్రసిద్ధి చెందినది. భాషా శాస్త్రవేత్తలు భారతదేశంలో 400 మాట్లాడే భాషలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ, 1991 లెక్కల ప్రకారం 216 వ్యక్తిగత భాషలు కలవని తేలింది. ఈ 216 భాషలలో 114 భాషలను 10,000 మంది లేదా అంతకు మించి ప్రజలు మాట్లాడుతున్నారు.

ఈ 114 భాషలలో 18 భాషలను రాజ్యాంగ పరంగా గుర్తించడం జరిగింది. అవి: 1. అస్సామీ, 2. బెంగాలీ, 3. గుజరాతీ, 4. హిందీ, 5. కన్నడ, 6. కాశ్మీరీ, 7. మళయాళం, 8. మరాఠి, 9. ఒరియా, 10. పంజాబి, 11. తమిళం, 12. తెలుగు, 13. ఉర్దూ, 14. సింధి, 15. మణిపురి, 16. నేపాలి, 17. కొంకణి, 18. సంస్కృతం. (ఇవి షెడ్యూల్డ్ భాషలు). హిందీ తప్ప మిగతా షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ భాషలన్నీ ఆయా రాష్ట్రాలకు పరిమితమై ఉన్నాయి. 18 షెడ్యూల్డ్ భాషలలో హిందీ భాషను మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్నారు. 1991 లెక్కల ప్రకారం హిందీని మాట్లాడే వారు 247.85 మిలియన్లు, తెలుగు మాట్లాడే ప్రజలు 72.08 మిలియన్లు, బెంగాలీ 71.78 మిలియన్లు, మరాఠీ 67.26 మిలియన్లు, తమిళం 60.60 మిలియన్లు, ఉర్దూ 46.11 మిలియన్లు, గుజరాతీ 41.37 మిలియన్లు, మళయాళం 35.32 మిలియన్లు, కన్న 34.78 మిలియన్లు, ఒరియా 31.72 మిలియన్లు, పంజాబీ 22.41 మిలియన్లు మాట్లాడుతున్నారు. మిగిలిన భాషలను 1 నుంచి 20 మిలియన్ల ప్రజల దాకా మాట్లాడుతున్నారు.

1955 ముందు వరకు ఈ భాషలకు ఖచ్చితమైన భౌగోళిక ప్రాంతీయ హద్దులు లేవు. 1950లో ఆంధ్రా ప్రాంతంలో తెలుగు భాష మాట్లాడే వారికై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమం జరిగింది. మదరాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం వేరయింది. దీనితో భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల విభజనకు పునాది పడిందని చెప్పవచ్చును. రాష్ట్రాల పునర్వ్యవస్థీకృత కమీషన్ ఏర్పరచబడినది. 1955లో ప్రచురించబడిన ఈ కమీషన్ నివేదిక ఆధారంగా, పార్లమెంటులో 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం భాషా ప్రాతిపదికగా రాష్ట్రాలు తిరిగి వ్యవస్థీకరించబడినవి. బొంబాయి, పంజాబుల విభజన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చెలరేగింది. ఈ ఉద్యమ ఫలితంగా బొంబాయి రాష్ట్రం మహారాష్ట్ర మరియు గుజరాత్‌లుగా 1960లో మరియు పంజాబ్ మరియు హర్యానాలుగా 1966లో విభజించబడినవి.

పశ్చిమ బెంగాల్‌లో 1986లో మిలిటెంట్ల ఉద్యమం ప్రారంభమైంది. డార్జిలింగ్ జిల్లాలో గోర్ఖలి (Gorkhali) భాష మాట్లాడే గూర్ఖాలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం లేవదీశారు. గూర్ఖా నేషనల్ ఫ్రంట్ నాయకుడైన సుభాష్ ఘీ సింగ్ (Subhash

Ghising) నాయకత్వంలో ఈ ఉద్యమం కదిలింది. కానీ, వారి ఉద్యమం వారి ఆశయ సాధనలో విఫలమైంది. వారిని తృప్తి పరచుటకై భారతదేశ ప్రభుత్వం వారి కోసం డార్జిలింగ్ గోర్ఖాహిల్ కౌన్సిల్ (Darjeeling Gorakaha Hill Council)ను ఏర్పాటు చేసింది. అంతేకాక, 1992లో వారి నేపాలీ భాషను ఎనిమిదవ షెడ్యూల్‌లో పొందుపరిచింది.

**ద్విభాషా తత్వము** (Bilingualism):

భారతీయ ప్రజలు వారి మాతృభాషను మాత్రమే మాట్లాడకపోవుట, భారతదేశ భాషా చిత్రం (Scenario)లో ఆసక్తికర అంశం. 1991 లెక్కల ప్రకారం 844 మిలియన్ల భారతదేశ జనాభాలో 163 మిలియన్ల ప్రజలు ద్విభాషులు (దుబాసీలు) అనగా వారి మాతృభాషనే కాక మరొక భాషను కూడా మాట్లాడతారు. ఈ 163 మిలియన్ల ప్రజలలో 61 మిలియన్ల ప్రజలు మూడు భాషలను మాట్లాడతారు. ఇంగ్లీషును లేదా హిందీ, రెండవ, మూడవ భాషగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 90 మిలియన్ల భారతీయులకు రెండవ, మూడవ భాషగా ఇంగ్లీషు తెలుసు. 70 మిలియన్ల భారతీయులకు హిందీ తెలుసు. ఈ భాషలను అధికారిక భాషలుగా కూడా భారతదేశంలో వ్యవహరిస్తారు.

## 2.7 సాంస్కృతిక సమూహములు:

భిన్నత్వము భారతదేశ ప్రత్యేక లక్షణము. ప్రతి సామాజిక రంగంలోను విభిన్నత స్పష్టంగా కన్పిస్తోంది. భౌగోళికంగా, భాషా పరంగా, మత పరంగా భారతీయ సమాజములో విభిన్నత కలదు. భారత దేశమంతటా ఒకే రకమైన సంస్కృతి లేదు. ప్రజలు విభిన్న సాంస్కృతిక పద్ధతులను అనుసరిస్తారు. దీనివలననే భారతదేశంలో అనేక సాంస్కృతిక సమూహాలు ఉన్నాయి. ఎన్ని సాంస్కృతిక పద్ధతులు ఉన్నాయో అన్ని సాంస్కృతిక సమూహాలు ఉన్నాయి. ఈ సాంస్కృతిక సమూహాలను వర్గీకరించడానికి ప్రయత్నాలు జరుగుచున్నవి.

**ద్రావిడ సంస్కృతి-ఇండో ఆర్యన్-సంస్కృతి:**

థామస్ ట్రాట్‌మన్ (Thomas Trautman) మొదలైన శాస్త్రవేత్తలు భారతదేశంలోని సాంస్కృతిక పద్ధతిని రెండుగా విభజించినారు.

అవి: 1. ద్రావిడ సంస్కృతి 2.ఇండో ఆర్యన్ సంస్కృతి

దక్షిణ భారతదేశం ద్రావిడ సంస్కృతికి పుట్టినిల్లు కాగా, ఉత్తర భారతదేశంలో ఇండో ఆర్యన్ సంస్కృతి ప్రతిఫలిస్తుంది. శిల్ప రచనా పద్ధతులు, కళాత్మక రూపాలు, ప్రార్థనా పద్ధతులు, బంధుత్వ ఆచరణలు, వివాహ పద్ధతులు, అనేక భాషా ప్రయోగాలు మొ॥ వాటిలో ఉత్తర భారతదేశానికి, దక్షిణ భారతదేశానికి మధ్య విభిన్నతలున్నవి. ఈ విభిన్నతలే రెండు భౌగోళిక ప్రాంతాలను సాంస్కృతిక పరముగా వేరుచేయుచున్నవి. దక్షిణ భారత ప్రాంతంలో ద్రావిడ భాష కుటుంబాలు ప్రబలంగా ఉండేవి. కాబట్టి, ఆ ప్రాంతానికి ద్రావిడ సంస్కృతి గల ప్రదేశంగా పేరు వచ్చింది. అదే విధంగా ఉత్తర హిందూ దేశంలో ఇండో ఆర్యన్ కుటుంబాలు ప్రబలంగా ఉండుటచేత అది ఇండో ఆర్యన్ సంస్కృతి గల ప్రదేశంగా పేరు పొందింది.

## 2.8 ఉన్నత, అల్ప సంప్రదాయాలు:

రాబర్ట్ రెడ్ ఫీల్డ్ (Robert RedField) వ్రాసిన మెక్సికన్ కమ్యూనిటీస్ గ్రంథం ఆధారంగా భారతదేశ సమాజ సాంస్కృతిక పద్ధతిని ఉన్నత, అల్ప వర్గాల సంప్రదాయాలుగా విభజించడం జరిగింది

ఉన్నత అల్ప సంప్రదాయాలు ఉన్నత సంస్కృతి, అల్ప సంస్కృతి లేదా సంప్రదాయ సంస్కృతి, జానపద సంస్కృతి అనే భావనల పరంపర నుంచి ఏర్పడినాయి. ఉన్నత సంప్రదాయము నగరాలలోని పాఠశాలలోను, మందిరాలలోను, గుడి గోపురాలలోను, గ్రంథాలలోను నెలకొని ఉంటూ విద్యావంతుల ఆదరాన్ని పొందుతూ ఉంటే, అల్ప సంప్రదాయము గ్రామీణ సముదాయాలలోను, కర్షకులలోను, జానపద సముదాయాలలో నివసిస్తూ ఉన్న నిరక్షరాస్యుల జీవిత విధానాలలో ప్రతిబింబిస్తూ కొనసాగుతూ ఉంటుంది. అంటే ఉన్నత సంప్రదాయాన్ని పండితులు ఆరాధిస్తూ ఉంటే, అల్ప సంప్రదాయాము పామరులలో కొనసాగుతూ

ఉంటుంది. తత్వ శాస్త్రవేత్తలు, మత ప్రవక్తల, పండితుల సంప్రదాయము ఉన్నత సంప్రదాయము. ఇది చైతన్య పూరితంగా ఉంటూ, అభివృద్ధి పొందుతూ పరివర్తన పొందుతూ తరతరాల వారికి సంక్రమిస్తూ ఉంటుంది. అల్ప సంప్రదాయము నిరక్షరాసుయలు, పామరుల చేతులలో ఉంటే అభివృద్ధి పొందక, ఎట్లాంటి మార్పులు, పరివర్తనలు చెందక ఎప్పటివలెనే నిలిచిపోతూ, తరతరాల వారికి అదే సంక్రమిస్తూ ఉంటుంది.

అయితే, ఈ రెండు సంప్రాదాయాలు పర్సరాధారంతో, అవినాభావ సంబంధాలతో ఉంటాయి. ఉన్నత, అల్ప సంప్రదాయాలు రెండూ రెండు రకాలైన ఆలోచనా పద్ధతులు. రెండు రకాల ఆచరణలు కలవి. కానీ, అవి ఎప్పుడూ కలిసిమెలిసి ఉంటూ, ఒకదానిలో ఒకటి ఇమిడి ఉన్నాయి. ఈ రెండు సంప్రదాయాలు బాగా వృథక్కరణం చెందిన సముదాయాలలో వేరువేరుగా ఉండక, ప్రజల కార్యకలాపాలలో కలిసి ఏకమై ఉంటాయి.

ఉన్నత సంప్రదాయానికి కొంతమంది ప్రత్యేకమైన అధ్యాపకులు, పండితులు, శిష్టజనులు ఉంటారు. ప్రొఫెసర్ వి.రాఘవన్ ఉన్నత సంప్రదాయానికి చెందిన పండితులుఎవ్వరో, ఉన్నత సంప్రదాయం మీద వారు ఇచ్చే ఉపన్యాసాలు, బోధనలు ఏవిధంగా ఉంటాయో, వాటిని పామర జనులకు ఏవిధంగా అందిస్తారో తెలిసినవారు. అంతేకాకుండా వేదవేదాంగాలలో ఉన్న అంశాలు, విధులు, మత సిద్ధాంతాలు, ఏయే వ్యవస్థాపనల ద్వారా, సంస్థల ద్వారా పామర జనులకు చేరుతాయో చెప్పినాడు. ఉదా: పురాణాలలోను, ఇతిహాసాలలోను ఉన్న కొన్ని అంశాలను పరిగ్రహించి, వాటిని పామరులకు, జానపద గేయాల ద్వారా ప్రచారం చేయడం. జంగం వాళ్లు, పిచ్చుకుంట్లు, కొమ్మదాసరులు మొ॥ పామర పండితులు గ్రామ గ్రామాలు తిరుగుతూ వీటిని ప్రచారం చేస్తూ ఉంటారు.

ఉన్నత సంప్రదాయంలో పరికల్పనలను ప్రజల నమ్మకాలుగా భావిస్తే, అల్ప సంప్రదాయంలో పరికల్పనలను ప్రజలు మూఢవిశ్వాసాలుగా భావిస్తారు. వ్యక్తి స్థితి, హెూదా మొ॥ అతడు ఏ సంప్రదాయాన్ని పాటిస్తున్నాడో దానిమీద ఆధారపడి ఉంటాయి.

మన దేశాన్ని తీసుకుంటే దానికున్న ఉన్నత సంప్రదాయాన్ని సాంస్కృతిక సంప్రదాయమని అనవచ్చు. అది అనేక రూపాలలో మార్గాలలో అల్ప సంప్రదాయంగా ఏర్పడుతుంది. ఉన్నత సంప్రదాయము సాంస్కృతిక పరంగా వస్తున్న వ్రతాలలోను, ఉత్సవాలలోను, కర్మకాండలలోను ప్రతిబింబిస్తూ ఉంటుంది. అల్ప సంప్రదాయాలను పాటించే వారు తమ సాంఘీక అంతస్థును పెంపొందించుకోవడానికి సంస్కృతి బద్ధమైన ఉన్నత సంప్రదాయాలను, కర్మకాండలను అలవరుచుకొని వాటిని పాటిస్తూ ఉంటారు. ఈ ప్రక్రియనే ఎం.ఎన్.శ్రీనివాస్ (M.N.Srinivas) సంస్కృతీకరణము (Sankritization) అన్నాడు. ఈ ప్రక్రియ సమాజంలో సాంస్కృతిక పరివర్తనలను తీసుకుని రావడానికి ఎంతైనా దోహదం చేస్తుంది. 'రెడ్ ఫీల్డ్', "సింగర్"ల అభిప్రాయం ప్రకారం నాగరికత అనేది ల్ప, ఉన్నత సంప్రదాయాల అన్యోన్యకలయిక మాత్రమే. ఉన్నత సంప్రదాయము నగర కేంద్రాలలో అభివృద్ధి పొంది, ప్రత్యేకంగా పండితుల ఆదరాన్ని పొందుతూ ఉంటే అల్ప సంప్రదాయము పల్లె సముదాయాలలో ఉంటుంది. అల్ప సంప్రదాయము నాగరిక కేంద్రాలలో అభివృద్ధి పొందుతున్న ఉన్నత సంప్రదాయాలతో సంపర్కం పొందుతున్నప్పుడు అది కొన్ని పరివర్తనలను, మార్పులను పొందుతుంది. మన దేశంలో అల్ప, ఉన్నత సంప్రదాయాలు జానపద, నాగరిక అక్షం (Axis) మీద ఉండి విభజన చెందినాయి. ఈ రెండు రకాల సంప్రదాయాలు జానపద సమాజాలలోను, నగరాలలోను, వివిధ రూపాలలో ఉంటూ ఉంటాయి. నగరాలలో ఇంకా జానపద, పల్లె సంప్రదాయాలు ఉంటూ ఉండడం మనకందరికీ తెలిసిన విషయమే. ఈ అల్ప సంప్రదాయము భజనల ద్వారా, హరికథల ద్వారా, బుర్రకథల ద్వారా నాగరిక జీవితంలోకి ప్రవేశిస్తుంది. నగరంలో ఇది ఒక సముచిత స్థానాన్ని అలంకరిస్తుంది.

జానపదులు అల్ప సంప్రదాయాన్ని గేయాల ద్వారా, నృత్యాల ద్వారా, ఉత్సవాల ద్వారా, వేడుకల ద్వారా, సంబరాల ద్వారా ప్రోత్సహిస్తూ ఉంటారు. వారిలో అది ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ అల్ప సంప్రదాయానికి వేరే గ్రంథాలు అంటూ ఉండవు. ఎక్కడా వ్రాత పూర్వకంగా గ్రంథాలు పొందుపరచలేవు. ఎక్కువగా దీనిని నిరక్షరాస్యులు, పామరులు, జంగం వారు మొ॥ వారు పాటల ద్వారా, కథల ద్వారా, పద్యాల ద్వారా పోషిస్తూ ఉంటారు. ఈ విధంగా వాటిని సమాజంలో ఎల్లకాలము ఉండేటట్లు చేస్తారు.

అల్ప సంప్రదాయం నుంచి కొన్ని సంఘటనలను కొందరు వేరు చేసి, వాటిని సంస్కరించి, ఉన్నత సంప్రదాయంలో కలుపుతారు. కొన్ని పండుగలు, ఉత్సవాలు రెండు సంప్రదాయాలలోను నెలకొని ఉంటాయి. పైగా ఒకే సంస్కృతిలో ఈ రెండు సంప్రదాయాలు ఏర్పడి కలిసి ఉండవచ్చు. అయితే, ఈ రెండింటినీ రెండు వర్గాల ప్రజలు అనుసరించి పాటిస్తూ ఉంటారు. అంతే కాకుండా ఒకే మతంలో రెండు సంప్రదాయాలు ఇమిడి ఉంటాయి. ప్రజలు ఒకే మతానికి చెందినప్పటికీ ఉన్నత సంప్రదాయాన్ని ఒక వర్గానికి చెందిన వారు పాటిస్తే, అల్ప సంప్రదాయాన్ని వేరొక వర్గానికి చెందిన వారు పాటిస్తారు. అట్లాగే ఒకే సమాజంలో రెండు సంప్రదాయాలను పాటిస్తారు. నగరాలలోను, పల్లెలోను రెండు రకాల సంప్రదాయాలు ఉంటాయి. కానీ, వాటిని ఆచీపటించి అమలు జరిపే వారు మాత్రం వేర్వేరుగా ఉంటారు. ఎవరు సంస్కృతీ పరమైన ఉన్నత సంప్రదాయాన్ని, దాని ప్రమాణాలను వదిలి అల్ప సంప్రదాయాన్ని, దాని ప్రమాణాలను అనుసరిస్తారో వారు సంస్కృతీకరణము పొందుతారని శ్రీనివాస్ అభిప్రాయపడినాడు.

శ్రీనివాస్ అభిప్రాయానికి, భావనలకు చేరువగా మేరియట్ మరి రెండు భావాలను ప్రవేశపెట్టినాడు. అతను ప్రవేశపెట్టిన రెండు భావనలు: 1) విశ్వజనీకరణ (Universalization) 2) ప్రాంతీయీకరణ (Parochialization). ఈ రెండు ప్రక్రియలు ఒకే సమాజంలో ఒకే సంస్కృతిలో ఒకే వంతులో ఉండవచ్చునని అనుభవిక పద్ధతి ద్వారా అతడు మన దేశంలో కిషన్ గర్హి (Kishan Garhi) అనే గ్రామాన్ని అధ్యయనం చేసి చెప్పినాడు.

అల్ప సంప్రదాయాలలో నెలకొని ఉన్న కొన్ని పద్ధతులను తీసుకుని వాటిని కొన్ని సాంస్కృతిక పద్ధతుల ద్వారా శుద్ధి చేసి చివరకు వాటిని ఉన్నత సంప్రదాయాలలోకి చేర్చే ప్రక్రియను "విశ్వజనీకరణ" అని మేరియట్ అన్నాడు. ఈ ప్రక్రియ ద్వారా అల్ప సంప్రదాయము కొంత వరకు ఉన్నత సంప్రదాయంలో చేరి తద్వారా అది అందరి దృష్టిలో పడటానికి ఆస్కారం లభిస్తున్నది. ఈ ప్రక్రియ వల్ల అల్పసంప్రదాయము సర్వవ్యాప్తం కావడానికి, విశ్వజనీకరణం చెందడానికి వీలు కలుగుతున్నది. అల్ప సంప్రదాయము ప్రాంతానికి, ప్రాంతానికి వేరుగా ఉంటుందనీ, అదే ఉన్నత సంప్రదాయం అయితే అన్ని సమాజాలలోను ఒకే రీతిలో ఉంటుందని మాత్రమే ఇక్కడ మనము గ్రహించవలసిన ముఖ్య విషయము. మన దేశంలో ఏ ప్రాంతంలో చూచినా ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు మొ॥ సంస్కృతీ సంపద అందరికీ ఒకే విధంగా ఉండి, తద్వారా వాటి నుంచి వచ్చే ఉన్నత సంప్రదాయం కూడా ఒకే రీతిలో ఉంటుంది. కానీ, అల్ప సంప్రదాయం అట్లాకాదు. దేశంలోనే వివిధ ప్రదేశాలలో, వివిధ ప్రాంతాలలో వివిధ అల్ప సంప్రదాయాలు ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల భాషను బట్టి, భాషా పరిజ్ఞానాన్ని బట్టి, సంస్కృతిని బట్టి, ఆర్థిక పరిస్థితులను బట్టి, భౌగోళిక పరిస్థితులను బట్టి ఉంటుంది. ఈ పరిస్థితులలో ముడిపడి ఉన్న అల్ప సంప్రదాయము ఒక్కసారి కొన్ని కారణాల, ప్రభావాల వల్ల ఉన్నత సంప్రదాయంలోకి చేరితే అప్పుడు అది విశ్వజనీకరణ చెందడానికి, లోకవ్యాప్తం కావడానికి వీలు లభిస్తుంది. ఈ ప్రక్రియకు ఉదాహరణగా మేరియట్ తాను అధ్యయనం చేసిన కిషన్ గర్హి గ్రామం నుంచి కొన్ని పండుగలను, వ్రతాలను పేర్కొన్నాడు.

కిషన్ గర్హికి చెందిన ప్రజలందరూ సలూనో (Saluno) అనే పండుగ చేసుకొంటారు. ప్రతియేటా ఈ పండుగను 15 రోజులు జరుపుకుంటారు. ఈ పండుగకు తప్పనిసరిగా స్త్రీలు తమ తమ పుట్టింటికి భర్తలతో పాటు పోతూ ఉంటారు. అంటే ప్రతి ఏటా ఈ పండుగ పేరు చెప్పి ప్రతి కుటుంబంలోని చిన్న, పెద్ద అందరూ ఒకేసారి కలుసుకొంటారు. పండుగ పూర్తయిన తరువాత ఎక్కడి వాళ్ళు అక్కడికి పోతూ వెళ్లేటప్పుడు తమ సుఖ, సంతోషాలను తెలుపుకోవడానికి అక్కచెల్లెళ్ళు తమ అన్నదమ్ముల చేతులకు స్థానికంగా పవిత్రంగా భావించే బార్లీ కొమ్ములను కట్టి, బార్లీ గింజలను వారి నెత్తి మీద చల్లుతారు. వెంటనే అన్నదమ్ములు కానుకగా తమ అక్కచెల్లెళ్లకు సముచితమైన విధంగా డబ్బు ఇచ్చి సత్కరించి వీడ్కోలు చెబుతారు.

సరిగ్గా ఇదే రోజున భవిష్యోత్తర పురాణం ప్రకారం దేశమంతటా రాఖీబంధన్ లేదా రక్షాబంధన్ పండుగను జరుపుకొంటారు. ఈ పండుగ నాడు పురోహితుడు ప్రతి ఇంటికి వెళ్లి వేదమంత్రాలతో ప్రతి ఒక్కరినీ దీవిస్తూ ప్రతి వారి చేతికి ఒక పవిత్రమైన దారాన్ని ముడివేస్తారు.

మేరియట్ ఈ పండుగ అల్ప సంప్రదాయం ద్వారా ఉన్నత సంప్రదాయంలోకి వచ్చినదనీ, కొన్ని మార్పు కూర్పుల ద్వారా పురాణాలలోకి ఎక్కి, తద్వారా దేశంలో అందరూ జరుపుతున్నారని అభిప్రాయపడినాడు. అంటే ఈ పద్ధతి విశ్వజనీకరణం పొందినదని అతని అభిప్రాయం.

విశ్వజనీకరణ ప్రక్రియను వ్యతిరేకంగా ఉండే ప్రక్రియ ప్రాంతీయాకరణ ప్రక్రియ (Parochialization Process). ఉన్నత సంప్రదాయంలో కొన్ని పద్ధతులను పామర జనులు పరిగ్రహించి వాటిని వారికి అనుకూలంగా మార్చుకొని వారికి ఉన్న అల్ప సంప్రదాయంలోకి చేర్చుకుంటాయి. ఈ ప్రక్రియనే మేరియట్ ప్రాంతీయాకరణ అన్నాడు. అంటే ఉన్నత సంప్రదాయంలో కొన్ని వ్రతాలు, పండుగలు, ఉత్సవాలు, కర్మకాండలు మొ॥ పామరులను ఆకర్షించి, వారు వాటిని అదే రూపంలో గాని, వారికి అనుకూలమైన రూపంలో గాని తమ అల్ప సంప్రదాయంలోకి చేర్చుకుని పాటిస్తారు. ఈ ప్రక్రియకు ఉదాహరణగా మేరియట్ కిషన్ గర్హిలోని ఒక పండుగను పేర్కొన్నాడు.

భాగవత పురాణం ప్రకారం గోవర్ధనోద్ధరణ అనే పండుగను ప్రతి వారు జరుపుకుంటారు. అయితే, ఈ పండుగ ఉన్నత సంప్రదాయానికి చెందినది. గోవర్ధనమనేది ఒక పర్వతము. ఆ పర్వతం మీద ఆవుల మందలు మేస్తూ ఉండేవి. ఒకనాడు కృష్ణుడు తోటి గోపాల బాలురను పిలిచి వర్షం కోసం ఎక్కడో ఉన్న ఇంద్ర దేవతలను పూజించవద్దని, తమకు దగ్గరలో ఉన్న గోవర్ధన పర్వతాన్ని పూజించమని ఆదేశించాడు. వెంటనే ఇంద్రునికి కోపం వచ్చి ఒకసారి గోవుల మీద, గోపాల బాలుర మీద రాళ్ల వాన కురిపించినాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆ గోవర్ధన పర్వతాన్ని పైకి ఎత్తి దాని కింద గోవులను, గోపాల బాలురను సురక్షితంగా కాపాడినాడు. కాబట్టి అప్పటి నుంచి ప్రతి ఏటా ఆ గోవర్ధన గిరిని అందరూ పూజిస్తారు.

ఈ గోవర్ధనోద్ధరణం పండుగను కిషన్ గర్హిలో 'గోవర్ధన' పండుగగా మారిపోయింది. కిషన్ గర్హిలో పామరులు ఈ పండుగ నాడు ఆవు పేడను ఒక పర్వతం మాదిరిగా తయారు చేస్తారు. ఈ పేడ పర్వతం మీద ఈ పండుగ నాడు చెట్లను నాటి, రాళ్లను పొదిగి వాటిని తమ పశువులుగా భావిస్తారు. పేడతోనే పశువుల కాపరి బొమ్మను, పాలచెంబులను తయారు చేస్తారు. అసలైన పశువుల కాపరులకు పండుగ నాడు తగిన బహుమతి ఇస్తారు. పేడతోనే పశువులు నీరు తాగే చెరువును తయారు చేస్తారు. చివరకు ఆ పర్వతాన్ని పశువులను పూజిస్తూ "ఓ పేడధనమా! నీవు కలకాలం మా ఇంట్లో వర్ధిల్లాలి" అని ప్రార్థిస్తారు. ఈ విధంగా ఉన్నత సంప్రదాయంలోని గోవర్ధన పండుగ అల్ప సంప్రదాయంలోకి వచ్చేటప్పటికీ గోవర్ధన పండుగగా మారిపోయి, దాని అర్థము, విలువ, ప్రయోజనాలు మారిపోయినాయి.

**బహు సంప్రదాయాలు** (Multiple Traditions):

భారతీయ సమాజ సంస్కృతిని ద్రావిడ-ఇండో ఆర్యన్‌ల సంస్కృతుల ద్వారా లేక ఉన్నత అల్ప సంప్రదాయాల ద్వారాను పూర్తిగా వివరించలేమని కొంత మంది సాంఘీక శాస్త్రవేత్తల అభిప్రాయం. భారతీయ సంస్కృతి సంక్లిష్టమైనదని, దానిని విభిన్నమైన విశిష్టమైన ఖచ్చితమైన రెండు తరగతులుగా విడదీసి అధ్యయనము చేఉట సాధ్యపడదని ఎస్.సి.దూబే (S.C.Dube) అభిప్రాయపడ్డారు. భారతీయ సంస్కృతికి అనేక సంప్రదాయాలు, వాటికి అనేక పద్ధతులు గలవు. ఇది మొత్తం పరిస్థితిని గజిబిజి చేస్తుంది. ఉన్నత సంప్రదాయాలు, అల్ప సంప్రదాయాల వంటి ద్వివర్ణ విభజనకు తీవ్రమైన పరిమితులున్నాయి.

ఈ విభజన ప్రాంతీయ, పాశ్చాత్య మరియు ఉత్పన్నమవుతున్న (Emergent) జాతీయ సాంప్రదాయాల పాత్రను పరిగణనలోనికి తీసుకునేందుకు సక్రమమైన పరిధిని ఏర్పడనీయదు. దీనికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయ భారతీయ సమాజానికి దూబే ఆరు రకాల వర్గీకరణను ప్రతిపాదించాడు. దీనిలో ప్రతిదీ గ్రామీణ, నగర సాంప్రదాయాలను అధ్యయనం చేస్తుంది. అవి:

1. శ్రేష్టమైన (Classical) సాంప్రదాయం
2. ఉత్పన్నమవుతున్న జాతీయ సాంప్రదాయం
3. ప్రాంతీయ సాంప్రదాయం
4. స్థానిక సాంప్రదాయం
5. పాశ్చాత్య సాంప్రదాయం
6. స్థానిక సామాజిక, సమూహా ఉపసంస్కృతుల సాంప్రదాయం

భారతీయ సంస్కృతిక సమూహ అధ్యయనంలో ఈ వివిధ సంప్రదాయ స్థాయిలు విశాల పరిధిని ఏర్పాటు చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే, ఈ విభజన ఏ సూత్రం మీద జరిగిందో అది నామమాత్రము, తాత్కాలికము. ఉన్నితిన్ (Unnithan), దేవ (Deva), సింగ్ (Singh)ల ప్రకారం వివిధ రకాల సంప్రదాయాల వర్గీకరణకు ఇది వర్తిస్తుంది. భారతదేశంలోని పద్ధతుల వర్గీకరణకు కూడా ఇది అన్వయిస్తుంది.

## 2.9 ముఖ్య పదములు:

**ఆది గ్రంథ్** (Adi Granth):

దీనిని గ్రంథ సాహెబ్ అని కూడా అందురు. ఇది సిక్కుల పవిత్ర గ్రంథము.

**అహురా మజ్దా** (Ahura Mazda):

పారశీకుల దేవుడు.

**అకాలీ దళ్** (Akalidal):

సిక్కుల దేవాలయములను రక్షించుటకు, సిక్కుల మత ఆచార సంప్రదాయములను పరిరక్షించుటకు ఏర్పడిన సిక్కుల సేన.

**అష్టాంగ మార్గము** (Ashtangika Marg):

ఎనిమిది సూత్రాల మార్గము. కోరికలను జయించడానికి, దుఃఖ నివారణకు గౌతమ బుద్ధుడు ప్రబోధించిన మార్గము.

**బార్ మిత్వా** (Bat Mitzvah):

యూదుల మగపిల్లలు 13వ సంవత్సరములో వారు పెద్ద మనుష్యుల సముదాయంలో చేరిన దానికి చిహ్నంగా నిర్వహించిన మత పరమైన కర్మకాండ.

**సర్కమ్‌షిషన్** (Circumcison):

పురుషులలోశిశ్నముపై ముందుగల చర్మాన్ని, స్త్రీలలో అంతర్గత జాష్యము (పెదిమ) మత పరమైన ప్రక్రియగా కత్తిరించడం (సుంతి). యూదులలో దీనిని అబ్రహంకు దేవునితో గల ఒప్పందానికి చిహ్నంగా బాలురకు 8 (ఎనిమిదవ) ఏటా ఆచరిస్తారు. ముస్లింలలో కూడా ఈ ఆచారం కలదు.

**సంస్కృతి** (Culture):

మానవుడు సమాజ సభ్యునిగా సముపార్జించే కళలు, మతము, ఆచార సంప్రదాయాలు, విలువలు వీటన్నింటి యొక్క మొత్తమే సంస్కృతి.

**దఖ్మా** (Dakhma):

పారశీకులు మృత శరీరమును ఉంచు ఎత్తయిన గోపురము. ఈ గోపురము ఎత్తయిన గోడలను కలిగి, గుండ్రముగా నుండి ఆకాశము వైపుకు తెరుచుకుని ఉంటుంది. పారశీకులు శవములను గోపురము పైన పెడతారు. గ్రద్దలు మృత శరీరములను తినవలెననే ఉద్దేశ్యంతో పారశీకులు ఆ విధంగా చేస్తారు.

**డెమి-గాడ్** (Demi-God) (Half God):

సగం దైవత్వం పొందిన వారు.

**డినామినేషన్** (Denomination):

సమాజంలో ఒక మతపరమైన వ్యవస్థ. దీనిని కొంత మంది మాత్రమే గుర్తిస్తారు. అందుచేత సభ్యత్వం కోసం ఇటువంటి మిగతా మత పరమైన వ్యవస్థలతో దీనికి పోటీ ఉంటుంది.

**నరవర్గ సమూహము** (Ethinic Group):

నరవర్గ సమూహము ఒక పెద్ద సమాజములో భాగము గాను, ఆ పెద్ద సమాజము యొక్క సంస్కృతిని నరవర్గ సమూహము వారు కలిగియుంటారని భావింపబడుచున్నది.

**ఉన్నత సాంప్రదాయము** (Great Tradition):

గుడి గోపురాలలోను, గ్రంథాలలోను నెలకొని ఉంటూ విద్యావంతుల ఆదరాన్ని పొందుతుంది. తత్వశాస్త్రవేత్తల, పండితుల సంప్రదాయము.

**గురుముఖి** (Gurumukhi):

సిక్కుల యొక్క పంజాబీ భాష లిపి.

**గురుద్వారా** (Gurudwara):

సిక్కుల దేవాలయము.

**హీనయాన** (Hinayana):

బౌద్ధ మతములో ఒక శాఖ, సంప్రదాయ బౌద్ధ తత్వము మీద పద్దతుల మీద ఆధారపడినది.

**జాకోబ్** (Jacob):

ముగ్గురు యూదు ముఖ్య మూల పురుషులలో ఒకరు.

**జహొవా** (Jahovah or Yahweh):

యూదుల దేవుడు.

**జూడాయిజమ్:**

యూదుల మతము.

**ఖల్సా:**

సిక్కుల కొరకు వారి చివరి గురువైన గురు గోవింద సింగుచే సృష్టించబడిన సైనిక మరియు రాజకీయ వ్యవస్థ.

**అల్ప సంప్రదాయము:**

గ్రామీణ సముదాయాలలోను, కర్షకులలోను, జానపద సముదాయాలలో నివసిస్తున్న నిరక్షరాస్యుల జీవన విధానాలలో ప్రతిబింబించే సంస్కృతి.

**మహాయాన** (Mahayana):

బౌద్ధ మతములోని ఒక శాఖ. బుద్ధుని భావనలో, ఆచరణ పద్ధతులలో మార్పులను అంగీకరిస్తుంది.

**మోనోథీజమ్** (Monotheism):

ఒక దేవుని యందు నమ్మకము.

**నౌజోత్** ( Naujote):

మత పరమైన కర్మకాండ. తొమ్మిదవ ఏట ప్రవేశించిన ఆడపిల్లలకు, మగపిల్లలకు యవ్వన దశలోనికి చేరిన గుర్తుగా సంప్రదాయకంగా జరుపు కర్మకాండ.

**నిర్వాణ** ( Nirvana):

సాహిత్య పరంగా అర్థము 'బైటికి వెళ్ళుట', ఈ భావనకు అర్థము 'ఆత్మ విముక్తి'.

**ఆక్సిపట్** (Occuiput):

తల వెనుక భాగము.

**అఫీషియల్ లాంగ్వేజ్** (Official Language):

అధికార భాషా చట్టం 1963 క్రింద రాజ్యాంగముచే గుర్తించబడిన భాష.

**పాతివ్రత్యం** (Prativatya):

భర్తను భార్య దేవునిలా భావించి పూజించుట.

**పోలిథీయిజమ్** (Polytheism):

బహుదేవతారాధన, అనేక మంది దేవతా మూర్తులను ఆరాధించుట.

**రేస్** (Race):

జాతి

**రమదాన్** (Ramadan):

చాంద్రమాన మాసం. ఈ నెలలో ముస్లిములు సూర్యోదయం నుండి సూర్యాస్తమానం వరకు నీటిని, ఆహార పదార్థములను తీసుకోకుండా ఉపవసిస్తారు.

**మతము** (Religion):

మానవాతీత శక్తులపై నమ్మకం.

**మోక్షము** (Salvation):

ఆత్మ బాధల నుండి, భౌతిక బంధాల నుండి విముక్తిని పొందుట.

**షియాలు:**

ముస్లిములలో ఒక శాఖ. వీరు అలీని మహమ్మద్ ప్రవక్తకు నిజమైన వారసునిగా భావిస్తారు.

**ఉప సంస్కృతి** (Sub Culture):

సమాజం యొక్క సంస్కృతి కలిగియుండి, తన సముదాయం యొక్క భిన్నమైన విశిష్ట లక్షణాలు కలిగియున్న సంస్కృతి.

**సున్నీలు:**

ముస్లిములలో ఒక శాఖ. నలుగురు ఖలీఫ్‌లను అనగా అబుబకర్, ఉమర్, ఉత్మన్, అలీలను అంగీకరించిన వారు.

**సినగాగ్** ( Synagogue):

యూదుల ప్రార్థనా స్థలము.

**టోరాహ్** (Torah):

చట్టము లేదా బోధన (Teaching). యూదుల మత గ్రంథము. భగవంతుడు మోజస్‌కు చెప్పగా, అతడు గ్రంథస్థం చేసినట్లు యూదుల నమ్మకము.

**జోరాష్ట్రియనిజమ్:**

పారశీకుల మతము.

**విశ్వజననీకరణ** (Universalisation):

అల్ప సంప్రదాయాలలో నెలకొని ఉన్న కొన్ని పద్ధతులను తీసుకొని వాటిని కొన్ని సాంస్కృతిక పద్ధతుల ద్వారా శుద్ధి చేసి చివరకు వాటిని ఉన్నత సంప్రదాయాలలోకి చేర్చే ప్రక్రియ.

## 2.10 ప్రశ్నలు:

1. భారతీయ జనాభా యొక్క జాతి సమ్మిశ్రమము విశ్లేషించుము.
2. భారతీయ జనాభాలో ఉన్న జాతులలోని రకములను గుర్తింపుము.
3. భారతీయ సమాజములోని నరవర్గ సమ్మిశ్రమమును విశ్లేషించుము.
4. భారతదేశములోని నరవర్గ సమూహములను గుర్తింపుము.
5. భారతీయ సమాజములోని మతపరమైన సమ్మిశ్రమమును వివరింపుము.
6. భారతదేశము నందు భిన్నమత విశ్వాసములు కలవు-చర్చింపుము.
7. భారతదేశ జనాభాలోని భాషా సమ్మిశ్రమమును చర్చింపుము.
8. భారతదేశములో మాట్లాడబడుచున్న వివిధ భాషల అంతస్తును వివరింపుము.
9. భారతదేశములోని సాంస్కృతిక సమూహములను రెండుగా విభజించుటలో ఉన్న పరిమితులను చర్చింపుము.

## 2.11 చదవదగిన గ్రంథాలు:

1. A Lion Hand BookG The World's Religions. Oxford: Lion Publishing Company, 1994.
2. Ahuja, Ram: Indian Social System, JaipurG Rawat Publications, 1993.
3. Mujumdar, D.N., and Madan, T.N: An Introduction to Social Anthropology. Bombay: Asia Publishing House, 1956.
4. Singh, Yogendra: Modernisation of India Tradition. (A Systmatic Study of Social Change) Jaipur: Rawat Publications, 1996.
5. Srinivas M.N: Caste in Modern India and other Essays Bombay: Media Promoters & Publishers, 1985.

**పాఠం-3**

# భారతీయ సమాజాన్ని సాంప్రదాయక విలువల ద్వారా అర్థము చేసుకొనుట

**విషయక్రమం:**


3.1 ఉద్దేశ్యము

3.2 పరిచయము

3.3 హిందూ జీవన దృక్పథము

3.4 పురుషార్థములు

3.5 ఆశ్రమ ధర్మములు

3.6 కర్మ, పునర్జన్మల భావనలు

3.7 ముఖ్య పదములు

3.8 ప్రశ్నలు

3.9 చదవదగిన గ్రంథాలు


## 3.1 ఉద్దేశ్యము:

హిందూ సామాజిక జీవనంలోని సాంప్రదాయక విలువలను వివరించుట.

## 3.2 పరిచయం:

ప్రపంచంలోని అన్ని సమాజాలలో భారతీయ సమాజానికి ఒక విశిష్టమైన గుర్తింపు ఉన్నది. భారతీయ సమాజంలోని ఈ విలక్షణత తరతరాలుగా వస్తున్న సాంప్రదాయక విలువల వలన వచ్చింది. కనుక భారతీయ సమాజాన్ని అర్థం చేసుకోవలెనంటే, దాని సాంప్రదాయక విలువలను అర్థం చేసుకోవడం అవసరం.

భారతీయ సమాజం వలెనే, విలువలు కూడా సనాతనమైనవి. పూర్వ నుంచి కూడా ప్రజలు ఈ విలువలను అంటిపెట్టుకుని పెంచి పోషించారు. ప్రాచీన కాలంలోని ఋషులు ఈ విలువలకు దైవశక్తిని ఆపాదించి ఆశీర్వదించుట వలనను, సమకాలీన పరిస్థితులకు అనుకూలమైనవిగా ఉండుట వలనను ప్రజలు విలువలను అంటిపెట్టుకొనియున్నారు. ప్రజలు సామాజిక జీవనం గూర్చి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకొని, వాటికి విలువలను ఆపాదించుకున్నారు. కనుక సాంప్రదాయక విలువలను అర్థం చేసుకొనుటకు, భారతీయ సామాజిక జీవన పరిజ్ఞానము అవసరము.

భారతీయ జీవన దృక్పథము హిందూ జీవన దృక్పథములో ప్రతిబింబిస్తుంది. హిందూ సామాజిక వ్యవస్థలో ఒక విలక్షణత ఉన్నది. సమాజంలోని ఆదర్శాలు, విలువలు నిర్దేశిస్తూ ప్రాచీన కాలంలో ఋషి సంప్రదాయంలో కొన్ని నియమాలను, సూత్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మానవులందరి మనుగడకు కావలసిన ధర్మాలను, గమ్యాలను వారు పొందవలసిన స్థితిని వివరించడం జరిగింది. సామాజిక, మానసిక ఆధారాలను అనుసరించి హిందూ సామాజిక వ్యవస్థను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించవలసిన

ఆవశ్యకత ఎంతైనా ఉంది. హిందూ చింతన, సంప్రదాయం గ్రహించి వాటిని వ్యాఖ్యానించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సనాతన పద్ధతులను అవగాహన చేసుకోవడం వలన వాటి సూత్రాలు, ప్రేరణలు నేటి సమాజానికి ఉపయోగపడతాయి. సామాజిక క్రమాన్ని పునర్నిర్మించడానికి దోహదం చేస్తాయి.

## 3.3 హిందూ జీవన దృక్పథము:

మనిషి శరీరము మరియు ఆత్మను కలిగి యుంటాడని హిందువుల నమ్మకము. ఈ రెండు ఒకదానితో ఒకటి సంబంధమును కలిగి ఉంటాయి. ఆత్మ శరీరాన్ని నడిపించే వక్తి. శరీరం లోపల ఆత్మ ఉండి, శరీరానికి జీవితాన్ని ఇస్తోంది. ఆత్మ శరీరం లోపల ఉన్నంత కాలం శరీరం పనిచేస్తుంది. ఆత్మ శరీరాన్ని విడిచి వెళ్లగానే, శరీర కదలిక ఆగిపోతుంది.

ఆత్మ శరీరంలో ఉన్నంత కాలం మనిషి జీవించియున్నట్లు భావిస్తారు. ఆత్మ తన నీడను వదలగానే, అనగా శరీరాన్ని విడువగానే జీవితం ఆగిపోతుంది. ఆత్మ కదిలి బైటికి వెళ్లడంతో ప్రాణం బయటకు పోతుంది. ప్రాణంతోపాటు అన్ని ముఖ్య వాయువులు శరీరంలో నుంచి బయటకు పోతాయని బృహదారణ్యక ఉపనిషత్తు వివరించింది.

కనుక హిందువులకు ఆత్మ అతి ముఖ్యమైనది. హిందువుల దృష్టిలో మనిషి జీవించడమనేది ఆత్మ శరీరంలో ఉండడమనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆత్మ శరీరాన్ని వీడినప్పుడు జీవితం ముగుస్తుంది. అనగా, ఆత్మ పోయినప్పుడు వ్యక్తి మరణిస్తాడు. ఆత్మ శరీరంలో ఎల్లకాలం ఉండదని దీని భావన. ఆత్మకు శరీరము విశ్రాంతి స్థలము. ఒక దశలో ఆత్మ నీడను వీడి, శరీరానికి మరణాన్ని తెలస్తుంది. శరీరము అశాశ్వతము, ఆత్మ శాశ్వతము. ఆత్మకు మరణము లేదు. చనిపోయిన తరువాత శరీరము కాలిపోయినప్పటికీ, ఆత్మ శాశ్వతమయినదని వేదాలు, హిందూ ధర్మశాస్త్రాలు ఉద్ఘాటించినాయి.

మరణముతో మనిషి యొక్క జీవితము అంతము కాదని హిందువుల నమ్మకము. మనిషికి పునర్జన్మ కలదు. మనిషి తిరిగి జన్మిస్తాడు. మరొక విధంగా చెప్పాలంటే, మరణించిన వ్యక్తి యొక్క ఆత్మ భూమి మీదకి తిరిగివస్తుంది.

పుట్టుట గిట్టుట కొరకే, కానీ హిందువులు జీవితం మరణంతో ఆగిపోదని భావిస్తారు. మరణము శరీరమునకే గానీ, ఆత్మకు కాదు. ఆత్మ శాశ్వతమైనది. వేరే శరీరములోనికి ప్రవేశిస్తుంది. పునర్జన్మ ఉన్నప్పటికీ, అది మరణముతో ముగిసి, తిరిగి పునర్జన్మ పొందుతుంది. ఈ విధంగా మానవుడు పుట్టుక, మరణము, పునర్జన్మ అనే చక్రంలో తిరుగుతూ ఉంటాడు.

కనుక హిందువుల అభిప్రాయంలో జీవితము పూర్వజన్మ, పునర్జన్మల గొలుసులో ఒక కొక్కెము లాంటిది. ఆత్మ శాశ్వతము కాబట్టి పుట్టుక, పునర్జన్మ సాధ్యము. మృత్యువు శరీరానికి గానీ, ఆత్మకు కాదు. కనుక జీవితానికి మరణము అంతం కాదు. క్రొత్త శరీరంలోనికి జీవితము పునర్జన్మగా తిరిగివస్తుంది.

**మరో లోకం** (After-Life):

శరీరము నశించిన తరువాత మరియు పునర్జన్మల మధ్య విరామముంటుంది. ఈ విరామ సమయంలో కూడా ఆత్మ చురుకుగా ఉంటుంది. జీవించి ఉంటుంది. హిందువులు ఈ లోకం తరువాత మరొక లోకం ఉంటుందని నమ్ముతారు. మనిషి మరణించిన తరువాత ఆత్మ మరొక లోకం వెళ్లి, అక్కడ జీవనం కొనసాగిస్తుంది. మరొక లోకం యొక్క స్వభావము, పరిస్థితులు మనిషి ఈ లోకంలో చేసే చర్యలపై ఆధారపడి ఉంటాయి. మరొక రెండు లోకాలు ఉన్నాయి. ఒకటి స్వర్గము, రెండవది నరకము. చనిపోయిన తరువాత మనిషి స్వర్గానికి వెళ్లి సుఖంగా జీవించవచ్చు లేదా నరకానికి వెళ్లి బాధలు పడవచ్చు.

మనిషి స్వర్గ సుఖాలు అనుభవిస్తాడా? లేక నరకయాతనలు పడతాడా? అనేది అతని యొక్క చర్యలపై అనగా కర్మఫలముపై ఆధారపడి ఉంటుంది. యజ్ఞవల్క్యుని ప్రకారం మరొక జీవితం అతను చేసే చర్యలు లేక కర్మలపై ఆధారపడి ఉంటుంది. మంచి పనులు మంచి ఫలములను, చెడు పనులు చెడు ఫలములను ఇస్తాయి. నీతివంతమైన లేక శీలవంతమైన చర్యలు మనిషిని స్వర్గానికి తీసుకువెళతాయి. చెడు చర్యలు లేక పనులు నరకానికి తీసుకువెళతాయి.

మృత్యు దేవత అయిన యమధర్మరాజు నరకంలో మనిషిని అనేక రకములైన బాధలకు గురిచేస్తాడు. ఉదా: సంకెళ్లతో బంధిస్తాడు. సలసలా మరిగే నూనెలో వేయిస్తాడు. నిప్పుల్లో కాలుస్తాడు. స్వర్గంలో మానవుడు ఆనందకరమైన జీవితాన్ని గడుపుతాడు.

**పునర్జన్మ:**

ఆత్మ శాశ్వతమైనది. కనుక జీవికి పునర్జన్మ ఉంటుంది. వ్యక్తులు తాము ఆచరించిన కర్మల ప్రతిఫలానుభవం ఆ జన్మలో పూర్తి కాకపోతే రాబోయే జన్మలలో పూర్తవుతుంది. ఒక జీవి కోరికలు, ఆలోచనలు, గుణగణాలు అనేక జన్మల నుంచి పరంపరగా వస్తుంటాయి. స్వభావ సిద్ధంగా ఆత్మ పరిశుద్ధమైనదైనా, వ్యక్తి చేసే చర్యల ఫలితాలు ఆత్మను అంటిపెట్టుకుని ఉంటాయి. పునర్జన్మలో కూడా కర్మఫలం కొనసాగుతుంది. పునర్జన్మలో ముందు జన్మలో చేసిన పనులను బట్టి వ్యక్తి సుఖంగా జీవించడమో? లేక కష్టపడడమో నిర్ణయింపబడుతుంది. ఆత్మ క్రితం జన్మలో కూడబెట్టిన కర్మల బరువు లేక భారములతో జన్మిస్తుంది అని మహాభారతంలో చెప్పబడినది. పూర్వ జన్మలో చేసిన కర్మల ఫలితంగా సుఖం గానీ, దు:ఖం గానీ మనిషికి దక్కుతుంది. ఇది యాథృచ్ఛికమైనదో లేక అదృష్టమో కాదు. ఇది కేవలం మానవుని గత చర్యలు లేక కర్మల ఫలితమే.

యజ్ఞవల్క్యుని అభిప్రాయంలో మానవుని చర్యలు మూడు రకములైన లేక మూడు విధములైన ఫలితాలను ఇస్తాయి. అవి:

1. జాతి : హెచ్చు లేక తక్కువ స్థితిలో పుట్టుక
2. ఆయువు : జీవిత కాలము
3. భోగము : సంతోషము లేక విచారము

ఈ విధంగా హిందువుల ఉద్దేశ్యములో జీవికి పుట్టుక, చావు, పునర్జన్మ ఉంటాయి. మనిషి జన్మిస్తాడు మరియు చనిపోతాడు. మరణము తరువాత పునర్జన్మ ఉంటుంది. ఈ దశలు ప్రతి ఒక్కరి జీవితంలో సంభవిస్తాయి. హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం పుట్టిన ప్రతి మనిషీ మరణిస్తాడు. అయితే మరణము జీవితాన్ని అంతం చేయదు. మరణం తరువాత మరో లోకంలో, స్వర్గంలో లేక నరకములో జీవితం కొనసాగుతుంది. మరో ప్రపంచంలో కొంతకాలం ఉన్న తరువాత మనిషి యొక్క ఆత్మ తిరిగి జన్మిస్తుంది, అదియే పునర్జన్మ.

## 3.4 పురుషార్థములు:

ఏదైనా ఒక ధ్యేయం ఉన్నప్పుడే జీవితానికి అర్థం ఉంటుంది. దీనిని గుర్తించి హిందూ మతము వ్యక్తికి ఒక ధ్యేయాన్ని నిర్దేశించింది. అయితే, ఇది ఒక ధ్యేయము కాదు, నాలుగు ధ్యేయములు. అవి: 1) ధర్మము, 2) అర్థము, 3) కామము, 4) మోక్షము. అనగా నీతివంతము, సంపద, సుఖము, ముక్తి.

పురుషార్థములు జీవితానికి తులనాత్మక దృక్పథాన్ని ఇచ్చాయి. జీవితానికి భౌతిక సుఖము మరియు ఆధ్యాత్మికత అవసరము. ఈ రెండింటిలో ఏది లేకపోయినా జీవితం అసంపూర్ణము. దీనిని దృష్టిలో పెట్టుకుని పురుషార్థములు భౌతిక సుఖానికి, ఆధ్యాత్మికతకు కూడా ప్రాధాన్యతనిచ్చాయి.

పురుషార్థాలు వ్యక్తికి, సామాజిక వ్యవస్థకూ కూడా నిర్మాణాత్మకంగాను, అభివృద్ధి పూర్వకంగాను ఉపయోగపడుతూ, ఆదర్శంగా ఉంటాయి. సమాజంలో నివసిస్తున్నప్పుడు వ్యక్తి అధికారాన్ని, ధనాన్ని, భోగభాగ్యాలను అక్రమ మార్గాల ద్వారా సంపాదించక, ధర్మ మార్గాన్ని అనుసరించి పొందడానికి ప్రయత్నించవలెను, ధనమే సర్వస్వము కాదు అనే దృష్టితో వ్యక్తి ప్రవర్తించవలెను. ఏ పరిస్థితుల్లోనూ ధర్మాన్ని త్యజించకూడదు. అట్లాగే కామవాంఛలు తీర్చుకొనే విషయంలో కూడా ధర్మాన్ని విడువ రాదు. సమాజంలో ఉన్న మిగతా వ్యక్తులతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకునే విషయంలో కూడా వ్యక్తి ధర్మబద్ధంగానే ఉండవలెను. వ్యక్తి ధర్మానుసారంగా ప్రాపంచిక భోగాలను అనుభవిస్తూ పరమార్థమైన మోక్ష సాధనకు కృషి చేయవలెను. మోక్ష సాధనకు మిగతా మూడు పురుషార్థాలు సాధనాలు మాత్రమే. మోక్షమే అన్నింటికంటే ముఖ్యమైన పురుషార్థం. జీవితంలో ధర్మంగా ప్రవర్తించి చావు, పుట్టుకలకు అతీతంగా ఉండే పరమాత్మతో లీనం కావడానికి వ్యక్తి మోక్షాన్ని సాధించాలి. ఈ మోక్ష

సాధనకు తన జీవిత కాలాన్ని సద్వినియోగ పరుచుకుని ధర్మబద్ధంగా మెలగవలెనని ఈ పురుషార్థాలు చెబుతాయి. సంగ్రహంగా చెప్పవలెనంటే ఆత్మ విముక్తి పొందడమే మోక్షము. శరీరంలో ఆత్మ బంధించబడినంత కాలం జీవికి ప్రాపంచిక విషయాలపై ఆసక్తి ఉంటుంది. దానినే ఈషణత్రయము అంటారు. దారేషణ, పుత్రేషణ, ధనేషణ అన్నదే ఈషణత్రయము. పూర్వజన్మ కర్మానుసారంగా ఆత్మ శరీరానుబద్ధమై ఉంటుంది. మోక్షమంటే ఆత్మ శరీర బంధం నుంచి ముక్తి పొంది పరమాత్మతో లీనం కావడం.

పురుషార్థాలనేవి వ్యక్తిని ఉత్తేజ పరిచే మహోన్నత జీవిత లక్ష్యాలు. మానవాళికి, ప్రపంచంలో ఉన్న ఏ ఇతర ధార్మిక సిద్ధాంత రూపాలు కూడా జీవితాశయాలను ఇంత చక్కగా, అత్యున్నతంగా, ఉపయోగకరంగా రూపొందించలేకపోయినా. ఒక్క భారతీయ తత్వశాస్త్రాలు మాత్రమే వీటిని గురించి వివరించినాయి. ఈ నాలుగు పురుషార్థాలను చతుర్వర్గాలని అంటారు. మొదటి మూడింటిని త్రివర్గాలని, నాలుగవ దానిని మహావ్రతమని అంటారు. ఈ పురుషార్థాలు సాధించడానికి ముఖ్యముగా కావలసినది శీలము, సత్ప్రవర్తన, మనోవాక్కాయ కర్మణా, ఇతరులకు ద్రోహము చేయకపోవడమే ఉత్తమ శీలమని పురాణాలు, ఇతిహాసాలు ఘోషిస్తున్నాయి. శీలం వలన ధర్మము, ధర్మము వలన సత్యం, సత్యం వలన సర్వమూ లభ్యమవుతుంది. శీలానికి మరొక పేరు ఆచారము. ఆచారము సర్వధర్మములకు మూలము, ప్రాణము. వేదవేదాంగాలు చదివిన వాడైనా శీలం లేకపోతే అతడు విజ్ఞాని కాడు. అజ్ఞాని గానే ఉంటాడు. ఈ పురుషార్థాలలో ఉన్న క్రమం గమనించదగినది. మొదటి ధర్మము, రెండోది అర్థము, మూడవది కామము, నాలుగవది మోక్షము. మానవుడు తన అర్థాన్ని కామాన్ని ధర్మ మార్గంలో సంతరించుకొన్నట్లయితే అతనికి మోక్షము సులభము. అందుచేతనే మొదట ధర్మం చెప్పి తరువాత అర్థము, కామము చెప్పి చివరకు మోక్షము చెప్పినారు. ఈ క్రమాన్ని మార్చి చెప్పరాదు. వీటిలో చాలా ముఖ్యమైనవి మొదటిదైన ధర్మము, చివరిదైన మోక్షము.

**ధర్మము:**

ధర్మము అనే పదాన్ని అనేక సందర్భాలలో అనేక అర్థాలలో ప్రయోగించడం జరిగింది. మహాభారతంలో ఒక సందర్భంలో దేవత అనే అర్థం స్ఫురించేటట్లు వాడడం జరిగింది. మనుస్మృతిలో భగవాన్ ధర్మం అని ఉన్నది. ఋగ్వేదంలో మతపరమైన సంస్కారాలకే అర్థంలోను, ఐతరేయ బ్రాహ్మణంలో మత పరమైన మొత్తం బాధ్యతలు అనే అర్థంలోను, ఛాందోగ్యోపనిషత్తులో నాలుగు ఆశ్రమ బాధ్యతలన్న అర్థంలోను ధర్మం అన్న పదాన్ని వాడినారు. ఈ పదానికి అర్థచ్ఛాయలు అనేకం ఉన్నప్పటికీ రాను రాను ఈ పదానికి ఒక నిర్దిష్టమైన అర్థం ఏర్పడింది. సంఘంలో ఉన్న వ్యక్తి సాంఘీకంగా తన మక్కులను, బాధ్యతలను గుర్తెరిగి సమాజంలో ప్రవర్తించే పద్ధతికే ధర్మము అన్న అర్థము ఏర్పడినది. భగవద్గీతలోను, మనుస్మృతిలోను, యజ్ఞవల్క్య స్మృతిలోను, తైత్తిరియోపనిషత్తులోను ఈ అర్థంలోనే ధర్మమనే పదాన్ని వాడినారు. వేదాలు సూచించిన, ఆశించిన ఫలితంగానీ, ఆశయం గానీ, ధర్మమని జైమిని అభిప్రాయము. రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాత బుద్ధితో, నీతి నిజాయితీలతో మానవులు మనసా వాచా కర్మణా జీవించే పవిత్ర జీవితమే ధర్మమని మనుస్మృతి చెబుతున్నది. అర్థశాస్త్రాలను, కామశాస్త్రాలను వ్రాసినట్లుగానే దర్మశాస్త్రాలను కూడా వ్రాసినారు. వ్యక్తి వివిధ దశలలో ఎట్లు ప్రవర్తించవలెనో, ఎట్లు ధర్మపథంలో జీవితంలో గడుపవలెనో ఈ ధర్మశాస్త్రాలు వివరిస్తాయి.

అంతిమ ఆశయానికి, ఆ ఆశయ సాధనకు ఉపయోగించే మార్గాలకూ తాత్వికంగా తేడా ఉన్నది. జీవితాశయ సాధనకు ముక్తి లేదా మోక్షము లేదా కైవల్యము అని చెప్పవచ్చు. ఆశయ సాధనకు భక్తి, జ్ఞాన, కర్మలు మార్గాలు అని చెప్పవచ్చు. ఈ మార్గాలకు పరస్పరం సంబంధం ఉండడమే కాక వాటికి అవినాభావ సంబంధము కూడా ఉన్నది. ఈ సాధన మార్గాలను ధర్మానుసారంగా ఉపయోగించవలెను, క్లుప్తంగా ఇది ధర్మ సంచయము. జీవిత పరమార్థమైన మోక్షమును సాధించడానికి ధర్మము సాధన మార్గము ధరించునది కాబట్టి ధర్మమనీ, విశ్వమంతా దీనిచేత ధరింపబడుతున్నది కాబట్టి ధర్మమనీ, పండితులు ఈ ధర్మ శబ్దానికి వ్యుత్పత్తి చెబుతారు. లోకంలో ప్రతి వస్తువుకు ఏదో ఒక ముఖ్యమైన నైసర్గిక ధర్మమున్నది. అది ఆ ధర్మాన్ని విడిచి పెడితే నశిస్తుంది. ఉదా: అగ్నికి వేడిమి, సూదంటు రాయికి ఆకర్షణ శక్తి, మనుష్యునికి మానవత్వము, పశువుకు పశుత్వము మొదలైనవి ధర్మములు.

ఋతము, సత్యము, ధర్మము అనే పదాల మధ్య ఉన్న తేడాను గమనించవలెను. మానసికంగా, ఆలోచనా పరంగా సత్యాన్ని గుర్తించడాన్ని ఋతము అంటారు. మనస్సు గుర్తించిన నిజాన్ని మాటలో వెలిబుచ్చడాన్ని సత్యము అంటారు. గుర్తించిన సత్యాన్ని ఆచరిస్తూ జీవితం గడపడాన్ని ధర్మం అంటారు. జీవితాన్ని ధర్మపథంలో గడిపిన వ్యక్తిని ధర్మిష్టుడంటారు.

మితాక్షరిలో ఆరు విధాలైన ధర్మాలను గురించి వివరించినారు. వీటిని 1) సాధారణ ధర్మము. 2) విశేష ధర్మము అని విభజించవచ్చు.

సాధారణ ధర్మాలను ఈ విధంగా చెప్పవచ్చు.

1. అహింస, 2. సత్యము, 3. అస్తేయము, 4. శౌచము, 5.ఇంద్రియ నిగ్రహము.

విశేష ధర్మాలను ఈ విధంగా చెప్పవచ్చు.

1. వర్ణ ధర్మము, 2. ఆశ్రమ దర్మము, 3. వర్ణాశ్రమ ధర్మము, 4. గుణ ధర్మము, 5. నిమిత్త ధర్మము.

యజ్ఞవల్క్యుని ప్రకారము తొమ్మిది రకాలైన ధర్మగుణాలున్నాయి. అవి: 1. అహింస, 2. నిర్మలత్వము, 3. నీతి, 4. పరిశుభ్రత, 5. ఇంద్రియ నిగ్రహము, 6. దానము, 7. ఆత్మ నిగ్రహము, 8. ప్రేమ, 9.సహనము. వీటిలో మొదటి ఆరు ధర్మగుణాలు ఇతరులకు మేలు చేస్తాయి. మిగతావి వ్యక్తి సత్ప్రవర్తనను పెంపొందిస్తాయి.

అర్థకామాల విలువలను సాధించుటలో ధర్మము మార్గదర్శిగా, నియంత్రణా సాధానంగా ఉంటుంది. పరమార్థమైన మోక్ష సాదనకు ధర్మము సాధనంగా ఉంటుంది. వ్యక్తి ధర్మబద్ధంగా జీవించినట్లయితే అతనికి మేలు, మంచి కలగడమేకాక, ఇతరులకు కూడా మేలు, మంచి జరుగుతుంది. దాని ఫలితంగా అభ్యుదయం కలుగుతుంది. ప్రభాకరుడు మొదలైన వారి వాదన ప్రకారం ధర్మం ధర్మం కోసమే. ఒక అంతిమ లక్ష్య సాధనకు ధర్మాన్ని సాదనంగా వీరు పరిగణించరు. ఈ వాదనను అనేక మంది భారతీయ తత్వవేత్తలు ఖండించినారు. దాని ఫలితంగా ఈ వాదన నిలువలేదు.

ప్రతి వ్యక్తి వర్ణాశ్రమ బాధ్యతలనే కాక ప్రజోపయోగమైన కార్యాలను కూడా నిర్వర్తించవలెనని ధర్మము ఉపదేశిస్తున్నది. ప్రతి వ్యక్తి ప్రత్యేక బాధ్యతలను నిర్వర్తించడమే కాక, ఇతర సాధారణ బాధ్యతలను కూడా నిర్వర్తించవలెను. ప్రజోపయోగము అతిథి సత్కారము, భూతదయ, ధర్మశీలా నిర్వహణము, పరుల ఆస్తిపాస్తులను ఆశించకపోవడం అన్నవి మొత్తం సమాజానికి మేలైన కార్యాలు. పైన వివరించిన ధర్మ గుణాలతో, సత్కార్యాలతో వ్యక్తి సమాజాభివృద్ధికి తోడ్పడి, మానవ జాతి మనుగడకు, ప్రపంచాభ్యున్నతికి సహాయభూతుడౌతాడు. కామము, క్రోధము, మదము, మాత్సర్యము మొదలైన వాటిని త్యజించి, క్షమ సహనము మొదలైన లక్షణాలతో ధర్మపథంలో ప్రవర్తించమని ధర్మము వ్యక్తిని నిర్దేశిస్తుంది. అంతేకాక జనోపయోగ కార్యాలను చేయవలసిందని కూడా ఉపదేశిస్తుంది.

హిందు ధర్మశాస్త్రాలు వ్యక్తిని మాత్రమే దృష్టిలో ఉంచుకున్నాయనీ, అంతర్జాతీయ దృక్పథం వాటిలో లోపించినదనీ కొందరు విమర్శిస్తారు. హిందూ సమాజంలో ధర్మాన్ని అనుసరించే వ్యక్తి ప్రత్యేక బాధ్యతలనే కాక సర్వసమాజ బాధ్యతలను వహించవలెనన్న దానిని బట్టి చూస్తే, పై విమర్శ ఎంతో పేలవమైనదని తోస్తుంది. కర్ణుని దాన స్వభావము, ధర్మరాజు సత్య ప్రవర్తన, శిబి చక్రవర్తి దయాగుణము, రాముని పితృవాక్య పరిపాలన, లక్ష్మణుని భ్రాతృభక్తి భారతీయులకే కాక, ప్రపంచానికంతటికీ ఆదర్శప్రాయమైన, ఆచరణ యోగ్యమైన సుగుణ పుంజాలని తెలియపోదు. భారతీయ సంస్కృతిలోఉన్న ఆశయాలు అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అన్ని జాతులకు వర్తిస్తాయి. చెడు నుంచి దూరంగా ఉండడం, మంచిని సాధన చేయడం, మనస్సును స్వాధీనంలో ఉంచుకొని క్రమశిక్షణలో ఉండడం, ఆత్మనిగ్రహము, పరిత్యాగబుద్ధి, పవిత్ర మేథస్సు, దుష్కార్యాలకు దూరంగా ఉండడం, సర్వభూతదయ, సర్వోపయోగ సత్కార్యాచరణము మొదలైనవి అలవరుకోవలెనని హిందూ ధర్మము ప్రబోధిస్తుంది.

హిందూ ధర్మము వ్యక్తికి అత్యుత్తమమైన విశిష్టమైన విలువలను, ఆశయాలను బోధిస్తుంది. వ్యక్తిలో ఉన్న చెడును నిర్భయంగా ఎదుర్కోవాలని, తనను తాను నిగ్రహించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవలెనని, ఇతరుల పట్ల దయాస్వరూపుడై ఉండవలెనని, అర్థ కామ విషయాలలో ధర్మానుసారంగా ఉండవలెనని హిందూ ధర్మ ప్రబోధిస్తుంది. హిందూ సంస్కృతిలో

ధర్మము అనే పదము చాలా ముఖ్యమైనది. మూలాధారమయినది. మహాభారత కావ్యంలో నాయకుని పేరు దర్మరాజు. అట్లాగే, రామాయణ మహాకావ్యంలోని నాయకుడు శ్రీరామచంద్రుడు ధర్మానికి ప్రతీక.

వ్యక్తి, సామాజిక వ్యవస్థల సక్రమ పురోభివృద్ధి కోసమే ధర్మము ఏర్పడింది. ఈ ధర్మ పదానికి అర్థం సమాజానికి సమాజానికి, యుగానికి యుగానికి మారుతూ ఉంటుంది.

హిందూ మతాన్ని సనాతన ధర్మమని కూడా పిలుస్తారు. మామూలుగా ధర్మమంటే వర్ణాశ్రమ దర్మమనే అర్థంలో వాడుతుంటారు. సమాజంలో ప్రజలను వృత్తిరీత్యా కొన్ని వర్ణాలుగా విభజించిరి. ఆయా వర్ణాలలో వ్యక్తులకు కొన్ని ఆశయాలు, బాధ్యతలు వర్ణాశ్రమ వ్యవస్థలో నిర్ణయించడం జరిగింది. వివిధ వర్ణాలకు చెందిన వ్యక్తులు ఆయా వర్ణాలకు నిర్దేశించిన బాధ్యతలను నిర్వహిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించినారు. భగవద్గీతలో ప్రతి వర్ణానికి కొన్ని బాధ్యతలున్నాయని, ఆయా వర్ణాల వ్యక్తులు స్వధర్మాన్ని సమాజాభివృద్ధి కోసం, సమాజంలో ఐకమత్యం కోసం నిర్వహించవలెనని ఉపదేశించినారు.

ధర్మం వలన సుఖసంతోషాలు, లాభము కలుగుతాయి. వ్యక్తి ధర్మం నుంచే ప్రతీదీ పొందుతాడు. ధర్మమనేది ముఖ్యమైనదనీ, ప్రపంచానికి బలాన్నిచ్చేదనీ రామాయణంలో వివరంపబడింది. పూర్వం ఆర్యుల మద్య పరస్పర సంబంధ బాంధవ్యాలుండేవి. ప్రతి వ్యక్తి ఒక గోత్రానికి చెంది ఉండేవాడు. గోత్ర సభ్యుల మధ్య రక్త సంబంధము, సమానత్వము ఉండేది. కాలక్రమంగా సంఘంలో జనాభా, ఉత్పత్తి శ్రమ విభజన, వ్యక్తిగత ఆస్థి, తరతమ భేదాలు పెరిగి పూర్వపు ఐక్యతా భావము, సత్సంబంధాలు, ఆత్మీయతలు లోపించినాయి. ఈ నూతన పరిస్థితులలో వ్యక్తి ఏదో పోగొట్టుకొన్నట్లు భావిస్తూ ఉండేవాడు.

వేదాంతులు ఉపనిషత్తులలో ఈ సమస్యను దూరదృష్టితో గమనించి జీవిత పరమార్ధమంటే ఏమిటో బోధించినారు. జీవితంలో ప్రతి నిత్యం ఎదుర్కొనే సంఘర్షణలలో వ్యక్తి ఎట్లా మెలగవలెనో చెప్పినారు. ఈ బోధనల వలన వ్యక్తికి, సామాజిక వ్యవస్థకు కూడా మేలు జరిగింది, అర్థ, కామ విషయాలలో ధర్మానుసారంగా వ్యక్తులు ప్రవర్తించి, జీవిత పరమార్ధమైన మోక్షం కోసం కృషి చేస్తే సంఘ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని వారు భావించినారు.

హిందూ మతము, దాని తాలూకా సిద్ధాంతాలు అనేక ప్రభావాలకు లోనయి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. హిందూ మతము ఒక సమాఖ్య వంటిది. అందులో వివిధరకాలైన దర్శనాలుంటాయి. కానీ, ఆ దర్శనాలు, సిద్ధాంతాలు ఒకే సత్యాన్ని, అంతిమ ఆశయాన్ని బోధిస్తాయి. హిందూ మతాన్ని ఒక కమలంతో పోలిస్తే, అందులో వివిధ శాఖలను కమలంలో ఉన్న ఆయా రేకులుగా ఊహించుకోవచ్చు. ఈ భిన్నత్వంలో ఏకత్వమే హిందూ మతానికి ఉన్న విశిష్ట లక్షణము. హిందూ మతాభివృద్ధి రెండు ప్రవాహాల కలయిక వంటిదని మనం గమనించవచ్చు. అవి:

1. వైదికము లేదా నిగమము

2. తాంత్రికము లేదా పౌరాణికము

ఈ ధోరణలు రెండు పరస్పరం కలిసిపోయినాయి. ఆర్యుల, అనార్యుల సిద్ధాంతాలు ఒకదాని వల్ల మరొకటి ప్రభావితం కావడమే కాక, ఒకటిగా కలిసిపోయినాయి.

ఆధునిక యుగంలో ఎంతవరకు ధర్మాన్ని ఆచరించడానికి మానవునికి వీలవుతుందో చెప్పలేము. సనాతన ధర్మాచరణ ఈనాడు ఆచరణ సాధ్యం కాదు. సమాజం అన్ని విధాలా మార్పుకు లోనవుతున్నప్పుడు, వ్యక్తుల జీవితాలు వర్ణవ్యవస్థననుసరించి లేనప్పుడు, వ్యక్తి పాత్ర సమాజంలో జన్మననుసరించి నిర్ణయం కానప్పుడు, సనాతన ధర్మము సమాజంలో పటిష్టంగా పనిచేయదు. అంతమాత్రం చేత ధర్మమనే దానికి ఆధునిక సమాజాలలో స్థానం లేదని కాదు. దర్మాన్ని పరిమితమైన అర్థంలో వాడకూడదు. పరిపూర్ణమైన అర్థంలోనే ధర్మాన్ని గ్రహించవలెను. ఆధునిక సమాజాలు వివిధ రకాల సంక్షోభాలతో, అవ్యవస్థా స్థితిగతులతో సతమతమవుచున్నవి. ఇటువంటి స్థితిలో వ్యక్తికి, సమాజానికి, మానవ జాతికి కూడా ధర్మము మేలు చేస్తుంది. వ్యక్తులందరూ వారి వారి కార్యకలాపాలు ధర్మబద్ధంగా కొనసాగించినప్పుడు సమాజంలో అవ్యవస్థ ఏర్పడదు. పైగా, సమసమాజం ఏర్పడుతుంది. సమాజం పురోభివృద్ధి చెందడానికి, సమాజంలో నియంత్రణా పద్ధతులు అమలు పరచడానికి ధర్మము ఎంతగానో ఉపయోగపడుతుంది.

## అర్థము (ద్వితీయ పురుషార్థము):

ధర్మ శాస్త్రాలలో రాజధర్మాన్ని గురించి కూడా చెప్పడం జరిగింది. రాను రాను రాజనీతి శాస్త్రము, ప్రభుత్వ పాలనా శాస్త్రము, అర్థ శాస్త్రము మొదలయినవి ప్రత్యేక శాస్త్రాలుగా రూపొందినాయి. అర్థ శాస్త్రము రాజనీతిని వివరించడమే కాక, ఆచరణలో రాజకీయాలు ఎలా ఉండాలో కూడా చెబుతుంది. ఆశయాలు, ఆశయ సాధనోపకరణాలు ధర్మబద్ధంగా ఉండవలెనని ధర్మశాస్త్రం చెబుతుంది. అర్థశాస్త్రము ఆశయ సాధనను మాత్రమే వివరిస్తుంది. కనుక అర్థశాస్త్రము కన్న ధర్మశాస్త్రమే మిన్న.

పురుషార్థాలలో రెండవది అర్థము. అర్థం అంటే సంపద, ఐశ్వర్యము. వీటి వలన వ్యక్తికి సుఖము, భద్రత లభిస్తాయి. సంపద లేకుండా వ్యక్తి ప్రపంచంలో ఏదీ సాధించలేడు. గృహస్థు అర్థకామాలను ధర్మబద్ధంగా కోరుకోవాలి. గృహస్థు తనపై ఆధారపడిన వారిని పోషించడానికి, వారి అవసరాలు తీర్చడానికి సంపద కావాలి. ఇది ఒక విలువగా, పురుషార్థంగా సంస్కృతి గ్రహించింది. కౌటిల్యుని అర్థశాస్త్రం ఈ విలువను మహోన్నత స్థితికి తీసుకువెళ్లి వివరించింది. కౌటిల్యుని ప్రకారం సుఖానికి మూలం ధర్మం, ధర్మానికి మూలం అర్థం, అర్థానికి మూలం రాజ్యం. ప్రతి విషయంలోను ధర్మంతో కూడిన అర్థం ఆవశ్యకం. దీని ద్వారా గృహస్థు ఇతర ఆశ్రమాల వారికి సేవ చేయగలుగుతాడు.

అత్యాశకు పోయి అక్రమ మార్గాల ద్వారా ధనము, అధికారము, భోగభాగ్యాలు సంపాదించక, ధర్మాన్ని అనుసరించి అవసరమైనంత వరకే అర్థాన్ని పొందడానికి మానవులు ప్రయత్నం చేయవలెనని అర్థశాస్త్రం నిర్దేశించింది. అర్థమే సర్వస్వమని భావించరాదనీ, ఏ స్థితిలోనూ ధర్మాన్ని త్యజించరాదనీ, ఈ ద్వితీయ పురుషార్థము మానవులకు బోధిస్తుంది. ప్రతి మానవుడు తమ తమ సంపాదనా ప్రయత్నాలలో అర్థం విలువ గ్రహిస్తే ఆధునిక సమాజాలలో ఉన్న అనేక అవ్యవస్థిత స్థితిగతులు మటుమాయమవుతాయి. ఆర్థిక, రాజకీయ రంగాలలో ఉన్న పోటీలు, సామరస్యం లేని ధోరణులు తగ్గి, మానవత్వపు విలువలు పెరుగుతాయి.

### కామము (తృతీయ పురుషార్థము):

కామము అంటే కోరిక. ఇంద్రియ వాంఛలను తృప్తి పరచుకోవడం కామం. అయితే మానవుని జీవితంలో కామము, ప్రేమ, సుఖసంతోషాలనేవి ఎట్లాంటి స్థానాన్ని ఆక్రమించాలి? అనే సమస్యను అనేక శాస్త్రాలలో చర్చించినారు. ఆశ్రమాలలో రెండవ ఆశ్రమమైన గృహస్థాశ్రమానికి హిందూ శాస్త్రాలలో ప్రాధాన్యత ఉంది. గృహస్థాశ్రమం ద్వారా వ్యక్తి తమ కామవాంఛలను తీర్చుకోవడానికి అవకాశముంది. సమాజంలో ధర్మానికి కట్టుబడి అవ్యవస్థను పెంపొందనీయకుండా వ్యక్తి తన కోరికలను తీర్చుకోవలసినదిగా శాస్త్రాలు పరిమితులు విధించినాయి. ఎంతో మంది మహాకవులు తమ తమ కావ్యాలలో ప్రేమను గురించి వర్ణించినారు. ధర్మాన్ని గురించి, అర్థాన్ని గురించి అనేక శాస్త్రాలున్నట్లే కామాన్ని గురించి కూడా అనేక శాస్త్రాలు వ్రాసినారు. ఈ శాస్త్రాలలో నాట్యము, సంగీతము, నాటకాఊ మొదలైన అంశాలను గూర్చి చర్చించినారు. శారీరక వాంఛలు తీర్చుకునే విషయంలో ధర్మాన్ని విడువరాదనీ, ధర్మానుసారంగా ప్రాపంచిక భోగాలననుభవిస్తూ మోక్షసాధనకు కృషి చేయాలని కామశాస్త్రాలు వివరించినాయి.

### మోక్షము (చతుర్థ పురుషార్థము):

పురుషార్థాలలో మోక్షము నాలుగవ పురుషార్థము. మోక్షమంటే ముక్తి అంటే విడిపోవడమని అర్థము. భవబంధం నుంచి లేదా జనన మరణ చక్రం నుంచి విడిపోవడం వల్ల సర్వక్లేశాలు శాశ్వతంగా నివృత్తాలవుతాయి. కర్మలకు మూల హేతువు అజ్ఞానము, అవిద్య. ఈ అజ్ఞానము నశించిన తరువాత అంటే జ్ఞానోదయం ప్రాప్తించిన తరువాత కర్మ వల్ల ఏర్పడే బంధనాలు, జనన మరణాదిక రూపమైన దు:ఖము సమూలంగా నివృత్తి చెందుతాయి. అందువలననే దార్శనికులు జ్ఞానాన్ని మోక్షానికి చరమ సాధనంగా పరిగణించినారు.

సాంఖ్యమతంలో పురుషులు ప్రకృతి పాశాల నుంచి శాశ్వతంగా ముక్తుడై తన యథా స్వరూపాన్ని పొందే స్థితిని కైవల్యమంటారు. ఆత్మకు జగత్తుతో సంబంధము నశించిపోవడమే మోక్షము. శరీరము, ఇంద్రియములు, విషయములు ఈ త్రివిధములైన బంధములకు చిట్టచివరి నాశనం కలగడం వలన ఆత్మకు ముక్తి సిద్ధిస్తుంది. మోక్షము బ్రహ్మానందము. అది సుఖానికి పరాకాష్ట.

మోక్షము రెండు విధములు. అవి: దేహముక్తి, జీవన్ముక్తి. వీటినే సాధ్యముక్తి, క్రమముక్తి అని కూడా అంటారు. న్యాయ, సాంఖ్య వాదాల ప్రకారం ముక్తి అంటే బాధ, తపనల నుండి విముక్తి మాత్రమే. వేదాంత వాదం ప్రకారం చావు పుట్టుకల నుంచి ఆత్మముక్తి పొందడాన్ని మోక్షం అంటారు.

సమ్యక్ జ్ఞానము, సమ్యగ్దర్శనము, సమ్యక్ చరిత్ర ఈ త్రిరత్నాలు ముక్తిని పొందడానికి ఆవశ్యకాలని జైనులు భావిస్తారు. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించినారు. కర్మము, జ్ఞానము, భక్తి అనే మూడు మార్గాల ద్వారా ముక్తి సిద్ధిస్తుంది. అనాసక్తి భావంతో కర్మ చేస్తూ సంసారంలో ఉన్నప్పటికీ, జలమధ్య గతమైన కమలం మాస్తరుగా నిర్లిప్తంగా ఉండగలిగిన జ్ఞానులను జీవన్ముక్తులంటారు. ఈ జీవితంలో సర్వప్రారబ్ద కర్మల ఫలాన్ని అనుభవించడం ముగిసి శరీరం పతనమైన తరువాత జీవుడు పురుషోత్తమునిలో లీనం అవుతాడు. అదే దేహముక్తి.

## 3.5 ఆశ్రమ ధర్మములు:

ప్రతి హిందువు తన జీవన ప్రయాణంలో నాలుగు దశల గుండా ప్రయాణం చేయవలెనని, ఈ దశలనే ఆశ్రమాలు అని అంటారని హిందూ ధర్మ శాస్త్రాలలో వివరింపబడినది. ఆశ్రమము అనే పదము సంస్కృతములో 'శ్రమ' అన్న పదం నుంచి వచ్చింది. మోక్ష సాధన అనే మహత్తర ప్రయాణంలో ఒకచోట ఆగి మిగతా ప్రయాణానికి సిద్ధం కావడానికి తీసుకునే విశ్రాంతిని ఆశ్రమము అంటారు. ఆశ్రమాలు నాలుగు. అవి:

1. బ్రహ్మచర్య ఆశ్రమము : విద్యార్థి జీవితము
2. గృహస్థ ఆశ్రమము : వివాహితుని జీవితము
3. వానప్రస్థ ఆశ్రమము : ఏకాంతవాస జీవితము (వనవాస జీవితము)
4. సన్యాస ఆశ్రమము : సన్యాసి జీవితము

మొదట హిందూ సమాజంలో మొదటి మూడు ఆశ్రమాలు మాత్రమే ఉండేవనీ, వానప్రస్థ సన్యాసాశ్రమాలను కలిపి ఒకే ఆశ్రమంగా భావించేవారని 'ప్రభు' అభిప్రాయం. ఛాందోగ్యోపనిషత్తులో మూడు దశలను మాత్రమే చెప్పినారు. అవి: 1. విద్యార్థి దశ, 2. గృహస్థ దశ, 3. ప్రశాంత దశ.

మోక్ష సాధనకు వ్యక్తి తన జీవిత కాలంలో నాలుగు దశల గుండా ప్రయాణం చేయవలెనని, ఒక దశ పూర్తికాగానే మరొక దశలోకి ప్రవేశించవలెనని హిందూ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అంటే సన్యాసాశ్రమాన్ని చేపట్టకముందే వ్యక్తి అంతకు పూర్వమున్న మూడు ఆశ్రమాల బాధ్యతలను నిర్వర్తించవలెను. అంతేకాక సమాజ పరంగా ఉన్న మూడు విధాలైన ఋణాలను వ్యక్తి తీర్చవలెను. అవి: 1. ఋషి ఋణము, 2. పితృ ఋణము, 3. దేవ ఋణము.

బ్రహ్మచర్యాశ్రమంలో వేదవేదాంగాలు చదివి, గృహస్థాశ్రమంలో ధర్మబద్ధంగా జీవనం గడిపి, సంతానాన్ని పొంది, వానప్రస్థంలో వివిధ దానాలు, త్యాగాలు చేసి, సన్యాసాశ్రమాన్ని స్వీకరించాలి. మొదటి మూడు ఆశ్రమాలలో తనకున్న అన్ని బాధ్యతలను సంపూర్తిగా నిర్వర్తించిన తరువాతనే వ్యక్తి మోక్షసాధనపై మనస్సును కేంద్రీకరించవలెను. ఏ వయస్సులో వివిధ ఆశ్రమాలు చేపట్టవలెనన్న విషయంపై భిన్నాభిప్రాయలు ఉన్నవి. అయితే వయస్సు వర్ణానుసారంగా మారుతుంది. సామాన్యంగా విద్యాభ్యాసం పూర్తయిన తరువాత బ్రహ్మచర్యాశ్రమము పూర్తిచేసుకొని వ్యక్తి గృహస్థాశ్రమం చేపట్టాలి. వృద్ధాప్యం వచ్చినప్పుడు వ్యక్తి గృహస్థాశ్రమం వదిలి వానప్రస్థాశ్రమం చేపట్టవలెను. ఈ మూడవ దశలో ఆదర్శ జీవితం గడిపిన తరువాత వ్యక్తి సన్యాసాశ్రమం చేపట్టి ప్రాపంచిక విషయాలకు, సుఖాలకు, భోగాలకు అతీతంగా ఉండి, మోక్ష సాధన ప్రధాన ఆశయంగా పెట్టుకుని నాలుగవ ఆశ్రమ జీవితాన్ని గడుపవలెను.

వాత్స్యాయనుడు వ్యక్తి యొక్క వంద సంవత్సరాల జీవిత కాలాన్ని బాల్యము, యౌవనము, వార్ధక్యము అనే దశలుగా విభజించినాడు. బాల్యావస్థలో విజ్ఞానాన్ని, చదువు సంధ్యలు నేర్వడానికి, యౌవన దశలో ప్రాపంచిక సుఖాలు అనుభవించడానికి, వార్ధక్యంలో మోక్షం సంపాదించడానికి వ్యక్తి కృషి చేయవలెనని వాత్స్యాయనుడు చెప్పినాడు.

**బ్రహ్మచర్య ఆశ్రమము:**

ఈ ఆశ్రమంలో విద్యార్థికి అతని ధర్మాన్ని బోధించడం జరుగుతుంది. విద్యార్థికి చదువుతోబాటు రాబోయే ఆశ్రమాలలో ఏ విధంగా ధర్మానుసారంగా మెలగవలెనో బోధిస్తారు. అర్థ, కామాలనే పురుషార్థాలను విద్యార్థి బ్రహ్మచర్యాశ్రమంలో అదుపులో ఉంచుకొనవలెను. ఈ ఆశ్రమంలో ఆచరించవలసిన విధులను వ్రతాలు అంటారు.

బ్రహ్మచర్య ఆశ్రమంలో విద్యార్థి దశ ఉపనయనంతో మొదలు అవుతుంది. బ్రాహ్మణులు 8వ ఏట, క్షత్రియులు 10వ ఏట, వైశ్యులు 12వ ఏట ఉపనయనానికి అర్హులు. శూద్రులకు ఉపనయనార్హత లేదు. ఉపనయనము తరువాతనే ఒక వ్యక్తి ద్విజుడు అవుతాడు. ఉపనయన ఉత్సవానికి ఎంతో సామాజిక ప్రాముఖ్యత ఉన్నది. తన ధర్మాలను, నిర్వర్తించవలసిన బాధ్యతలను, చేయవలసిన పనులను ఈ ఉత్సవం ద్వారా బ్రహ్మచారికి గుర్తుచేస్తారు. ఉపనయనానంతరము విద్యార్థి తగిన గురువును ఆశ్రయించి విద్య నేర్పవలసినదిగా ప్రాధేయపడతాడు.

అధ్యయన కాలంలో విద్యార్థి కొన్ని విధులను పాటించవలెను. గురుకులంలోనే ఉండి వేదాధ్యయనము చేయవలెను, సూర్యోదయం కాక మునుపే నిద్రలేచి, గురు శుశ్రూష చేసి, రాత్రిపూట భూశయనం చేయాలి. శుశ్రూషలతో గురువును మెప్పించిన తరువాతనే వేదాధ్యయనం ప్రారంభమవుతుంది. సత్యము పలుకుతూ కామ, క్రోధ, లోభాలకు అతీతంగా ఉండాలి. ఇతరులకు హాని కలుగకుండా ప్రవర్తించవలెను. విద్యార్థి కేవలం విద్యా సముపార్జనే కాక, సత్ప్రవర్తన నేర్చుకుంటూ శీలాన్ని పెంపొందించుకోవడంతోపాటు తెలివితేటలను, ఆలోచనలను ఈ దశలో వృద్ధి చేసుకుంటారు. ఈ దశలో విద్యార్థి ఆత్మనిగ్రహము, ఆత్మ సంయమనము పాటించవలెను. విద్యా సముపార్జనానంతరము యధాశక్తి గురు దక్షిణ సమర్పించి, గృహస్థాశ్రమము స్వీకరించడానికి గురువుల అనుమతి పొందవలెను. విద్యాభ్యాసము పూర్తి చేసిన వ్యక్తిని సమవ్రతుడు అంటారు.

గురువు శిష్యునికి ఆధ్యాత్మిక తండ్రి లాంటి వారు. గురువు శిష్యుని తన కన్న కొడుకువలె భావిస్తారు. దీనికి శిష్యుడు గురువుకు సేవ చేసి ఋణం తీర్చుకుంటాడు. గురువు, శిష్యుని వద్ద నుండి ఏమాత్రం దక్షిణ తీసుకొనే వారు కారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత శిష్యుడు తన స్వంత వక్తి సామర్థ్యాలతో గురువు గారికి స్వయంగా గురుదక్షిణ సమర్పిస్తాడు. బ్రహ్మచర్య ఆశ్రమము గురువు గారి అనుగ్రహ ఆశీర్వాదములతో సక్రమంగా పూర్తి చేసి వ్యక్తి గృహస్థ ఆశ్రమంలోనికి ప్రవేశిస్తాడు.

**గృహస్థ ఆశ్రమము:**

రెండవ ఆశ్రమమైన గృహస్థ ఆశ్రమము అనగా వివాహ జీవితము. గృహస్థ ఆశ్రమము వివాహంతో మొదలవుతుంది. వ్యక్తి వివాహంతో కుటుంబం ఏర్పాటు చేసుకుంటాడు. హిందువులకు వివాహము శరీర సంస్కారాలలో ఒకటి. వివాహంలో భాగస్వాములైన భార్యాభర్తల సంబంధాలు పవిత్రమయినవి. వ్యక్తులిద్దరు కలిసి ధర్మబద్ధంగా జీవించడానికి వివాహం అవసరమని హిందువులు భావిస్తారు. హిందువులలో వివిధ రకాలయిన వివాహాలు ఉన్నాయి. అవి:

1. బ్రహ్మవివాహము : విద్య, సదాచారము ఉన్న యువకుని కన్యాదాత స్వయంగా పిలిచి వస్త్రాలంకారాదులతో కన్యనిచ్చి చేసే వివాహము.
2. దైవ వివాహము : యజ్ఞం చేయించిన ఋత్విజునికి కన్యనిచ్చి వివాహం చేయుట.
3. ఆర్ష వివాహము : కన్యాదాత ధర్మార్థం వరుని దగ్గర గోమిథునాన్ని తీసుకుని కన్యనిచ్చి శాస్త్రీయంగా చేసే వివాహము.
4. ప్రజాపర్య వివాహము : ఉభయులూ ధర్మబద్ధంగా జీవించమని కన్యాదాత వరునితో చెప్పి కన్యనిచ్చి చేసే వివాహము.
5. అసుర వివాహము : కన్యాదాతకు ధనమిచ్చి కన్యను వివాహం చేసుకొను పద్ధతి.
6. గాంధర్వ వివాహము : వధూవరులిద్దరూ ఇష్టపడి, తల్లిదండ్రుల ప్రమేయం లేకుండానే చేసుకొనే వివాహము.
7. రాక్షస వివాహము : కన్యను బలాత్కారంగా తీసుకుని పోయి చేసుకునే వివాహము.

8. పైశాచిక వివాహము : నిద్రావస్థలో గానీ, అపస్మారకంలో గానీ ఉన్న కన్యను బలాత్కారం చేసి వివాహం చేసుకునే పద్ధతి.

వివాహ మహోత్సవ సందర్భముగా చేసే విధులు, సంస్కారాలు. 1. కన్యాదానము, 2. వివాహ హెూమము, 3. పాణిగ్రహణము, 4. లాజహెూమము, 5. అగ్ని ప్రదక్షిణము, 6. ఆశ్మారోహణము, 7. సప్తపది, 8. అరుంధతీ దర్శనము.

ఇందులో పాణిగ్రహణము, సప్తపది సంస్కారాలను ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.

బ్రహ్మచర్యాశ్రమం పూర్తిచేసిన స్నాతకుని జీవితంలో వివాహమయిన తరువాత నూతన దశ ప్రారంభమవుతుంది. గహస్థాశ్రమంలో వ్యక్తి అనేక విధులను పాటించవలెను. గృహస్థు నిత్యకృత్యాలతో పాటు అయిదు మహాయజ్ఞాలు చేయవలెను. అవి: 1. బ్రహ్మయజ్ఞము, 2. పితృయజ్ఞము, 3. దేవయజ్ఞము, 4. భూతయజ్ఞము, 5. మనుష్య యజ్ఞము. వీటినే పంచ యజ్ఞాలందురు. ఈ యజ్ఞాలను నిర్వర్తించే సందర్భముగా కొన్ని విధులను నిర్వర్తించాలి. అంటే బ్రహ్మయజ్ఞము చేసేటప్పుడు అధ్యయన అధ్యాపనలు చేయాలి. అంటే వేద పఠనము చేయాలి. పితృయజ్ఞంలో పితృదేవతలకు తర్పణాలు విడువవలెను. దేవ యజ్ఞంలో నిత్యమూ హెూమము చేయవలెను. భూతయజ్ఞమములో పంచభూతాలకు బలులు ఈయవలెను. మనుష్య యజ్ఞంలో అతిథి పూజా సౌకర్యాలు కల్పిస్తూ ఉండవలెను. గృహస్థాశ్రమంలో వ్యక్తి అర్థకామాలను ధర్మానుబద్ధంగా అనుభవించవలెను. ఆశ్రమాలన్నింటిలోనూ గృహస్థాశ్రమము సర్వోత్కృష్టమైనది. గృహస్థుడు అసిధారా వ్రతంతో అర్థకామాలు రెంటినీ దర్మార్జనకే వినియోగించవలెను. గృహస్థుగా ఉన్నప్పటికీ కూడా తామరాకు మీది నీటి బొట్టు వలె అంటీ అంటకుండా విరక్తుడై, జ్ఞాన పరిపక్వతను పొంది చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి అతడు ప్రయత్నించవలెను. ఆపన్నులకు, వికలాంగులకు, అభాగ్యులకు ఆశ్రయం ఇచ్చి మానవ సేవే మాధవ సేవ అనే ఉత్తమ ఆదర్శాన్ని ప్రతిష్టించడానికి కృషి చేయడం గృహమేథి పరమ ధర్మము.

**వాన ప్రస్థాశ్రమము:**

గృహస్థాశ్రమం తరువాత వ్యక్తి వానప్రస్థాశ్రమం చేపట్టవలెను. వ్యక్తి కుటుంబాన్ని, ఇంటిని, గ్రామాన్ని వదిలి అడవులలోనికి వెళ్లి ఇంద్రియ నిగ్రహం సాధించడానికి కృషి చేయవలెను. ఈ దశలో వ్యక్తి తన కుటుంబంతో సమగ్రంగాను, సంపూర్ణంగాను జీవనం గడిపిన పిమ్మట అడవులలోనికి వెళ్లి హెూమాలు చేస్తుంటాడు. అధ్యయనము, అర్పణము అతని నిత్యకృత్యాలు. ఈ దశలో వ్యక్తి ఆహార నియమాలు పాటించి కాయగూరలు, పండ్లు భుజిస్తూ మద్యమాంసాలు త్యజించవలెను. గృహస్థాశ్రమంలో జరిపిన పంచ మహాయజ్ఞాలు ఈ ఆశ్రమంలో కూడా వ్యక్తి కొనసాగించవలెను.

వానప్రస్థాశ్రమంలో పొందిన క్రమశిక్షన నాలుగవ దశ అయిన సన్యాసాశ్రమానికి పునాది అవుతుంది. అందువల్లనే వ్యక్తి అడవులలోని కంద మూలాలను తిని జీవితం గడపవలసి ఉంటుంది. గ్రామం నుంచి తీసుకువచ్చిన పదార్థం ఏదీ తినరాదు. నెమ్మదిగా శారీరక సుఖాలను త్యజించాలి. శరీరాన్ని కష్టానికి అలవాటు చేయాలి. భౌతిక అవసరాలను తగ్గించుకోవాలి.

వ్యక్తి వానప్రస్థాశ్రమంలో కూడా సామాజిక బాధ్యతలు నిర్వహించవచ్చు. సమాజహిత కార్యక్రమాలను వనములో ఉండే నిర్వహించవచ్చు. వానప్రస్థ జీవితం సమాజ శ్రేయస్సుకు అంతకిత కావలసియున్నది. వ్యక్తి జీవితం బ్రహ్మజిజ్ఞాస, ధ్యానాలతో నిండినదై ఉంటుంది. వానప్రస్థాశ్రమంలో వ్యక్తి త్యాగగుణాన్ని, ధర్మగుణాన్ని, సేవాతత్పరతను ప్రదర్శించాలి. స్వార్థబుద్ధి వీడి నిస్వార్థంగా జీవించాలి. వానప్రస్థాశ్రమము తరువాత వ్యక్తి సన్యాసాశ్రమమును స్వీకరిస్తాడు.

**సన్యాసాశ్రమము:**

వానప్రస్థాశ్రమము తరువాతి ఆశ్రమము సన్యాసాశ్రమము. గృహస్థాశ్రమము సాగించి వ్యక్తి నేరుగా సన్యాసాశ్రమం తీసుకోవచ్చునని మనువు భావిస్తాడు. ఈ దశలో వ్యక్తికి ఏమియూ ఉండరాదు. ఈ దశలో వ్యక్తికి పూర్వపు పేరు, ఇంటి పేరు ఏమియూ ఉండవు. కుటుంబంతో బంధము పోతుంది. ఆకారంలో, దుస్తులలో మార్పు ఉంటుంది. శిరోముండనం చేయించుకొని, కాషాయ వస్త్రాలను ధరించాలి. రోజుకు ఒకమారు మాత్రమే భిక్షాటన చేసి భుజించాలి. భిక్ష దొరికినా, దొరకక పోయినా ఒకే రకమైన మానసిక స్థితి కలిగియుండాలి. సత్యమే పలకాలి. ఇంద్రియ నిగ్రహం ఉండాలి. అనురాగం, కోపం విడిచి ఇతరులకు

హాని చేయక అమరత్వానికి, మోక్షానికి ప్రయత్నించాలి. ధ్యానం ద్వారా ఆత్మసాక్షాత్కారం కోసం ప్రయత్నించాలి. ఆత్మను అన్ని జీవరాశులలోను దర్శించాలి. లక్ష్య సాధనలో ధృడత్వం, బ్రహ్మముపై ధ్యానం, ఆత్మనిష్టుడై ఉండడం, ముక్తిని నిరంతరం కోరుకోవడం ఈ దశలో ముఖ్యము.

సన్యాసాశ్రమం పూర్తిగా మోక్ష సాధనకే. ఈ ఆశయ దశలో వ్యక్తి చావు బ్రతుకుల చింతనకు అతీతంగా ఉండవలెను. రాగద్వేషాలకు అతీతంగా ఉంటూ వ్యక్తి మోక్ష సాధనకు కృషి చేయాలి.

పైవిధంగా హిందూ ధర్మశాస్త్రాలు వర్ణాశ్రమ ధర్మాలను వివరించడం జరిగింది. ఈ వర్ణాశ్రమ ధర్మాలు వ్యక్తికీ, సమాజానికి కూడా విలువైనవి. బ్రహ్మచర్యాశ్రమంలో మొదటి పురుషార్ధకమైన ధర్మానికి అధిక ప్రాధాన్యత ఉంది. సర్వవిధాలా బ్రహ్మచారి ధర్మాన్ని గ్రహించాలి. అధ్యయనం చేయాలి. ధర్మాన్ని ఆచరించాలి. తద్వారా అర్థకామాలను అదుపులో ఉంచుకోవాలి. ఈ ఆశ్రమంలోనే మోక్షం గురించి కొంత తెలుసుకోవాలి.

గృహస్థాశ్రమంలో అర్థకామాలు అనే రెండు పురుషార్థాలు ప్రధాన్యత వహిస్తాయి. ధర్మమార్గంలో అర్థ, కామాలను సాధించి మోక్షానికి మార్గాన్ని సుగమం చేసుకోవడము ఈ ఆశ్రమం యొక్క ప్రత్యేకత. వానప్రస్థాశ్రమంలో నిగ్రహాన్ని పాటించమని, సన్యాశ్రమంలో పూర్తిగా మోక్ష సాధనయే లక్ష్యమని హిందూ ధర్మ శాస్త్రాలు వివరించాయి.

హిందూ ధర్మ శాస్త్రాలు వివరించిన ఈ వర్ణాశ్రమ ధర్మాలు సమాజ క్రమతకు, సమాజ అభివృద్ధికి, వ్యక్తికి మహోన్నతమైనవి. వ్యక్తి ఏ ఆశ్రమానికి చెందినప్పటికీ తన విధులను నిర్వర్తిస్తూ ఉండవలెను. అవి: **1.** నిశ్చలత, **2.** క్షమ, **3.** ఆత్మనిగ్రహము, **4.** శౌచము, **5.** ఇంద్రియ నిగ్రహము, **6.** వివేచనము, **7.** జ్ఞానము, **8.** సత్యావాధిత్యము, **9.** అక్రోధము.

మొదటి ఆశ్రమంలో వ్యక్తిని సమాజం పెంచి పోషించి విద్యాబుద్ధులు నేర్పుతుంది. పైగా, ఈ ఆశ్రమంలో ఉన్న వ్యక్తి సామాజిక వారసత్వాన్ని పొందుతాడు. రెండవ ఆశ్రమంలో ఉన్న వ్యక్తే సమాజాన్ని, సమూహాన్ని కాపాడతాడు. సమాజ పరంగా అభివృద్ధి పొంది నీతి నియమాలను అనుసరిస్తూ అతడు వాటిని పెంపొందిస్తూ తనను తాను అభివృద్ధి చేసుకుంటాడు. మూడవ ఆశ్రమంలో వ్యక్తి సంసార బాధ్యతలను, అర్థ కామాలను పరిత్యజించి తనను తాను తెలుసుకొనడానికి చేసే ప్రయత్నంలో మక్ష సాధన ప్రయత్నంలో శిక్షణ పొందుతాడు. చివరి ఆశ్రమంలో వ్యక్తి ప్రాపంచిక విషయాలకు, సామాజిక పరమైన బాధ్యతలకు పూర్తి దూరమై కేవలం ఆత్మ చింతనతో మోక్ష సాధనకు కృషి చేస్తాడు.

## 3.6 కర్మ, పునర్జన్మల భావనలు:

హిందూ మతంలో కర్మ సిద్ధాంతానికి ప్రాముఖ్యత ఉన్నది. హిందువులందరూ కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు. వ్యక్తి చేసే చర్యలే కర్మలు. ఈ లోకంలో వ్యక్తి చేసే చర్యల ఫలితాలు మరుజన్మలో వ్యక్తి యొక్క జన్మను, కష్టసుఖాలను నిర్ణయిస్తాయని హిందువుల నమ్మిక.

సమాజంలో వ్యక్తి ప్రవర్తనను అదుపులో పెట్టడానికి కర్మ, పునర్జన్మల భావనలు తోడ్పడుతున్నాయి. మంచి పనులు చేస్తే మంచి ఫలం పొందగలరని చెప్పడం వలన వ్యక్తి తన జీవితంలో భవిష్యత్తు మీద ఆశలు పెట్టుకుంటాడు. పూర్వ జన్మ కర్మ ఫలం వలన ప్రస్తుత జన్మ నిర్ణయమయినప్పటికీ, వ్యక్తి ధర్మ మార్గం ద్వారా ప్రవర్తించి, వచ్చే న్మలోనైనా మంచి ఫలాన్ని పొందవలెనని ఆశిస్తాడు.

జీవి పూర్వజన్మలో తాను సంపాదించిన పాపఫలాన్ని సత్కర్మల ఆచరణల ద్వారా పోగొట్టుకుని, పుణ్యాన్ని సంపాదించి తద్వారా మోక్షం పొందే అవకాశమున్నది. ముక్తి అనగా అనంతమయిన జనన మరణ చక్రం నుంచి జీవి బయట పడి జన్మరాహిత్యాన్ని పొందడం. ఏ ఒక్క జన్మలోనైనా తన మంచితనాన్ని నిరూపించగలిగిన ప్రతి జీవి మోక్షం పొందడానికి వీలున్నది చెప్పడం వలన ఈ భావనలు చాలా ఉత్తమమయిన సాంఘీక ఆదర్శాలని చెప్పవచ్చు.

కర్మ, పూర్వజన్మ భావనలు సమాజ నైతిక విలువలను పరిరక్షించడానికి తోడ్పడతాయి. పునర్జన్మ మీద నమ్మకం కలిగి ఉండడం చేత ప్రతి వ్యక్తి ఈ జన్మలో సత్కార్యాలను చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధానము వలన సమాజ అభివృద్ధి

సాధ్యపడుతుంది. సామాజిక వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. ఈ భావనలు మానవ విశృంఖల ప్రవర్తనను అదుపులో పెడతాయి. దొంగతనము, లంచము, హత్యలు, వ్యభిచారము మొదలైన సంఘ విద్రోహక చర్యలన్నీ పాపకర్మలుగా పరిగణించుటయే కాక, అట్టి కర్మలను చేసిన వారు రాబోయే జన్మలో నరకానికి పోతారని హెచ్చరించుట వలన వ్యక్తులు అటువంటి కర్మలను విడనాడడానికి ప్రయత్నిస్తారు. ఈ విధంగా సమాజ వ్యవస్థకు కర్మ, పునర్జన్మ భావనలు ఉపకరిస్తున్నవి.

వ్యక్తులలో నిర్మాణాత్మకమైన సంబంధాలు పెంపొందడానికి సాంఘీక సంక్షేమం పెంపొందడానికి ఈ కర్మ, పునర్జన్మ భావనలు తోడ్పడతాయి. సృష్టిలో ఉన్న జీవులన్నీ భగవంతుని దృష్టిలో సమానమేనని, భూతదయ ఉండడం సత్కర్మ అనీ హిందూ ధర్మ శాస్త్రాలలో వివరించడం జరిగింది. ఈ సిద్ధాంతాల ప్రభావం వల్లనే హిందూ సమాజంలో శాంతి, సహకారాలు పెంపొందినాయి. కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం సత్కర్మగా చెప్పడం వలన అటువంటి వారిని రోఇంచడానికి వ్యక్తులు ప్రయత్నిస్తారు. యజ్ఞయాగాదులు, దానధర్మాలు చేయడం ఉత్తమ కర్మలుగా చెప్పడం చేత ధనవంతులు ఆయా కార్యనిర్వహణల ద్వారా పేదవారికి సహాయ పడడం జరుగుతుంది. ప్రతి వ్యక్తి సత్కర్మలను ఆచరించినప్పుడు వ్యక్తి క్షేమమే కాక సంఘ క్షేమమునకు కూడా మార్గం ఏర్పడుతుంది.

## 3.7 ముఖ్య పదములు:

| | | |
|---|---|---|
| అర్థ (Artha) | : | ప్రాపంచిక సుఖాలకు, భౌతికావసరాలకు ఉపయోగపడే ధనము, అధికారము మొదలైనవి. |
| ఆశ్రమము (Ashramam) | : | సంస్కృతంలో శ్రమ అన్న పదం నుంచి వచ్చినది. మోక్ష సాధన అనే ప్రయాణంలో ఒకచోట ఆగి, మిగతా ప్రయాణానికి సిద్ధం కావడానికి తీసుకొనే విశ్రాంతి. ఆశ్రమాలు నాలుగు. అవి: బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమములు. |
| భూతయజ్ఞము (Bhutha Yajna) | : | పంచభూతములను (భూమి, నీరు, ఆకాశము, అగ్ని, వాయువు) తృప్తి పరచుటకు చేయు మతపరమైన కర్మకాండలు. |
| బ్రహ్మ యజ్ఞము (Brahma Yajna) | : | వేదపఠనము చేయాలి. |
| దేవ యజ్ఞము (Deva Yajna) | : | దేవతలకు నిత్యము హోమము చేయుట. |
| ధర్మము (Dharma) | : | నీతి, నిజాయితీలతో కూడిన ప్రవర్తన వ్యక్తులందరూ వారి వారి కార్యకలాపాలు సక్రమంగా కొనసాగించడమే ధర్మము. |
| ద్విజ (Dvija) | : | 'రెండు సార్లు జన్మించుట' అని సాహిత్య పరంగా అర్థము. ఉపనయనము అనంతరం వ్యక్తులను రెండుసార్లు జన్మించినట్లు భావిస్తారు. |
| గృహస్థ (Grihastha) | : | వైవాహిక జీవితము. |
| గురు (Guru) | : | ఉపాధ్యాయుడు. |
| గురుకుల (Gurukula) | : | గురువు ఇంటి వద్ద నివశిస్తూ విద్య నేర్చుకొనే స్థలము. |
| కామ (Kama) | : | లైంగిక తృప్తితో కూడిన భౌతిక ఆనందము. |
| కర్మ (Karma) | : | వ్యక్తిచేయు మంచి లేక చెడు చర్య. |
| కర్మఫల (KarmaPhala) | : | వ్యక్తులు చేయు కర్మల ఫలితము. |

మనుష్యజ్ఞ లేక అతిథియజ్ఞ (Manushya Yajna Athidi Yajna): అతిథులను ఆదరించుట

| | | |
|---|---|---|
| మోక్ష లేక ముక్తి (Moksha or Mukthi) | : | భవబంధం నుంచి లేదా జనన మరణ చక్రం నుంచి విడిపోవడం. |
| పాపకర్మ (Papa Karma) | : | పాపపు లేక చెడు చర్యలు లేక పనులు. |
| పుణ్యకర్మ (Punya Karma) | : | మంచి చర్యలు లేక పనులు. |
| పురుషార్ధములు (Purusharthas) | : | జీవిత లక్ష్యాలు. అవి నాలుగు. ధర్మము, అర్ధము, కామము, మోక్షము. |
| సమవర్తన | : | గురుకులంలో విద్య పూర్తి చేసుకువచ్చుట. |
| శ్రాద్ధ (Shraddha) | : | తల్లిదండ్రులకు పెట్టు సాంవత్సరీకము. |
| తర్పణ (Tarpana) | : | సాంవత్సరీకములో నీటిని, ఆహారమును అర్పించుట. |

## 3.8 ప్రశ్నలు:

1. హిందూ జీవన విధానమును వివరింపుము?
2. హిందూ జీవన భావనలో ఆత్మ యొక్క స్థానమును వివరింపుము?
3. పురుషార్ధములను వివరింపుము?
4. హిందూ జీవన విధానంలోని అన్ని పురుషార్ధాలలోను ధర్మము ప్రముఖమైనది. చర్చింపుము?
5. ఆశ్రమ వ్యవస్థ యొక్క లక్షణములను చర్చింపుము?
6. హిందూ కర్మ సిద్ధాంతమును వివరింపుము?
7. వ్యక్తి జీవనంలో నాలుగు ఆశ్రమాల ప్రాముఖ్యతను వివరింపుము?
8. కర్మ-పునర్జన్మ సిద్ధాంతములను, వాటి సంబంధనమును వివరింపుము?

## 3.9 చదవదగిన పుస్తకములు (SUSPECTED READINGS):

1. Prabhu, Pandarinath H. : Hindu Social Organisation, A study in Socio-Phychological and Ideological Foundations, Bombay, Popular, Prakashan, 1963.

2. Motwani, Kemal : Manu A Study in Hindu Social theory, Madras, Ganesh & Co., 1937.

3. Radha Krishnan : The Hindu View of life, New Delhi, Harper Collins, 1993.

**పాఠం-4**

# కుల వ్యవస్థ

**విషయక్రమం:**


**4.1 ఉద్దేశ్యము**

**4.2 పరిచయము**

**4.3 వర్ణము, జాతి, భావనలు**

**4.4 ఆధునిక సమాజంలో కులము**

**4.5 ముఖ్య పదములు**

**4.6 ప్రశ్నలు**

**4.7 చదవదగిన పుస్తకములు**


## 4.1 ఉద్దేశ్యము:

కుల వ్యవస్థను వర్ణము మరియు జాతి భావనల దృష్ట్యా వివరించుట, కుల సిద్ధాంతములను వివరించుట, కుల వ్యవస్థలో మార్పులను వివరించుట.

## 4.2 పరిచయం:

ఏ సమాజమైనా సామాజిక స్తరీకరణను కలిగి ఉంటుందని సమాజ శాస్త్రవేత్తలు వివరించారు. సమాజంలోని ప్రజలు అనేక ప్రాతిపదికలపై వర్గీకరింపబడతారు. ఈ వర్గీకరణకు చెందిన ప్రజలను ఒక క్రమశ్రేణిలో అమర్చడం జరుగుతుంది. భారతదేశంలో ఒక ప్రత్యేకమైన సామాజిక స్తరీకరణ కలదు. భారతీయ సమాజము అనేక కులాలుగా విభజింపబడింది. ఈ కులాల సంఖ్య తక్కువ కాదు. అవి వేల సంఖ్యలో ఉన్నవి. ప్రజలు ఈ అనేక కులాలలో ఏదో ఒక కులంలో జన్మిస్తారు. వారు ఏ కులంలో జన్మించిందీ ఎప్పుడూ మరిచిపోరు. కుల వ్యవస్థ సంకుచితమైనది, కనుక గతిశీలత ఒక కులంలో నుంచి మరొక కులములోనికి ఉండదు. ఒకరు ఏ కులంలో అయితే జన్మిస్తారో వారు మరణించే వరకు ఆ కులము వారిగానే పరిగణింపబడతారు. ఈ పరిస్థితిని ఏదీ కూడా మార్చలేదు.

ప్రతి కులానికి ఒక హెూదా ఉంటుంది. దాని ప్రకారం కులాలు ఒక క్రమశ్రేణిలో అమర్చబడినవి. ఈ క్రమశ్రేణిలో కొన్ని కులాలు ఎక్కువ హెూదా కలిగి, పై అంతస్థులో స్థానము కలిగిఉన్నవి. కొన్ని కులాలు తక్కువ హెూదా కలిగి, క్రింది అంతస్థులో స్థానము కలిగి ఉన్నవి. ఈ రెండింటి మధ్య అనేక కులాలు వివిధ అంతస్థులు కలిగి ఉన్నాయి. కులము పుట్టుకతో ఆపాదించబడుతుంది. కనుక, ఆ కులములో పుట్టిన వారికి కులశ్రేణి హెూదా పుట్టుకతో వస్తుంది. కనుక కులములోని వ్యక్తులకు కుల అంతస్థు ఆపాదించబడిన అంతస్థు, తపస్సు గానీ, ప్రార్థన గానీ, సంపద గానీ పుట్టుకతో వచ్చిన కుల అంతస్థును మార్చలేవు. ఈ అంశంలో కుల వ్యవస్థ కఠినమైనది గతిశీలతా అంశములో మరి ఏ ఇతర స్తరీకరణా పద్ధతీ, కుల వ్యవస్థ స్తరీకరణా పద్ధతి వలె లేదు.

## 4.3 వర్ణము, జాతి : భావము

ప్రారంభంలో పాశ్చాత్యులు కుల వ్యవస్థను జాతి సంబంధమైన, జన్మ సంబంధమైన వ్యవస్థగా పరిగణించినారు. ఈ భావంతోనే తొలుత పోర్చుగీసు వారు, వారి భాషలో 'కాస్ట' (Casta) అను పదాన్ని ఉపయోగించినారు. నేటి వరకు ఆంగ్లేయులు భారతీయులు ఈ వ్యవస్థను నిర్వచించేటప్పుడు ఈ అర్థము స్ఫురించే మాటలే ఉపయోగించారు.

'కాస్ట్' అనే పదము 'కాస్ట' అను పదము నుండి గ్రహించబడినది. 'కాస్ట్' అనగా వంశపారంపర్య లక్షణాల సంశ్లిష్టత. 'కాస్ట్' అనగా కులము.

రిస్లే కుల వ్యవస్థను ఈ క్రింది విధముగా నిర్వచించినాడు. "ఒకే ఇతిహాస పూర్వీకుని వంశం అనుకొని వంశానుగతంగా అనే వృత్తులు జేసి, ఒకే సామరస్య పూరిత సమూహంగా ఉంటూ ఒకే నామధేయం గల కుటుంబాలు లేదా సమూహాల చీలిక''.

**వర్ణము:**

భారతదేశంలో కొందరు కులమును వ్యవహారికంగా వర్ణము అని కూడా పిలుస్తారు. వర్ణము అనగా రంగు. 2000-1500 బి.సి మధ్య కాలంలో భారతదేశంపైకి దండెత్తి వచ్చిన ఆర్యులు, వారి భౌతిక ఆకారంలో ముఖ్యంగా రంగులో భారతీయులకు భిన్నంగా ఉన్నారు. ఆర్యులు తెలుపు రంగులోను, స్థానికులైన భారతీయులు నలుపు రంగును కలిగియున్నారు. మంచి వర్ణమును కలిగి యుండుట ఆర్యుల ఆలోచనా పద్ధతిని ప్రభావితం చేసింది. నల్ల రంగు గల స్థానిక భారతీయుల నుండి దూరంగా ఉండేవారు. దీనివలన రెండు రకాల ప్రజలు ఒకరినొకరు ఒంటరిగా ఉండేవారు. ఇది సమాజాన్ని శరీరపు రంగు ఆధారంగా రెండు తరగతులుగా విభజించింది. ఈ రెండు తరగతులను వర్ణాలు అని పిలవడం జరిగింది. ఆర్యులు తమ వారిని శ్వేతవర్ణముగాను, స్థానిక ప్రజలను దశ్యవర్ణము (నలుపు రంగు తరగతి) గాను తెలిపారు. కనుక వర్ణము అంటే రంగు అనీ, మొట్టమొదట హిందూ సమాజంలో ఈ అర్థంతోనే వర్ణ విభజన జరిగినట్లు తెలియుచున్నది. ఆర్యులకు, దశ్యులకు మధ్య వరీర ఛాయలో గల భేదం కారణంగా రెండు వర్ణాలు ఏర్పడినాయని ఆచార్య పీ.ఎన్.ప్రభు వివరించారు. వర్ణ విభేదాలు మొదట ఆర్యులను, ద్రావిడులను సరిపోల్చేటప్పుడు వివరించినారు. కానీ, తరువాత మిగతా వర్గాలను వర్ణించేటప్పుడు వర్ణ విభేదాలను వారికి కూడ ఆపాదించినారు. ఘర్యే దృష్టిలో మొదట ఆర్యులకు, ద్రావిడులకు చూపిన వర్ణ విభేదాలను రాను రాను వర్గాలకు, శూద్రులకు అన్వయింపజేసినారు.

కాలక్రమేణా ఆర్యవర్గము మూడు తరగతులుగా విభజింపబడినది. అవి: 1. బ్రాహ్మణులు, 2. క్షత్రియులు, 3. వైశ్యులు. ప్రకార్య విభజన కోసం ఆర్యవర్ణము ఈ విధంగా మూడు తరగతులుగా విభజింపబడినది. బోధనా వృత్తిని బ్రాహ్మణులు, విదేశ దండయాత్రల నుంచి ప్రజలను రక్షించు పని క్షత్రియులు, వ్యాపార వాణిజ్యాలను వైశ్యులు స్వీకరించారు. దాసులను శూద్రులుగా పేర్కొని, వారికి పై మూడు తరగతులను సేవించే వృత్తిని నిర్దేశించారు. శూద్రులను భగవంతుడు మూడు వర్ణాల వారికి సేవ చేయుటకే సృష్టించాడు అని పాలించే ఆర్యులు ప్రకటించారు. ఈ విధంగా వారు పై వర్ణాల వారికి సేవ చేయుటకు నిర్బంధించబడ్డారు.

మొదట వర్ణము అను పదము శరీరపు రంగులోని భేదాలు తెలియజేయడానికి మాత్రమే వినియోగించేవారు. కానీ, తర్వాత ఈ పదము ఈ మొదటి అర్థాన్ని కోల్పోయింది. ప్రకార్య విభజన కొరకు సమాజంలో ఏర్పరచబడిన నాలుగు తరగతులను వర్ణములుగా పిలవడం ప్రారంభమైనది. మహాభారతంలోని శాంతి పర్వంలో భృగు మహర్షి వర్ణాల పుట్టుకను ఈ క్రింది విధంగా వర్ణించినాడు. మొట్టమొదట బ్రాహ్మణులను మాత్రమే సృష్టించినట్లు, ఆ తర్వాత క్షత్రియ, వైశ్య, శూద్రులు ఏర్పడినట్లు, శ్వేతవర్ణులు బ్రాహ్మణులని, లోహిత (ఎర్ర రంగు) వర్ణులు క్షత్రియులని, పసుపు వర్ణులు వైశ్యులని, అసిత (నల్లని) వర్ణులు శూద్రులని వివరించినాడు.

కాలక్రమేణా వర్ణ విభజన చేసేది శరీర ఛాయ కాదని పుట్టుకతో ప్రతి వ్యక్తి శూద్రుడని, అతడు సముపార్జించుకునే గుణాల ఆధారంగా వ్యక్తి ఈ నాలుగు వర్ణాలలో ఏదో ఒక వర్గానికి చెందుతాడని హిందూ శాస్త్రకారులు వివరించారు.

ఉదా: భగవద్గీతలో సత్వగుణం గల వారు బ్రాహ్మణులని, సత్వ-రజో గుణాలు గల వారు క్షత్రియులని, రజో-తామస గుణాలు గలవారిని వైశ్యులని, తామస గుణం గల వారిని శూద్రులని పేర్కొనడం జరిగింది.

ఋగ్వేదకాలం నాటి సమాజము చతుర్వర్ణాలుగా విభజింపబడినది. ఇందులో మూడు వర్ణాల వారు ద్విజులు. అనగా ఉపనయన కర్మకాండకు అర్హత గలవారు. వీరు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు. నాల్గవ వర్ణం వారు శూద్రులు. ఉపనయన సంస్కారానికి అర్హత లేనివారు.

మను ధర్మ శాస్త్రంలో ఈ నాలుగు వర్ణాలు బ్రహ్మ శరీర వివిధ అంగాల నుండి ఉద్భవించాయని వివరించడం జరిగింది. బ్రహ్మముఖము నుండి బ్రాహ్మణులు, భుజముల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ఉద్భవించారని వివరణ ఉన్నది. ఇట్లా చెప్పడంలో ఒక ప్రాముఖ్యత ఉందని కొందరి అభిప్రాయము. వివిశ శరీర భాగాలకు గల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వాక్కునకు మూలస్థానమైన నోటి నుఁండి బ్రాహ్మణులు పుట్టారు కనుక గురువులు గాను, వీర పరాక్రమములకు మూలమైన బాహువుల నుండి పుట్టినందువలన ఆయుధ ధారలై ఇతరులను రక్షించుటకు క్షత్రియులు, ఊరువుల నుండి పుట్టిన వైశ్యులు ఆహారోత్పత్తికి, పాదాల నుండి జనించిన శూద్రులు ఇతర వర్ణముల వారికి సేవకులు గాను వ్యవహరిస్తారని అభిప్రాయపడినారు.

వర్ణ విభజనకు గుణాలతోపాటు వ్యక్తి నిర్వహించే సంస్కారాలు లేదా కర్మలు కూడా ప్రధానమైనవిగా భావించినారు. ఉదా: బ్రాహ్మణుడి జీవితం సంస్కారమయంగా ఉంటుంది. పూజలు, యజ్ఞాలు చేయడం లేదా చేయించడం, ఉపనయనం తరవాత నిత్యం సంధ్యా వందనం చేయడం, గాయత్రీ దేవిని పూజించడం, శుచి-అశుచిలను పాటించడం, ధర్మాలను నిర్వహించడం మొదలైన బాధ్యతలుంటాయి. అంటే వ్యక్తి తన తల్లిదండ్రుల యొక్క వర్ణంతో సంబంధం లేకుండా తాను అలవరుచుకునే గుణాలు లేదా నిర్వహించే కర్మలు లేదా సంస్కారాల కారణంగా మాత్రమే అతని వర్ణం నిర్ణయించబడుతుంది.

విభిన్న వర్ణాల వారికి విభిన్న వృత్తులు ఇవ్వబడ్డాయి. విద్యా సంబంధమైన విషయాలు బ్రాహ్మణులకు, పరిపాలన-రక్షణ సంబంధమైన విషయాలు క్షత్రియులకు, వ్యాపార వ్యవసాయక విషయాలు వైశ్యులకు యివ్వబడినవి. శూద్రులు తమపై ఉన్న మూడు వర్ణాల వారికి సేవకులు. వివాహ, ఆహార సంబంధమైన విషయాలలో కూడా వర్ణాల మధ్య ఆంక్షలున్నాయి.

ఉదా: బ్రాహ్మణ యువకుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల యువతులలో ఏ ఒక్కరినైనా వివాహమాడవచ్చును. క్షత్రియ యువకుడు క్షత్రియ, వైశ్య, శూద్ర యువతులలో ఏ ఒక్కరినైనా వివాహమాడవచ్చును. వైశ్య యువకుడు వైశ్య, శూద్ర యువతులలో ఏ ఒక్కరినైనా వివాహమాడవచ్చును. శూద్ర యువకుడు మాత్రం శూద్ర యువతిని మాత్రమే వివాహమాడవలెను. ఇటువంటి వివాహాన్ని అనులోమ వివాహమంటారు. స్త్రీ మాత్రం తనకంటే తక్కువ వర్ణానికి చెందిన యువకుని వివాహము చేసుకొనరాదు. దీనిని ప్రతిలోమ వివాహమంటారు.

ఆహార సంబంధ ఆంక్షలు కూడా వర్ణాల మధ్య ఉన్నాయి. బ్రాహ్మణులు, వైశ్యులు మాంసాహారాన్ని తీసుకొనకూడదు. శాకాహారాన్ని మాత్రమే భుజించాలి. క్షత్రియులు, శూద్రులు మాంసాహారాన్ని, శాకాహారాన్ని భుజింపవచ్చు. బ్రాహ్మణుడు బ్రాహ్మణుడు వండిన వంటను మాత్రమే తినాలి. క్షత్రియులు బ్రాహ్మణులు, క్షత్రియులు ఎవరు వండిన వంటనైననూ భుజించవచ్చును. వైశ్యులు బ్రాహ్మణులు వండిన, వైశ్యులు వండిన వంటను భుజించవచ్చును. శూద్రులు వారి వర్ణం వారు వండిన వంటతోపాటు మిగిలిన వర్ణములలో ఎవరి వండిన వంటనైననూ తినవచ్చును.

వర్ణాలలో వృత్తులు వంశపారంపర్యంగా వచ్చేవి కావు. ఏ వర్ణం వారైనను (శూద్రులు తప్ప) ఏ వృత్తినైననూ అవలంబించవచ్చును. దీనిని బట్టి వర్ణ వ్యవస్థలో వృత్తి పరమైన గతిశీలత ఉన్నదని చెప్పవచ్చును. ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వద్ధామ బ్రాహ్మణులైనప్పటికీ కత్తితపట్టారు. పరశురాముడు జన్మత: బ్రాహ్మణుడైనప్పటికీ, క్షత్రియ వృత్తిని స్వీకరించాడు. జన్మత: క్షత్రియులైన విదేహ రాజైన జనకుడు, కైకేయ రాజైన అశ్వపతి, కాశీ రాజైన అజాతశత్రు, పాంచాల రాజైన ప్రవహణ జైవాలి బ్రాహ్మణ వృత్తిని స్వీకరించుటయే కాక, ధర్మ శాస్త్రాలను బోధించారు. వారికి బ్రాహ్మణులు కూడా శిష్యులైనారు. శంతనుని వివాహానికి అతని సోదరుడైన క్షత్రియుడైన దేవపి పురోహితునిగా వ్యవహరించాడు. విశ్వామిత్రుడు జన్మత:

క్షత్రియుడైనప్పటికీ, బ్రాహ్మణ ఋషి యొక్క జీవన పద్ధతిని అనుసరించాడు. అవసరమైనప్పుడు బ్రాహ్మణులు క్షత్రియ జీవన విధానాన్నే కాక, వైశ్య జీవన విధానాన్ని కూడా అనుసరించడాన్ని ధర్మశాస్త్రాలు అనుమతించినాయి. అటులనే క్షత్రియులు కూడా వైశ్య జీవన విధానాన్ని అవలంభించేవారు. అదే విధంగా వైశ్యులు కూడా వృత్తి పరమైన మార్పును అనుసరించవచ్చునని శాస్త్రాలు వివరించినాయి.

పై అంశాలు వర్ణ వ్యవస్థ సంకుచితమైనది కాదని, దానిలో వృత్తి పరమైన గతిశీలత ఉండేదని తెలుపుతోంది. వేద కాలంలో ఒక వర్ణంలో సభ్యత్వం ఒక కుటుంబంలో జన్మించడానిని బట్టి ఉండేది కాదు.

వర్ణ సిద్ధాంతం ప్రకారం సామాజిక అంతస్తులో బ్రాహ్మణులు మొదటి స్థానాన్ని, రెండవ స్థానాన్ని క్షత్రియులు, మూడవ స్థానాన్ని వైశ్యులు, నాల్గవ స్థానాన్ని శూద్రులు కలిగియున్నారు. కాలక్రమేణా చతుర్వర్ణ వ్యవస్థ అనేక కులాలుగా విడిపోయింది. అయినప్పటికీ అన్ని కులాలు చతుర్వర్ణ వ్యవస్థ నమూనాలో ఇమిడి ఉంటాయని సీ.హెచ్.కూలే అభిప్రాయం.

**జాతి:**

కులమునకు సంబంధించిన మరొక పదము జాతి. జాతి అనుపదం 'జాన్' అను సంస్కృత పదము నుండి గ్రహించబడినది. దీనికి అర్థము 'పుట్టుట'.

ఒక్కొక్కసారి వర్ణము, జాతి, రెండు పదాలు ఒకటిగానే భ్రమింపజేస్తాయి. కానీ, Emile Senart ఈ రెండు పదాలు, వర్ణ మరియు జాతి, స్వతంత్ర అర్థమ కలవని వివరించినాడు. మొదట వర్ణము అను పదము ఆర్యులకు దశ్యులకు గల భేదము తెలుపు పదముగా ఉపయోగించినప్పటికీ, తరువాతి కాలంలో నాలుగు కులాలకు అన్వయింపబడినది. న్యాయ శాస్త్ర గ్రంథాలలో 'కులము' 'జాతి'గానే పరిగణింపబడినది.

వర్ణములు స్థూలమైన సామాజిక వర్ణములు, వర్ణములు సైద్ధాంతిక కుల సమూహములు, వర్ణములో భిన్నమైన అనేక కులాలు (జాతులు) ఉన్నాయి. కానీ, జాతి సంకుచితమైన సముదాయము, జాతి అంతర్వివాహ సమూహము: అంతేకాక ఒక పేరును కలిగి విభిన్న లక్షణాలను కలిగి ఉంటుంది. ఒక జాతిలోని సభ్యులందరూ ఒకటిగా ఉండి, మిగిలిన సమూహాలతో వివాహ, ఆహార సంబంధాలతో ప్రత్యేకంగా, విడిగా ఉంటారు.

కుల వ్యవస్థ అధ్యయనంలో సాధారణంగా రెండు పదాలను ఉపయోగిస్తుంటారు. అవి: 1. కులము, 2. ఉపకులము. ఇప్పుడు జాతి అనే పదము కులాన్ని తెలియజేస్తుందా? లేక ఉపకులాన్ని తెలియజేస్తుందా? అనే ప్రశ్న తలెత్తుతుంది. కులమునకు, ఉపకులమునకు తేడా ఉంది. ఉపకులము కులములో ఒక భాగము. నిజానికి ఉపకులమే కులము యొక్క లక్షనాలను పుణికిపుచ్చుకున్నది. అయితే ఇది ఒక సంకుచిత సమూహము. కులప్రకార్యాలైన ఆహార, వివాహ నిబంధనలను కుల సభ్యుల ప్రవర్తనను క్రమబద్దీకరించడం మొదలైన వాటిని ఉపకులమే నిర్వస్తుంది. ఈ ప్రకార్యాల నిర్వహణలో కుల పాత్ర ఏమీ లేదు. ఉపకులమే వీటికి పూర్తి బాధ్యత వహిస్తుంది.

ఈ కారణాల వలన సమాజ శాస్త్రవేత్తలు ఉపకులాన్ని కులము యొక్క ప్రమాణము (Unit)గా భావిస్తారు. M.N.శ్రీనివాస్ కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేసినారు. ఐరావతీకార్వే కూడా ఉపకులాన్ని కులవ్యవస్థ యొక్క అంతిమ విశ్లేషణా ప్రమాణముగా భావించారు. Adrian Mayer, Sherring కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినారు.

పురాతన కాలం నుంచి కుల వ్యవస్థ రెండు రకాలైన క్రమ విధానాలకు లోనైందనీ, అవి: 1. కుల విభజన విధానము, 2. కుల మిశ్రమ విధానము అని కొందరు అభిప్రాయము. ఒక కులంలో కొన్ని కుటుంబాలు విడిపోయి ఇంకొక ఉపకులంగా మారినవనీ శాస్త్రవేత్తలు వివరించినారు. తెగ కులంగా కాలక్రమేణా మారి, ఆ కులము తిరిగి అనేక ఉపకులాలుగా చీలిందని, ఒక్కొక్క ఉపకులము ఒక్కొక్క వృత్తిని స్వీకరించిందని పరిశోధనలు వివరించినాయి. కులాలు మరీ ప్రత్యేకంగా చెప్పవలెనంటే ఉపకులాలు అంతర్వివాహ సముదాయాలు. ఉపకులాల మధ్య పెళ్లిళ్లు చేసుకున్నప్పుడు కుమ్హార్, అహిర్ కులాలలో శుద్ధి చేసుకోవడానికి జంతు బలి ఇస్తారు. సాధారణంగా వేరు కులాల మధ్య వివాహము చేసుకున్నప్పుడు వెలివేయడం పరిపాటి. ఉపకులాలు కూడా అంతర్వివాహ సూత్రాన్ని పూర్వము కట్టుదిట్టంగా పాటించేవారు. కానీ, రాను రాను అంతగా పాటించలేదు.

వృత్తిలో మార్పుల వల్ల ఉపకులాలు పుట్టడము సహజము. ఉత్తర భారతదేశంలో గల మోచి-కాయస్థ-దర్జీ, కాయస్థ-సెందువ్వ అను ఉపకులాలు వారు చేసే వృత్తుల వలన ఏర్పడినవి. కులంలో వచ్చే సాంఘీక ఆచారాల మార్పుల వల్ల కూడా ఉపకులాలు ఉద్భవిస్తాయి. ఆహార నియమాలలో మార్పులు కూడా ఉపకులాల స్థితిపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఒక కులంలోని ఉపకులాలు అన్నిచోట్ల ఒకే పద్ధతిలో ఉండవు. ఒకే కులంలో ఉపకులాలు విభిన్న పద్ధతులను అవలంభించడానికి ఆ ఉపకులాలు విభిన్న స్థితులలో ఉండడమే కారణము.

మానవులకు సామాజిక గుర్తింపునిచ్చే ఆధారంగా ఉపకులం ఉన్నది. ఆ విధంగా ఉపకులం కులానికి వాస్తవికంగా ప్రమాణమైనది. దీనిని బట్టి జాతి, ఉపకులము సాన్నిహిత్య సంబంధం కలిగియున్నవని చెప్పవచ్చునని కొందరు అభిప్రాయము. కానీ, E.A.Gait దీనికి తన అభ్యంతరాన్ని తెలియజేసినాడు. G.S.Ghurye Gait అభిప్రాయాన్ని ఖండించాడు. ఘుర్యే ప్రకారం ప్రజలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1. బ్రాహ్మణులు, 2. శూద్రులు. బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులంతా శూద్రులేనని ఘుర్యే వివరించారు. అటులనే తక్కువ కులం వారికి అగ్రకులస్థులంతా ఒకే సమూహము. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని Gait అభిప్రాయాన్ని ఘుర్యే ఖండించారు. ఉపకులం అనే పదాన్ని వినియోగించేటప్పుడు ప్రాంతీయ మనోభావాలకు, దృక్పథాలకు వ్యతిరిక్తత వ్యక్తం చేశారు. సమాజ శాస్త్ర దృక్పథంలో కుల వ్యవస్థను సక్రమంగా అవగాహన చేసుకోవాలంటే ఉపకులాన్ని అసలైన కులముగా గుర్తించక తప్పదని ఆయన నొక్కి వక్కాణించారు. మహారాష్ట్రలోను, తమిళనాడులోను జరిపిన పరిశోధనల వలన ఉపకులా వాడుకే ఎక్కువగా ఉందనీ, కనుక ఉపకులాలనే వాస్తవ కులాలుగా భావించాలని ఘుర్యే అభిప్రాయపడినాడు.

**కుల వ్యవస్థ లక్షణములు:**

కుల వ్యవస్థ పురాతన మరియు ఆధునిక భారతదేశంలో ఒక ప్రత్యేకమైన స్తరీకరణ పద్ధతి. కుల వ్యవస్థ భారతీయుల యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితంలో కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నది. కులము అనే పదము కాస్ట అనే స్పానిష్ పదం నుండి ఉద్భవించింది. కాస్ట అంటే వంశపారంపర్య లక్షనాల సంశ్లిష్టత అని అర్థము. అయితే కులాన్ని వివిధ సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించినారు.

ఒకే మూలపురుషుణ్ణి కలిగియుండి ఒకే వారసత్వ వృత్తిని పాటిస్తూ అంతర్వివాహాన్ని మాత్రమే చేసుకుంటూ, ఒకే పేరుతో మాత్రమే చలామణి అయ్యే కొన్ని కుటుంబాలు లేదా బంధు సమూహాల సాధర్మ్య సమూహాన్ని కులమంటారు.

బోగెల్ ప్రకారం కుల వ్యవస్థ సంఘాన్ని వంశపారంపర్య సమూహాల క్రింద విడదీస్తుంది. ఈ సమూహాలు ఒక విధంగా ఒకదానికొకటి సంబంధం లేకుండా, మళ్లీ కొన్ని రకాల సంబంధాలు కలిగియుంటాయి. ఈ సమూహాలకు సంబంధించిన ముఖ్య లక్షణాలు ఏమిటంటే వివాహాలలోను, సంపర్కాలలోను, భోజన విషయాలలో ప్రత్యేక్షంగానైనా, పరోక్షంగానైనా యిచ్చిపుచ్చుకోవడంలో వేరుగా ఉండి, శ్రమ విభజన సూత్రం ప్రకారం, ప్రతి సమూహానికి సాంప్రదాయసిద్ధంగా ఒక వృత్తి ఉండి, ఆ వృత్తిని కొన్ని సందర్భాలలో కొంతవరకు మాత్రమే వదిలిపెట్టగలిగి, ఈ సమూహాలన్నీ ఒకే అంతస్తుల క్రమంలో ఉన్నత, అల్ప శ్రేణులుగా ఏర్పడి ఉండడం.

కులం రెండు ముఖ్య లక్షణాలు గల సాంఘీక సమూహం కేట్కర్ (Ketkar) అభిప్రాయపడినాడు. ఆ లక్షణాలలో మొదటిది సభ్యత్వము. సభ్యులకు జన్మించిన వాళ్లకే సభ్యత్వము ఉంటుంది. అటువంటి వాళ్లే సభ్యులవుతారు. రెండోది, కఠినమైన సాంఘీక కట్టుబాట్ల వలన సభ్యులు తమ సమూహ సభ్యులు గాని వారిని వివాహం చేసుకోవడం నిషిద్ధం. ప్రతి సమూహానికి ఒక నామధేయం ఉంటుంది. ఇటువంటి పేరులున్న సమూహాలు కలిసి ఇంకొక సాధారణ నాయధేయం గల పెద్ద సమూహంగా కలుస్తాయి. ఈ పెద్ద సమూహాలు ఇంకా పెద్ద సమూహాల అంతర భాగాలు. ఈ విధంగా వివిధ దశలు గల సమూహాలకు కులం అన్నమాట. ప్రతి దశలోను అన్వయించడం జరుగుతోంది. కులం, ఉపకులం అన్న మాటలు సంపూర్ణార్థం కలవిగా కాక, వాటి సాపేక్ష భావం గ్రహించవలెను. పెద్ద సమూహాలను కులం అని, చిన్న సమూహాలను ఉపకులం అని అంటారు.

హిందూ సమాజంలో తప్ప మరి ఏ ఇతర సమాజాలలోనూ 'కులము' కన్పించదు. ప్రతి హిందువునకు పుట్టుకతోనే కులమేర్పడుతుంది. ఒక కులం నుంచి మరొక కులానికి మార్చడానికి వ్యక్తికి వీలుపడదు. కులాలకు వరస క్రమంలో గౌరవమూ, హోదా ఉంటాయి.

ఒకసారి వ్యక్తి ఒక కులంలో పుట్టి దానిలో సభ్యుడైతే అతడు చనిపోయే వరకూ దానిలో సభ్యుడుగానే ఉంటాడని హాట్టన్ చెప్పినాడు. డబ్బు గాని, పేదతనం గాని, విజయం గాని, ఓటమి గాని అతని కులాన్ని మార్చలేవు. కాని వ్యక్తి తన కుల ప్రమాణాలను, ప్రవర్తనా పద్ధతులను అతిక్రమించి ప్రవర్తిస్తే మాత్రం అతనిని తాత్కాలికంగా గానీ, శాశ్వతంగా గానీ ఆ కులం నుంచి వెలివేస్తారు.

ప్రొఫెసర్ ఘర్యే (Ghurye) ఈ కులాలను, కుల వ్యవస్థను కుల సిద్ధాంతాలను విశేషంగా అధ్యయనం చేసినాడు. ఇతడు 'భారతదేశంలో కులము-వర్గము' (Caste and Class in India) అనే తన గ్రంథంలో కులానికి ఉన్న ఆరు లక్షణాలను వివరించినాడు. అవి:

1. కులాలు, సమూహాలు, ప్రతి కులానికి అభివృద్ధి చెందిన జీవిత విధానాలు, పద్ధతులు ఉంటాయి. ఐచ్ఛిక సమూహాలు, వర్గాలు వీటి మాదిరిగా కాక కులంలో సభ్యత్వము పుట్టుకతో వస్తుంది.

2. హిందూ సమాజంలో ఎక్కడ చూచినా కులాలలో ఒక క్రమశ్రేణి కనిపిస్తుంది. అట్లాంటి క్రమశ్రేణిలో బ్రాహ్మణులు పై స్తరంలో ఉండి ఆధిక్యాన్ని పొందినారు.

3. ఒక కులం వారు ఇంకొక కులం వారితో కలిసి భోజనం చేయకూడదు, వివాహాలు జరుపుకోరాదు అనే ఆంక్షలుంటాయి.

4. కొన్ని కులాలను గానీ, కుల సమూహాలను గానీ ఏర్పాటు చేయడం. మరికొన్ని కులాల వారు తమ తమ ఆధిక్యాన్ని చూపించి అనేక సదుపాయాలను, అవకాశాలను పొందడం జరుగుతుంది.

5. వ్యక్తులు కులవృత్తులు చేపడతారు. ఎవరికి తోచిన వృత్తిని వారు చేపట్టే అవకాశం ఉండదు.

6. వ్యక్తులు అంతర్వివాహాలు జరుపుకుంటారు.

కులాలను బట్టి వ్యక్తులను గుర్తించడం జరుగుతుంది. వ్యక్తి బాల్యావస్థలో, విద్యార్థి దశలో, యుక్త వయస్సులో ఎట్లా తిరగవలెను? ఎట్లా మాట్లాడవలెను? ఎట్లాంటి దుస్తులు ధరించవలెను? ఏ పని చేయవలెను? మొదలైన వాటన్నింటిలో కులాలకు కొన్ని పద్ధతులుంటాయి. అవి ఆ పద్ధతులను తమ సభ్యులకు సూచిస్తాయి. అంతేకాకుండా కులము సామాజిక, మత హక్కులు, సదుపాయాలు, వృత్తులు వీటన్నిటికీ సంబంధించిన కొన్ని నియమాలతో ఉంటుంది. వారసత్వ విషయంలోను, ఆస్తి వ్యవహారాల విషయంలోను, కులము కొన్ని పద్ధతులను సూచిస్తుంది. ఒక్క మాటలో చెప్పవలెనంటే కులము వ్యక్తులతో అన్ని వేళలా, అన్ని పనులలోను, అన్ని సంబంధాలలోను ముడివడి, అల్లుకొని ఉంటుంది.

**1. పుట్టుకతో వచ్చిన క్రమశ్రేణి:**

అంతస్తుల క్రమము కుల వ్యవస్థకు ఆయువుపట్టు. దేశంలో ఏ ప్రాంతంలోనైనా కులాలన్నీ అంతస్తుల క్రమంలోనే ఉంటాయి. ఈ కుల శ్రేణిలో ఉన్నత స్థానంలో ఉన్న కులాలు ఒకే పోలికలతో ఉండడం. అట్లే అట్టడుగున ఉన్న కులాలు ఇంచుమించు ఒకే పోలికతో ఉండడం గమనించదగిన విషయము. కానీ, ఈ విధంగా ఉన్నంత మాత్రాన ఈ కుల వ్యవస్థ దేశమంతటిలోను సర్వసాధారణత్వము, సమరూపత కలిగియున్నదనుకోవడం పొరపాటు.

నిజానికి భారతదేశంలో ఉన్న సుమారు 3000 కులాలు సరైన అంతస్తుల క్రమంలో పేర్చడం ఎవరి తరమూ కాదు. ఉత్తర హిందుస్థానంలోను, దక్షిణ హిందుస్థానంలోను ఒకే పేరు గల కొన్ని వర్గాలు ఉన్నాయి. కానీ, అంతస్తుల క్రమంలో అవి ఒకే శ్రేణిలో లేవు. ఉదాహరణకు ఉత్తర హిందుస్థానంలో గల భూస్వామ్య కులాలకున్న సముచిత స్థానము దక్షిణ భారతంలో ఉన్న భూస్వామ్య కులాలకు లేదు.

కులాల పేర్లు, వారి వివిధ అంతస్తులు దేశం అంతటా విభిన్నంగా ఉన్నా, పైన ఉన్న, అడుగున ఉన్న కులాల స్థితిని బట్టి, వర్ణ క్రమం బట్టి, మొత్తం మీద కుల నిర్మితి పోల్చవచ్చు. ఉదామరణకు దేశమంతటిలోను బ్రాహ్మణ కులాలు స్థితిపైనా, శూద్ర, పంచమ కులాల స్థితి అడుగునా ఉండడం గమనించవలెను. చారిత్రాత్మక దృష్టితో చూస్తే ఈ నిర్మితి అచేతనమైనది కాదని శాస్త్రవేత్తల అభిప్రాయము. ఈ నిర్మితి యొక్క మూల పదార్థాలైన వివిధ కులాల అంతర్నిర్మాణము చాలా సంశ్లిష్టమైన, విభిన్న పద్ధతులలో జరగడం వల్లనే మనం చూస్తూ ఉన్న కుల వ్యవస్థ చాలా సంశ్లిష్టతతో కనిపిస్తుంది.

సమాజంలోని వ్యక్తులను కుల వ్యవస్థ వివిధ స్తరాలుగా విడదీస్తుంది. ఒక్కొక్క స్తరము ఒక్కొక్క కులమని గ్రహించవలెను. వ్యక్తులు పుట్టుకతో ఏ కులానికి చెందుతారో నిర్ణయించడం జరుగుతుంది. ఒక్కసారి వ్యక్తి ఒక కులంలో జన్మిస్తే, చనిపోయే వరకు అతడు ఆ కులానికి చెందిన వాడవుతాడు. అతని వృత్తి, అతని పండుగలు, మతము, ఇల్లు, బంధువర్గము, వ్రతాలు, ఆచారాలు, సంప్రదాయాలు మొదలైనవి అతనికి పుట్టుకతోనే నిర్ణయమై ఉంటాయి.

హిందూ మతము క్రమశ్రేణిలో ఉన్న మత వ్యవస్థను కర్మ సిద్ధాంతములో ముడివేస్తుంది. అంటే వ్యక్తులు తమ తమ పూర్వజన్మ సుకృతం ద్వారా ఎవరు ఏ కులంలో తిరిగి జన్మిస్తారో నిర్ణయమవుతుంది. అందువల్లనే కొందరు ఎక్కువ కులంలో జన్మించి కుల క్రమశ్రేణిలో పై అంతస్తును, కొందరు తక్కువ కులంలో జన్మించి కుల క్రమశ్రేణిలో తక్కువ అంతస్తులను కలిగి ఉంటారు.

హిందూ సమాజ కుల క్రమశ్రేణిలో మొదటి స్థానాన్ని బ్రాహ్మణులు, తరువాత స్థానాలు వరుసగా క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు కలిగియున్నారు.

**2. సాంఘీక వర్గీకరణ:**

హిందూ సమాజము అనేక కులాలుగా విభజన చెందింది. వ్యక్తులు వారి సంపూర్ణ జీవితాన్ని ఈ కులాలలోనే గడుపుతారు. కులాలలో సభ్యత్వము స్వచ్ఛంధము కాదు. పుట్టుక వ్యక్తి సభ్యత్వాన్ని నిర్ణయిస్తుంది. ఆ వ్యక్తి అదే కులంలో పెరిగి పెద్దవాడై చనిపోవలసి ఉంటుంది. అందులో సభ్యత్వము నిర్బంధము.

**3. అంతర్వివాహము:**

పుట్టుకతో సబ్యత్వము పొంది, అంతర్వివాహాన్ని నిర్దేశించే, సమూహాల క్రమశ్రేణిని కుల వ్యవస్థ అని పేర్కొంటాము. వ్యక్తి పుట్టుకతోనే ఏదో ఒక కులానికి చెందియుంటాడు. ఒక కులంలో జన్మించిన వ్యక్తి ఆ కులంలోనే పెరిగి, పెద్దవాడై మరణించవలెను గానీ, ఇతర కులాలలోనికి మారకూడదు. ప్రతి కులము కొన్ని శాఖలుగా (ఉపకులాలు) రూపొందింది. ఈ కులాల వారు తమ కులాలలోని వారినే వివాహమాడాలి. ఇతర కులాల వారిని వివాహమాడరాదు. కనుక కులము అంతర్వివాహ సమూహము. ఈ అంతర్వివాహ విధానము కుల వ్యవస్థకు జీవం వంటిదని వెస్టర్ మార్క్ (Wester Mark) పేర్కొన్నాడు. ఇతర శాఖలు లేక కులాలలో వారిని వివాహమాడితే కులం నుంచి వెలివేయబడతారు. భారతదేశ సమైక్యము ఈ అంతర్వివాహ విధానంలోనే ఉన్నదని రస్సెల్ (Russel) భావించినాడు. కులం అంతర్వివాహ సమూహమైతే గోత్రం బహిర్వివాహ సమూహము. కులాలు అంతర్వివాహాలను ప్రోత్సహిస్తే గోత్రం బహిర్వివాహాలను ప్రోత్సహిస్తుంది. గోత్రాలలో అంతర్వివాహాలు నిషిద్ధం. సగోత్రులు అనగా ఒకే గోత్రం గలవారు వివాహాలు చేసుకోరాదు. వారు అన్నా, చెల్లెళ్లుగా పరిగణించబడతారు. వర్గానికి, కులానికి గల ముఖ్యమైన తేడా వివాహ విషయంలోనే. వర్గము బహిర్వివాహ సమూహము, మరియు అంతర్వివాహ సమూహము కూడా. కానీ, కులం కేవలం అంతర్వివాహ సమూహము కూడా. ఒక వర్గము వారు ఆ వర్గములోని వారిని వివాహమాడవచ్చు లేదా మరొక వర్గములో వారిని వివాహమాడవచ్చు. ఉదా: ఒక డాక్టరు తన కుమార్తెను వేరొక డాక్టరుకు ఇచ్చి వివాహం చేయవచ్చును లేదా వేరొక వర్గములోని వాడైన ఇంజనీరుకు ఇచ్చి వివాహము చేయవచ్చును. కుల నంబంధన వివాహ విషయంలో ఈనాటికీ ఖచ్చితముగా పాటింపబడుతున్నది చెప్పవచ్చును. ప్రేమ వివాహాలు తప్ప, పెద్దలు కుదిర్చి చేయు వివాహాలన్నీ అంతర్వివాహ సమూహములే. ఏ వ్యక్తి అయినా ఈ నిబంధనను ఉల్లంఘిస్తే కుల బహిష్కరణ, అపరాధం మొదలైన శిక్షలుంటాయి.

**4. ఆహార అటవాట్లకు సంబంధించిన నిబంధనలు:**

హిందూ కుల వ్యవస్థ కులాలకు ఆహార అలవాట్లకు సంబంధించిన నియమాలను కూడా నిర్దేశించింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు ఏయే ఆహారాలు తీసుకోవాలో వివరించింది. హిందూ కుల వ్యవస్థలో ప్రతి వ్యక్తీ కూడా ఎట్లాంటి ఆహారం, పానీయం ఎవరి దగ్గర స్వీకరించవచ్చునో, ఎవరి దగ్గర స్వీకరించకూడదో స్పష్టంగా, సూటిగా సూచించడం జరిగింది. కానీ, ఈ నియమాలలో ఒక ప్రాంతానికి, మరొక ప్రాంతానికి చాలా వ్యత్యాసముంది. కొన్ని రకాల ఆహార పదార్థాలను కొన్ని కులాల వారు తీసుకోకూడదని నిబంధనలు ఉన్నాయి. బ్రాహ్మణులు, వైశ్యులు శాకాహారాన్ని మాత్రమే భుజించాలి. క్షత్రియులు, శూద్రులు శాకాహారాన్ని, మాంసాహారాన్ని కూడా బుజించవచ్చును. అంతేకాక తమ కులస్తులతో మాత్రమే సహపంక్తి భోజనం చేయాలి.

ఆహార నియమాలను బట్టి కులాలను అయిదు సమూహాలుగా విభజించవచ్చు. ఒకటవది ద్విజులు, రెండవది ఏ కులాల నుంచైతే ద్విజులు పక్కా ఆహారం స్వీకరిస్తారో అది. మూడు ఏ కులాల నుంచైతే ద్విజులు నీరు తప్ప ఇంకేమీ స్వీకరించరో అది. నాలుగు అంటరాని కులాలు కాక బ్రాహ్మణులు నీరు కూడా స్వీకరించని వేరే కులాలు. అయిదు ఎవరిని తాకితేనే మలినమైపోతారో వారు (అంటరాని కులాల వారు).

ఇక్కడ ఆహారాన్ని 'పక్కా' 'కచ్చా' అని రెండు విధాలుగా విభజించినారు. పక్కా ఆహారమంటే నీరు, నెయ్యితో వండిన వంటకారు. కచ్చా ఆహారమంటే నీటితో మాత్రమే చేసిన వంటకాలు. దాదాపు అన్ని కులాలు బ్రాహ్మణుల నుంచి 'కచ్చా' ఆహారాన్ని స్వీకరిస్తారు. కానీ, బ్రాహ్మణులు మాత్రం తమ కులస్థుల నుంచి తప్ప ఇంకెవరి దగ్గరా 'కచ్చా' ఆహారాన్ని స్వీకరించరు.

హట్టన్ దృష్టిలో ఆహార నియమాలే కుల వ్యవస్థకు మూలాధారము. సామాన్యంగా ఒక కులం వారు వారి కులస్థుల వంటనే భుజించవలెననే సూత్రం బహుశః కులాలలో అంతర్వివాహాలకు దారితీసి ఉండవచ్చు. దాని వల్లనే కులానికీ, కులానికీ మధ్య అడ్డుగోడలు ఏర్పడినవి. ఆహార పానీయ నియమాలలో కులాలు అంతస్తుల క్రింద విభజన పొందినవి. సాధారణంగా ఒక కులం పరిశుద్ధమైనది అంటే అది అగ్రకులాలలో ఒకటి అని అర్థము. దీనికి పరీక్ష ఏమంటే మిగతా అగ్రకులాల వారు వారి నుంచి మంచినీళ్లు త్రాగుతారు. ఉత్తర భారతదేశంలో చాలా శూద్ర కులాల నుంచి అగ్రకులాల వారు మంచినీళ్లు త్రాగుతారు. దక్షిణ భారతదేశంలో పశ్చిమ ప్రాంతంలో ఏ కులం వారు ఆ కుల సభ్యుల నుంచి గాని లేదా ఎక్కువ కులం వారి నుంచి గాని మంచినీళ్లు త్రాగుతారు. గంగా జలము ఏ కులం వారి నుంచి అయినా త్రాగవచ్చునని నమ్మకము.

కులాల మధ్య పంక్తి భోజన నియమాలు, మంచినీరు ఇచ్చిపుచ్చుకోవడం కన్న కఠినంగా ఉంటాయి. భోజనం విషయంలో ఎవరు వడ్డించినారో కన్నా, ఎవరు వండినారో ముఖ్యము. ఒక్కొక్కప్పుడు ఆహారాన్ని అన్యకులస్తులు చూసినట్లయితే భుజించకుండా పారేస్తారు. ఒ కులంలోని ముఖ్యంగా ఒక గోత్రం వారికి పంక్తి భోజనాలు తప్పకుండా ఉంటాయి. అంతేకాక వివాహాలు చేసుకోదగ్గ గోత్రాల వారితో కూడా పంక్తి భోజనాలు ఉంటాయి. 'బ్లంట్' అభిప్రాయంలో ఈ పంక్తి బోజనాలు బహిర్గత వివాహాలు చేసుకోవడంతో వచ్చినవి. ఎందుచేతనంటే వివాహానంతరము వారు బంధువుల కావడంతో వారి పంక్తిని బోజనము చేయడం తప్పనిసరి అవుతుంది. ఏది ఏమైనా కుల సముదాయాల మధ్య పంక్తి భోజనాలు తప్పనిసరిగా ఉంటాయి.

వివిధ కులస్తులు జట్టుగా గ్రామాంతరము వెళ్లినప్పుడు ప్రతి కులం వారు ఎవరికి వారుగా పొయ్యి పెట్టి వండుకోవడం సామాన్యము. బ్రాహ్మణ కులంలో వంట వండేటప్పుడు చాలా ఆచారాలను పాటిస్తారు. కొన్ని కులాలలో బోజనం చేసేటప్పుడు ఇంకొకరు చూడకూడదు.

కులాల మధ్య ఆహార నియమాలతోపాటు వంటకు వివిధ కులాల వారు ఏ రకపు వంట సామాగ్రి ఉపయోగించడమో కూడా నిర్ణయించడమైనది. మట్టి పాత్రలు ఉపయోగించుట అగ్రకులాలన్నింటికి నిషేధము. దీనికి ముఖ్య కారణము ఆ సామాగ్రిని శుద్ధి చేయుట కష్టము. ఎటువంటి ఆహారాన్ని వివిద కులాల వారు తినవచ్చునో కూడా నిర్ణయించడమైనది. కొన్ని కులాలు సాంప్రదాయకంగా శాకాహారులు. కానీ, వాళ్లలో మతాన్ని పురస్కరించుకొని మళ్లీ బేదాలున్నాయి. వైష్ణవులు సాధారణంగా శాకాహారాన్ని తింటారు. కానీ, కొందరి విషయంలో శై, వక్తి మతాల వారు మాంసాహారాన్ని తిన్నా తప్పులేదు. చేపలను తినడంలో

కూడా ఒక ప్రాంతానికి, ఇంకొక ప్రాంతానికి భేదం ఉన్నది. బెంగాల్‌లో బ్రాహ్మణ కులాలు కూడా చేపలు తింటారు. కానీ, ఎడారి ప్రదేశం అయిన రాజస్థాన్‌లో చేపలు తినడం హీనంగా చూస్తారు. బ్రాహ్మణ కులాలు శాకాహారులైనా కొన్ని రకాల కూరలను తినడం నిషేధము. ఉదాహరణకు క్యాబేజీ, క్యారెట్టు, బీట్‌రూట్, ఉల్లి, వెల్లుల్లిలను కొన్ని అగ్రకులాల వారు భుజించరు.

**5. సాంఘీక ఆంక్షలు:**

సమాజాన్ని వివిధ స్తరాలుగా విభజించినారు. స్పష్టమైన సామాజిక క్రమము కులాలలో ఉంది. సాంఘీక వర్ణ క్రమంలో బ్రాహ్మణుడు ప్రథమ స్థానమాక్రమించినాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశము లేదు. ఇతర కులాల వారితో కలిసి బావిలో నీరు తోడుకోకూడదు. భోజనము, సాంఘీక ప్రక్రియల వంటి కొన్ని విషయాలపైన తీవ్రమైన నిబంధనలు కలవు.

మలినం ఆహార పదార్థాల ద్వారానే కాకుండా స్పర్శ ద్వారా కూడా వస్తుందని హిందువులలో ఒక అభిప్రాయం కలదు. ఇది క్రింది కులస్థులను స్పర్శిస్తే వస్తుంది. అంతే కాకుండా కొంత మంది ప్రత్యేక వ్యక్తుల ద్వారా కూడా స్పర్శ మలినం వస్తుంది. వారు ఎవరింటే బహిష్టు స్త్రీలు, ప్రసవమయిన స్త్రీలు (కొంత కాలం వరకు), తలకు కొరివి పెట్టిన వ్యక్తులు (ఉత్తర క్రియ అయ్యే వరకు) మొదలయినవారు.

దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో దూర మలినం కూడా గుర్తించడమైనది. కొన్ని కులాల వ్యక్తులు దగ్గరున్నంత మాత్రాన మలినమయి పోయినట్లేనని కొందరు భావిస్తారు. వారు కొన్ని అగ్రకులాల వ్యక్తుల దగ్గరకు కానీ, దేవాలయాల దగ్గరకు కాని రావడం నిషిద్ధం. కేరళలో నాయర్‌ల దగ్గరకు ఉయా కుల వ్యక్తి 12 అడుగులలోపు, పాన్ 3, 4 అడుగుల లోపు, పులియ 96 అడుగుల దూరం లోపు కాకూడదు. ఆ వ్యక్తి పొరపాటున బ్రాహ్మణులనెవరినయినా తాకితే అతను వెంటనే స్నానం చేసి, పవిత్రమైన మత గ్రంథాలు చదవాలి. ఈ నిబంధనల వల్ల కొన్నిసార్లు పులియ వంటి క్రింది కులస్థులు గ్రామ మార్గాల్లో దగ్గర వాటిని వదలి చాలా దూర మార్గాలను అనుసరించవలసి వస్తుంది. కేరళలో అగ్రకులాల వారు స్నానం చేసే చెరువులో నీరు నాయిడీ కులస్థులు తాకితే అది అపరిశుద్ధమవుతుంది. అగ్రకులం వారు ఎవరైనా నాయాడి కులస్థుల వల్ల మైలపడితే వారు ఏడు చెరువులలో స్నానం చేసి, చిటికెన వేలు నుంచి కొంత రక్తం పైకి తీస్తే వారు పరిశుద్ధులవుతారు. డిసెంబరు 24, 1932 హిందూ వార్తా పత్రికలో ఒక విలేఖరి వ్రాసిన ప్రకారము "తిరునల్వేలి'' జిల్లాలో 'పురధవనన్'' అనే కులస్థులను అగ్రవర్ణాల వారు చూడకూడదు. ఈ "పురధవనన్'' కులస్థులు అంటరాని వారి యొక్క బట్టలు ఉతుకుతారు. అందువల్ల వీళ్లు రెండు విధాలుగా అంటరాని వాళ్లు. వీళ్ల తమను చూడడం వల్ల అన్య కులస్థులు మైలపడకుండా ఉండడానికి అర్థరాత్రివేళ తమ పనులు చూసుకొంటారుట.

సంప్రదాయకంగా అగ్రవర్ణాల వారు ఉపయోగించే నూతులు అంటరాని కులాల వారు ఉపయోగించరాదు. ఈ కులాల వారు ఎప్పుడైనా వారి హక్కులను స్థిరం చేసుకోవడానికి అగ్రకులాల వారు ఉపయోగించే నూతులను ఉపయోగిస్తే అగ్రకులాల వారు వీరివల్ల మైలుపడిన నూతుల నుంచి నీరు త్రాగడం మానివేయడం జరుగుతుంది. దేవాలయాల దగ్గర కూడా ఈ అంటరాని కులాల వారు కొంత దూరంలో ఉండవలెననే ఆంక్షలున్నాయి. కులం యొక్క స్థితిని బట్టి వారుండవలసిన దూరం నిర్ణతమయినది. ఉదాహరణకు 'ఇరవాన్' కులస్థులు "గురువాయూర్'' దేవాలయ ప్రాంగణపు గోడలకు 325 అడుగుల దూరంలో ఉండవలెను. తిరువాన్కూరులో "సుచీంద్రం'' కోవెలను ఆనుకొని ఉన్న రహదారిని అంటరాని కులాల వారు ఉపయోగించకూడదని నిషేధించినారు.

ఒక కుటుంబంలో జనన మరణాల వలన రక్తసంబంధీకులందరూ మైలను ఆచరించుటలోను, పాటించుటలోను కూడా కులానికీ, కులానికీ మధ్య వ్యత్యాసాలున్నాయి. దక్షిణ భారతదేశంలో శిశువు జన్మించినప్పుడు జనన అశుచి బ్రాహ్మణులలో 10 రోజులు, క్షత్రియ కులాలలో 11 రోజులు, నాయర్ కులంలో 15 రోజులు, కురిచ్చియన్ కులంలో 28 రోజులు పాటించవలెను.

శ్వాస, నిశ్వాసల ద్వారా కూడా మలిన ప్రదానం కావచ్చు కాబట్టి రాజ సేవకులు, దేవాలయాలలో పనిచేస్తున్న క్రింది కులస్థులు నోటికి, ముక్కుకు అడ్డంగా గుడ్డ కట్టుకోవాలి. పై వివరణ వలన కులాల మధ్య సామాజిక సంబంధాలు కఠినతరమైనవని చెప్పవచ్చును.

**6. కుల వృత్తులు నిర్ణయింపబడుట:**

ఒక వ్యక్తి ఏ కులానికి చెందుతాడు అనేది అతని పుట్టుకను బట్టి ఆధారపడి ఉంటుంది. కులాన్ని బట్టే అతని అంతస్థు కూడా నిర్ణయింపబడుతుంది. ఒక వ్యక్తి యొక్క వృత్తి అతనికి వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. కుల వ్యవస్థ వ్యక్తులకు వివిధ అంతస్తులను ఆపాదించుటతో పాటు వివిద రకాల వృత్తులను కూడా నిర్ణయించింది.

కులం ప్రాతిపదిక మీద హిందూ సమాజము బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అను నాలుగు స్తరాలతో కూడుకొని ఉన్నది. ఈ నాలుగు స్తరాలను చాతుర్వర్ణ్యాలు లేదా నాలుగు కులాలుగా భావిస్తున్నారు. సిద్ధాంత రీత్యా కులాలు నాలుగే అయినప్పటికీ ఆచరణలో అయిదు కులాలు ఉన్నట్లు చెప్పవచ్చును. హరిజనులుగా వ్యవహరిస్తున్న వారందరినీ అయిదో స్తరంలోకి చేర్చినారు. ఈ ప్రధానమైన కులాలు క్రమక్రమంగా అనేక కారణాల వలన కొన్ని వందల కులాలుగా రూపొందినాయి. సాంప్రదాయక హిందూ సమాజంలో వివిధ కులాలకు చెందిన వ్యక్తులకు వివిధ ప్రకార్యాలు, వృత్తులు ఉన్నాయి.

బ్రాహ్మణులకు వేదాలను అధ్యనం చేయడం, బోధించడం, యజ్ఞాలు చేయడం, చేయించడం, దానం చేయడం, దానం పుచ్చుకోవడం మొదలైన ప్రకార్యాలు ఉండేవి. ప్రజలను కాపాడడం, రాజ్య పరిపాలన చేయడం, దానాలు చేయడం మొదలైన ప్రకార్యాలు క్షత్రియులకు ప్రత్యేకంగా ఉండేవి. పశువులను కాపాడడం, వాణిజ్యం, వ్యవసాయం వంటి ప్రకార్యాలను వైశ్యులు నిర్వర్తిసు&ండేవారు. వ్యవసాయ వృత్తులు శూద్రులకు అప్పగించే వారు. గ్రామ పారివుధ్యాన్ని కాపాడడంలో హరిజనులు తోడ్పడుతుంటారు. ఈ విధంగా సమాజానికి కావలసిన ప్రకార్యాలను ఈ కులాలు నిర్వహిస్తుండేవి. వివిధ ప్రకార్యాలను నిర్వహించుటలో ఒక కులం వారు మిగతా కులాల వారికి తోడ్పడుతుండేవారు. వృత్తి నిర్వహణలో అన్ని కులాలకు సమానమైన బాధ్యతలున్నాయి.

వృత్తులను సమన్వయం చేస్తూ స్తరీకరణం జరగడం అన్ని సమాజాలలో ఉన్నప్పటికీ, ఈ విధమైన స్తరీకరణాన్ని జన్మతో ముడివేయడం హిందూ సమాజ ప్రత్యేకత అని చెప్పవచ్చు. వృత్తిని జన్మతోనే ముడివేయుట వలన వృత్తులకు పోటీ ఉండదు. వృత్తి నిర్వహణ వ్యక్తి అర్హతలను బట్టి కాక, కులం మీద ఆధారపడి ఉండడం వలన, ప్రతి కులానికీ కొన్ని వృత్తులు కేటాయించి ఉండడం వలన, వ్యక్తికి వృత్తి పరమైన అభద్రతా భావముండదు. వృత్తులు, వంశపారంపర్యంగా వచ్చేవి. కనుక వ్యక్తులలో వృత్తి నైపుణ్యం పెరుగుతుండేది. కుల వృత్తులను పాటించడం వ్యక్తి ధర్మంగాను, సామాజిక ధర్మంగాను చెప్పడం చేత వివిధ వృత్తులను అనుసరించే వారిని గౌరవించడం జరిగేది.

**7. మత సంబంధమైన ఆమోదాలు:**

కుల వ్యవస్థ హిందూ మతం యొక్క ఆమోదాలపై ఆధారపడి ఉంది. హిందూ మత వర్ణాశ్రమ ధర్మాలు వ్యక్తులకు కొన్ని ధర్మాలను, విధులను, ప్రమాణాలను సూచిస్తాయి. హిందూ మతానికి చెందిన ఏ వ్యక్తి అయినా, తన కులానికి చెందిన విధులను, ధర్మాలను నిర్వర్తించవలెను. ఉదాహరణకు మహాభారత యుద్ధంలో అర్జునుడు తన మిత్రులను, బంధువులను, గురువులను వధించడానికి సంశయిస్తుంటే, కృష్ణుడు క్షత్రియ ధర్మాన్ని నొక్కి చెప్పి యుద్ధం చేయడానికి అర్జునుని కర్తవ్యోన్ముఖుని చేసినాడు.

కుల వ్యవస్థ అనేది హిందూ మతంలో ఒక భాగం. మత విధుల్ని నిర్వహించుటలోను, మతాచారాలను కాపాడుటలోను కుల వ్యవస్థ కీలకమైన పాత్ర వహిస్తుంది. హిందూ మత ధర్మాలను కుల వ్యవస్థ సంరక్షించుటతోపాటు హిందూ మత పవిత్రతను కూడా కాపాడుతుంది.

**8. ఆరోపించిన అంతస్థు:**

హిందూ సమాజంలో ఒక్కొక్క కులానికి ఒక్కొక్క అంతస్థు ఇవ్వబడింది. ఒక వ్యక్తి ఒక కులంలో జన్మించినప్పుడు, సమాజంలో అప్పటికే ఆ కులానికి ఉన్న అంతస్థు అతనికి వస్తుంది. ఒక వ్యక్తి యొక్క ప్రమేయం ఏమాత్రం లేకుండా, అతనికి సమాజంలో కుల అంతస్థు ఆరోపించబడుతుంది. ఈ కుల అంతస్థు ఏమాత్రం అతని ప్రమేయము, జోక్యము లేకుండా

అతనికి ఆపాదించబడుతుంది. ఈ విధంగా ఆరోపించిన లేదా ఆపాదించబడిన అంతస్థు ఒక వ్యక్తికి అతని జీవిత పర్యంతము వెనువెంటే ఉంటుంది. ఈది మార్పుశక్యము కానిది.

**9. సంస్కృతి పరిరక్షణ:**

ప్రతి కులానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు సాంఘీక విలువలూ ఉంటాయి. ఇవి ఒక తరం నుంచి మరొక తరానికి సామాజికంగా సంక్రమిస్తాయి. ఒక్కొక్క కులము ఒక్కొక్క ప్రత్యేక సాంస్కృతిక విభాగము లేదా సమూహము. ఈ సంస్కృతిని పరిరక్షించుట ప్రతి కులము యొక్క బాధ్యత. ఒకే కులమునకు చెందిన వ్యక్తులు వేర్వేరు ప్రాంతాలలో నివసిస్తున్నట్లయితే, వారి మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు ఉంటాయి. హిందూ సంస్కృతి వివిధ కులాల సంస్కృతుల సమ్మేళనం. ఈ హిందూ సంస్కృతిని స్థిరంగా ఉంచే విధిని కులాలే నిర్వర్తిస్తాయి.

**10. శ్రమ విభజన:**

ఒక్కొక్క కులానికి ఒక్కొక్క ప్రకార్యమును కేటాయించుట ద్వారా సమాజము శ్రమ విభజన సూత్రాన్ని పాటించినదని చెప్పవచ్చు. కుల వ్యవస్థ యొక్క ప్రధాన విధి సమాజంలో శ్రమ విభజనను సృష్టించుట. వివిదకులాలకు వివిధ రకాలైన వృత్తుల్ని ప్రసాదించిన కుల వ్యవస్థ శ్రమ విభజనా యంత్రాంగంగా పనిచేస్తుంది. ఒక వృత్తిని బాల్యము నుండి చేయడం వలన వృత్తి నైపుణ్యం పెరుగుతుంది. తమ తమ కులాల విధుల్ని నిర్వర్తించుటలో ప్రతి కులం వారు మరొక కులంతో సన్నిహితము, సామరస్య పూరితమైన పర్సర సహకారాన్ని పొందుతారు.

**11. సాంఘీక భద్రత - నియంత్రణ:**

కుల వ్యవస్థ తన సభ్యులకు భద్రతను కలుగజేస్తుంది. కుల సభ్యులకు ఆపద వచ్చినా, నిస్సహాయుడుగా ఉన్నా, ఆ కులాలలోని వారందరూ ఐకమత్యంగా ఉండి ఆదుకుంటారు. ఒక వ్యక్తి కష్టాలలో ఉన్నప్పుడు సహాయపడవలసిన బాధ్యత అతని కులానికి సంబంధించిన మిగిలిన సభ్యులకు ఉంటుంది. కుల వ్యవస్థ భద్రతను ప్రసాదించుటతో బాటు వ్యక్తి ప్రవర్తనను కూడా అదుపులో పెడుతుంది. ప్రతి కులానికి కొన్ని నిబంధనలు ఉంటాయి. ఈ నిబంధనలు ఆ కుల సభ్యుల ప్రవర్తనను అదుపులో పెట్టుట వలన కుల వ్యవస్థ సాంఘీక నియంత్రణా యంత్రాంగంగా పనిచేసి, సమాజానికి మేలు చేకూరుస్తుంది.

**12. కుల సంఘాలు:**

ప్రతి కులానికి ఒక సంఘముంటుంది. ఈ కుల సంఘాలు కుల నిబందనలను పరిరక్షిస్తుంటాయి. కులములోని వ్యక్తుల ప్రవర్తనను నియంత్రిస్తుంటాయి. కుల సంస్కృతిని కాపాడతాయి. కుల వ్యక్తులకు రక్షణను, భద్రతను కల్పిస్తాయి.

కుల సంఘాలు కులానికి సంబంధించిన బాధ్యతను వహిస్తాయి. కులంలోని సభ్యులు పాటించవలసిన నియమాలను, నిబంధనలను ఈ సంఘాలు నిర్ణయిస్తాయి. ఈ నియమాలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులు. కుల సంఘాలు చిన్న ప్రాంతాలలో ఉంటాయి. కులం కీర్తికి గాని, భద్రతకు గాని భంగం కలిగించే ఏ విషయంలోనైనా కుల సంఘాలు సభలను నిర్వహించవచ్చును. మామూలుగా కుల సంఘాల దృష్టికి వెళ్లే నేరాలు ఆహార పానీయాల నిషేధాల ఉల్లంఘన, వివాహ నియమాల ఉల్లంఘన, మత నియమాల ఉల్లంఘన (గోహత్య, బ్రాహ్మణుని అవమానించుట మొదలైనవి), కులాచారాలను పాటించకపోవుట, కుల ఆర్థిక చర్యలకు వ్యతిరేకమైన పనులు చేయడం మొదలైనవి.

కుల సంఘాలు నిర్వహించడానికి కొన్ని ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. వాటిలో ఇచ్చే సాక్ష్యం ప్రమాణం చేసి ఇవ్వాలి. సాధారణంగా ఈ ప్రమాణాలు గంగా జలం మీద గాని, తులసి మొక్క పైన గాని, దేవుడి పైన గాని చేస్తుంటారు. నేరస్థుడు తను నేరం చేసి కూడా నేరం అంగీకరించకపోతే మరుగుతున్న నూనెలో చేతిని ముంచడం చెయ్యాలి.

కుల సంఘాలు సాధారణంగా కులంలో నుంచి వెలివేయడం, జరిమానా విధించడం, దెబ్బలు కొట్టడం మొదలైన శిక్షలు విధిస్తాయి. ఒక్కొక్కసారి నేరస్థులకు నీరు ఇవ్వకపోవడం, కచ్చా ఆహారం ఇవ్వకపోవడం, అతని నుంచి అవి ఎవ్వరూ స్వీకరించకపోవడం లాంటి శిక్షలు కూడా వేస్తుంటారు. నేరస్థునికి బ్రాహ్మణులు పౌరోహిత్యం చేయరు. మంగళలు క్షురకర్మ

చేయరు. చాకలలు బట్టలు ఉతకరు. ఒకవేళ అతను చనిపోయినా దహన కాండలు మిగిలిన కుల సభ్యులకు జరిగినట్లు జరుగవు. ఈ విధమైన శిక్షలు కుల బహిష్కరణతో సమానంగా స్పష్టంగా చెప్పకపోయినా, అవి వాటితో సమానమే.

క్రింది కులాల సంఘాలు అగ్రకులాల వాటికన్నా ఎక్కువగా క్రమపద్ధతిలో ఉంటాయి. అపరాధం చెల్లించడం, విందు చేయడం వలన తక్కువ కులాల వారి అపరాధాలు క్షమించబడతాయి. కొన్ని నేరాలను తొలగించుకోవాలంటే గంగానదిలో స్నానం చేయడం మొదలైనవి చేయాలి. సాధారణంగా శిక్ష తరువాత నేరస్థుల కులంలో మామూలు సభ్యులవుతారు.

**13. కుల వ్యవస్థ-పుట్టు పూర్వోత్తరములు:**

కుల వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను గురించి చెప్పే వారినందరినీ మూడు రకాలుగా విభజించవచ్చును. తమ పరిశోధనల ద్వారా ఎంతో కృషి చేసి సరిఅయిన నిదర్శనాలు కనబడకపోవడం వల్ల దాని పుట్టుక తెలుసుకోవడం సాధ్యపడే విషయం కాదని చెప్పేవారు మొదటి రకానికి చెందినవారు. కుల వ్యవస్థ పుట్టుకకు సంబంధించి వాస్తవాన్ని ఎట్లాగైనా తెలుసుకోవాలనే కుతూహలంతో తమ పరిశోధనలు కొనసాగించే వారు రెండో రకానికి చెందిన వారు. కులాల పుట్టుకను గురించి వాస్తవిక దృక్పథం లేకపోయినప్పటికీ ఊహా కల్పితాలైన అభిప్రాయాలతో తమ పాండిత్యాన్ని ఏదో ఒక విధంగా ప్రదర్శించవలెననే కోరిక గలవారు మూడో రకానికి చెందినవారు. కుల వ్యవస్థ పుట్టుక మీద ఈనాడున్న సిద్ధాంతాలలో మూడో రకపు సిద్ధాంతాలే ఎక్కువ. ఈ సిద్ధాంతాలు శాస్త్రీయ దృక్పథానికి దూరంగా ఉన్నాయి.

కుల వ్యవస్థ ప్రాతిపదికను తెలుసుకోవాలనే అభిలాష ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కుల వ్యవస్థ యొక్క సమగ్ర చరిత్రను వ్రాయడం ఈనాడు సాధ్యపడే విషయం కాదు. హిందూ మతాన్ని గురించి, హిందూ సనాతన ధర్మాల స్వరూపాన్ని గురించి, ఈనాడు మనలో చాలా మందికి అధికారికంగా తెలియదు. మన ప్రాచీన శాస్త్రాలలో మరుగుపడి ఉన్న అనేక విషయాలను మనము సమగ్రంగా తెలుసుకోలేని స్థితిలో ఉన్నాము. అందువల్ల ప్రాచీన హిందూ సమాజంలో ఉన్న కుల వ్యవస్థ ఈనాడు మనకు కనబడుతున్న రూపంలో ఉన్నదా? లేదా? దీనికి భిన్నమైన రూపంలో ఉన్నదా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం మనకు ఇదమిత్థంగా తెలియకపోయినప్పటికీ, మన ముందు ఉన్న కొన్ని ఆధారాలను నిష్పాక్షికమైన దృష్టితోను, శాస్త్రీయమైన పద్ధతిలోను పరిశీలించడం ద్వారా చరిత్రను కొంత వరకు పునర్నిర్మించుకోవచ్చును. అట్లాంటి ప్రత్యక్ష ఆధారాలు పరిశీలన ద్వారా కుల వ్యవస్థ ఏ కాలంలో ఏ రూపంలో ఉండేదో తెలుసుకోవచ్చు.

కుల వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను పరిశీలించే ముందు ముఖ్యంగా రెండు విషయాలను గమనించాలి.

1. హిందూ మతానికి, హిందూ సమాజానికి వర్ణాశ్రమ ధర్మాలే పునాది వర్ణధర్మాలు సమిష్టి జీవనానికి సంబంధించినవి. ఆశ్రమ ధర్మాలు వ్యష్టి జీవనానికి సంబంధించినవి. వ్యష్టి సమిష్టుల పరిపూర్ణతయే హిందూ సమాజ లక్ష్యము. అట్లాంటి ధర్మాలకు సంబంధించినదే కుల వ్యవస్థ. కుల వ్యవస్థకు సంబంధించిన నియమాలను, సూత్రాలను మామూలు వ్యక్తులు కాకుండా, విమర్శన శక్తి, దూరదృష్టి ఉన్న మునులు, మహర్షులు, అవతార పురుషులు రూపొందించినారని చెబుతారు. సూత్రాలను, నియమాలను రూపొందించడమే కాకుండా అవసరమైనప్పుడు వాటిని సవరించడం, రద్దు పరచడం కూడా వారు చేసే వారు. కుల వ్యవస్థ అన్ని కాలాలలోను ఒకే విధంగా ఉండదని చెప్పినారు. యుగాన్ని బట్టి, పరిస్థితులను బట్టి ప్రజాభిప్రాయాన్ని బట్టి, కుల వ్యవస్థలకు సంబంధించిన నియమాలు మార్పు చెందుతాయని ఋషులు స్పష్టం చేసినారు. ఇంత వివరించినప్పటికీ, పాశ్చాత్య శాస్త్రవేత్తల ఆలోచనా రీతులలో ప్రభావితమైన వారు కుల వ్యవస్థలో గతిశీలత లేదనీ, అది పూర్తిగా నిరుపయోగమైన వ్యవస్థ అనీ, దాని ఆధారంగా రూపొందించిన భారతీయ సమాజము మార్పు చెందదని చెప్పడం సమంజసం కాదు.

2. ఏ సామాజిక వ్యవస్థ అయినా పరిణామం చెందుతుందే గాని క్రొత్త సృష్టి జరుగదు. అదే విధంగా కుల వ్యవస్థ కూడా మిగిలిన సామాజిక వ్యవస్థల మోస్తరుగానే పరిణామం వలన ఏర్పడినదే గాని, సృష్టించినది కాదు. కుల వ్యవస్థ గతానుగతికంగా మార్పు చెందుతూ ఈనాటి రూపాన్ని ధరించిందనే విషయాన్ని ముఖ్యంగా గుర్తుంచుకోవలెను. అనేక శతాబ్దాలుగా భారతదేశంలో కుల వ్యవస్థ ఉండడాన్ని బట్టి చూస్తే దాని ప్రాతిపదికన భారతీయ సామాజిక వ్యవస్థలోనే ఉందనే విషయము నిస్సందేహము.

ఈ కుల వ్యవస్థ పుట్టుకను గురించి అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. అవి:

1. మత పరమైన సిద్ధాంతము

2. వృత్తి సిద్ధాంతము

3. జాతి సిద్ధాంతము

4. సంస్కార సిద్ధాంతము

5. భౌగోళిక సిద్ధాంతము

**1. మత పరమైన సిద్ధాంతము:**

చతుర్వర్ణాలు కుల వ్యవస్థకు మూలమైనవి. చతుర్వర్ణ వ్యవస్థ దైవ నిర్మితాలని హిందువుల నమ్మకము. చతుర్వర్ణాల ప్రసక్తి హిందూ మత ప్రాచీన సాహిత్యంలో చాలా చోట్ల కన్పిస్తుంది. కుల వ్యవస్థ, దాని పరిణామ వికాసాలను గురించిన ప్రస్తావన మనుసంహితలో ఉంది. చతుర్వర్ణాలను సృష్టికర్త అయిన బ్రమ్మ ఏర్పరచినాడని హిందూమతం వివరిస్తుంది. మను సంహిత బ్రాహ్మణులు సృష్టికర్త నోటి నుంచి, క్షత్రియులు భుజాల నుంచి, వైశ్యులు తొడలు నుంచి, శూద్రులు పాదాల నుంచి పుట్టినారని వివరిస్తుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు శగవంతుని నిర్దేశాలని ఋుగ్వేదంలో పురుష సూక్తం కూడా వివరిస్తుంది. కుల వ్యవస్థను, కుల దర్మాలను భగవంతుడే నిర్ణయించినట్లు భగవద్గీతలో ఉన్నది.

చాతుర్వర్ణ్యం మయాస్పష్టం గుణకర్మ విభాగశ:

తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తార మన్యయమ్.

ఈ విధంగా చాతుర్వర్ణ్యం కుల వ్యవస్థ భగవన్నిర్మితమని హిందూ మతం వివరిస్తుంది. అయితే, పైన చెప్పిన వర్ణాలే కాకుండా ఇతర కులాలు ఎట్లా పుట్టినాయి అనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. దీనికి మనుసంహితలోను, గౌతమ సంహితలోను సమాధానం దొరుకుతుంది. అనులోను, విలోమ సంహితలోను వివాహ సంపర్కాల ఫలితంగా కలిగిన సంతానానికి కుల స్థాయిలో అంతరం వాటిల్లడం చేత అనేక కులాలు పుట్టినట్లు ఈ సంహితలు వివరించినాయి. దీనినే వర్ణ సంకరమంటారు. వర్ణ సంకరం వలన కలిగిన సంతానము కుల వ్యవస్థకు, ధర్మ శాస్త్రాల నియమాలకు దూరమైనందు వల్ల వారిని కుల బహిష్కృతులుగా వ్యవహరించినట్టు గౌతములు వివరించినారు. అట్లాంటి బహిష్కృతులే ఇతర కులాలుగా ఏర్పడినట్లు తెలుస్తున్నది. చతుర్వర్ణాలే కాక 134 కులాల ప్రస్తి ప్రాచీన భారతీ శాస్త్రాలలో ఉన్నట్లు విల్సన్ (Wilson) చెప్పడం, పై సిద్ధాంతాన్ని బలపరుస్తున్నది.

**విమర్శ:**

సమగ్రంగా పరిశీలిస్తే ఈ మత సిద్ధాంతములో లోపాలు కనిపిస్తున్నాయి. చతుర్విధ వర్ణ వ్యవస్థ కేవలం సిద్ధాంత పరంగా ఏర్పడినదే గానీ సామాజిక పరిశీలన వలన ఏర్పడినది కాదు. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారు సమాజాన్ని ఒక సమానాంతర వ్యవస్థగా భావించినారే గానీ, కులాల పుట్టుపూర్వోత్తరాలను స్పష్టంగా నిరూపించుటలో విఫలమయినారు. చతుర్విధ కుల వ్యవస్థ చారిత్రక దృష్టికి దూరంగా ఉన్నది. ఉదాహరణకు ఒక్క బ్రాహ్మణ కులంలోనే ఈనాడు మనకు 1800 ఉపకులాలు కనబడుతున్నవి. వివాహ విషయంలో వారిలో ఎన్నో ఆంక్షలు ఉన్నాయి. అదీగాక, ఈ చతుర్వర్ణ కులాల వారు తమ కుల వృత్తులకు ఎప్పుడూ కట్టుబడి యుండలేదు. ఉదాహరణకు రాజ్యాధికారము ఎప్పుడూ క్షత్రియులకే పరిమితమై యుండలేదు. మౌర్య రాజులు శూద్రులని, గుప్త రాజులు వైశ్యులని, భారశైవులు బ్రాహ్మణులని చరిత్ర నిరూపిస్తున్నది. అట్లాగే వర్తక వాణిజ్యాలు వైశ్యులకే పరిమితమైయుండలేదు. మత నియమాలు తెలిపే గ్రంథాకర్తలంతా బ్రాహ్మణులు కారు. విశ్వామిత్రుడు, తులాధరుడు మొదలైన ధర్మ శాస్త్రకారులు బ్రాహ్మణేతరులు. వీటినన్నిటినీ బట్టి చూస్తే, కులాలు దైవ ర్ణయమని, కుల వృత్తులు బేదింపరానిదనీ, వంశపారంపర్యంగా సంక్రమిస్తాయని భావించడం సమంజసం కాదు.

అయితే, ఈ మత సిద్ధాంతములలో గుర్తించవలసిన అంశాలు రెండు ఉన్నాయి. జీవసాదృశ్య సాంఘీక సూత్రం మీద ఆధారపడి కుల వ్యవస్థ రూపొందినట్లు ఈ సిద్ధాంతములో గుర్తించవలసిన మొదటి విషయము. చతుర్వర్ణాలను మానవ శరీరంలోని అవయవాలు ఒకదానిపై మరొకటి ఆధారపడుతూ శరీరానికి తోడ్పడతాయో అట్లాగే వివిధ కులాలు ఒకదాని మీద మరొకటి ఆధారపడి సమాజ నిర్మితికి, ప్రకార్యాలకు తోడ్పడుతున్నాయి. క్రియా నిర్వహణలో శరీరంలో తలకు ఎంత ప్రాధాన్యత గలదో, పాదాలకూ అంతే ప్రాధాన్యత గలదు. అట్లాగే సమాజంలో బ్రాహ్మణుడెంత ముఖ్యమో, శూద్రుడు కూడా అంతే ముఖ్యము. అంతస్థులలో వివిధ కులాల మధ్యనున్న తారతమ్యాలను గురించి మన ప్రాచీన సాహిత్యంలో ఎక్కడా వివరణ లేదు. భగవద్గీతలో చెప్పినట్లు కులాలు పుట్టుకతోనే వచ్చినప్పటికీ కుల సభ్యత్వము పుట్టుక ప్రాతిపదికన కాక గుణకర్మలను బట్టి నిర్ణయిస్తారని చెప్పడం గమనించవలసిన మరొక విషయము. అంటే కులాల మధ్య గతిశీలతకు అవకాశమున్నది. కొన్ని గుణకర్మలను బట్టి ఏ కులం అంతస్థుకైనా చేరుకోగలడనేది పైన చెప్పిన శ్లోకం వలన తెలుస్తుంది.

**2. వృత్తి సిద్ధాంతము:**

వృత్తి ప్రాతిపదిక మీద కుల వ్యవస్థ ఏర్పడిందని భావించిన వారిలో Nesfield (నెస్‌ఫీల్డు) ముఖ్యుడు. నెస్‌ఫీల్డు అభిప్రాయంలో కుల వ్యవస్థ మత ప్రభావం మీద ఆధారపడి సృష్టించినది కాదు. పూర్వకాలంలో ఒకే వృత్తి చేసే వారందరూ కలిసి ఒక ప్రత్యేక వృత్తి సంఘముగా ఏర్పడినారు. కాలక్రమేణా వంశపారంపర్యంగా అదే వృత్తిని స్వీకరించుట వలన వృత్తులను బట్టి వేరువేరు కులాలు ఏర్పడినాయి. ఇట్లా వృత్తుల వలన ఏర్పడిన కులాల అంతస్థులలో హెచ్చుతగ్గులు లేకపోలేదు. ఉదాహరణకు: లోహ వృత్తిని స్వీకరించిన కులాలు తాము బుట్టలు అల్లుకునే మేదరి కులం వారి కంటే అధికులమని భావించేవారు. ఒకే వృత్తిని అవలంభించే వారిలో సహజంగా సంఘీభావము ఉంటుంది. దీనివలన వృత్తి నైపుణ్యం, పద్ధతులు వంశపారంపర్యంగా ఆయా కులాల వారికి సంక్రమిస్తూ వచ్చినాయి. ఈ విధంగా వృత్తి సంఘాలు కుల వ్యవస్థ నిర్మాణానికి దోహదం చేసినట్లు వృత్తి సిద్ధాంతం తెలియజేస్తుంది.

**విమర్శ:**

వృత్తి సిద్ధాంతములో కొన్ని లోపాలు కనబడుతున్నవి. ఒకే వృత్తిని అవలంభించే కులంలో ఉపకులాలు ఏర్పడడం, ఏ ఉపకులంలో వారు ఆ ఉపకులంలోనే వివాహం చేసుకోవలెననే నియమాలు ఏర్పడడం ఏ విధంగా జరిగినాయనే ప్రశ్నలకు ఈ సిద్ధాంతములో సరైన సమాధానం దొరకదు. ఉదాహరణకు: పూజా వృత్తిని అవలంభించే బ్రాహ్మణ కులంలో అనేక ఉపకులాలు ఉన్నాయి. ఈ ఉపకులాలతో వివాహ సంబంధాలపై అనేక ఆంక్షలు ఉన్నాయి. వారందరిదీ ఒకే వృత్తి అయినప్పుడు ఈ ఆంక్షలు ఎందువలన ఏర్పడినాయి? అదీకాక గోత్ర వ్యవస్థకు కుల వ్యవస్థతో సన్నిహిత సంబంధమున్నది. వివాహ రీత్యా కులం అంతర్వివాహ సమూహానికి చెంది ఉంటే గోత్రం బహిర్వివాహ సమూహానికి చెందింది. అంటే ఒక కులంలోని వారు ఆ కులంలో వారిని మాత్రమే వివాహం చేసుకోవాలి. కాబట్టి కులాన్ని బట్టి వారందరూ ఒక్కటైనా గోత్రాన్ని బట్టి వారు భిన్నులన్నమాట. ఒకే వృత్తిని అవలంభిస్తూ, ఒకే కులానికి చెందిన వారిలో కూడా పైన చెప్పిన వివిధ గోత్రాలు వాటికి సంబంధించిన ఆంక్షలు ఏ విధంగా వచ్చినాయనే విషయంలో వృత్తి సిద్ధాంతము సరిఅయిన వివరణను ఇవ్వలేకపోయింది. అదీకాక, ఒక వృత్తిని అవలంభించే వారినే ఒక ప్రాంతాన ఉన్నత కులస్థులు గాను, ఇంకో ప్రాంతాన తక్కువ కులస్థులుగాను లెక్కిస్తున్నారు. ఉదాహరణకు: వ్యవసాయం ముఖ్యవృత్తిగా ఉన్న వారిని దక్షిణ భారతదేశంలో చిన్నచూపుతో చూస్తుంటే, ఉత్తర భారతదేశంలో హెచ్చుస్థాయిలో ఉన్న అగ్రకులస్థులుగా పరిగణిస్తున్నారు. ఈ విధంగా ఒకే కులం వేరు వేరు ప్రాంతాలలో వేరువేరు అంతస్థులలో ఉండడానికి కారణం ఏమిటో వృత్తి సిద్ధాంతం స్పష్టం చేయలేదు. కాబట్టి ఈ సిద్ధాంతం సమగ్రమైనది కాదని చెప్పవచ్చు.

**జాతి సిద్ధాంతము:**

హెర్బర్ట్ రిస్లే (Herbert Risley) అనే శాస్త్రవేత్త తన 'ది పీపుల్ ఆఫ్ ఇండియా' (The People of India) అను గ్రంథములో కుల వ్యవస్థ జాతి వ్యత్యాసాల మీద రూపొందినదని సిద్ధాంతీకరించినాడు. శరీరపు ఛాయ, ఒడ్డు, పొడవు మొదలైన శారీరక లక్షణాలలో వ్యత్యాసాలున్న వ్యక్తులు వివిధ సమూహాలుగా ఏర్పడినారు. ఆ సమూహాలే కులాలుగా మార్పు చెందినాయి. శారీరక లక్షణాలు జాతికి సంబంధించినవి. ఈ లక్షణాలలో వివిధకులాల మధ్య వ్యత్యాసాలు కానవస్తున్నాయి.

ఉదాహరణకు: పై కులాలలో ముక్కు సన్న గాను, పొడవు గాను, క్రింది కులాలలో వెడల్పు గాను, పొట్టి గాను కానవస్తుంది. సాధారణంగా పై కులస్థులు అందరికన్నా తెల్లగా ఉంటారు. ఉత్తర భారతదేశంలో అన్ని కులాల వారు దక్షిణ భారతదేశంలో అన్ని కులాల వారికంటే తెల్లగాను, దేహదారుఢ్యం గలవారుగాను ఉంటారు. సమాజాలన్నీ కొన్ని శారీరక లక్షణాలకు హెచ్చు విలువను ఇచ్చినట్లు గానే భారత సమాజం కూడా వాటికి ప్రాధాన్యం ఇచ్చింది. ఈనాటికీ వివాహ సంబంధాలను నిర్ణయించడంలో రంగు, దేహదారుఢ్యం, అందాల ప్రసక్తి వస్తుంది. నల్లని వారు, తెల్లని వారు అన్ని కులాలలో ఉన్నప్పటికీ, కొన్ని కులాలు నలుపు, కొన్ని కులాలు తెలుపు అనే సాధారణ అభిప్రాయం ఒకటి ఈనాటికీ ప్రజలలో ఉంది. "నల్లని బ్రాహ్మణుని, ఎఱ్ఱని మాదిగ వానిని నమ్మరాద"నే తెలుగు సామెతను చూస్తే కులాలు జాతి వ్యత్యాసాలు వల్ల ఏర్పడినట్లు తెలుస్తుంది. వివిధ కులాల మధ్య వర్ణ సాంకర్యం కలగకుండా హిందూ సమాజం ఎన్నో ఆంక్షలను విధించింది. అంతర్వివాహ పద్ధతి అటువంటి ఆంక్షలలో ముఖ్యమైంది. పై కులస్థులు, ముఖ్యంగా బ్రాహ్మణులు తమ జాతి పవిత్రతను కాపాడుకోవడం కోసం తాము ఏర్పరచుకొన్న కట్టుబాట్లను చూస్తే కుల వ్యవస్థ జాతి వ్యత్యాసాల వల్ల ఏర్పడిందని తెలుస్తుంది. ఆర్యులు, ద్రావిడులు, ఆర్యద్రావిడులు, మంగోల్ ద్రావిడులు అనే నాలుగు జాతులు భారతీయులలో ఉన్నట్లు రిస్లే చెప్పినాడు. ఇవి వివిధ సమూహాలుగా ఏర్పడి కులాలుగా రూపొందినాయి. వర్ణాంతర వివాహాల మీద ఎన్ని ఆంక్షలున్నా అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతుల ఫలితంగా ఎన్నో మిశ్రమ కులాలు ఏర్పడినాయి. ఈ వర్ణ సాంకర్యం వల్ల ఏర్పడిన వివిధ కులాలు సమాజంలో వివిధ అంతస్థులలో ఉన్నాయి. ఈ విధంగా జాతి వ్యత్యాసాలే కుల వ్యవస్థకు మూలమని రిస్లే భావించాడు.

**విమర్శ:**

రిస్లే అభిప్రాయలు సత్యదూరంగా ఉన్నాయి. బి.యస్.గుహ, పి.సి.మహాల నోబిస్, సి.ఆర్.రావు, డి.ఎన్.మజుందార్, ఎస్.ఎస్.సర్కార్ మొదలైన వారు కూడా భారతీయులలో ఉన్న జాతి వ్యత్యాసాలను గురించి అనేకంగా పరిశోధనలు చేశారు. వీరందరూ సాంఘీక సమూహాలలో నున్న వ్యత్యాసాలు కేవలం జాతి వ్యత్యాసాల మీద మాత్రమే ఆధారపడి ఉన్నాయని చెప్పడం కష్టం అని అభిప్రాయ పడినారు. జాతి వ్యత్యాసాలకూ కుల వ్యత్యాసాలకూ మధ్య ఉన్న సంబంధాన్ని రిస్లే సరిగా వివరించలేకపోయినాడు. ప్రాంతీయ వ్యత్యాసాల వల్ల, భాషా వ్యత్యాసాల వల్ల ఏర్పడిన సమూహాలను జాతి వ్యత్యాసాల వల్ల ఏర్పడిన సమూహాలుగా అతడు పొరపాటు పడినాడు. అమెరికాలను, దక్షిణాఫ్రికాలోను, నీగ్రో జాతి వారికి మిగతా జాతుల వారికి మధ్య ఉన్న జాతి వ్యత్యాసాలు మనదేశంలో ఏ ప్రాంతానికి చెందిన కులాల మధ్య కూడా కనపడవు. ఒకే ప్రాంతానికి చెందిన కులాల మధ్య కూడా కనబడవు. ఒకే ప్రాంతానికి చెందిన ఒకే భాష మాట్లాడుతూ ఒకే కులానికి చెందిన చాలా మంది వ్యక్తులలో కూడా జాతి వ్యత్యాసాలు ఉన్నాయి. వివిధ కులాలకు చెందిన వారిలో కూడా శారీరక లక్షణాలలో చాలా పోలికలు ఉన్నాయి. బ్రామ్మణులకు, హరిజనులకు మధ్య చాలా కులాలు ఉన్నాయి. అయితే ఈ కులాలలో హరిజనుల కంటే నల్లగా ఉన్న వారు, బ్రాహ్మణుల కంటే తెల్లగా ఉన్న వారు కూడా ఉన్నారు. వ్యవసాయ వృత్తి మీద ఆధారపడిన కింది కులాలలో చాలా మంది బ్రాహ్మణుల కంటే తెల్లగా ఉన్నారు. ఉత్తర భారతదేశంలో హరిజనులు దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణుల కంటే తెల్లగా ఉన్నారు. అంతేకాక ప్రపంచ చరిత్రలో వివిధ కులాలలో వివిధ సమాజాలలో జాతి వ్యత్యాసాలు కనబడుతున్నాయి. అయితే, ఈ వ్యత్యాసాల వల్ల ఏ సమాజంలోను, ఏ కాలంలోనూ కులాలు రూపొందినట్లు కనబడదు. దీనిని బట్టి చూస్తే జాతి వ్యత్యాసాల వల్ల ఒక్క భారతదేశంలోనే కుల వ్యవస్థ ఏర్పడిందని చెప్పడం నిజం కాదు. అదీకాక, ఆర్యులు మన దేశానికి రాక పూర్వమే స్థానికులైన దస్యులలో కూడా కుల వ్యవస్థ ఉండినట్లు ఈనాడు అందరూ అంగీకరిస్తున్నారు.

**సంస్కార సిద్ధాంతము:**

ఎ.ఎమ్.హెూకార్ట్ (A.M.Hocart) తన "ఇండియా అండ్ ది పసిఫిక్" (India and the Pacific) అనే గ్రంథంలోని సంస్కార సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు. భారతదేశంలో కుల వ్యవస్థ మత సంస్కారాల నిర్వహణలో వ్యక్తుల మధ్య ఏర్పడిన సంబంధాల మీద ఆధారపడిందని అతని అభిప్రాయము. ప్రజలు ఆదరించే మత వియోకమైన కర్మకాండల మూలంగా కులాలు ఏర్పడినాయి. రంగులకు, తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు మొదలగు సంజ్ఞలు ఏర్పడినట్లే మత సంస్కార సంబంధమైన విధులను నిర్వహించడానికి వినియోగింపబడిన వ్యక్తులకు వారి విధులను బట్టి కుల సంజ్ఞలు వచ్చినాయి. వివిధ కులాలు నిర్వహించే విధులు మత సంస్కారాలకు ముఖ్యమని భావించడం జరిగింది. ఉదాహరణకు మంత్రాలు చదవడం, మేళతాలు

వాయించడం, నివేదనకు వట్టి పాత్రలను తయారు చేయడం, కాగడడాలు పట్టడం, పల్లకీ మోయడం మొదలైన పనులు లేకుండా మతానికి సంబంధించిన ఏ ఉత్సవమూ జరుగదు. ఈ విధులను నిర్వహించడంలో వివిధ కులాల వారు ఈనాటికీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మత సంబంధమైన ఈ విధులకు వంశానుక్రమంగా వ్యక్తులు నిర్వహించడం వల్ల కుల వ్యవస్థ దృఢపడింది. మత సంస్కారాల నిర్వహణలో అంటరాని కులాల వారి పాత్ర కూడా ఉన్నది. ఉదా: ఈనాటికీ కొన్ని గ్రామాలలో గ్రామ దేవతల పేరిట జరిపే ఉత్సవాలలో పశువులను బలియిచ్చే సందర్భంలో ఈ అంటరాని వారనే చెప్పబడే కులాల వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మత విషయిక నిర్వహణలో ఏ ఒక్క కులం పాల్గొనకపోయినా దానికి సంబంధించిన ఉత్సవం పూర్తి కాదు. జీవనోపాధి కోసం వివిధ కులాల వారు తమ విషయిక నిర్వహణకు సంబంధించిన విధులతోపాటు వేరే కొన్ని వృత్తులను కూడా చేపట్టినారు. ఈ విధంగా మత విషయిక నిర్వహణ నుంచే కుల వ్యవస్థ పుట్టిందని ఈ సిద్ధాంతం చెబుతున్నది.

**విమర్శ:**

ఈ సిద్ధాంతంలో విషయాలు సహేతుకంగా లేవు. హెూకార్ట్ అభిప్రాయాలు భారతదేశంలో ఉన్న కుల వ్యవస్థతో ప్రత్యక్ష పరిచము ఉండి ఏర్పడినవి కావు. అదీగాక, ఇతని సిద్ధాంతంలో ఉపకులాల పుట్టుక, వాటిలో ఉన్న అంతస్తు తారతమ్యాల ప్రసక్తి లేదు. కాబట్టి కులాలు కేవలం మత విషయక విధుల నుంచి పుట్టినాయనే అతని వాదం సరికాదనే చెప్పవలె.

**భౌగోళిక సిద్ధాంతం:**

భౌగోళిక వ్యత్యాసాలే కుల వ్యవస్థకు మూలమనేది మరొక సిద్ధాంతము. గిల్బర్ట్ (Gilbert) తన " ది ఆరిజన్ ఆఫ్ ది క్యాస్ట్" (The Origin of the Caste) అనే పుస్తకంలో ఆ వాదాన్ని ప్రతిపాదించినాడు. పల్లపు ప్రాంతాలలో, తీర ప్రాంతాలలో, కొండ ప్రాంతాలలలో, ఎడారి ప్రాంతాలలో ప్రజలు నివసించినట్లుగా పురాతన తమిళ సాహిత్యంలో ప్రస్తావన ఉన్నది. వివిధ ప్రాంతాలలో నివసించే వారు వారి ప్రాంతాలకు అనుగుణమైన వృత్తులను చేపడుతూ, ప్రత్యేకమైన ఆర్థిక, సాంఘీక వ్యవస్థలలో ఉన్నారు. వివిధ ప్రాంతాలలో నివసించడం వల్ల ఆహార నియమాలలోను, సాంస్కృతిక జీవనంలోను, నాగరికతలోను వారిలో భిన్న లక్షణాలు ఉన్నాయి. ఉదాహరణకు: తీర ప్రాంతాలలో చేపలు పడుతూ జీవించే బెస్త వారి జీవన పద్ధతులకూ కొండ ప్రాంతాలలో ఉండే పశుకాపరుల జీవన పద్ధతులకూ చాలా తేడాలున్నాయి. అయితే, కాలక్రమేణా కరువు కాటకాలు వల్ల నైతేనేమి, మరే ఇతర కారణాల వల్లనైతేనేమి ఒక ప్రాంతం ప్రజలు మరొక ప్రాంతానికి తరలిపోవడం చేత భిన్న ప్రాంతీయుల ఆచార వ్యవహారాలతో పరిచయం ఏర్పడింది. స్థానికుల సంస్కృతి ప్రభావం వల్ల వచ్చిన వారి మీద పడినప్పటికీ, వారు తమ తమ వృత్తులను, సంస్కృతిని ప్రత్యేకంగా నిలబెట్టుకోవడం వల్ల ఒకే ప్రాంతంలో విభిన్నమైన సంస్కృతులు, వృత్తులు ఏర్పడినాయి. విభిన్నమైన వృత్తులు, సంస్కృతులు ఉన్న సమూహాలే కులాలుగా రూపాంతరం చెందినాయి. ఉదాహరణకు: దక్షిణ భారతదేశంలో సముద్ర ప్రాంతాన ఉప్పు తయారు చేసే వారున్నారు. కాలక్రమేణా కొన్ని పరిస్థితుల ప్రభావం వల్ల వారు వేరువేరు ప్రాంతాలకు తరలిపోయినారు. అట్లా వలసపోయి వేరే ప్రాంతాలలో వృత్తిని స్వీకరించిన తరువాత కూడా ఉప్పు తయారు చేసే వారుగానే వ్యవహరించడం చేత వారిని ఉప్పిలియార్లు అనే ఒక ప్రత్యేక కులంగా వ్యవహరించే వారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలిపోయిన వారు కొత్త ప్రాంతంలో వారి పాత వృత్తులను కొనసాగించవచ్చు. లేదా కొత్త వృత్తులను స్వీకరించవచ్చు. ఏ వృత్తులను అనుసరించినప్పటికీ ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతం వారితో కలిసి జీవించడం వల్ల వేరువేరు కుల సమూహాలుగా ఏర్పడినారు. అంతేకాక కొన్ని ప్రాంతాల పేర్లతో కూడా ఉపకులాలకు చెందిన వ్యక్తులను పిలుస్తుండేవారు. ఒక ప్రాంతం పేర్లతో కూడా ఉపకులాలకు చెందిన వ్యక్తులను పిలుస్తుండేవారు. ఒక ప్రాంతం వారు వేరొక ప్రాంతానికి తరలిపోయిన తరువాత కూడా వారిని వారి పూర్వ ప్రాంతాల పేరుతోనే వ్యవహరించడం వల్ల వేరు కులంగానో, ఉపకులంగానో రూపొందడం జరిగింది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ కులంలో చాలా ఉపకులాలు చాలా ప్రాంతాల పేర్లతో ఉన్నాయి. వేగి దేశం నుంచి తరలివచ్చిన బ్రాహ్మణులను వేగినాట్లు అని, ద్రవిడ దేశం నుంచి తరలివచ్చిన బ్రాహ్మణులను ద్రావిడులని, కోసల దేశం నుంచి వచ్చిన వారిని కాసల నాట్లని పిలవడం చేత ఒకే కులంలో చాలా ఉపకులాలు వచ్చినాయి.

**విమర్శ:**

భౌగోళిక వ్యత్యాసాలు కుల వ్యవస్థ పుట్టుటకు కొంత తోడ్పడి ఉండవచ్చు. కానీ, భారతదేశమంతటా అన్ని కాలాలలోను సమాంతరంగా కనబడుతున్న చతుర్వర్ణాలకు సంబంధించిన వృత్తులు ఏ ప్రాంతానికి చెందినాయో, అవి ఎట్లా ఏర్పడినాయో ఈ సిద్ధాంతం వివరించలేదు.

**కృత్రిమ సృష్టి సిద్ధాంతం:**

తాము ఇతరుల కంటె అధికులమని భావించిన బ్రాహ్మణులు తమ స్వప్రయోజనాలను కాపాడుకోవడానికి ఏర్పరచిన కృత్రిమ వ్యవస్థే ఈ కుల వ్యవస్థ అన్నవాదం ఒకటి ఉన్నది. ఈ వాదాన్ని ప్రతిపాదించిన వారిలో అబ్బీడ్యూబాయిస్ (Abbe Dubois) ముఖ్యుడు. ఈ సిద్ధాంతం ప్రకారం కుల వ్యవస్థ కేవలం బ్రాహ్మణ కల్పితము. పూజా పురస్కారాలను అవలంభించే బ్రాహ్మణులు సంఘంలో తమ అధికార ప్రాబల్యాన్ని, గౌరవ ప్రతిష్టలు నిలబెట్టుకొనేందుకు ప్రజలను వివిధ కులాలుగా విభజించినారు. అంతేకాక, ప్రతి కులానికి ఒక నియమావళిని ఏర్పరచి ఆ నియమాలను ఉల్లంఘించకుండా కొన్ని ఆంక్షలను విధించారు.

**విమర్శ:**

బ్రాహ్మణులు తమ స్వప్రయోజనాల కోసం కుల వ్యవస్థను సృష్టించినారనే వాదం పాక్షికంగా కనబడుతుంది. కుల వ్యవస్థను బ్రాహ్మణులు నియంతృత్వ ధోరణిలో సృష్టించినట్లయితే వారి ప్రాబల్యం తగ్గగానే కొంత కాలానికి అది నశించిపోయి ఉండేది. కానీ, అట్లా జరుగలేదు. అదీగాక, బ్రాహ్మణులే కులాలను సృష్టించినట్లయితే ఆ బ్రాహ్మణ కులంలోనే 1800 పైగా (ఉప కులాలు) తెగలు ఎవరు, ఏ ప్రయోజనాలను ఆశించి సృష్టించారు? అన్న ప్రశ్నకు ఈ సిద్ధాంతంలో సమాధానం కనిపించదు. కుల వ్యవస్థ పటిష్టం కావడానికి బ్రాహ్మణులు కొంతవరకు తోడ్పడి ఉండవచ్చు. వారే కుల వ్యవస్థకు మూలం అనడం సమంజసం కాదు.

**సంఘర్షణ సిద్ధాంతం:**

ఏ.ఎమ్.టి.జాక్సన్ (A.M.T.Jackson) 'ఏ నోట్ ఆన్ ది హిస్టరీ ఆఫ్ క్యాస్ట్ సిస్టమ్'' (A Note on the History of Caste Stystem) అనే తన పుస్తకంలో సంఘర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అతి ప్రాచీన కాలంలో జరిగిన రాజకీయ సంఘర్షణల వల్ల కుల వ్యవస్థకు పునాదులు ఏర్పడినాయి అనేది ఈ సిద్ధాంత సారాంశము. సాంస్కృతిక, ఆర్థిక వైషమ్యాల వల్ల ప్రాచీన కాలంలో ఆదిమ తెగలలోను, రాజ్యాలలోను, నిరంతర సంఘర్షణలు సంభవించి తెగలు, రాజ్యాలు సమ్మిళితమవుతుండేవి. ఇట్టి సమ్మేళనం వల్ల కొత్త కులాలు ఏర్పడుతుండేవి. ప్రాచీన భారతదేశంలో 118 రాజ్యాలున్నట్లు మెగస్థనీసు (Megasthanese) పేర్కొన్నాడు. ఈ రాజ్యాల మధ్య నిరంతరం సంఘర్షణలు వస్తూ ఉండేవి. ఓడిపోయిన రాజ్యాలు గెలిచ్చిన రాజ్యాల అధికారం కిందకి వస్తుండేవి. ఈ విధంగా విభిన్న రాజ్యాలకు, తెగలకు చెందిన ప్రజలు ఒకే అధికారం క్రిందకి వచ్చినప్పటికీ వారి సంస్కృతులు వేరు కాబట్టి వారిని ప్రత్యేక సమూహాలుగానే పరిగణించడం జరిగింది. ఈ సమూహాలే కులాలు రూపాంతరం చెందాయి. కొన్ని కులాలను వారి పూర్వ నివాస రాజ్యాల పేరిట వ్యవమరించే వారు. ఉదాహరణకు: మహారాష్ట్రంలో చంపనేరి అనే కులం ఉండేది. చంపనేరి అనే పదము క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందిన హిందూ రాజవంశానికి అన్వయించే పదము. ఈ విధంగా ఉదాహరణ పూర్వకంగా జాక్సన్ కుల వ్యవస్థ వివిధ తెగలలోను, రాజ్యాలలోను జరిగే సంఘర్షణల వల్ల ఏర్పడిందని నిరూపించాడు.

**విమర్శ:**

కేవలం సంఘర్షణ వల్లనే కుల వ్యవస్థ ఏర్పడిందనే వాదము నమ్మదగినది కాదు. హిందూ సమాజ పరిణామంలో జాతి, రాజకీయ సంఘర్షణలు కొంత వరకు తోడ్పడి ఉండవచ్చు. కానీ ఈ సంఘర్షణలే కుల వ్యవస్థకు మూలమని అనడంలో అర్థం లేదు. ఈ నాడు వ్యవహారంలో ఉన్న సుమారు 3500 కులాలు, ఉపకులాలు సంఘర్షణల ఫలితంగా వచ్చినాయని చెప్పడం నమ్మదగిన విషయం కాదు. కుల వ్యవస్థ అనేక ప్రభావాలకు లోనై ఏర్పడ్డదేగాని కేవలం సంఘర్షణల వల్ల ఏర్పడ్డది కాదు. కల వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలను వివరించడానికి పై సిద్ధాంతాలు కొంత వరకు ప్రయత్నం చేశాయి. కానీ, కుల వ్యవస్థ ప్రాతిపదికకు

సంబంధించిన విషయాలన్నింటినీ ఏ ఒక్క సిద్ధాంతమూ సమగ్రంగా వివరించలేకపోయింది. ఏ సాంఘీక వ్యవస్థ అయినా అనేక కారణాల ప్రభావం వల్ల ఏర్పడుతుందే కానీ, ఒకే ఒక ప్రత్యేకమైన కారణం వల్ల ఏర్పడుతుందని చెప్పడానికి వీలుపడదు. ఈ కారణాలలో కొన్ని ప్రస్ఫుటమైనవి కావచ్చు. మరికొన్ని అప్రస్ఫుటమైనవి కావచ్చు. కుల వ్యవస్థ ప్రాతిపదికకు సంబంధించిన కారణాలలో ప్రస్ఫుటమైనవి ఏవో, అప్రస్ఫుటమైనవి ఏవో చెప్పడం ఈ నాడు సాధ్యపడే విషయం కాదని మాత్రం గుర్తుంచుకోవాలి.

**బ్లంట్ సిద్ధాంతము:**

కులాల పుట్టుక అనే విషయం గూర్చి ఆలోచించేటప్పుడు మనం పూర్వకాలంలోని సంశ్లిష్టతా పూర్వకమైన సమాజాన్ని దృష్టిలో ఉంచుకోవలెనని ఇ.ఎ.బ్లంట్ వాదన. ఇతని దృష్టిలో ఆ సంశ్లిష్టతా పూర్వకమైన సమాజంలో వర్గాలు, వాటిని మధ్యగా ఛేదించే వర్తక సంఘాలు ఉండేవి. అప్పటి వర్గాలు వర్ణ వ్యవస్థపై ఆధారపడినవి. కానీ, సంకర సంబంధాల వల్ల వివిధ వర్ణాలు సంఘమంతా వ్యాపించినవి. ఈ వివిధ వర్ణాలు ఉద్భవించే సమయంలోనే వర్తక సంఘాలు తలెత్తినవి. దీనివల్ల ప్రతి వర్తక సంఘంలో ప్రతి వృత్తి సంఘంలోని ప్రజలు వివిధ వర్ణయుక్తమైన వారై యుండి, ఏ సంఘానికా సంఘం వారు గొప్పవారుగా తలచుకుంటూ తరువాత దశలో ఏ సంఘం వారా సంఘం యొక్క నిర్మలత్వం కాపాడుకోవడానికి అంతర్వివాహాలను ప్రోత్సహించడం, పంక్తి భోజనాలు కలవారే అంతర్వివాహాలు చేసుకోవడం ప్రారంభమైంది.

ఈ విధంగా ప్రతి వర్తక సంఘంలో, వృత్తి సంఘంలోను, రక్త సంబంధం పై, వర్ణ సంబంధం పైనా ఆధారపడిన చిన్న సముదాయాలుండేవి. ఈ చిన్న సముదాయాలే నేటి ఉపకులాలు. నాటి వర్తక సంఘాలు, వృత్తి కులాలు కాని వాటిలో ఉపకులాలు లేవనీ, వృత్తి కులాలన్నీ శక్తివంతమైన కుల పంచాయతీల చేతులలో ఉంటాయని, వృత్తి కులాలు కానివి ఒక పూర్వీకుని యొక్క సంతతి వారని, వృత్తి కులాల వారికి ఇటువంటి నమ్మకాలు లేవని బ్లంట్ సిద్ధాంతీకరించినాడు. వృత్తి కులాలకు బ్లంట్ బ్రాహ్మణ, కాయస్త, సానార్ (బంగారు పనివారు), లోహర్ (ఇనుప పనివారు)లను, వృత్తి కులాలు కానివారుగా రాజ్‌పుట్, ఖత్రీ, జాట్, బార్ కులాలను ఉదాహరణగా చూపించినాడు. ఇతని సిద్ధాంతము కూడా లోపరహితమయింది కాదు. ఒకే మూల పురుషుడి నుంచి తమ బంధుత్వాల జాడ తెలుసుకోవడం అనేది, వృత్తి కులాలు కాని వాటిలోను, వృత్తి కులాలలోను కూడా ఉన్నది. ఉదాహరణకు చాలా వృత్తి కులాలు విశ్వకర్మను తమ కుల మూలపురుషునిగా భావిస్తారు.

**రామ్‌ప్రసాద్ చందా సిద్ధాంతము:**

రామ్‌ప్రసాద్ చందా కూడా కుల వ్యవస్థ పుట్టుక, వర్ణ విచక్షణ, వృత్తిపై ఆధారపడినదని అభిప్రాయపడినాడు. తొలుత వర్ణ క్రమంపై ఆధారపడిన సమూహాలలో వృత్తి వంశపారంపర్యంగా రావడం వలన అవి కులాల క్రింద మారినవి. అటు తరువాత సంకర వివాహాల వలన మిగతా కులాలు పుట్టినాయని రామ్‌ప్రసాద్ చందా వివరించినారు.

**సెనార్ట్ సిద్ధాంతము:**

కుల వ్యవస్థ ప్రాచీనార్యుల యొక్క కొన్ని నియమ నిబంధనల మూలంగా ఆవిర్భవించినదని సెనార్ట్ అభిప్రాయము. ఇతని దృష్టిలో పంక్తి బోజనాలు కుల వ్యవస్థకు ముఖ్యము. ఈ పంక్తి బోజనాలు చేసే వాళ్లు పూర్వకాలంలో ఒకే కుటుంబ దేవతను పూజించే వారు. పూజానంతరము నైవేద్యం పెట్టిన ఆహారం భుజించే వారని, అందుచేతనే ఆహారానికి పవిత్రతను అంటగట్టటం జరిగినదని ఆయన వాదన. ఆర్యుల దండయాత్రల వలన వర్ణ సంకరం జరగడం వలన రెండు విధాలైన పవిత్రతను సూచించినారు. మొదటి పద్ధతి వంశపారంపర్యంగా పవిత్రత అంటే సాంకర్యాలను నిరసించడం, రెండోది వృత్తికి పవిత్రతను ఆపాదించడం. దీనివల్ల కొన్ని వృత్తులను పవిత్రంగాను, కొన్ని వృత్తులను అపవిత్రంగాను ఎంచడం జరిగింది. వీని వల్ల క్రొత్త సముదాయాలు ఏర్పడినాయి. ఈ సముదాయాలన్నింటిలోను పౌరోహిత్యం చేసే వర్గం వారొక్కరే యుక్తాయుక్త వివేకం ప్రదర్శించి తమ వర్గ సదృఢతను పెంపొందింప చేసుకొని మొదటి కులంగా ఏర్పడినారు. ఇక సంప్రదాయ సిద్ధమైన చతుర్వర్ణ సంకరం వలన మిగతా కులాలు పుట్టినాయని వివరించినాడు.

ఈ సిద్ధాంతము కూడా తీవ్రంగా విమర్శలకు గురయింది. దాల్‌మెన్, ఈ సిద్ధాంత కర్త ఋగ్వేద కాలంలో భారతదేశం సామాన్యంగా ఉండేదని తలచటం పొరపాటని వాదించినారు. అప్పటికప్పుడే సంఘ సంశ్లిష్టత బాగా పెరిగి ఋగ్వేద కాల ప్రజలు

నాటికే అభివృద్ధి చెందిన నాగరికత పెంపొందించినారు. పంక్తి భోజనాల పుట్టుక గూర్చి సెనార్ట్ చెప్పిన విషయాలలో కూడా కొన్ని లోపాలు ఉన్నవి. ఎందువల్లనంటే కుల సభ్యులు సాధారణంగా ఒక మూలపురుషుని సంతతి వారని చెప్పుకోగా, గోత్ర సభ్యులు కూడా తమ సంతతి గోత్ర పురుషునికి ఆరోపించుట సహజము. గోత్ర బహిర్గత వివాహాలు సహజంగా జరగడానికి కారణం కూడా వారు రక్త బంధువులనే నమ్మకమే. ఒక మూలపురుషుని సంతతి అని చెప్పదగింది గోత్రం గాని కులం కాదు. ఇది సెనార్ట్ అభిప్రాయానికి భిన్నంగా ఉంది.

**ఇబట్‌సన్ సిద్ధాంతము:**

బ్రాహ్మణులు తమకున్న ఉన్నత స్థితి, పౌరోహిత్యాధికారము దుర్వినియోగపరిచి తమ వృత్తినీ, క్షత్రియ వృత్తిని తప్ప మిగతా వృత్తులన్నీ చాలా హీనమయినవిగా తలచడం వలన కులాలు ఉద్భవించాయని ఇబట్‌సన్ సిద్ధాంతము. దీనికితోడు ఆదిమ జాతులు, వృత్తి సంఘాలు అభివృద్ధి చెందిన మతం కూడా కులాల పుట్టుకకు తోడ్పడినవని వివరించినాడు. కొన్ని కులాల పుట్టుక ఆదిమ జాతుల నుంచి వచ్చింది అనే విషయము నిస్సందేహము. కానీ, కుల వ్యవస్థ అంతా రూపొందడానికి ఇబట్‌సన్ చెప్పిన అభిప్రాయాలు ఏమంత క్రొత్తవి కావు. ఇకపోతే ఆయన కుల వ్యవస్థ పుట్టుక గురించి చెప్పడానికి బదులు కుల వ్యవస్థా లక్షణాలు మాత్రమే పొందుపరిచినాడని హట్టన్ విమర్శించాడు.

**హెూకార్ట్ సిద్ధాంతము:**

హెూకార్ట్‌కు భారత కుల వ్యవస్థతో ప్రత్యక్ష పరిచయం లేదు. సిలోన్‌లోని బుద్ధుని దేవాలయంలో జరిగే నిత్య పూజా విధానాన్ని పరిశీలించి ఈ సిద్ధాంతము వివరించినాడు. ఇతని దృష్టిలో మత ప్రక్రియలు నిర్వహించడానికి గాను చతుర్వర్ణాలను సృష్టించినారు. ఉదాహరణకు చాకలి, మంగలి వాండ్లకు కుల వ్యవస్థలో ఒక ప్రత్యేక స్థానమున్నది. కొన్ని సందర్భాలలో వీళ్లు చేసే పనులే అగ్రకులాలకు పరిశుద్ధం చేస్తాయి. దేవాలయంలో ఇటువంటి సంప్రోక్షక క్రియలు చేసే వారే వంశపారంపర్యంగా యీ పనులు చేస్తారు. పూర్వకాలంలో రాజ్యాధినేతను కూడా దేవునితో పోల్చడం వలన దేవాలయంలో చేసే ప్రక్రియలు రాజు కొలువులో కూడా చేయడము సహజము. పెద్ద రాజ్యాధినేతలు అడుగుజాడలలో సామంత రాజులు కూడా తమ కొలువులందింటువంటి ప్రక్రియల నేర్పాటు చేయడం వలన దేశమంతా ఇటువంటి వృత్తులు చేసే వారుద్భవించి కాలక్రమేణా ఎవరి వృత్తులు వారు ఉన్నతమైనవనే దురభిప్రాయం పెంపొందించుకోవడం వల్ల వృత్తి తరగతులు కులాలైనవని హెూకార్ట్ వాదన. వివిధ కులాలలో పంక్తి భోజనాల నిషేధము, వివాహ నిషేధాలు ఎందువల్ల వచ్చినవో ఇతడు చెప్పలేదు. కానీ, బహుశః వీటివల్ల ఆ వృత్తుల పవిత్రత పోతుందేమోనని వారు నిషేధించి ఉంటారని హట్టన్ అభిప్రాయము.

**స్లేటర్ సిద్ధాంతము:**

స్లేటర్ (Slater) 'ద్రవిడియన్ ఎలిమెంట్స్ ఇన్ ఇండియన్ కల్చర్'' అనే గ్రంథంలో వృత్తికి, జాతికి కూడా కుల పట్టికలో ప్రాముఖ్యత ఉందని వివరించినాడు. ఈ రెంటినీ సమన్వయ పరిచి కుల పుట్టుక సిద్ధాంతము ఒకదాన్ని ప్రతిపాదించినాడు. కుల వ్యవస్థ దక్షిణ భారతదేశంలో ఉత్తర భారతం కంటే ఎక్కువ శక్తిమంతంగా ఉన్నదని వక్కాణిస్తూ ఈ వ్యవస్థ ఆర్యుల రాకకు పూర్వం ఉందని, వాటి సంఘంలో వృత్తులు వంశానుగతం చేయడం వల్ల, తద్వారా వృత్తి రహస్యాలు వారికి కావలసిన వారి చేతుల్లో ఉండేటట్లు చేసుకోవడం జరిగేది. మంత్ర, మత సంస్కారాల పెరుగుదల ఈ వృత్తులపై ఆధారపడిన సముదాయాలకు ఒక విధమైన బలం చేకూర్చి బహిర్గత వివాహ సంబంధాలు చెడ్డవి, ఆచారానికి భిన్నం అనే భావన పెంపొందింపజేసింది. దీనికితోడు ఆర్యుల దండయాత్రల వలన వర్ణ విభేదాలను కులాలకు అన్వయించి కొన్ని కులాల నెక్కువ, కొన్నింటిని తక్కువ క్రింద చూడడం జరిగింది.

కులాల పుట్టుక టోటమిజంకు దానితో వ్యవహరించే ఆంక్షల వల్ల కలిగినదని రైస్ (Rice) అభిప్రాయం. ఈ సందర్భంలో అతడు వంటచేసే గదికి పవిత్రతను ఆరోపించడం ఆహారం ద్వారా చెడు ప్రాప్తమవుతుందనటం టోటమిజం యొక్క సూత్రాలను జ్ఞాపకం చేస్తాయని వ్రాసినాడు.

కుల వ్యవస్థ అవతరణానికి పురాతనమైన ఆంక్షలు, మానవాతీతశక్తి, ఆత్మబలము చాలా వరకు తోడ్పడినవి. శరత్‌చంద్ర రాయ్ వంటి వారు ముఖ్యంగా ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ ఈ నమ్మకాలు ఇండో ఆర్యన్ వర్ణ వ్యవస్థ పూర్వద్రావిడ సమాజంలో పెంపొందిన వృత్తి వర్గాల మధ్య జరిగిన పరస్పర క్రియల వల్ల ఉద్భవించినదని పేర్కొనినాడు. తత్వశాస్త్రం ద్వారా కుల వ్యవస్థను వ్యాఖ్యానించడానికి ప్రయత్నించినాడనే విమర్శ గలదు.

**ఘుర్యే సిద్ధాంతము:**

ఘుర్యే అభిప్రాయం ప్రకారం ఆర్యులు మనదేశంలో దాదాపు క్రీ.పూ.2500 ప్రాంతంలో ప్రవేశించినప్పుడే వారిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలున్నట్లు చెబుతున్నారు. వీరి మధ్య వివాహ బాంధవ్యాలు లేవు. వారు అప్పుడు ఈ దేశంలో నివసిస్తున్న ఆదిమ వాసులను వేరుగా భావించి శూద్రులని పిలిచారు. ఈ శూద్రులను తమ మతపూజలు చేయనీయలేదు. తమ పూజా స్థలంలో శూద్రులను కనీసం ఉండనివ్వలేదు. ఎటువంటి పరిస్థితులలో శూద్రులతో వివాహ బాంధవ్యాలను ఏర్పరచుకోలేదు. మనకు లభిస్తున్న మొట్టమొదటి హిందూ మతగ్రంథాల్లో మొదటి మూడు వర్గాలనే పేర్కొన్నారని, శూద్రులు పై విధంగా ఉద్భవించి ఉండవచ్చునని ఘుర్యే అభిప్రాయం.

హట్టన్ దృష్టిలో ఈ సిద్ధాంతాలన్నీ చాలా వరకు కుల వ్యవస్థ లక్షణాలను విశదీకరించినాయి. కానీ, అసలు కుల వ్యవస్థ ఏవిధంగా ఉద్భవించిందో విస్పష్టం చేయలేదని ఆయన విమర్శించినారు. ఈతడు కుల వ్యవస్థ పుట్టుకపై నిర్దుష్ట సిద్ధాంతాన్ని చేయక కుల వ్యవస్థ భారతదేశంలో విలసిల్లడానికి గల కారణాలను మాత్రం పొందుపరిచినాడు. ఆయన చెప్పిన కారణము భారతదేశంలో అక్కడ ప్రదేశాలు పృథక్కరణం చెంది ఉండడం వలన సాంస్కృతిక జీవనము వివిధ ప్రదేశాలలో అతి తక్కువ అన్య సంపర్కము కలిగి ఉండేది. దీనికి తోడు ఆహారం వల్ల శుచి, అశుచి మనిషికి సంక్రమిస్తాయని, మానవాతీత శక్తి ఆత్మబలం వంటి పురాతనాభిప్రాయాలు ప్రజలలో ఉండడం మైల, శుచి, స్నానాంతరం పరిశుద్ధం కావడం, పూర్వీకులను పూజించడం, నైవేద్యం పెట్టిన ఆహారానికే విలువనివ్వడం, పునర్జన్మలో కర్మ సిద్ధాంతములో నమ్మకము, వంశపారంపర్యంగా వృత్తులను చేపట్టడం, వివిధ సంస్కృతుల మధ్య ముక్యంగా పితృవంశము, మాతృవంశము, సంఘర్షణ వివిధ వర్ణ వైషమ్యాలు, దండయాత్రలు, ఒక విధమైన ఆర్థిక పరిపాలనా పద్ధతులు, అన్నిటికీ మించిన అతి తెలివితేటలు గల అంతస్థుల క్రమంలో ఉన్న వారు తమ స్వలాభం కొరకు ప్రజానీకాన్ని అణచి ఉంచడం ఈ వ్యవస్థకు కారణాలుగా హట్టన్ వక్కాణించాడు.

**కుల వ్యవస్థలో మార్పులు:**

ఈనాడు భారతీయ సమాజంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలలో చాలా మార్పులు వచ్చినాయి. ఈ మార్పులకు ఎన్నో నిదర్శనాలు కనబడుతున్నాయి. అన్ని సామాజిక వ్యవస్థల మోస్తరుగానే కుల వ్యవస్థ కూడా మార్పు చెందుతున్నది. నిర్మితిలోను, ప్రకార్యాలలోను ఈనాటి కుల వ్యవస్థ కూడా మార్పులు చెందినది. అయితే కుల వ్యవస్థకు చెందిన మార్పులు దేశమంతటా ఒకే రంగా లేవు. ఉత్తర దేశం కంటే దక్షిణ భారతదేశంలోను నాగరికతా స్థాయిలో వెనుకబడిన జిల్లాల కంటే అభివృద్ధి చెందిన జిల్లాలలోను, గ్రామ సముదాయాల కంటే పట్టణ సముదాయాలలోను, మారుమూల ఉన్న గ్రామాల కంటే పట్టణ సముదాయాలకు దగ్గరగా ఉన్న గ్రామాలలోను కుల వ్యవస్థకు సంబంధించిన మార్పులు హెచ్చుగా కనబడుతున్నాయి. కుల వ్యవస్థకు సంబంధించిన కొన్ని ముఖ్య లక్షణాలలో మార్పులు వచ్చినాయి. కొన్ని లక్షణాలకు సంబంధించిన మార్పులు దేశమంతటా కనబడుతుంటే మరికొన్ని లక్షణాలకు సంబంధించిన మార్పులు కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవలెను.

1. **కాలుష్యము:** బస్సులు, రైళ్ళు, మొదలైన ప్రయాణ సాధనాల ప్రభావం వల్ల కులాల మధ్య ఉన్న అంటరానితనము నానాటికీ సమసిపోతున్నది. ఆధునిక విద్యా సదుపాయాల వల్ల వివిధ కులాలకు చెందిన పిల్లలు ఒకచోటికి రావడం జరుగుతున్నది. ఫలహార శాలలోను, వసతి గృహాలలోను అన్ని కులాల వారికి ప్రవేశమున్నది. అంటరానితనము గ్రామాల కంటే పట్టణాలలోను పై తరాల వారి కంటే యువతరం వారిలోను చాలా వరకు సమసిపోయింది. ఇప్పటికీ అమెరికా, దక్షిణాఫ్రికాలలో కొన్ని విద్యా సంస్థలలో, ఫలహారశాలలో నీగ్రో జాతి వారికి ప్రవేశం లభించడం లేదు. ఆ దేశాలలో నీగ్రో జాతి వారి పట్ల ఎన్నో విషయాలలో విచక్షణ చూపుతున్నారు. అటువంటి పరిస్థితి మనదేశంలో ఏ కులానికీ చెందిన వారి పట్ల కూడా లేదని చెప్పవచ్చు.

2. **జీవన విధానంలో మార్పులు:** జీవన విధానంలో హరిజనుల మీద గాని, మరే ఇతర వెనుకబడిన వర్గాల మీద పూర్వకాలంలో ఉన్న ఆంక్షలు ఈనాడు లేవు. పూర్వం వస్త్రధారణలోను, గృహ నిర్మాణంలోను, అన్న పానాదులలోను ఆయా కులాల మీద కొన్ని ఆంక్షలు ఉండేవి. అటువంటి ఆంక్షలు ఈనాడు తొలగిపోయినాయి. సంస్కృతీకరణ, పాశ్చాత్యీకరణ ప్రక్రియల ప్రభావం హెచ్చుగా ఉన్న కులాల్లో ఈ మార్పులు హెచ్చుగా ఉన్నాయి.

3. **కుల వృత్తులలో మార్పు:** వివిధ కులాలకు చెందిన వృత్తులలో చాలా మార్పులు వచ్చినాయి. విద్యా సంస్థలలోను, ఆఫీసులలోను, పరిశ్రమలలోను, బ్యాంకులలోను, ఎన్నో రకాలైన కొత్త ఉద్యోగావకాశాలు లభించడంతో పూర్వం మోస్తరుగా పూర్తిగా కుల వృత్తుల మీద ఆధారపడవలసిన అవసరం ఈనాడు లేదు. వివిధ కులాల వారు ఒకే వృత్తిని స్వీకరిస్తున్నారు. కుల వృత్తులు ప్రోత్సాహకరంగా లేకపోవడం వల్ల ఎన్నో రకాల కుల వృత్తులు అడుగునపడిపోవడం జరిగింది. అయితే వేరే వృత్తులు, ఉద్యోగాలు లభించకపోవడం వల్ల కులవృత్తుల మీద ఆధారపడిన కులాల వారి కంటే కులవృత్తులను విడనాడిన వారిలో ఉద్యోగ సమస్య మెచ్చుగా కనబడుతుంది. కుల వృత్తులను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్య కొంతవరకు పరిష్కారం కాగలదని ప్రజలు కొందరు అభిప్రాయపడుతున్నారు. కొద్దికాలంగా కుల వృత్తుల మీద అగౌరవం, అనిశ్చితం ప్రదర్శించడం జరుగుతూ వచ్చింది. ఈ భావానికి పై తరాల వారే కొంతవరకు కారకులని చెప్పవలె. కుల వృత్తులలో ఉన్న కష్టనష్టాలను, శ్రమను అనుభవించిన పై తరాల వారు తమ పిల్లలు కుల వృత్తులను స్వీకరించడానికి అంగీకరంచడం లేదు. కొత్తగా ఏర్పడిన విద్య, ఉద్యోగ అవకాశాల మీద వారికి వున్న మోజే కుల వృత్తుల పట్ల వారికి వున్న చిన్నచూపుకు కొంతవరకు కారణము. ఉదా: బ్రాహ్మణులు తమ పిల్లలు వైదీక వృత్తిని స్వీకరించడానికి అంగీకరించడం లేదు. వ్యవసాయ వృత్తి మీద ఆధారపడిన కులాల వారు తమ తమ పిల్లలను వ్యవసాయ వృత్తిని స్వీకరించడానికి అనుమతించడంలేదు. అట్లే చాకలి, మంగలి, కంసాలి తదితర కులాల వారు తమ పిల్లలను తమ కులవృత్తులను స్వీకరించకుండా నిరుత్సాహ పరుస్తున్నారు. కానీ, ఉద్యోగాలు దొరకక నిస్పృహ చెందిన యువకులు తమ జీవనోపాధికి కులవృత్తులుగా వున్న కులాలకు చెందిన యువకులు వారి వారి కుల వృత్తులను స్వీకరిస్తున్నారు. ఒక్క పక్క కులవృత్తుల పట్ల అనిష్టత మరోపక్క కులవృత్తులను స్వీకరించడం వల్ల తప్ప ఇతర అవకాశాలు లేవనే గుర్తింపు అనే పరస్పర విరుద్ధమైన విచిత్ర పరిస్థితి ఈనాడు మన సమాజంలో ఉన్నది. కుల వృత్తులలో మార్పు వచ్చినా కులాల పేర్లలో మాత్రం మార్పు రాలేదు. వ్యక్తులు కులవృత్తులను విడిచిపెట్టినా వారిని ఆయా కులాల పేర్లతోనే పిలుస్తున్నారు.

ఉదా: చాకలి, మంగలి, కంసాలి మొ॥ కులాల వారు తమ వృత్తులను విడనాడి వేరే ఉద్యోగాలను చేపట్టినప్పటికీ ఆయా కులాలకు చెందిన వ్యక్తులుగానే పరిగణిస్తున్నారు.

4. **భూస్వామ్యంలో మార్పు:** ఈనాడు భూస్వామ్యంలో మార్పు వచ్చింది. భూస్వామ్యంతోపాటు వివిధ కులాల మధ్య అధికారంలో కూడా గతిశీలత జరిగింది. బూముల మీద అధికారం దేశమంతటా, అన్ని గ్రామాలలో ఒకే కులానికి మాత్రమే చెంది ఉండలేదు. ఉదాహరణకు: ఆంధ్రప్రదేశ్‌లో ఒక సర్కారు ప్రాంతంలోనే వివిధ కులాల వారు భూస్వామ్యాన్ని చలాయిస్తున్నారు. కొన్ని గ్రామాలలో కమ్మ వారు, మరికొన్ని గ్రామాలలో బ్రాహ్మణులు ఈ అధికారాన్ని పొంది ఉన్నారు. కాపు, వెలమ, కళింగ కులాల వారు కూడా భూస్వామ్యపు అధికారము అనుభవించే గ్రామాలు ఎన్నో ఉన్నాయి. తరతరాలుగా గ్రామాలలో ఒకే కులం బూస్వామ్యం చలాయించే రోజులు పోయినాయి. ఆర్థికంగా పైకి రాగలిగిన కులాలు ఈనాడు భూస్వామ్యంలో తమపాలు పంచుకొంటున్నారు. ఆర్థిక స్థోతమత ఈనాడు ఒకే కులానికి పరిమితం కాదు. ఆర్థికంగా ఉన్నత అంతస్థుకు చెందిన వారిలో అన్ని కులాల వారు ఉన్నారు. భూస్వామ్యంలో వివిధ కులాల మధ్య గతిశీలత జరిగింది. దీనివల్ల ప్రాబల్య కులాల ఆధిపత్యం కొంతవరకు తగ్గింది. ఉదాహరణకు: గతంలో కొన్ని గ్రామాలలో బ్రాహ్మణులలో భూస్వామ్యం ఉండడం వల్ల వారు తమ ఉన్నత అంతస్థుతోపాటు గ్రామస్తుల మీద అజమాయిషీ చలాయిస్తుండేవారు. ఈనాడు భూములు, అగ్రహారాలు పోగొట్టుకున్న బ్రాహ్మణులు తమ పూర్వ ప్రాబల్యాన్ని కోల్పోయినారు. అదే విధంగా కమ్మ, రెడ్డి, రాజపుత్ర, కాయస్థ మొదలైన వారు అనేక గ్రామాలలో తమ ప్రాబల్యాన్ని పోగొట్టుకున్నారు. భూస్వామ్యం నేడు అనేక కులాల వారు పంచుకొంటున్నారు. భూస్వామ్యంలో మార్పు రావడం ద్వారా గతంలో అధికారం లేని కులాలు ఈనాడు దానిని పొందడం, గతంలో అధికారం ఉన్న కులాలు ఈనాడు దానిని కోల్పోవడం కనబడుతుంది. భూస్వామ్యం వల్ల ఏర్పడిన గతిశీలతే దీనికి

ముఖ్యకారణము. హెచ్చు భూమిని సంపాదించుకున్న ప్రతి వ్యక్తీ కులానికి చెందిన ఉన్నత వర్గం (Upper Class)లో సభ్యత్వాన్ని పొందుతున్నాడు. ఉన్నత వర్గానికి చెందటమేకాక ఉన్నత వర్గ సభ్యులు పొందే ప్రయోజనాలను పొందగలుగుతున్నాడు. కుల వ్యవస్థ ప్రభావంతోపాటు వర్గ వ్యవస్థ ప్రభావం కూడా ఈనాడు చాలా మంది వ్యక్తుల ప్రవర్తనలో కనబడుతుంది. అటు ఉన్న కులానికి, ఇటు ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తులు కొందరున్నారు. ఉన్నత కులాలు పొందే లాభాన్నే కాక ఉన్నత వర్గాల వారు పొందే లాభాన్ని కూడా వీరు పొందుతున్నారు. వీరు సమాజంలో హెచ్చు అధికారాన్ని చలాయిస్తున్నారు. వీరిని నూతన సంపన్నులుగా (New Rich) పరిగణిస్తున్నారు. కుల సభ్యులుగా గతంలో గౌరవాన్ని పొందలేని వ్యక్తులలో కొందరు ఈనాడు భూస్వామ్యంలో మార్పు రావడం వల్ల వర్గ సభ్యత్వం వల్ల దానిని పొందగలుగుతున్నారు. బూస్వామ్యం ద్వారా ఏర్పడిన ప్రాబల్య కులాల ఆధిక్యతను పూర్తిగా అంతమొందించడానికే ఈనాడు భూసంస్కరణలను ప్రవేశపెడుతున్నారు.

5. **ప్రాబల్య కులాలలో మార్పు**: సనాతన హిందూ సమాజంలో ప్రాబల్య కులానికి చెప్పతగ్గవి ఏమైనా ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. సాంఘీక, ఆర్థిక, రాజకీయ అంతస్తులలో కులాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయనే విషయం నిర్వివాదాంశం. అయితే, ఒక కులం వారు మిగతా కులాల వారి మీద ఆచారబద్ధం కానటువంటి అధికారాన్ని చలాయించి, ప్రాబల్య కులాలుగా రూపొందినట్లు ప్రాచీన భారతీయ సాహిత్యంలో ఆధారాలు లేవు. కులాల మధ్య ఐకమత్యము, సహకారము, సహజీవనము ఉండేవి. సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలలో అన్య కులాల మీద అజమాయిషీ చేయడం ద్వారా ప్రాబల్య కులంగా మారాలనే అభిలాష ఏ కులానికీ ఉండేది కాదు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భారతదేశంలో వివిధ కులాల అంతస్థులలో మార్పు వచ్చింది. పారిశ్రామిక వ్యవస్థాపన వల్ల వాణిజ్య పంటలకు ప్రాధాన్యం వచ్చింది. వ్యవసాయ వృత్తుల మీద ఆధారపడిన కులాలు అధిక ధనాన్ని ఇచ్చే వాణిజ్య పంటలను పండించటం మొదలు పెట్టినారు. దీనివల్ల కొన్ని కులాల వారు ఆర్థికంగా పైకి రావడం, ఉన్నత వర్గస్థాయికి చేరుకోవడం జరిగింది. ఒక్కసారి ఆర్థికంగా పైకి వచ్చిన కులాలు ప్రాబల్య కులాలుగా రూపొందడం జరిగింది.

వ్యవసాయేతర వృత్తుల మీద ఆధారపడిన కొన్ని కులాలలో కూడా ప్రాబల్య కులాలు ఉన్నాయి. కొన్ని గ్రామాలలో ఆచార రీత్యా ఉన్నత స్థానం ఆక్రమించుకొన్న బ్రాహ్మణులు పరిస్థితులు అనుకూలంగా ఉండడం చేతను అధికారం చలాయించవలెననే కోరిక ఉండడం చేతను వారు కూడా ప్రాబల్య కులంగా మారడం జరిగింది. అట్లాగే వాణిజ్య వ్యాపారాల వల్ల ఆర్థికంగా పైకి రాగలిగిన కింది కులాలు కూడా ప్రాబల్య కులాలుగా రూపొందినాయి. ఒకసారి ప్రాబల్య కులంగా రూపొందగానే ఆ కులానికి చెందిన వారు సాంఘీక, ఆర్థిక, రాజకీయ విషయాలలో జోక్యం చేసుకోవడం జరుగుతుంది. ఈ విషయంలో అన్నీ కులాల కంటే తమదే పైచేయి అనే భావం కలిగి ఉండడం సహజము. గత శతాబ్దం నుంచి పెక్కు గ్రామాలలోను, పట్టణాలలోను కొన్ని కులాలు ప్రాబల్య కులాలుగా రూపొందినాయి. అయితే ఈనాడు సాంఘీక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలలో ప్రవేశపెట్టిన మార్పుల ఫలితంగా ప్రాబల్య కులాల ఆధిపత్యం కొంతవరకు తగ్గిందని చెప్పవచ్చు. రాజకీయంగా బలాన్ని సంపాదించుకున్న కింది కులాలు ప్రాబల్య కులాలుగా చలామణి అయిన కులాలు ఈనాడు ముఖ్యంగా ఎన్నికల సమయంలో కింది కులాల సహాయాన్ని అర్థించవలసి వచ్చింది. ప్రాబల్య కులాల వారు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలనే తలంపుతో తమ అంతిమ ప్రయత్నంగా క్రింది కులాల వారి మీద కొన్ని అత్యాచారాలకు పూనుకోవడం మనకు అక్కడక్కడ కనబడుతుంది. అటు అధికారం పోతుందనే భయం వల్లను, ఇటు రాజకీయంగా, ఆర్థికంగా బలాన్ని సంపాదించుకోగలిగిన కింది కులాలు ప్రాబల్య కులాల నాయకత్వాన్ని ప్రతిఘటించడం వల్లను కులాల మధ్య కొన్ని సంఘర్షణలు ఏర్పడుతున్నాయి.

6. **రాజకీయాధికారంలో మార్పులు**: కొద్ది కాలం కిందటి వరకు రాజకీయాధికారము ప్రాబల్య కులాల చేతులలో ఉండేది. రాజకీయాలలో వారు ఆడింది ఆటగాను, పాడింది పాటగాను ఉండేది. కానీ, ఈనాడు వారు తమ రాజకీయాధికారాన్ని చాలా వరకు కోల్పోయినారు. వయోజన ఓటింగ్ పద్ధతి వల్ల కింది కులాల వారు కూడా రాజకీయాధికారంలో భాగం పంచుకొంటున్నారు. కింది కులాల వారి రాజకీయ అంతస్థులో గణనీయమైన మార్పు వచ్చింది. ఈనాడు ముఖ్యంగా 1971వ సం॥లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కింది కులాల వారు రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించినారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజకీయ వ్యవస్థలో వచ్చినన్ని మార్పులు మరే వ్యవస్థలో రాలేదని చెప్పవచ్చు. ఉన్నత

రాజకీయ అంతస్థు కోసం అన్ని కులాల వారు యథాశక్తి పాటుపడుతున్నారు. వివిధ రాజకీయ పార్టీల మధ్య పోటీ జరగడం అన్ని దేశాలలోను ఉండే సహజ ప్రక్రియే. కానీ, మన దేశంలో రాజకీయాధికారం కోసం ఒక్క రాజకీయ పార్టీలోనే కాక కులాల మధ్య కూడా పోటీ సాగుతున్నది. అయితే దీని ప్రభావం సమాజంలో ఏవిధంగా ఉంటుందో చూడవలసి ఉన్నది. సాంఘిక, ఆర్థిక అంతస్థులో నిమిత్తం లేకుండానే ఈనాడు కొన్ని కులాల వారు రాజకీయాధికారాన్ని పొందుతున్నారు. ఉదాహరణకు హరిజనులు కింది అంతస్థుకు చెందియున్నారు. అయినప్పటికీ వారిలో వచ్చిన రాజకీయ చైతన్యం ద్వారా వారు రాజకీయాధికారంలో భాగం పంచుకొంటున్నారు. అంటే ఈనాడు మన దేశంలో సామాజిక, ఆర్థిక అంతస్థులు రాజకీయాధికారాన్ని సృష్టించలేకపోతున్నాయి. రాజకీయాధికారమే వ్యక్తుల సమూహాల సామాజిక, ఆర్థిక అంతస్థులను సృష్టిస్తున్నది. కుల సభ్యుడు గాను, వర్గ సభ్యుడు గాను అవకాశాన్ని పొందలేని వాడు రాజకీయాలలో పాల్గొనడం ద్వారా వాటిని పొందగలుగుతున్నాడు. 1971లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలోను, 1972లో రాష్ట్ర విధాన సభకు జరిగిన సాధారణ ఎన్నికలలోను ఈ విషయం ఋజువైంది. ధనిక వర్గాల వారు, ప్రాబల్య కులాల వారు ఈ ఎన్నికలలో పరాజయం పొందినారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాల అభ్యర్థులు గెలుపొందడం జరిగింది.

7. **కులాల అంతస్థులో మార్పులు:** వివిధ కులాల సామాజిక అంతస్థులో మార్పు వచ్చింది. వివిధ కులాల మధ్య కొత్త రకమైన సంబంధం ఏర్పడినాయి. వ్యక్తి సామాజిక అంతస్తు, అధికారము పూర్తిగా కులం మీద ఆధారపడలేదని చెప్పవచ్చు. కింది కులాల వారెందరో ఈనాడు ఉన్నత సామాజిక అంతస్తును ఆక్రమించినారు. సృజనాత్మకమైన మార్పులు ఏవో కొన్ని సామాజిక వ్యవస్థలో రావడం జరిగింది. ఆ మార్పులే వివిధ కులాలకు చెందిన వ్యక్తుల సామాజిక అంతస్థులో వచ్చిన మార్పుకు కారణము. రాజకీయ, ఆర్థిక, విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పు ఫలితంగా వ్యక్తుల యొక్క రాజకీయ, ఆర్థిక, విద్యా అంతస్థులలో మార్పు వచ్చినట్లే సామాజిక వ్యవస్థలో కూడా మార్పు రావడం వల్లనే వ్యక్తుల యొక్క సామాజిక వ్యవస్థలో మార్పు వచ్చింది. ఉదా: ఉన్నత పదవి, ఉద్యోగము, విద్య, ధనము ఉన్నప్పటికీ ఉన్నత కులానికి చెందినప్పటి సమాజంలో గౌరవాన్ని పొందలేని వ్యక్తులెందరో ఈనాడు మనకు కనబడుతున్నారు. సామాజిక వ్యవస్థలో వచ్చిన మార్పులే దీనికి కారణమని చెప్పవచ్చు.

8. **కులాల సాంఘిక సంబంధాలలో మార్పులు:** వివిధ వ్యక్తుల మధ్య సమూహాల మధ్య ఎప్పుడూ ఒకే రకమైన సంబంధాలు ఉండవు. కొత్త సంబంధాలు ఏర్పడతాయి. అదే విధంగా కులాల మధ్య ఎల్లప్పుడూ ఒకే రకమైన సంబంధాలు ఏర్పడి ఉండలేదు. వివిధ కాలాలలో వివిధ కులాలకు వివిధ ప్రక్రియలుండేవి. సనాతన హిందూ సమాజంలో కులాలే ఐకమత్యాన్ని, సహకారాన్ని కల్గి ఉండేవి. బ్రిటీషు వారి పరిపాలనా కాలంలో కులాల మధ్య అసహనం, సంఘర్షణ, విద్వేషాల వంటి విభేదాలు పెరిగినాయి. బ్రిటీషు పాలకుల "విభజించి పాలించడం" అనే సిద్ధాంత ఫలితంగా ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో కులాల మధ్య అనేక సంఘర్షణలు జరిగినాయి. ఒక కులం వారు మరొక కులం వారి మీద అసభ్యకరంగా ప్రవర్తించడం జరిగింది. బ్రిటీషు వారి కాలంలో బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులకు మధ్య ద్వేష పూరితమైన వాతావరణం ఏర్పడింది. కానీ, ఈనాడు కులాల మధ్య ద్వేషాలను రేకెత్తించే ప్రయత్నాలకు స్వస్తి చెప్పడం జరిగింది. ఈనాడు కులాల మధ్య సంబంధాలు మరొక రకంగా ఉన్నాయి. కులాల మధ్య ఈనాడు పోటీతో కూడిన సంబంధాలు ఉన్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధన కోసం అన్ని కులాల మధ్య పోటీ కొనసాగుతుంది. ఈ పోటీ వల్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అన్ని కులాల వారు సమాన స్థాయిని చేరుకోవడానికి అవకాశం వుంది. ఇప్పటికీ కొన్ని వెనుకబడిన కులాల వారు ఈ పోటీ వల్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతస్థులో ఉన్న తస్థానాన్ని ఆక్రమించుకోవడం జరుగుతుంది. ప్రాథమిక హక్కుల కోసం అన్ని కులాల వారు కృషిచేయవలసిందే. వారిలో ద్వేష రహితమైన పోటీ ఉండవలసిందే. అయితే కొన్ని సందర్భాలలో కులాల మధ్య పోటీ విషమ పరిస్థితికి దారితీస్తోంది.

గతంలో ప్రాబల్యం ఉండి, ప్రస్తుతం అధికారానన్ని చలాయిస్తున్న కులాలకు రాజకీయంగా చైతన్యవంతమయిన వెనుకబడిన కులాలకు మధ్య అప్పుడప్పుడు సంఘర్షణలు జరుగుతున్నాయి. మారుతున్న పరిస్థితులలో ఒకపక్క రాజకీయ అధికారం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని మరొక పక్క ఆ అధికారాన్ని నిలబెట్టుకోవాలనే తలంపుతో ప్రాబల్యం ఉన్న కులాలు మిగతా కులాల మీద కొన్ని అత్యాచారాలకు పూనుకోవడం కొన్నిచోట్ల జరుగుతున్నది. ప్రాబల్యం ఉన్న కులాల

ఆధిపత్యాన్ని తగ్గించాలనే తలంపుతోనే మన ప్రభుత్వం భూకమతాలను, భూస్వామ్యాన్ని పట్టణంలో ఆస్తులను పరిమితం చేసే కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తున్నది. అటువంటి పరిస్థితులలో ప్రాబల్యం వున్న కులాలకు వెనుకబడిన కులాలకు మధ్య జరిగే సంఘర్షణలు ఎక్కువవుతాయనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం అమలు పరిచే కార్యక్రమాల వల్ల తరతరాలుగా ఉన్నత అంతస్థును, అధికారాన్ని అనుభవిస్తున్న కులాలు గాని, భూస్వామ్యులు గాని, ఆస్తిపరులు గాని, తమ ఆధిపత్యాన్ని పోగొట్టుకోక తప్పదు. అంతమాత్రం చేత తోటి ప్రజల పట్ల ఈర్ష్య కలిగి ఉండడం శ్రేయస్కరం కాదు.

భూస్వామ్యంలోను, రాజకీయాధికారంలోను, సనాతన హిందూ సమాజంలో కూడా వివిధ కులాల మధ్య గతిశీలత ఉండినట్లు యమ్.యన్.శ్రీనివాస్ తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. భూస్వామ్యంలోను, రాజకీయ అధికారంలోను కులాల మధ్య గతిశీలత ఎల్లప్పుడూ పైకి, కిందకు జరుగుతూనే ఉండేది. ఇందులో కొత్త ఏమీలేదు. అదే విధంగా ఈనాడు కూడా అంస్థలలో వివిధ కులాల మధ్య గతిశీలత జరుగుతున్నట్లు భావించడం ఎంతైనా అవసరం. ఏ కుల, మత, రాజకీయ పార్టీకి చెందినా భారతీయులందరూ ఒకే జాతి అనే భావన మనలో దృఢంగా నాటుకొని ఉన్నది. ఏ శక్తి వారిని విడదీయలేదు అనే విషయం చైనాతోను, పాకిస్థాన్‌తోను ఈ మధ్య జరిగిన యుద్ధాల వల్ల ఈ విషయం స్పష్టమైంది.

9. **అంతర్వివాహ నియమాలలో మార్పులు:** ఏ కులం వారు ఆ కులంలోనే వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలనే నియమం సనాతన కాలం నుంచి హిందూ సమాజంలో వస్తున్నది. వివాహ రీత్యా కులం అంతర్గతానికి సంబంధించినది. అయితే ఈనాడు వర్ణాంతర వివాహాలను చట్ట సమ్మతం చేసినారు. కానీ, వివాహానికి సంబంధించి కుల వ్యవస్థలో మార్పులు లేవని చెప్పవలెను. గ్రామాలలో ఈనాటికీ సరైన ప్రోత్సాహం లభించడంలేదు. వర్ణాంతర వివాహాలు పట్టణ సముదాయాలలో ఉన్న కొంత మంది యువతీ, యువకులకే పరిమితమయినాయి. తమ కులంలో వివాహ సంబంధాలు కుదుర్చుకోవడం హెచ్చుగా జరుగుతుంది.

10. **కులాల సంస్కారపరమైన అంతస్థులో మార్పు:** కొద్ది కాలంగా కింది కులాలలో సంస్కృతీకరణ ప్రక్రియ జరుగుతున్నది. సంస్కృతీకరణ ప్రభావం వల్ల మత సంబంధమైన కర్మకాండలలో కింది కులాల వారు, పై కులాల వారికి దగ్గరగా వచ్చినారు. సామాజిక అంతస్థులో కింది కులాల్లో ఉన్న వారే హిందూ కర్మకాండను తరతరాలుగా పరిరక్షించేవారు కావడం ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. మతపరమైన కర్మల నిర్వహణలో వివిధ కులాల వారు సన్నిహితులైనప్పటికీ మత అంతస్తులో మాత్రం మార్పు రాలేదని చెప్పవలె. గ్రామాలలో మత సంబంధమైన ఉత్సవాలలో సనాతన హిందూ సమాజంలో ఉన్నటువంటి అంతస్థులనే ఈనాటికీ వివిధ కులాల వారు పాటిస్తున్నారు. ఉదా: ఇప్పటికీ మత పరమైన కర్మకాండను బ్రాహ్మణులే జరుపుతున్నారు.

కులతత్వము (Castiesm) ఈనాటి కుల వ్యవస్థతో సంబంధ ఉన్న సమస్యలలో కులతత్వం ఒకటి. ఒక కులం వారు మరొక కులం వారి పట్ల ఈర్ష్య, ద్వేషం, పక్షపాతాలతో కూడిన ప్రవర్తనతో ఉండే ప్రక్రియను కులతత్వమంటారు. ఒక కులం వారు సమాజంలో తమకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాబల్యం ఉపయోగించుకొని తమ కులాల వారి బాగోగులకు ప్రాముఖ్యం ఇస్తూ అన్య కులస్తులను చిన్న చూపు చూస్తూ వారిని అణగదొక్కేవలెననే తలంపు కలిగి ఉంటడం ఈ కులతత్వంలో ప్రధానంగా కనబడుతుంది. ఇది ఒక అంటుజాడ్యంగా తయారయింది. కులాల మధ్య అసహనాన్ని రేకెత్తిస్తున్నది. వివిధ కులాల మధ్య అన్ని రంగాలలో పోటీలు, తగాదాలు పెరిగిపోతున్నాయి. ఒక కులం పెత్తనాన్ని మరొక కులం వ్యతిరేకిస్తున్నది. ఉద్యోగం కేటాయించడంలో కుల ప్రభావం కనబడుతుంది. అధికారంలో ఉన్న వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి తమ కులస్తుకే ఉద్యోగాలు ఇప్పించడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. రాజకీయాలలో ఈ కులతత్వ ప్రభావం ఎంతగానో కనబడుతుంది. రాజకీయాలలో ఒక కులం అధికారాన్ని మిగతా కులాల వారు ప్రతిఘటిస్తున్నారు. ఎవరికి వారు తమ కుల ఆధిపత్యాన్ని నిలబెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి ప్రయత్నాలలో పోటీకి దగ్గరలో ఉన్న కులాల వారిని అణగదొక్కడం ఉన్నది. కులతత్వం ఈనాడు సముదాయాలలో విలయ తాండవం చేస్తున్నది. పార్లమెంటు మొదలు గ్రామ పంచాయతీ వరకు జరిగే ఎన్నికలలో కుల ప్రాతిపదికన ఎన్నో హింసాత్మక చర్యలు జరుగుతున్నాయి.

కులద్వేషాల వల్ల కులాల మధ్య హింసాయుతమైన సంఘర్షణలు, కలహాలు ఎక్కువగా బయలుదేరుతున్నాయి. ఎన్నికల సమయాలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను పరిశీలించకుండానే కులాలను బట్టి ఓటు వేయడం కూడా జరుగుతుంది.

కులతత్వ బీజాలను ప్రప్రథమంగా బ్రిటీషు వారే నాటినట్లు చెప్పవచ్చు. బ్రిటీషు వారు మన దేశంలో కాలు పెట్టక ముందు కులాల మధ్య, మతాల మధ్య సామరస్యం ఉండేది. ముఖ్యంగా మొగలుల పరిపాలనా కాలంలో కులాల మధ్య ద్వేషాలు అంతగా లేవని చెప్పవలె. బ్రిటీషు వారు నెలకొల్పిన విద్యా విధానం, ఉద్యోగావకాశాల వల్ల మొదట పై కులస్థులే హెచ్చుగా లాభం పొందడం జరిగింది. సివిల్ సర్వీసెస్ అధికారులు గాను, లాయర్లు, డాక్టర్లు, అధ్యాపకులు, గుమస్తాలు గాను మొదట మూడు కులాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. కొత్త వాణిజ్య వ్యాపారావకాశాలలో మాత్రం కింది కులాలకు చెందిన వారు కొందరు లాభం పొందినారు. కానీ, 1857వ సంవత్సరములో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సమరంలో అగ్రకులాల వారే హెచ్చుగా పాల్గొనడం చేత బ్రిటీషు పాలకులకు పై కులాలపై మోజు తగ్గింది. అప్పుడు వారు కింది కులాల వారిని ఉన్నత స్థాయికి తీసుకురావలెనని నిశ్చయించినారు. వారి అభివృద్ధికి బ్రిటీషు వారు చాలా అవకాశాలను కల్పించినారు. కింది కులాలకు సైన్యంలో హెచ్చు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఈ విధంగా కింది కులాల వారిని పై అంతస్థుకు తీసుకువచ్చినారు.

విభజించి పాలించడమే (మిత్రభేదమే) రాజకీయ విధానం కాబట్టి వారిట్టి ప్రయత్నానికి పాల్పడినారు. దీనివల్ల కులాల మధ్య విభేదాలు ఏర్పడి కుల వ్యవస్థ కలుషితం కావడం ఆరంభమైంది. ఒక కులం వారు మరొక కులం వారిని ద్వేషించడం మొదలైంది. ఈ విధంగా కులతత్వం హిందువుల మధ్య అనైక్యతకు దారితీసింది.

బ్రిటీషు పరిపాలన అంతమై స్వతంత్ర భారతదేశంగా ఏర్పాటైనా కూడా ఈ కులతత్వ పిశాచం మనలను విడిచిపెట్టలేదు. అయితే ఈనాడు మనముందున్న కులతత్వానికి, బ్రిటీషు వారి కాలంలో ఉన్న కులతత్వానికి మధ్య కొంత భేదం ఉంది. బ్రిటీషు వారి కాలంలో కులలత్వం కులాల మధ్య ద్వేషాలను రేకెత్తించడానికే తోడ్పడింది. ఈనాటి కులతత్వం అలా కాకుండా ప్రతి కులం వాడు తమ హక్కుల రక్షణ కోసం పోరాటం జరపడం ఒక ముఖ్య లక్షణమయింది. ఏ కులం వారు ఆ కులం వారి అభివృద్ధి కోసం పోరాడడం వారి లక్ష్యము. ఈ లక్ష్య సాధనమే ఈనాటి కులతత్వ ముఖ్యఉద్దేశ్యం. అంతేగానీ పూర్తిగా కుల వ్యవస్థను, కులాన్ని నిర్మూలించవలెనని పోరాటం ఈ మధ్య జరగడం లేదు. ఒక కులం వారు మిగతా కులస్తులను దూషించవలెననే తలంపు ఈనాటి కులతత్వంలో ప్రధాన విషయం కాదు. ఏ విధంగా భారత రాజ్యాంగం వ్యక్తుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానతను హెచ్చరిస్తున్నదో అదే విధంగా ఈనాడు మనకు కనబడే కులతత్వం కూడా అట్టి హెచ్చరిక చేస్తున్నది. ప్రతి కులం వారు తమ సాంఘీక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి మరొక కులం వారితో పోటీపడడం సామాజిక దృష్ట్యా కొంత వరకు మంచిదే అవుతుంది. కులతత్వం కులాల మధ్య అభ్యుదయ భావాలను పెంపొందిస్తుంది. అటువంటి భావాలు ఉన్నప్పుడే వివిధ కులాలకు సమస్యలను ఎదుర్కొవడానికి వీలవుతుంది. అయితే అటువంటి లక్ష్య సాధన విస్మరించి కులాల మధ్య ద్వేషాన్ని రగిలించే కులతత్వం మాత్రం చాలా ప్రమాదకరమైనదని గుర్తు ఉంచుకోవలెను. గతంలో కులాల మధ్య ద్వేషాలను రగిలించే ప్రయత్నాలు ఎన్నో జరిగినాయి. అటువంటి ప్రయత్నాలు తిగిరి ఈనాడు తలెత్తకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయునిదని గుర్తుంచుకొనవలెను.

## 4.4 ఆధునిక సమాజంలో కులము:

పైన వివరించిన అంశాల వలన కుల వ్యవస్థలో కొన్ని మార్పులు సంభవించినప్పటికీ, ఈనాటికీ సమాజంలో కుల వ్యవస్థ వ్రేళ్లు పాతుకునే ఉందని చెప్పవచ్చును. అయితే సాంప్రదాయక కుల వ్యవస్థకు, ఇప్పటి కుల వ్యవస్థకు చాలా తేడాలున్నాయి. కుల వ్యవస్థలో అనేక కారణాల వలన మార్పులు సంభవించినాయి. ముఖ్యంగా సభ్యులు ఈనాడు పూర్తిగా వంశపారంపర్య వృత్తులను అనుసరించుటలేదు. ఎవరికి అనువుగా ఉన్న వృత్తులను వారు చేపడుతున్నారు. ఆహార నిషేధాలను కూడా కుల వ్యవస్థలో సభ్యులు పాటించుటలేదు. వివాహ పరమైన అంశాలలో కూడా మార్పులు చోటుచేసుకున్నవి. సభ్యులు కులాంతర వివాహాలను కూడా జరుపుకుంటున్నారు. అంటే ఒక కులంలోని వారు మరొక కులంలోని వారితో వివాహ సంబంధాలు కలుపుకుంటున్నారు. అన్ని కులాల వారు కలిసి మెలిసి సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. రాను రాను మతము తన ప్రాబల్యాన్ని,

ప్రభావాన్ని కులము మీద చూపలేకపోతున్నది. కలిసి మెలిసి చదువుతున్నారు. కలిసిమెలిసి తిరుగుతున్నారు. కలిసి మెలిసి ఉద్యోగాలు చేస్తున్నారు. సూక్ష్మంగా చెప్పవలెనంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కుల వ్యవస్థలో అనేక మార్పులు సంభవించినాయి. పారిశ్రామికీకరణము, నగరీకరణము కుల వ్యవస్థలో ఎన్నెన్నో మార్పులకు కారణాలైనాయి. వీటివల్ల ఉమ్మడి కుటుంబం యొక్క నిర్మితి, రూపము మారిపోయి తద్వారా కులవృత్తి ప్రమాణం వీగిపోయింది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై కుల సభ్యులు కులవృత్తిని విడనాడటంతో కుల వ్యవస్థ తారుమారు అయ్యింది. వ్యక్తులు స్త్రీ, పురుష విచక్షణ, కుల విచక్షణ పాటించకుండా కలిసిమెలిసి చదువుకునే విధానము, కలిసిమెలిసి ఉద్యోగాలు చేసుకొనే విధానము మొదలైనవి వచ్చి కుల వ్యవస్థలో మార్పులు తెచ్చినాయి. వీటికి తోడు రాకపోకల సౌకర్యాలు అభివృద్ధి చెందడం, వ్యక్తులు కలిసి దూరపు ప్రయాణాలు చేయడం, ఆ ప్రయాణాలలో కలిసి భోజనాలు చేయడం ఇత్యాదులు కుల వ్యవస్థలో ఇంకా మార్పులు తెచ్చినాయి. వీటన్నిటికంటే ముఖ్యమైనది ఆంగ్ల విద్యా విధానము. పాశ్చాత్య సంస్కృతి, పాశ్చాత్య విధానాలు వీటన్నిటి ప్రభావం వలన కుల వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చినాయి.

కుల వ్యవస్థపైన అనేక మంది సమాజ శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరిపినారు. ఈనాటికీ ఈ సమస్య అనేక మంది సమాజ శాస్త్రజ్ఞులనే కాక, సమాజ శాస్త్ర విద్యార్థులను కూడా ఆకర్షిస్తున్నది. ఇటీవల జరిపిన సర్వేలో శ్రీలక్ష్మన్న గారు రచించిన "Caste Dynamics in Village India", యోగేష్ అతల్ రచించిన "The Changing Frontiers of Caste" గ్రంథాలలో బోజన పానియాది విషయాలలో (Communal Taboos) ఆంక్షలను గురించి విస్తారంగా చర్చించినారు.

లక్ష్మన్న గారు ఆంధ్ర ప్రాంతంలో జరిపిన సర్వేననుసరించి వ్రాసిన గ్రంథము, యోగేష్ అతల్ ఉత్తర భారతదేశంలో భాగమైన రాజస్థాన్‌లోని గ్రామాలలో జరిపిన సర్వే ఆధారంగా వ్రాసిన గ్రంథము ఒక రకంగా ఇవి రెండు ఉత్తర, దక్షిణ భారతదేశములో జరిపినవి కనుక కుల వ్యవస్థ ప్రస్తుత పరిస్థితిని కొంత సమగ్రంగా వివరిస్తాయి. దేశంలో ఇంకా అనేక ప్రాంతాలలో వ్యక్తిగతంగాను, సంస్థలు జరిపిన పరిశోధనలు కూడా గ్రంథ రూపంలో అనేకం ఉన్నవి.

కులము అంతర్వివాహాలను పాటించడమే కాక, భోజన పానియాలలో కూడా అంతస్సమూహ లక్షణాలను పాటిస్తున్నది. ఈ లక్షణాలను ఒక శతాబ్దం పూర్వము ఎక్కువగా పాటించే వారు. అందుకే హాట్టన్ "వ్యక్తి తనకంటే తక్కువ కులము వారిచేత అన్నము తినడనేది ఆంక్ష". ఇదే కులము యొక్క పవిత్రతను కాపాడుటకు గీటురాయి అని అభిప్రాయపడినాడు.

శ్రీ లక్ష్మన్న రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలో సర్వే జరిపినప్పుడు కులంలోని ఉపకులాల మధ్య ఏకపంక్తి భోజనం నిషేధం కాదని వ్రాసినారు. ఉదా: బ్రాహ్మణులలో మధ్వులు, స్మార్తులు, ఆరాధ్యులు వీరంతా ఏకపంక్తి భోజనం చేస్తారు. కానీ, శ్రీవైష్ణవులు ఏకపంక్తి బోజనం చేయరు. కానీ వివాహాది సంబంధాలు ఒకరితో ఒకరు ఏర్పరచుకునే వారు కాదు. ఇప్పటికే కొన్ని పల్లె ప్రాంతాలలో పాటించనప్పటికీ పట్టణ ప్రాంతాలలో వివాహాది సంబంధాలేర్పరచుకొనటంలో ఎట్టి ఆక్షేపణా లేదు. లక్ష్మన్న గారు కులంలోని ఉపకులాల మధ్య కంటే, కులాల మధ్య ఆహారము గ్రహించుటలో కఠినమైన ఆంక్షలున్నట్లు వ్రాసినారు.

యోగేష్ అతల్, లక్ష్మన్న జరిపిన సర్వేల ఫలితంగా ఇద్దరూ కులము క్రమేపీ అంతరిస్తుందా? అన్న విషయంపై ఒక అభిప్రాయాన్ని వెలిబుచ్చినారు. ఈ ప్రశ్నకి సమాధానంగా ముందు వారు జరిపిన సర్వే ఫలితాలను తెలుసుకొనవలెను. బోజన పానీయాదుల విషయంలో, వివాహాది సంబంధాలలో సాంప్రదాయకమైన కులవృత్తుల ననుసరించుటలో ఆజ్ఞలను, నిషేధాలను గ్రామీణ ప్రాంత ప్రజలు కుల నిబంధనలను పాటిస్తున్నారు. అగ్రకులాలకు చెందిన వారు, ఆర్థికంగా, సామాజికంగా పై అంతస్థులో ఉన్న వారు కులాంతర వివాహాలకు దోహదం చేస్తున్నారు. ఆర్థిక కారణాల వలన, సంస్కారాలపైన ఆధారపడి క్రమ శ్రేణీకరణం విచ్ఛిన్నమవుతున్నది. దేశంలో జరుగుతున్న అనేక మార్పులు, భూసంబంధమైన చట్టాల ఫలితంగా అనేక కులాలు తమ వృత్తిని కాకపోయినప్పటికీ వ్యవసాయాన్ని చేపడుతున్నవి. ఇతర వృత్తుల స్వీకారంలో కూడా అదే కారణంగా భావించవచ్చు. అనేక విధాలుగా మారిన పరిస్థితులలో కూడా కులం నిలద్రొక్కుకొనుచున్నది. దాని ప్రకార్యాలు, రూపము, నగర వాతావరణంలో ఒక రకంగా, గ్రామీణ వాతావరణంలో ఒక రకంగా ఉంటాయి. యోగేష్ అతల్ ఉద్దేశ్యములో కులము ఇప్పటికే బలీయమైన సామాజిక శక్తిగానే పరిచేయుచున్నది.

పాశ్చాత్యాకరణ, సంస్కృతీకరణ, పారిశ్రామికీకరణ, లౌకికీకరణ, విద్యా వ్యాప్తి, నూతన చట్టాలు మొదలైన అనేక కారణాల వలన కుల వ్యవస్థ కొంతవరకు బలహీనమైనప్పటికీ, కొన్ని విషయాలలో మాత్రం కులాలు బలాన్ని పుంజుకుంటున్నాయి. ఇదివరకు కులాలు, కుల పంచాయతీలు ఆయా గ్రామాల వరకే పరిమితమైయున్నాయి. ప్రయాణ సౌకర్యాలు అభివృద్ధి పొందిన ఈ రోజులలో ఒకే కులానికి చెందిన అనేక మంది ఏదో ఒక ప్రదేశములో కలిసే అవకాశమున్నది. నేడు కుల సమితులు ఏర్పడినాయి. బ్రాహ్మణ సంఘము, కమ్మ మహాజన సభ, ఆర్యవైశ్య సంస్థ, నాయీబ్రాహ్మణ సంస్థ మొదలైన అనేక కుల సంస్థలు ఏర్పడడం వలన కుల వ్యవస్థ బలాన్ని పుంజుకుంటుంది. కొన్ని, కొన్ని వ్యాపార సంస్థలు కొన్ని కులాల వారి చేతులలోనే ఉన్నాయి. ఇతర కులాల వారిని ఆ వ్యాపార సంస్థలు తమలో చేరనీయవు. నేడు కులతత్వం పూర్వకాలం కన్నా ఎక్కువగా పెరిగిందని చెప్పవచ్చు. ఈనాడు అనేక విద్యాలయాలను వివిధ కులాల వారు స్థాపిస్తున్నారు. అందులో ఉద్యోగాలు ఎక్కువ శాతం తమ కులాల వారికే ఇస్తున్నారు. కులప్రాతిపదికపై చట్టసభలలో సీట్లు, కుల ప్రాతిపదికపైన రాజకీయ నాయకుల ఎన్నిక జరుగుచున్నది. కులపక్షపాతం పెరుగుతున్నదని సర్వేల వల్ల స్పష్టమైనది. ఈ ఆధునిక కాలంలో కూడా కొన్ని కులాలు అణచివేతకు గురిఅవుచున్నవి. కొన్ని కారణాల వల్ల కుల వ్యవస్థ కొన్ని విషయాలలో బలహీనమవుతున్నా, మరికొన్ని విషయాలలో ఎక్కువ బలాన్ని పుంజుకుంటుందని చెప్పవచ్చు. D.R.Desai కులమును "హిందూ సమాజ ఉక్కు కవచము"గా అభివర్ణించినారు.

## 4.5 ముఖ్య పదములు:

1. ఆరోపిత అంతస్తు (Ascribed Status) : పుట్టుకతో ఒక వ్యక్తికి వచ్చిన సామాజిక స్థితి.

2. బ్రహ్మ (Brahma) : సృష్టికర్తగా హిందువులు భావించు భగవంతుడు బ్రాహ్మణాహిత్యంలో బ్రహ్మ పురుష లేక విరాట్ పురుష అని కూడా పిలవబడతాడు.

3. కుల పంచాయతీలు (Caste Panchayat) : కులము యొక్క అంశములను పరిరక్షిస్తూ, కుల సభ్యుల ప్రవర్తనను నియంత్రించు సంఘము. ఈ కుల పంచాయతీ పెద్దలు ఎన్నిక ద్వారా గానీ, వారసత్వం వలన గానీ అధికారము కలిగి ఉంటారు.

4. కులము/జాతి (Caste/Jati) : అంతర్వివాహ సమూహము. ఒక ఉమ్మడి పేరును కలిగియుంటుంది. దీనిలో సభ్యత్వము వంశపారంపర్యముగా సంక్రమించును. వివాహ అంశములలో సభ్యులను నియంత్రిస్తుంది. వారసత్వపు వృత్తులను అనుసరిస్తుంది.

5. ఆహార, పానీయ సంబంధాలు (Commesal Relations) : కులాల మధ్య ఆహార, పానీయ సంబంధాలకు సంబంధించిన ఆంక్షలు కలవు.

6. దాస లేక దస్యు (Das/Dasyu) : ఆర్యులు భారతదేశమును దండెత్తినప్పుడు, భారతదేశంలో ఉన్న ప్రజలను ఆర్యులు దాస లేక దస్యులు అని పిలిచారు. అనగా నలుపు వరీర వర్ణము గల ప్రజలు అని అర్థము.

7. అంతర్వివాహము (Endogamy) : ఒక సమూహములో వివాహము చేసుకొను పద్ధతి (ఉదా:కులము)

8. జెన్స్ (Gens) : (పురాతన రోమ్‌లో) ఒకే ఉమ్మడి పేరు కలిగి, ఒకే పూర్వీకుని నుండి ఉద్భవించామని భావించే కొన్ని కుటుంబాల సమూహము.

9. గోత్ర (Gotra) : హిందూ సమాజములోని ఆచారము. బహిర్వివాహ సమూహము. ఒకే పూర్వీకుని నుంచి ఉద్భవించామనే నమ్మకము కల్గి ఉంటారు. కులములకు గోత్రములుంటాయి.

| | | |
|---|---|---|
| 10. గిల్డ్ (Guild) | : | పరస్పర సహకారముతో రక్షణ కొరకు కొందరు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సంఘము.<br>ఉదా: కంసాలి సంఘము, కమ్మరి సంఘము. |
| 11. క్రమశ్రేణి (Hierarchy) | : | సామాజిక స్తరాలను హెచ్చుతగ్గుల శ్రేణిలో ఏర్పరచుట. |
| 12. అనులోమ వివాహము (Hypergamy) | : | ఈ పద్ధతిలో తక్కువ కుల అంతస్తు స్త్రీ, పై అంతస్తులోని పురుషుని వివాహము చేసుకొనును. |
| 13. మానా (Mana) | : | వస్తువులకు, వ్యక్తులకు, ప్రదేశాలకు గల అవ్యక్తమైన వక్తి. |
| 14. బయటి కులాలు (Out Caste) | : | తక్కువ కులాల వారికి అనగా దళిత కులాలకు ఈ పదము వర్తిస్తుంది. |
| 15. ఉపకులము | : | కులములోని విభాగము. కులము యొక్క లక్షణములను కలిగి, కులము వలెనే వ్యవమరించే వ్యక్తి యొక్క జీవితాన్ని ఎక్కువగా ప్రభావితం చేసే వ్యవస్థ. |

## 4.6 ప్రశ్నలు:

1. వర్ణ, జాతి భావనలను విశదీకరింపుము?
2. వర్ణ, కులముల మధ్య సంబంధమును విశ్లేషించుము?
3. కుల వ్యవస్థ లక్షణములను వివరించుము?
4. బయటి కులాల యొక్క లక్షణాలను వివరింపుము?
5. కుల వ్యవస్థ సిద్ధాంతములను క్లుప్తీకరింపుము?
6. సాంప్రదాయక కుల సిద్ధాంతము మిగిలిన కుల సిద్ధాంతముల నుండి ఏవిధంగా భిన్నమగునో వివరింపుము?
7. కుల వ్యవస్థలోని మార్పులను వివరింపుము?
8. కుల వ్యవస్థలోని మార్పులకు గల కారణాలను విశదీకరింపుము?
9. కుల వ్యవస్థ భవిష్యత్తును పరిశీలింపుము?

## 4.7 చదువదగిన పుస్తకములు:


1. రామ్ అహుజా : భారతీయ సామాజిక వ్యవస్థ, జైపూర్ (రావత్ పబ్లికేషన్స్, 1993)
2. ఘుర్యే, జి.ఎస్ : భారతదేశములో కులము మరియు జాతి, బొంబాయి: పాప్యులర్ ప్రకాషన్, 1969
3. గౌల్డ్, హెరాల్డ్ : హిందూ కుల వ్యవస్థ, ఢిల్లీ: చాణక్య పబ్లికేషన్స్, 1987
4. హట్టన్.జె.హెచ్ : భారతదేశములో కులము, దాని స్వభావము, ప్రకార్యము మరియు పుట్టుక, ఢిల్లీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 1963
5. మెండల్‌బామ్, డేవిడ్.జి : భారతదేశంలో సమాజము వాల్యూమ్ 1, 2: బొంబాయి, పాప్యులర్ ప్రకాషన్, 1972

SUSPECTED READINGS:

1. Ahuja, Ram. : Indian Social System, Jaipur, Rawat Publications, 1993

2. Ghurya, G.S. : Caste and Race in India, Bombay, Popular Prakashan, 1969

3. Gould, Harold : The Hindu Caste System, Delhi, Chanakya Publications, 1987

4. Hutton, J.H. : Caste in India, Its Nature, Function and Origins, Delhi, Oxford University Press, 1963

5. Mandelbaum, David.G: Society in India Vols. 1 and 2, Bombay, Popular Prakashan, 1972.

# యూనిట్ - 5

# ముఖ్యమైన సామాజిక సంస్థలు

## పాఠం-5

## కులము , వర్గము మరియు శక్తి

**విషయక్రమం:**


5.1 ఉద్దేశ్యము

5.2 పరిచయము

5.3 భారతదేశములో కుల వ్యవస్థ

5.4 కులము-వర్గము

5.5 కులము-వర్గము-శక్తి

5.6 సారాంశము

5.7 ప్రశ్నలు

5.8 చదవదగిన గ్రంథములు


### 5.1 ఉద్దేశ్యము:

1. భారతదేశములో కుల వ్యవస్థ స్వభావమును వివరించుట.
2. కులమునకు, వర్గమునకు గల సంబంధమును వివరించుట.
3. కులమునకు, శక్తికి గల సంబంధమును వివరించుట.
4. కులమునకు, వర్గమునకు మరియు శక్తికి గల సంబంధమును వివరించుట.

### 5.2 పరిచయము:

భారతదేశములో కులము ఒక విశిష్టమైన సామాజిక స్తరీకరణా పద్ధతి. కులము మరియు వర్గము రెండునూ అంతస్థు సమూహములు. ఒక ప్రత్యేకమైన జీవనశైలిని కలిగియుండి, ఒకరమనే భావన ఉన్న వ్యక్తుల సముదాయము అంతస్తు సమూహము. ప్రత్యేకమైన మతపర కర్మకాండలు అంతస్తు కలిగిన వంశపారంపర్య సమూహము కులము. ఉత్పత్తి పరమైన సంబంధిత సమూహము వర్గము. ఒక వర్గములోని సభ్యులు మిగిలిన వారితో సరిపోల్చినపుడు ఒకే రకమైన సామాజిక ఆర్థిక అంతస్థు కలిగియుంటారు. అయితే, ఒక కుల సభ్యులను మరొక కుల సభ్యులతో పోల్చి చూసినపుడు ఎక్కువ గానీ, తక్కువ గానీ అయిన మత పరమైన కర్మకాండల అంతస్థును కలిగియుంటారు. ఒకే సామాజిక వర్గములోని ప్రజలు ఒకే రకమైన జీవన అవకాశాలను కలిగియుంటారు. కొంత మంది సమాజ శాస్త్రజ్ఞులు వర్గమును ఆర్థికపరమైనదిగాను, మరికొందరు వర్గమును జీవనశైలిగాను, జీవన దృక్పథముగాను భావిస్తారు. కులమును సభ్యుల యొక్క గౌరవమును, వృత్తి పరమైన, సామాజిక పరమైన సంబంధాలను నిర్ణయించే సంకుచిత సాంఘీక స్తరముగా కొందరు సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తారు. కుల వ్యవస్థలో వివిధ కుల

సభ్యుల మధ్య సామాజిక ఆంక్షలు కలవు. వర్గ వ్యవస్థలో వివిధ వర్గ సభ్యుల మధ్య ఏవిధమైన ఆంక్షలు ఉండవు. కులమునకు, వర్గమునకు భారతదేశములో దగ్గరి సంబంధమున్నది. భారతీయ సమాజములో కులము, వర్గము కలిసి ఉంటాయి. అనేక సందర్భములలో కుల సమూహములు వర్గ సమూహములుగా పనిచేయును. ఇదే విధముగా కులమునకు, వర్గమునకు, శక్తికి దగ్గరి సంబంధమున్నది. సాంప్రదాయక భారతీయ సమాజంలో ముఖ్యంగా గ్రామీణ సముదాయాలలో శక్తి ప్రాబల్య కులములలో కేంద్రీకృతమైనది. స్వాతంత్ర్యానంతరము అనేక కారణముల వలన శక్తి సాంప్రదాయక ప్రాబల్య కులము నుండి సంఖ్యా పరముగాను, ఆర్థిక పరముగాను ప్రాబల్యమయిన మధ్య తరగతి, క్రింది తరగతి వర్గాల చేతులలోనికి మారుచున్నది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని కులమునకు, వర్గమునకు, శక్తికి గల సంబంధమును ఈ క్రింద చర్చించుట జరిగింది.

## 5.3 భారతదేశములో కుల వ్యవస్థ:

భారతీయ సమాజ నిర్మితి యొక్క ముఖ్యలక్షణము కుల వ్యవస్థ. కులాల అంతస్థును, క్రమశ్రేణిని తెలియచేయుటయే కుల వ్యవస్థ ముఖ్య లక్షణము. భారతదేశ మంతటా ఈ కుల వ్యవస్థ వ్యాపించి ఉన్నది. వ్యక్తుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలను కులము నియంత్రిస్తుంది.

సామాజిక వ్యవస్థలో కుల వ్యవస్థ ప్రాచీనమైనది. ఒక వ్యక్తి యొక్క కులము ఆధారముగా అతని యొక్క విద్య, వృత్తి, రాజకీయ, సామాజిక హక్కులు, వివాహ ఎంపిక మరియు మతపరమైన కర్మకాండల ప్రవర్తన తెలుసుకొనవచ్చును. వ్యక్తి కులపు అంతస్థు పుట్టుక నిర్ణయిస్తుంది. దీనితోపాటు అతని సామాజిక అంతస్థు హక్కులు ప్రస్ఫుటమవుతాయి. సాంప్రదాయిక కుల పద్ధతిలో అంతర్గిత విభేదీకరణ ఒకే కులమునకు చెందిన వారితో ఉండదు. ఒకే కులమునకు చెందిన వారు ఒకే విధమైన మత ప్రకార్యాల స్థాయిని, సామాజిక ఆర్థిక పరిస్థితిని, రాజకీయ స్థాయిని, హక్కులను, బాధ్యతలను కలిగియుంటారు. కుల వ్యవస్థ భిన్న కులాల వారి మధ్య పూర్తి విషమస్తరీయ (Verticle) విభేదీకరణ కలిగియుంటుంది. వివిధ కులాలు మత పరమైన కర్మకాండల నిర్వహణలోను, సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితులలోను భేదాలను కలిగియుంటాయి. సంపద, రాజకీయ శక్తులలోని విభజన కూడా కుల విభజన వలె ఉన్నది. వీటిలోని క్రమశ్రేణి కుల వ్యవస్థలోని మత పరమైన కర్మకాండల క్రమశ్రేణిని పోలియున్నది. సాంప్రదాయిక భారతీయ సమాజములోని కుల వ్యవస్థ తక్కువ గతిశీలతను కలిగియున్న సంకుచిత వ్యవస్థ అని చెప్పవచ్చు.

## 5.4 కులము-వర్గము:

సాంప్రదాయిక భారతీయ సమాజ ముఖ్య లక్షణము కులమునకు వర్గమునకు పోలిక ప్రస్ఫుటముగా గోచరించుట. కులము, వర్గముల అధ్యయనము సాంప్రదాయికముగా నిర్వచనాత్మకమైనది. కులమును, వర్గమును భిన్నమైన అస్థిత్వము గల వాటిగా కొందరు అభివర్ణించారు. కుల వ్యవస్థ సాంస్కృతికముగా నిర్దుష్టమైనది గాను, విశిష్టమైనదిగాను, మిగిలిన సమాజాల అధ్యయనానికి వినియోగించుట పెడద్రోవ పట్టించేదిగా ఉంటుందని కొందరు అభిప్రాయపడినారు. వర్గము అనేక అంతర్వివాహ సమూహాలు కలిగియున్నదిగా, కులము అన్ని వైపులా మూసి వేయబడిన సామాజిక వ్యవస్థగా వర్ణించారు. అందువలన కుల విభజనకు వర్గ విభజనకు సంబంధము లేదు. వర్గాల ప్రమేయము లేక నేకుల అవతరణ జరిగింది. కుల వ్యవస్థలోని అంతస్థు వర్గ వ్యవస్థలోని అంతస్థు వలె సంపదపై ఆధారపడినది కాక, పుట్టుకపై ఆధారపడినది.

మరొక ఉపగమము కుల వర్గాలను అనంతత్వము (Continuum)గా భావించి, విభజించింది. స్వేచ్ఛా గతిశీలతలు ఈ ఉపగమమునకు మూలములు. ఈ ఉపగమము ఒక సమాజాన్ని గతిశీలత ఆధారంగా గానీ, కుల పరంగా గానీ, వర్గ పరంగా గానీ విభజించుటకు తోడ్పడుతుంది. ఈ స్తరీకరణ అనంతత్వములో సంకుచిత తత్వము కలిగిన కుల వ్యవస్థ ఒకవైపు, స్వేచ్ఛా, గతిశీలత, పోటీ తత్వము కలిగిన వర్గతత్వము మరొక వైపున గోచరిస్తాయి. సంకుచిత తత్వము గల కులము నుంచి స్వేచ్ఛా తత్వము గల వర్గము దాకా విస్తరించినట్లు వివరించవచ్చును.

కుల శ్రేణికి, ఆర్థిక శ్రేణికి సంబంధాన్ని అనుభవాత్మకముగా మరొక ఉపగమము అధ్యయనము చేసినది. సామాజిక శాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు గతించిన 30 సంవత్సరాల కాలంలో భారతదేశంలో చేసిన అధ్యయనాలలో ఈ అనుభవాత్మక

ఉపగమము ఎక్కువగా గోచరిస్తుంది. ఈ అధ్యయనాలన్నీ కుల క్రమశ్రేణితో ఎంతవరకు పోలి ఉందో తెలుసుకొనుటకు ప్రయత్నించినవి. ఈ ఉపగమములన్నీ ఒకదానికొకటి పూర్తిగా విరుద్ధమైనవి కావు. కానీ, శాస్త్రజ్ఞుల అధ్యయనాలలోను, లక్ష్యాలలోను, కేంద్రబిందువులోను వ్యత్యాసాలున్నాయి.

భారతీయ సమాజములో వ్యక్తి యొక్క పుట్టుక, మిగిలిన స్థాయిలలో అతని అంతస్థును తెలియజేసే సాంప్రదాయక సమాజముగా పేరుగన్నది. ఈ కుల క్రమశ్రేణిలో తక్కువ అంతస్థు గల వ్యక్తికి సమాజంలో మిగిలిన వరుస శ్రేణులలో కూడా ఆర్థిక, రాజకీయ క్రమశ్రేణిలలో కూడా తక్కువ అంతస్థు ఉంటుంది. కుల అంతస్థుకు, సామాజిక ఆర్థిక అంతస్థుకు గల దగ్గరి సామ్యము సాధారణంగా అందరూ గుర్తించినదే. తక్కువ కులము, తక్కువ వర్గము అను పదములను అందరూ ఇంచుమించుగా పర్యాయ పదములుగా భావిస్తారు. వెనుకబడిన తరగతులకు భారతదేశ ప్రభుత్వము ప్రత్యేక అవకాశములు కలుగచేయునప్పుడు ఆర్థిక ప్రాతిపదిక బదులు కుల ప్రాతిపదికనే అనువర్తింపచేసింది. ఒక వ్యక్తి యొక్క కులమును బట్టి అతని సామాజిక ఆర్థికపరమైన అంశములను తెలుసుకోవచ్చుననే అంశము దీనిలో అంతర్లీనమైన భావన. భారతదేశంలో వయోజనులకు ఓటు హక్కు గలదు. దీని ప్రకారం కుల, మత, వర్గ, లింగ భేదము లేక వయోజనులందరూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ప్రజాస్వామిక దేశమైన భారతదేశం వంటి నూతన ప్రజాస్వామిక దేశాలలో ఓటు హక్కు అందరికీ సమానంగా ఇవ్వబడింది. కనుక రాజకీయ స్తరీకరణ చేయుటకు వీలు లేదు. రాజకీయ ప్రభుత్వ అధికార పదవుల పాత్ర, అధికారములను బట్టి స్తరీకరణ, రాజకీయ దృక్కోణం నుంచి చేయుట వీలవుతుంది. ఈ విధంగా వాస్తవ పరిశీలనలో సమాజంలో ఎప్పుడూ కొందరు మిగిలిన వారి కంటే ఎక్కువగా సామాజిక రాజకీయ కార్యక్రమములో పాల్గొనే వారుంటారు. కార్యక్రమాలలో పాల్గొనుటకు అవకాశాలకు మార్గము, వినియోగము అనునవి సామాజిక స్తరీకరణకు ముఖ్య ఆధారాలు కావచ్చును. రాజకీయ శక్తి, పాల్గొనే అవకాశాలను బట్టి ఒక సమాజాన్ని ఎక్కువగా సమసమానత్వం గల సమాజంగా గానీ లేక ఎక్కువ క్రమశ్రేణి కలిగిన సమాజంగా గానీ వివరించవచ్చు.

ఇప్పుడు మనము కులమునకు, అంతస్థుకు గల సంబంధాన్ని, వీటికి రాజకీయ జోక్యముతో, అధికార పంపిణీ రాజకీయ పాత్రతోగల సంబంధాన్ని పరిశీలిద్దాం.

గ్రామీణ వాతావరణంలో గల శక్తియుతమై, అధికార యుతమైన కులమును సామాజిక శాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు విపులంగా అధ్యయనం చేసినారు. ఎమ్.ఎన్.శ్రీనివాస్ దీనిని 'ప్రభావి' కులమని వర్గీకరించి వర్ణించినాడు. ఈ భావన భారతీయ గ్రామీణ సమాజాలలో గల 'శక్తి' యొక్క నిర్మితిని అవగాహన చేసుకోవడంలో ఉపయోపడింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలు ప్రభావికులాల సభ్యులు రాజకీయంగా ఎక్కువ చురుకుగా ఉండి వాటిని అధికంగా ప్రభావితం చేస్తారు. ప్రభావికులాలు ఎక్కువ నైపుణ్యాన్ని కలిగి, సముదాయ వ్యవహారాలలో అధిక శక్తివంతులుగా వారిని వారు భావిస్తారు. ఓటు హక్కు వినియోగించుకుంటారు. రాజకీయ కార్యక్రమాలలో ఎక్కువగా పాలు పంచుకుని, ప్రభుత్వ అధికారులతో రాజకీయ నాయకులతో ఎక్కువగా సంబంధాలు కలిగియుంటారు. ఎక్కువ అంతస్థు కలిగిన కులమునకు ఎక్కువ ప్రభావం లేదు అని ఇటీవల గ్రామీణ సమాజ శాస్త్ర అధ్యయనములు తెలియజేసినాయి. ఇదే విధంగా మిగిలిన అధ్యయనములు కులమునకు, రాజకీయ పరిజ్ఞానమునకు గల సంబంధాన్ని అధ్యయనం చేసినప్పుడు వాటికి ఎక్కువ సంబంధము ఉన్నట్లు కనిపించింది. కానీ, కులానికి, రాజకీయ జోక్యానికి ఎక్కువ సంబంధమున్నట్లు కన్పించలేదు. కులానికి, రాజకీయ తాదాత్మ్యతకు సంబంధము గోచరించలేదు.

## 5.5 కులము-వర్గము-శక్తి:

సామాజిక ఆర్థిక అంతస్థుకు, రాజకీయ శక్తికి గట్టి సంబంధమున్నదని సమాజ శాస్త్ర పరిశోధనలలో అధికభాగం తెలియజేస్తున్నవి. పుట్టుకతో ఎక్కువ అంతస్థు ఉన్న వారికి సామాజిక ఆర్థిక అంతస్థు కూడా ఎక్కువగా ఉన్నట్లయితే వారికి రాజకీయములలో జోక్యము ఎక్కువగా ఉంటుందని సాంఘీక శాస్త్ర అధ్యయములన్నీ ఉద్ఘాటించినవి. వ్యక్తి యొక్క కుల అంతస్థు అతని యొక్క రాజకీయ అవగాహనకు ప్రభావమునకు, పాత్రకు దోహదం చేయదు. కులమునకు, రాజకీయ శక్తి గల సంబంధము మధ్యలో వచ్చిన సామాజిక ఆర్థిక అంతస్థు వలన సంభవించింది. ఇదే విధంగా ఆధునిక భారతదేశంలోని స్తరీకరణ అంతస్థులో పొంతన లేకపోవుటను సూచిస్తుంది. దీనితోపాటు గతిశీలత, అంతఃకుల విభేదాలు, అంతర కులంలో సమాన

అవకాశాలు మొదలైన వాటిని సూచిస్తుంది. వర్గ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ స్వేచ్ఛా సమాజాలుగా మారినప్పటికీ, కులమునకు శక్తికి ఉన్న సంబంధము కంటే కులమునకు సామాజిక ఆర్థిక అంతస్తునకు వున్న సంబంధము ఎక్కువ.

భారతీయ సామాజిక స్తరీకరణలో నవీన చట్టము మరియు రాజకీయ చట్టములతో పాటు, పోటీ రాజకీయ ప్రక్రియ అధిక ప్రభావం చూపే వక్తిగా ఆవిర్భవిస్తున్నది. సమసమాజ నిర్మాణానికి దోహదం చేసే పౌర రాజకీయ చట్టము మరియు మిగిలిన చట్టాలు, విద్య, వృత్తి, మిగిలిన వర్గ లక్షణాలను మరియు రాజకీయ శక్తిని, మిగిలిన నాయకత్వపు హోదాలను మరియు పౌర రాజకీయ అవకాశాలను ఆపాదించబడిన అంతస్థు యొక్క లక్షణాల నుంచి సాధింపదగిన లక్షణాలుగా మార్చినాయి. తక్కువ కులాల వారు విద్యను, హెచ్చు స్థాయి వృత్తులను, రాజకీయ ప్రభావమును, నాయకత్వ హోదాను సాధించుకొనుట మొదలు పెట్టినవి. పోటీ తత్వ రాజకీయ ప్రక్రియ సామాజిక రాజకీయ రంగాలలో ఉండే మతపరమైన కర్మ కాండ అంతస్థును తగ్గించినది.

కులాధారమైన కర్మకాండల అంతస్థును కూడా తగ్గించినది. క్రొత్త ప్రాతిపదికపై గతిశీలత, విద్య, వృత్తి, రాజకీయ ప్రభావము, నాయకత్వ మోదాల ద్వారా సాంఘీక రాజకీయ అంతస్తుల తేడా తగ్గించింది.

దీని పర్యవసానంగా సాంప్రదాయక కుల వ్యవస్థలో గతిశీలతకు దోహదం చేసే సాంస్కృతికీకరణ బదులు ఆధునికీకరణ, రాజకీయకరణలు క్రమంగా గతి శీలతకు దోహదం చేస్తున్నవి. గ్రామీణ సమాజములలో బాహ్య ప్రపంచంలో ఎక్కువగా సంబంధం పెట్టుకున్న కొద్ది వాటిల్లో ఆర్థిక పరమైన మార్పులు సంభవించినవనీ, ఫలితంగా శక్తి నిర్మితి కూడా గమనించదగిన మార్పు చెందినదని, స్వాతంత్ర్యానంతరము భారతదేశంలో గ్రామీణ సమాజాలలో చేసిన అధ్యయనములు సూచించుచున్నవి. రాజకీయ శక్తి యొక్క కేంద్రము గ్రామాల నుంచి బాహ్య ప్రపంచంలోనికి కదిలింది. సాంప్రదాయక కుల పంచాయతీల అధకారము, శక్తి నశించుచున్నవి. అంతస్థులోని మార్పు కోసం వారి కోరికను సమాజంలోని మిగిలిన వారు కూడా గుర్తించినారు. సాంప్రదాయిక కుల వృత్తులను వదిలివేయుట దీనిలో మొదటి ప్రయత్నము. సాంప్రదాయక గ్రామీణ పద్ధతిని వ్యతిరేకించే వారు, దానిలో బాధపడే వారు కాక, ఆర్థికంగా ఎవరైతే వారి పరిస్థితి మెరుగుపరుచుకుని, ఈ పరిస్థితి నుంచి కొంత వరకు బయటపడ్డారో వారే ఈ మార్పును కోరుతున్నారనేది ఇచ్చట గమనించదగిన అంశము. అంతస్థులో పరస్పర విరుద్ధమైన పరిస్థితిని గమనించిన వారు ఈ విధమైన మార్పు కావాలని కోరుకునే వారికి స్పష్టమైయినది. ఈ రాజకీయ స్వతంత్ర్యము అట్టడుగు కులాల వారి ముఖ్యంగా అంటరాని కులాల వారి ఆత్మస్థైర్యానికి, పెరుగుతున్న ఆశలకు ప్రోదిని చేసినది. రాజకీయ నవీనత, ప్రజాస్వామ్య సంస్కరణలకు అనుకూల వాతావరణము కులాన్ని, మతపరమైన కర్మకాండల పటుత్వాన్ని సడలింపచేయడానికి సహజంగా సహాయపడినవి. ఈ దశలో గ్రామాలలోని మార్పు సాంస్కృతిక, రాజకీయ స్థాయిలలో ఉన్నది. గత రెండు దశాబ్దాలుగా శక్తి పంపిణీ చాలా గమనశీలమైన (Dynamic) లక్షణమును పొందినది. కొన్ని పరిస్థితులలో కులానికి, శక్తికి గల సంప్రదాయిక సంబంధం తిరగబడింది. గతంలో కంటే శక్తి అనేది చాలా వరకు వర్గము నుంచి విముక్తి పొందినది. భూమిపై ఆధిపత్యము శక్తిని సంపాదించుటకు ఇక ఏమాత్రము మార్గము కాదు. వయోజన ఓటు హక్కు పంచాయతీరాజ్ క్రొత్త నవీన ప్రక్రియలను గ్రామీణ సమాజములలో ప్రవేశపెట్టినవి. శక్తి కొరకు పోరాటం అనేది అంతటా వ్యాపించిన ఒక సామాన్య పద్ధతిగా మారింది. ఎందువలెనంటే సామాన్య మానవునికి శక్తికి మార్గము గతంలో ఎప్పుడూ లేనంతగా ఈనాడు లభ్యమయినది గనుక, బహుశా అందుచేతనే ఈ విధంగా జరుగుతున్నదని చెప్పవచ్చును.

గ్రామ స్థాయిలో ప్రాంతీయ స్థాయిలో సామాజిక స్తరీకరణ పనిచేసే చోట మధ్య కులాలకు, మధ్యతరగీతి రైతులకు ఊర్ధ్వాభి ముఖ గతిశీలత ఉన్నట్లే ఆధారమున్నది. సంప్రదాయకబద్ధమైన ఉన్నత కులాల సామాజిక అంతస్థు పురాతన కాలంతో పోల్చి చూసినప్పుడు పతనం చెందనిదని చెప్పవచ్చును. మధ్య కులాల గ్రామ స్థాయిలోను, ప్రాంతీయ స్థాయిలోను రాజకీయ ప్రభావమును పొందినవి. భారతీయ గ్రామాలలో రాజకీయ తగాదాలు, ముఠా తగాదాలుగా మారుట ఆధిపత్యం వహించినది. గ్రామీణ రాజకీయాలలో ఎక్కడైతే ఆధిపత్య కులాలు గ్రామంలోని సగం జనాభా కంటే తక్కువగా ఉన్నాయో అక్కడ అంతఃకుల కలహాలు ప్రాధాన్యత సంతరించుకుంటాయి. లేక తక్కువ స్థితియందున్న కులాలు ఆధిపత్య కులాలకంటే సంఖ్యాపరంగా ఎక్కువగా నున్నప్పుడు కూడా ఇది సంభవించవచ్చు. దగ్గరగా ఉన్న కులాలలో హోదా గల స్థితి కోసం పోటీ గ్రామీణ సమాజములలో పూర్వకాలంలో ఉండేది. తక్కువ, హెచ్చు కులాల మధ్య ప్రత్యక్ష సంఘర్షణ నేటి గ్రామీణ సమాజ లక్షణమయినది.

ఈనాడు ఆర్థిక, రాజకీయ నిర్మితులు కుల నిర్మితి నుంచి కొంతవరకు విడివడినా రాజకీయ శక్తి, ఆర్థిక శక్తి మీద ఈనాడు ఎక్కువగా ఆధారపడియున్నవి. గతంలో కొన్ని సందర్భములలో కులము మిగిలిన అంశములతో కలిసి, ఎన్నికలలో నిలబడిన వ్యక్తులు గెలవడానికి సహాయపడినది. మరికొన్ని సందర్భములలో 'మద్దతు' నిర్మితిని విభజించింది. రాజకీయ పద్ధతికి కులము చేసే ఉపకారము ఎప్పుడు ఉండేదానిగా భావింపరాదు. దీనిని జాగ్రత్తగా విశ్లేషించవలసిన అగత్యమున్నది.

మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా కులము కూడా మారి వ్యవస్థను చక్కగా మారేటట్లు చేస్తుంది. సాంస్కృతిక పద్ధతులు, విధానాలలో ముఖ్యమైన మార్పు వచ్చినట్లు కనిపించుచున్నది. ఏ విధమైన మత పరమైన కర్మకాండ చేయాలి? లేక ఏవిధమైన ప్రవర్తనా నియమావళిని అనుసరించాలి? అనే అంశములపై ఇక ఏవిధమైన కట్లుబాట్లు పరిమితులు లేవు. విభిన్న కుల సమూహముల మధ్య విభిన్న వ్యక్తుల మధ్య సామాజిక పరమైన ప్రవర్తనా నియమావళి చాలా వరకు సడలినది. ఇది ఆర్థిక, రాజకీయ రంగాలకు కూడా వర్తిస్తుంది. నవీన రాజకీయ, ఆర్థిక సంస్కృతులను అందరూ అంగీకరించడమే కాక, అందరూ అందులో పాలుపంచుకునేందుకు సంసిద్ధులై ఉన్నారు. కానీ, రాజకీయాలలో సాంఘీక శక్తి ఆర్థిక శక్తి మీద కొంతవరకు ఆధారపడియున్నది.

## 5.6 సారాంశము:

పైన వివరించినట్లుగా కుల వ్యవస్థ భారతీయ సమాజములో ఒక విశిష్టమైన స్తరీకరణ పద్ధతి. సాంప్రదాయక భారతదేశములోని స్తరీకరణ పద్ధతి యొక్క ముఖ్య లక్షణము కులమునకు, వర్గమునకు తగల దగ్గరి సంబంధము మరియు కులము, వర్గము మరియు శక్తికి గల దగ్గరి సంబంధము. సాంప్రదాయక భారతదేశంలో ఒక అందస్థులో వ్యక్తి యొక్క పుట్టుక అతని మిగిలిన అన్ని స్థితులను నిర్ణయిస్తుంది.

ఈ దృక్పథము ప్రకారము సాంఘీక అంతస్థుకు, ఆర్థిక అంతస్థుకు మరియు రాజకీయ అంతస్థుకు దగ్గరి సంబంధమున్నది. కుల క్రమశ్రేణిలో తక్కువ అంతస్థులలో కూడా తక్కువ అంతస్థు కలిగియుంటాడు. తక్కువ కులము మరియు తక్కువ అంతస్థు ఎక్కువ కులము మరియు ఎక్కువ అంతస్థు పర్యాయ పదములుగానున్నవి. అంతేకాక, ఆరోపించిన పెద్ద అంతస్థు పెద్ద ఆర్థిక అంతస్థుతో కలిసినప్పుడు అది ఎక్కువ రాజకీయ కలాపములకు, పరిజ్ఞానమునకు దోహదం చేస్తుంది. స్వాతంత్ర్యానంతరము భారతదేశంలో గ్రామాలు ఎక్కువగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు పెట్టుకోవడం వలన వాటిలో మార్పులు ఎక్కువగా చోటుచేసుకున్నవి. శక్తి నిర్మితి కూడా గణనీయంగా మార్పు చెందింది. ఈ అంశాలన్నీ అనేక గ్రామీణ అధ్యయనములు కూడా దృఢపరుచుచున్నవి. భారతీయ గ్రామీణ సమాజములో ఆర్థిక స్తోమత గల వారు రాజకీయ శక్తిని ఆర్థిక శక్తి ద్వారా సాధించినారు. రాజకీయ కార్యకలాపములలో పాల్గొను స్థాయి ఆర్థిక శక్తిపై సామాజిక శక్తిపై ఆధారపడి ఉంటుంది.

## 5.7 నమూనా ప్రశ్నలు:

1. కులమునకు, వర్గమునకు గల సంబంధము చర్చింపుము.
2. కులము, వర్గము మరియు శక్తికి గల పరస్పర సంబంధమును చర్చింపుము.

## 5.8 చదవదగిన గ్రంథములు:

1. ఆంద్రీ బీటెల్ - కాస్ట్, క్లాసు అడ్ పవర్ — Andre Beteille - Caste, Class and Power
2. కే.ఎల్ శర్మ - సోషల్ స్ట్రాటిఫికేషన్ ఇన్ ఇండియా — K.L.Sharma - Social Stratification in India
3. రామ్ అహూజా - సొసైటీ ఇన్ ఇండియా — Ram Ahuja - Society in India
4. యోగేందర్ సింగ్ - సోషల్ స్ట్రాటిఫికేషన్ అండ్ ఛేంజ్ ఇన్ ఇండియా — Yogendra Singh - Social Stratification and Change in India

**పాఠం-6**

# సాంఘీక అసమానతా రూపముగా కులము

## (Caste As A Form of Social Inequality)

**విషయక్రమం:**


**6.1 ఉద్దేశ్యము**

**6.2 పరిచయము**

**6.3 సాంఘీక అసమానత - భావన**

**6.4 సాంఘీక అసమానతా రూపముగా కులము**

**6.5 సారాంశము**

**6.6 నమూనా ప్రశ్నలు**

**6.7 చదవదగిన గ్రంథములు**


## 6.1 ఉద్దేశ్యము:

సాంఘీక అసమానతా భావనను చర్చించుట.

కులమును సాంఘీక అసమానతా రూపముగా చర్చించుట.

## 6.2 పరిచయము:

అన్ని సమాజాలలోను ప్రజలు వయస్సు, లింగభేదము, వ్యక్తిగత లక్షణములు మొదలైన ప్రాతిపదికలపై విభజింపబడతారు. సమాజములోను, వ్యక్తులలోను అనేక రకముల విభిన్నతలు గోచరిస్తాయి. ప్రజలు ప్రతి అంశములోను పూర్తిగా ఏకరూపముగా ఏ సమాజములోనూ ఉండరు. విభిన్నత లేక అసమానత మానవ సమాజము యొక్క ముఖ్య అంశము. సమాజము యొక్క స్వభావములోనే విభిన్నతలు అంతర్గతముగా ఉంటాయి. ప్రపంచములో సమనత్వము గలిగిన సమాజములు గోచరించవు. స్తరీకరింపబడని సమానత్వము గల సమాజములు ఉండుట మిథ్య అని, అటువంటి సమాజములు మానవ జాతి చరిత్రలోనే గోచరించవనీ, గుర్తింపబడలేదనీ పి.ఏ.సోరోకిన్ వివరించారు.

ప్రతి సమాజములోను ఒక క్రమశ్రేణి ఉంటుంది. దానిలోని సభ్యులు ఆధిక్యత మరియు తక్కువ ఉన్నతి మరియు నిమ్న ప్రాతిపదికపై అమర్చబడి పరస్పర సంబంధముల అమరికతో ఉంటారు. పుట్టుకతోనే వ్యక్తులు శారీరక, మానసిక అసమాన లక్షణాలను కలిగియుంటారు. అయితే, ఈ అంశాలను గూర్చి జీవ శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తారు గానీ సమాజ శాస్త్రజ్ఞులు పట్టించుకోరు. సమాజ శాస్త్రవేత్తలు ఈ అసమానతలను సహజంగా పరిగణిస్తారు. సమాజ శాస్త్రజ్ఞులు సామాజిక పరిస్థితులను, వాటి వలన సమాజములో తలెత్తే వివిధ రకముల అసమానతలను చర్చిస్తారు. కులము ఇటువంటి సాంఘీక అసమానతా రూపములలో ఒకటి ఇప్పుడు కులమును ఒక సాంఘీక అసమానతా రూపముగా చర్చిద్దాము.

## 6.3 సాంఘీక అసమానత-భావన:

సాంఘీక అసమానత అనగా సమానత్వము లేకపోవుట లేక వ్యక్తుల మధ్య అసమానత్వము ఉండుట. దీనివలన కొందరు వ్యక్తులు సంపద, అంతస్థు, మరియు శక్తి అను సామాజిక అంశములలో సమాజములో మిగిలిన వారి కంటే తక్కువగా భావింపబడతారు. సాంఘీక అసమానతలే సమాజములో వివిధ రకముల సాంఘీక స్తరీకరణకు కారణమౌతాయి.

సామాజిక అసమానతలు వ్యక్తుల స్వభావములోనే అంతర్లీనంగా ఉంటాయి. ప్రకృతి సహజమైన విభిన్న లక్షణాలతోపాటు సాంఘీక ఆమోదం పొందిన విభిన్న లక్షణాలను కూడా వ్యక్తులు కలిగియుంటారు. అనగా లింగ భేదము, వయస్సు మొదలైన సహజమైన విభిన్నతలతో పాటు బంధుత్వము, వృత్తి మొదలైన సామాజిక విభిన్నతలను కూడా కలిగియుంటారు. ఈ సామాజిక విభిన్నతల వలన సమాజంలో కొందరు వ్యక్తులు మిగిలిన వ్యక్తుల కంటే సంపద, ఆదాయము, అంతస్థు, శక్తి మొదలగు అంశాలలో తక్కువగా చూడబడతారు. ఈ అంశములను సామాజిక అసమానతలను సాక్ష్యాలు (Evidences)గా తీసుకొనవచ్చును.

## 6.4 సాంఘీక అసమానతా రూపముగా కులము:

హిందూ సమాజము కుల ప్రాతిపదికపై స్తరీకరింపబడిన సమాజము. భారతదేశములో కుల ప్రాతిపదికన ఒక విశిష్టమైన సామాజిక స్తరీకరణ పద్ధతిగా సమాజ శాస్త్రజ్ఞులు నిరంతర పరిశోధనలు చేస్తూనే ఉన్నారు.

ఘర్యే అభిప్రాయంలో కులమునకు ఆరు లక్షణములు గలవు. అవి:

1. సమాజము విభిన్న ఖండములుగా విభజించుట
2. క్రమశ్రేణి
3. ఆహార, వివాహ సంబంధాల పరిమితులు
4. పౌర మరియు మతపరమైన వైకల్యములు మరియు విభిన్న తరగతులకు సదుపాయములు
5. వృత్తిలో ఎంపిక స్వేచ్ఛా లేకపోవుట
6. అంతర్వివాహ సమూహము

ఎన్.కే.దత్తు (N.K.Dutt) కూడా కొద్దిపాటి మార్పులతో కులమునకు పై లక్షణములను పేర్కొన్నాడు. అవి:

1. బహిర్వివాహము
2. ఇతర కులస్థులతో భోజన, పానీయ అంశములలో పరిమితులు
3. విభిన్న కులములకు ఆపాదింపబడిన విభిన్న వృత్తులు
4. కులాల క్రమశ్రేణి
5. కులమును పుట్టుక నిర్ణయించుట
6. పుట్టిన వ్యక్తి చనిపోవు వరకు ఆ కులములోనే ఉండుట

కుల నిబంధనలను అతిక్రమించిన వారికి కుల బహిష్కారము కలదు.

కులము సాంస్కృతిక పరమైన అంశమని యోగేందర్ సింగ్ పేర్కొన్నారు. సాంస్కృతిక అంశమే కాక, సామాజిక నిర్మితి పరమైన పద్ధతి అని కూడా ఆయన వివరించారు. కులవ్యవస్థ సామాజిక పరమైన వ్యవస్థ. దీనిని క్రమశ్రేణిలో ఏర్పరచబడ్డ వంశపారంపర్యపు సమూహాలలో వ్యవస్థీకృతమైన పరస్పర చర్యగా భావిస్తారు. వివాహ వృత్తి నిబంధనలు, ఆర్థిక పరమైన శ్రమ

విభజన, శుచి అశుచిలపై ఆధారపడ్డ మతపరమైన కర్మకాండలను నిర్వహించుట. సాంస్కృతిక ప్రమాణాలను, విలువలను అమలు పరుచుట కుల వ్యవస్థ ప్రధాన లక్షణములు.

బహిర్వివాహము, కులవృత్తులు, కులాల క్రమశ్రేణి మొదలైన కుల వ్యవస్థ లక్షణములు సామాజిక స్తరీకరణను ఏరుగా ప్రభావితం చేస్తాయి. మరొక వైపు సాంస్కృతిక అంశాలు విలువలపై ఆధారపడినవి. దీనివలననే భారతదేశంలో కులవ్యవస్థను నిర్మిత పరంగాను విశ్లేషిస్తారు. కుల వ్యవస్థ శ్రమ విభజన సూత్రముపై ఆధారపడి ఉన్నది. ఒక్కొక్క కులమునకు ఒక్కొక్క వృత్తి పరమైన విశిష్టీకరణ కలదు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కుల దృక్పథముతోనే అధ్యయనము చేయవలెనని ఎ.ఆర్.దేశాయ్ వాదన. ప్రజల ఆర్థిక జీవన విధానమును ముఖ్యముగా నిర్ణయించేది కులము. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వైవిధ్యము అనేక విధాలుగా ఉన్నప్పటికీ, ఈనాటికీ సాంప్రదాయిక వృత్తులే ప్రజల ఆరోగ్య అంతస్థును నిర్ణయించుచున్నవి. భారతదేశంలోని గ్రామాలలో ఏ భాగములోనైనను, కుల ప్రాతిపదికపైనే నివాస ప్రాంతాలు ఉంటాయి. భారతదేశంలో కుల భవిత్యం ఏమైనప్పటికీ, కులము ఏ ప్రాంతంలో నివసించాలనేదే కాక, ఎటువంటి గృహమును నిర్మించుకోవాలనేది కూడా నిర్ణయిస్తుంది.

సామాజిక సంబంధాలను గ్రామాలలో కులపు అంతస్థు నిర్దేశిస్తుంది. కులము క్రమశ్రేణి సంబంధాల వ్యవస్థ. ఈ కుల వ్యవస్థ పిరమిడ్ ఆకారములో ఉండి, దానిలో పైన బ్రాహ్మణులు, తర్వాత క్షత్రియులు లేక రాజపుత్రులు, బనియాలు, (వైశ్యులు) మరియు అస్పృశ్యులు ఉంటారు. హిందూ సమాజములో ఇంకా అనేక వేల కులాలు, ఉపకులాలు ఉన్నాయి.

ఎమ్.ఎన్. శ్రీనివాస్ ఆధిపత్య కులాల భావనను గూర్చి చర్చించినాడు. గ్రామాలలో ఈ కుల యొక్క సంఖ్యాబలము అధికముగా ఉంటుంది. గ్రామీణ వ్యవస్థలో ఈ కులము అత్యధిక శాతం భూములను కలిగియుండి, గ్రామానికి సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంటుంది. గ్రామాలను ఈ ఆధిపత్య కులాలే పాలిస్తాయి. ఆధిపత్య కుల భావనలో కొద్ది కులాలకు మాత్రమే గ్రామాలపై పట్టు కలిగియుంటుందని స్పష్టంగా తెలియజేస్తుంది. గ్రామాలలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ ఆధిపత్య కులాలు గ్రామీణ సమాజంలోఅత్యధిక అంతస్తును కలిగియున్నాయని ఎమ్.ఎన్.శ్రీనివాసే కాక, ఆండ్రూ బీటెల్ (Andre Beteille) మొదలైన సామాజిక శాస్త్రవేత్తలు కూడా పేర్కొన్నారు.

వ్యక్తి యొక్క లేక కుటుంబాల యొక్క ఆర్థిక గతిశీలతను కూడా కులమే నిర్ణయిస్తుంది. కొన్ని కులాలు వంశపారంపర్య వృత్తులను వదిలివేస్తున్నప్పటికీ, మరికొన్ని కులాలు ఇంకా సాంప్రదాయిక వృత్తులనే అనుసరిస్తున్నారు. గ్రామీణ సమాజ అధ్యయనాలలో వృత్తి పరమైన గతిశీలత మరియు సామాజిక గతిశీలతలను కు ప్రాతిపదికపైనే విశ్లేషించడము జరగాలి.

వినియోగ పద్ధతిని కూడా గ్రామాలలో కులమే నిర్ణయిస్తుందని ఎ.ఆర్.దేశాయ్ గమనించారు. కులమే ఆహార పద్ధతులను, దుస్తుల అలవాట్లను, పాత్రలను, ఇతర వస్తువులను ఉపయోగించుటను నిర్ణయిస్తుంది. ఈ కుల నిర్ధారిత వినియోగ పద్ధతి గ్రామస్తుల పూర్తి జీవన శైలిని వారి ఉత్పత్తి పద్ధతిని ప్రభావితం చేస్తుంది. వినియోగ పద్ధతుల వలె వారి యొక్క ఋఉణ గ్రస్తత కూడా వారి కులాన్ని బట్టి ఉంటుంది. భారతీయ గ్రామాలలో కులానికి, ఋణము దొరుకుట, ఋణ గ్రస్తతకు సన్నిహిత సంబంధముంటుంది. ఇందులో కొన్ని కులాలలో ఎక్కువ మంది వంశపారంపర్యంగా ఋణగ్రస్తులయిన వారు గాను మరికొంత మంది ఋణాలు ఇవ్వబడ్డ వారుగాను ఉన్నారు.

గ్రామీణ సమాజ అధ్యయనములు గ్రామీణ సమాజములలో ప్రత్యేకమైన, నిర్దిష్టమైన గ్రామీణ నివాస పద్ధతులు ఉంటాయని తెలియజేస్తాయి. ఈ నివాస పద్ధతులను కులమే నిర్ణయిస్తుంది. సమాజ శాస్త్రజ్ఞులు కుల ప్రాతిపదికపై గ్రామాలను వర్గీకరించినారు. కులము ఆధారంగా గ్రామాలలో విభిన్న నివాస పద్ధతులు ఉంటాయి. ఉదా: రాజపుత్రులు మరియు బ్రాహ్మణులు పాలక కులమునకు దగ్గరిగా నివాస స్థానములను కలిగియుంటారు. అస్పృశ్యులుమరియు ఆదిమజాతులు ఎల్లప్పుడూ గ్రామానికి దూరంగా నివసిస్తారు. వ్యాపార వ్యవసాయ కులములు సాధారణంగా గ్రామాలలో మధ్య ప్రాంతాన్ని ఆక్రమించుకుంటారు. దీనిని బట్టి కులము మరియు వర్గము గ్రామీణ సామాజిక స్తరీకరణలో కేంద్ర స్థానము ఆక్రమిస్తున్నవని చెప్పవచ్చును.

భారతీయ సమాజములో సామాజిక అసమానతల అంశం ఒక మౌళికమైన సమస్య. కులము లేదా వర్గము మీద ఆధారపడి ఉన్న సామాజిక స్తరీకరణ అధ్యయనము అసమానతలను అర్థం చేసుకోవడముపై ఆధారపడియున్నది.

లూయిస్ డ్యూమాంట్ (Louis Dumont), ఫ్రెంచి సమాజ శాస్త్రజ్ఞుడు అసమానతలను కుల ప్రాతిపదికగా వివరించినాడు. సమానత్వానికి వ్యతిరేక పదము క్రమశ్రేణి అని, అసమానత కాదని అతని అభిప్రాయము. కుల వ్యవస్థలోని క్రమశ్రేణిని కుల ముఖ్య సూత్రమైన శుచి, అశుచిగా వివరించినాడు.

1. క్రమశ్రేణి అనగా అశుచిపై శుచి యొక్క ఆధిక్యత - శుచి నుంచి అశుచులను విడదీయుట శ్రమ విభజన ప్రాతిపదికపై 'శుచి' వృత్తులను, 'అశుచి' వృత్తులను విడదీయుట అని అతని అభిప్రాయము.

2. క్రమశ్రేణి స్వతంత్రత కలిగిన సహజమైన అసమానతలు లేదా శక్తి పంపిణీ

3. కులాల క్రమము మత పరమైన స్వభావము గలది.

4. చుట్టూనున్న వారితో మధ్యనున్న వారి యొక్క సంబంధమే క్రమశ్రేణి.

ఈ విధంగా డ్యూమాంట్ కుల సిద్ధాంతీకరణ మరియు కుల క్రమశ్రేణి భావన పాశ్చాత్య శాస్త్రవేత్తలు వివరించిన పాశ్చాత్య భావనలైన వ్యక్తి వాదము, సర్వసమానత్వ వాదము మొదలైన వాటికి పూర్తిగా భిన్నంగా ఉంది. డ్యూమాంట్ క్రమశ్రేణిని వర్ణ సిద్ధాంతములో సంబంధీకరించినాడు. కానీ, ఇది శక్తి అధికారములలో భిన్నమైనది. హిందూ సమాజములో రాజు పురోహితునికి లొంగియుండట మతపరమైన క్రమశ్రేణికి సంబంధించిన అంశము. కనుక క్రమశ్రేణిలో వర్ణభాగము మరియు కుల వ్యవస్థ ఇమిడియున్నది అని వివరించినాడు. ఈ విధంగా పరస్పర చర్యలలోను, ప్రవర్తనలోను డ్యూమాంట్ సైద్ధాంత పరమైన దృక్పథానికి అధిక ప్రాధాన్యత నిచ్చినాడు.

సంప్రదాయక క్రమ విభజన (జాజ్‌మాని వ్యవస్థ), వివాహ నిబంధనలు, సాంఘీక సంబంధాలు, ఆర్థిక సామాజిక తర్కముపై కంటే క్రమశ్రేణిపై లేదా మతపరమైన విలువలపై ఆధారపడి యుంటాయని డ్యూమాంట్ పేర్కొన్నాడు.

సాంప్రదాయక భారతీయ సమాజంలో క్రమశ్రేణికి మూలము సాంఘీక అసమానతలను కలిగియుండుట, మరియు శుచి, అశుచిల ఆలోచన అనియు చెప్పవచ్చు. ఆధునిక పారిశ్రామిక సమాజంలో అసమానతల మూలము 'సాధన' (Achievement) ఇది స్వేచ్ఛా మరియు న్యాయమైన పోటీ యొక్క ఫలితము హిందూ ధర్మశాస్త్రాలు హిందూ సమాజము నాలుగు వర్ణాలుగా విభజింపబడినవనీ, మరియు వీటిలో అనేక జాతులు పరస్పర ఆధారములతో ఏర్పాటు చేయబడినవనీ వివరించినవి. కులమును మతముతో ముడి వేసినంత కాలం ప్రజలు అంతస్థు క్రమశ్రేణిలను అంగీకరించారు. ఈ సంబంధము ఇరవయ్యవ శతాబ్దములో 1920 మరియు 1930 వరకు కొనసాగింది. పాశ్చాత్య సంస్కృతి యొక్క ప్రభావము, విద్యా వ్యాప్తి, పారిశ్రామికీకరణ మరియు నగరీకరణ ప్రక్రియలు ప్రజల యొక్క అభిప్రాయములలో మార్పును తీసుకొని వచ్చినవి.

ప్రజలు మానవ నిర్మితమైన అసమానతలను ప్రశ్నించుట మొదలు పెట్టినారు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం రావడంతో సాంఘీక అసమానతలను ప్రశ్నించడానికి సాంఘీక న్యాయము కోరడానికి మరింత అవకాశం లభించింది. మండల కమిషన్ రికమండేషన్లు, కేల్కర్ కమిషన్ రికమండేషన్లు మొదలైన వాటి వలన మరియు కుల, సముదాయ ప్రాతిపదికపై ఓట్ల సాధనకై రాజకీయ నాయకుల చేత ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడానికి మరియు సాంఘీక అసమానతలను తొలగించడానికి మరిన్ని అవకాశాలు కల్పించినాయి. అణగద్రొక్కబడిన కులములు తరగతుల వారు సాంఘీక న్యాయం పేరిట ఉద్యోగాలలో, శాసన సభలలో, విద్యా సంస్థలలో రిజర్వేషన్లు పొందుటలో ఆశ్చర్యము లేదు కానీ, కుల వర్గ సముదాయ ఆధారంగా ఉన్న సాంఘీక అసమానతలను తొలగించుటలో చేస్తున్న ప్రయత్నముల వలన కొన్ని కులములలో సముదాయాలలో ఆశాభంగము కలిగిన దాని వలన అనేక ఉద్యమాలు మరియు హింసాత్మక చర్యలు చోటుచేసుకొనుచున్నవి. మరియు రాజకీయ నాయకులు స్వార్థ పరత్వంతో ప్రవేశపెట్టిన విపరీత ప్రక్రియలు ఎక్కువ ఆందోళనకరముగా నున్నవి. సాంఘీక సాంస్కృతిక జీవనంలో అనేక ఆందోళనకరమైన మార్పులు చోటుచేసుకొన్నాయనుటలో సందేహము లేదు. దీని నివారణకు అనేక పరిష్కార మార్గములు సూచింపబడినవి.

ఆండ్రూ బీటెల్ (Andre Beteille) శక్తి-మరియు అసమానతల మధ్య గల సంబంధము చర్చించినాడు. వక్తి అసమానతలు అంగీకరింపబడినవి, అయితే ఇది ప్రజలు విభిన్న లక్షణాలను కలిగి ఉండడం వలన కాక, కులమును శక్తి యొక్క సాధనముగా అంగీకరించుట వలన జరిగినది. ఆంగ్లేయులు వారి యొక్క మద్దతును క్రమశ్రేణి మరియు కులము యొక్క శక్తికి ఉపసంహరించు కోవడం వలన క్రమశ్రేణి కుప్పకూలుట మొదలయినది. వర్గ వ్యవస్థలో భూమి మరియు ఆస్థి కలిగిన వారు భూమి లేని వారిపై, ఆస్థి ని వారిపై ఆధిపత్యాన్ని పొందుతున్నారు.

శక్తి అసమానతలపై సమాజ శాస్త్ర విశ్లేషణలో రెండు లక్షణములు కలవు. అవి:

1. ఒకరి మీద మరొకరి శక్తి

2. వారి శక్తిని వివరించి, మార్పు చేసి, నిబంధనలను సృష్టించి దీనివలన అందరినీ బంధించి (Bond) ఉంచుట.

ఇదే సమయంలో శక్తి యొక్క పరిధి కూడా విశ్లేషణలో ప్రాముఖ్యతను పొందినది. ఒకే వ్యక్తి గాని లేదా సమూహం గానీ సమాన అధికారాన్ని సమాజంలో కలిగియుండరు. విభిన్న వ్యక్తులు ఎవరైతే శక్తిని కలిగి దానిని ఉపయోగించుచున్నారో ఒక రంగంలో లేక అనేక రంగాలలో ఒక పటిష్ట సమూహంగా ఏర్పడతారు. వీరు మిగిలిన సమాజం నుంచి స్పష్టంగా గుర్తింపబడతారు.

సాంఘీక అసమానతలను శక్తిలోనిఅసమానతలను చర్చించిన పిదప, సామాజిక ఉనికిలోని సాధారణ పరిస్థితులలోని అసమానతలను కూడా చర్చించుట అవసరము. అనేక మంది వ్యక్తులు అసమానతను వర్గాల సామాజిక విభజనగా గుర్తించినారు. అవి:

1) పెట్టుబడిదారులు

2) సామ్యవాదులు

పెట్టుబడిదారీ వ్యవస్థలో స్వంత ఆస్థి, వర్గ వ్యవస్థ ఉంటాయి.

సామ్యవాద వ్యవస్థలో వీటిని సాపేక్షంగా గుర్తిస్తారు. సామ్యవాద వ్యవస్థలో స్వంత ఆస్థిని నిర్మూలిస్తే వర్గ వ్యవస్థ నిర్మూలింపబడుతుందా? అను సందేహము కలదు.

పెట్టుబడిదారీ సమాజాలు ఆస్థిపై స్వంత అధికారము ద్వారా వ్యవస్థీకరింపబడతాయా?

సోషలిస్టు సమాజాలలో స్వంత ఆస్థిని నిషేధించుట వలన వర్గ వ్యవస్థ నిర్మూలించబడుతుందా? అను సందేహము పొడసూపుతుంది. రష్యా మరియు ఇతర సోషలిస్టు దేశాలలో అసమానతలు ఉండి, కొనసాగుతున్నవి కనుక, దీనిని బట్టి అసమానత అనేది వర్గ భావన కంటే విశాలమైనదని చెప్పవచ్చును.

అంతస్థు, వక్తి మరియు ఆదాయములలో సాంఘీక అసమానత్వము గూర్చి చర్చించునప్పుడు కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి. సర్వ మానవత్వ సమాజము సంభవమా?

ఇది ఎప్పుడైనా గతములో ఉన్నదా? భవిష్యత్తులో వస్తుందా?

ఆధునిక సమాజములు సమానత్వ వాగ్దానముపై నిర్మింపబడినప్పటికీ, సర్వసమానత్వ సమాజము సాధ్యపడునట్లు కనబడుట లేదు. వ్యవస్థీకరణ, విలువ కట్టుట, అంతర్గత లక్షణముగా సామాజిక జీవనంలో ఉన్నంత కాలం, అసమానత అనే సమస్య కొనసాగుతూ ఉంటుందనే చెప్పవచ్చు. మనము సర్వసమానత్వ సమాజాన్ని రెండు స్థాయిలలో అర్థం చేసుకొనవచ్చును.

1) విభిన్న స్థాయిలలో ఉన్న ప్రజలు ఒకే వక్తి, హొదా అనుభవించే పరిస్థితి.

2) మొత్తం సమాజ సభ్యులందరూ శక్తి, హొదా అనుభవించుటకు ఒకే విధమైన మార్గము కలిగియుండుట.

అయితే, ఇటువంటి పరిస్థితి భవిష్యత్తులో వస్తుందని భావించుట భ్రాంతి అని ఇంచుమించు అందరు సమాజ శాస్త్రవేత్తలు అంగీకరించినారు.

## 6.5 సారాంశము:

సాంఘీక అసమానత అనేది వ్యక్తుల మధ్య ఒక అసమాన స్థితి. ఈ సాంఘీక స్థితిలో అసమానతలు కొంచెం ఎక్కువ లేక తక్కువగా సంపద, అంతస్థు మరియు శక్తులలో ఎవరైతే ఎక్కువ సమానులుగా భావింపబడుతున్నారో, వారి కన్నా తక్కువ స్థానాన్ని కలిగియుంటారు. ఈ అసమానత అనేది వ్యక్తులలో సహజంగా అంతర్గతంగా ఉంటుంది. కులము ఒకరకమైన సాంఘీక అసమానత అంతర్వివాహము, కులవృత్తి, మరియు క్రమశ్రేణి అను కుల నిర్మితి యొక్క లక్షణాలన్నీ సామాజిక స్తరీకరణపై ప్రత్యక్ష ప్రభావాన్ని కలిగియుంటాయి. సాంప్రదాయిక వృత్తులు వ్యక్తుల యొక్క సంపద అంతస్థును నిర్ణయిస్తాయి. గ్రామీణ వివాహ పద్ధతులు కూడా ప్రత్యేక కుల సమూహాలచే నిర్ణయింపబడతాయి. గ్రామాలలో సామాజిక పరస్పర చర్యలను కుల వ్యవస్థ నిర్దేశిస్తుంది. కులము క్రమశ్రేణి సంబంధాల వ్యవస్థ కనుక జీవితంలోని కుల అంతస్థుకు సంబంధించిన అన్ని రంగాలలోను అసమానతలు ఉంటాయి.

## 6.6 నమూనా ప్రశ్నలు:

1) సాంఘీక అసమానతా భావనను చర్చింపుము.

2) కులమును సాంఘీక అసమానతా పద్ధతిగా చర్చింపుము.

## 6.7 చదవదగిన గ్రంథములు:


1. ఆంద్రూ బీటెల్ - ఇనీక్వాలిటీ ఎమాంగ్ మెన్ Andre Beteille-Inequality Among Man

2. జి.యస్.ఘుర్యే - కాస్ట్, క్లాసు అండ్ ఆక్యుపేషన్ G.S.Ghurye-Caste, Class And Occupation

3. రామ్ ఆహుజా - సొసైటీ ఇన్ ఇండియా Ram Ahuja-Society In Inda

4. కే.ఎల్.శర్మ - సోషల్ స్ట్రాటిఫికేషన్ ఇన్ ఇండియా K.L.Sharma-Society In India.

పాఠం-7

# సామాజిక స్తరీకరణ మరియు అసమానత
# భారతదేశంలో ఉత్పన్నమయ్యే అంశములు-పద్ధతులు

**(Social Stratification And Inequality- Issues And Emerging Trends In India)**

**విషయక్రమం:**


7.1 ఉద్దేశ్యము

7.2 పరిచయం

7.3 సామాజిక స్తరీకరణ అధ్యయనంలోని అంశాలు

7.4 సారాంశం

7.5 నమూనా ప్రశ్నలు

7.6 చదవదగిన పుస్తకములు


## 7.1 ఉద్దేశ్యము:

సామాజిక స్తరీకరణ మరియు అసమానతల వలన భారతదేశంలో ఉత్పన్నమయ్యే అంశములను, పద్ధతులను వివరించుట.

## 7.2 పరిచయం:

గత అయిదు దశాబ్దాలుగా స్తరీకరణకు సంబంధించిన సమాజ శాస్త్రము వేగముగా అభివృద్ధి చెందినది. స్వాతంత్ర్యానంతరము గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలలో సామాజిక స్తరీకరణ అధ్యయనము ప్రాధాన్యత వహించినది. భావపరమైన స్పష్టత కోసం కొంతమంది సమాజ శాస్త్రజ్ఞులు కులమునకు, తెగకు మరియు కులమునకు, సముదాయమునకు గల సంబంధాన్ని అధ్యయనం చేసినారు. కుల స్తరీకరణలో కర్మకాండల ప్రాధాన్యత, నిర్మితి ప్రకార్యముల విశ్లేణ 'ఫీల్డు వర్కు' (Field Work) ద్వారా దత్తాంశమును సేకరించుట మొదలైనవి శాస్త్రజ్ఞుల అధ్యయనములలో ముఖ్యాంశములు. సామాజిక స్తరీకరణ అధ్యయనములు చారిత్రకమైన ఆధారాలను చాలా వరకు నిర్లక్ష్యం చేసినాయి. అప్పట్లో సమాజ శాస్త్రజ్ఞులు కుల పుట్టుక మరియు పరిణామ ప్రక్రియలను, సామాజిక మార్పును స్థూల నిర్మితి దృక్కోణము నుంచి అద్యయనము చేయుటకు ప్రయత్నం చేయలేదు. ఆనాటి అధ్యయములన్నీ సామాజిక వాస్తవములను సూక్ష్మ దృష్టితో పరిశీలించే వర్ణనాత్మక సమస్యా నిర్ధారక పూర్వకమైన అధ్యయనములుగా ఉండిపోయినవి. సామాజిక స్తరీకరణలోని సిద్ధాంతాలకు, సమస్యలకు ప్రాధాన్యతనివ్వక, సామాజిక ప్రాంతాలను గుర్తించడానికి (Maping) ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినారు. సామాజిక వర్గ విశ్లేషణ అసలు ఉండకుండా ఉండడం కానీ, లేక క్లుప్తంగా ఉండడం గానీ జరిగింది. ఈ దశలో భారతీయ సామాజిక అధ్యయనాలన్నీ కులమును, తెగను, గ్రామీణ సముదాయములను వర్ణనాత్మక దృష్టితో అధ్యయనం చేసినవి. సామాజిక స్తరీకరణను విశ్లేషణా దృక్కోణం నుంచి చూడడం అనేది అనుభవాత్మక పరిశీలనలో భావించదగిన (Inferential) అంశముగానే ఈ అధ్యయనములో ఉన్నది. ఈ పై అంశాలను దృష్టిలో పెట్టుకుని సామాజిక స్తరీకరణ అధ్యయనాలలో ఆవిర్భవిస్తున్న అంశాలను, పద్ధతులను చర్చిద్దాము.

## 7.3 సామాజిక స్తరీకరణ అధ్యయనంలోని అంశములు, ఉత్పన్నమయ్యే పద్ధతులు:

1960 నాటికి భావనా పరమైన పద్ధతి పరమైన సమస్యలు సామాజిక స్తరీకరణ అధ్యయనములో ప్రధానమయినవిగా గుర్తించడమైనవి. అనుభవం మీద, శాస్త్రీయ పరమైన ప్రయోగాల మీద ఆధారపడి అధ్యయనం చేయడమనేది ఈ దిశలో వచ్చిన ఒక ప్రముఖమైన అభివృద్ధిగా చెప్పవచ్చును. సామాజిక స్తరీకరణ, పరిశీలన నుంచి పరస్పర సంబంధ ప్రభావిత సూత్రాల పైకి దృష్టిని మరల్చింది. కుల స్తరీకరణలలో లూయిస్ డ్యూమాంట్ (Louis Dumont) రచన అప్పటి దాకా ఉన్న వాటిలో విశిష్టంగా నిలిచింది. ఇతడు సామాజిక స్తరీకరణ అధ్యయనాల స్థాయిని తాత్కాలిక సామాన్య స్థాయి నుంచి సిద్ధాంత పరమైన ప్రశ్నలు లేవనెత్తే స్థాయికి దానిని పెంచినారు. డ్యూమాంట్ ఆలోచనలో సిద్ధాంతము మరియు తత్వము కూడా ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి.

సామాజిక స్తరీకరణ విశ్లేషణము మార్క్సిస్టు సిద్ధాంతములు, పద్ధతులు వినియోగిస్తూ చేసిన అధ్యయనములు సామాజిక స్తరీకరణ అధ్యయనానికి చారిత్రక విశ్లేషణ పద్ధతిని వినియోగిస్తూ అనేక అధ్యయనాలు చేసినారు. అంద్రూ బీటెల్ (Andre Beteille) దక్షిణ భారతదేశపు గ్రామాలలో వినియోగించిన 'కులము-వర్గము-శక్తి' అనే భావనా పరమైన వర్గీకరణ సూత్రముల వైపు మొగ్గును స్పష్టంగా చూపుతున్నది. ఎఫ్.జి.బెయిలీ (F.G.Bailley) ఒరిస్సాలో అధ్యయనం చేసి తెగ-కులము-దేశములకు గల సంబంధాలను గూర్చి తెలియజేస్తూ వ్రాసిన సిద్ధాంత పరమైన వ్యాసాలలో దీనికి ఉదాహరణ పూర్వకముగా బలము చేకూర్చినాడు.

బెయిలీ (Bailey), బీటెల్ (Beteille) ఇరువురూ కూడా స్తరీకరణ ప్రక్రియను వివరించుటలో 'ఓపెన్ అండ్ క్లోజ్డ్' (Open and Closed) భావనలను ఉపయోగించినారు.

ఈ కాలములోని అధ్యయనములన్నీ సమస్యా దిశగా ఊహాపరంగా, విషయ పరంగా సామాజిక స్తరీకరణను విశ్లేషిస్తున్నవి. ఈ అధ్యయనములు అధికంగాకుల పరమైనా సమస్యలపై దృష్టిని కేంద్రీకరించినవి.

వర్గ దోపిడీ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో అధికారం చలాయించడం, పేదరికానికి, సామాజిక సాంస్కృతిక వైమనస్యమునకు (Alienation) న్యాయ సమత్వమునకు గల సంబంధాలను అధ్యయనము చేయుచున్నవి.

ఈ కాలపు అధ్యయనాలలో షెడ్యూల్డు తెగల, షెడ్యూల్డు కులాల వెనుకబడిన తరగతుల ఆధిపత్యన కులాల మరియు సముదాయాల అంశాలు అధికభాగం చోటుచేసుకున్నవి.

పైన పేర్కొన్న సామాజిక స్తరీకరణ అధ్యయనములలో విశ్లేషణా పద్ధతి వినియోగించుట జరిగినది. యోగేందర్ సింగ్ సామాజిక స్తరీకరణలో ఈ క్రింది పేర్కొన్న క్రొత్త పద్ధతులు ఉన్నట్లుగా పేర్కొన్నారు.

1. సామాజిక స్తరీకరణ భావనలపై, సిద్ధాంతములపై చర్చ
2. మారుతున్న కార్యక్రమాల దృష్ట్యా భ్యావనా పద్ధతులు, వాటి ఆధారాలపైన పునరుద్ఘాటన చేసే ప్రయత్నాలు
3. స్తరీకరణ అధ్యయనములో క్రొత్తగా విషయ పరమైన ఆసక్తులు
4. సామాజిక స్తరీకరణలోని అధ్యయనాలలో బహుళవృత్తుల ఆసక్తి విషయ పరంగా, సిద్ధాంత పరంగా కూడా ఫలప్రదంగా కలవడము.

ఎస్.సి.మాలిక్ (S.C.Malik) ఈ క్రింది అంశాలను సామాజిక స్తరీకరణకు ముఖ్యమైనవిగా వివరించినారు.

1. అంతస్థు నిర్ణయించే మత కర్మల విలువలు
2. సామాజిక గతిశీలత మరియు అంతస్థు నిర్ణయం
3. సాంఘీక అంతస్థు మరియు స్తరీకరణ

4. కులము మరియు వర్గముల సమస్య

5. చారిత్రక పరిస్థితులు

భారతదేశములోని భావనలు, దృక్పథముల గురించి సాధారణమైన ప్రశ్నలు, నిర్దిష్టమైన, విషయ పరమైన ప్రశ్నలు లేవనెత్తబడినవి.

స్థూలంగా ఈ క్రింది అంశాలను అనేక కోణముల నుండి అధ్యయనం చేయవచ్చును.

1. భారతదేశంలోని సాంప్రదాయక స్తరీకరణ పద్ధతి
2. భారతదేశములోని కులము, వర్గముల భావనా పరమైన సమస్యలు
3. కొనసాగుతున్న క్రమశ్రేణి మరియు రూపరహిత వర్గములు
4. రైతులలో సామాజిక గతిశీలత్ణ
5. కులము మరియు రాజకీయములు
6. కులము, వర్గము మరియు పార్టీ
7. కులము, వర్గము మరియు అధికారము
8. సామాజిక స్తరీకరణ, శక్తి
9. సామాజిక స్తరీకరణ మరియు గ్రామీణాభివృద్ధి
10. సామాజిక స్తరీకరణ-భారతీయ నగరాలలో షెడ్యూల్డు కులములలో గతిశీలతాధారములు
11. వృత్తులు మరియు సామాజిక స్తరీకరణ
12. పారిశ్రామికీకరణ మరియు సామాజిక స్తరీకరణ
13. తెగలలో వర్గము మరియు జాతి.
14. సామాజిక స్తరీకరణ, విద్య, సంపద, మరియు ఆస్థి
15. సామాజిక స్తరీకరణ మరియు వలస.

గత 40, 50 సంవత్సరాలుగా సామాజిక స్తరీకరణ అధ్యయనాలలో భావనా పరమైన, విషయ పరమైన మార్పులను మనము గమనిస్తూనే ఉన్నాము.

డ్యూమాంట్ (Dumont) నిర్మిత పరమైన సిద్ధాంతము, తత్వము, మార్క్స్ (Marx) యొక్క సిద్ధాంతము, పద్ధతి మరియు వర్గము, అంతస్థు, పార్టీ (Party)లపై వెబర్ యొక్క దృక్కోణాత్మక ఉపగమము మొదలగునవి 1950 దశకంలో ఉన్న నిర్మితి, ప్రకార్యవాద సిద్ధాంతములను, పద్ధతులను సవాలు చేసినవి.

1960లో జరిగిన అధ్యయనములలో సామాజిక స్తరీకరణపై జరిగిన చర్చలు భావనా పరమైన నమూనాలు-సంఘర్షణ, చారిత్రక నిర్దుష్టత-పోలిక, నిర్మితి, ప్రకార్యము-సంఘర్షణ, గతితార్కికత-తత్వములపై కేంద్రీకృతమయినవి.

సామాజిక స్తరీకరణా అధ్యయనములు భావనా పరంగా, విషయ పరంగా కూడా సమస్యా అనుస్థాపితము (Problem Oriented)గా మారినవి. క్రొత్త అధ్యయనములు మతము, వర్గ దోపిడీ, పలుకుబడి, దారిద్ర్యము, వైమనస్యము న్యాయ సమానత్వము మొదలైన సమస్యలను పరిశీలించినారు. సామాజిక స్తరీకరణలో కుల, వర్గ భావనల పునరాలోచన చర్చలకు కేంద్ర బిందువైనది.

సిద్ధాంత పరమైన చర్చ సంప్రదాయ బ్రిటీష్ మరియు అమెరికన్ల నిర్మితి, ప్రకార్యవాదముల నుండి నిర్మాణ వాదము, చారిత్రక నిర్మాణ వాదము, మార్క్సిజమ్‌ల వైపు మారినది.

యోగేందర్ సింగ్ 1970, 80లలో సామాజిక స్తరీకరణ అధ్యయనములలో ఈ క్రింది క్రొత్త అనుస్థాపనలు (Orientations) చోటుచేసుకున్నట్లుగా గమనించారు.

1. సామాజిక స్తరీకరణ యొక్క సిద్ధాంత పరమైన నమూనాలపై (Paradigm) చర్చ

2. చారిత్రాత్మక మరియు పరిణామాత్మక దృక్పథాల పునరుజ్జీవము

3. సామాజిక స్తరీకరణలో గతితార్కిక నమూనా ఒక సిద్ధాంత పరమైన పద్ధతిగా ఆవిర్భవించుట

4. సామాజిక స్తరీకరణకు సంబంధించిన భావనా పరమైన, సాంఘీకమైన అంశాల గురించి తెలుసుకొనవలెననే ఆలోచన

సిద్ధాంత వాదము, పరిణామాత్మక దృక్పథము, గతితార్కిక అనుస్థాపన, సంబంధిత అంశాల గురించి తెలుసుకొనవలెననే ఆలోచన మొదలయిన నాల్గింటిని సామాజిక స్తరీకరణకు సంబంధించిన ముఖ్యమైన అంశములుగా యోగేందర్ సింగ్ వివరించినారు.

ఈ కాలంలో సామాజిక స్తరీకరణ అధ్యయనాలలో రెండు సందర్భములలో సిద్ధాంత పరమైన ప్రశ్నలు ఉత్పన్నమయినవి.

1. సామాన్య సిద్ధాంత పరమైన సామాజిక పద్ధతి

2. సామాజిక స్తరీకరణను అధ్యయనం చేయుటలో భావన, విషయములను గూర్చి సామాజిక నిర్ణయం

భారతదేశములో సామాజిక స్తరీకరణను అధ్యయనం చేయుటలో నిర్మాణాత్మక వాదము, మార్క్సిజము, తత్వ పరమైన నమూనాను మొదట ప్రవేశపెట్టినవి. సామాజిక స్తరీకరణను సిద్ధాంతీకరించుటలో ఇది ప్రాథమిక అంశముగా రూపొందింది.

డ్యూమాంట్ (Dumont) కుల వ్యవస్థను గూర్చి అధ్యయనం చేసిన 'హెూమోహైరార్కిస్' (Homo Hierarcics) గ్రంథములోనిర్మాణ పరమైన నమూనాలలో తాత్వికతకు (Ideology) ఒక ముఖ్యమైన స్థానాన్ని కల్పించినాడు. డ్యూమాంట్ విశ్లేషణలో తత్వమనే పదము హిందూ నాగరికతలో నుంచి గ్రహించబడ్డ ఆలోచనలు, ప్రమాణముల నుంచి రూపొందించబడింది. ఇందులో కులము మూలమైనది.

సామాజిక స్తరీకరణా ప్రామాణిక నిర్మితిలో గల ముఖ్య సూత్రము 'క్రమశ్రేణి'. ఈ క్రమశ్రేణి మతపరమైన కర్మకాండ, మరియు ప్రవర్తనా నియమముల యందు గల శుచి, అశుచిలకు మధ్య గల గతితార్కిక సంబంధమును వివరించును. కుల వ్యవస్థ యొక్క తాత్వికత మరియు సామాజిక నిర్మితి యొక్క తులనాత్మక అధ్యయనము డ్యూమాంట్ (Dumont) దృష్టిలో కేంద్రబిందువులు.

తాత్వాక సిద్ధాంతానికి కార్ల్‌మార్క్స్ (Karl Marx) సామాజిక నిర్మితి, స్తరీకరణ సిద్ధాంతములో ప్రాధాన్యత ఉన్నప్పటికీ, దీనికి భారత సామాజిక స్తరీకరణ అధ్యయనములలో సమానమైన ప్రాధాన్యత లేదు. మార్క్స్ (Marx) భారతీయ సామాజిక స్తరీకరణ అధ్యయనములు తాత్వికపరమైన అంశాలను లేవనెత్తినప్పటికీ, అంత సమగ్రంగా చేయలేదు. అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు ఈ తాత్వికతకు ఇచ్చే ప్రాధాన్యత వారి యొక్క వర్గ నేపథ్యంపై ఆధారపడి యుంటుందని వారి అధ్యయనములో వివరించినారు.

సామాజిక స్తరీకరణను అధ్యయనం చేసే వారిలో తరచుగా 'మధ్యతరగతి' 'మార్క్సిస్ట్' సామాజిక శాస్త్రవేత్తలలో తాత్విక విభజన జరుగుతుంది. ఇది 'మార్క్సిస్ట్' కాని సామాజిక శాస్త్రవేత్తలను వేరు చేయుట కోసం జరుగుతుంది. అయితే వారి అధ్యయన చట్రం (Frame) సంజ్ఞానాత్మకమైనదా లేక సిద్ధాంత పరమైనదా కూడా చూడలేదు. ముఖ్యంగా వారు చేసిన ఎంపిక వివరణ లేక వర్గ నిర్ణయం మార్క్స్ ఊహించినట్లుగా వుందా లేదా అని కూడా చూడకుండా చేయడం జరిగింది. ఈ పద్ధతిలో లోపాలను కొన్నింటిని గుర్తించారు. అయితే, ఈ మాదిరి (Paradigm) ని పూర్తిగా ఖండించలేదు. మార్క్సిస్

అధ్యయనాలలో సామాజిక స్తరీకరణ అధ్యయనానికి ఈ మధ్యన ఎక్కువగా 'అనుభవ పూర్వక' దత్తాంశము (Emperical Data) ఉత్పత్తి, (Generate) చేయబడింది. ఉత్పత్తి విధాన (Mode of Production) ఉపగమము ఎక్కువ ప్రయోజనకరంగా ఉండే అంశము. ఆర్థిక శాస్త్రవేత్తలు, చరిత్రకారులు దీనిని రూపొందించటంలోను, ఆచరణలో పెట్టు పద్ధతిలోను తాత్వికతకు నామమాత్రపు పాత్ర మాత్రమే ఉంది. అటువంటి వాటిలో ముందుగా ఎంచుకొన్న ప్రమాణాల కంటే అనుభవాత్మక సూచికల పైనే సాధారణంగా కేంద్రీకరించటం జరిగింది. వర్గ లక్షణాలను స్థాపించటమే మార్క్సిస్టులు చేసిన సామాజిక వర్గీకరణలో, అధ్యయనాలలో తాత్వికత కున్న ముఖ్యమైన పాత్ర. ఇది సామాజిక స్థాయిలో స్పుటమైన తాత్వికతతోనే పనిచేస్తుంది కానీ, సామాజిక వర్గాలలో (Sociolofical Catagories) వుండే సంజ్ఞా నిర్మితిలో (Cognitive Structure) లోతుగా వుండే దాని ఉనికిని గురించి పట్టించుకోదు.

సామాజిక స్తరీకరణ అధ్యయనాలలో కొత్త అభివృద్ధి వచ్చింది. కొన్ని సందర్భాలలో యిది మార్క్సిస్ట్ సంప్రదాయానికి సంబంధించి ఉంది. భారతదేశ కుల పద్ధతిలో 'బ్రాహ్మణ వ్యతిరేక' తాత్వికత వచ్చింది. అధికంగా పెరుగుతున్న వ్యతిరేక ఉద్యమాలు లేకుండా చేయబడిన (Deprived) సముదాయాలు, తెగలు, షెడ్యూల్డ్ కులాలు మరియు వెనుకబడిన తరగతులు, వెనుకబడిన సముదాయములలోని విద్యావంతులైన తెలివి గల వారు 'శుచి-అశుచి'లపై ఆధారపడ్డ హిందూ కుల పద్ధతి యొక్క కర్మకాండ నిబద్ధతను ఈ తాత్వికత ఎక్కువగా ప్రశ్నించుట జరిగింది. సామాజిక నిర్మితిలో 'బ్రాహ్మణ నమూనా'పై ఆధారపడ్డ కులము. కుల ప్రసక్తి లేని వృత్తి పర విశిష్టీకరణపై ఆధారపడ్డ సమూహాలు, సముదాయాలు అనే రెండు తాత్విక సిద్ధాంతాల మధ్య పోటీ జరిగింది.

దేశములోని అనేక ప్రదేశములలో అనేక మంది వారి జనులు, మిగిలిన షెడ్యూల్డ్ కులాలు బౌద్ధ మతంలోనికి మారుట వలన కులములో బ్రాహ్మణ వ్యతిరేక తాత్వికతకు బలము చేకూరింది. ఇది దళిత ఉద్యమ తాత్వికతకు సామాజిక సంస్కరణకు, సామాజిక వ్యతిరేకతకు వారి 'ఎజెండా' (Agenda)లో ఒక ముఖ్య భాగము. మిగతా ముఖ్యమైన సామాజిక రచనలలో కూడా తోటి సామాజిక శాస్త్రవేత్తల సామాజిక వర్గ పుట్టుకలు, వారు ఎన్నుకునే పద్ధతులు, భావనలు, సాంఘీక సమస్యలపై వారు చేసే సాధారణీకరణలు ప్రభావితమౌతాయనే దృక్పథం సమాజ శాస్త్రంలో ఉంది. సమాజంలోని వెనుకబడిన తరగతుల వారిని గూర్చి అధ్యయనం చేస్తున్నప్పుడు బాధితులను (Victims) సమస్యలను తదనుభూతి (Empathy)తో చూసినప్పుడు వాస్తవిక దృష్టి ఏర్పడుతుందని అనేక మంది భారతీయ, పాశ్చాత్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. 1960 దశకంలో ఉద్భవించిన ఈ పరిజ్ఞానము (Conscivness) తదుపరి దశకములలో ఎక్కువ వేగమును పొందింది. విద్య, సామాజిక గతిశీలతా పద్ధతుల వలన, సామాజిక విధానాలను, ప్రభుత్వం ఆచరణలో పెట్టుట వలన మసదృష్టితో సమస్యలను స్పష్టంగా వ్యక్తం చేయగల తెలివి గల వారు వెనుకబడిన తరగతులలో ఆవిర్భవించారు.

భారతీయ సామాజిక నిర్మితి, సాంప్రదాయములలో తాత్విక చర్చ మరియు రాజ్యాంగ చట్టములో నిర్దేశింపబడిన సాంఘీక న్యాయము, స్వేచ్ఛ, సాంఘీక సమానత్వము ధ్యేయాలుగా భారతీయ సమాజాన్ని మార్చుట కొరకు అనువైన సామాజిక విధానాలను తీసుకురావడానికి సరియైన ఎంపిక చేసే విధానాలపై తాత్విక చర్చ జరిగింది. తాత్వికత సాధారణంగా ప్రామాణిక నిర్మితి యొక్క సిద్ధాంత పరమైన భావన అయినందవలన దాని వాస్తవికతను గూర్చిన చర్చ కష్టమవుతుంది. కానీ, కులములో బ్రాహ్మణ వ్యతిరేక తాత్వికత ఉద్భవించటము, సామాజిక స్తరీకరణ భావనలో వర్గీకరణ దృష్టి ఉద్భవించటముతో ఒక క్రొత్త దశ ప్రారంభమయింది.

సమాజ శాస్త్రంలోని ఈ అధ్యయనంలో 1970 నుంచి గమనించదగిన మార్పేమిటంటే కుల వ్యవస్థలో పరిణామం, వృత్తి పరమైన సమూహాలు మరియు వర్గాలు, వర్గాలకు సంబంధించిన ఇతివృత్తాలు పునరుజ్జీవింపబడినవి. సామాజిక వ్యవస్థల విశ్లేషణలో చరిత్రను, చారిత్రాత్మక రచనలను అధికంగా వినియోగించటం పైదాని కనుబంధముగా వచ్చిన కొత్త పద్ధతి ఈ మార్పును వివరించే (3) మూడు అంశాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

1. ప్రకార్య మాదిరి (Paradigm) సామాజిక నిర్మితులను, వ్యవస్థలను పూర్తిగా చారిత్రక దృక్పథంతో చూడటం చేత సామాజిక స్తరీకరణలో దాని వినియోగం తగ్గింది.

2. 1960 మధ్యకాలం నుంచి సాంఘీక శాస్త్రాలలో మార్క్సిజం పునఃప్రాణం పోసుకోవటంతో గతితార్కిక, చారిత్రక భౌతిక వాద మాదిరి యొక్క వినియోగము సామాజిక విశ్లేషణలో పెరిగింది.

3. సమాజంలో వెనుకబడిన వర్గాల్లో గతిశీలత పొందిన వర్గం వారి కొత్త పరిజ్ఞానం వల్ల సామాజిక స్తరీకరణ సాంఘీక శాస్త్రానికి కొత్త తాత్వికత చేకూర్చడం.

సాంఘీక సాంఘీక శాస్త్రాలలో సాధారణంగాను, సామాజిక శాస్త్రాలలో ప్రత్యేకంగాను, 1970, 1980 కులంలో ఈ అంశాలన్నీ కలిశాయి. కొన్ని అధ్యయనాలు భారతదేశములోని కులము యొక్క పుట్టుకను తిరిగి అధ్యయనం చేయడం ప్రరా:బించాయి. ఇది ఆవరణ పరమైన మరియు వృత్తి పరమైన భేదాలతో సమూహాలను ఒక కాలంలో వంశపారంపర్యపు వాస్తవికతలుగా వివరించారు. మిగతా అధ్యయనా ప్రయత్నాలు దాని పుట్టుకను, అధికారి నిర్మితిలోను, ముఖ్యంగా కొన్ని సముదాయాలు మిగతా వాటి మీద అధికారం చలాయించి వారి సంపదను, శక్తిని కొల్లగొట్టటం వివరించాయి. 1970, 1980లలో అధ్యయనాలు ఎక్కువగా మార్క్సిస్ట్ పద్ధతులు వినియోగించాయి. ఇవి పరిణామ మార్గం ద్వారా ఉత్పత్తి పద్ధతి, నిర్దిష్టంగా కుల ప్రాతిపదికపై ఏవిధంగా జరుగుతుందో అనే దాని మీద చర్చ ప్రారంభించారు. ఈ కొత్త అనుస్థాపన ప్రాధాన్యత భారతదేశంలో కుల స్తరీకరణ పుట్టుక మీద ఒక శాస్త్రీయ సిద్ధాంత వ్యాసం (Scientific Thesis) ఆవిర్భవించిందని కాదు. కానీ, సామాజిక స్తరీకరణ సమాజ శాస్త్రము, సిద్ధాంతము, పద్ధతులకు సంబంధించిన తాత్విక ఉద్రిక్త స్థితిని ప్రతిబింబిస్తుంది.

1950, 1960లలో భారతదేశంలో కులవర్గ సంబంధాలు, వాటి పద్ధతుల అధ్యయనంలో ప్రకార్య వాద పద్ధతి యొక్క ఆధిక్యత అనేక ఉపయోగకరంగా వుండే క్షేత్ర నిజాలు (Field Data) ఇచ్చింది. ఈ వ్యవస్థ వాటి విలువలను లోతుగా గమనించడానికి (Indepth Observation), వాటి పరస్పర సంబంధాలను అధ్యయనము చేసుకునేందుకు దోహదం చేసింది. ఈ అధ్యయనాలలో ఒక ముఖ్యమైన పరిమితి ఏమిటంటే అది వ్యవస్థలను-ముఖ్యంగా గ్రామీణ, నగర, వృత్తి పరమైన నిర్మితిని నిశ్చలంగా చిత్రీకరించింది. ప్రకార్య వాదమూల సూత్రాలు ప్రమాణ స్వచ్ఛందత (Normanative Vohlunarism)ల ఏకాభిప్రాయ తాత్వికత (Consensus Ideology) మీద ఆధారపడి వున్నాయి. అటువంటి అధ్యయనాలు సామాజిక స్తరీకరణను మార్పు, పోరాటం దృష్టితో కంటే సామాజిక సుస్థిరత, కొనసాగటం దృష్ట్యా చూశాయి. మార్పు అనే భావన (Notion) కాలము, చరిత్ర మరియు గతితార్కికత అనే భావాన్ని (Ideas) తీసుకొస్తుంది. మొదట చేసిన సామాజిక స్తరీకరణ అధ్యయనాల్లో చాలా వాటిల్లో సామాజిక విశ్లేషణాంశాలు లోపిస్తున్నాయి. ఒక గ్రామంలో గాని పట్టణంలో గాని సామాజిక స్తరీకరణ పై చేసిన చాలా అధ్యయనాలు అనుభవాత్మక పరిశీలనపై ముఖ్యంగా ఆధారపడ్డాయి. ఇవి చారిత్రక రికార్డ్‌ను కానీ, తారతమ్య (Comparative) స్థూల సామాజిక దృష్టిని కానీ వినియోగించలేదు.

1970, 80 దశకాల్లో సమాజము రూపాంతరము చెందుట వలన, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ఫలితాలు చూపుట వలన సంపద, శక్తుల వలన వచ్చే సామాజిక అసమానతలు, సామాజిక పగ, సామాజిక సంఘర్షణ రూపొందడము ద్వారా ప్రకార్యవాద పద్ధతి యొక్క పరిమితులు సామాజిక శాస్త్రవేత్తలకు స్పష్టమయినవి. సాంఘీక శాస్త్రములలో అభివృద్ధి చెందుతున్న కొత్త పుంతలు, ముఖ్యంగా చరిత్ర, ఆర్థిక శాస్త్రము, రాజకీయ శాస్త్రము, మనోవిజ్ఞాన శాస్త్రములలో మరియు ప్రవర్తనా శాస్త్రములు ఈ పద్ధతిని పటిష్టం చేసినవి. చరిత్రకారులు భారతదేశంలోని సామాజిక నిర్మితిని, దాని రూపాలను స్థూల చారిత్రక కాల చట్రం (Historical Time Frame) నుంచి ఎక్కువగా చూడడం మొదలు పెట్టినారు. సామాజిక ఉప నిర్మితుల, ఉప సంస్కృతులను కాలము స్థలము దృష్ట్యా, చరిత్ర వ్రాసే వారిలో కొన్ని వర్గాల వారు, ముఖ్యంగా చరిత్రలో 'సబ్‌ఆల్టరన్' ఉపగమము రచయితలు తీవ్రంగా పరిశోధించారు. ఆర్థిక శాస్త్రవేత్తలు, ముఖ్యంగా వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలను 'మార్క్సిస్ట్' అను స్థాపన ప్రభావితం చేయబట్టి గ్రామీణ భారతదేశంలోని సామాజిక స్తరీకరణ పద్ధతిలో కొత్త భావన యోచనలను (Conceptual Scheme) రేకెత్తించింది. వారి తీర్పు (Findings) స్తరీకరణ అధ్యయనాల సామాజిక 'మాదిరి' (Paradigm)ని ప్రభావితం చేసింది. మిగతా సాంఘీక శాస్త్రాలలో కూడా ఇటువంటి తీరే కన్పించింది. ఇదంతా సామాజిక స్తరీకరణను అధ్యయనం చేయడానికి చారిత్రక మరియు పరిణామాత్మక చట్రం (Frame Work) ఉద్భవించడానికి దోహదం చేసింది.

చరిత్రపై అవధారణ (Emphasis) సామాజిక స్తరీకరణ అధ్యయనాల పుట్టుక గురించిన ప్రశ్నలు, దాని కొత్త పద్ధతులు తెలుసుకోవడానికి దారితీసింది. గతితార్కిక అనుస్థాపన ఉద్భవించడం అనేది ఈ దిశలో కొత్త అభివృద్ధి. ఇది రెండు రూపాలను పొందింది. ఇందులో మొదటిది సామాజిక స్తరీకరణ పద్ధతిని గమనించడం, దాని రూపం కంటే లక్షణాల మీద అవధారణ

(Emphasis) చేయడం. రెండవది సామాజిక స్తరీకరణ సానుకంప తాత్వికత (Consensus Ideology) నుంచి గతితార్కిక అధ్యయనం, సామాజిక పోరాటం (Conflict) మరియు దానికే పేరు (Designation) పెట్టటంపై అవధారణ చేయుటకి మారింది. 'మార్క్సిస్ట్' సిద్ధాంతాలనుపయోగించి చేసే అధ్యయనాలలో పరిశీలన, విశ్లేషణ చేయడానికి ఇవి ప్రాథమిక పరిమితులు (Parameters) అయ్యాయి. సామాజిక స్తరీకరణ అనే దానికి ఆచరణాత్మక క్రమపద్ధతి (Methodology) యొక్క చర్చ నుంచి సామాజిక పద్ధతులపై కేంద్రీకరించడం అనేది ఉద్భవిస్తుంది. కులము లేక వర్గము అనే వాస్తవికతను ఈ అస్తిత్వం గల వస్తువుల (Entities) లక్షనాల నుంచి గ్రహించాలా? లేక అలా తయారైన పద్ధతి నుంచి గ్రహించాలా సామాజిక స్తరీకరణ మూల పద్ధారాల (Substantive) లక్షణాలను అవధరించటం వల్ల దానికొక నిశ్చలమైన (Static), చారిత్రక దృక్కోణం ప్రాప్తించింది. ఈ సామాజిక విషయాలను 'అయ్యేవాటి' కంటే (Becoming) 'వున్న' (Being) వాటిగా భావించటం వలన దత్తాంశాన్ని వ్యాఖ్యానించటానికి, తార్కిక ఫలితాలు సామాజిక స్తరీకరణ భావనను వినియోగించటానికి, సామాజిక పరిణామానికి దోహదం చేయటానికి వినియోగపడతాయి.

మార్క్సిస్టు కాని రెండు తరహా అధ్యయనాలలో ఈ ఫలితాలు ప్రత్యక్షమవుతాయి. ఈ పద్ధతి సానుకంపన మైన అంశం మీద ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించింది. ఇది సామాజిక క్రమాన్ని మార్చే దానికన్నా స్తరీకరణ కొనసాగించే వాస్తవాన్ని సుస్పష్టంగా చిత్రీకరించింది. పల్లెల్లోను, పట్టణాలలోను కులం, వర్గం మీద చేసే అధ్యనాలు గతిశీలతకు ఎంతవరకు దోహదం చేయగలవు లేక ఎంతవరకు అడ్డుకోగలవు అనే విషయాన్ని గమనించి వివరించటం జరిగింది. అంతస్థు, సంపద, శక్తి అనే వాటిని పునర్నిర్మించటం కూడా ఇవి చేస్తుంటాయి. వాటి యొక్క ఉనికి, ప్రాధాన్యత, ఈ రెండింటి మీద ఆధారపడి యుంటుందని అధ్యయన వేత్తలు నొక్కివక్కాణించుట జరిగింది. ప్రకార్యవాద అధ్యయనములు, నిర్మితి వాదక అధ్యయనాలలో ప్రస్ఫుటమైనట్లు 'అని ఉన్నాయి' (Being) అనే దానిని ఎక్కువగా నొక్కివక్కాణించుట సామాజిక వాస్తవాన్ని దాని చారిత్రక గతితార్కిక నిజము నుండి మినహాయించుటయే అవుతుందని కొందరు సంఘ శాస్త్రవేత్తలు అభిప్రాయపడినారు. అనుభవాత్మక దృష్టిలో భారతదేశంలో కులాన్ని, వర్గాలన్ని విశ్లేషించుటలో దీనికి సంబంధించిన ప్రశ్నలు తలెత్తినాయి. సంప్రదాయంగా ఈ సంస్థలను ఒక సూచికల సముదాయము ద్వారా కానీ, సామాజిక ఆర్థిక చారిత్రక వ్యవహారములలో ప్రతిష్టాత్మకమైన పద్ధతి ద్వారా కానీ అధ్యయనం చేసేవారు. ఈ రెండు దృక్పథములలో కూడా కులము - వర్గము అనే వాటి నిర్మితి లేదా సంబంధాల సమూహ నిర్మితి యొక్కలక్షణాన్ని నొక్కి వక్కాణించడము జరిగింది. కుల వర్గాల కుల వర్గాల సామాజిక నిర్మితి వాస్తవాన్ని మార్క్సిస్టు అధ్యయనములలో ఉత్పత్తి విధానాల ద్వారా - కౌలుదారీ పద్ధధతి (Feudalism) పెట్టుబడి పద్ధతుల (Capitalism) ద్వారా అధ్యయనం చేయటం జరుగుతోంది. కులము, వర్గము రెండింటికీ సంబంధించిన సంబంధాల పద్ధతి కూడా అల్పకాలమైనవే కాకుండా ఇవి రెండూ కలుస్తాయని, (Convergence) లేదా పరస్పర పరివర్తనం (Interchange) చెందుతాయని సాంద్రతాధ్యయమనములు (Intensive Studies) తెలియజేసినవి. కులం ఎక్కువ కాలం వరకు ఉండే సంబంధాల సముదాయాన్ని సామాజిక నిర్మితిగా ఏర్పరుస్తుంది. అయితే అది కూడా సమాజం ఉత్పన్నం చేసే సామాజిక, ఆర్ధిక, రాజకీయ, సాంస్కృతిక శక్తుల ఒత్తిడికి తగిన విధంగా (Respond)మారుతుంది. కనుక కులాన్ని, వర్గాన్ని నేటి భారతీయ సమాజంలో కేవలం సంస్థలుగాను కాకుండా కులంలో 'కులతత్వం' ఎంత వరకు ఉంది. వర్గంలో వర్గతత్వం ఎంతవరకు ఉంది? అనేవి అధ్యయనం చేయటం ఆసక్తికరంగాను, ప్రాధాన్యత కలదిగాను ఉంటుంది. ఈ ఉపగమము యొక్క క్రొత్తదనము మార్క్స్ పరమైన, నిర్మితిపరమైన, ప్రకార్యవాదమైన సమాజ శ్యాస్త్ర మరియు సాంఘీక శాస్త్ర పరంపరలలో చర్చకు దోహదం చేసింది. చరిత్రకారుల్లో సబ్ఆల్టరన్ (Subaltern-అడుగు తరగతి) ఉపగమము ఈ పరిజ్ఞానము (Awareness) చరిత్ర వ్రాయడానికి సహాయపడినది. ఇది స్థూల నిర్మితుల సామాజిక నిర్మితులను, చిన్న నిర్మితులతో కలపటమే కాక సాంఘీక క్రమాన్ని (Social Order) సామాజిక పద్ధతులతో కలుపుతుంది.

ఈ అభివృద్ధి నిర్మితపరమైన (Structuralism) జనాధ్యయన పద్ధతికి (Ethnomethodology)నరవర్గ సమాజ శాస్త్రం (Ethnic Sociology) మార్క్సిజమ్, ప్రకార్యవాదము (Functionalism) మొదలైన వాటియొక్క సంజ్ఞానాత్మక మరియు వర్గీకరణ (Methodological) విధానంలో తీవ్రతను పెంచటానికి ఒకవైపు దారితీయగా, మరొకవైపు ఇవి సామాజిక వాస్తవాన్ని విశ్లేషించడానికి, ప్రత్యేకంగా సామాజిక స్తరీకరణను అర్థం చేసుకోవడానికి సిద్ధాంతాలన్నీ కలవడానికి (Convergence) ఎక్కువగా ప్రయత్నం జరిగింది. సమాజ స్తరీకరణ అధ్యయనానికి 1970 మరియు 1980లలో విస్తృతమౌతున్న సాంఘీక శాస్త్రాల ఉపగమనాలు సమాజ శాస్త్రం సామాజిక మానవ శాస్త్రాలలో పరిధులు దాటి పెరిగిపోయింది. చరిత్రకారులు ఆర్థిక శాస్త్రవేత్తలు, రాజకీయ శాస్త్రవేత్తలు,

మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా సామాజిక స్తరీకరణ అర్ధం చేసుకునేందుకు సంబంధించిన రచనలు రచించారు. ఈ పరస్పర విద్యా విభాగాల అనుస్థాపనతో సిద్ధాంతపరమైన కలయిక జరుగుతోందనడానికి సూచనలు కనిపిస్తున్నాయి. సబ్ఆల్టరన్ (Subaltern-కిందిస్థాయి) చరిత్రకారులు కూడా వర్గము మరియు సామాజిక ఉద్యమాల విశ్లేషణకు మార్క్సిస్ట్ నిర్మితి పరమైన మాదిరి (Stucturalist Paradigms)వల్ల సంశ్లేషణ (Synthesis) ఎక్కువగా వినియోగిస్తున్నట్లు కనిపిస్తుంది. సామాజిక స్తరీకరణనుమార్క్సిస్ట్ సిద్ధాంత పరమైన చట్టం ద్వారా ఇటీవల చేసిన అధ్యయనాలలో సంప్రదాయము ప్రకార్యము, ఆధ్యాత్మిక, ఆదిభౌతిక వైరుధ్యాలతోను వాటి పరిహారంతోను చేసిన చర్చ మరియు మార్పు పొందటం అనే వాటిమీద ఆసక్తి ఎక్కువగా చూపెట్టాయి. ప్రకార్యవాద అధ్యయనాలు పరస్పర సంఘర్షణ, వైరుధ్యం మరియు చారిత్రాత్మక పద్ధతులు మొదలైన వాటి మీద ఎక్కువ ఆసక్తి కనబరిచాయి. సామాజిక ఉద్యమాలు కులము, వర్గముతో వాటిపై పెరుగుతున్న సంబంధము. జనాభా సంబంధమైన నగర నిర్మితులు, రాజకీయ ప్రక్రియలు, ఆర్థిక ఏర్పాట్లు, సమాజ స్తరీకరణ వెనుకనున్న సిద్ధాంత పరమైన అధ్యయనాలు ఈ ఉద్దేశ్యాలను తెలియజేస్తున్నాయి. వీటన్నిటితోను సామాన్యంగా ఉన్న అనుస్థాపన (Orientation) ఏమిటంటే సామాజిక క్రమం మీద దృష్టి సారించేకంటే ఆధ్యాత్మిక, ఆదిభౌతిక వైరుధ్యాలతోను వాటి పరిహారంతోను సంబంధలం గల విమర్శపై కేంద్రీకరించడం. భారత దేశంలో మొదటి నుంచి సామాజిక సంబంధము ఒక ముఖ్య లక్షణము. ఈ సంబంధము (relevance) మీద చర్చ యొక్క సందర్భం మాత్రం మారుతూ వచ్చింది.

1950వ దశకంలో చాలా అధ్యయనాలు సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక పద్ధతుల అభివృద్ధిపై అనుస్థాపించబడినవి (Oriented). ఇవన్నీ కూడా సామాజిక మార్పు తీసుకురావటం కోసం జాతీయ స్థాయిలో జరిగే ప్రయత్నాల నుంచి ప్రేరేపణ పొంది చేసిన అధ్యయనాలలో భాగాలు. సమాజంలోని గ్రామీణ, నగర పారిశ్రామిక భాగములలో సామూదాయిక వికాసం పంచాయతీ పద్ధతి, కుల వర్గముల పాత్ర, శ్రేష్ట వర్గముల ఏర్పాటు మొదలైన వాటి అధ్యయనం మీద కేంద్రీకరించాయి. ఇందులో ఎక్కువ భాగం సామాజిక పురోభివృద్ధి మరియు దానికి దోహదం చేసే వ్యవస్థలు (Institutions) వాటికి సహాయపడే లేక ఆటంకాలుగా ఉండే పద్ధతులను గుర్తించడంపై అధ్యయనాలు. ప్రణాళికాబద్ధ అభివృద్ధి అప్పుడు (Relevant) సంబంధించిన దాని అర్థంగా గుర్తించబడింది. 1960లో భావ సిద్ధాంత (Ideology) దక్పథంలో మార్పు వచ్చి చర్చ యొక్క సామాజిక సందర్భం (Relevence) ప్రమాణ శాస్త్రం వైపు మళ్లింది. మొదటగా ఇది భారతీయ సమాజ శాస్త్రము మరియు సంజ్ఞానాత్మక విషయాలవైపు మళ్లింది. ఇందులో సామాజిక స్తరీకరణ కులాన్ని వర్గంతో పోల్చి చూసేదిగా చర్చ కనిపించింది. అదే విధంగా భారతదేశ వాస్తవ పరిస్థితికి సమాజ స్తరీకరణతో సహా 'మాదిరి' (Paradigm) యొక్క ఔచిత్యం అనే ప్రశ్న కూడా ఈ సందర్భంలో ఉద్భవించింది. రెండవ ప్రశ్న సామాజిక రివాజుకు సామాజిక మార్పుకు సామాజిక స్తరీకరణ అధ్యయనాలు ఏవిధంగా దోహదం చేస్తాయి? ఏవిధంగా సహాయ పడతాయి? సామాజిక స్తరీకరణ అధ్యయన పద్ధతిలో సామాజిక రివాజు మార్పులు అక్కడ భావనా పరంగాను, ఆచరణ అనుస్థాపన భిన్నంగా (Operational Orientation) మారింది.

సామాజిక అభివృద్ధి పద్ధతిలో సామాజిక స్తరీకరణ సూత్రాలు కులము, వర్గ విభేదము మొదలైనవి. వైరుధ్యం పోరాటంగా చూడబడ్డాయి. మార్పు విధానం (Policy) విమర్శన లేకుండా అంగీకరించటం అనేది మార్పు విధానాన్ని, పద్ధతిని విమర్శనాత్మకంగా విశ్లేషించటానికి చోటు ఇచ్చింది. సామాజిక న్యాయము సమానతతోపాటు అభివృద్ధికి చోటుయిచ్చింది. ఇది సామాజిక స్తరీకరణ అధ్యయనం చేయడానికి సిద్ధాంతమైన ఉపగమాలను, విమర్శనాత్మక సిద్ధాంతాలను మార్క్సిజమ్‌కు ఎక్కువ (Relevant) సంబంధము కలిగేలా చేసింది. భారతదేశంలోని సామాజిక స్తరీకరణ అర్థం చేసుకొనేందుకు 1970 మరియు 1980 దశకములలో మూల సూత్రాలను నిర్మితి, పద్ధతులను అర్థం చేసుకొనే ప్రయత్నంలో చోటు చేసుకుంటున్న ఆధునికీకరణ, పునర్ నిర్మితి పద్ధతులు శిష్ట వర్గాలు (Elites) సమాజములో వెనుకబడిన వారిలో తరగతులు (Categories of weaker section of society) స్త్రీలు, పిల్లలు, తెగలు, షెడ్యూల్డ్ కులాలు (Scheduled Caste) మొదలైనవి సామాజిక సమానతలు, అసమానతలలో క్రొత్త వాస్తవాల అధ్యయనము సామాజిక ఆధునికకీకరణ అభివృద్ధి దృష్ట్యా సామాజిక స్తరీకరణలో వాటి పాత్ర అనేవి అధ్యయనానికి క్రొత్త సంబంధిత దృక్కోణాలు, భారతదేశంలో తయారు అవుతున్న క్రొత్త సామాజిక రూపాలను, నిర్మితులను వాటి సూత్రాలను, పద్ధతులను సమాజ శాస్త్రము పూర్తిగా అర్థము చేసుకోవలసిన అవసరము ఇంకా ఉంది.

## 7.4 సారాంశం:

పైన చర్చించినట్టుగా స్తరీకరణలో సమాజశాస్త్రము సామాజిక క్రమము, సామాజిక సమానత్వము, సామాజిక అసమానత్వము, సామాజిక న్యాయము, శక్తి మానవుని యొక్క ప్రకృతి అనే వాటితో ముఖ్యంగా ముడిపడి ఉంది. స్థూలంగా ఈ విషయాలన్నీ కూడా సామాజిక స్తరీకరణ, నిర్మితులు, పద్ధతులు మొదలైన సిద్ధాంతాలకు సంబంధించినవి. సామాజిక స్తరీకరణకు ప్రమాణాత్మకమైన ఉపగమము అంటే హెూదా (Status) సంపద మరియు శక్తి అనేవి నిరుద్దష్టమైన వివరణ ఇవ్వగలవు.

## 7.6 ప్రశ్నలు:

1. భారతీయ సామాజిక స్తరీకరణలోని ముఖ్యమైన సమస్యలను చర్చింపుము.

2. భారతీయ సామాజిక స్తరీకరణ అధ్యయనంలో ఉత్పన్నమౌతున్న విధానాలను చర్చించుము.

## 7.5 చదవదగిన పుస్తకములు:


1. కే.ఎల్.శర్మ : సోషల్ స్ట్రాటిఫికేషన్ ఇన్ ఇండియా - ఇష్యూస్ అండ్ థీమ్స్

K.L.Sharma : Social Stratification in India-Issues & Themes.

2. యోగేంద్ర సింగ్ : సోషల్ స్ట్రాటిఫికేషన్ అండ్ ఛేంజ్ ఇన్ ఇండియా

Yogendra Singh : Social Stratification in and Change in India.

3. రామ్ అహుజా : సొసైటీ ఇన్ ఇండియా

Ram Ahuja : Society in India.

4. కే.ఎల్.శర్మ : సోషల్ స్ట్రాటిఫికేషన్ ఇన్ ఇండియా

K.L. Sharma : Social Stratification in India.

## పాఠం-8

# అసమానత - శాశ్వతత్వము

**విషయక్రమం:**

**8.1 ఉద్దేశ్యము**

**8.2 పరిచయము**

**8.3 సామాజిక అసమానత భావన**

**8.4 అసమానతల అధ్యయనానికి ఉపగమాలు**

**8.4.1 మార్క్స్ ఉపగమము**

**8.4.2 వెబర్ ఉపగమము**

**8.4.3 నిర్మితి-ప్రకార్య ఉపగమము**

**8.5 అసమానత - దాని శాశ్వతత్వము**

**8.6 సారాంశము**

**8.7 నమూనా ప్రశ్నలు**

**8.8 చదవదగిన గ్రంథములు**

## 8.1 ఉద్దేశ్యము:

సాంఘీక అసమానతా భావమును వివరించుట.

సాంఘీక అసమానతాధ్యయనములోని దృక్పథములను చర్చించుట. భారతీయ సమాజంలో అసమానత ఏవిధముగా శాశ్వతం చేయబడిందో చారిత్రక సాంఘీక ఔచిత్యమును చర్చించుట.

## 8.2 పరిచయం:

సాంఘీక అసమానత నిరంతర సమస్య. కాబట్టి అన్నిచోట్ల ఏదో ఒక రూపంలో కనిపిస్తూ ఉంటుంది. దీని ఉనికి జీవనంలో ఒక భాగము. సాంఘీక అసమానత నిరంతర సమస్య. ఇది సమాజంలో వ్యక్తులకు ఎక్కువ, తక్కువ స్థితులను కలగజేస్తుంది. ఇది ఏ సూత్రములపై ఆధారపడి ఉంటుందో, ఆ సూత్రాలు వ్యక్తులు, సమూహాలు, కుటుంబాల మధ్య సామాజిక వనరులను పంపిణీ చేయు పద్ధతిని నిర్ణయిస్తుంది. అసమానత అన్నిచోట్ల గోచరించినప్పటికీ, దీనికి కారణాలు - ఫలితాలు మరియు గమనశీలత (Dynamics) అనేక రూపములలో ఉంటాయి. ఈ అసమానతను గూర్చి డేరాన్ డార్ఫ్ (Dahren Dorf) నాలుగు ప్రశ్నలను మనముందుంచాడు.

అవి:

1. మానవులలో అసమానతలు ఎందుకున్నవి?

2. వీటి యొక్క కారణములేవి?

3. ఇవి తగ్గించబడతాయా? లేక పూర్తిగా వీటిని నిర్మూలించుటకు వీలవుతుందా?

4. సమాజంలో దీనిని ఒక అవసరమైన అంశముగా అంగీకరించాలా?

ఇవి అన్నిచోట్లా తలెత్తే ప్రశ్నలయినా అసమానత ప్రపంచంలో పలుచోట్ల విభిన్నమైన పద్ధతులలో వ్యక్తమౌతున్నది. సామాజిక అసమానతకు శాస్త్ర సమ్మతి, దాని యొక్క ప్రకార్యావాదము తప్పని సరితత్వము మొ॥నవన్నీ దానిని లాంఛన ప్రాయంగా సూత్రం వలే చెప్పే పద్ధతిలో కేంద్రీయ అంశాలు: డేరన్ డార్ఫ్ (Dahren Dorf) చెప్పిన దానిలో కూడా ఇవే కేంద్రాంశాలు. భారతీయ సమాజంలోని సామాజిక అసమానతలు వాటి నిరంతర తత్వంను గురించి చర్చించే ముందు ఆ భావనను (Concept) దానికి ఉపగమాలను క్లుప్తంగా విశ్లేషించడము భావ్యము.

## 8.3 సామాజిక అసమానత భావన:

సామాజిక అసమానత అంటే సమానత్వము లేకపోవుట లేక వ్యక్తుల మధ్య అసమాన పరిస్థితి ఉండటం లేక వ్యక్తులు సమాజంలో సంపద, శక్తి, అంతస్థు, హోదా మొ॥న వాటిలో ఇంచుమించుగా అసమాన పరిస్థితులను మిగతా వారితో పోల్చిచూసినప్పుడు ఏర్పడేది. సామాజిక అసమానత అనేక దృక్కోణాలు గలది. ఎప్పుడూ మారుతూ ఉండేది. సామాజిక అసమానతలు నిరంతరం ఏర్పడుతూ లేక పునర్నిర్మితమౌతూ ఉంటుంది. అసమానత అనేది సిద్ధాంత పరంగా కానీ, పరిశోధనాత్మకంగా కానీ సమానతకు వ్యతిరేక పదము కాదు. ఇది పోల్చి చూసుకుంటే తెలిసేది. ఇది Absolute కాదు. వ్యక్తులు, కుటుంబాలు, సమూహాలు మిగతా వారితో పోల్చిచూసుకొనేది.

ఉదా: కుటుంబములోని సభ్యుల మధ్య సమానత, అసమానత రెండూ కూడా ఉన్నాయి.

కుటుంబములోని సభ్యుల మధ్య అసమానతలు ఆదాయం, విద్య, ఉద్యోగము, వృత్తి అనేక వాటి కంటే వయస్సు, లింగము, బంధుత్వము, గౌరవము మొ॥న వాటి మీద ఆధారపడి ఉన్నాయి. ఆదాయము, వృత్తి, విద్య మరియు గౌరవము అనే అంశాల మీద సామాజిక అసమానత ఆధారపడి ఉంటుంది. ఇవి చాలా ముఖ్యమైనవి. ప్రాధాన్యత కలవి.

## 8.4 అసమానతల అధ్యయనానికి ఉపగమాలు (Approaches of the Study of Inequality):

అసమానతల అధ్యయనానికి అనేక ఉపగమాలున్నాయి. అందులో ఈ క్రిందివి ముఖ్యమైనవి.

1. మార్క్స్ ప్రతిపాదించిన ఉపగమము.

2. వెబర్ ప్రతిపాదించిన ఉపగమము.

3. ప్రకార్య నిర్మితి ఉపగమము.

**8.4.1 మార్క్స్ ఉపగమము:** జీవన పరిస్థితులు మార్క్స్ ప్రతిపాదించిన ఉపగమము ప్రకారము క్రమశ్రేణిని, అసమానతలను నిర్ణయిస్తాయి. మార్క్స్ చెప్పిన ప్రకారము ఉత్పత్తి పద్ధతి మనుషుల సంబంధాలను వారి ప్రమేయము లేకుండానే నిర్ణయిస్తుంది. మనుషుల స్వభావము వారి యొక్క భౌతిక పరిస్థితులను నిర్ణయించే ఉత్పత్తిపైన ఆధారపడి ఉంటుంది. మార్క్స్ ఆస్థి సంబంధాలు, ఆస్థికి సంబంధించి వ్యక్తుల మధ్య సంబంధాలు కానీ, వ్యక్తికి పదార్థానికి గల సంబంధం కాదని తెలియజేశాడు. ప్రతి సమాజములోనూ వస్తువుల ఆర్థిక ఆధారాన్ని లోపల కల infra Structure ను Super Structure ను విడదీయవచ్చు. అభివృద్ధి చెందే సందర్భంలో ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు అంతర్గత వైరుధ్యము ఉంది. ఉత్పత్తి ప్రక్రియలో సత్వతంత్రము పోతుందని మార్క్స్ చెప్పాడు. ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు గల వైరుధ్యం వల్ల వర్గ నిర్మితి జరుగుతుందని, ఇది వర్గ పోరాటానికి దారితీస్తుందని మార్క్స్ చెప్పాడు.

సామాజిక వర్గాలు మొదట అణగ(ద్రొక్కే వారికి, అణగ(ద్రొక్కబడ్డ వారికి ఉండే వారిలో మొదట వైరుధ్యము శ(తుత్వ భావన కలగజేస్తుందని తరువాత వారు లేని వారుగా కలవారుగా రెండు విభిన్న శ(తుత్వ భావన గల సముదాయాలుగా రూపొందుతారని మార్క్స్ విశ్లేషించాడు. ఇప్పటివరకు ఉన్న సామాజిక చరి(త అంతా కూడా వర్గపోరాట చరి(తగా మార్క్స్ అభివర్ణించాడు. స్వేచ్ఛగా ఉన్న వ్యక్తి (Free Man) బానిస మరో విధంగా చెప్పాలంటే అణగ(ద్రొక్కేవాడు, అణగ(ద్రొక్కబడే వాడు ఒకరికొకరు నిరంతరము పరస్పర వైరుధ్య పరిస్థితుల్లో ఉండేవారు. వారు ఒకరిపై ఒకరు విరామం లేని బాహాట యుద్ధం సాగించేవారు. ఇది (క్రొత్త సమాజ స్థాపనకు గానీ, లేక యుద్ధం చేసుకొనే వారు ఇద్దరూ కూడా నశించటంలో కానీ ముగిసేది.

కాల గమనాన్ని బట్టి చూస్తే ఈ పైన చెప్పిన చారి(త్రక పద్ధతికి ఒకే ఫలితము ఉంటుంది. అదేమిటంటే పెట్టుబడిదారులను, కార్మికులు బయటకు నెట్టిన, ఓడించిన తరువాత కొద్దికాలము కార్మికులు (Dictators) వున్నా తర్వాత వర్గ రహిత సమాజ స్థాపన జరుగుతుంది. మార్క్సిజమ్‌లో ఇది భౌతికవాద తార్కిక సిద్ధాంతముగా (ప్రసిద్ధి చెందింది. తార్కిక సిద్ధాంతము అంటే పరస్పర వైరుధ్యము గల రెండింటి మధ్య పోరాటము, భౌతిక (Materalism) అంటే ఆర్థిక చర్య మిగతా వాటన్నిటికీ మూలమనే పరికల్పనను వక్కాణించటాన్ని తెలియజేస్తుంది.

మార్క్స్ పై విధంగా నిర్మితి, వాస్తవిక పరిస్థితుల్నిగురించి, వాటిలో రాబోయే మార్పు గురించి ఒకేసారి మాట్లాడుతాడు. సామాజిక, రా(ష్ట మరియు ఉత్పత్తి శక్తులు, వీటన్నిటి ఉద్భవ (Evolution)పద్ధతుల్ని విశ్లేషించి మార్క్స్ ఆర్థిక సామాజిక విభేదీకరణను స్పష్టం చేశాడు. రెంటి మధ్య (ప్రాతికూల్యం, వైరుధ్యం అనేవి వాటి మధ్య తారతమ్యం గుర్తించటానికి మార్పుకు కారణాలు. ఇవి సామాజిక స్తరీకరణలో తప్పని సరియైన సంఘటనలు

**8.4.2 వెబర్ ఉపగమము:** మార్క్స్ సిద్ధాంతము అసమర్ధనీయమనీ అనేక కారణ సిద్ధాంతాన్ని ఏక కారణ సిద్ధాంతానికి మదించాడని అసంబద్ధ ఏకకారణ దృగ్గోచర దృశ్యంగా చి(త్రీకరించాడని వెబర్ విమర్శించాడు. సిద్ధాంత పరమైన తేడాలు, పద్ధతి పరమైన తేడాలు ఉన్నప్పటికీ, మార్క్స్ వెబర్ ఇరువురు కూడా సామాజిక నిర్మితిలోని భాగాల పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవటమే ఇద్దరి ఆసక్తి, ధ్యేయము. సహేతుకంగా రూఢీ చేయటం, వ్యక్తి గతంగా కాకుండా పద్ధతిని అధ్యయనం చేయటం దైనందిన కార్య(క్రమంగా చేయటం అనేక సూ(త్రాలు వ్యక్తి అతని చర్య అనేది వెబర్ యొక్క వ్యాఖ్యాన సమాజ శా(స్త్రం యొక్క కేం(ద్ర బిందువు అందుచేత వెబర్ సామాజిక స్తరీకరణ సిద్ధాంతం యొక్క పద్ధతి అతని యొక్క ఆత్మా(శయ పద్ధతిగా విమర్శించబడినది.

వెబర్ (ప్రకారము, ఆర్థిక కారణాలే కాకుండా సామాజిక స్తరీకరణ విశ్లేషణకు సామాజిక, రాజకీయ కారణాలు కూడా (ప్రధానమైనవి. సమాజంలో స్తరీకరణ అనేది శక్తి యొక్క అసమానపు పంపిణీకి (ప్రత్యక్ష సాక్ష్యమని అతడి అభి(ప్రాయము. విపణి స్థలాల్లోనూ, రాజకీయాల్లోనూ, సముదాయాల్లోనూ తరగతి కానీ, దాని (ప్రతిరూపాలు కానీ పనిచేస్తూ ఉంటాయని వెబర్ అభి(ప్రాయపడ్డాడు. సామాజిక నిర్మితికి వర్గము అనేది మూలస్తంభము. పెట్టుబడిదారీ వ్యవస్థ పారి(శ్రామిక సమాజము వెబర్ విశ్లేషణ యొక్క కేం(ద్ర బిందువు. దీనితోపాటు 'శక్తి' (Power) వెబర్ సామాజిక స్తరీకరణ యొక్క మూలాంశము. వ్యవస్థీకృతము చేయబడ్డ శక్తిని దృష్టిలో పెట్టుకుని వెబర్ తన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. విశ్లేషణ కోసం దీనిని మూడు రకాలైన చర్యలుగా విభజించవచ్చును. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగముగా విభజించవచ్చును. వాటిలో వర్గ, హెూదా, పార్టీ (Party)లను బట్టి దానిని భిన్నంగా గుర్తించటం జరిగింది. వెబర్ ఒక్కొక్క రంగంలోని స్తిరీకరణను వివరించటం కోసం శక్తి లక్షణాలను విశ్లేషించాడు.

సమాన ఆర్థిక హెూదా గల వ్యక్తుల సముదాయం వర్గమని మార్క్స్ చెప్పిన నిర్వచనాన్ని అంగీకరిస్తూ దానికి అంతస్థు, పార్టీ అనే (ప్రమాణాన్ని కూడా కలిపేడు. వర్గము, హెూదా, శక్తి అనే మూడు చాలా దగ్గరగా ముడిపడి ఉన్నాయని వెబర్ భావన. ఇందులో ఏ ఒక్క (ప్రమాణం ఉన్నా మిగతా రెండూ ఉన్నట్లే. అయితే, వాటి పరస్పర సంబంధము ఎల్లప్పుడూ అంత ఖచ్చితమైంది కాదని వెబర్ పేర్కొన్నాడు.

వర్గములు, అంతస్థు, సమూహాలు మరియు పార్టీలు (Parties) సముదాయంలోని శక్తి పంపిణీలో భాగాలు.

ఆర్థిక పరంగా నిర్ణయించబడిన శక్తి వర్గ పద్ధతి ద్వారా స్థిరీకరించబడినది. అయితే, ఇది శక్తితో సమానం కాదు. ఆర్థిక క్రమం, ఆర్థిక వస్తువులు ఏవిధంగా పంచబడి వినియోగించబడేదో తెలిపేది మాత్రమే.

పోలిన ఆర్థిక ఆసక్తులు, పోలిన శక్తి కలవారంతా ఒక తరగతికి లేదా తరగతి సన్నివేశానికి సంబంధించిన వారే. వెబర్ తరగతి అనేది సంపూర్ణంగా ఆర్థిక వర్గమేనని ఇది బజారు (Market) పరిస్థితి ఫలితమేనని పేర్కొన్నాడు.

సామాజిక రాజ్యంలో శక్తిని అంతస్తు నిర్దేశిస్తుంది. సమాజంలో ఒకే గౌరవము, అంతస్థు మధ్య ఉండే ఒకే జీవనశైలిలో ఉండే వారంతా ఒకే అంతస్తు సమూహానికి లేక సమూహపు సన్నివేశానికి చెందిన వారవుతారు. ఒకని 'శక్తి' సామాజిక రంగము (Sphere)లో ఈ విధంగా వివరించటం మూలాన మనిషి మిగతా వారి నుండి అందుకొనే గౌరవం మీద ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి సాంఘీక శక్తి మిగతా వారి నుంచి అందుకుంటాడు. శక్తి అనేది మనిషికి సంబంధించని (Impersonal) ఆర్థిక స్థాయి, గౌరవం అనేది మనిషి యొక్క వ్యక్తిగతమైన పర్యాంకనం మీద ఆధారపడి ఉంటుంది. ఉన్నవారు, లేని వారు ఇరువురూ ఒకే అంతస్థు, సముదాయమునకు చెందవచ్చును. అంతస్థులో సమానంగా ఉన్న వారు సామాజికంగా ఒకరికొకరు అందుబాటులో ఉంటారు. వారి మధ్య స్వేచ్ఛ సామాజిక ప్రతిచర్య ఉంటుంది. కానీ వారికంటే తక్కువ అంతస్థులో వారితో ప్రతిచర్య పరిమితం చేసుకుంటారు. ఒక మనిషి లేక కొంతమంది మనుషులు ప్రక్రియ (Communal Action)లో మిగతా వారి ప్రతిఘటన ఉన్నా కూడా తమ Will ను మిగతా వారి మీద రుద్దే అవకాశం ఉన్నవారు శక్తివంతులుగా వెబర్ వర్ణించాడు. అతని అభిప్రాయం ప్రకారం కొంతమంది ఆసక్తి వారి సముదాయం (Constellation) నుంచి లాంఛనప్రాయమైన స్వేచ్ఛా విపనిలో వక్తి ఉద్భవిస్తుంది. ఆవిధంగా స్థాపించబడి నిర్దేశించిన అధికార స్థానము నుంచి వచ్చిన శక్తి మిగతా వారిని శాసించే హక్కు లోబడి ఉండే బాధ్య నిర్ణయిస్తుంది. స్తరీకరణలో శక్తి అంశము, వర్గము, గౌరవము అనే వాటిలో విడదీయలేనంతగా ముడిపడి ఉంది. వాస్తవానికి ఒక రంగంలో శక్తిని మిగతా రంగాలలో దానికి సమానమైన శక్తిగా వినియోగించుకొనే అభిప్రాయం (Tendency) ప్రజలలో ఉంది. సంపద ఉన్నా మనుషులు రాజకీయ శక్తి, అంతస్తు రెండింటినీ కోరుకుంటారు. హెచ్చు అంతస్థు పదవిలో ఉన్న వారు రాజకీయ నాయకులు కూడా అంతస్థును, ఆర్థిక శక్తిని సంపాదించడంలో ఆసక్తి కలిగిఉన్నారు. పాలనా యంత్రాంగంలో ప్రకార్య నిర్మితులలోనూ అధికారాన్ని ప్రకార్య పద్ధతులపై విభజించవలసిన అవసరముపై వెబర్ అనేక కారణాలు విశదీకరించారు.

**8.4.3 నిర్మితి-ప్రకార్య ఉపగమము (Structural Functional Approach):** పార్సన్స్ (parsons), డేవిస్ (Davis) స్తరీకరణను నిర్మితి ప్రకార్యవాద దృక్కోణం నుంచి శ్రేష్టమైన రచన చేశారు. సామాజిక స్తరీకరణ అంటే ఒక సామాజిక వ్యవస్థలో ఉన్న మనుషులను విభిన్న తరగతులుగా ఒకరితో మరొకరిని పోల్చినప్పుడు ఉన్నత స్థాయికి, క్రిందిస్థాయికి చెందిన వారిగా సామాజికంగా ముఖ్యమైన అంశాలలో ఏర్పరచుట అని పార్సన్స్ అభిప్రాయపడినాడు. స్తరీకరణలో అంచనా వేసే పద్ధతిలో సామాజిక వ్యవస్థలోని వ్యక్తులను అక్కడ సాధారనంగా ఉండే విలువల పద్ధతిని దృష్టిలో పెట్టుకుని తరగతులుగా విభజించడం అని కూడా పార్సన్స్ అభిప్రాయపడినాడు. సామాజిక అసమానత వ్యవస్థ అన్నది ఆ సమాజములోని విలువల వ్యవస్థ నుంచే ఉద్భవిస్తుంది. మనుషుల లక్షణాలను, పనితీరు, సమాజం నిర్ణయించిన ప్రమాణాలు కలిగుండటాన్ని బట్టి ఫలితాలు పంచబడతాయి. ఈ అంశాలలో మనుషులు మారుతూ ఉంటారు. ప్రతి సమాజము తనకున్న పనులను, దానికి ఉన్న విలువలను బట్టి స్తరాలుగా విభజిస్తుంది. ఇందులో కొన్ని మిగతా వాటి కంటే ముఖ్యమైనవిగా ఉంటాయి. అందుచేత సామాజిక అసమానతలు ఏ సమాజములోనైనా తప్పనిసరి. సామాజిక అసమానత అన్నది విలువల ఏకాభిప్రాయం నుండి ఉద్భవించింది. ఇది ప్రకార్య ప్రత్యేకతల నుంచి (Specialization) వచ్చింది. అందుచేత క్లుప్తంగా చెప్పాలంటే సామాజిక అసమానత అందులో భాగాలన్నింటినీ కలుపుకొని సమగ్రంగా తయారు చేస్తుంది అని పార్సన్స్ అభిప్రాయపడినాడు.

డేవిడ్ (Davis) సామాజిక అసమానతలను సమాజము అనుకోకుండా రూపొందించింది అని అభిప్రాయపడినాడు. సమాజంలోని ముఖ్యమైన పదవులన్నీ ప్రయత్నపూర్వకంగా, తెలివిగా మంచి అర్హతలు గల వ్యక్తుల చేత నిర్మించబడతాయి. ఆదాయంలో కానీ, అంతస్థులో కానీ, శక్తి దృష్ట్యా కానీ ఎక్కువగా ప్రతిఫలం ఇచ్చేవి. అవి ఈ క్రింది లక్షణాలు కల్గిఉన్నాయి.

ఎ) సమాజానికి చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి.

బి) ప్రత్యేకమైన హెచ్చుస్థాయి శిక్షణ, ప్రతిభ కలిగిఉంటాయి.

ప్రకార్యవాదం యొక్క సారాంశం ఏమిటంటే సామాజిక అసమానతలను బట్టి సామాజిక అసమానతలు ఉద్భవిస్తాయి. కానీ, వ్యక్తుల యొక్క అవసరాలను, రోల్కులను బట్టి కాదు. డేవిడ్, మూర్ ఇరువురు కూడా సమాజంలో భిన్న పదవుల (Positions) కంటే ప్రతిఫలాల నుంచి సామాజిక అసమానతలు ఉద్భవించాయని అభిప్రాయపడ్డారు. వారిరువురు కూడా సామాజిక అసమానతలు ప్రకార్య పరంగా అవసరమని, సార్వత్రికంగా శాశ్వతంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

## 8.5 అసమానత దాని శాశ్వతత్వము:

సామాజిక అసమానతలు నిర్మించటం అవి శాశ్తంగా ఉండేటట్లు చూడటం ఒక నిరంతర ప్రక్రియ. సామాజిక అసమానత అనేది ఒక నిర్మిత పరమైన అనేక రకాలుగా , అనేక పరిస్థితులలో పరిశీలించటానికి వీలుగా ఉన్న చారిత్రక వాస్తవము. అందుచేత సామాజిక అసమానత అనేది నిర్మితికి, తాత్వికతకు మరియు ప్రజల ప్రవర్తనకు సంబంధించినది. దీని పర్యవసానం ప్రజలు ఏర్పాటు చేసుకున్న విధానాలు, వారి జీవనశైలి, వారు నిర్మించుకున్న జీవనోపాధి అనే వాటి దృష్ట్యా చూడవచ్చు. కులము, వర్గ సమూహాన్ని, కుటుంబాన్ని చూసినప్పుడు సాంప్రదాయక అసమానతలు కొన్నింటితో పాటు క్రొత్త అసమానతలు కొన్ని ఉద్భవించాయి. ఇవి కొంత వరకు చారిత్రక, సాంస్కృతిక, వారసత్వము ద్వారా, కొంత వరకు ప్రస్తుతపు పంపకపు న్యాయం (Distributive Justice) ద్వారా చోటుచేసుకున్నాయి. కుల సమూహాల్లో కూడా వర్గ అసమానతలు పెరిగినాయి.

భారతీయ గ్రామీణ సమాజాలలో భూమిని సొంతంగా కలిగి ఉండటం, దానిని అదుపులో (Control) పెట్టడం, దానిని వినియోగించే పద్ధతిలో కూడా కులంతో ముడివేసే పరస్పర సంబంధాలను చూడటం జరుగుతుంది. అంద్రూ బీటెల్ (Andre Beitelle) అనే వ్యక్తి భారతీయ గ్రామీణ సమాజాలలో మూడు రకాలైన అసమానతలను గుర్తించాడు. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. భూమి స్వంతదారుకు, కౌలుదారుకు మధ్య

2. భూమి స్వంతదారు, కూలీ వానికి మధ్య

3. పెద్ద, మధ్యతరహా, చిన్న భూమి స్వంతదారుల మధ్య

లాయిడ్ ఎ.ఫాలర్స్ (L.A.Fallers) సామాజిక అసమానత ప్రమాణ పరంగాను, నిర్మితి పరంగాను, రెండు విధాలుగా ఉంటుందని గమనించాడు. ప్రమాణపరమైంది అంచనా (Evaluation) వేయుటకు సంబంధించి, నిర్మిత పరమైనది. వస్తు వనరులు, వక్తి పంపిణీకి సంబంధించినవిగాను ఉంటాయి. పద్ధతి పరస్పర సంబంధాలు, కులము, బంధుత్వము, కుటుంబము, వివాహము, ఉత్పత్తి, శక్తులు, ఉత్పత్తి సంబంధాలు ఏర్పడటానికి ఉత్పత్తి పద్ధతి ఆధారమని లాయిడ్ ఎ.ఫాలర్స్ అభిప్రాయపడినాడు. ఈ సంబంధాలు సమాజంలోని అసమానతలను శాశ్వతం చేస్తాయి.

జమిందారీని రూపుమాపటం, భూమి కలిగి ఉండటంపై ఆంక్షలు, పరిమితులు విధించడం, దేశమంతటా ప్రభుత్వాధికారం కేంద్రీకృతమవటం, క్రొత్త చట్టాలు, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి పొందటం, న్యా నిర్మితి విధానం మదలైనవన్నీ కూడా భారతదేశంలోని కుల పద్ధతి యొక్క నిర్మితి, ప్రమాణిక పద్ధతి (Normanative Pattern)గా మార్చేశాయి. ఈ కారణాల వల్ల కులం ఒక సామాజిక వర్గశ్రేణి (hierarchy)గా బలహీనమైనది. కానీ, సామాజిక, ఆర్థిక గతిశీలతకు మరియు రాజకీయ లబ్ధికి మూలంగా బలపడింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన సార్వజనీన వయోజన ఓటు హక్కు, ఎలక్షన్స్, వలస, విద్య మొదలైనవి కులాన్ని మతపరమైన కర్మకాండకు కాక, వేరే వాటికి వినియోగించటానికి కాని భిన్నకుల సమూహాల మధ్య ఇప్పటికీ గమనించదగ్గ సాంస్కృతిక సాంఘీక భేదాలున్నాయి. ముఖ్యంగా వారి జీవన పద్ధతులు మతపరమైన కర్మకాండలు చేయటం మొదలైనవి. ఈ విధంగా భారతీయ సమాజంలో సామాజిక అసమానతలు శాశ్వతంగా ఉండేటట్లు చేయబడుతున్నవి.

## 8.6 సారాంశము:

పైన చర్చించిన విధంగా సామాజిక స్తకరీకరణతో సమాజశాస్త్రము మానవుని యొక్క ప్రకృతి, సామాజిక సమానత్వము, అసమానత్వము, సామాజిక న్యాయము, శక్తి మొదలైన విషయాలతో సంబంధించి వుంది. స్థూలభావంలో ఈ అంశాలన్నీ సామాజిక స్తరీకరణ సిద్ధాంతానికి, నిర్మితికి మరియు పద్ధతికి సంబంధించి ఉన్నాయి. దృక్కోణాత్మక (Dimensionalistic) ఉపగమము అంటే అంతస్థు, సంపద మరియు శక్తి అనేవి సామాజిక స్తరీకరణ గురించి అవగాహన కోసం వివరించి చెప్తుంది.

## 8.7 నమూనా ప్రశ్నలు:

1. సాంఘీక అసమానతను నిర్వచింపుము.
2. సాంఘీక అసమానతల ఉపగమములను చర్చింపుము.
3. భారతీయ సమాజములో సాంఘీక అసమానతల శాశ్వతత్వమును చర్చింపుము.

## 8.7 చదవదగిన గ్రంథములు:


1. రాజేంద్రపాండే : సోషల్ ఇనీక్వాలిటీ

(Rajendra Pande Social Inequality)

2. కే.ఎల్.శర్మ : సోషల్ స్ట్రాటిఫికేషన్ ఇన్ ఇండియా

(K.L.Sharma : Social Stratification in India)

3. యోగీంద్ర సింగ్ : సోషల్ స్ట్రాటిఫికేషన్ అండ్ ఛేంజ్ ఇన్ ఇండియా

(Yogendra Singh : Social Stratification and change in India)

4. రామ్ అహుజా : సొసైటీ ఇన్ ఇండియా

(Ram Ahuja : Society in India)

## పాఠం-9

# వివాహము

**విషయక్రమం:**


**9.0 ఉద్దేశ్యము**

**9.1 పరిచయము**

**9.2 వరణ క్షేత్రం**

**9.3 తల్లిదండ్రులు కుదిర్చిన వివాహం**

**9.4 స్వయముగా ఏర్పాటు చేసుకున్న వివాహము**

**9.5 బహు భార్యత్వము**

**9.6 ఏక వివాహం**


## 9.0 ఉద్దేశ్యము:

వివాహములోని రకములు, వివాహ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు వివరించుట.

## 9.1 పరిచయం:

జంతు సమాజంలో లేని, మానవ సమాజంలో మాత్రమే ఉన్న ఏకైక వ్యవస్థే వివాహ వ్యవస్థ. కుటుంబం లాంటి వ్యవస్థలు జంతు సమాజంలో కూడా ఉంటాయి. కానీ, వివాహ వ్యవస్థ మానవ సమాజానికే పరిమితమై ఉంటుంది. "చట్టబద్ధంగానో లేక ఆచారబద్ధంగానో లేక సాంఘీక ఆచారబద్ధంగానో లైంగిక సంబంధాన్ని కల్గి ఉండడానికి, సంసార జీవితాన్ని కొనసాగించడానికి అనుమతించబడ్డ స్త్రీ పురుషులు సంయోగాన్ని వివాహం అంటారు. మానవజాతి శైశవ దశలో "స్వేచ్ఛా రతి'' సమాజంలో ఉండేదని కొందరి భావన. అంటే జంతువుల వలె స్త్రీ పురుషులు తమ కామవాంఛను తీర్చుకునేవారు. వారిలో ఎవరు ఎవరికి భర్త కారు. ఎవరూ ఎవరికి భార్య కారు. అటువంటి సందర్భాలలో పరస్పరానురాగాలు ప్రేమ అనేవి ఉండే అవకాశం లేదు. కొంతకాలం గడిచిన తరువాత సామూహిక వివాహాలు వచ్చాయి. అంటే ఒక సమాజంలో కొందరు పురుషులు కలిసి కొందరు స్త్రీలను వివాహమాడతారు. ఆ పురుషులంతా ఆ స్త్రీలందరికీ భర్తలు. ఈ సమూహంలోని ఏ పురుషుడైనా, ఏ స్త్రీతోనైనా లైంగిక వాంఛలను సఫలీకృతం చేసుకోవచ్చు. దాని తర్వాత బవాస భర్తృత్వం, బవాస భార్యత్వం, ఏకత్వ వివాహాలు ఉద్భవించాయని భావన. ఏది ఏమైనప్పటికీ వివాహ వ్యవస్థకు సమాజంలో ఒక ప్రత్యేకత ఉందనే చెప్పవచ్చు.

వివాహం కుటుంబ వ్యవస్థకు పునాది. వివాహం వలననే కుటుంబాలు ఏర్పడతాయి. యదార్థానికి వివాహం అంటే ఇద్దరు స్త్రీ పురుషుల కలయికా మాత్రమే కాదు ఆ స్త్రీ పురుషులిద్దరికీ సంబంధించిన రెండు కుటుంబాల కలయిక అని చెప్పాలి. ఈ వివాహం సంసార స్థాపనకు మార్గాన్ని ఏర్పరుస్తున్నది. వివాహం మానవునిలోని లైంగిక వాంఛను పశుతుల్యంగా చేయక, సాంఘీక పరంగాను, మానుషంగాను చేస్తుంది. వివాహితులు తమ భాగస్వాములతో కాముక భారాన్ని మాత్రమే ప్రదర్శించకుండా, ప్రేమానురాగాలను సృష్టించుకుంటారు. ఈ వివాహ వ్యవస్థ స్త్రీ పురుషులను పరస్పరం త్యాగమూర్తులుగా చేయడానికి

పాటుపడుతుంది. మానవుని లైంగిక వాంఛను తీర్చడంతోపాటు, సంతానాన్ని కూడా కలిగిస్తుంది. తద్వారా జాత్యాభివృద్ధి గావించి, సమాజాన్ని అభివృద్ధి గావిస్తుంది.

వివాహ వ్యవస్థ విశ్వజననీయమైనప్పటికీ, వివాహ వ్యవస్థ అన్ని సమాజాలలో ఒకే విధంగా ఉండదు. ఇది అనేక పద్ధతులలో, రకాలలో ఉంటుంది. సామాజిక ప్రమాణాలు వివాహ వ్యవస్థను గురించి అనేక దృక్పథాలను వెల్లడించినవి. ఆ దృక్పథాల ఆధారంగా భారతీయ సమాజంలో వివిధ రకాలైన వివాహ పద్ధతులు ఆచరణలో ఉన్నవి.

1. వరణ క్షేత్రము: ఏ సమూహం నుండి సహచరులను ఎంపిక చేసుకోవాలి?

2. వరణ ఎంపిక: సహచరుల ఎంపికను ఎవరు నిర్ణయిస్తారు?

3. సహచరుల సంఖ్య ఎంపిక.

ఈ దృక్పథాలలోని అంశాల ఆధారంగా ఒక ప్రత్యేకమైన లేక ఒక రకమైన వివాహ పద్ధతి ఏర్పడుతుంది.

## 9.2 వరణ క్షేత్రము:

సామూహిక ప్రమాణాలు ఒక సమూహంలోని వ్యక్తులు అదే సమూహానికి చెందిన వ్యక్తులను వివాహమాడవలెనని నిర్దేశించినాయి. ఎవరిని పెళ్లాడాలి? ఎవరిని పెళ్లాడరాదు? అనే విషయంలో ఈ ప్రపంచంలో దాదాపు అన్ని సమాజాలు నిర్దుష్టమైన నిబంధనలను ఏర్పాటు చేస్తాయి. ఈ నిబంధనల ప్రకారం కొందరు వివాహం చేసుకోవడానికి అర్హులు కాగా, మరికొందరు అనర్హులు. దీనితోపాటు కొందరిని పెళ్లాడడానికి ప్రత్యేకమైన హక్కులు కొందరు కలిగిఉంటారు. కొందరిని పెళ్లాడడానికి సమాజం ఆమోదించి సమ్మతినిస్తుంది. మరికొందరిని చేసుకోరాదని అసమ్మతులను తెల్పి అటువంటి వివాహాలను నిషేధిస్తుంది. ఇటువంటి వివాహ సూత్రాలు మన భారతీయ సమాజంలో ఉన్నంత జఠిలంగా మరే సమాజంలోనూ ఉండవు. ఏ వర్గానికి చెందిన వారిని చేసుకోవాలి. ఏ వర్గం వారిని చేసుకోకూడదు? అనే విషయాన్ని ధర్మశాస్త్రకారులు, గృహ్య సూత్రకారులు రూపొందించి తమ తమ గ్రంథాలలో పొందుపరిచి వివాహ విధి, నిషేధాలకు పవిత్రతను, అపవిత్రతను అంటగట్టారు. మన సమాజం అనేక కులాలు గాను, అనేక వంశాలుగాను, అనేక గోత్రాలు అనేక ఉపశాఖలు గాను విభజింపబడింది. ఈ వర్గీకరణలో కులాలు, జాతులు, గోత్రాలు అనేకం వస్తాయి. ఏ వర్గం వారు ఎవరిని వివాహం చేసుకోవాలి, ఎవరిని చేసుకోకూడదు అనే అనేక సిద్ధాంతాల్ని హిందూ శాస్త్రకారులు నిర్మించి, నియమించారు. వీరితోబాటు శారీరక లక్షణాలు వ్యక్తుల పేర్లు కూడా ఒక వ్యక్తి వివాహాన్ని చేసుకోవడానికి అర్హతల్నీ, అనర్హతల్నీ తెలియజేస్తూ ఉంటాయి. అవి చిన్న సమాజాల నుండి, ఆదిమ సమాజాల వరకు పెళ్లిళ్లకు సంబంధించిన నియమాలుంటాయి. అవి సమాజాల పవిత్రతను పరీక్షిస్తుంటాయి. సమాజం నాగరిక దశకు ప్రయత్నిస్తున్న దశలో కొద్దిపాటి మార్పుతో ఈ నిబంధనలు శాస్త్రకారులు తమ శాస్త్రాలలో పొందుపరిచారు. వీటితోపాటు ఈ శాస్త్రకారులే మరికొన్ని నియమాలు సృష్టించి హిందూ వివాహ వ్యవస్థను జఠిలంగాను, క్లిష్టతరంగాను చేశారు.

ఒక సమూహంలోని వ్యక్తులు అదే సమూహానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే దానిని 'అంతర్వివాహము' అనియు, తమ సమూహంలోని వ్యక్తిని కాకుండా వేరొక వారిని చేసుకుంటే బహిర్వివాహము అనియు అంటారు. సవర్ణ వివాహం అంతర్వివాహానికి అన్యగోత్ర వివాహం బహిర్వివాహానికి చక్కని ఉదాహరణలు. హిందూ సమాజంలో కులాలు, గోత్రాలు, రక్త బంధువుల (సపిండుల) మధ్య జరిగే వివాహాల గురించి అనేక నియమ, నిబంధనలు చేయబడ్డాయి.

హిందూ సమాజంలో వధూవరుల నిశ్చయానికి సంబంధించి కొన్ని పరిమితులున్నాయి. వీటిలో ముఖ్యమైనవి నాలుగు. అవి:

1. సవర్ణ వివాహము లేక అంతర్వివాహము
2. భిన్నగోత్ర వివాహము లేక బహిర్వివాహము
3. అనులోమ వివాహము
4. ప్రతిలోమ లేక విలోమ వివాహము

**1. అంతర్వివాహము లేక సవర్ణ వివాహము** (Endogamy):

వివాహ రీత్యా కులమనేది అంతర్వివాహ సమూహానికి చెందినది. కులాలే కాక ఉపకులాలు కూడా అంతర్వివాహ సమూహాలకు చెందినవి. ఏ కులంలో వారు ఆ కులంలో వారినే వివాహమాడాలి. వర్ణాంతర వివాహాలను నిషేధించే వారు సనాతన హిందూ సమాజంలో సవర్ణ వివాహాలకే అనుమతి లభించేది. భారతీయ సమాజం అనేక వందలలో లేక వేల మతాలుగా విభజింపబడింది. మన సమాజంలో ఏ కులం వారు ఆ కులం వారినే వివాహమాడాలని ఆచారమున్నది. అందుకని కులాలను 'అంతర్వివాహ సమూహాలు' అని అంటారు. ప్రతి కులానికీ అనేక ఉపకులాలుంటాయి. ఏ 'ఉపకులం' (Sub Caste) ఆ ఉపకులానికి చెందిన వారినే వివాహమాడాలి.

**2. అన్యగోత్ర వివాహము లేక బహిర్వివాహము** (Exogamy):

కుల వ్యవస్థతోపాటు గోత్ర వ్యవస్థ కూడా హిందూ సమాజంలో అనాదిగా వస్తున్నది. కుల వ్యవస్థ అంతర్వివాహ సమూహానికి చెందినదయితే గోత్ర వ్యవస్థ బహిర్వివాహ సమూహానికి చెందినది. అంటే ఏ కులం ఆ కులంలోనే వివాహ సంబంధాలను ఏర్పరచుకోవలెను. కానీ, సగోత్రీయుల మధ్య వివాహ సంబంధాలు ఏర్పరచుకోగూడదు. అన్యగోత్రీయులనే వివాహమాడవలెను. ఈ గోత్ర నియమం ఒక్క హిందూ సమాజంలోనే కాక చాలా ఆదిమ తెగలలో కూడా కనబడుతుంది. వారిలో కూడా ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహ సంబంధాలు ఉండవు. భిన్నగోత్రం వారినే వివాహం చేసుకుంటారు. ఈనాటికీ హిందువులు ఈ అన్యగోత్ర వివాహ నియమాన్ని ఎక్కువగా పాటిస్తున్నారు. ప్రేమ వివాహాలలోను, వర్ణాంతర వివాహాలలోను తప్ప తక్కిన అన్ని సమయాలలోను గోత్ర ప్రసక్తి తప్పక ఉంటుంది. వధూవరులు వేరు వేరు గోత్రాలకు చెందినప్పుడే వివాహ నిశ్చయం జరుగుతుంది. గృహ్యసూత్రాలలో సగోత్ర వివాహాలను నిషేధించినట్లు కనబడదు. ఆపస్తంభుడు, కౌశికుడు మొదలైన వారు గోత్రాన్ని ప్రస్తావించలేదు. కానీ, ధర్మ సూత్రాలలో మాత్రం సగోత్ర వివాహాల నిషేధం ఉన్నది. వశిష్టుడు సగోత్ర వివాహాలను నిషేధించినాడు. తండ్రి వైపు ఏడు తరాలను తల్లివైపు ఐదు తరాలకు చెందిన వారిని వివాహం చేసుకోరాదని చప్పేవాడు. సగోత్ర వివాహాలు నిషేధాలని స్మృతులు నొక్కి చెప్పాయి. సగోత్ర కన్యను వివాహమాడినప్పుడు ఆ కన్యను త్యజించి చాంద్రాయణ వ్రతం చేయవలెనని శాసించినారు.

సగోత్ర, సప్రవర వివాహాలు నిషిద్ధాలు. అంటే వ్యక్తి తన గోత్రానికి, తన ప్రవరకూ చెందిన వారిని వివాహమాడరాదు. అన్యగోత్రానికి, అన్య ప్రవరకూ చెందిన వనితను వివాహమాడాలి. గోత్రము అనే పదం తొలుత ఋగ్వేదంలో గోచరించిందట. 'గోత్రం' అంటే 'గోశాల' అని అర్థము. 'గో' అంటే గోవు అని అర్థం. ఆర్యుల ఆర్థిక వ్యవస్థ గోధనము. ఒక్కొక్క ఆర్యతెగకూ కొన్ని గోవులండేవి. ఆ గోవులన్నిటినీ ఒకే శాలలో ఉంచేవారు. అదే విధంగా వేర్వేరు ఆర్యతెగలకు వేర్వేరు గోశాలలుండేవి. బహుశః ఒక్కొక్క తెగను వారి వారి గోశాలల పేరుతోనే పిలిచేవారు. వివిధ ఆర్య తెగలూ తమలో తాము వివాహమాడడానికి బదులు అన్య తెగను వివాహమాడితే, ఆ అన్య తెగ వారు కూడా తమతో సంబంధాలను పెంచుకుంటారు. తద్వారా ఆయా తెగలు బలాన్ని పుంజుకుంటాయి. కాబట్టి ఏ గోవుల శాల వారు ఆ గోవుల శాల వారిని (ఏ గోత్రం వారు, ఆ గోత్రం వారిని) వివాహమాడనీక వేరొక గోశాల వారిని (అన్యగోత్రజ్ఞులను) వివాహమాడి ఉండవచ్చు. అందువల్లనే కాబోలు కొంత కాలానికి 'గోత్రం' అంటే 'కొంత మంది వ్యక్తుల సమూహం'గా చెప్పబడింది. కాలక్రమేణా ఈ గోత్రమనే పదం ఒక ఋషి వంశానికి చెందిన వ్యక్తుల సమూహంగా చెప్పబడింది.

బౌద్ధాయనుడను దక్షిణ భారత దేశానికి చెందిన హిందూ శాస్త్రకారుడు గోత్ర వ్యవస్థను హిందూ మతానికి జోడించి, సగోత్ర వివాహాలను మహాపాతకంగా శాసించాడు. విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ గౌతమ, అత్రి, వశిష్ట, కశ్యపలు,సప్త ఋషులనియు, అగస్త్యుడు ఎనిమిదవ వాడనియూ ఈ ఎనిమిది మంది ఋఉషుల సంతతే వివిధ గోత్రాలనియు, బౌద్ధాయన శ్రౌతసూత్రం చెప్పినట్లు తెలుస్తున్నది. ఈ బౌద్ధాయనమునకు పిదప లక్షలాది గోత్రాలుద్భవించాయని యూ ప్రవరలను మాత్రం 49 యేననియూ తెల్పినట్లు తెలుస్తున్నది. మహాభారతం అంగీరస, కశ్యప, వశిష్ట, భృగు అను నాలుగు గోత్రాలను సూచించినట్లు తెలుస్తున్నది. బౌద్ధాయనుడు భృగ, అంగీరసులను గోత్రాలలో చేర్చలేదు కాబట్టి బౌద్ధాయనుడు కూడా 'మూలగోత్రాల' (Original Gotras) సంఖ్యను ఖండితంగా చెప్పలేదనియూ, కౌణే పండితుడు భావించాడు. యదార్థానికి నేడడు మన భారతదేశంలో గోత్రాల

సంఖ్యను ఇదమిద్ధంగా చెప్పలేము. ఋషుల పేరు మీదగా కొందరు గోత్ర వ్యవస్థను ఈనాటికీ అనుసరిస్తున్నారు. మరికొందరు జంతువులూ, చెట్లూ, చేమలూ, ప్రదేశాలు, నదీనదాలు మొదలగు వాటిని కూడా తమ తమ గోత్ర నామాలుగా వివరిస్తున్నారు.

గోత్రాలు వివాహ విషయంలోనే అనేక విషయాలలో ప్రధాన పాత్ర వహిస్తూ ఉంటాయి. ఒక వ్యక్తి సంతానం లేకుండా మరణిస్తే ఆస్థిపాస్తులు సగోత్రీయులకు చెందుతాయని గౌతమ ధర్మ సూత్రములోనున్నట్లు తెలుస్తోంది. శ్రాద్ధాది కర్మలలో ఆహ్వానింపబడే పురోహితుడు సగోత్రజ్ఞుడు కారాదు. పితృదేవతలకు తర్పణమిచ్చేటప్పుడు వారి గోత్ర నామాన్ని చెప్పాలి. అనుదినం చేసే సంధ్యా వందనాలలో తన గోత్ర నామాలను పలుమార్లు చెప్పుకోవాలి. సగోత్రజ్ఞురాలిని వివాహ మాడకూడదు.

ప్రవర అంటే ప్రార్థన అని అర్థం. గోత్రం ఒక వంశస్థుల సమీపాన గల ఋషులను తెలియజేస్తే ప్రవర అంటే సుదూరంగా ఉన్న అదే వంశపు ఋషుల గురించి తెలియజేస్తుంది. ప్రవరను 'ఆర్షేయ' గౌతమ ధర్మ సూత్రాలు వశిష్ట ధర్మ సూత్రం, మానవ గృహ్యసూత్రం, శంఖ్య ధర్మసూత్రం మొదలగునవి ఒక వ్యక్తి తన ప్రవరకు సంబంధించిన స్త్రీని వివాహం చేసుకోవటం నిషేధించినట్లు తెలుస్తోంది. 'ప్రవర' సగోత్రులకు చెందిన యువతిని పెళ్లి చేసుకుంటే హిందూ న్యాయశాస్త్ర ప్రకారం అది పెళ్లి కానేరదని హిందూ శాస్త్రకారులనేకులు భావిస్తున్నారు. ఈ విషయంలో మనువు మౌనం వహించినట్లు తెలుస్తోంది. సర్వసాధారణంగా ప్రతీ గోత్రానికి మూడు ప్రవరలుంటాయి. కొన్నిటికి ఒకటి లేక రెండు లేక అయిదు ప్రవరలుంటాయి. తమ గోత్రాన్ని మర్చిపోయిన క్షత్రియులు తమ పురోహితుని గోత్రప్రవరలను స్వీకరించే వారని తెలుస్తోంది. ఒక వ్యక్తికి తన గోత్రం తెలియనప్పుడు తనకు వేదాన్ని నేర్పిన అఆచార్యుని గోత్రాన్ని గోత్రాన్ని, ప్రవరను స్వీకరించాలని ఆపస్తంభ ధర్మసూత్రంలో ఉంది. గురు పుత్రికను తప్ప తన గురువు గోత్ర ప్రవరలకు చెందిన ఏ యువతినైనా ఆ వ్యక్తి పెళ్లాడవచ్చు. "ఎవరైనా ఒక వ్యక్తి సగోత్రురాలితో సంభోగిస్తే అతడు చాంద్రాయనం చేయాలని, అనంతరం ఆ స్త్రీని బహిష్కరించక సోదరి లేక తల్లి వలె చూస్తూ ఆమె పోషణ భారం వహించాలనీ, ఒకవేళ ఆ స్త్రీకి శిశువు జన్మిస్తే ఈ పాపం ఆ శిశువుకి తగలదనీ ఆ శిశువు కశ్య గోత్రాన్ని స్వీకరించాలనీ బౌద్ధాయనుడు పేర్కొన్నాడు.

సపిండ నిషేధాలు: హిందూ ధర్మశాస్త్రం ప్రకారం దగ్గర బంధువు కన్నా అన్యుల్ని వివాహమాడుట మంచిది కాబట్టి వారు దగ్గర బంధువుల్ని వివాహాడటాన్ని నిషేధించారు. హిందూ శాస్త్రకారుల సిద్ధాంతం ప్రకారం "వధువు" సపిండురాలు కారాదు. అనగా ఆమె "అసపిండురాలు" కావలెను. పిండము (Pinda) అంటే ఏమిటో తెలుసుకోవాలి. "పిండము" అంటే "రేణువు" అని అర్థం. వివాహం ఆస్థిపాస్తుల సంక్రమణం, "అశేంచ" అను మూడు విషయాలలో సపిండ సంబంధాలు ప్రధాన పాత్రను వహిస్తాయని కాణే పండితుడు తెలియజేస్తున్నారు. "సపిండ" అనే పదానికి "మితాక్షర" రచయిత విజ్ఞానేశ్వరుడు, "దాయభాగ" రచయిత జీమూత వాహనుడు వేర్వేరు అర్థాలు చెబుతున్నారు. మితాక్షర ప్రకారం "పిండము" అంటూ శరీరంలోని "జీవరేణువు" సపిండము, అంటే ఒక జీవరేణువుకు సంబంధించినది. తండ్రిలో ఉండే జీవరేణువులే కుమారునిలోకూడా ఉంటాయి. కాబట్టి కుమారుడు తండ్రికి సపిండుడు. ఇదే రీతిగా రక్తబంధువులలో ఒకరి శరీరంలో మరొకరికి సంబంధించిన జీవరేణువులుంటాయి కాబట్టి వారందరూ సపిండులవు.

1&2 "Endogamy & Exogamy" అనే పదాన్ని మెక్‌లినన్ (Mclenan) అను పండితుడు తన "Primitive Marriage" అనే గ్రంథంలో తొలిసారిగా ఉపయోగించాడు.

3. శిశు జననం తరువాత పాటించే "పురుడు" ఎవరైనా చనిపోయినప్పుడు పాటించే "మయల" అనే వాటిని "అశౌచం" అంటారు.

4. Kane P.V "History of Dharma Sastras" వారు బెంగాలుకు సంబంధించిన 'దాయభాగ' సిద్ధాంతం ప్రకారం శ్రాద్ధాది కర్మలలో పితృదేవతల కల్పించే అన్నపు ముద్దను "పిండం" అని పిలుస్తారు. అట్లు పిండప్రదానం స్వీకరించి చనిపోయిన వ్యక్తి వారసులే సపిండుగు. దాయభాగ కర్త సపిండ సంబంధాన్ని అశౌచలకు, ఆస్థిపాస్తుల పంపకాల వరకే పరిమిత పరిచినట్లు పెళ్లిళ్ల విషయంలో నిర్దుష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయనట్లు తెలుస్తోంది. ప్రస్తుత చర్చలో "సపిండ" అనే విషయాన్ని మితాక్షర కర్త అనుసరించిన రీతిలోనే మనం కూడా అనుసరిద్దాం.

ప్రతి రక్త బంధువులోను ఒకే రకమయిన జీవరేణువులున్నప్పుడు మరి ఏ బంధువునూ ఎట్టి పరిస్థితిలోనూ వివాహం చేసుకొనరాదుగా అనే సందేహం ఉద్భవిస్తుంది. వివాహ విషయంలో తండ్రి వంశంలో ఏడు తరాలలోపు వారిని, తల్లి వంశంలో అయిదు తరాల లోపు వారిని పెళ్లి చేసుకోకూడదు. తండ్రి వంశంలో ఏడవ తరం తరువాత సపిండ సంబంధాలు సమసిపోతాయి. గౌతమ, వశిష్ట, విష్ణువరాహ, యజ్ఞవల్క్య మొదలగు హిందూ శాస్త్రకారులు తండ్రి తరపున ఏడు తరాల వరకూ, తల్లి తరపున అయిదు తరాలకు చెందిన కన్యను వివాహమాడుటను నిషేధించినట్లు తెలుస్తోంది.

**మేనరికాలు:**

ఉత్తర భారతదేశములో సపిండ వివాహాలు నిషిద్ధాలు. కానీ, మన ప్రాంతంలో అందులోనూ ముఖ్యంగా ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో మేనత్త, మేనమామ బిడ్డలు తల్లిదండ్రుల వంశాలలో రెండవ తరానికి మాత్రమే చెందిన సపిండులైనా కూడా వివాహం చేసుకోవడానికి అర్హులు. అంతేగాక, ఈ ప్రాంతాలలో మేనమామ కుమార్తెలను వివాహమాడుట ఒక హక్కు అని కూడా చెప్పవచ్చు. ఉత్తర భారతదేశంలో ఈ ఆచారం మహాభారతంలో మాత్రమే గోచరిస్తుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు తన మేమమామ కూతురయిన రుక్మిణిని, అర్జునుడు తన మేనమామ కూతురైన సుభద్రనూ వివాహమాడారు. శ్రీకృష్ణార్జునులు మాతృస్వామిక పరమైన యాదవ వంశీకులు కాబటిట ఈ వివాహం వారికి నిషిద్ధం కాదు. ఇక మన ప్రాంతంలో, ముఖ్యంగా అగ్ర వర్ణాలలో మేనరికాలు హెచ్చేనని చెప్పాలి. మేనరిక వివాహాలు ఒకవేళ జరగనప్పటికీ మేనత్త మేనమామ బిడ్డలు వేళాకోళాలాడుకోవడము, పరిహాసాలాడుకోవడం జరుగుతుంది. దీనికి హేతువేమిటో కొంతవరకు ఆలోచించాలి. పూర్వకాలం వివాహం జరగకపోయినా మేనత్త మేనమామ బిడ్డల నడుమ లైంగిక సంబంధాలకు సంబంధించిన యథేచ్ఛ ఉండి ఉండవచ్చు. ఈ లైంగిక యథేచ్ఛ కాలక్రమేణా రూపుమాసిపోయి దాని చిహ్నలైన వేళాకోళాలు, పరిహాసాలు మాత్రం మిగిలిపోయి ఉండవచ్చు. మేనత్త మేనమామ బిడ్డల మధ్య లైంగిక పరమైన స్వేచ్ఛ ఒకప్పుడు ఉండి ఉండవచ్చుననే భావాన్ని బలపరిచే మరొక ఆచారాన్ని కూడా పరిశీలిద్దాం. పెళ్లి కాలంలో ఒక రోజున పెండ్లి కుమార్తెను ఆమె మేనత్త బిడ్డలు ఎక్కడో దాచివేస్తారు. వారికి కొంత సొమ్ము ముట్టజెప్పి పెండ్లి కుమారుడు తన వధువును వారి నుండి విడిపించుకొంటాడు. ఈ సొమ్మునే "మరదలు మాడా" అంటారు. దీనిని ఈ విధంగా అర్థం చేసుకుందాం. ఒకప్పుడు మేనమామ బిడ్డలతో లైంగిక సంబంధం కల్గిఉన్న తన భార్యను వివాహమైన పిదప వారి బారి నుండి కొంత సొమ్మును చెల్లించి విడిపించుకుంటాడు. నేడు ఈ ఆచారం ఒక అభినయంగా తయారయింది. "మరదలు మాడా"ను ఎందుకు ఇస్తున్నారో తెలియకుండానే ఆచరిస్తున్నారు.

మేనరికాలు మన తెలుగుదేశంలో ఎన్నో వందల సంవత్సరాలకు పూర్వం నుండీ వస్తూనే ఉన్నాయి. 3వ శతాబ్దికి చెందిన ఇక్ష్వాకవంశ రాజకుమారుడైన సిరివీర పురుషదత్తుడు తన మేనత్త కుమార్తెలనందరినీ వివాహమాడినట్లు నాగార్జున కొండకు చెందిన ఒక శిలాశాసనం తెలియజేస్తుంది. (Ep. 1 Vol.20) కాని నేడు మన ప్రాంతంలో మేనమామ కూతుర్లను వివాహమాడుతున్నారు. కానీ, మేనత్త కూతుర్లను వివాహమాడరు. మేనత్త కూతుర్ని వివాహమాడుటకు "ఎదురు మేనరికం" అనే పేరుతో నిషేధిస్తారు. బహుశ మాతృస్వామిక కుటుంబాల నుండి పితృస్వామిక కుటుంబాలకు మార్పు చెందిన తరువాత తండ్రి యొక్క సోదరి కుమార్తెను వివాహం చేసుకోవడాన్ని నిషేధించి ఉండాలి. మన ప్రాంతంలో మేనరికాలతోపాటు అక్క కూతురును పెళ్లి చేసుకోవడం కూడా ఒక ఆచారంగా ఉన్నది. మన ఆంధ్ర ప్రాంతంలో ముఖ్యంగా ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయ నగరం జిల్లాలలో బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలగు కొన్ని వంశాలలో అక్క కూతురిని వివాహమాడే ఆచారాలు ఎక్కువగానే గోచరిస్తాయి. మేనరికాలు, అక్క కూతుర్లను వివాహమాడడాలు సపిండ వివాహాలే. ఈ విషయంలో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతానికి ఉత్తరాది వారికే సపిండ వివాహాల విషయంలో ఎంతో భేదమున్నదని చెప్పవచ్చు. ఈ రెండూ వివాహాలూ సపిండ వివాహాలయినప్పటికీ మిక్కిలి ఆమోదయోగ్యంగా ఉన్నాయి. కానీ, వైద్యశాస్త్ర రీత్యా మేనరికాల వలన అక్క కుమార్తెను వివాహమాడుట వలన పుట్టే సంతానం సత్పంతానం కానేరదు. కాబట్టి అసపిండ వివాహాలు జీవశాస్త్రానికి, వైద్య శాస్త్రానికి కూడా ఆమోదయోగ్యాలన్న విషయాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. అంటే జీవశాస్త్రరీత్యా సపిండ వివాహాల్ని చేసుకోవడం దోషం.

**విరుద్ధ సంబంధ నిషేధం:**

దగ్గర బంధువుల్ని సపిండుల్ని వివాహం చేసుకోవడాన్ని హిందూ శాస్త్రకారులు నిషేధించారు. కానీ, కొందరు బంధువులు మనకు రక్తబంధువులు కాకపోవచ్చు. అటువంటి వారు సపిండులు కాజాలరు. వారు సపిండులు కాకపోయినప్పటికీ బంధువులలో కొందరిని వివాహమాడుటను నిషేధించారు. అటువంటి బంధువులు మనకు రక్త బంధువులు కాకపోయినప్పటికీ ఒక వ్యక్తి ఆ బంధువుకూ నడుమ వివాహ సంబంధం ఉండదు. అంటే ఆ చుట్టరికం వివాహం చేసుకోవడానికి విరుద్ధంగా ఉంటుందన్నమాట. దీనిని విరుద్ధ సంబంధం అంటారు. విరుద్ధ సంబంధం అంటే ఏమిటో ఒక ఉదాహరణ తీసుకొని పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. ఒక వ్యక్తి పినతండ్రి లేక పెదతండ్రి భార్య యొక్క సోదరుని వివాహమాడరాదు. పినతండ్రి లేక పెదతండ్రి యొక్క భార్యలు రక్త బంధువులు కానప్పటికీ 'పినతల్లి' లేక 'పెదతల్లి' అవుతారు. అంటే వారు 'తల్లి వరుస'కు చెందిన బంధువులు. అట్టి వీరి చెల్లెండ్రు కూడా ఒక వ్యక్తికి 'తల్లి వరుస' గానే చెప్పబడుతారు. దానివలన వారు వివాహ విషయంలో విరుద్ధ సంబంధం కల్గియున్నారు. ఇంకొక ఉదాహరణ చెప్పుకొందాం. ఒక వ్యక్తి తన వదిన (అన్నగారి భార్య) గారి యొక్క సోదరి యొక్క కుమార్తెను విరుద్ధ సంబంధం ప్రకారం పెళ్లి చేసుకోకూడదు. యదార్థానికి వదిన గారు రక్త బంధువు కాకపోవచ్చు. అటువంటప్పుడు ఆమె సోదరి కూడా రక్తబంధువు కానేరదు. వదినగారి సంతానం తనకు కూడా సంతానం వంటిదే. తనను "పినతండ్రి" అని పిలుస్తారు. వదిన సోదరి యొక్క కుమార్తె కూడా తనకు కుమార్తె సంబంధంలోనే పిలుస్తుంది. తండ్రి కుమార్తెల వివాహం నిషిద్ధం కాబట్టి కుమార్తె వరుసలో ఎవరు ఉన్నా వారి నడుమ వివాహ సంబంధం విరుద్ధమే కాబట్టి అది నిషిద్ధం.

విరుద్ధ సంబంధం నిషేధాల్ని ప్రాచీన కాలం నుండి భారతీయులు అనుసరిస్తున్నార. మహాభారం నుండి కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. ఆదిపర్వంలో శుక్రాచార్యుని కుమార్తె దేవయాని కచుని ప్రేమించి అతనిని వివాహం చేసుకొమ్మని ప్రాధేయపడుతుంది. కచుడు శుక్రుని శిష్యుడు. శుక్రుని వద్ద మృతసంజీవనీ విద్యను అభ్యసిస్తున్నాడు. గురువు తండ్రితో సమానుడు కాబట్టి అతని పుత్రిక తనకు చెల్లెలవుతుంది. ఇది రక్త సంబంధం కాకపోయినప్పటికీ విరుద్ధ సంబంధం కాబట్టి కచుడు దేవయానిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. విరాట పర్వంలో కూడా ఒక వివాహం విఉఎరుద్ధ సంబంధం అయినందువల్ల నిషేధింపబడింది. బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడు విరాటరాజు కూతురైన ఉత్తరకు 'నాట్యాన్నీ', 'సంగీతాన్ని' నేర్పుతాడు. అజ్ఞాత వాసానంతరం బృహన్నల రూపాన్ని వదిలిన అర్జునుని తన కుమార్తె ఉత్తరను వివాహమాడవలెనని విరాట మహారాజు కోరతాడు. ఉత్తరకు తాను గురువునని, గురువు తండ్రితో సమానుడు కాబట్టి ఉత్తరను తాను వివాహమాడుట విరుద్ధమనీ అర్జునుడు ఈ వివాహాన్ని వ్యతిరేకించాడు. పెళ్లిళ్ల విషయంలో విరుద్ధ సంబంధాల్ని ఈనాటికీ కూడా మనదేశంలో అనేక మంది ఆచరిస్తారు.

**హైపర్‌గమి (Hypergamy), అనులోమ వివాహము:**

హైపర్‌గమిని సంస్కృతంలో అనులోమ వివాహమంటారు. వైదిక సాహిత్యంలో అనులోమ వివాహ ప్రసక్తి అనేకచోట్ల కనబడుతుంది. విష్ణు ధర్మ సూత్రం ఈ అనులోమ వివాహ పద్ధతిని ఆమోదించింది. పై కులముల పురుషుడు క్రింది కులాల కన్యలను వివాహమాడే పద్ధతిని అనులోమ వివాహమంటారు. అనులోమ వివాహ పద్ధతిని ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

బ్రాహ్మణ యువకుడు బ్రాహ్మణ కులములోని కన్యను మాత్రమే కాక, క్షత్రియ, వైశ్య, శూద్ర కులములోని కన్యలను కూడా వివాహమాడుట.

క్షత్రియ యువకుడు క్షత్రియ కులములోని కన్యను మాత్రమే కాక, వైశ్య, శూద్ర కులములోని కన్యలను కూడా వివాహమాడుట.

వైశ్య కుల యువకుడు వైశ్య కులములోని స్త్రీనే కాక, శూద్ర కుల స్త్రీని కూడా వివాహమాడుట.

శూద్ర కుల యువకుడు శూద్ర స్త్రీని మాత్రమే వివాహ మాడవచ్చును.

ఈ అనులోమ పద్ధతి ద్వారా కలిగిన సంతానం వృత్తిలో తండ్రిని, అంతస్థులో తల్లిని అనుసరించడం ఉన్నది.

**హైపోగమి (Hypogamy), ప్రతిలోమ వివాహము:**

హైపర్‌గమికి వ్యతిరేకము హైపోగమి. హైపోగమిని ప్రతిలోమ వివాహము అందురు. ప్రాచీన హిందూ సాహిత్యంలో ప్రతిలోమ వివాహాలు పద్ధతి గురించి పెక్కు చోట్ల ప్రస్తావన ఉన్నది. క్రింది కులాలకు చెందిన యువకులు పైకులాలకు చెందిన స్త్రీలను వివాహమాడే పద్ధతి ప్రతిలోమ వివాహ పద్ధతి. ఉదా: శూద్రకుల యువకుడు వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కుల యువతులలో ఎవరినైనా వివాహమాడుట ప్రతిలోమ వివాహ పద్ధతి. క్రింది కులాల పురుషులు పై కులాలకు చెందిన స్త్రీలను వివాహమాడుట అనగా, ప్రతిలోమ వివాహ పద్ధతిని శాస్త్రకారులు అంతగా ప్రోత్సహించలేదు. ప్రతిలోమ వివాహాల వలన కలిగిన సంతానము కులాలన్నింటి కంటే తక్కువ అంతస్థుకు చెందుతారని మనువు, గౌతముడు వివరించారు.

అనులోమ, ప్రతిలోమ వివాహాలు అన్ని కులాల వారికి వర్తించవు. సమాజంలో అందరికీ వర్తించవు. అవి కేవలం రాజర్షులకు, బ్రహ్మర్షులకు మాత్రమే పరిమితమైనవి. కాబట్టి అవి చలాలా కొద్ది కుటుంబాలకు మాత్రమే పరిమితమయినట్లు చెప్పవచ్చు. అవి ఉన్నత కులాల వారందరికీ క్రింది కులాల కన్యలను వివాహం చేసుకునే అనుమతి లేదు. కాబట్టి అనులోమ, ప్రతిలోమ వివాహాలు కొన్ని ప్రత్యేక పరిస్థితుల వలన కొందరికి మాత్రమే పరిమితమయినది.

## 9.3 తల్లి తండ్రులు కుదిర్చిన వివాహము:

వధూవరుల నిశ్చయములలో తల్లిదండ్రుల నిర్ణయమే పూర్వకాలం నుంచి అమలులో ఉన్న పద్ధతి. తల్లితండ్రులే సాధారణంగా వారి పిల్లలకు, వివాహాలను నిశ్చయిస్తారు. సామాజిక ప్రమాణాల ప్రకారం పిల్లల వివాహము చేయుట తల్లితండ్రుల బాధ్యత అనే అంశంపై వివాహ సందర్భంలో తల్లితండ్రుల పాత్రను, నిర్ణయాన్ని సమర్ధించడం జరుగుతుంది.

సామాజిక పరిస్థితులలో అనేక మార్పులు చేసుకున్నప్పటికీ, నేటికీ కూడా బిడ్డల వివాహాల తల్లితండ్రులే నిర్ణయిస్తున్నారు. 1959లో వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులను మార్గరేట్ కార్‌మాక్ (Margaret Cormack) అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో 92 శాతం కేసులలో వివాహాలు తల్లితండ్రులచే నిర్ణయింపబడతాయనీ, కేవలం 8 శాతం కేసులలో మాత్రమే స్వయం నిర్ణయక వివాహాలు జరుగుతాయని తేలింది.

జైపూర్‌లో రెండు తరాల మీద సమాజశాస్త్ర అధ్యయన శాస్త్రవేత్తలు వర నిర్ణయంపై 1984లో ఒక అధ్యయనమును నిర్వహించినారు. 60 మంది స్త్రీలు, 60 మంది పురుషులపై ఈ అధ్యయనం జరిగింది. 18-35 సంవత్సరముల మధ్య వయస్సు కలిగిన వివిధ ఆదాయ సమూహము, భాషా సమూహము మరియు విద్యా సమూహాలకు చెందిన వారిని ఇంటర్వ్యూ చేసినారు. ఈ అధ్యయనంలో సమాధానమిచ్చే వారి తల్లి తండ్రుల తరంలోని 98.3 శాతం వారికి, వారి అనుమతి లేకుండానే వాళ్ల తల్లి తండ్రులు వివాహాలు కుదిర్చారు. 1.7 శాతం వివాహాలు మాత్రమే వారంతట వారు ఏర్పాటు చేసుకున్నవి. సమాధానం ఇచ్చే వారి తరంలో 20 శాతం వివాహాలు మాత్రమే వారి తల్లి తండ్రులు కుదిర్చారు. 80 శాతం వారికి వారే వివాహాలు కుదుర్చుకున్నారు.

నవీన యువత వారి జీవిత భాగస్వామిని వారు ఎంపిక చేసుకోగలిగినప్పటికీ, ఎంపిక మాత్రం కుటుంబం నిర్ణయించే అంశంగానే ఇంకా ఉందని దీనివలన తెలుస్తున్నది.

ఈ కాలంలో జీవిత భాగస్వామి ఎంపికపై వివాహ ప్రకటనలను ఉపయోగిస్తున్నారు. ఈ పద్ధతిలో కూడా తల్లిదండ్రులదే పైచేయిగా ఉంటోంది. ఈ వివాహ ప్రకటనలపై చేసిన సర్వేలు కొంత సరైన సమాచారాన్ని అందజేస్తాయి. వివాహ ప్రకటనలు సాధారణంగా నగర, విద్యావంతులు మరియు ధనవంతులు ఇస్తారని ఈ అధ్యయనాలలో గుర్తించబడింది. తల్లితండ్రులే వివాహ ప్రకటనలను ఇచ్చి పరిశీలించి, ఎదుటి వారి నేపథ్యాన్ని గమనించి, విచారించి, ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించి, అప్పుడు ఎవరిని ఇంటర్వ్యూకి పిలవాలో నిర్ణయిస్తారని ఈ అధ్యయనాలు వివరించినాయి.

వధూవరుల ఎంపిక అనే విశేషమైన, సూక్ష్మమైన అంశంలో తల్లితండ్రులే సమర్ధులని నమ్మిక ఉండడంతో ఎంపిక వారినే వదలడమవుచున్నది. వారి జీవితానుభవము, నిజ మరియు ఊహాపరమైన సామర్థ్యము, బాధ్యత వీటన్నింటి యొక్క మొత్తముతో తల్లితండ్రులకు వదూవరుల ఎంపిక అంశములో సామర్ధ్యము యోగ్యత కలవని భావించడం జరుగుతోంది.

తల్లితండ్రులు బిడ్డలకు వధూవరుల ఎంపికలో విపరీతమైన, జాగ్రత్తను కనపరుస్తారు. తల్లితండ్రులు పిల్లల వివాహ సందర్భములో సంస్కృతీ, సంప్రదాయాలను 80% చూస్తారని, కుటుంబ అంతస్థును 56% చూస్తారని, కుటుంబ ఆర్థిక స్థితిని 11% చూస్తారని, వధువు విద్యను 5.5% శాతం చూస్తారని 1964లో బరోడాలో 200 మంది కాలేజీ విద్యార్థులపై జరిపిన సర్వేలో వెల్లడయినది.

వారి పిల్లల వివాహాన్ని నిర్ణయించునప్పుడు అనేక అంశాలను దృష్టిలో పెట్టుకునే తల్లితండ్రులు, జీవిత భాగస్వామి ఎంపికలో తమ పిల్లల అంగీకారిన్న అరుదుగా తీసుకుంటారు. జైపూర్‌లో 1984లో చేసిన రెండు తరాల అధ్యయనంలో సమాధానం చెప్పే వారి తల్లితండ్రుల్లో 98.4 శాతం వారికి వారి తల్లితండ్రులే వివాహాన్ని ఏర్పాటు చేశారు. వివాహం చేసేటప్పుడూ తల్లితండ్రులు వివాహం చేసుకునే వారి అంగీకారాన్ని తీసుకోలేదు.

తల్లితండ్రులు స్థిర పరచిన వివాహాలలో, పిల్లలకు ఎటువంటి పాత్ర ఉండదు. దానిని వారు నిరసిస్తున్నారు, అయినా భరిస్తున్నారు. (Vimal Shah) 1975లో 281 హిందూ డిగ్రీ విద్యార్థుల విమల్ షా వివాహ విషయంలో వారి యొక్క దృక్పథాలను గురించి తల్లితండ్రుల ప్రమేయం గురించి లేదా వారి స్వంత ఎంపిక గురించి అధ్యయనం చేయడం జరిగింది. 68.4 శాతం స్త్రీలు, 62.0% పురుషులు వారి తల్లితండ్రుల మరియు బంధువుల ద్వారా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుంటారని, మరియు 27.6% స్త్రీలు, 30.7% పురుషులు తల్లితండ్రుల అనుమతితోనే జీవిత భాగస్వామిని స్వంతంగా ఎంపిక చేసుకోవాలని కోరుకుంటారనీ, 4.0% స్త్రీలు, మరియు 7.3% పురుషులు పూర్తిగా వారే ఎవరి ప్రమేయం లేకుండా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడమును కోరుకుంటారని ఈ అధ్యయనముల ద్వారా వెల్లడయినది.

## 9.4 స్వయముగా ఏర్పాటు చేసుకున్న వివాహాలు:

తల్లిదండ్రులు నిర్ణయించిన వివాహాలు సమాజంలో ఎక్కువ జరుగుతున్నప్పటికీ, స్వంతంగా స్త్రీ, పురుషులు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం అనేది కూడా సమాజంలో చోటుచేసుకుంటున్నది. వధూవరుల వరణము బాల బాలికల మీద గాక వారి పెద్దల మీద ఆధారపడి ఉండే ఆచారం హిందూ సమాజంలో పూర్వం నుంచి ఉన్నది. గతంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుండేవి. బాల్యావస్థలో ఉన్న వారు మంచి చెడులను ఆలోచించలేరు. కాబట్టి వధూవరులు వరణము వారి పెద్దల మీదనే ఆధారపడి ఉండేది. అంతేకాక వివాహ సంబంధాలు సామాన్యంగా బంధు సమూహాలలో జరిగేవి. కాబట్టి బాలబాలికలకు ఒకరికొకరు తెలియరనే ప్రస్తి ఉండేదికాదు. చిన్ననాటి నుంచి పరిచయం ఉన్న బాలబాలికలే వదూవరులుగా మారడం ఉండేది. ఈనాడు బాల్య వివాహాలు చాలా వరకు తగ్గిపోయాయి. అయినా వధూవరులను నిర్ణయించుటలో పెద్దల జోక్యం తగ్గిపోలేదు. ఈనాటికీ వదూవరుల వరణ యువతీయువకుల మీద కాక పెద్దల మీదనే హెచ్చుగా ఆధారపడి ఉంది. వివాహ నిర్ణయం పూర్తిగా యువతీ, యువకులకు వదిలి వేయడం లేదు. కానీ, వదూవరుల వరణంలో ఈనాడు యువతీ యువకులను సంప్రదింపులకు కొంత ప్రాముఖ్యత ఉంది. యువతీ, యువకులు సంప్రదించిన తరువాతే పెద్దలు వివాహ నిర్ణయం చేస్తున్నార. యువతీ, యువకులను సంప్రదించడమే ఈనాడు వధూవరుల వరణంలో వచ్చిన మార్పుగా భావించవచ్చు. యువతీ, యువకులను కనుక్కున్న తర్వాతనే పెద్దలు వివాహ నిర్ణయం చేయడం జరుగుతుంది.

ఈనాడు యువతీ, యువకులు స్వతంత్రంగా తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుంటున్నారు. అయినప్పటికీ తల్లిదండ్రుల అనుమతితోనే వివాహం చేసుకుంటున్నారు. యువతకు వారి జీవితాన్ని వారే స్వతంత్రంగా నిర్ణయించుకునే అవకాశాన్ని వారంతల వారే నిర్ణయించుకున్న వివాహాలు కల్పిస్తున్నాయి.

జీవిత సహచరుల సంఖ్యను బట్టి వివాహమును రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. ఏకత్వ వివాహం

2. బహుత్వ వివాహం

ఒక పురుషులు ఒక స్త్రీని వివాహమాడడం ఏకత్వ వివాహము (Monogamy). ఒక పురుషుడు ఒకరి కన్నా ఎక్కువ మంది స్త్రీలను వివాహమాడడం లేదా ఒక స్త్రీ ఒకరి కన్నా ఎక్కువ మంది పురుషులను వివాహమాడడం బహుత్వ వివాహము (Plygamy). బహుత్వ వివాహం రెండు రకాలు.

1. బహు భర్తృత్వం (Polyandry)

2. బహు భార్యత్వం (Polygyny)

ఒక స్త్రీ ఒకే సమయంలో ఒకరి కన్నా ఎక్కువ మంది భర్తలను కలిగి వుండే విధానాన్ని బహుభర్తృత్వమంటారు. ఈ బహుభర్తృత్వం సాధారణంగా నాగరిక సమాజాలలో ఉండదు. ఈ ఆచారం కొన్ని ఆదిమ జాతులలోనే ఎక్కువగా ఉన్నది. మహాభారతంలో ద్రౌపదికి పంచపాండవులందరూ భర్తలే. ఇది మనకు ఇతిహాసం నుండి తీసుకోదగ్గ చక్కటి ఉదాహరణ. కొంత కాలం క్రితం మార్గ ప్రాంతంలో ఈ బహుభర్తృత్వ ఆచారం గోచరించేది. నీలగిరి కొండల ప్రాంతాలలో నివసించే తోడా జాతిలో కూడా ఈ ఆచారం ఎక్కువగా ఉంది. తోడా జాతిలో ఒక వ్యక్తికి వివాహమైతే అతని భార్య, అతని సోదరులందరికీ భార్య అవుతుంది. అంటే ఈ వివాహానంతరము భర్తకి ఇంకెవరైనా సోదరులు జన్మిస్తే వారికి కూడా ఆమె భర్య అవుతుంది. తోడా జాతికి సమీపంలో నివసిస్తున్న 'కోటా' జాతిలో ఒక వ్యక్తి భార్యతో అతని సోదరులు స్వేచ్ఛా పరమైన లైంగిక సంబంధాన్ని కలిగియుండవచ్చు. కోటా జాతి స్త్రీ భర్త, తను సమీపంలో లేనప్పుడు ఆ రాత్రికి తన సోదరులలో ఒకరిని నిర్ణయించి నియమిస్తాడు. బహుభర్తృత్వం ఉన్న జాతుల వారు పాండవులనీ, వారి సంస్కృతినీ ఆరాధిస్తారు. ఈ ఆచారమున్న సమాజాలలో స్త్రీల సంఖ్య కన్నా, పురుషుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండి ఉండవచ్చు. దానివలన ఒక స్త్రీని కొందరు పురుషులు వివాహం చేసుకోవడం జరుగవచ్చును. తోడా జాతి స్త్రీ గర్భవతి అయినప్పుడు ఆమె భర్తలలో పెద్దవాడు (పెద్ద సోదరుడు) "విల్లంబుల మహోత్సవము"ను ఆచరిస్తాడు. ఆమెకు కలిగిన మొదటి ఇద్దరు లేక ముగ్గురు పిల్లలకు ఈ ఉత్సాహాన్ని ఆచరించిన వ్యక్తి తండ్రిగా సాంఘీక హోదాను కలిగిఉంటాడు.

## 9.5 బహు భార్యత్వము:

ఒకే సమయంలో ఒక వ్యక్తికి ఒకరు కన్నా ఎక్కువ మంది భార్యలుండడాన్ని బహుభార్యత్వమంటారు. వేదకాలం నుంచీ నేటి వరకు కూడా మన సమాజంలో బహుభార్యత్వ వివాహాలు జరుగుతూనే ఉన్నవి. పూర్వకాలంలో రాజులు అనేక మంది భార్యలను కలిగిఉండేవారు. సంప్రదాయం సిద్ధాంత పరంగా బహుభార్యత్వాన్ని అంగీకరించినప్పటికీ అది ప్రత్యేక పరిస్థితులలోనే ఆచరించవచ్చు. మను ప్రకారం భార్య వంధ్య అయినచో, ఎనిమితి సంవత్సరాల తరువాత తాను సంతానం పొందడానికి ఆమెను విడిచి వేరొకరిని వివాహమాడవచ్చును. ఎవరికైననూ పిల్లలు కలిగి చనిపోతుంటే పది సంవత్సరాల తరువాత వేరొకరిని వివాహం చేసుకోవచ్చు. భార్యకు స్త్రీ సంతానకు ఉంటే పదకొండు సంవత్సరాల తరువాత మరొకరిని వివాహం చేసుకోవచ్చు. ఒక పేచీకోరు భార్య అయితే ఏవిధమైన ఆలస్యం లేకుండా వెంటనే ఇంకొకరిని వివాహం చేసుకోవచ్చును. కౌటిల్యుడు, వాత్స్యాయనుడు కూడా స్వల్ప తేడాతో పైరీతిగానే వివరించారు. 1956 హిందూ వివాహ చట్టాన్ననుసరించి బహుభార్యత్వంపై ఆంక్షలు విధింపబడ్డాయి. అయితే మహమ్మదీయులు బహుభార్యత్వాన్ని పాటించవచ్చు. బహుభార్యత్వాన్ని ఎక్కువగా ఆదిమ గెతలలో ఈనాటికీ కూడా ఉన్నది. నాగా తెగలలోను, గోండ్‌లలోను, మధ్య భారతదేశంలోని ఆస్ట్రలాయిడ్ జాతులలోను ఈ బహుభార్యత్వం ఎక్కువగా ఉంది. పూర్వకాలంలో కొందరు రాజులు శత్రువులను జయించి వారి కన్యలను వివాహమాడిని చారిత్రక నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి. అయోధ్య నవాబుకు అనేక మంది భార్యలుండేవారు. నైజాం నవాబుకు వంద మంది వరకూ భార్యలుండేవారని తెలుస్తున్నది. మహారాజులు, చక్రవర్తులు అనేక మంది భార్యలుండడం వలన తమ హోదా ఎక్కువవుతుందని భావించి అనేక మంది స్త్రీలను వివాహమాడి యుండవచ్చు. సమాజంలో బహుభార్యత్వానికి స్మృతికారుల అంగీకారం ఉంది. కనుక ధనవంతులైన వారు బహుభార్యత్వానికి అలవాటుపడినారు. అయితే చట్టప్రకారం బహుభార్యత్వం నిషేధించబడింది.

## 9.6 ఏకవివాహం (Monogamy):

ఏకత్వ వివాహమంటే ఒక స్త్రీ ఒక పురుషుని లేక ఒక పురుషుడు ఒక స్త్రీని వివాహమాడుట. ఒక పురుషుడు గాని, ఒక స్త్రీ గాని ఏక కాలంలో ఒక జీవిత భాగస్వామిని కలిగియుండట ఏకత్వ వివాహము. అనాదిగా మన దేశంలో బహుభార్యత్వం, బహుభర్తృత్వం ఉన్నా కూడా ఎక్కువ మంది ఏకత్వ వివాహాలనే ఆచరించారు. యదార్థానికి అన్ని వివాహాలలోను ఏకత్వ వివాహం ఉత్తమమైనదని చెప్పవచ్చు. ఒక వ్యక్తికి ఒకే జీవిత భాగస్వామి అయినందు వలన పరస్పర ప్రేమానురాగాలు ఎక్కువగా

ఉంటాయి. హిందూ సంప్రదాయంలో పురుషుడు ఒక స్త్రీను మాత్రమే వివాహం చేసుకోవడాన్ని ప్రోత్సహించారు. దానిని ఏకపత్నీ వ్రతంగా శ్లాఘించడం జరిగింది. భార్య తన భర్తను దైవంగా భావించాలి. ఈ విధమైన వివాహంలో భార్యాభర్తలిరువురూ అన్యోన్యత, ప్రేమ అవగాహన కలిగి యుండడానికి అవకాశం ఉంటుంది. భార్యను 'అర్ధాంగి' అంటారు. అంటే భర్త శరీరంలో సగభాగం భార్య. వారి మద్య విడదీయరాని సంబంధాన్ని భావించడం జరిగింది. దైనందిన జీవితంలోనే కాక ఆధ్యాత్మిక విషయాలలో భార్యలేనిదే భర్త కర్మకాండకు అర్హుడు కాడు.

గృహస్థ జీవిత రథానికి పురుషుడు ఒక చక్రం, స్త్రీ మరొక చక్రంగాను భావించి స్త్రీలను సహధర్మచారిణిగా భావించడం జరిగింది. ఈ విధంగా ఉన్న కుటుంబ జీవితంలోని పిల్లలు చక్కని ప్రేమ, అభిమానం పొందుతారు. పిల్లలు మూర్తి మత్వ వికాసానికి ఇట్టి కుటుంబం చాలా సహాయకారిగా ఉంటుంది. నైతిక సామాజిక విలువలను పిల్లలు తల్లితండ్రులు జీవన విధానం నుంచి నేర్చుకుంటారు. పిల్లల పోషణకు తల్లితండ్రులిద్దరూ సమాన బాధ్యత కనబరుస్తారు.

ఈ పద్ధతిలో ఆర్థిక విషయాలు, ఒత్తిడులు కలిగినప్పుడు భార్యాభర్తలిరువురు కష్టసుఖాలను సమంగా పంచుకుంటారు. వారికి కలిగిన పిల్లల విషయంలో కూడా సమభావం ఉండడానికి అవకాశముంది. స్త్రీలకు సవితి పోరు ఉండదు. మానసిక ఆందోళన ఉండదు. ఈ కారణాల వలన భారతదేశంలో ఏక వివాహాలకు గౌరవం ఉంది. చక్కని ఆదర్శాలు, ఆశయాలతో ఏర్పాటైన ఏక వివాహంలో చాలా మార్పులు వచ్చాయి. నిర్ణయాలు తీసుకోవడంలోను, కుటుంబ విషయాలలోను భర్త తాను అధికుడనని భావించుట వలన అతడు నిరంకుశుడైనాడు. అంతేకాక, పురాణాలలో పాతివ్రత్య ఆదర్శం అధికంగా పతిసేవ చేయడమే, ఆమె జీవిత ధ్యేయం, ప్రయోజనం అని భావించడం జరిగింది. నది ఏ రీతిగా సముద్రంలో కలిసిపోయి తాను సముద్రంతో తదాత్మ్యం చెందుతుందో అలాగే, భార్య తన వ్యక్తిత్వాన్ని అర్పణ చేసి భర్తకు పూర్తిగా విధేయంగా ఉండాలని భావించినాడు. భర్తను తృప్తి పరచడమే ఆమెకు ఆనందమైనది. భర్త దుర్మార్గుడైనా, దుష్టుడైనా అవినీతి పరుడైనా అతనిని విమర్శించరాదు. అతడు జీవించియున్నతం కాలమూ సేవయే కాక, అతని మరణం తర్వాత 'సతి'ని పాటించాలి. అయితే కాలక్రమేణా ఈ భావనలో మార్పులు చోటుచేసుకున్నవి. 'సతి' నిషేధించబడినవి.

ప్రపంచ వ్యాప్తంగా మొదటి నుంచి ఏక వివాహమే ఎక్కువగా పాటిస్తున్నారు. బహు వివాహ సంప్రదాయాన్ని పాటించే కొన్ని సమాజాల్లో కూడా ఏక వివాహం యొక్క గొప్పతనాన్నే అంగీకరించడం జరుగుతోంది. నేటి ఆధునిక సమాజాలన్నీ ఏక వివాహాన్నే న్యాయంగా పాటిస్తున్నాయి. ఆదిమ తెగలు కూడా ఏక వివాహ సంప్రదాయంపైనే మొగ్గుచూపుతున్నారు.

సహచరులను పొందడంలో హిందూ వివాహ పద్ధతులు ఎనిమిది రకాలుగా ఉన్నట్లు ప్రాచీన హిందూ సాహిత్యంలో ఉన్నది. వీటినే అష్టవిధ వివాహాలని అంటారు. అవి: 1. బ్రహ్మము, 2. దైవము, 3. ఆర్షము, 4. ప్రాజాపత్యము, 5. అసురము, 6. గాంధర్వము, 7. రాక్షసము, 8. పైశాచికము. మొదటి నాలుగు శాస్త్రాలని చివరి నాలుగు అపశ్రాస్తాలని భావిస్తారు. ఈ ఎనిమిదింటిలోను పైశాచికము విడువదగిందని, బ్రహ్మము ఉత్తమమైనదని చెబుతారు. మొదటి నాలుగు పద్ధతులే హెచ్చుగా ఆచరణలో ఉన్నాయి.

**1. బ్రహ్మము:**

ఈ వివాహ పద్ధతిలో కన్యాదాత గుణ సంపన్నుడైన, విద్వాంసుడైన వరుని స్వయంగా పిలిచి, సత్కరించి అతని దగ్గర ధనాన్ని స్వీకరించకుండానే సాలంకృతమైన కన్యను దానం చేస్తాడు. అన్ని వివాహ పద్ధతులలోను బ్రహ్మము యోగ్యమైనదిగా స్మృతులు ప్రశంసించాయి. ఇది అనాది నుంచి వస్తున్న పద్ధతి. ఇదే వివాహ విధానము. ఈ పద్ధతినే ఈనాటికీ ఆచరిస్తున్నప్పటికీ దీనిలో కట్నం ప్రవేశించి నిందలపాలవుతున్నది.

**2. దైవము:**

అలంకృతమైన కన్యను యజ్ఞంలో ఋత్విక్కుగా ఉన్న వరునికి ఇచ్చి వివాహం చేసే పద్ధతియే దైవము. ఆ ఋత్విక్కునకు దక్షిణగా కన్యను ఇస్తారు. ఆర్షము కంటే ప్రశస్తమైనది దైవమని స్మృతికారులు సూచించినారు. యజ్ఞాలు చేయడం క్రమంగా తగ్గిపోవడం చేత ఈ పద్ధతికి కూడా స్వస్తి చెప్పడం జరిగింది.

**3. ఆర్షము:**

ప్రజాపత్యం కంటే ఆర్ష వివాహము ప్రశస్తమని ధర్మశాస్త్రజ్ఞుల అభిప్రాయము. కన్యాదాత వరుని దగ్గర యజ్ఞ విహిత కార్యాలకు ఒకటి లేక రెండు గోవులను స్వీకరించి కన్యను ఇవ్వడం ఆర్షము. దీనిని కట్నంగా భావించే వారు కాదు. కేవలం యజ్ఞ కార్య నిమిత్తము గోమిథునాన్ని స్వీకరిస్తున్నట్లు మాత్రమే భావించే వారు. యజ్ఞాల ప్రాధాన్యము క్రమక్రమంగా తగ్గిపోవడం చేత ఈ పద్ధతి తగ్గిపోతుంది.

**4. ప్రజాపత్యము:**

ఆ పద్ధతి ప్రకారం కన్యాదాత యోగ్యుడైన వరుని చూసి అతనిని తన కుమార్తెనిస్తే వారిరువురు ధార్మిక కర్తవ్య నిర్వహణలో పరస్పర సాహచర్యంలో ప్రవర్తిస్తారు అనే అభిప్రాయంతో కన్యను ఇస్తాడు. ఈ పద్ధతిలో కన్యాదాత తన కుమార్తెను స్వీకరించవలసిందిగా ప్రార్థనా పూర్వకంగా వరుని అడుగుతాడు. ప్రజాపతి మోస్తరు సంతానాన్ని పొంది పితృ ఋణాన్ని తీర్చి ధర్మమార్గాన ప్రవర్తించవలెనని ఈ వివాహం సూచిస్తుంది.

**5. అసురము:**

వధువు తల్లితండ్రులకు యథాశక్తి ధనం ఇచ్చి వివాహమాడే పద్ధతియే అసురము. అసుర వివాహ ప్రస్తావన ఋగ్వేదంలో ఉంది. దీనిలో ధనానికి ప్రాధాన్యం హెచ్చు. ధనలోభం వల్ల ధనవంతులైన వ్యక్తులకు కన్యలను విక్రయించే వారు. స్మృతికారులు ఈ వివాహ పద్ధతిని ప్రశంసించలేదు. లోభంతో శుల్కం గ్రహించి కన్యలను అమ్మడం హీనమని మనుస్మృతిలో ఉన్నది. కన్యాదాన సమయంలో కన్యాదాత ధనాన్ని స్వీకరిస్తే అతడు కన్యా విక్రేత అవుతాడని ఆపస్తంభుడు సెలవిచ్చినాడు. ధనం ద్వారా స్వీకరించిన కన్య దైవ పితృకర్మలకు అయోగ్యురాలని, ఆమె దానిలో సమునయని భావించే వారు. అయినా ఈ వివాహ పద్ధతి హిందూ సమాజంలో కొన్నిచోట్ల ఉన్నది. గ్రీకు చరిత్రకారుడైన మోగస్తనీసు వ్రాతలను బట్టి ఈ పద్ధతి పశ్చిమ భారతదేశంలో హెచ్చుగా అమలులో ఉన్నట్లు తెలుస్తున్నది. దీనికి భిన్నంగా ఈనాడు కన్య నుంచి వరుడు ధనాన్ని స్వీకరిస్తున్నాడు. అసుర, ఆర్ష వివాహాలు ప్రచారంలో ఉన్నప్పుడు వరకట్నం ఉండేది కాదు. కాలక్రమమున రజస్వల కాక పూర్వమే వివాహం చేసే ఆచారము ప్రబలం కావడంతో కట్నం ఇచ్చి అయినా ఆతురతతో బాల్య వివాహం చేసేవారు. కట్నము ప్రేమపూర్వకంగా తప్పనిసరి అయిన షరతు కావడం వల్ల అది దురాచారంగా పరిణమించింది.

**6. గాంధర్వము:**

స్త్రీ పురుషులు పరస్పరం అంగీకరించి వివాహమాడటం గాంధర్వము. దీనిలో స్త్రీ పురుషులు ఇరువురు కామవాంఛకు లోనై స్వేచ్ఛాపూర్వకంగా ప్రవర్తిస్తారు. ఈ వివాహ పద్ధతిని సర్వోత్తమంగా మనువు శ్లాఘించినాడు. గంధర్వ జాతులలో విరివిగా ఉన్న పద్ధతి కాబట్టి దీనిని గాంధర్వమని అన్నట్లు చెప్పినారు. క్షత్రియులలో దీనికి హెచ్చు ప్రోత్సాహం లభించింది. పూర్వకాలంలో తల్లిదండ్రులు వరాన్వేషణలో తమ కుమార్తెకు స్వేచ్ఛ ప్రసాదించినట్లు అధర్వణ వేదంలో ఉన్నది. వివాహ సమయాలలోను, ఉత్సవాలలోను బంధుమిత్రులు కూడిన సమయాలలోను యువతీ యువకులు దగ్గర చేరడం, పెద్దలు దానిని ప్రోత్సహించడం మనకు తెలిసిన విషయమే. దాంపత్యము ప్రేమ మీద ఆధారపడింది. కాబట్టి ఈ వివాహము ప్రశస్తమని కొందరి అభిప్రాయము. పరస్పరం కామంలో కూడిన స్త్రీ పురుషుల వివాహము శ్రేష్ఠమని శకుంతలకు పెంపుడు తండ్రియైన కణ్వుడు చెప్పినట్లు మహాభారతంలో ఉన్నది. ధార్మిక క్రియా సంస్కారం లేకపోవడం చేతను, కాముకతయే ప్రాతిపదిక కావడం చేతను ఈ వివాహాన్ని అప్రశస్తమైనదిగా చాలా మంది స్మృతికర్తలు భావించినారు. సంతానము, ఆస్తి హక్కు విషయంలో అనేక చిక్కులు ఏర్పడడం చేతను, వర్ణ వ్యవస్థ కట్టుబాట్లు తీవ్రతరం కావడం చేతను ఈ వివాహ పద్ధతి సన్నగిల్లిపోయింది.

**7. రాక్షసము:**

కన్యవైపు బంధువులను హింసించి చివరకు చంపి అయినా కన్యను బలవంతంగా హరించుకొనిపోయి వివాహమాడే పద్ధతిని రాక్షసము అని మనువు చెప్పినాడు. యుద్ధంలో అభిరుచి ఉన్న జాతులు ఈ పద్ధతిని హెచ్చుగా అనుసరించినాయి.

ఇప్పటికీ కొన్ని ఆదిమ తెగలలో వివాహ సమయంలో యుద్ధం చేసి కన్యను బలాత్కరించి తీసుకొన పోయేటట్లు అభినయించే దృశ్యము వారి వివాహ సంస్కారాలలో ఒకటిగా కనిపిస్తుంది.

కన్యను బలాత్కరించి తీసుకొని పోవడం రాక్షస, పైశాచిక పద్ధతులలో సామాన్యమైనా ఈ రెండు పద్ధతులలోను వ్యత్యాసం ఉన్నది. పైశాచిక పద్ధతిలో కన్యను అచేతన స్థితిలో తీసుకొనపోతారు. రాక్షసలో కన్యను చేతన స్థితిలోనే తీసుకొనిపోతారు. కన్య అభిప్రాయానికి వ్యతిరేకంగా బలాత్కారంగా అపహరించుకొని పోవడం క్రమేణ తగ్గింది. కన్య అంగీకారం మీద కూడా రాక్షస వివాహాలు జరుగుతుండేవి. కాలక్రమేణా ఈ పద్ధతికి భారతదేశం స్వస్తి చెప్పింది. అయినా క్షత్రియ జాతులలో మాత్రం కొంత కాలం వరకు ఇది మిగిలింది. క్షత్రియునికి రాక్షస పద్ధతి ప్రశస్తమైందని మనువు చెప్పినాడు. మహాభారతంలో భీష్ముడు కన్యలను బలాత్కారంగా తీసుకొనివచ్చే సందర్భంలో ఈ వివాహ ప్రసక్తి ఉన్నది. ఈ పద్ధతి శక్తికీ, వీరత్వానికి చిహ్నం గావడం చేత యుద్ధ ప్రియులైన క్షత్రియులు హెచ్చుగా దీనిని అనుసరించేవారు.

**8. పైశాచికము:**

నిద్రించినప్పుడు, అచేతన స్థితిలో ఉన్నప్పుడు కన్యను అపహరించుకొనిపోయి వివాహమాడటమే పైశాచికమని వాత్స్యాలాయన గృహ్య సూత్రాలలో ఉన్నది. ఇది భారతదేశంలో పశ్చిముత్తర ప్రాంత నివాసులైన పిశాచ తెగల వివాహ పద్ధతి. కాబట్టి దీనిని పైశాచమని చెప్పినట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. కన్యను మోసగించి వరుడు వివాహమాడటం చేత దీనిని అతి నీచమైనదిగా భావిస్తారు. ఈ విధమైన వివాహము ఎక్కువగా ఆదిమ తెగలలో కనబడుతుంది.

## పాఠం-10

# హిందూ వివాహ వ్యవస్థ

హిందూ సమాజంలోను, హిందూ మతంలోను వివాహమనేది ఒక ముఖ్యమైన సంస్కారము. అది చాలా అర్థవంతమైనది. పవిత్రమైనది కూడా. వివాహ సమయంలో వధూవరులు తీసుకొనే ప్రతిజ్ఞలను పరిశీలిస్తే హిందూ సమాజంలో వివాహానికి ఉన్న పవిత్రతా ప్రాధాన్యాలు మనకు విశదమవుతాయి. శారీరకంగా విభిన్న వ్యక్తులైన స్త్రీ పురుషులను మానసికంగా ఒకే వ్యక్తిగా చేయడమే హిందూ వివాహంలో ఉన్న ఆదర్శము. ఈ వివాహ వ్యవస్థ వధూవరులిద్దరినీ ధర్మార్థకామాలనే పురుషార్థాల సాధనలో జీవితాంతం సహచరులుగా చేస్తుంది. ఈ జన్మలోనే కాకుండా జన్మాంతరాలలో కూడా వీరి దాంపత్యము శాశ్వతంగా కొనసాగుతుందని వేదాలు ఘోషిస్తున్నాయి. కేవలం ఇంద్రియ సుఖప్రాప్తికే కాక త్యాగానికి, ధర్మ రక్షణకు కూడా వివాహాన్ని నిర్దేశించినట్లు హిందువులు భావిస్తున్నారు. వివాహము స్త్రీ, పురుషుల మధ్య జరిగే సాంఘీక ఒప్పందమే కాక, పవిత్రమైన బంధంగా హిందువులు భావిస్తున్నారు. భార్యాభర్తలలో దాంపత్యనిష్ఠ కలగచేయడానికే వివాహ సమయంలో నూత్న దంపతుల చేత అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తున్నారు. పరిపూర్ణ స్నేహంతో భర్య ఛాయవలె భర్తను అనుసరించి బాధ్యతతో మెలగవలెనని ఈ వివాహ వ్యవస్థ బోధిస్తుంది. కన్యాదానం చేసే ముందు వధువు తండ్రి వరునితో "ధర్మేణ, అర్థేన, కామేనత్య మైషా నాటి చరితవ్యా" అని చెబుతాడు. అంటే ధర్మము, అర్థము, కామము అనే పురుషార్థ త్రయ సాధనలో వరుడు ఏ సమయంలోనూ వదువును అతిక్రమించకూడదు అని అర్థము. దానికి వరుడు "నాతిచరామి" అని సమాధానమిస్తాడు.

వివాహిత అయిన స్త్రీ సహధర్మచారిణిగా, అర్ధాంగిగా, గృహిణిగా భావించడం వల్ల కుటుంబంలోనే కాక సమాజంలో కూడా భారత స్త్రీ మహోన్నత స్థానాన్ని ఆక్రమిస్తున్నది. ఆమె గృహానికి రాణి వంటిది. ప్రేమతో పాలించి గృహాన్ని సమస్త సౌఖ్యాలతో నింపే బాధ్యత ఆమె మీద ఉన్నది. భార్య తన భర్తను ప్రత్యక్ష దైవంగా భావిస్తుంది. పతియే దైవము అన్న భావనతో జీవితాంతము భర్త పట్ల శ్రద్ధతో నడుచుకోవడం తన విద్యుక్త ధర్మం అని ఆమె భావిస్తుంది. దానినే పాతివ్రత్యం అని అంటారు.

ఈ ప్రాతివ్రత్య భావన స్త్రీకి స్ఫురించడానికి అరుంధతీ నక్షత్ర దర్శనము వివాహ సమయంలో చేయిస్తారు. కుటుంబ సౌఖ్యానికి భార్య చిహ్నము. పని చేయడంలో దాసిగాను, క్షమాశక్తిలో భూదేవిగాను, స్త్రీకి కుటుంబంలో ప్రత్యేక స్థానం ఉన్నది. ధర్మాన్ని కాపాడడంలో గృహిణి నిర్వహించే పాత్ర అతి ముఖ్యమైనది. శిశు సంరక్షణ, బంధు సత్కారము మొదలైన బాధ్యతలను నిర్వర్తించడంలో గృహిణికి సాటి మరెవరూ లేరు. కుటుంబ ధనాన్ని కాపాడటంలో స్త్రీ పాత్ర కొనియాడదగింది. ఆడ దిక్కులేని మగవాడు అనేక దురభ్యాసాలకు లోనవుతాడు అని చెబుతారు. శరీరం ఏ విధంగా గంగాజలంతో పావనమవుతుందో అదే విధంగా పతివ్రత అయిన కుటుంబిని వల్ల భర్త పావనమవుతాడని భారతీయులు భావిస్తారు.

హిందూ వివాహానికి ముఖ్యమైన ఆదర్శాలు ఆరు. అవి:

**1. ప్రజోత్పత్తి:**

వివాహ బద్ధంగా జరిగే స్త్రీ పురుష సంపర్కం ద్వారానే ఉత్తమ సంతానం కలుగుతుందని మొదటి ఆదర్శము. అంటే పుష్టి అయిన సంతానం ద్వారానే మంచి జాతి ఏర్పడుతుంది. సంతానోత్పత్తి ద్వారానే వివాహ వ్యవస్థ సమాజం మనుగడకు తోడ్పడుతున్నది. దాంపత్యేతరమైన సంపర్కం ద్వారా ఉత్తమ సంతానం కలగటానికి అవకాశం లేదని అందరు అంగీకరిస్తున్నారు.

**2. స్త్రీకి ఆధారము:**

వివాహం ద్వారానే స్త్రీకి ఒక అస్తిత్వము, ఆధారము ఏర్పడుతుంది. అటువంటి ఆధారం లేని స్త్రీ జీవితము అంధకారమయము. పాతివ్రత్యం ద్వారానే స్త్రీ జీవిత లక్ష్యం సిద్ధిస్తుంది. అంతేగాక, స్త్రీకి సంతానార్హత వివాహం వల్లనే కలుగుతుంది.

**3. ఆశ్రమ ధర్మము:**

నాలుగు ఆశ్రమాలలోను గృహస్థాశ్రమము శ్రేష్ఠతమైన ఆశ్రమమని స్మృతులు పేర్కొంటున్నాయి. అటువంటి ఆశ్రమ ధర్మాన్ని నెరవేర్చడానికి వివాహ వ్యవస్థలోనే వీలవుతుంది. గృహస్థాశ్రమాన్ని అందరూ విధిగా అనుసరించవలెనని ఉపనిషత్తులు చెబుతున్నాయి. గార్హస్థ్య జీవితంలో ప్రవేశించని వారిని యజ్ఞహీనునిగా వైదిక సాహిత్యంలో పేర్కొన్నారు.

**4. కర్మానుష్టానము:**

స్త్రీ సహాయము లేకుండా పురుషుడు కర్మకాండను జరపడానికి వీలులేదు. మత సంబంధమైన, వివాహ సంబంధమైన పుణ్యకార్యాలలో, ఉత్సవాలలో చాలా సంస్కారాలను, నిర్వహించే అర్హత పురుషునికి స్త్రీ వల్లనే లభిస్తున్నది. పురుషుడు ఒంటరిగా చేసిన యజ్ఞం వల్ల దేవతలు ప్రీతి చెందరని, భార్యా సహితుడై చేసినప్పుడే తృప్తి చెందుతారని వేదాలలో ఉన్నది. అట్లాగే, సహధర్మచారిణి అయిన భార్య లేకుండా పుణ్యనదీస్నానం గాని, పుణ్యక్షేత్ర సందర్శనం గాని పురుషుడు చేయడం వ్యర్థమని భావిస్తారు.

**5. పితృ దేవతా పూజ:**

పితృదేవతారాధన వల్ల పితౄణాన్ని తీర్చుకోవడం హిందూ మతంలో ఒక ముఖ్యధర్మము. అట్టి ధర్మ సిద్ధికి వివాహము అవసరము. అంతేకాక, తల్లిదండ్రులను పుత్రులు పున్నామనరకం నుంచి ఉద్ధరిస్తారన్న భావం గాఢంగా ఉండటం వల్ల వివాహ వ్యవస్థను ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు.

**6. ధర్మార్థ కామ మోక్ష ఫలసిద్ధి:**

వ్యక్తి ఇహపర సుఖాలకు, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే చతుర్విధ పురుషార్థ సిద్ధికి వివాహము ఎంతగానో తోడ్పడుతుంది.

ముఖ్యమైన ఈ ఆరు ఆదర్శాలు ఉండడం చేతనే హిందూ వివాహ వ్యవస్థ సమాజంలో ఉన్నత స్థానాన్ని నిలుపుకొన్నది.

హిందువులు ఆచరించే అన్ని సంస్కారాలలోను బహుశః పెళ్లికి ఉన్నంత ప్రత్యేక స్థానం మరే ఇతర సంస్కారానికి లేదని చెప్పాలి. మనదేశంలో తరతరాలుగా వివాహ సంస్కారం అతి పవిత్రమైనదిగా పరిగణింపబడుతుంది. 'పెళ్లి' అనే పదము అచ్చ తెనుగు కాగా, వివాహమనేది సంస్కృత భాష నుండి పుట్టిన పదం. 'వివాహము' అనే పదము మోసుకుపోవడం అనే అర్థాన్నిచ్చే 'వాహ' అనే సంస్కృత మూలం నుండి పుట్టినది. వధువును వరుని ఇంటికి తీసుకుపోయే ప్రక్రియనే వివాహము అని అంటారు. మన సాహిత్యంలో 'ఉద్వాహము', 'పరిణయము', 'ఉపయామము', 'పాణిగ్రహణము' వివాహానికి నామాంతరాలుగా ఉన్నాయి. 'ఉద్వాహము' అంటే పెండ్లికుమార్తెను తన తల్లితండ్రుల గృహాన్నించి తరలించడం. వివాహం అంటే ఒక ప్రత్యేక పద్ధతిననుసరించి ఒక యువతిని యువకునికి భార్యగా చేయడానికి తీసుకువచ్చే తతంగం. 'పరిణయము' అనగా అగ్నిహోత్రానికి ప్రదక్షిణం చేయడం. 'ఉపయామము' అనగా దగ్గరగా తీసుకువచ్చి ఒకనికి భార్యగా చేయడం. 'పాణిగ్రహణము' అనగా వరుడు వధువు యొక్క కుడిచేతిని తన కుడిచేతితో పట్టుకొనుట.

హిందువుల పెళ్లిలో అనేక తతంగాలు ఉంటాయి. ఈ తతంగాలు ఉంటాయి. ఈ తతంగాలలో దేనిని ముందు చేయాలి, దేనిని తరువాత చేయాలి అనే విషయం అన్ని హిందూ గృహసూత్రాలు ఇంచుమించు ఏకాభిప్రాయాన్ని కల్గి ఉన్నప్పటికీ, కొన్ని తతంగాల వరుసక్రమం విషయంలో మాత్రం కొద్దిపాటి భేదాల్ని సూచిస్తాయి. అశ్వామన గృహ్యసూత్రం ప్రకారం 'అగ్ని ప్రదక్షిణం', 'సప్తపది' జరగడానికి ముందే పాణిగ్రహణం జరగాలి. ఆపస్తంభ గృహ్య సూత్ర ప్రకారం అగ్ని ప్రదక్షిణానికి ముందు సప్తపది జరగాలి. గోభిల, బేద్ధాయన గృహ్య సూత్రాలు సప్తపది అయిన పిదప పాణిగ్రహణం జరగాలని పేర్కొనగా, మిగిలిన అనేక గృహ్య సూత్రాల ప్రకారం సప్తపదికి ముందే పాణిగ్రహణం జరగాలి. కాణే పండితుడు అనేక గృహ్యసూత్రాలను పరిశీలించి పెళ్లి తతంగాల వరుస క్రమాన్ని ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

**వరాగమనము:**

తొలుత పెండ్లి కుమారుడు మంగళ వాయిద్యాలతో పెళ్లి వారింటికి తరలివెడతాడు. ఈ కార్యక్రమానికి ముందు సమావర్తనం అనే వేరొక కార్యక్రమం జరుగుతుంది. దానినే సామాన్య పరిభాషలో 'స్నాతకం' అంటారు. బ్రహ్మచర్యాశ్రమంలో చదువు ముగించుకుని గురువు ఆజ్ఞను తీసుకొని ఇంటికి వ్యక్తి రావడం 'సమావర్తనం'. ఈ విధంగా వచ్చిన వ్యక్తిని 'స్నాతకుడు' అంటారు. స్నాతకుడు గొడుగు, చెప్పుడూ మొదలగు వాటిని ధరించి, కాశీయాత్రకు బయలుదేరుతాడు. అప్పుడు కాబోయే బావమరిది స్నాతకునికి ఎదురేగి చిన్న బెల్లం ముక్కను గడ్డం క్రింద పెట్టి, కాశీకి పోవలదనీ, తన సోదరిని వివాహం చేసుకోమని అభ్యర్థిస్తాడు. పిదప పెండ్లి కుమారుని కాళ్లు కడిగి అతనికి నూతన వస్త్రాలనిస్తాడు. ఈ తతంగమే స్నాతకం, స్నాతకమైన పిదప వరామగనం జరుగుతుంది. పెండ్లికుమారునికి కాబోవు మామ గారు మధుపర్కం అనగా, తేనె మొదలైన తీపి పదార్థాలతో తయారు చేసిన ద్రవం ఇస్తాడు. తదుపరి నూతన వస్త్రాలనిస్తారు. ఈ నూతన వస్త్రాలనే నేడు 'మధుపర్కాలు' అని అంటున్నారు. అయితే మధుపర్కము అంటే తీపిద్రవమే కానీ, నూతన వస్త్రాలు కావు. అనంతరం వధూవరులు మంగళ స్నానం చేస్తారు. పిదప వరుడు గణపతి పూజ, వధువు గౌరీపూజ చేస్తారు.

**కన్యావరణం:**

కన్యావరణం అంటే కన్యను వరించడం. మగ పెళ్లివారు కొంత మంది పెళ్లి కూతురు తండ్రి దగ్గరకు వెళ్లి పెళ్లి కుమారుని గోత్ర ప్రవరలను తెలియచేస్తూ వధువును కోరుతారు. అప్పుడు పెళ్లి కూతురి తండ్రి గాని, సంరక్షకుడు గానీ తాము తమ కన్యను పెండ్లి కుమారునికి ఇవ్వడానికి మూడుసార్లు తమ అంగీకారాన్ని తెలుపుతారు. అప్పుడు పెండ్లి కుమారుడు "పరమేశ్వరునికి ప్రీతిని కలిగించడానికీ, ధర్మాన్ని నెలకొల్పడానికి, సంతానాన్ని, సంపదనీ పొందడానికి ఈ స్త్రీని పెళ్లి చేసుకుంటాను" అంటాడు.

**కన్యాదానము:**

వివాహ తతంగాలలో కన్యాదనం కూడా చాలా ముఖ్యమైనది. పెళ్లి కుమార్తెకై అంతవరకూ ఆమె తండ్రికి కానీ, లేక సంరక్షకుని గానీ కల బాధ్యతను పెళ్లి కుమారునికి అప్పగించడమే కన్యాదానం అనబడుతుంది. హిందువులు వరుని లక్ష్మీనారాయణ స్వరూపునిగా భావిస్తారు. అందుకే వరుడు తనకన్నా చాలా చిన్నవాడైనప్పటికీ కన్యాదాత అతని కాళ్లను కడిగి, ఆ నీటిని తలపై జల్లుకుంటాడు.

కన్యాదాత వరుని ఉద్దేశించి "నేను బ్రహ్మలోకం పొందడానికి, బంగారు ఆభరణములచే అలంకరింపబడిన ఈ కన్యనూ విష్ణుస్వరూపుడగు నీకు ఇచ్చుచున్నాను", అనియూ, పితృదేవతలు తరించుటకు ఈ కన్యను దానము చేయుచున్నాను. దేవతలు, పంచభూతములు దీనికి సాక్షులు అనియూ అంటాడు.

కన్యాదాత పెళ్లి కుమారుని చేతిలో నీటిని ధారపోస్తూ పెళ్లి కుమార్తెను పెళ్లి కుమారునికి అర్పిస్తాడు. ఇలా నీటి ధారను పోయడం వలనను కన్నెదనం 'కన్నెధార'గా పిలవబడుచున్నది. అనంతరం కన్యాదాత ధర్మార్థకామములందు ఈమెను అధిగమించి ప్రవర్తించకుము అని అనగా, పెండ్లి కుమారుడు 'అతిక్రమించి చరించను' అని అంటాడు.

**సుముహూర్తం:**

పిదప మరికొన్ని తతంగాలు జరిగిన పిమ్మట సుముహూర్తం జరుగుతుంది. ఈ సుముహూర్తమే పెళ్లి యొక్క ప్రధాన ఘట్టం. సుముహూర్తం నిర్ణీత సమయానికి జరుగుతుంది. పెళ్లిపీటల మీద వధూవరులిద్దరూ తొలిసారిగా చూసుకునే సమయమే సుముహూర్తం. అంతవరకూ వీరి మధ్యన ఉన్న తెర తొలగించబడుతుంది. అనంతరం వధూవరులిద్దరూ ఒకరి తలపై ఒకరు జీలకర్ర బెల్లం కల్పిన ముద్దను ఉంచుతారు. జీలకర్ర ముసలితనాన్ని త్వరగా రానీయదనియూ, బెల్లం మంగళ ప్రదమైనదనియూ భావించుట వలన అట్లా చేయవచ్చు.

**సూత్ర ధారణ:**

సూత్రధారణకు ముందు కొన్ని తతంగాలుంటాయి. వరుడు వధువు నడుము చుట్టూ ఒక త్రాటిని కడతాడు. దీనినే యోక్త్రధారణము అంటారు. ఇది స్త్రీలకు ఉపనయనము లాంటిది. ఆ త్రాటిని కడుతూ అగ్ని హోత్రములందు తనకు సహచారిణిగా ఉండమని కోరతాడు.

తదుపరి మంగళ సూత్రం కట్టడం జరుగుతుంది. ఒక కాడెను తెప్పించి ఆ కాడెను పెళ్లికూతురి తలపై ఉత్తర దక్షిణ దిక్కుగా పెట్టి, ఆ కాడె రంధ్రము నుండి నీటిని పోస్తూ మంగళసూత్రాన్ని అభిమంత్రించి పిదప దానిని వరుడు పెళ్లికూతురి మెడలో "మూడుముళ్లు" వేసి కడతాడు. "నా జీవనాన్ని కాపాడే ఈ సూత్రాన్ని నీకు కడుతున్నాను. నీవు నూరు సంవత్సరములు బ్రతుకుము" అని పెళ్లికొడుకు మంత్రపూర్వకంగా చెబుతాడు.

మంగళసూత్రం అనే పదానికిద్రావిడ భాషలో 'తాలి' అంటారు. తాలి అనగా తాటి ఆకుతో చేసిన ఆభరణం. తొలుత ద్రావిడ దేశస్థులే వివాహాలలో తాటాకుతో తయారు చేసిన ఆబరణాన్ని సూత్రంగా కట్టుకునేవారు. మంగళప్రదమైనది కాబట్టి దీనికి 'మంగళ సూత్రం' అని పేరు వచ్చింది. ఈ ఆచారం ముఖ్యంగా తమిళులది. దీనిని క్రమేణా దక్షిణ భారతదేశంలోని అందరూ అనుసరిస్తున్నారు.

**తలంబ్రాలు:**

తలంబ్రాలను 'కపివావాచనము' లేక 'అక్షతారోపణ' అని పిలుస్తారు. వధూవరులు ఒకరి తలపై ఒకరు సౌభాగ్యముగాను, ప్రియత్వమును, తృప్తినీ పొందుదుము గాక అని చెప్పుచూ తలంబ్రాలు పోసుకుంటారు.

పిదప పురోహితుడు వధూవరులకు రక్షాబంధనము కట్టును. అటు పిదప వధూవరుల కొంగులను పురోహితుడు ముడివేయును. దీనిని 'బ్రహ్మముడి' అందురు. వదూవరుల ఐక్యతను బ్రహ్మముడి సూచిస్తుంది.

**ప్రధాన హోమము:**

పెండ్లి కుమారుడు అగ్నిని వేదమంత్రయుక్తముగా స్థాపిస్తాడు. నేతితో హోమం చేస్తాడు. అగ్నిని పెళ్లికి ప్రధాన సాక్షిగా భావించబట్టి, పెళ్లిళ్లను "అగ్నిసాక్షి వివాహం" అంటారు. ఇదే ప్రధాన హోమము.

**పాణిగ్రహణం:**

పాణిగ్రహణాన్ని కరగ్రహణమని కూడా అంటారు. వధువు కుడిచేతిని వరుడు తన కుడిచేతితో పట్టుకుంటాడు. ప్రభు ప్రకారం పాణిగ్రహణం, సప్తపది పూర్తికానప్పుడు అది వివాహం కానేరదు.

**సప్తపది:**

సప్తపది అనగా ఏడు అడుగులు అని అర్థం. వైవాహిక జీవనాన్ని ఏడడుగుల అనుబంధంగా చెబుతారు. సప్తపది పూర్తికానప్పుడు దానిని వివాహంగా ఏ న్యాయస్థానమూ అంగీకరించదు. పెళ్లి కూతురితో కూడి ఉత్తర దిశకు గాని, దక్షిణ దిశకు గానీ ఏడడుగులు నడవాలి.

శక్తిని ఒసగుటకు, బలము నిచ్చుటకు, వ్రతముల కొరకు, ఆనందము కొరకు, ఇంద్రియ విధులకు పుష్టినిచ్చుటకు, ఋతువుల కొరకు, గృహస్థాశ్రమమున చేసే హోమాల కొరకు విష్ణువు నిన్ను అనుసరించుగాక అనుచు ఏడడుగులు నడుస్తారు వధూవరులు.

ఈ సప్తపదిలో వధువు తన తల్లితండ్రుల గోత్రము వదిలి భర్త కూటమునందు చేరును కాబట్టి వధువు తన తల్లితండ్రుల కుటుంబానికి చెందిన ఆశౌచనియమాలను లాంఛన ప్రాయంగా పరిమితమైన కాలమే పాటించును. భర్త గోత్ర కూటమిని మాత్రమే అనుసరిస్తుంది.

**లాజహోమము:**

లాజహోమంలో పెండ్లి కూతురు సోదరుడు తెచ్చిన లేక ఇచ్చిన పేలాలను, పెళ్లికూతురు అగ్నిలో చల్లుతుంది. పిదప వధూవరులు అగ్ని ప్రదక్షిణం చేస్తారు. పిమ్మట పెళ్లికూతురు నడుముకు కట్టిన త్రాడును "నిన్ను వరుణ పాశము నుండి విడిపించుచున్నాను'' అనుచూ వరుడు విప్పును.

**నక్షత్ర దర్శనము:**

నక్షత్ర దర్శనమే వివాహ విధులలో ఆఖరి ఘట్టం. పెళ్లినాటి రాత్రి పురోహితుడు వదూవరులకు ధృవనక్షత్రాన్ని, పిదప అరుంధతీ నక్షత్రాన్ని చూపుతాడు.

తదుపరి మగ పెండ్లి వారింటిలో వధూవరులు గృహప్రవేశం చేస్తారు. పెండ్లి అయిన పిదప నాల్గవ రోజు 'గర్భాదానం' (Utials) జరుగుతుంది. నాల్గవ రోజు జరుగుటచే దానిని 'చతుర్ధకర్మ' అందురు. ఈ విధంగా హిందువుల వివాహ తంతు ముగస్తుంది.

## చట్టము మరియు మారుతున్న పరిస్థితులు:

ఆధునిక యుగంలో హిందూ వివాహ వ్యవస్థ అనేక ముఖ్యమైన మార్పులకు లోనయ్యింది. హిందూ వివాహ వ్యవస్థలో ఈ క్రింది ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయని రామ్ అహుజా (Ram Ahuja) వివరించారు. అవి:

1. వివాహ వ్యవస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యంలోనే మార్పు చోటుచేసుకుందని చెప్పవచ్చు. ధర్మమే ప్రధాన ప్రాతిపదికగా గల వివాహ లక్ష్యము, సహచరత్వము అనే లక్ష్యంగా మారినదని చెప్పవచ్చును.
2. వివాహ పద్ధతిలో మార్పు: బహు వివాహ పద్ధతి నుండి (అనగా బహుభర్తృత్వము, బహుభార్యత్వము) ఏక వివాహ పద్ధతికి మార్పు.
3. జీవిత సహచారి ఎంపిక పద్ధతిలో చోటుచేసుకున్న మార్పు. అనగా వరణ క్షేత్రములో మార్పు (అనగా కులాంతర వివాహాలు చేసుకొనుట). జీవిత సహచారిని ఎంపిక చేసుకొనుటలో మార్పు (అనగా కేవలం తల్లితండ్రులు ఎంపిక చేయుట నుండి తల్లితండ్రులు, మరియు వధూవరులు కలిసి ఎంపిక చేయుట, మరియు ప్రత్యేకంగా వధూవరులే భాగస్వాములను ఎంపిక చేసుకొనుట).
4. వివాహ వయస్సులో మార్పు: బాల్య వివాహాల నిషేధము, యుక్త వయస్సు వచ్చిన వారికి వివాహాలు
5. వివాహ స్థిరత్వంలో మార్పు: హిందూ సమాజంలో విడాకులు చోటుచేసుకొనుట.
6. వివాహంలో ఆర్థిక పరమైన అంశాలలో మార్పు అనగా వరకట్న పద్ధతిలో మార్పు.
7. వితంతు వివాహాలు అనుమతించుట.

అనేక అంశాల కారణంగా హిందూ వివాహ వ్యవస్థలో పై మార్పులు చోటుచేసుకున్నవి. ఆధునిక విద్య, సామాజిక ఉద్యమాలు, పాశ్చాత్యుల ప్రభావము, శాసనాలు మొదలైన ముఖ్యమైన అంశాలు వివాహ వ్యవస్థలోని మార్పులకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చును.

వివాహానికి సంబంధించిన శాసనాలు ఈ క్రింది అంశాలు.

1). వివాహ వయస్సు

2). వర ఎంపిక క్షేత్రము

3). జీవిత భాగస్వాముల సంఖ్య

4). వివాహ విచ్ఛిన్నత

5). వరకట్న చెల్లింపు

6). వితంతు పునర్వివాహము

ఈ అంశాలకు సంబంధించిన ముఖ్యమైన చట్టాలను ఈ క్రింది విధముగా చెప్పవచ్చును.

## హిందూ వితంతు పునర్వివాహ చట్టం (1856):

1829వ సం॥లో సతీసహగమన నిషేధ చట్టం ప్రవేశపెట్టడం జరిగింది. సతీసహగమన నిషేధ చట్టం అమలులోనికి వచ్చిన తరువాత సహగమనము రూపుమాయడంతో వితంతువుల సమస్య ఎదురైంది. సతీసహగమన నిషేధ చట్టం మానవతా దృష్టితో చేయబడింది. వితంతువులను సమాజంలో దయనీయ స్థితికి విడిచి పెట్టేయడం జరిగింది. వితంతవులలో మరీ పిన్నవయస్కులు, జీవితంలో ఏ సౌఖ్యాన్ని అనుభవించని అమాయకురాండ్రు. వయస్సు ఇంకా ముదరని వారు జీవితాంతమూ ఒంటరిగా జీవితాన్ని గడపడం దుర్భరము. భార్య చనిపోతే పురుషుడు వివాహమాడవచ్చు గానీ, భర్త చనిపోతే స్త్రీ పునర్వివాహం చేసుకోవడాన్ని హైందవ సమాజం అంగీకరించలేదు.

స్త్రీ విషయంలో జరుగుతున్న ఈ అన్యాయము అసంబద్ధమయినదని సంఘ సంస్కర్తలు భావించి, వితంతువులు వివాహం చేసుకోవడానికి సమాజము అంగీకరించవలెనని ఉద్యమం చేపట్టినారు. సనాతన ధర్మమనే పేరుతో కరుడుగట్టిన భావాలకు బానిసలుగా తయారయిన అనేకులు ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. ఈ అడ్డంకులను ఎదుర్కొనడానికి ఒకప్రక్క ప్రజలకు చట్టబద్ధం చేయడానికి ప్రయత్నించినారు. బ్రహ్మ సమాజము ఈ సమస్యపై కావించిన కృషి ప్రశంసనీయము. ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరు వీరేశలింగం గారు, కొండా వెంకటప్పయ్య గారు అపారమైన సేవ చేసినారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్ ఈ విషయంలో ఒక శాసనాన్ని ఆమోదించవలసిందని భారత ప్రభుత్వానికి 1855లో విజ్ఞప్తి సమర్పించినాడు. సంస్కరణ అంటే వ్యతిరేకత కన్నా ప్రజలలో అనుకూలత అధికంగా ఉన్నదని ప్రభుత్వం గ్రహించి, 1856లో హిందూ వితంతు వివాహ చట్టాన్ని ఆమోదించింది.

ఈ చట్టంలో వితంతు మళ్లీ వివాహం చేసుకోవడానికి అంతవరకు న్యాయరీత్యా ఉన్న అడ్డంకులను, అయోగ్యతలను తొలగించినారు. పునర్వివాహం చెల్లుతుందని, తద్వారా కలిగిన సంతతి కూడా న్యాయ సమ్మతమైనదేనని ఈ చట్టం ప్రకటించింది. అయితే, వివాహానికి యుక్త వయస్కురాలైన వితంతువు యొక్క సమ్మతి అవసరము. యుక్త వయస్కురాలు కాని వితంతు విషయంలో ఆమె తండ్రి గాని, తల్లి గాని, అన్న గాని లేదా తాత గాని అంగీకరిస్తే చాలు. పునర్వివాహం చేసుకున్నంత మాత్రాన భర్త మరణం ద్వారా సంక్రమించే ఆస్తి హక్కులు రద్దు కావు.

ఈ చట్టం వల్ల పునర్వివాహం చేసుకోగోరే వారికి ఆటంకాలు తొలగుతాయే తప్ప, ప్రత్యక్ష ప్రయోజనమేమీ ఉండదు. అయితే పరోక్షంగా మానసిక మార్పుకు మళ్లీ వివాహం చేసుకుంటే తప్పులేదనే భావం కలగడానికి ఉపకరిస్తుంది. ఈ మార్పు చాలా అవసరము. వితంతు అంగీకారము లేకుండా చట్టము వితంతు వివాహాన్ని ఏర్పాటు చేయజాలదు.

### బాల్య వివాహ నిరోధ చట్టము (1929):

యుక్త వయస్సు రాకమునుపే వివాహం చేయడం భారతీయ సంప్రదాయాలలో ఉంది. ఈ అలవాటు ఇతర సమాజాలలో కూడా లేకపోలేదు. అయితే, భారతీయ సమాజంలో మరీ బాల్య దశలో కూడా వివాహాలు చేస్తుండేవారు. పిల్లకి మూడు, నాలుగేండ్ల వయస్సు వచ్చిందో లేదో వివాహం జరిపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇది చాలా అనుచితమైన పద్ధతి. దీనివల్ల సమాజ సంబంధాలలో కొన్ని అక్రమాలు కూడా జరుగుతుండేవి. వ్యక్తి స్వాతంత్ర్య ధోరణులు ప్రపంచంలో వ్యాప్తి చెందడం మొదలయిన నాటి నుండి వివాహ విషయంలో వ్యక్తికి, తనంతట తాను జీవిత సహభాగినిని ఎన్నుకొనే అవకాశం ఉండవలెననే భావము క్రమముగా విస్తరించింది. కాబట్టి వివాహ వయస్సు పెంచవలెనని గత శతాబ్ది నుండి ఉద్యమము ప్రారంభమయినది.

ఆనాటి ప్రసిద్ధ సంఘ సంస్కర్తలు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చినారు. 1927లో హరవిలాస్ శారద బాల్య వివాహాలు నివారణకు బిల్లును ప్రవేశపెట్టినాడు. ఈ బిల్లుకు ప్రజల అండదండలు ఉన్నాయని గ్రహించి, ప్రభుత్వము 1929లో బాల్య వివాహ నిరోధక చట్టాన్ని (The Hindu Marriage Restraint Act) ఆమోదించింది. దీనినే శారదా చట్టమని కూడా పేర్కొంటారు. ఇది 1930 ఏప్రియల్ మొదటి తేదీన దేశమంతటా అమలులోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం వివాహ వయస్సు స్త్రీకి 15, పురుషునికి 18. ఈ పరిమితులు మించనిదే వివాహం చేయరాదు. ఎవరయినా అట్లాంటి బాల్య వివాహం చేసినట్లయితే వారు శిక్షార్హులు. బాల్య వివాహం జరుగబోతున్నట్లు ముందుగా తెలిస్తే, వివాహాన్ని ఆపు చేయమని న్యాయస్థానము ఉత్తర్వు జారీ చేస్తుంది. ఉత్తర్వును ఖాతరు చేయకపోతే జరిమానాకు, జైలు శిక్షలకు గురిఅవుతారు.

ఈ చట్టము అమలులోనికి వచ్చిన తర్వాత కూడా చట్టం విధించిన వయో పరిమితులు నిండకమునుపే వివాహాలు చేసిన సందర్భాలు విస్తృతంగా కాకపోయినా అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. కానీ, అవి కాలక్రమేణా తగ్గుతున్నవి. 1955 హైందవ వివాహ చట్టం (Hindu Marriage Act of 1955)లో వయః పరిమితి మొదట్లో స్త్రీకి 15, పురుషునికి 18 ఏండ్లని నిర్ణయించినా, తరువాత సవరణ ద్వారా స్త్రీకి 18, పురుషునికి 21కి పెంచినారు. ప్రజలు విద్యాధికులు అవుతున్న కొద్దీ చట్టంతో నిమిత్తం లేకుండానే యుక్త వయస్సు వచ్చిన తరువాత వివాహం చేసుకునే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. అంత మాత్రం చేత చట్టం ప్రాముఖ్యాన్ని తగ్గిస్తున్నట్లుగా భావించరాదు. గతంలో బాల్య వివాహాలకు సంబంధించి ప్రజలలో పరివర్తన తీసుకొనిరావడానికి ఈ చట్టము ఎంతగానో ఉపయోగపడింది.

**హిందూ వివాహ ఆశక్తతల తొలగింపు చట్టము (1946), (The Hindu Marriage Disabilities Removal Act, 1946):**

హిందువులలో ఒకే గోత్రమునకు, ఒకే ప్రవరకు చెందిన వారి మధ్య వివాహాలు నిషిద్ధము. ఒకే గోత్రమునకు, ఒకే ప్రవరకు చెందిన వారు ఒకే మూలపురుషుని నుండి ఉద్భవించిన వారిగా భావింపబడతారు. గనుక, వారి మధ్య అన్నాచెల్లెళ్ల బంధముంటుందని, వీరి మద్య వివాహాలు నిషేధింపబడినవి. హిందూ వివాహ ఆశక్తతల తొలగింపు చట్టము 1946 (hindu Marriage Disabilities Removal Ac, 1946) సగోత్ర, సప్రవరల మధ్య వివాహ నిషేధాన్ని తొలగించి, సగోత్ర, సప్రవర వ్యక్తుల మధ్య వివాహాలను చట్టబద్దం చేసింది. ఈ చట్టము స్థానములో హిందూ వివాహ చట్టము (1955) (Hindu Marriage Act, 1955) వచ్చినది.

**హిందూ వివాహ భద్రతా చట్టము 1949 (The Hindu Marriages Validity Act, 1949):**

కుల నియమాలు బహిర్వివాహాన్ని మాత్రమే అనుమతిస్తాయి. కులాంతర్వివాహాలు అనుమతించరు. హిందూ వివాహ భద్రతా చట్టము 1949 విశిన్న కులాల వారి మధ్య జరిగే వివాహాల్ని అన్నింటినీ నియమబద్ధమైనట్టుగా అంగీకరించింది. వీటితోపాటు ఉపకులాల మద్యన, తెగల మధ్యన వివాహాలన్నింటినీ చట్టబద్ధమైనవిగా అంగీకరించింది. ఈ చట్టము అంతర్మత వివాహాలను కూడా గుర్తించింది కానీ హిందూ-ముస్లిం వివాహాలను మాత్రం నిషేధించింది. 1954లో చేసిన ప్రత్యేక వివాహ చట్టము పై చట్టాన్ని రద్దు చేసింది.

ప్రత్యేక వివాహ చట్టము (1954): ఈ చట్టము వయస్సు, నిషేధింపబడ్డ బంధుత్వాలు, జీవించి వున్న భాగస్వామి (జీవిత), వివాహము చేసుకొనదల్చుకొన్న వారి మానసిక పరిస్థితి మొదలైన వాటి మీద కొన్ని నిషేధాలు విధించింది. ఆ షరతులు యీ క్రింది విధంగా ఉన్నాయి.

1) వివాహము చేసుకోదలచిన ఇరువర్గాలలో ఎవరికి జీవిత భాగస్వామి జీవించి ఉండకూడదు.

2) ఇరువర్గాలలో ఎవరూ కూడా పిచ్చి వాళ్లు కాని, మానసిక వైకల్యం కాని కలవారై ఉండకూడదు.

3) వరునికి 21 ఏళ్లు నిండిఉండాలి, వధువుకు 18 ఏళ్లు నిండిఉండాలి.

4) ఎవరూ కూడా నిషేధించిన బంధుత్వాలలో (తాత-మనవరాలు, సోదరి-సోదరుడు, తల్లితండ్రి-మొదలైనవి) వారు కాకూడదు.

**ప్రత్యేక వివాహ చట్టము** (Civil):

ఇది పౌర వివాహానికి ఏర్పాటు చేస్తుంది. మత పరమైన కర్మకాండతో చేసే పద్ధతికి ప్రాధాన్యనివ్వదు. ఇందులో కొన్ని నెరవేర్చవలసిన లాంఛనాలున్నాయి. వధువు వరుడు వారు నివసించే ప్రదేశంలో వివాహాలు నమోదు చేసే ఆఫీసరుకు ముప్పై రోజుల ముందు దరఖాస్తు ద్వారా తెలియపర్చాలి. దానిని ఆ ఆఫీసరు నోటీసు బోర్డుపై వుంచి ఎవరికైనా అభ్యంతరాలున్నచో 30 రోజులలో తెలియజేయవలసినదిగా చేస్తాడు. ఎవరికైనా సక్రమమైన అభ్యంతరాలున్నచో వివాహానికి వారు పెట్టుకొన్న దరఖాస్తు తిరస్కరిస్తారు. ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేకపోయినట్లయితే నోటీసిచ్చిన మూడు నెలలోపు వివాహాన్ని జరుపుతారు. ఇరువర్గాల వారికి నచ్చిన ఏ పద్ధతిలోనైనా వివాహం చేసుకోవచ్చు. వివాహం జరిపే సమయంలో ఇద్దరు సాక్షులు ఉండి దరఖాస్తుపై సంతకాలు పెట్టాలి. పౌర వివాహ చట్టబద్ధత ద్వారా ఇది మత పరిమితులను ఛేదించింది.

ఈ పౌర వివాహ చట్టం వలన విభిన్న మతనమ్మకాలు కలవారు, ప్రత్యేకించి హిందువులు, ముస్లిములు వివాహం చేసుకొనవచ్చును. ఈ చట్టం వివాహాన్ని మతపరంగా కాక, పౌర ప్రక్రియగా చేసేటందుకు దోహదం చేస్తుంది. వివాహాన్ని మత పరంగా చేసుకోవలసిన అగత్యం లేదు. ఇంతేగాక, ఈ వివాహ పద్ధతిలో వధూవరుల ప్రమేయము లేకుండా చేసింది. ఈ చట్టం ద్వారా యువతకు వర ఎంపికా స్వేచ్ఛ, వివాహ పద్ధతి ఎంపిక స్వేచ్ఛ లభించినవి. ఈ చట్టము విడాకులకు కూడా అవకాశాన్ని కల్పించినది. హిందూ వివాహ చట్టము (1955)లోని నిబంధనలే ఈ చట్టంలో విడాకులు మంజూరుకు కూడా వర్తిస్తాయి.

**హిందూ వివాహ చట్టము (1955), (The Hindu Marriage Act, 1955):**

హిందువుల వివాహానికి సంబంధించిన నియమాలను, నిబంధనలను క్రోడీకరించి ఈ చట్టాన్ని రూపొందించినారు. ఈ చట్టము 1955 నుంచి భారతదేశ మంతటికీ వర్తింపజేసినారు. ఈ చట్టములోని నిబంధనల ప్రకారము హిందూ స్త్రీ పురుషులు వివాహం చేసుకోవడానికి ఈ క్రింది షరతులను సంతృప్తి పరచవలెను.

1. ఏ ఒక్కరికీ భార్య గాని, భర్త గాని జీవించి యుండరాదు.
2. ఏ ఒక్కరూ పిచ్చివారై ఉండకూడదు.
3. పెండ్లికుమారుని వయస్సు 18, పెండ్లికుమార్తె వయస్సు 15 సంవత్సరాలు నిండవలెను. (సవరణ ద్వారా ఈ పరిమితులను 21కి, 18కి పెంచినారు).
4. ఆచారము అనుమతిస్తే తప్ప వివాహ సంబంధానికి వరుస కాని వారై ఉండకూడదు.
5. పెండ్లి కుమార్తె వయస్సు 18 లోపయితే, తల్లి, తండ్రి, అన్న, దగ్గరి బంధువులలో వరస క్రమాన్ని బట్టి ఏ ఒక్కరయినా అనుమతించవలెను. దగ్గరి వారు ఎవరూ లేకపోతే అనుమతితో నిమిత్తము లేదు. 18 ఏండ్ల లోపు బాలికకు వివాహం చేయదలచుకున్నప్పుడు కోర్టు దృష్టిలో ఆ అమ్మాయికి శ్రేయస్కరం కాదనుకొంటే వివాహం జరుగకుండా ఆపుచేయవచ్చు.

వివాహ విధానాన్ని గురించి నిర్బంధమేమీ లేదు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకోవచ్చు. హిందూ వివాహాలను నమోదు చేయవలెననే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించుకోవచ్చు. నమోదు చేయనంత మాత్రాన వివాహం రద్దు కాదు.

భర్త లేదా భార్య జీవించి ఉండగానే మళ్లీ వివాహం చేసుకుంటే చెల్లదు. చేసుకోరాని వాళ్లను చేసుకున్నా చెల్లదు. బలవంత వివాహము, నపుంసకత్వము, మతిస్థిమితం లేకపోవడం ఆధారంగా కూడా వివాహాన్ని న్యాయస్థానము రద్దు చేయవచ్చు. వివాహం నాటికే పురుషునిని ద్వారా పెండ్లి కుమార్తె గర్భం ధరించి ఉండి, ఈ విషయం పెండ్లి కుమారునికి మొదట్లో తెలియక,

తెలిసిన తరువాత ఆమెతో లైంగిక సంబంధం లేకుండా ఉన్నట్లయితే, పెండ్లయిన ఏడాదిలోగా న్యాయస్థానానికి ఫిర్యాదు చేసిన పక్షంలో, వివాహాన్ని రద్దు చేసే అవకాశం ఉంది.

భార్యాభర్తలలో ఏ ఒకరయినా రెండో వారి అనుమతి లేకుండా ఇంటి నుంచి తప్పుకున్నప్పుడు, ఫిర్యాదుపై వారి సంబంధాన్ని న్యాయస్థానము పునరుద్ధరించవచ్చు. అయితే, రెండవ వారు చట్టబద్దమయిన వేర్పాటును లేదా విడాకులను కోరవచ్చు.

రెండేండ్లుగా వదిలి ఉండడం, హింసించడం, అంటువ్యాధులకు లోనుకావడం, పరులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవడం మొదలైన కారణాల మీద విడిపోవడానికి ఏ ఒక్కరు కోరుకున్నా, న్యాయస్థానము వారి వేర్పాటును అనుమతిస్తుంది.

**విడాకుల చట్టము:**

హైందవ సమాజంలో వివాహమనేది విడదీయరాని పవిత్ర బంధమనే అభిప్రాయము ప్రబలి ఉంది. కానీ, మారుతున్న విలువలను బట్టి ఈ అభిప్రాయంలో మార్పు వస్తున్నది. భార్యాభర్తలకు ఒకరంటే మరొకరికి గిట్టకపోతే, దుర్భరమైన జీవితం గడపటంకంటే విడిపోవడం మంచిదని భావించడం జరుగుతున్నది. కాబట్టి ఆధునిక నాగరిక సమాజంలో వలె హిందూ సమాజంలో కూడా విడాకులను చట్టబద్దం చేసినారు.

1955లో అమలులోకి వచ్చిన హిందూ వివాహాల చట్టము విడాకుల విషయంలో సమగ్రమైన నిబంధనలను రూపొందించినది. అది దేశ వ్యాప్తంగా వర్తిస్తుంది. భార్యాభర్తలలో ఏ ఒక్కరైనా ఈ దిగవ పేర్కొన్న వాటిలో ఏ కారణము చేతయినా వివాహాన్ని రద్దు చేయమని కోరితే, న్యాయస్థానము విడాకులకు అనుమతిస్తుంది. ఇద్దరిలో ఏ ఒక్కరైనా అవినీతికి అలవాటు పడడం, మరొక మతాన్ని పుచ్చుకుని హైందవత్వాన్ని కోల్పోవడం విడాకులకు విజ్ఞప్తి పెట్టుకున్న నాటికి మూడేండ్లుగా ఎప్పటికీ నయం గాని అస్థిమిత మనస్సుతో ఉండడం.

1. కుష్టు సుఖవ్యాధులు ఉండడం

2. సన్యాసం స్వీకరించడం

ఏడేండ్లుగా కన్పించకుండా జీవిం ఉన్నాడన్న విషయం కూడా తెలియకపోవడం. న్యాయరీత్యా విడిపొమ్మని న్యాయస్థానం డిక్రీ ఇచ్చిన తరువాత రెండేండ్లకు కూడా సంసారం చేయకపోవడం విడిపోయిన భార్యాభర్తలకు కొన్ని కారణాల మూలంగా వివాహ సంబంధాన్ని పునరుద్ధరించుకోమని న్యాయస్థానం కోరినా, ఆ కోరికను రెండేండ్లయినా కాతరు చేయకపోవడం.

విడాకులు కోరవలెనంటే, వివాహమైన తరువాత మూడు సంవత్సరములు గడుపవలెను. అయితే, కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రతివాది వాదిని ఘోరంగా హింసించి బాధపెడుతుంటే న్యాయస్థానము విడాకుల పరిశీలనకు మూడేండ్లు నిండక ముందే అనుమతించవచ్చు. విడాకులకు అనుమతినిచ్చిన ఒక సంవత్సరం తరువాత తిరిగి వివాహం చేసుకోవడానికి అభ్యంతరము ఉండదు. విడాకులిచ్చినా, వివాహాన్ని రద్దు చేసినా, అప్పటి గర్భం ధరించి ఉండుట ద్వారా గానీ, అంతకు ముందుగానే కలిగిన పిల్లలు గానీ, ఆ ఇరువురి సంతానంగానే పరిగణించడం జరిగి, తల్లిదండ్రుల ఆస్తిపై హక్కును పొందిఉంటారు.

విడాకులు పొందిన స్త్రీ పోషణ భారాన్ని ఆమెకు వ్యక్తిగతంగా ఉన్న ఆస్తిని బట్టి భర్త ఆర్థిక వక్తిని బట్టి న్యాయస్థానము భరణము రూపంలో నిర్ణయిస్తుంది. ఈ భరణం పొందిన స్త్రీ పర పురుషునితో సంబంధం పెట్టుకున్నా తిరిగి వివాహం చేసుకున్నా భరణం రద్దవుతుంది.

విడిపోయిన భార్యాభర్తల మైనరు సంతానం విషయంలో వారి భద్రత గురించి న్యాయస్థానము వెంటనే తాత్కాలిక ఉత్తరవు జారీ చేస్తుంది. వారికున్న ఆస్తిపాస్తులను పరిశీలించిన మీదట చివరి ఉత్తర్వు ఆ తరువాత జారీ అవుతుంది.

ఈ చట్టం ప్రకారం న్యాయస్థానం కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ముందుగా వీలైతే రాజీ కుదర్చడం మంచిది. ఆ తరువాత విడాకులు కోరేవారు చట్ట ప్రయోజనాలను దుర్బుద్ధితో వినియోగించుకోకూడదు. అవతలి వారు ఎన్నో

బాధలు పెట్టినారని ఫిర్యాదు చేసి ఉండి కూడా విచారణ మధ్యలో వారిని క్షమించినానని ఫిర్యాది ప్రకటించకుండా, అనవసరంగా విచారణ జాప్యం జరగకుండా ఉండవలెను. ఈ చట్టంలోని నిబంధనలు విడాకులు కోరుకునే వారికి ఉపయోగకరంగా ఉన్నాయి.

**వరకట్న నిషేధ చట్టము (1960), (The Probation of Dowry Act):**

నేటి సమాజాన్ని పీడిస్తున్న సమస్యలలో వరకట్నము ఒకటి. ఈ సమస్య మూలంగా దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న తల్లిదండ్రులున్నారు. యువతులు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఈ సమస్యను గురించి సాహిత్యము, రేడియో, సినిమా, ఇతర ప్రచారక సాధానాల ద్వారా చర్చించడం జరుగుతుంది. సంస్కరణల ద్వారా మార్పు తేవాలని అనేక ప్రయత్నాలు జరిగాయి. ఈ వరకట్నాన్ని అరికట్టడానికి శాసన బద్ధమైన చర్యలు కూడా తీసుకొనవలెనన్న కృషి ఫలితమే వరకట్న నిషేధ చట్టమునకు పునాది. ప్రభుత్వము వరకట్న నిషేధ బిల్లును 1960లో ఆమోదించింది. ఈ చట్టము ప్రకారము వివాహ సందర్భంలో పెండ్లి కుమార్తె తండ్రి పెండ్లి కుమారునికి ఏ రూపములోనయినా కట్నమియ్యరాదు. ఆ తరువాత కూడా కానుకలు మొదలైనవి ఏ రూపంలోనూ ఇవ్వకూడదు. కట్నమిచ్చినా, పుచ్చుకున్నా ఈ చట్టం క్రింద జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెంటినీ విధించవచ్చు.

అయితే, ఈ చట్టము సమాజంపై నామమాత్రపు ప్రభావమును మాత్రమే కలిగియున్నదని చెప్పవచ్చు. కట్నమివ్వడం నేరమని తెలిసినా, పుచ్చుకోవడం నేరమని తెలిసినా ఈ ఆచారము కొనసాగుతూనే ఉన్నది. ఈ సమస్య పరిష్కారం కావలెనంటే సమాజంలో స్త్రీ పురుషునితోపాటు అన్ని రంగాలలోనూ సమాన స్థాయిని పొందవలెను. ఆర్థిక అసమానతలు తొలగిపోవలెను.

## ముఖ్య పదములు:

| | |
|---|---|
| 1. క్రాస్ కజిన్ : (Cross Cousin) | మేనమామ కూతురు, మేనత్త కూతురు |
| 2. దాన : (Dana) | బహుమతి |
| 3. దేశ ఆచార : (Desa Achara) | స్థానిక పద్ధతి |
| 4. ధర్మపత్ని : (Dharma Patni) | భార్య |
| 5. మంత్ర : (Mantra) | మతపరమైన కర్మకాండలలో ఉచ్చరించు శోకములు |
| 6. సగోత్ర : (Sagotra) | స్వంత గోత్రము |
| 7. సంస్కార : (Samskara) | మతపరమైన కర్మకాండ, పవిత్రత |
| 8. స్త్రీ ధనం : (Stri Dhana) | తల్లిదండ్రులు గానీ, భర్త గానీ ఒక స్త్రీకి ఇచ్చు ధనము. |
| 9. స్వయంవర : (Swayamvar) | స్త్రీ స్వయముగా భర్తను ఎంపిక చేసుకొను పద్ధతి |

## నమూనా ప్రశ్నలు:

1. భారతీయ సమాజములోని వివిధ వివాహ పద్ధతులను తెలుపుము.
2. సగోత్ర, సపిండ వివాహ నిషేధములను తెలుపుము.
3. తల్లితండ్రుల వర నిర్ణయము. వధూవరుల స్వయంవర నిర్ణయములను గూర్చి వ్రాయుము.
4. సాంప్రదాయ హిందూ వివాహ రూపములను (అష్ట వివాహాలు) తెలుపుము.

5. హిందూ వివాహ పవిత్రతను వివరింపుము.

6. హిందూ వివాహములోని మతపరమైన కర్మకాండలను తెల్పుము.

7. హిందూ వివాహము అవిచ్ఛిన్నమైనది-చర్చింపుము.

8. హిందూ వివాహ రూపములను మార్చి చట్టములను వివరింపుము.

9. 1955, హిందూ వివాహ చట్టము హిందూ వివాహ వ్యవస్థలో తెచ్చిన మౌళిక మార్పులను తెలుపుము.

## చదవదగిన పుస్తకములు:


1. అహుజా, రామ్ : ఇండియన్ సోషల్ సిస్టమ్ : జైపూర్ : రావత్ పబ్లికేషన్స్ : 1993.

Ahuja Ram : Indian Social System : Jaipur Rawat Publications : 1993.

2. కపాడియా,కె.ఎమ్ : మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా, ఢిల్లీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 1966.

Kapadia K.M G Marriage and Family in India Delhi, Oxford University Press 1966.

3. పాండే, రాజ్‌బాలీ : హిందూ సంస్కారాస్ : బెనారస్ : విక్రమ్ పబ్లికేషన్స్ 1949.

Pande, Raj Bali : Hindu Samskaras Banaras : Vikram Publications 1949.

4. ప్రభు, పండరినాథ్. హెచ్ : హిందూ సోషల్ ఆర్గనైజేషన్ : ఎ స్టడీ ఇన్ సోషియో, సైకలాజికల్ అండ్ ఐడియలాజికల్ ఫౌండేషన్స్ బొంబే : పాప్యులర్ ప్రకాషన్ 1963.

Prabhu, Pandarinath HG Hindu Social Organisation A Study in Socio, Psychological and Ideological Foundations : Bombay : Popular Prakashan 1963.

5. రావు, జి.సి.వి. సుబ్బా : ఫ్యామిలీ లా ఇన్ ఇండియా, హైదరాబాద్, ఏసియా లా హౌస్ 1989.

Rao, G.C.V. Subba : Family Law in India, Hyderabad, Asia Law house 1989.

**పాఠం-11**

# ముస్లింలలో వివాహ వ్యవస్థ

**విషయక్రమం:**


**11.0 ఉద్దేశ్యము**

**11.1 పరిచయము**

**11.2 రక్త సంబంధం**

**11.3 బంధుత్వము**

**11.4 ముతా వివాహము**

**11.5 నిఖా వివాహము**

**11.6 మెహర్**

**11.7 విడాకులు**

**11.7.1 తలాఖ్**

**11.7.2 భార్యాభర్తల పరస్పర అంగీకారంతో విడాకులు**

**11.7.3 చట్టపరమైన కారణాల వలన భార్య విడాకులు కోరుట**


## 11.0 ఉద్దేశ్యము:

ముస్లిములలో వివాహ వ్యవస్థను వివరించుట.

## 11.1 పరిచయము:

ముస్లిం వ్యవస్థలో రెండు ఉప విభాగములు కలవు. అవి: 1). సున్నీలు 2). షియాలు. ఈ విభాగాల మధ్య వివాహ నిషేధాలు లేనప్పటికీ, ఈ వర్గాలలోని ప్రతి వ్యక్తి తమ సభ్యులతోనే బాంధవ్యాన్ని ఇష్టపడతాయి. ఈ ఉప విభాగాలైన సున్నీలు, షియాలు అంతర్వివాహ సమూహాలు అని చెప్పవచ్చు.

భారతీయ ముస్లిములు కూడా ఇతర దేశాలలోని ముస్లిముల వలేనే పెళ్లిళ్ల విషయంలో ఇస్లాం మత విధులను అనుసరిస్తారు. ఇస్లాం మతంలో లైంగిక వాంఛ సంతృప్తి కొరకు, సంతానోత్పత్తి కొరకు స్త్రీ పురుషుల మధ్య సంబంధాన్ని ధృవీకరించడానికి వివాహం జరగాలనే భావన ఉంది. కనుక లైంగిక వాంఛల సంతృప్తి, సంతానోత్పత్తి ముస్లిము వివాహ వ్యవస్థ ప్రధాన లక్ష్యాలుగా చెప్పవచ్చు. సంతానం అంశంలో హిందువులలో ఉన్న పద్ధతి ముస్లిములలో లేదు. హిందువుతు సంతానము లేనప్పుడు పిల్లలను దత్తత తీసుకుంటారు. ఈ దత్తత తీసుకోబడిన పిల్లలు చట్టప్రకారము ఆ దత్తత తీసుకున్న వారి స్వంత పిల్లలు గానే పరిగణింపబడతారు. అయితే, ముస్లిములలో ఈ దత్తత స్వీకారం పద్ధతి లేదు. కనుక సంతానాన్ని పొందడానికి వివాహము ఒక్కటే ముస్లిములకు మార్గము.

వివాహానికి ముందు 'A' కి 'B' ద్వారా సంతానం ఉన్నట్లయితే, 'A' ,'B'లకు వివాహమైన పిదప ఆ సంతానం చట్టబద్ధమైన సంతానం గానే పరిగణింపబడతారు అని రోమన్ చట్టము పేర్కొన్నది. ఈ పద్ధతి ముస్లిమ్ చట్టములో లేదు. అటువంటి సంతానము ముస్లిము చట్టము ప్రకారము అక్రమ సంతానము.

ముస్లిం చట్టము దృక్పథంలో ఒక బిడ్డ క్రమబద్ధమైన సంతానంగా పేర్కొనబడవలెనంటే గర్భధారణ సమయానికే ఆ బిడ్డ తల్లితండ్రులకు వివాహమై ఉండవలెను. కాబట్టి మిధున సంబంధము కంటే, క్రబద్ధమైన సంతానం కోసం ముస్లిములకు వివాహము అవసరము. అటువంటి సందర్భాలలో వివాహం సంతానాన్ని క్రమబద్ధం చేయడం కోసమే అయితే అటువంటి వివాహం కూడా క్రమబద్ధమైన, నిబద్ధత కలిగిఉండాలి.

ముస్లిం వివాహ నిబద్ధతకు (Valid)ముస్లిం వ్యక్తిగత చట్టము (Muslim Personal Law) ఈ క్రింది నియమాలను నిర్దేశించింది.

ఒక ముస్లిం యువకుడు ముస్లిం యువతినే కాక, ముస్లిం కాని 'కితాబియా'ను కూడా వివాహ చేసుకొనవచ్చును. ఖురాను తప్ప ఏ ఇతర గ్రంథం ద్వారానైనా తెలియపరచబడిన మతం పట్ల విశ్వాసం కలిగిన పురుషుని లేదా స్త్రీని 'కితాబియా'గా పిలుస్తారు.

ఈ నిబంధన ముస్లిం యువతి విషయంలో చాలా కఠినంగా అమలు పరచబడుతుంది. ఎటువంటి పరిస్థితులలోను కూడా ఏ ముస్లిం యువతి కూడా ముస్లిం మతానికి చెందని యువకుని వివాహమాడరాదు. కితాబియాతో వివాహ కూడా ముస్లిం యువతికి నిషేధము.

ముస్లిం యువకుడు విగ్రహారాధన చేసే యువతిని వివాహమాడే అంశంలో సున్నీలకు, షియాలకు మధ్య భిన్నత్వమున్నది. సున్నీలు ఇటువంటి వివాహాన్ని చిన్నచూపు చూసి, దానిని అక్రమమైన వివాహంగా భావిస్తారు. ఆ స్త్రీ ఏ సమయంలోనైనా ఇస్లాం మతము స్వీకరించి, ఆ వివాభదీహాన్ని సక్రమము చేసుకోవచ్చును. అప్పటిదాకా ఆ వివాహము అక్రమమైనదే. కానీ, షియాలలో ఈ వివాహము చెల్లదు. వారు దానాని సమ్మతించరు.

వివాహం ఒక క్రమబద్ధమైన లైంగిక సంబంధాన్ని ఏర్పాటు చేస్తుంది. ఒక వ్యక్తికి దగ్గరి బంధువులతో లైంగిక సంబంధాలను నిరోధించే ఉద్దేశ్యముతో జీవిత భాగస్వాములను ఎంచుకోవడంలో కొన్ని పరిమితులను వివరించారు. ముస్లింలలో కొన్ని రకాల బంధువులతో వివాహం చేసుకోవడం విద్యుక్త ధర్మంగా భావించే నియమాలున్నాయి. అదే విధంగా అవాంఛనీయమని భావించే సూత్రాలు వాటిని నిషేధిస్తూ పరిమితులు ఉన్నాయి.

## 11.2 రక్త సంబంధం (Consanguinity):

బంధుత్వ ఆధారంగా ఈ క్రింది సంబంధీకులతో వివాహం నిషిద్ధము.

(1) తల్లి మరియు కొడుకు (Mother and Son)

(2) నాయనమ్మ మరియు మనవడు (Grand Mother and Grand Son)

(3) అన్న మరియు చెల్లెలు (Brother and Sister)

(4) మేనమామ మరియు మేనకోడలు (Uncle and Niece)

(5) మేనల్లుడు మరియు మేనత్త (Nephew and Aunt)

## 11.3 బంధుత్వము (Affinity):

వివాహం ద్వారా ఏర్పడిన ఈ క్రింది బంధువులను వివాహమాడరాదు.

(1) భార్య యొక్క తల్లి లేక నాయనమ్మ లేక అమ్మమ్మ

(2) భార్య యొక్క కూతురు లేక మనవరాలు

(3) తండ్రి యొక్క భార్య లేక తండ్రి పూర్వీకులు

(4) కొడుకు భార్య లేక కొడుకు యొక్క కొడుకు లేక కూతురు కొడుకు

**పెంపకము:**

పెంపుడు తల్లి తల్లితో సమానము. కనుక ఆమెతో వివాహము నిషిద్ధము.

ముస్లిం మతములో వధువు 'కన్య'యే అయి ఉండాలనే నియమము లేదు. ముస్లిం యువకుడు వితంతువునైనను లేక విడాకులు తీసుకున్న యువతినైననూ వివాహమాడవచ్చును. కానీ, కొన్ని షరతులకు లోబడి వితంతువును గానీ, విడాకులు తీసుకున్న స్త్రీని గానీ ప్రత్యేక పరిస్థితులలో వివాహం చేసుకొనవచ్చును. ఒక వితంతువు భర్త చనిపోయిన తరువాత నాలుగు నెలల పది రోజులు 'ఏకాంతంగా' జీవించాలి. ఈ కాలమును 'ఇద్దత్' అంటారు. భర్త చనిపోవునాటికి ఆమె గర్భవతి అయితే, ఈ ఇద్దత్ కాలంలో ప్రసవించకపోతే, ఈ ఇద్దత్ కాలమము ప్రసవించేదాకా పొడిగించబడుతుంది. ఇద్దత్ కాలములో వివాహం చేసుకొనరాదు.

ఈ పరిమితి విడాకులు తీసుకున్న యువతికి కూడా సమానంగా వర్తిస్తుంది. విడాకులు తీసుకున్న ముస్లిం స్త్రీ తన వైవాహిక జీవితంలో భర్తను 'కలిసినట్లయితే' (Consummated) తిరిగి వివాహం చేసుకొనుటకు ముందు మూడు చాంద్రాయణ మాసములు 'ఏకాంతంగా' (Seclusion) జీవించాలి. ఆమె బహిష్టు అయినట్లయితే, మూడు బహిష్టుల కాలాన్ని ఇద్దత్ కాలంగా పరిగణించాలి. ఆమె గనుక గర్భవతి అయినట్లయితే ప్రసవించుటతో ఆమె ఇద్దత్ పూర్తవుతుంది. ఆమె బహిష్టు కోసం ఎదురు చూడవలసిన అవసరం లేదు. విడాకులు తీసుకున్న ముస్లిం స్త్రీ వైవాహిక జీవితంలో భర్తతో కలియనట్లయితే 'ఇద్దత్' కాలాన్ని పాటించనవసరం లేదు.

ఇద్దత్ కాల పరిశీలన ఒక స్త్రీ గర్భవతియో కాదో నిర్ణయించేందుకు నిర్దేశించబడింది. ఇద్దత్ కాలములో ఉన్న స్త్రీని వివాహమాడుట క్రమబద్ధము కాదు. ఇద్దత్ కాలములో ఉన్న స్త్రీని తెలిసి వివాహము చేసుకొనుట షియాలలో నిషిద్ధము.

ముస్లిం యువకుడు ఏకకాలంలో ఒకరి కన్నా ఎక్కువ మందిని వివాహమాడవచ్చును. ఒక ముస్లిం వ్యక్తి ఒకేసారి నలుగురు భార్యలను కలిగియుండవచ్చును. ఈ సంఖ్యను అధిగమించకూడదు. అయిదవ స్త్రీని వివాహము చేసుకోవడము నిషేధము కాకపోయినప్పటికీ (Batil) క్రమబద్ధ వివాహము (Valid Marriage Sahih) కానేరదు. దానికొక క్రమబద్ధము కాని వివాహము (Faid) కాని వివాహముగా భావిస్తారు. కానీ, యిది తాత్కాలికము మాత్రమే. ఆ వివాహానికున్న కళంకాన్ని తుడిచి దాని క్రమబద్ధము చేస్తే ఆ వివాహము సక్రమమైన వివాహమౌతుంది. అప్పటికతనికున్న భార్యలో ఎవరికైనా విడాకులిచ్చినచో ఆ అయిన వివాహము క్రమబద్ధమైన వివాహంగా మారుతుంది.

ఎక్కువ మంది భార్యలున్నప్పుడు, అప్పుడున్న భార్యకు తాను వివాహము చేసుకోబోయే వధువుకు చట్టం నిషేధించే ఏ విధమైన సంబంధం ఉండకూడదు. వధువు భార్యకు సోదరి కాని, పిన్ని కాని లేక మేనకోడలు కాని అయినట్లయితే అది చట్టం నిషేధించే బంధుత్వమవుతుంది. ఆ విధంగా పరస్పరం బంధుత్వమున్న స్త్రీలు ఒక ముస్లిం పురుషునికి భార్యలు కాకూడదు. ఇది చట్ట పరంగా నిషేధించబడిన బంధుత్వము. ఒకవేళ ఈ విధమైన బంధుత్వమున్న వధువును వివాహం చేసుకుంటే, భార్యకు విడాకులిచ్చి ఆ వివాహాన్ని క్రమబద్ధమైన దానినిగా చేసుకోవచ్చును.

## 11.4 ముతా వివాహము:

ఇస్లాం మతంలోని షియాలు శాఖలో ముతా వివాహాలు జరుగుతుండేవి. ముతా అనగా అరబ్బీలో సౌఖ్యం, ఆనందం అని అర్థము. ముతా వివాహమనగా సౌఖ్యం కోసం, ఆనందం కోసం స్త్రీ పురుషుల మధ్య కుదిరిన ఒప్పందం అని చెప్పవచ్చు. 'ముతా' అంటే తాత్కాలికంగా చేసుకునే పెళ్లి అని అర్థం చెప్పుకోవాలి. మహమ్మద్ ప్రవక్త కాలం వరకూ కూడా ఈ ప్రాచీన పద్ధతి వివాహాలు జరుగుతుండేవి. ఆనందం అనుభవించడానికి తాత్కాలికంగా ఒక స్త్రీని వివాహం చేసుకునే పద్ధతిని ముతా వివాహమంటారు. ఈ వివాహ బంధం తాత్కాలికంగా కొంత కాలం మాత్రమే కొనసాగుతుంది. దీనిలో వివాహ విషయంలో వధువు బంధు వర్గం యొక్క ప్రసక్తి గాని, వారి పాత్ర కానీ ఏమీ ఉండదు. వధూవరుల పరస్పర అంగీకారంతో ఈ వివాహం జరుగుతుంది. ఈ పద్ధతిలో స్త్రీ పురుషులు తాము భార్యా భర్తలుగా ఎంత కాలం కలిసి జీవనం సాగించాలో ముందుగానే ఒక నిర్ణయాన్ని తీసుకుంటారు. ఈ వివాహ కాలం పరిసమాప్తి కాకుండా స్త్రీ విడాకులను తీసుకునే అధికారాన్ని కలిగియుండదు. నిర్ణీత కాలం పరిసమాప్తి అయిన తరువాత మాత్రమే వివాహ సంబంధాలు రద్దవుతాయి. స్త్రీ యొక్క సంతానాన్ని ఆమె బంధువులు చూస్తారు. స్త్రీకి వారసత్వపు హక్కు గానీ, భర్త నుండి పోషణ బాధ్యత పొందే హక్కు గానీ లేవు. ఈ తాత్కాలిక వివాహం ద్వారా ఒక స్త్రీతో లైంగిక జీవనాన్ని కొనసాగిస్తున్నందుకు వివాహం చేసుకున్న స్త్రీకి కొంత సొమ్మును భర్త ఇస్తుండేవాడు. ఈ పద్ధతి వేశ్యావృత్తిని పోలినందున, ఈ ముతా వివాహ పద్ధతిని మహమ్మద్ ప్రవక్త వ్యతిరేకించినాడు. అయినా ముతా వివాహాలు అక్కడక్కడా చెదురుమదురుగా జరుగుతున్నట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. ముతా వివాహం వలన స్త్రీకి లైంగిక పరమైన స్వేచ్ఛ ఎక్కువగా పెరుగుతుంది. ఈ విధమైన లైంగిక వ్యాపారం కట్టుబాట్లు, ఆచారాలను క్రమబద్ధం చేయడానికి ఇస్లాం మతం ప్రయత్నించింది. ముతా వివాహాలను మహమ్మదీయులు రాను రాను వ్యతిరేకించడం మొదలు పెట్టినారు.

## 11.5 నిఖా వివాహము :

ఇస్లాం మతంలో పెండ్లి అనేది పవిత్ర ఒప్పందము.మహమ్మదీయ సమాజంలో వివాహ సాంగత్యాన్ని సూచించే అరబిక్ పదమే 'నిఖ'. మహమ్మదీయుల ఆదర్శ సూత్రాలననుసరించి స్త్రీ, పురుషులు మిధున సంబంధాన్ని చట్టబద్ధం చేసి, కొన్ని ధర్మాలను, విధులను నిర్వర్తించడానికి ఉద్దేశింపబడిన ఒప్పందమే 'నిఖా'. నిఖా ఒకవైపు సమాజామోదము పొందినది. మరొక వైపు మత సంబంధమైనది. అతి పవిత్రమైనది. నిఖా వివాహ పద్ధతి, ఇస్లాం మత దృఢతకు చక్కని పునాదులు వేసి సర్వసమ్మతం గావించింది. నిఖా సమయంలో ఇద్దరు ప్రతినిధులు, ఇరువురు పురుష సాక్షులు అవసరం. సాక్షులు లేకుండా నిఖా జరుపడానికి వీలులేదు. మైనారిటీ తీరని వారి విషయంలో ఇరు పక్షాలలో ఇరు పక్షాలలోని సంరక్షకులు గాని లేదా వారిచే నియమించబడిన ఇతర వ్యక్తులు గానీ ప్రతినిధులుగా నిఖా జరుగుతుంది.

ఒక పక్షం వారు ఈ వివాహాన్ని దాఖలు చేయగా (ప్రతిపాదించగా) మరొక పక్షం వారు బలపరుస్తారు. నిఖా దాఖలు కావడం, బలపరచడం రెండూ ఒకే పర్యాయం జరగాలి.

నిఖా ప్రక్రియ జరిగే ముందు ఎండు ఖర్జూరా, పంచదార, పంచదార పూసిన శనగలు, ధూరా (పెళ్లి కుమారుడు) ముందు ఉంచుతారు. నిఖా సమయంలో సాధారణంగా ఇద్దరు ప్రతినిధులు సాక్షులుగా ఉంటారు. ఈ సాక్షులలో ఒకరు వరుని పక్షం వారు. మరొకరు వధువు పక్షం వారు ఉంటారు. వధువు తరపున సాక్షి (ముస్తాహిద్) వధువు దరికి వెళ్లి కుదిర్చిన వ్యక్తిని వరునిగా అంగీకరిస్తుందా అన్న విషయాన్ని మూడుసార్లు అడిగి తెలుసుకుంటాడు. అంగీకారం లభించిన తరువాత ముస్లాహిద్ తిరిగి వచ్చి నిఖాకు వచ్చిన పెద్దల మధ్య కూర్చుంటాడు. అప్పుడు వరుని పక్షపు ముస్తాహిద్ ఆ స్త్రీని భార్యగా స్వీకరిస్తున్నావా అని వరుని వరుసగా మూడుసార్లు ప్రశ్నిస్తాడు. వరుని అంగీకారానంతరం ఇరు పక్షపు ముస్తాహిద్‌లు నిఖాకు వచ్చిన బాధ్యత గల కొందరు పెద్దలు నిఖాను ప్రకటించి నిఖానామా (వివాహ పత్రం) పై సంతకాలు పెడతారు. ఈ ప్రకారంగా నిఖా ఒప్పందం ముగుస్తుంది. దాంపత్య జీవనం నిఖా అనంతరం చట్ట పరమైన సర్వే సమ్మతమౌతుంది.

## 11.6 మెహర్:

చారిత్రక దృష్టితో చూసినట్లయితే మెహర్ అనేది స్త్రీని అమ్మజూపే భావం వెనుక దాగియున్న అభిప్రాయంగా కొంతకాలం చలామణి అయింది. మహమ్మదీయ వివాహ విధానంలో 'మెహర్' అతి సాధారణమైనది. అది ఒక విచిత్రమైన న్యాయ భావన. వివాహానంతరము భార్య భర్త నుండి పొందే ఆస్తిని మెహర్ అని పిలుస్తారు. పురుషుడు తన భార్యను విలువైన, గౌరవనీయ వ్యక్తిగా భావించి, ఆమెకు కొంత మొత్తాన్ని చెల్లించే పద్ధతి మెహర్. మెహర్‌ను భార్య తల్లిదండ్రులకు, బంధువులకు చెల్లించవలెను. మెహర్ భార్య విలువైన వ్యక్తి అని తెలియజేయుటకు సంకేతంగా ఏర్పాటు చేయబడింది. దీనివల్ల భార్యకు ఒక సామాజిక అంతస్తు, ఇతరుల దృష్టిలో ఆమెకు గౌరవ భావం కలుగుతాయి.

ముస్లింల వివాహంలో మెమర్ ఒక అంతర్భాగ లక్షనం. వివాహ సమయంలో వ్రాయబడి వివాహ పత్రం (నిఖానామా)లో దీని విలువను తెలియజేస్తారు. కుటుంబ గౌరవం కోసం యువతి తల్లితండ్రులు వరుని కుటుంబం నుండి వీలైనంత ఎక్కువ మొత్తాన్ని రాబట్టడానికి ఉద్దేశింపబడిన మక్కును మెమర్‌గా గుర్తిస్తారు. మెహర్ రెండు రకములు.

1. ము అజ్జల్
2. మువజ్జర్

ము అజ్జల్ అనగా స్త్రీకి వెంటనే చెల్లించేది. మువజ్జర్ అనగా కొంతకాలం తరువాత చెల్లించేది.

మెహర్ భార్యను డబ్బు రూపంలో విలువ కట్టబడి కొనుగోలు వెలకాదు. మెహర్ విలువ ఎంత ఉండాలి అనే అంశం నిర్దిష్టంగా పేర్కొనబడలేదు. అది అంగీకారం కుదుర్చుకునే ఇరుపక్షాల సామాజిక అంతస్తుపై ఆధారపడి ఉంటుంది. కొన్ని కుటుంబాలలో సంప్రదాయం ప్రకారం మెహర్ నిర్ణయిస్తారు.

సాధారణంగా మెహర్ మొత్తాన్ని వివాహం నిర్ణయించుకునే సందర్భంలోనే నిర్ణయించడం జరుగుతుంది. అరుదైన సమయాలలో నిఖా జరిగేటప్పుడు మరికొంత ఎక్కువ మొత్తం మెహర్‌ను స్త్రీ కోరవచ్చు.

ము అజ్జల్ జరిగిన ప్రదేశంలో అమలులో ఉన్న సాంఘీక ఆచారాలు, ధర్మాలు ప్రకారం మెహర్ మొత్తాన్ని తుదిగా నిర్ణయించడం పరిపాటి. సర్వసాధారణంగా వివాహాన్ని నిర్వహించే ఖాజీలు తమ వద్దనున్న రిజిస్టరులో మెహర్ మొత్తాన్ని నమోదు చేస్తారు.

షియా ముస్లింలలో కుమారుడు మూల్యం చెల్లించని స్థితిలో తండ్రి చెల్లించి తీర్చవలెను. షియా సూత్రం ప్రకారం భార్య నిర్ధారించిన మొత్తాన్ని పొందుటకు యోగ్యురాలు. కొన్ని సందర్భాలలో వరుడు డాంబిక ప్రదర్శన కోసం ఎక్కువ మొత్తాన్ని బహిరంగంగా ప్రకటించి, తర్వాత రహస్యంగా మామూలు మొత్తాన్ని మెహరనామాలో వ్రాస్తారు. కొన్ని సమయాలలో భార్య మెహర్ అక్కరలేదని వివాహ సందర్భములో అంగీకరించినను, తరువాత తగు సాంప్రదాయ మెహర్ కోరవచ్చును.

స్త్రీ తన మెహర్ రాబట్టుకొనుటకు భర్త ఆస్తులను తన ఆధీనంలోనికి తీసుకొనవచ్చును. మెహర్ సొమ్ము తీరే వరకు ఆస్తులను తన హక్కు భుక్తంలో అట్లే ఉంచుకొనవచ్చును. మెహర్ సంపూర్ణంగా తీరిన పిదప ఆస్తిని భర్తకు లేదా చట్టరీత్యా అధికారం పొందిన వ్యక్తుల ఆధీనం చేయవలెను. ఏది ఏమైనా ముస్లిం స్త్రీకి మెహర్ ఒక చక్కని జీవిన సదుపాయాన్ని కలిగిస్తుంది. ముస్లిం వివాహంలోని మెహర్ భార్యకు భద్రతను, మత సంప్రదాయాన్ని గౌరవించే లక్షణాన్ని, స్త్రీ వ్యక్తిత్వానికి అస్తిత్వాన్ని ప్రసాదిస్తుంది.

## 11.7 విడాకులు:

ముస్లింల వివాహ వ్యవస్థలో ఒప్పందపు అంశాలు ఇమిడియున్నవి. సివిల్ ఒడంబడికలు ఏ విధంగా రద్దవుతాయో, అదే విధంగా ముస్లిం వివాహము కూడా రద్దవును.

ముస్లిం వివాహము హిందువుల వివాము వలె పవిత్రమయినది, విడదీయరాని బంధముగా భావింపబడదు. ముస్లింల వివాహ బంధము భర్త యొక్క అభీష్టము (తలాఖ్) ప్రకారము గానీ, లేక భార్యాబర్తలిరువురి (ఖులా) అంగీకారముతో గానీ విచ్ఛిన్నమగును.

**11.7.1 తలాఖ్:**

భర్త తన భార్యకు విడాకులు ప్రకటించడానికి ఏకపక్ష అధికారం కలిగి ఉండడం ముస్లిం చట్టంలో కనిపించే ఏకైక అంశం. అతడు ఏ కారణం చూపకుండానే నిర్హేతుకంగా, అక్షరాల చపలచిత్తంగా, పరిహాసంగానైనా లేదా మైకంలోనైనా ఏ తీర్పు లేకుండా చివరకు భార్య తన సమక్షంలో లేకున్నను సూత్రప్రాయ తలాఖ్ మాటను ఉచ్ఛరించినంత మాత్రాన విడాకులివ్వవచ్చు. క్లుప్తంగా చెప్పవలెనంటే 'తలాఖ్' ముస్లిం వరుని ఏకపక్ష దుశ్చర్య మాత్రమే.

సున్నీ, షియా వర్గీయులు మొత్తం మదర్‌సాలు ఈ తలాఖ్ సూత్రానికి గుర్తింపునిచ్చాయి. తలాఖ్ అనగా వివాహపు రద్దు లేదా విడాకులు అని అర్థం. భర్త ఉద్దేశపూర్వకంగా భార్యకు విడాకులు ఇవ్వడానికి స్పష్టమైన సందిగ్ధం లేని రీతిలో వ్యక్త పరిచే విడాకుల ప్రక్రియే తలాఖ్‌గా పరిగణింపబడుతుంది. విడాకుల సూత్రం ప్రకారం ముస్లింలు తమ భార్యలకు అతి సునాయాసంగా విడాకులు ఇవ్వవచ్చు. మానసిక ఆరోగ్యం కలిగిన పురుషుడు, మైనారిటీ తీరిన వ్యక్తి భార్యకు తలాఖ్ ఇవ్వవచ్చు. భార్యకు అంగీకారం లేనప్పటికీ భర్త ఆమె నుండి విడాకులు కోరవచ్చు. విడాకుల విషయంలో పురుషునికి స్త్రీ కంటే ఎక్కువ అవకాశాలు ముస్లిం చట్టంలో కల్పించబడ్డాయి.

తలాఖ్ రెండు ప్రధాన పద్ధతుల ద్వారా కొనసాగుతున్నది.

1. తలాఖ్-ఇ-సున్నీ (Approved Divorce)

2. తలాఖ్-ఉల్-బదాయ (Unapproved Divorce)

**1. తలాఖ్-ఇ-సున్నీ:** తలాఖ్-ఇ-సున్నీ మౌలికమైన తిరిగి మార్చగల విడాకుల స్వరూపం. ఇది రెండు రకాలుగా విభజింపబడి ఉంది.

**ఎ) తలాఖ్-ఎ-అహసన్** (Talaq-A-Ahasan):

ఈ పద్ధతిలో భర్త తుర్హ్ (Turh) కాలంలో అనగా స్త్రీ రెండు ఋతుస్రావాల మధ్య కాలంలో తలాఖ్ పదాన్ని ఉచ్ఛరింపవలసి ఉంటుంది. భర్త తన భార్యతో తలాఖ్ ఉచ్ఛరించిన నాటి నుండి మూడు నెలలపాటు లైంగిక సంబంధాన్ని కొనసాగించడు. మూడు నెలల గడువు పిదప విడాకులు మంజూరు చేయబడతాయి. లైంగిక సంబంధం కొనసాగని ఈ మూడు నెలల కాలాన్ని 'ఇద్దత్' అంటారు. ఇద్దత్ కాలంలో భార్య తన భర్త వద్దే నివాసముంటుంది. ఈ కాలంలో ఒకవేళ లైంగిక సంబంధం కొనసాగితే లేదా భర్త సనస్సు మారి తిరిగి భార్యను స్వీకరిస్తే తలాఖ్ రద్దయిపోతుంది. తొందరపాటు వల్ల తగు ఆలోచనా లోపంతో తలాఖ్ ఉచ్చారణ జరిగినట్లయితే ఈ పద్ధతి వలన తిరిగి భార్యాభర్తలుగా కొనసాగే అవకాశమున్నది.

**బి) తలాఖ్-ఇ-హసన్:**

భర్త మూడుసార్లు వరుసగా మూడు 'తుర్హ' కాలాలలో తలాఖ్ అనే పదాన్ని ఉచ్ఛరించవలెను. ఏ రకమైన లైంగిక సంబంధాన్ని కల్గి ఉండకుండా మూడు తుర్హకాలాలు తలాఖ్ చెప్పినట్లయితే విడాకులు మంజూరు అవుతాయి. ఇలాంటి తలాఖ్ విధానంలో బర్త తిరిగి మనస్సు మార్చుకునే అవకాశ కాలం దాటిపోయినట్లేనని చెప్పవచ్చును. భర్త తిరిగి భార్యను స్వీకరించే అధికారాన్ని కోల్పోతాడు. ఇద్దత్ కాల అనంతరం స్త్రీ తన ఇష్టానుసారంగా తగు స్వేచ్ఛతో తిరిగి వివాహమాడవచ్చును. మళ్లీ ఇష్టముంటే మునుపటి భర్తనే వివాహమాడే స్వేచ్ఛ ఆమెకున్నది.

ఈ పై రెండు రకాల తలాఖ్ పద్ధతులలో పురుషుని చొరవ వల్లనే విడాకులు జరుగుతాయి.

**2 తలాఖ్-ఉల్-బదాయి విడాకుల విధానం:** తలాఖ్-ఉల్-బదాయికి ఈ క్రింది లక్షణములు ఉన్నవి.

1. తుర్హ్ కాలంలో ఏకధాటిగా తలాఖ్ పదాన్ని మూడు సార్లు ఉచ్చరించుట, మూడవసారి చేసిన తలాఖ్ ఉచ్ఛారణ అనంతరం వివాహం రద్దవుతుంది.

2. నిర్బంధమైన రీతిలో ఒక పర్యాయం తలాఖ్-ఉల్-బదాయి సూత్ర స్వరూపం ప్రకారం భర్త తన భార్యకు తక్షణం వివాహ రద్దును ప్రకటించుచు ఒక వేళ తాను ఇష్టపడిన భార్యను హసన్ తలాఖ్ రీతిలో తిరిగి వివాహం చేసుకోవచ్చును.

    ఒక్కొక్కప్పుడు భర్త భార్యకు విడాకులివ్వాలనుకున్నప్పుడు పరోక్ష పద్ధతిని అస్పష్ట రీతిలో ఉచ్ఛారణ చేస్తాడు. ఉదా: నేను నీతో అన్ని విధాలైన సంబంధాలను త్యజిస్తున్నాను. నీకు నాకు ఎట్టి సంపర్కము కొనసాగదు లేదా మరికొంత సందిగ్ధ ధోరణిలో ఇలా అంటారు. నేను నిన్ను నా భార్య బంధం నుంచి విడిపించినాను. ఇలాంటి అస్పష్ట ప్రకటనలు విడాకుల పరోక్షతను చాటుతాయి.

కొన్ని సందర్భాలలో ప్రతినిధి నియామకం ద్వారా తలాఖ్ జరుగుతుంది. ఇలాంటి పద్ధతిని తలాఖ్-ఇ-తఫ్వీజ్ (Talaq-E-Tafweez) అంటారు. ఈ పద్ధతిని షియాలు, సున్నీలు గుర్తించారు. భర్త తలాఖ్ నిచ్చుటకు వేరొకరికి ప్రాతినిధ్య హక్కును ఇవ్వవచ్చు. ఇలా ఇవ్వబడే హక్కు సంపూర్ణ అధికారముతో గాని, కొన్ని షరతులతో కాని ఉండవచ్చు. ఈ పద్ధతిలో తలాఖ్ కోసం వాడబడే పదాలలో స్పష్టత, ప్రతినిధిగా నియమింపబడిన వ్యక్తి పేరుతో నిర్బంధత తప్పనిసరి అవసరం. ఈ ఒక్క పద్ధతిలో మాత్రం ముస్లిం వివాహ వ్యవస్థలో భార్యకు, భర్త నుండి స్వేచ్ఛను పొందే సదుపాయం కల్గింది.

### 11.7.2 భార్యాభర్తల పరస్పర అంగీకారంతో విడాకులు:

పరస్పర అంగీకారం ద్వారా న్యాయ శాస్త్ర గుణప్రక్రియ ద్వారా ముస్లిం వివాహ రద్దు చట్టం ప్రకారంగా కూడా ముస్లిం వివాహం రద్దు గావింపబడే వీలున్నది.

**1. ఖులా పద్ధతి:** ఖులా పద్ధతిలో భార్య తన భర్తను వివాహ సంబంధం నుండి విముక్తి ప్రసాదించమని వేడుకొని తాను పొందిన మెహర్ ఇవ్వజూపుతుంది. ఒకవేళ భర్త సమ్మతి లభించినట్లయితే వివాహం రద్దు అవుతుంది.

**2. ముబారత్:** పరస్పర అంగీకారం ద్వారా కొనసాగే రద్దు పద్ధతిని ఖులా ముబారత్ అనే పేరుతో పిలుస్తారు. విడిపోవాలనే కోరిక భార్యాభర్తలిద్దరి నుండి వస్తుంది. వారిరువురి ఇష్ట ప్రకారమే ముబారత్ జరుగుతుంది.

న్యాయశాస్త్ర ప్రక్రియ ద్వారా 'ఇలా' (Ila) జిహర్ (Zihar) లియాన్ పద్ధతుల ద్వారా వివాహం రద్దు కావచ్చు. హనాఫి చట్టం ప్రకారం భర్త తన భార్యతో లైంగికానుబంధాన్ని కోరనని ప్రతిజ్ఞ పూనుతాడు. ఈ ప్రతిజ్ఞ నాలుగు నెలల కంటె ఎక్కువ కొనసాగుతుంది. ఈ గడువు విజయవంతంగా పూర్తి అయినట్లయితే వివాహం రద్దు అవుతుంది. దీనినే 'ఇలా' అంటారు.

అలాగే 'జిహర్' అనే విధానంలో భర్త తన భార్యను స్వంత తల్లితో సమానంగా ఎంచుతాడు. తల్లితో మిధున సంబంధం నిషేధం కావున భార్యతో లైంగిక సంబంధాన్ని కొనసాగించడు. భార్య త ప్రవృత్తిని ప్రశ్నించినప్పటికీ తగు సమాధానం రానప్పుడు ఆమె న్యాయ పరమైన విడాకులకు న్యాయ మూర్తులను ఆశ్రయించి సాధించుకుంటుంది. లియాన్ పద్ధతిలో భర్త తన భార్యపై వ్యభిచార అభియోగాన్ని మోపుతాడు. భార్య ఈ నిందను నిరాకరిస్తుంది. ఒకవేళ బర్త ఈ అభియోగాన్ని నిరూపించలేని పక్షంలో భార్య వివాహాన్ని రద్దు పరిచే హక్కును పొందుతుంది. భార్య హక్కును వినియోగించుకుంటే లియాన్ ద్వారా వివాహం రద్దయినట్లు ప్రకటించబడుతుంది.

**11.7.3 చట్టపరమైన కారణాల వలన భార్య విడాకులు కోరుట:**

ముస్లిం స్త్రీలకు కొన్ని పరిస్థితులలో విడాకులు అనుమతింపబడినాయి. ముస్లిం వివాహ విచ్ఛితి చట్టం 1939 ప్రకారం ముస్లిం యువతి ఈ క్రింది కారణాల వలన విడాకులను భర్త నుండి కోరవచ్చును. అవి:

1. నాలుగు సంవత్సరాలపాటు భర్త జాడ తెలియకపోవుట.
2. ఉద్దేశపూర్వకంగా గానీ లేక అసమర్థత వలన గానీ భర్త రెండు సంవత్సరములపాటు భార్యకు జీవనోపాధి కల్పించుటలో విఫలగుట.
3. ఏడు సంవత్సరాలపాటు గానీ, లేక అంతకన్నా ఎక్కువ కాలం గానీ భర్త జైలు శిక్షను పొందుట.
4. భర్త మూడు సంవత్సరములపాటు తగిన కారణం లేకుండానే వివాహ బంధమైన బాధ్యతలను నిర్వహింపలేకుండుట.
5. వివాహ సమయము నుండియూ భర్త నిర్వీర్యుడై యుండుట.
6. భర్త రెండు సంవత్సరములపాటు పిచ్చివాడుగా కానీ, కుష్టు రోగముతో కానీ, తీవ్రమైన సుఖవ్యాధితో గానీ బాధపడుచుండుట.
7. భర్త భార్య ఎడల మిక్కిలి క్రూరత్వమును కలిగియుండుట.
8. ముస్లిం న్యాయ శాస్త్ర బద్ధమైన ఏ యితరమైన కారణాలు.

**పాఠం-12**

# క్రైస్తవులలో వివాహ వ్యవస్థ

**విషయక్రమం:**


12.1 ఉపోద్ఘాతము

12.2 లక్ష్యాలు

12.3 లక్షణాలు

12.4 విడాకులు


## 12.1 ఉపోద్ఘాతము:

ముస్లింలలో సున్నీలు, షియాలు అను రెండు సమూహాలు ఉన్నట్లుగానే క్రైస్తవులలో ప్రొటస్టెంట్లు, రోమన్ కేథలిక్కులు అను రెండు తెగలు కలవు. ఈ రెండు తెగల (సమూహాల) మధ్య వివాహ నిషేధాలు లేవు. ఈ రెండు సమూహాలు ఒకే రకమైన వివాహ పద్ధతులను అనుసరించుచున్నవి.

హిందూ వివాహము వలెనే క్రైస్తవ వివాహము కూడా మత పరమైన భావనల మీదనే ఆధారపడియున్నది. వివాహ వ్యవస్థలో మతమునకు అధిక ప్రాధాన్యత ఉన్నది. వివాహం అనేది జీవితంలో కేంద్రస్థానం ఆక్రమించిన దివ్య సంస్థ అని క్రైస్తవుల అభిప్రాయము. దైవ నిర్ణయం వలననే స్త్రీ, పురుషులు వివాహ వ్యవస్థ ద్వారా ఒకటిగా అవుతారని, భార్యాభర్తలు ఒకరిలో ఒకరు ఐక్యమవవలెనని క్రైస్తవుల నమ్మకం. కనుక దేవుని నిర్ణయం ఆచరించుటకు స్త్రీ పురుషులు తప్పనిసరిగా వివాహమాడవలెనని క్రైస్తవులు భావిస్తారు.

## 12.2 లక్ష్యాలు:

క్రైస్తవుల వివాహానికి కొన్ని లక్ష్యాలున్నాయి. అవి:

1. మానవుని లైంగిక వాంఛను సఫలీకృతం చేసుకోవడానికి వివాహం చక్కని సాధనంగా ఉపయోగపడుతుంది. వివాహం వలన ప్రక్క మార్గాలు త్రొక్కకుండా పవిత్రమైన లైంగిక జీవనాన్ని కొనసాగించవచ్చును.
2. వివాహం ద్వారా కుటుంబ వ్యవస్థను ఏర్పరచుకుని, సంతానాన్ని పొందుట.
3. వివాహ వ్యవస్థ వలన పరస్పర సహకారం, అన్యోన్య ప్రేమానురాగాలను అభివృద్ధి చేసుకోవడం, తద్వారా తత్పరతను ఏర్పరచుకోవడం.

## 12.3 లక్షణాలు:

వివాహము అవసరము కాబట్టి, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనుటయను సమస్య ప్రాధాన్యతను సంతరించుకున్నది. వధూవరులు తమంతట తామే జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనుట మరియు తల్లిదండ్రులు వధూవరులను తమ పిల్లలకి ఎంపిక చేయుట అను రెండు పద్ధతులు క్రైస్తవ వివాహ వ్యవస్థ యందు కలవు. అయితే, పదికి తొమ్మిది మందికి తల్లిదండ్రులే

ఎంపిక చేసి, వివాహాన్ని స్థిరపరుస్తారని అహుజా వివరించినారు.

క్రైస్తవులు వివాహ సమయంలో ఈ క్రింది అంశాలకు ప్రాధన్యతనిస్తారు.

1. వదూవరులకు దగ్గరి రక్త బంధుత్వ సంబంధము లేకుండుట.

2. వధువు వైపు, వరుని వైపు సమానమైన సాంఘీక అంతస్థు ఉండుట.

3. విద్య

4. నైతిక ప్రవర్తన.

వధూవరుల ఎంపిక జరిగిన పిమ్మట ఒక ప్రత్యేకమైన వేడుక జరుగుతుంది. ఆ వేడుకను 'ప్రధానం' అంటారు. ఈ ప్రధానంలో వదూవరులు ఇరువురి అంగీకారాన్ని పెద్దలు తెలుసుకుంటారు. అటు పిమ్మట వారు తమతో కొబ్బరికాయలు, నూతన వస్త్రాలు, బంగారపు ఉంగరం మొదలగు వాటిని తీసుకువెళతారు.

పెండ్లి రోజున వధూవరులిద్దరూ తమ తమ బంధుమిత్రులతో చర్చికి చేరుకుంటారు. రోమన్ కేథలిక్ శాఖకు చెందిన వారు 'ఫాదర్'ను పెండ్లికి పురోహితునిగా ఆహ్వానించగా, ప్రొటెస్టెంట్ శాఖ వారు 'పాస్టర్'ను పెండ్లి పురోహితునిగా ఆహ్వానిస్తారు. వివాహాన్ని ఈ క్రైస్తవ పురోహితులు చేయిస్తారు.

వివాహమునకు ముందు మత గురువు ఈ దిగువ అంశములను స్పష్టంగా తెలుసుకోవాలి. అవి:

1. వివాహమాడ గోరు వారి దాంపత్యము పరిశుద్ధ లేఖనమునకు అనుగుణముగా ఉండుట.

2. రాజ్యము, సంఘము, చట్టముల కనుకూలించి యుండుట.

3. వధూవరులు యుక్త వయస్సు వారు కానప్పుడు (అనగా మైనారిటీ దాటనప్పుడు) వారి తల్లిదండ్రులు గానీ, సంరక్షకులు గానీ సమ్మతించుట).

4. దాంపత్యము దైవాశీర్వాదమున కనుకూలమైనదని స్పష్టముగా తెలియుట.

వివాహం జరిగే ముందు రోజున, ఒకటి లేక రెండు లేక మూడు ఆదివారాలలో చర్చిలో వివాహ ప్రకటనను చేయవలెను. ఆ వివాహ ప్రకటన ఇట్లుండును.

.................. కాపురస్థుడు ................. అను పేరు గల ఆయనయూ ................... కాపురస్థురాలు ................... అను పేరు గల ఆమెయూ దేవుని ఏర్పాటు ప్రకారము పరిశుద్ధ గృహస్థ జీవనములో ప్రవేశింపనుద్దేశించుచున్నారు. వీరిని జత పరచకూడదనే వారు వివాహమునకు ముందే ఆ అభ్యంతరమును తెలుపవలెనని పురోహితులు హెచ్చరిక చేయుదురు.

వివాహమాడు వధూవరులు పీఠము వద్దకు వచ్చి వరుడు వధువునకు కుడివైపు ఉండవలెనని వారిరువురూ పీఠము వద్దకు రాగానే పురోహితుడు ఇట్లు చెప్పును.

మిక్కిలి ప్రియులారా! ఈ స్త్రీ పురుషులకు పరిశుద్ధ వివాహము చేయుటకు దేవుని సుఖమునందునూ, ఈ సంఘము యెదటనూ, మనము సమావేశమైనాము. వివాహమనునది దేవుడు తానే నియమించిన ఘనమైన స్థితియై యుండి క్రీస్తునకునూ, ఆయన సంఘమునకు గల మర్మమైన ఐక్యమును సూచించుచున్నది. వివాహము ఏర్పడిన హేతువులను తగినట్లుగా యోగించి భక్తి వినయములతోను, దైవ భయముతోనూ, వివేకముతోనూ, సంబుద్ధితోనూ దీనికి పూనుకొనవలెను. ఆ హేతువులు ఏవియనగా:

మొదటిది, దేవుడు తన చిత్త ప్రకారము మనుష్య జాతి వృద్ధి పొందునట్లుగా పిల్లలకు ప్రభువు యొక్క భగమునందును,

శిక్ష యందును, ఆయన పరిశుద్ధ నామమునకు మహిమ కారణముగా పెంచబడునట్లును వివాహము ఏర్పడినది.

రెండవది, దేవునిచే నియమింపబడిన స్వాభావికమైన కోరికలనూ, ఆక్షేపణలనూ, పరిశుద్ధ పరచబడి యుక్తము క్రమ పరచబడునట్లునూ దేవుని వలన యీ పరిశుద్ధ స్థితికి పిలువబడినవారు అందులోనే పవిత్రులుగా జీవించునట్లునూ ఇది ఏర్పడియున్నది.

మూడవది, సుఖ దుఃఖములలో ఒకరికొకరు తోడుగానూ, సహాయము గానూ ఆదరణగా ఉండునట్లు ఇది ఏర్పడియున్నది.

పురోహితుడు వరుని చేత వధువునకు మంగళ సూత్రమును కట్టిస్తారు. పెండ్లి సర్వసాధారణముగా పగటి పూటే జరుగుతుంది. పెండ్లియనంతరం విందు భోజనం జరిగే ఆచారం కూడా భారతీయ క్రైస్తవులలో ఉన్నది.

చర్చిలోనే కాక, వివాహ రిజిస్ట్రార్ కార్యాలయాలలోనూ, స్వంత గృహాలలోనూ కూడా వివాహము చేసుకొనవచ్చునని క్రైస్తవ వివాహ చట్టము 1872 అనుమతినిచ్చింది.

## 12.4 విడాకులు:

బైబిలు క్రైస్తవులలో విడాకులను నిషేధించింది. వివాహం దేవుని ఆజ్ఞ మేరకు అతని ఆశీర్వాదంతో ఆమోదించబడినందున అది సర్వకాల సర్వావస్థలలో వర్ధిల్లవలెను. దానికి విడాకుల అంతం ఉండకూడదు అని బైబిలులో ఆంక్షలు సాక్షాత్కరించినప్పటికీ, క్రైస్తవ సముదాయాలలో విడాకుల పద్ధతిని స్వేచ్ఛగా అనుమతిస్తున్నారు. 1896 సం॥ విడాకుల చట్టం క్రైస్తవులలో విడాకులను వీలు కల్పించినది. ఈ చట్టం ప్రకారం భార్య భర్త నుంచి ఈ క్రింది కారణాల వలన విడాకులను కోరవచ్చు.

1. భర్త తన మతాన్ని మార్చుకుని, మరో స్త్రీని వివాహమాడినట్లయితే.

2. పరస్త్రీతో లైంగిక సంబంధానికి దిగి తప్పుడు ప్రవర్తనకు లోబడినట్లయితే.

3. అక్రమ పద్ధతిన రెండో భార్యను పొందినట్లయితే

4. పర స్త్రీని బలాత్కారం చేసినట్లయితే.

5. భార్య పట్ల కౄరంగా ప్రవర్తించినట్లయితే.

6. రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం తగు కారణం లేకుండా భార్యకు దూరంగా ఉంటే.

డిక్రీ లభించిన తర్వాత వారిరువురు తిరిగి వివాహం చేసుకోవడానికి కనీసం ఆరు మాసాలు వేచియుండమని యుంటుంది. 1896 విడాకుల చట్టం సెక్షన్ 19 ననుసరించి వివాహం ఈ క్రింది కారణాల వలన చెల్లుబాటు కాకుండా పోయే అవకాశమున్నది.

1. భర్త నపుంసకుడైనప్పుడు, భార్య గొడ్రాలయినప్పుడు, సంసార సుఖానికి వారిరువురూ పనికిరానప్పుడు.

2. భార్యాభర్తల బంధం సమీప రక్త సంబంధ పరిధిలోకి చెందినదని తేల్చబడినప్పుడు.

3. భార్యా భర్తలలో ఏవైనా బుద్ధి మాంధ్యం, పిచ్చి మొ॥గు అవలక్షణాలు ఉన్నప్పుడు.

4. వివాహ సమయంలో ఇరువురిలో ఎవరైనా ఇదివరకే భార్య, భర్తను కలిగి ఉన్నట్లయితే.

5. అవినీతి ద్వారా కానీ, బలవంతం ద్వారా గానీ పెళ్లి కుదిరినప్పుడు

కోర్టు నుండి తీర్పు ద్వారా, విడాకుల ద్వారా గాని విడిపోతే భార్య, భర్త నుంచి మనోవర్తిని పొందే అవకాశం చట్టరీత్యా కల్పించబడింది.

**పాఠం-13**

# కుటుంబ వ్యవస్థ

**విషయక్రమం:**


**13.1 పరిచయం**

**13.2 కుటుంబము-పుట్టుపూర్వోత్తరాలు**

**13.3 కుటుంబాల వర్గీకరణ**

**13.4 సమిష్టి కుటుంబము**

**13.5 ముఖ్య పదములు**

**13.6 నమూనా ప్రశ్నలు**

**13.7 చదవదగిన గ్రంథములు**


## 13.1 పరిచయం:

సమాజంలోని ప్రాథమిక సమూహాలలో కుటుంబము ముఖ్యమైనది. కుటుంబము సంస్థగా, పరిమితిగా సమాజ శాస్త్రంలో పరిగణన పొందుతున్నది. మనము సమాజ నిర్మాణాన్ని స్థూలంగా పరిశీలించడానికి కుటుంబమత్యంత ప్రాముఖ్యాన్ని వహిస్తుంది. కుటుంబ విధానము నిర్మాణంలో విధులలో చాలా మార్పులు చెందుతూ వస్తూ ఉంది. చారిత్రకంగా కుటుంబము అనేక మార్పులు చెందుతున్నా సమాజంలో దీని ప్రాముఖ్యత పెరిగింది. ప్రతి వ్యక్తి కుటుంబంలో సభ్యుడు కుటుంబం లేనిదే వ్యక్తికి మనుగడ లేదు. సమాజంలో బాధ్యత గల వ్యక్తిగా మెలగడానికి కావలసిన శిక్షణ కుటుంబంలో మాత్రమే లభిస్తుంది కాబట్టి కుటుంబాన్ని గురించి కూలంకషంగా పరిశీలించడం సంఘ సంక్షేమ శాస్త్ర విద్యార్థికి ఎంతైనా అవసరము. భార్యాభర్తల మధ్య గల వైషమ్యాలు, పిల్లల సమస్యలు మొదలైన కుటుంబ సమస్యలు అర్థం చేసుకోవడానికి, కుటుంబాన్ని సంపూర్ణంగా పరిశీలించడం అవసరం. సమాజ శాస్త్రవేత్తలు కుటుంబాన్ని అనేక విధాల నిర్వచించినారు. పిల్లలను కనిపెంచి, వృద్ధిలోనికి తీసుకొని రావలెననే వాంఛతో స్త్రీ పురుషులు తమ మధ్య ఏర్పరచుకున్న పవిత్ర బంధమే వివాహము. ఈ వివాహము నిర్దిష్టమైన, శాశ్వతమైన, పవిత్రమైన సామాజిక వ్యవస్థ. వ్యక్తికి కుటుంబంతో జీవితాంతము సంబంధము ఉంటుంది. అతని సుఖశాంతులకు నైతికోన్నతికి కుటుంబమే నిలయము. మానవ నాగరికతకు ప్రథమ సోపానము కుటుంబము.

ఏ సమాజంలోనైనా కుటుంబము కీలకపాత్ర వహిస్తుంది. సమాజాన్ని సక్రమంగా అర్థం చేసుకోవలెనంటే, ముందుగా కుటుంబ సంస్థను చక్కగా అర్థం చేసుకోవలె. కుటుంబము సరిగా పనిచేయకపోతే సామాజికాభివృద్ధి కుంటుపడుతుంది. కుటుంబ అవ్యవస్థ సమాజ అవ్యవస్థకు దారితీస్తుంది. భవనానికి పునాది ఎంత ముఖ్యమో సమాజానికి కుటుంబము అంత ముఖ్యము. వ్యక్తి క్షేమము సమాజ క్షేమము కూడా కుటుంబ సంస్థ పనిచేసే తీరుననుసరించి ఉంటుంది. మానవ సమాజ సంస్థలన్నిటిలోను కుటుంబ సంస్థ ప్రధానమైనది, ఆవశ్యకమైనది, కుటుంబంలోని సభ్యుల సంఖ్య సామాజిక పరిస్థితులననుసరించి మారుతూ ఉంటుంది. పూర్వకాలంలో పెద్ద పెద్ద కుటుంబాలుండేవి. కానీ, ఆధునిక నాగరిక సమాజాలలో చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయి. సమిష్టి కుటుంబాలు తగ్గిపోయి వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతున్నాయి. ఈ మార్పుకు అనేక కారణాలున్నాయి.

రాను రాను కుటుంబ సంస్థ రకరకాల మార్పులకు లోనవుతూ వచ్చింది. ఆదిమ ఫ్యూడల్ సమాజాలలో ఉన్న కుటుంబ వ్యవస్థకు ఆధునిక సమాజాలలో ఉన్న కుటుంబ వ్యవస్థకు చాలా తేడా ఉన్నది.

## 13.2 కుటుంబము-పుట్టుపూర్వోత్తరాలు:

కుటుంబ చరిత్రను గురించి అనేకమయిన అభిప్రాయాలున్నాయి. మానవుడు ఉద్భవించిన తొలి రోజులలో కుటుంబ వ్యవస్థ లేదు. ఆ కాలంలో ఏ నియమాలు లేకుండా స్త్రీ పురుషులు జంతువులవలే శారీరక వాంఛలు తీర్చుకొనేవారు. నాడు లైంగిక విశృంఖలత్వము ఉండేది. భార్యాభర్తలు వివాహము అనే మాటలు ఆనాడు లేవు. లైంగిక నియమావళి కూడా లేదు. ఈ విధమయిన అభిప్రాయాలను మోర్గాన్ (Morgan) మొదలయిన వారు వెల్లడించారు. ఆర్థికంగా, సాంఘీకంగా సహాయాన్ని వాంఛించి పురుషుని సాంగత్యాన్ని స్త్రీ కోరింది. పురుషునితో క్రబద్దమైన లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకొంది. ఈ విధంగా కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. పురాతన కాలంలో కూడా మానవులలో వివాహ వ్యవస్థ ఉన్నట్లు అనేక ఆధారాలున్నాయి. కుటుంబానికి పుట్టుక లేదని కొందరి భావము.

సంస్థల పుట్టు పూర్వోత్తరాలను గురించి ఖండితంగా చెప్పడం సాధ్యం కాదు. మానవుడు భూమి మీద అవతరించిన తరువాత ఏ సంస్థ ఏ విధంగా ఎప్పుడు పనిచేయడం ప్రారంభించిందో, మొదట్లో ఏ రూపంలో ఉండేదో నిశ్చయంగా చెప్పవలెనంటే శాస్త్రకారులకు ఎన్నో ఇబ్బందులున్నాయి. పూర్వకాలంలో జరిగిన విషయాలు తెలుసుకోవడానికి సరిఅయిన ఆధారాలు ఈనాడు లేవు. ఆనాటి విషయాలు ఇప్పటి వారి దృష్టికి అతీతాలు. సమాజ క్రమాభివృద్ధిలో ఎన్నెన్నో మార్పులు శాస్త్రకారుని దృష్టికి అందనివి ఉన్నాయి. కాబట్టి ఏ సంస్థ పుట్టు పూర్వోత్తరాలను గురించి అయినా శాస్త్రకారుడు ఖండితంగా చెప్పలేడు. కానీ, చేసిన పరిశోధనలను బట్టి ఇట్లా జరిగి ఉండవచ్చునని ఊహించవచ్చు. ఈ ఊహాగానానికి కొంత విలువ లేకపోలేదు.

కుటుంబ సంస్థ గురించి కూడా ఇట్లాగే జరిగింది. వివిధ శాస్త్ర పరిశోధకులు వారి వారి పరిశోధనలను బట్టి కుటుంబ సంస్థ ఆదిలో ఎట్లా ఉండేదో ఊహించి చెప్పినారు. కుటుంబ సంస్థ ఆరంభ దశను గురించి అనేక వాదాలున్నాయి. మొదట్లో మానవులు చిన్న గుంపుగా మాత్రమే ఉండేవారని, కుటుంబ సంస్థ అనేది లేదనికొందరు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. మరికొందరు శాస్త్రజ్ఞులు ఆది నుంచి కుటుంబ సంస్థ ఉన్నదని భావిస్తున్నారు.

సమ్నర్ (Sumner), కెల్లర్ (Keller) అనే వారు రక్త సంబంధాన్ని అనుసరించి మొదట్లో కొన్ని గుంపులుండేవని భావిస్తున్నారు. బ్రిఫాల్ట్ (Brifault) అభిప్రాయం ప్రకారం ఆదిలో కుటుంబ సంస్థ లేదు. తల్లులు వారి పిల్లల సమూహము మాత్రమే ఉండేది. తరువాత కుటుంబ సంస్థ అభివృద్ధి అయింది. అయితే, వెస్టర్ మార్క్ (Wester Mark) దానికి సరిగా వ్యతిరేక భావాలను వెల్లడించాడు. వెస్టర్ మార్క్ ప్రకారం మొదటి నుంచి కుటుంబం ఉండేది. మాలినోవ్స్కీ (Molinowski) ప్రకారం కుటుంబ సంస్థ సమూహము లేదా గుంపు అన్నవి కలిపి అవినాభావ సంబంధాలతో అభివృద్ధి చెందినాయి.

ఆదిలో పితృ స్వామిక కుటుంబ వ్యవస్థ ఉండేదని హెర్నీ, సమ్నర్, మెయిన్ (Herney, Sumner, Maine) భావిస్తే, బెకోఫెన్ (Bachofen) ఆదిలో మానవ జాతి స్వైరత (Promiscuity) దశలో ఉండేదని ఆ తరువాత మాతృస్వామిక కుటుంబ సంస్థ అభివృద్ధి అయిందని భావించాడు. L.H.Morgan అనే ఆయన కుటుంబ సంస్థ మూడు దశలుగా అభివృద్ధి అయిందని పేర్కొన్నాడు. మార్గన్ ప్రకారం ఆదిలో స్వైరత ఉండేది. తరువాత మాతృస్వామిక కుటుంబ సంస్థ అభివృద్ధి అయింది. మాతృస్వామికం నుంచి పితృస్వామిక కుటుంబ సంస్థ అభివృద్ధి చెందింది.

ఆధునిక సమాజ శాస్త్రజ్ఞులు మాత్రం కుటుంబ వ్యవస్థ రూపురేఖలు ఆదిలో ఎట్లా ఉండేవి అనే ప్రశ్నను అర్థరహితమైనదిగా భావిస్తున్నారు. ఎందుకంటే మానవ జాతి చరిత్రలో కుటుంబ సంస్థ ఎప్పుడూ ఉంటున్నదే. ఈ సంస్థ ఫలానా కాలం నుంచి పెరిగింది అని చెప్పడం అశాస్త్రీయమవుతుంది. పైగా, అనేక కారణాల వల్ల కుటుంబ సంస్థ మానవజాతి చరిత్రలో అభివృద్ధి అయింది. కుటుంబ సంస్థ మానవజాతి చరిత్రలో ఫలానా కాలంలో అభివృద్ధి అయిందని చెప్పడం సమంజసం కాదు. మాలినోవ్స్కీ చెప్పినట్లు కుటుంబం కొన్ని మానవ అవసరాలు తీర్చడానికి సంస్కృతీ పరంగా అభివృద్ధి అయింది. కుటుంబ సంస్థ అభివృద్ధికి ప్రధాన కారణాలైన మానవుల అవసరాలు మూడు. అవి: 1. మిధున వాంఛ, 2. సంతాన వాంఛ, 3. ఆర్థికావసరాలు. దీనినే

మనవారు యీషణత్రయమన్నారు. మిధున వాంఛ మానవునికి ముఖ్యమైనది. అయితే యీ మిథున వాంఛను సంతృప్తి పరచుకోని సందర్భంలో ఒక విధమైన స్పర్ధను మానవుడు ఎదుర్కొంటాడు. మానవుడు దీని నుంచి తప్పుకొంటూ తమ వాంఛ పరితృప్తి కోసం కొన్ని రక్షణలు సమాజ పరంగా ఏర్పరచుకొన్నాడు. ఆ రక్షణల మారు రూపమే కుటుంబ సంస్థ.

మానవునిలో సంతా వాంఛ చాలా తీవ్రమయింది. తమ ఆస్థిని సంక్రమింపజేయడానికి తమ కుటుంబము పేరు నిలబెట్టడానికి, తమ పని పాటలలో పాలుపంచుకోవడానికి తమను వృద్ధాప్యంలో ఆదుకునేందుకు మానవులు సంతానాన్ని కోరతారు. యీ కోర్కె కుటుంబ సంస్థ అభివృద్ధికి దోహదం చేస్తుంది.

కుటుంబ సభ్యులందరూ కలిసి జీవనోపాధికి కృషి చేయడం కూడా మానవ జాతి చరిత్రలో కుటుంబ సంస్థ అభివృద్ధికి తోడ్పడింది. స్త్రీ పురుషులలో శారీరకంగా ఉండే తేడాలను అనుసరించి కొన్ని కొన్ని పనులు నిర్వర్తించడంలో వారు తమ తమ నేర్పును ప్రదర్శిస్తారు. పురుషులు వ్యవసాయము మొదలైన పనులను, స్త్రీలు పిల్లల సంరక్షణను వహించి, ఆర్థికావసరాల కోసం ఉభయులు కృషి చేస్తారు. ఏ కాలంలోనయినా కుటుంబ వ్యక్తులు ఆర్థికావసరాలను తీర్చుకోవడానికి తగిన కృషి చేస్తూనే ఉన్నారు. వీటితోపాటు మానవునికి తోడు ఉండవలెననే కోర్కె, సుఖ దు:ఖాలలో భాగం పంచుకొనే వారుండవలెననే కోర్కె కుటుంబ సంస్థ అభివృద్ధికి దోహదం చేసినాయి. కుటుంబ సంస్థ ఆదిలో ఎప్పుడు మొదలయింది, అనే ప్రశ్న కంటే ఆదిలో కుటుంబ సంస్థ ఏ కారణాల వల్ల అభివృద్ధి అయిందనేది ప్రధానము. అనేక కారణాల వల్ల కుటుంబ సంస్థ మానవజాతి క్రమాభివృద్ధిలో పెంపొందింది.

**కుటుంబ వ్యవస్థ ప్రధాన లక్షణాలు:**

**1. విశ్వజనీనత:**

కుటుంబ సంస్థ అన్నది ఆధునిక మానవ సమాజాలలోనే కాకుండా మానవజాతి క్రమాభివృద్ధిలో ప్రతి దశలోనూ ఉంటుంది. ప్రతి వ్యక్తి ఏదో ఒక కుటుంబానికి చెంది ఉంటాడు. పక్షులు, జంతువుల సమాజాలలో కూడా కుటుంబమున్నదని చెప్పడానికి ఆధారాలున్నాయి.

**2. మిథున సంబంధము:**

కుటుంబ సంస్థలో ప్రధాన లక్షణము స్త్రీ, పురుష సాంగత్యము. జీవిత భాగస్వాములైన భార్యాభర్తలిద్దరూ అనుబంధంతో జీవితకాలమంతా కలిసి ఉండవచ్చు లేదా కారణాంతరాల వల్ల పరిమిత కాలం వరకే దంపతులుగా ఉండవచ్చు.

**3. నామకరణ పద్ధతి** (System of Nomenalature):

ప్రతి కుటుంబాన్ని గుర్తు పట్టడానికి వీలయేటట్లుగా దానికి ఒక పేరు ఉంటుంది. కుటుంబంలో కలిగే సంతానానికి పేర్లు పెట్టడం అనేది కూడా ఒక పద్ధతిననుసరించి జరుగుతుంది. పిల్లలకు పేర్లు పెట్టడంలో తల్లిదండ్రులు మత రాజకీయ నమ్మకాల ప్రభావం చాలా ఉంటుంది. వంశ పారంపర్యాన్ని గణనలోనికి తీసుకునే విషయంలో కూడా తేడాలున్నాయి. కొన్నిచోట్ల మాతృ వంశీయ విధానముంటుంది. మరికొన్నిచోట్ల పితృ వంశీయ విధానముంటుంది.

**4. ఆర్థిక సదుపాయాలు:**

భౌతిక అవసరాలను తీర్చుకోవడానికి ప్రతి కుటుంబానికి కొన్ని ఆర్థిక సదుపాయాలుంటాయి. ప్రతి కుటుంబానికి కొంత భూవసతి కానీ, వ్యాపారం కానీ, ఉద్యోగం కానీ ఉంటుంది. అయితే ఆర్థిక స్థితిగతులలో ఒక కుటుంబానికి మరొక కుటుంబానికి తేడాలుంటాయి.

**5. ఉమ్మడి నివాసము** (Common Habitation):

ప్రతి కుటుంబానికి విశ్రాంతి తీసుకొనడానికి, నిత్యకృత్యాలు తీర్చుకోవడానికి, పిల్లలు, పెద్దలు నివసించడానికి ఒక నివాసము అవసరము. దానినే ఇల్లు అంటారు. అయితే పెద్ద పెద్ద భవనాలలో కొన్ని కుటుంబాలు, మధ్యతరహా ఇళ్లలో కొన్ని కుటుంబాలు నివసిస్తే ఏ వసతి లేని నిర్భాగ్యులు చెట్ల కిందనే తలదాచుకుంటారు. అది కూడా ఒక రకమైన నివాసమే.

**6. ఆవేశ ప్రాతిపదిక:**

మానవుని భౌతికావసరాలు సుఖాలు, కోరికలు మొదలైన వాటి మీద కుటుంబ సంస్థ ఆధారపడి ఉంటుంది. స్త్రీ పురుషుల సంగమము సంతానాన్ని పొందడం, ఆ సంతానాన్ని ప్రేమతో పెంచి పెద్ద చేయడం భార్యాభర్తలు పరస్పర ప్రేమతో జీవితం గడపడం, ఆర్థిక, సామాజిక పరంగా రక్షణ కల్పించుకోవడం మొదలైనవన్నీ కుటుంబ సంస్థలో ప్రధానంగా ఉంటాయి. వీనికంతటికీ ప్రాతిపదిక ఆవేశమే.

**7. తీర్చిదిద్దే ప్రభావము:**

కుటుంబం, దానిలో వ్యక్తులను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. వ్యక్తుల ప్రవర్తన మీద కుటుంబ సంస్థ ప్రభావం ఎంతగానో ఉంటుంది.

**8. పరిమితమైన పరిమాణము** (Limited Size):

నాగరిక సమాజాలలో ఉన్న సంస్థలన్నింటిలోను కుటుంబ సంస్థ పరిమాణంలో చిన్నది. భార్యాభర్తలు వారి సంతానము ఆ కుటుంబంలో ఉంటారు. కాబట్టి అది సహజంగా పరిమితంగా ఉంటుంది. పూర్వము సమిష్టి కుటుంబాలలో సేవకులు, దగ్గర బంధువులు కలిసి ఒక కుటుంబంగా ఉండే సమయాలలో కుటుంబ సంస్థ పరిమాణం కొంత పెద్దదిగా ఉండేది.

**9. సమాజంలో కీలక స్థానము** (Nuclear Position):

మానవ సమాజాలలో ఉన్న అనేక సంస్థలు వృద్ధి చెందుతూ, మార్పులకు లోనవుతూ ఉంటాయి. ఈ సంస్థలన్నింటిలోకి కుటుంబ సంస్థ ప్రధానమైనదేకాక కేంద్రస్థానమాక్రమించుకొని ఉంటుంది.

**10. సభ్యుల బాధ్యత:**

కుటుంబ సభ్యులు పరస్పరం ప్రేమానురాగాలతో ఉంటూ ఒకరి కోసం మరొకరు త్యాగం చేస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లల యోగక్షేమాల కోసం తమ సుఖాన్ని కూడా వదులుకుని ఎంతటి త్యాగమైనా చేస్తూ పిల్లల క్షేమమే పరమార్థంగా భావించి జీవిస్తుంటారు.

**11. సామాజిక నిబంధన** (Social Regulation):

కుటుంబము తన సభ్యులను ఆయా దశలలో నియంత్రణ చేస్తుంది. ఎట్లా ప్రవర్తించాలో కూడా నేర్పుతుంది. కుటుంబము పిల్లలను నియంత్రించడమే కాక తల్లిదండ్రులను కూడా హద్దులలో ఉంచుతుంది. వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేటట్లు చేస్తుంది.

**కుటుంబము-సామాజిక ప్రకార్యాలు** (Sociological Functions of Family):

మానవజాతి చరిత్రలో కుటుంబము అతి ప్రాచీనమయిన, ప్రముఖమయిన సామాజిక వ్యవస్థ. మానవ సమాజంలోని ఏకత్వ భావనకూ, సమైక్యానికి కుటుంబమొక చిహ్నము. వ్యక్తులతో ఆరంభమయిన కుటుంబమే క్రమక్రమంగా పరిణామం పొంది, రాజ్యంగా విస్తరించింది. రాజ్య పౌరులు నిర్వహించవలసిన బాధ్యతలు నేర్పే విద్యాలయమే కుటుంబము.

కుటుంబానికి వ్యక్తి మూలాధారము. సమాజానికి కుటుంబము ఆధారము. రాజ్యాల ఉన్నతి గాని, పతనం గాని ఆ సమాజంలో పౌరుల గుణశీలాల మీద ఆధారపడి ఉంటుంది. కుటుంబము నిర్వహిస్తున్న విధులు చాలా ఉన్నాయి.

**1. ఆర్థిక ప్రకార్యము:**

కుటుంబానికి సుఖాన్ని ఇచ్చేవి ఆస్తిపాస్తులు. పూర్వకాలంలో కుటుంబము తనకు కావలసిన వివిధ వస్తువులను ఉత్పత్తిచేసి వినియోగించేది. భారతీయ సమిష్టి కుటుంబంలో వ్యక్తులందరూ కలిసి పనిచేసి పరస్పర సహకారంతో ఆనందాన్ని పంచుకునేవారు. అవిటి వారికి, ముసలి వారికి ఈ విధానంలో రక్షణ ఉండేది. వారు కూడా కొంత కృషి చేసి కుటుంబ

నిర్వహణకు తోడ్పడే వారు. కుటుంబ సభ్యులు వ్యవసాయము, చేతి పనులు, ఇతర వృత్తులు అవలంభించి కుటుంబపు ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేవారు. కానీ, నేడు కుటుంబంలోని సభ్యులందరూ కలిసి పనిచేసి వారి సంపదను సమకూర్చవలసిన అవసరం లేదు. వారంతా కష్టపడి వారికి కావలసిన వస్తువులను వారే ఉత్పత్తి చేయవలసిన అవసరం కూడా లేదు. వినియోగ వస్తువులు అధికంగా ఉత్పత్తి చేసి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచడం వల్ల వాటిని స్వయంగా ఉత్పత్తి చేయడం కోసం కుటుంబ సభ్యులు శ్రమ పడనక్కరలేదు. నాటి కుటుంబపు విధులను నేడు ప్రయివేటు రంగము, ప్రభుత్వము నిర్వహిస్తున్నాయి. ఇప్పటికీ కొన్ని కుటుంబాలు కొంతవరకూ ఈ విధమయిన చేతి పనులు మొదలయిన వాటిని నిర్వహిస్తున్నాయి.

**2. ధార్మిక ప్రకార్యము:**

కుటుంబము అందులోని సభ్యులకు మత సంబంధమైన శిక్షణ ఇస్తుంది. పిల్లలు తమ పెద్దల నుంచి సద్గుణాలు నేర్చుకోవడానికి మత సంబంధమయిన శిక్షణ అవసరము. దైవారాధన, యజ్ఞయాగాదులు, మత సంబంధమయిన ఉపదేశాలు మొదలయినవి పూర్వం హెచ్చుగా ఉండేవి. అందువల్ల నాటి వ్యవక్తులు మత సంబంధమైన విషయాలలో నిమగ్నులై ఉండేవారు. కానీ, నేడు మత ప్రమేయం లేని లౌకిక రాజ్యము ఆచరణలో ఉండడం వల్ల వ్యక్తులలో మత సంబంధమయిన భావాలు సన్నగిల్లాయి. నాడు కుటుంబాలలో ప్రార్థనా సమావేశాలు నిత్యము సంప్రదాయంగా జరుగుతూ ఉండేవి. కానీ, నేడు చాలా వరకు ఇటువంటి సమావేశాలు తగ్గిపోయినాయి.

**3. విద్యా ప్రకార్యము:**

పిల్లలకు విద్యా భోదన నాడు కుటుంబాలలోనే అధికంగా జరిగేది. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తుకు కావలసిన విద్యా సోపానాలు నిర్మించినారు. వ్యక్తిగత శిక్షణను పిల్లలకు ఇచ్చే అవకాశము ఎక్కువగా తల్లికే ఉంది కానీ, నేడు అనేక విద్యా సంస్థలను ప్రభుత్వము, ఇతర సంస్థలు ఏర్పాటు చేయడం వల్ల ఈ బాధ్యత చాలా వరకు కుటుంబానికి తగ్గిపోయింది. నాడు కుటుంబాలలో వృత్తి పరమైన విద్యా శిక్షణ తల్లిదండ్రులు ఇచ్చేవారు. నాటి కుటుంబాలలో వృత్తులు కులం మీద ఆధారపడడం వల్ల వృత్తి శిక్షణ సభ్యులకవసరము కానీ, నేడు ఈ బాధ్యతను అనేక సాంకేతిక, వైజ్ఞానిక, విద్యా సంస్థలు నిర్వహిస్తున్నాయి.

**4. ఆరోగ్య ప్రకార్యము:**

పూర్వము ఆరోగ్య, వైద్య సంబంధమయిన విధులు కుటుంబం నిర్వహించేది. కుటుంబ సభ్యుల అనారోగ్యం కానీ, ఇతర అస్వస్థతలు కానీ నివారించచేసే బాధ్యత కుటుంబానిదే. కానీ, నేడు ఆస్పత్రులు ఆరోగ్య సదుపాయాలు అధికం కావడం వల్ల ఈ విధులు కుటుంబం నుంచి ఆయా సంస్థలకు సంక్రమించినాయి. నేడు ప్రసూతి సౌకర్యాలు ఆస్పత్రులే నిర్వహిస్తున్నాయి. నాడు సభ్యులకు వినోదావకాశాలను (Recrational Facilities) కుటుంబము కల్గించేది. నేడు ఆ విధులను చలనచిత్రాలు, క్లబ్బులు, క్రీడా సంఘాలు మొదలయినవి నిర్వహిస్తున్నాయి.

**5. ప్రత్యుత్పత్తి:**

కుటుంబ సంస్థ మానవునికి ఉన్న మిథున వాంఛలను తీర్చుకోవడానికి సక్రమమయిన అవకాశం కల్పిస్తుంది. తద్వారా మానవ జాతి పెరుగుదలకు తోడ్పడుతుంది. తల్లిదండ్రుల సహజమయిన సంతాన కాంక్షను కుటుంబ సంస్థ తీరుస్తుంది.

**6. నిర్వహణ:**

ప్రతి కుటుంబము కొంత ఆర్థిక ఉపాధితో కూడి ఉంటుంది. కుటుంబంలో సభ్యులను పోషించడానికి భార్యాభర్తలు కృషి చేస్తూ, వీలయిన సౌకర్యాలను కల్పించి తమ సంతానాన్ని పెంచి పెద్ద చేస్తారు.

**7. సంక్రమణ:**

తల్లిదండ్రుల అనంతరం వారి తాలూకా ఆర్థిక సామాజిక హెూదా పిల్లలకు సంక్రమిస్తుంది. పిల్లలు తమ కుటుంబ స్థాయిని బట్టి సమాజంలో స్థానాన్ని పొందుతారు.

**8. సాంఘికీకరణ:**

కుటుంబ సంస్థ నిర్వహించే అతి ముఖ్యమైన ప్రకార్యము సాంఘికీకరణము. కుటుంబంలో పెద్దలు పిన్నలకు అనేక విషయాలను నేర్పుతుంటారు. కుటుంబ సంస్థతో ఉండడం వల్ల పిల్లలు పెరుగుతూ వారి చుట్టుపక్కల ఉండే వాతావరణాన్ని అనుసరించి విషయాలను గ్రహించి అనుకరిస్తారు. సమాజంలో వ్యక్తిగా నిలవడానికి, పని చేయడానికి కావలసిన హంగులన్నీ సాంఘికీకరణ ద్వారా కుటుంబ సంస్థ ఏర్పరుస్తుంది. ఏ కుటుంబ సంస్థకు చెందిన పిల్లలలో సాంఘికీకరణ సరిగా జరగదో వారి పెరుగుదల లోపభూయిష్టంగా ఉంటుంది. మెకైవర్ అభిప్రాయం ప్రకారం కుటుంబ ప్రకార్యాలను ఆవశ్యకాలు, అనావశ్యకాలని విభజించవచ్చు. మిథున వాంఛ, సుస్థిర సంతృప్తి, పిల్లల సంరక్షణ, గృహ సదుపాయాలు అనేవి ఆవశ్యక ప్రకార్యాలు. ఆర్థికారోగ్య, విద్య, వినోద, మత విషయాలకు చెందిన ప్రకార్యాలు అనావశ్యక ప్రకార్యాలు. అయితే, ఇందులో కొన్ని బాధ్యతలను ఆధునిక సమాజాలలో కుటుంబ సంస్థ సరిగా నిర్వహించడం లేదు. నూతనంగా అభివృద్ధి అయిన ఇతర సంస్థలు ఈ బాధ్యతలలో కొన్నింటిని నిర్వహిస్తున్నాయి.

## 13.3 కుటుంబముల వర్గీకరణ:

సమిష్టి కుటుంబము, వ్యష్టి కుటుంబము అను రెండు రకముల వర్గీకరణే కాక, కొంత మంది సమాజ శాస్త్రవేత్తలు ఈ కుటుంబమును ఈ క్రింది రకములుగా కూడా వర్గీకరించినారు.

**రాస్ వర్గీకరణ** (Ross Classification):

రాస్ ప్రకారము కుటుంబములో నాలుగు రకములు కలవు.

**1. పెద్ద సమిష్టి కుటుంబము:** మూడు లేక నాలుగు తరాల వ్యక్తులు ఒకే ఇంటిలో నివసిస్తూ, ఉమ్మడి వంటను, ఉమ్మడి ఆస్తి ఆదాయాలను కలిగియుంటారు.

**2. చిన్న సమిష్టి కుటుంబము:** రెండు తరాలకు చెందిన వ్యక్తులు ఒకే ఇంటిలో నివసిస్తారు.

**3. న్యూక్లియర్ కుటుంబము (వ్యష్టి కుటుంబము):** తల్లి, తండ్రీ వారి పెళ్లి కాని పిల్లలు నివసిస్తారు.

**4. ఆధారపడ్డ వ్యక్తులతో న్యూక్లియర్ కుటుంబము:** తల్లి, తండ్రి, అవివాహిత పిల్లలు మరియు ఒకరిద్దరు ఆధారపడిన వ్యక్తులతో కుటుంబము.

**డ్రైవరు వర్గీకరణ** (Driver's Classification):

డ్రైవరు కుటుంబాలను ఈ క్రింది విధంగా వర్గీకరించినాడు. అవి స్థూలముగా రెండు రకాలు.

1) న్యూక్లియర్ కుటుంబము 2) ఉమ్మడి కుటుంబము.

ఎ) న్యూక్లియర్ కుటుంబాలు రెండు రకములు.

**సామాన్య వ్యష్టి కుటుంబము:**

సామాన్య వ్యష్టి కుటుంబములో భార్య, భర్త మాత్రమే ఉంటారు.

**సంశ్లిష్ట వ్యష్టి కుటుంబము:**

వైవాహిక బంధం ద్వారా గానీ, రక్త సంబంధం ద్వారా కానీ ఉన్న బంధువులతో నివసిస్తున్న భార్యాభర్తలు కుటుంబము సంశ్లిష్ట వ్యష్టి కుటుంబము.

పాఠం-14

# ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

ఉమ్మడి కుటుంబము రెండు రకములు.

1) ఉమ్మడి కుటుంబము

2) మార్జినల్ ఉమ్మడి కుటుంబము (Marginal Joint Family)

## 1. ఉమ్మడి కుటుంబము:

రెండు గానీ, అంతకంటే ఎక్కువ గానీ వివాహిత జంటలు ఉంటారు. వారు వారి పిల్లలతో నివసిస్తుంటారు. లేక రెండు గానీ, అంతకంటే ఎక్కువ జంటలు గానీ దగ్గర లేక దూరపు బంధువులతో నివసిస్తుంటారు. లేక ఒకే జంట మూడు తరాల వారితో నివసిస్తుండవచ్చు.

## 2. మార్జినల్ ఉమ్మడి కుటుంబము:

ఒక వివాహిత జంట వివాహం అయినా కాకపోయినా పిల్లలు వారితో నివసిస్తుంటే అది మార్జినల్ ఉమ్మడి కుటుంబము.

పై వర్గీకరణతోపాటు డ్రైవర్ 'హౌస్‌హోల్డ్' కుటుంబ పద్ధతినికూడా పేర్కొనినాడు.

ఒక వివాహిత జంటతోపాటు అదే తరంలోని ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ బంధువులు నివసిస్తే అది హౌస్‌హోల్డ్ (Household) కుటుంబ పద్ధతి.

**గోరే వర్గీకరణ** (Gore's Classification):

గోరే కుటుంబాలను రెండు స్థూల రకములుగా వర్గీకరించినాడు.

1) న్యూక్లియర్ లేక వ్యష్టి కుటుంబము.

2) ఉమ్మడి కుటుంబము

న్యూక్లియర్ కుటుంబమును మూడు రకాలుగా వర్గీకరించినాడు. అవి:

1. భార్యా, భర్త, వివాహం కాని పిల్లలు ఉన్న కుటుంబం.
2. భార్య, భర్త, పిల్లలు వివాహం కాని సోదరులు ఉన్న కుటుంబం.
3. భార్య, భర్త, పిల్లలు, వితంతు తల్లి మరియు కొంత మంది రక్తబంధువులు కాని వారు ఉన్న కుటుంబం.

గోరే ఉమ్మడి కుటుంబమును తిరిగి మూడు రకాలుగా వివరించినాడు.

1. భార్య, భర్త, వివాహం అయిన, వివాహం కాని పిల్లలు ఉన్న కుటుంబం.
2. భార్య, భర్త, వివాహం అయిన, వివాహం కాని పిల్లలు, వివాహం కాని సోదరులు ఉన్న కుటుంబం.
3. భార్య, భర్త, వివాహిత కుమారులు, వివాహిత సోదరులు ఉన్న కుటుంబము.

**పోలిన్ కొలిందా** (Pauline Kolenda) **వర్గీకరణ:**

కొలిందా కుటుంబమును 12 రకాలుగా వర్గీకరించినారు.

1) న్యూక్లియర్ లేక వ్యష్టి కుటుంబము. (Nuclear Family)

2) మద్దతు వ్యష్టి కుటుంబము (Supplementary Nuclear Family)

3) ఉప వ్యష్టి కుటుంబము (Sub Nuclear Family)

4) మద్దతు, ఉప వ్యష్టి కుటుంబము (Supplemented Sub Nuclear Family)

5) వంశానుక్రమ ఉమ్మడి కుటుంబము (Lineal Joint Family)

6) మద్దతు వంశానుక్రమ ఉమ్మడి కుటుంబము (Supplemented Lineal Joint Family)

7) దాయాదుల ఉమ్మడి కుటుంబము (Collateral Joint Family)

8) దాయాదుల మద్దతు ఉమ్మడి కుటుంబము (Supplemented Collateral Joint Family)

9) వంశానుక్రమ దాయాదుల ఉమ్మడి కుటుంబము (Lineal Collateral Joint Family)

10) వంశానుక్రమ దాయాదుల మద్దతు ఉమ్మడి కుటుంబము (Supplemented Lineal Collateral Joint Family)

11) ఒంటరి వ్యక్తుల కుటుంబాలు (Single Person Households)

12) మిగిలిన వారు (others)

1. వ్యష్టి కుటుంబములో వివాహిత దంపతులు పిల్లలతో జీవిస్తారు.

2. మద్దతు వ్యష్టి కుటుంబములో అదనంగా మరొక వ్యక్తి వివాహిత జంటలో వారి పిల్లలు లేకుండా కానీ, పిల్లలతో కానీ ఉంటారు. ఈ అదనపు వ్యక్తి తల్లి లేక తండ్రి, అవివాహిత సోదరి లేక సోదరుడు లేక వైవాహిక బంధువు అయిన అత్త గానీ, మామ గానీ అయి ఉండవచ్చు.

3. పురుషుడు గానీ, స్త్రీ గానీ వారి పిల్లలతో నివసిస్తే అది ఉప వ్యష్టి కుటుంబము.

4. మద్దతు ఉప వ్యష్టి కుటుంబములో స్త్రీ గానీ, పురుషుడు గానీ, వారి పిల్లలతోబాటుగా ఒక బంధువు నివసిస్తాడు.

5. వంశానుక్రమ ఉమ్మడి కుటుంబములో పుత్ర సంతతి, సోదరుల సంతతి కలిసి నివసిస్తారు.

6. కుటుంబ సభ్యులతోపాటు అదనంగా ఎవరైనా నివసిస్తున్నట్లయితే అవి మద్దతు వంశానుక్రమ ఉమ్మడి కుటుంబము, దాయాదుల ఉమ్మడి కుటుంబము, దాయాదుల మద్దతు ఉమ్మడి కుటుంబము, దాయాదాల మద్దతు ఉమ్మడి కుటుంబము, వంశానుక్రమ దాయాదుల మద్దతు ఉమ్మడి కుటుంబము యొక్క పరిగణనలోనికి వస్తాయి. (అదనంగా సభ్యుని యొక్క బంధుత్వాన్ని పరిగణనలోనికి తీసుకోవలెను).

భార్య లేని భర్త, భర్తలేని భార్య ఒంటరి కుటుంబాలు. అన్నా, చెల్లి, అక్కా, చెల్లి, బామ్మ-మనవరాలు, మేనత్త-మేనకోడలు వీరు మిగిలిన వారి తరగతికి చెందినవారు.

**రామ్ అహుజా వర్గీకరణ** (Ram Ahuja's Classification):

రామ్ అహుజా కుటుంబాలను ఈ క్రింది విధముగా రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి:

1. 'సంప్రదాయక' కుటుంబాలు (Traditional Families)

2. 'విచ్ఛిన్న' కుటుంబాలు (Fissioned Families)

రామ్ అహూజా వినియోగించిన కుటుంబాల వర్గీకరణ పదాలను ఉమ్మడి కుటుంబ, వ్యష్టి కుటుంబ పదాలకు పెద్ద వ్యత్యాసము లేదు. పురాతన కాలములోని ఉమ్మడి కుటుంబములను 'సంప్రదాయక' కుటుంబాలుగా, ఆధునిక కాలంలో కుటుంబాలను విచ్ఛిన్న కుటుంబాలుగా అహూజా వర్గీకరించినాడు.

ఈ రెండు తరగతుల కుటుంబాలను అహూజా పునర్వర్గీకరించినాడు. సంప్రదాయక కుటుంబాలను ఈ క్రింది విధంగా వర్గీకరించినాడు.

**1) విస్తృత పరిధిలో బంధువులు గల కుటుంబము** (Large Range Kinship Family):

ఈ తరహా కుటుంబములో నాలుగు తరాల బంధువులు నివసిస్తుంటారు (తాత, తండ్రి, కొడుకు, మనవడు).

**2) మధ్యతరహా పరిధిలో బంధువులు గల కుటుంబము** (Intermediate Range Kinship Family):

ఈ తరహా కుటుంబములో మూడు తరాల బంధువులు నివసిస్తుంటారు (తండ్రి, కొడుకు, మనవడు).

**3) చిన్న పరిధిలో బంధువులు గల కుటుంబము** (Small Range Kinship Family):

ఈ తరహా కుటుంబములో రెండు తరాల బంధువులు లేక ఒక తరం వారే నివసించవచ్చు. (కొడుకు, మనవడు) లేక ఒక్కరే జీవించవచ్చు.

విచ్ఛిన్న కుటుంబాలను తిరిగి రెండు రకములుగా వర్గీకరించినాడు.

1) **స్వతంత్ర్య కుటుంబము:** భార్య, భర్త, వివాహం కాని పిల్లలు నివసిస్తుంటారు. కుటుంబ యజమానికి ఆర్థిక స్వాతంత్ర్యముంటుంది.

2) **ఆధారిత కుటుంబము:** భార్య, భర్త, వివాహం కాని పిల్లలు నివసిస్తున్నప్పటికీ, కుటుంబ యజమానికి ఆర్థిక స్వాతంత్ర్యం లేక మరొక కుటుంబంపై ఆర్థిక పరంగా, ప్రకార్య పరంగా ఆధారపడతాడు.

## 14.1 సమిష్టి కుటుంబము (Joint Family):

భారతీయ సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవలెనంటే సమిష్టి కుటుంబాన్ని గురించిన అవగాహన ఉండవలెను. మన సామాజిక వ్యవస్థలో సమిష్టి కుటుంబము ఎంతో గణనీయమైన పాత్ర వహించింది. చరిత్ర గతిలో అనేక కారణాల వల్ల సమిష్టి కుటుంబము వృద్ధి పొంది వివిద కారణాల వల్ల విచ్ఛిన్నమవుతూ, రాను రాను అదృశ్యమైపోతున్నది. ఇతరేతర సమాజాలలో కూడా ఇట్లాంటి సంస్థలు వృద్ధి పొందినాయి. ఉదాహరణకు పూర్వము రోమ్‌లో మగ పిల్లలలో పెద్ద వానికి కుటుంబ విషయాలలో సర్వహక్కులు ఉండేవి. భారతీయ సమాజంలో సమిష్టి కుటుంబ వ్యవస్థ ముఖ్యపాత్ర నిర్వహించింది. ఈనాటికి కూడా అనేక ప్రాంతాలలో సమిష్టి కుటుంబ వ్యవస్థ వర్ధిల్లుతూనే ఉంది. ప్రారంభ దశ నుంచి వ్యవసాయము మొదలైన పద్ధతులు కనిపెట్టిన తరువాత మానవజాతి నుంచి మరొక దశకు అభివృద్ధి చెందే సందర్భంలో మధ్య ఉన్న సామాజిక సంబంధాలు కూడా మార్పు చెందినాయి. వ్యవసాయం మీద బతుకుతూ ఒక నిర్ణీత ప్రాంతంలో ఉంటూ ఇల్లు వాకిలి ఏర్పరచుకున్నప్పుడే కుటుంబం తీరుతెన్నులు కూడా మారిపోతాయి. మానవ చరిత్రలో సమిష్టి కుటుంబ వ్యవస్థ అభివృద్ధికి, వ్యవసాయము మొదలైనవి అభివృద్ధి చెందిన దశకూ ఎంతో సన్నిహితత్వం ఉంది. ప్రకృతిని జయించిన కొద్దీ ఉత్పత్తి విధానాలు మారిన కొద్దీ సామాజిక సంబంధాలు మారుతాయి. ఆనాడు వ్యవసాయం చేయడానికి పెద్ద పెద్ద కుటుంబాలు చాలా అవసరమయినాయి. భూమికి కొరత లేదు. కానీ, చేసే వాళ్లకు కొరత ఉండేది. కాబట్టి ఆనాడు సమాజ పరంగా పెద్ద కుటుంబాలు అవసరమైనాయి.

**సమిష్టి కుటుంబ లక్షణాలు:**

(1) సమిష్టి కుటుంబానికి చెందిన ఆస్తిపాస్తుల మీద తండ్రి గానీ, పెద్ద కుమారుడు కానీ పెద్దలుగా ఉంటూ పెత్తనం చేస్తూ ఉంటారు. కుటుంబ విజయానికి ఆస్తిపాస్తులు సంపాదించడంలో వినియోగించేవారు.

(2) మత సంబంధ కార్యాలను కుటుంబంలోని సభ్యులు అందరూ కలిసి నిర్వహిస్తారు.

(3) కుటుంబ సభ్యులు సంపాదించిన ధనాన్ని ఒకే మొత్తంగా ఉంచి కుటుంబానికి ఖర్చు కాగా, మిగిలిన ధనాన్ని కుటుంబ యజమాని నిలవచేస్తాడు.

(4) శక్తి కొద్దీ కష్టపడి పనిచేసి తనకవసరమయిన దానిని సమిష్టి నుంచి తీసుకోవడమే ఈ సమిష్టి కుటుంబంలోని విశిష్ట లక్షణము.

(5) సమిష్టి కుటుంబంలో భార్య, భర్త లేక వారి దగ్గర బంధువులు కూడా సభ్యులుగా ఉంటారు. అన్నదమ్ములు, వారి భార్యాపిల్లలు, మేనమామలు, మేనత్తలు, వారి సంతానము, మనుమలు, మనవరాళ్లు మొదలైన వారందరూ సమిష్టి కుటుంబంలో ఉంటారు. మనమందరము ఒకటే అనే మానసిక భావన సమిష్టి కుటుంబ సభ్యులలో ఉంటుంది.

(6) ఆస్తి సమిష్టిగా ఉంటుంది. ఆదాయమంతా సమిష్టిగా ఉంటుంది. సభ్యుల అవసరాలకు అయ్యే ఖర్చులను మొత్తం ఆదాయం నుంచే వాడుతుంటారు.

(7) సమిష్టి కుటుంబ సభ్యులందరూ ఒకే ఇంటిలో ఉంటారు. సభ్యులందరికీ ఒకే వంటశాల ఉంది.

(8) సమిష్టి కుటుంబ వ్యవహారాలలో కుటుంబ పెద్దదే అంతిమ నిర్ణయము. మిగతా సభ్యులు తమ కుటుంబ యజమానిని సంప్రదించకుండా ఎన్నడూ వ్యవహరించరు.

**సమిష్టి కుటుంబ ప్రయోజనాలు:**

(1) సమిష్టి కుటుంబంలో సబ్యులందరూ కష్టపడి సహకారంతో పని చేయడం వల్ల ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్గుతుంది.

(2) వ్యవసాయము జీవనోపాధిగా ఉన్న కుటుంబాలకు ఉమ్మడి కృషి వల్ల దుబారా ఖర్చులు తగ్గి పొదుపు సాధ్యమవుతుంది. ఆహార, గృహ వసతులలో కూడా పొదుపు జరుగుతుంది.

(3) కుటుంబంలోని వృద్ధులకు, వికలాంగులకు, నిరుద్యోగులకు, అనాథలకు ఆశ్రయం లభిస్తుంది.

(4) ఉమ్మడి కుటుంబాల వల్ల బాలబాలికలు ఉన్నత విద్య లభ్యసించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

(5) ఉమ్మడి కుటుంబానికి సమాజంలో గౌరవ ప్రతిష్టలు అధికంగా ఉంటాయి.

(6) సహకారము, త్యాగము, సమత్వము, నాయకత్వము, క్రమశిక్షణ, విధేయత మొదలయిన ఉత్తమ గునాలు అలవడడానికి తగిన వాతావరణము ఉమ్మడి కుటుంబంలో లభ్యమవుతుంది.

(7) పిన్నలు, పెద్దలు ఒకే ఇంటిలో ఉండడం వల్ల పెద్ద వారి అనుభవాల నుంచి పిన్నలు లోకజ్ఞానాన్ని గడిస్తారు.

(8) కుటుంబంలోని వ్యవహారాలను అందరూ కలిసి సక్రమంగా నిర్వహించి పని సులభంగా జరగడానికి తోడ్పడుతారు.

(9) తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం తెచ్చుకోవడానికి అవకాశముంటుంది.

(10) భూమిని విభజించడం జరుగదు. తత్ఫలితంగా ఉత్పత్తి ఎక్కువ కావడానికి వీలుంటుంది.

(11) సహజీవనము, త్యాగము, ప్రేమ, సేవ మొదలైన ధార్మిక గుణాలు సభ్యులందరికీ అలవడుతాయి.

**సమిష్టి కుటుంబంలో లోపాలు:**

(1) సమిష్టి కుటుంబంలో కొందరు కృషి చేయకుండా బద్దకంగా జఢత్వంతో జీవితాన్ని వెళ్లబుచ్చుతారు. ఎట్లాగైనా గడుస్తుంది కదా అనే దృష్టితో కొందరు మనస్ఫూర్తిగా పనిచేయరు. కొంతమంది మాత్రమే శ్రమపడవలసి వస్తుంది.

(2) సమిష్టి కుటుంబంలో కుటుంబ పెద్ద నిర్ణయమే అంతిమ నిర్ణయమవుతుంది. కొన్ని సందర్భాలలో కుటుంబ పెద్ద తన అభిప్రాయాలను మిగిలిన వారి మీద రుద్దడం కద్దు. కుటుంబ సభ్యులకు కొంత స్వేచ్ఛ తగ్గడమేకాక, వారి వ్యక్తిత్వము, సృజనాత్మకత శక్తులు ఎక్కువగా అభివృద్ధి చెందవు.

(3) కుటుంబ సభ్యుల మధ్య లేనిపోని అపార్థాలు పెరిగి తగాదాలు ఏర్పడుతాయి. ఈ తగాదాలకు ద్వేషము, ఓర్వలేని తనము కారణాలవుతాయి. సమిష్టి కుటుంబంలో నూతన వధూవరులకు వివాహమయిన మొదటి దశలో తగినంత స్వేచ్ఛ ఉండదు.

(4) సమిష్టి కుటుంబాలలో ఒకరితో ఒకరు పోటీపడి దుబారా ఖర్చు చేసే తత్వము అధికంగా ఉంటుంది.

(5) ఆస్తి పంపకాలలో తగాదాలు రావడానికి అవకాశాలెక్కువ. న్యాయ సంబంధమయిన చర్య లేకుండా ఈ తగాదాలు తీరవు. వ్యవసాయం చేసే కుటుంబాలలో భూమిని పంపకాలు చేసుకోవడం వల్ల భాగాలు మిక్కిలి చిన్నవి అవుతున్నాయి. వ్యవసాయానికయే ఖర్చు ఎక్కువ. రాబడి తక్కువ. అందువల్ల నష్టపడుతున్నారు.

(6) సమిష్టి కుటుంబాలలో స్వార్థపరత్వము ఎక్కువగా ఉంటుంది. నిరంకుశలయిన కుటుంబ యజమానులు కొంత రహస్యంగా దారి పిన్నలకు నష్టం కలుగచేయవచ్చు. సమిష్టి కుటుంబంలో విశిష్టమయిన లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. పితృ స్వామిక కుటుంబము ఏర్పడినప్పటి నుంచి ఈ వ్యవస్థ ఆచరణలో ఉంది. నేటికీ చాలా కుటుంబాలలో ఈ విధానము అమలులో ఉంది. కానీ, సమాజంలో నేడు అమలులో ఉన్న ఆర్థిక విధానాల వల్ల సమిష్టి కుటుంబ వ్యవస్థ క్షీణిస్తున్నది.

**కుటుంబము-మారుతున్న పద్ధతులు:**

భారతీయ కుటుంబము యొక్క ముఖ్య లక్షణము ఉమ్మడి తత్వము. సంప్రదాయికంగా రెండు లేక మూడు తరాల బంధువులు ఒకే గృహంలో నివసిస్తూ ఉమ్మడి వంటనే చేసుకుంటూ ఉమ్మడి ఆస్తి ఆదాయాలను అనుభవిస్తూ ఉమ్మడి సంస్కృతిని కలిగియుంటారు. ఈనాడు ఈ ఉమ్మడి కుటుంబాలు స్వతంత్ర, వ్యవష్టి కుటుంబాలుగా రూపుదిద్దుకొనుచున్నవి.

జె.బి.బౌమన్ (J.P.Bowman) తన 1951, 'డైజెస్ట్ ఆఫ్ ది సెన్సెస్ రిపోర్టు ఫర్ బొంబే, సౌరాష్ట్ర అండ్ కచ్'లో (Digest of the Census Report for Bombay, Saurashtra and Kutch) సనాతన ఉమ్మడి కుటుంబాలు అనుకున్న దానికన్నా చాలా తక్కువగా ఉన్నాయని అభిప్రాయ పడినాడు. భారతదేశపు సెన్సెస్ కమిషనరు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినారు. ఒకచోట జీవించే ఉమ్మడి కుటుంబాల సంఖ్య తగ్గి, వ్యష్టి కుటుంబాల సంఖ్య పెరుగుచున్నది. ఈ పద్ధతి ఇంకా పెరుగుతూనే ఉంది. ఫలితంగా వ్యష్టి కుటుంబాలే ఆధిక్యతను సంతరించుకొనుచున్నవి.

ఐ.పి.దేశాయ్ (I.P.Desai) సౌరాష్ట్రలోని మహువా పట్టణంలో అధ్యయనం చేసి 61.47 శాతం వ్యష్టి కుటుంబాలు ఉన్నాయని కనుగొన్నాడు. ఇదే పద్ధతి ఇంకా కొనసాగుతోందని అతను అభిప్రాయపడినాడు. 38.53 శాతం ఉమ్మడి కుటుంబాలలో సగం మాత్రమే ఒకే ఇంటిలో జీవించడం, ఉమ్మడి వంట, ఉమ్మడి ఆస్తి ఆదాయాలను కలిగియున్నాయని ఆయన గమనించారు. అందులో మూడవ వంతు కుటుంబాల సంఖ్య పనిచేయుటలో మాత్రమే ఉమ్మడి కుటుంబాలుగా ఉన్నాయని గమనించాడు. వ్యష్టి కుటుంబాలు పెరుగుతున్నవనీ, ఉమ్మడి కుటుంబాలు తరుగుచున్నవనీ ఆయన నిర్ధారించారు. భార్య, భర్త, పిల్లల కుటుంబాలు మాత్రమే ఎక్కువగా గోచరిస్తున్నాయని వివరించినాడు.

రాస్ 1961లో బెంగుళూరులో అధ్యయనం చేసి తన అధ్యయనంలో 64.3 శాతం వ్యష్టి కుటుంబాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ అధ్యయనం ఆధారంగా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై, వ్యష్టి కుటుంబాలు ఆవిర్భవించినవని వివరించారు. రామకృష్ణ ముఖర్జీ కూడా తన బెంగాల్ అధ్యయనంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినారు.

**సమిష్టి కుటుంబాలలో వస్తున్న మార్పులు:**

సమాజము నిత్య చైతన్య స్రవంతి. సమాజంలో నిర్దిష్టమైన మార్పులు త్వరత్వరగా వస్తూ ఉన్నాయి. భౌతిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక, వైజ్ఞానిక శక్తులు ఈ మార్పులకు దోహదం చేస్తున్నాయి. ఈ సామాజిక పరిణామ దశలో సమాజ నిర్మాణంలోని భాగాలన్నీ మార్పు చెందుతాయి. విధి నిర్వహణలో కుటుంబ వ్యవస్థ కూడా తీవ్రమయిన మార్పులకు గురి అవుతున్నది.

సమిష్టి కుటుంబము స్వయం సమృద్ధమయిన వ్యవస్థ. ఆర్థిక, నైతిక, విద్యా, వైద్య కార్యక్రమాలకు ఇది కేంద్రము. ఈ సమిష్టి కుటుంబంలో సభ్యులు సంపూర్ణ వ్యక్తులుగా రూపొంది అవకాశము ఉంది. దేశంలో వస్తూ ఉన్న ఆర్థిక, సాంఘీక, రాజకీయ పరిణామాల ఫలితంగా సమిష్టి కుటుంబాలలో చాలా మార్పులు వస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం దీనికెక్కువ దోహదం చేస్తుంది. ఈ మార్పుల ఫలితంగా ఆధునిక కుటుంబము అవతరించింది. నేడు దేశ వ్యాప్తంగా ఈ ఆధునిక కుటుంబాలు వ్యాప్తి చెందుతున్నాయి. భార్య, భర్త, ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఈ కుటుంబ నిర్మాణంలో సభ్యులు.

బ్రిటీషు వారి పరిపాలనా కాలంలో భారతీయ సమాజంలో కలిగిన ఎన్నో మార్పులు సమిష్టి కుటుంబ వ్యవస్థను బాగా ప్రభావితం చేసినాయి. పారిశ్రామికీకరణ, నగరాలకు వలస పోవడం, ప్రయాణ సౌకర్యాలు పెరగడం, ఆధునిక విద్య, వ్యవసాయేతర వృత్తుల మీద ఆధారపడడం, స్త్రీ విద్య, స్వేచ్ఛ, ఉద్యోగ నిర్వహణ, నూతనాలోచనలు, అభిప్రాయాలు మొదలైనవి సమిష్టి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడానికి కారణాలయినాయి. నగర ప్రాంతంలో సమిష్టి కుటుంబాలు తక్కువగా ఉంటాయి. గ్రామ ప్రాంతాలలో కూడా సమిష్టి కుటుంబాలు చీలిపోతున్నాయి.

**సమిష్టి కుటుంబంలో వస్తున్న మార్పుకు కారణాలు:**

**(1) ప్రజాస్వామ్య ఆదర్శాలు:**

భారతదేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యక్తులకు రాజ్యాంగ బద్ధమయిన హక్కులు లభించినాయి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమానత్వ సోదర భావాలను, స్త్రీ, పురుషులకు రాజ్యాంగం ప్రసాదించిన వరాలు. వీటివల్ల ఇంటా-బయటా పురుషులతోపాటు స్త్రీకి కూడా ప్రాతినిధ్యం పెరిగింది. నేడు అన్ని రంగాలలో, అన్ని వృత్తులలో స్త్రీ పాల్గొంటూ ఉంది. ఇది సాంప్రదాయ కుటుంబంలో వచ్చిన ముఖ్యమైన మార్పు. పూర్వము స్త్రీల కార్యకలాపాలు ఇంటికి మాత్రమే పరిమితమై ఉండేవి. కానీ, నేడు పురుషులతో బాటు అన్ని రంగాలలో పాల్గొనే అవకాశాలు స్త్రీలకు ఈ ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కల్పించినాయి. దీనివల్ల స్త్రీ హెూదాలలో పెద్ద మార్పు వచ్చింది.

**(2) పారిశ్రామికీకరణము:**

పారిశ్రామిక విప్లవం వల్ల సంప్రదాయ కుటుంబ నిర్మాణంలో విధులలో మార్పులు వచ్చినాయి. మన దేశము వ్యవసాయిక దేశము. వ్యవసాయము మనకు ముఖ్య జీవనాధారము అయినప్పటికీ నేడు సాంకేతిక, వైజ్ఞానిక ప్రగతిని పురస్కరించుకొని పారిశ్రామికాభివృద్ధిని సాగించే ప్రయత్నాలు జరుగుచున్నవి. సమిష్టి కుటుంబము ఉత్పత్తి వినియోగాలు రెండింటితో కూడిన స్వయం సమృద్ధమైన వ్యవస్థ. నేడు పారిశ్రామికాభివృద్ధి వల్ల కుటీర పరిశ్రమలు, చేతి పనులు క్షీణించినాయి. పరిశ్రమలలో యంత్రాలకు ప్రముఖ స్థానం కల్పించి తక్కువ వ్యయంతో స్వల్ప వ్యవధిలో అధిక ఉత్పత్తిని సాధించవచ్చు. ఎక్కువ మంది పురుషులకు, స్త్రీలకు కూడా ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలు కల్పించవచ్చు. దీనివల్ల 'శ్రామిక వర్గము' (Working Class) బయలుదేరింది. కుటుంబంలో ఉండే సభ్యులు చాలా మంది ఈ పరిశ్రమలలో, కర్మాగారాలలో పనిచేస్తున్నారు. ఈ పారిశ్రామికాభివృద్ధి స్త్రీలకు ప్రత్యేక హెూదా కల్పించింది. ఆర్థిక, రాజకీయ, సాంఘీక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించింది. నేడు చాలా మంది స్త్రీలు కర్మాగారాలలో పనిచేస్తున్నారు. వారికి పురుషులతో బాటు ఆర్థిక సమానత్వం కలిగింది. పూర్వము స్త్రీలకు భర్తలను తల్లిదండ్రులు నిర్ణయించి వివాహము జరిపించేవారు. నేడు ప్రజాస్వామ్య సిద్ధాంతాల మూలంగా సమాజంలో వస్తూ ఉన్న విలువల మార్పుల మూలంగా స్త్రీలకు స్వేచ్ఛ లభించింది. వారి జీవిత భాగస్వాములను వారే ఎన్నిక చేసుకోవచ్చు. వారి మనస్తత్వాలకు, భావాలకు, ఆదర్శాలకు

తగిన వ్యక్తిని వారు ఎన్నిక చేసుకోవచ్చు. సమిష్టి కుటుంబంలో ఉండే నిర్బంధాలు ఆదునిక కుటుంబంలో చాలా వరకు తొలగినాయి.

**(3) వ్యక్తి వాదము:**

ఆర్థిక విప్లవము దేశంలో చాలా మార్పులు తెస్తూ ఉంది. సమిష్టి కుటుంబంలో చాలా మంది సభ్యులు కలిసి పనిచేసి వారి సంపాదనను ఉమ్మడిగా ఖర్చు చేసేవారు. నాడు సమాజంలో క్లిష్టమయిన పరిస్థితులు లేవు. వ్యవసాయిక కార్యక్రమాలలో పరస్పర సహకారంతో వ్యక్తులంతా కలిసి పనిచేసేవారు. కానీ, నేడు పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఆధునిక భావాలు ప్రచారమవుతున్నాయి. సభ్యుల మధ్య భావ సంఘర్షణ ఏర్పడింది. ఆర్థిక కారణాల మూలంగా పరిమిత కుటుంబాల మీద వ్యామోహం పెరిగింది. ఈ భావాల సంఘర్షణ వివిధ సభ్యులను వేరుచేస్తున్నది. అందువల్ల నేడు సమిష్టి సంపాదన, సమిష్టి ఖర్చు, సమిష్టి జీవనము చాలా క్లిష్టమవుతున్నాయి. వ్యక్తివాద భావాలు నేడు అధికముగా ప్రచారమవుతున్నవి. తన బాగోగులు, కుటుంబ పరిస్థితులు తానే చూసుకొంటున్నాడు. తానే నిర్ణయించుకుంటున్నాడు. "నేడు, నా ఇల్లు, నా పిల్లలు, నా కుటుంబము" అనే ఆధునిక భావాలు అధికంగా కలగడం వల్ల సమిష్టి కుటుంబ స్వరూపము మారిపోతున్నది.

**(4) పట్టణ పెరుగుదల:**

సమిష్టి కుటుంబంలో ఉన్న మార్పులకు మరొక ముఖ్యకారణము పారిశ్రామికాభివృద్ధితో కూడిన నగరాల పట్టణాల పెరుగుదల. నేడు పారిశ్రామికాభివృద్ధిలో అత్యంత వేగంగా జరుగుతున్నది. దీనితోబాటు నగరాలు, పట్టణాలు కూడా త్వరగా వృద్ధి చెందుతున్నాయి. పల్లెలలో వివిధ వ్యక్తుల మధ్య ఉండే పరస్పర అన్యోన్యత, అవగాహన, సానుభూతి పట్టణ వ్యక్తుల మధ్య ఉండదు. అంతేకాకుండా పట్టణాలలో వినోద, విలాస సౌకర్యాలు అధికంగా ఉండడం వల్ల వ్యక్తులు వారి విరామ కాలాన్ని వీటి కోసం వినియోగిస్తారు. అందువల్ల కుటుంబ సభ్యులంతా కలిసి విరామ కాలాన్ని ఆనందంగా గడపడం, పరస్పర అన్యోన్యత పెంచుకోవడం అనే భావాలకు అవకాశం లేదు. నడు ఈ సమిష్టి కుటుంబము పట్టణ ప్రాంతాలలో మార్పు చెందుతూ ఉంది. పట్టణ సమాజంలో కార్మికులు విరివిగా ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి వలసపోతూ ఉంటారు. పట్టణాలలో ఉపాధి, ఉద్యోగ సౌకర్యాలు అధికమనే భావంతో పల్లెల నుంచి ప్రజలు సంప్రదాయ వృత్తులను విడిచిపెట్టి పట్టనాలకు తరలివస్తున్నారు. అంతేకాకుండా కుటుంబంలోని సభ్యులు ఉద్యోగం కోసం దేశంలో దూర ప్రాంతాలకు సయితం తరలిపోతున్నారు. వీటి వల్ల కూడా సమిష్టి కుటుంబము క్షీణిస్తున్నదని చెప్పవచ్చు.

అంతేకాక, సాంఘీక నియంత్రణ సాధనాలయిన మతము, నీతి, ధర్మము, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు మొదలయిన వాటిలో విప్లవాత్మకమయిన మార్పులు వచ్చినాయి. వీటి వల్ల కూడా సమిష్టి కుటుంబము క్షీణించి ఆధునిక కుటుంబమవతరించడానికి తీవ్రంగా దోహదం జరిగింది.

ఆచార్య ఎమ్.ఎన్.శ్రీనివాస్ దక్షిణ భారతదేశంలో కూర్గుల సమిష్టి కుటుంబ వ్యవస్థను గురించి తీవ్ర పరిశోధన జరిపినాడు. దక్షిణ భారత దేశంలో ప్రధానమయిన సమిష్టి కుటుంబంగా కూర్గులు పరిగణనకు వస్తారు. అయినప్పటికీ, ఈ కూర్గులలో కూడా సమిష్టి కుటుంబ వ్యవస్థ క్షీణిస్తున్నది.

అయితే, నేడు పట్టణాలలో ఈ సమిష్టి కుటుంబ వ్యవస్థ ఎట్లా పనిచేస్తున్నది, అందులోని సభ్యుల మధ్య సంబంధాలు ఎట్లా ఉన్నాయి అనే విషయాలను గురించి క్షుణ్ణమయిన పరిశీలన లేనప్పుడు నిర్ణయాలు చేయడం కష్టం. నేడింకా అనేక పట్టణాలలో, గ్రామాలలో హిందూ ధర్మ సంప్రదాయాల ప్రభావం ప్రబలంగా ఉండడం వల్ల తల్లిదండ్రులను ముసలితనంలో పోషించడం కుమారుల విధియని ఇప్పటికీ గుర్తించడం జరుగుతున్నది. అవివాహితులైన అక్కా చెల్లెళ్లకు వివాహం చేయడం, అనాథలయిన అక్కాచెల్లెళ్లను పోషించడం తమ ధర్మంగా భావించి అన్నదమ్ములు నేటికీ సమిష్టి కుటుంబాలను నిర్వహిస్తున్నారు. ఈనాటికీ మన దేశంలో వ్యవసాయము, వ్యాపారము ప్రధాన వృత్తులుగా గల కుటుంబాలలో వ్యక్తులు విడివిడిగా కాపురాలు చేస్తున్నప్పటికీ వ్యవసాయ, వ్యాపారాలను సమిష్టిగా చేసుకుంటున్నారు.

మొత్తం మీద భారతీయ సమాజంలో ఈనాడు ప్రజలు వ్యష్టి కుటుంబాలపైనే మొగ్గుచూపుతున్నారు. ఉత్పత్తి విధానాలు మారుతున్నప్పుడు ఆ మార్పు ప్రభావము సమాజంలో ఉన్న వివిధ సంస్థల మీద కూడా ఉంటుంది. వ్యవసాయమే ప్రధాన వృత్తియై ఉండి, ప్రయాణ సౌకర్యాలు లేకుండా, పరిశ్రమలు అభివృద్ధి కానప్పుడు సమిష్టి కుటుంబ వ్యవస్థ చక్కగా పనిచేసింది. కానీ, సమాజంలో స్థితిగతులు మారడం వల్ల సమిష్టి కుటుంబము క్రమంగా క్షీణిస్తున్నది. దీని స్థానంలో వ్యష్టి కుటుంబాలు రూపొందుతున్నాయి.

నగరాలలో ఉద్యోగాలలో ఉన్న వారు గ్రామాలలో ఉన్న సమిష్టి కుటుంబాలతో పూర్తిగా సంబంధాలు వదులుకోవడం లేదు. పైగా, పెండ్లి మొదలైన విషయాలలో నిర్ణయాలు పెద్దలకే వదులుతున్నారు. నగరాలలో ఉద్యోగాలు చేసే వారి తల్లిదండ్రులు గ్రామాలలోనే ఉంటున్నారు. చదువుకునే చెల్లెళ్లు, తమ్ముళ్లు ఉద్యోగాలు చేసే వారి దగ్గర ఉంటున్నారు. చదువు, వివాహము అయిన దాకా వారు పెద్దన్నల దగ్గరే ఉంటారు. ఆ తరువాత ఉద్యోగం వచ్చిన చోటికి వెళతారు. అయితే గ్రామంలో ఉన్న తల్లిదండ్రులతోను, నగరంలో ఉన్న పెద్దన్నయ్యతోను వారికి నిత్య సంబంధాలు ఉండకపోవు. భారతీయ సమాజంలో కుటుంబ సంస్థ యూరోపియన్ సమాజాల మోస్తరు రూపొందడములేదు. పెద్ద కుమారుడు ఆర్జనపరుడయిన తరువాత దూరదేశంలో ఉన్న తన మిగతా తమ్ముళ్ల, చెల్లెళ్ల విద్యా వివాహ బాధ్యతలను తీసుకుంటాడు. యీ గురుతర బాధ్యత నిర్వర్తించేటప్పుడు తల్లిదండ్రుల సంప్రదింపులను, సహాయాన్ని పెద్ద కుమారుడు తీసుకొంటాడు. కుటుంబ సభ్యులు వివిద ప్రాంతాలలో ఉంటున్నప్పటికీ పెండ్లి మొదలైన శుభకార్యాల సందర్భాలలో అందరూ కలుస్తారు. కొన్ని సందర్భాలలో సమిష్టి కుటుంబ ఆస్తి అవిభక్తంగా ఉంటుంది. అన్నదమ్ములందరూ వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్నా తరాలు గడిచినా ఎవరి కాపురాలు వాళ్లు దిద్దుకుంటున్నా, గ్రామంలో వారి సమిష్టి కుటుంబానికి ఉన్న ఇల్లు, భూమి అవిభక్తంగానే ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా శ్రీకాకుళ ప్రాంతంలో సమిష్టి కుటుంబ వ్యవస్థ ఇంకా బాగా పనిచేస్తున్నది. ఉద్యోగ నిమిత్తం కుటుంబ సభ్యులు మరొక ప్రాంతానికి వెళ్లి ఉన్నప్పటికీ, వారి ఆదాయం కూడా సమిష్టి కుటుంబంలోని ఆదాయంగా పరిగణించడం జరుగుతున్నది. సమిష్టి కుటుంబ వ్యవస్థ మార్పుకు గురి అవుతున్నప్పటికీ అది పూర్తిగా మారడంలేదు.

## 13.2 ముఖ్య పదములు:

పితృవంశానుక్రమము

1) అగ్నాటిక్ రిలేషన్‌షిప్ (Agnatic Relationship): తండ్రి వంశానుక్రమం ద్వారా రక్త సంబంధము.

2) వైవాహిక బంధము: వివాహం ద్వారా భార్యాభర్తల మధ్య ఏర్పడు (Conjugal) సంబంధము.

3) రక్త సంబంధము: ఒకే రక్త సంబంధీకులు (Consanguinal)

4) తారావాద్ (Tarawad): మాతృస్వామిక ఉమ్మడి కుటుంబము. కేరళలోని నాయర్లలో గోచరిస్తుంది.

5) పేట్రియార్క్ (Patirarch) పురుషుడు కుటుంబ పెద్ద.

## 13.3 నమూనా ప్రశ్నలు:

1) భారతీయ కుటుంబము యొక్క స్వభావమును, లక్షణములను వివరించుము.

2) భారతీయ కుటుంబము యొక్క స్థిరత్వమును విశదీకరింపుము.

3) కుటుంబ వ్యవస్థలోని భిన్న రకములను తెలుపుము.

4) ఉమ్మడి కుటుంబ లక్షణములను వివరింపుము.

5) ఎన్ని రకములుగా ఉమ్మడి కుటుంబమును వర్గీకరించవచ్చునో వివరింపుము

6) భారతీయ కుటుంబములో ఈనాడు చోటు చేసుకుంటున్న మార్పులను విశ్లేషించుము.

7) భారతీయ కుటుంబ వ్యవస్థలో మార్పుకు దోహదం చేసే కారణాలను గుర్తించుము.

## 13.4 చదవదగిన పుస్తకములు:


1. అహూజా రామ్ : ఇండియన్ సోషల్ సిస్టమ్, రావత్ పబ్లికేషన్స్, జైపూర్ 1993.

Ahuja Ram : Indian Social System, Rawat Publications : Jaipur 1993

2. దేశాయ్, ఐ.పి, సమ్ ఏస్పెక్ట్స్ ఆఫ్ ఫ్యామిలీ ఇన్ మహూవా, ఆసియా పబ్లిషింగ్ హౌస్, 1964

Desai I.P, Some aspects of Family in Mahuva.

3. కపాడియా కే.ఎమ్, మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా, ఢిల్లీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, 1966

Kapadia K.M., Marriage and Family in India.

4. కొలెందా, పోలిన్ "రెలిజియన్, కాస్ట్ అండ్ ఫ్యామిలీ స్ట్రక్చర్" ఎ కంపారిటివ్ స్టడీ ఆఫ్ ఇండియన్ జాయింట్ ఫ్యామిలీ ఇన్ మిల్టన్ సింగర్ అండ్ బెర్నార్డ్ ఎస్.కాన్ (ఎడిటర్స్) స్ట్రక్చర్ అండ్ ఛేంజ్ ఇన్ ఇండియన్ సొసైటీ, న్యూయార్క్, విన్నర్-గ్రన్-ఫౌండేషన్ ఆఫ్ ఏంత్రోపో లాజికల్ రీసెర్చ్-1968.

Kolenda, Pauline-Religion, Caste and Family Structure A Comparative Study of Indian Joint Family in Milton singer and Bernard S.Cohn (Editors) Structure and change in Indian Society, New York Winner-Gren-Foundation of Anthropolagical Research 1968.

5. మదన్, టి.ఎన్, "ది జాయింట్ ఫ్యామిలీ ఎ.టెర్మలాజికల్ క్లాసిఫికేషన్" - ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కంపారిటివ్ సోషియాలజీ 3:7 ఒఏ 16.

Madan, T-N, "The Joint Family-A Termilogical Classification-International Journal of Comparative Sociology. 3:7 to 16.

**పాఠం-15**

# గిరిజన సామాజిక వ్యవస్థ (ఆదిమ తెగ)

**విషయక్రమం:**


**15.0** **లక్ష్యము**

**15.1** **ఆదిమ తెగ - భౌగోళిక వివరణ**

**15.2** **ఆదిమ తెగ - నిర్వచనములు**

**15.3** **ఆదిమ తెగ - లక్షణములు**

**15.4** **ఆదిమ తెగ - హెర్డ్**

**15.5** **ఆదిమ తెగ - డార్మిటరీ**

**15.6** **ముగింపు**

**15.7** **పరిభాషిక పదములు**

**15.8** **నమూనా ప్రశ్నలు**

**15.9** **చదువదగిన గ్రంథముము**


## 15.0 లక్ష్యము:

పై పాఠములలో ముస్లింలు, మరియు క్రైస్తవుల సామాజిక వ్యవస్థలను గూర్చి చర్చించాము. భారత సమాజములో ఆదిమ తెగ ప్రజలకు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. వీరి సామాజిక వ్యవస్థ హిందూ, ముస్లిం మరియు క్రైస్తవ సామాజిక వ్యవస్థకు భిన్నముగా ఉన్నప్పటికిని భారత సమాజములలో వీరు ఒక ముఖ్యమైన భాగముగా ఉన్నారు. ఆదిమ తెగ ప్రజలను గిరిజనులుగా వ్యవహరిస్తారు. ఈ పాఠములో గిరిజన సామాజిక వ్యవస్థను విశదీకరించడం లక్ష్యం.

## 15.1 ఆదిమ తెగ - భౌగోళిక వివరణ:

భారత సమాజములలో నివసించుకున్న గిరిజనులను భౌగోళిక ఆధారముగా ఈ క్రింది మూడు రకములుగా చెప్పవచ్చును. అవి:

**1. పశ్చిమ తూర్పు ప్రాంతములలో నివసించెడి గిరిజనులు:**

ఈ రకమైన తెగలు అస్సాం, త్రిపుర, మణిపూర్ ప్రాంతాలలో నివసించుచున్నవి. **1986-1987** కాలము నాటి లెక్కల ప్రకారము వీరి జనభా **21** లక్షలు. వీరు మంగోళ్ జాతికి చెందిన వారు. వీరి భాష ఆస్ట్రిక్ కుటుంబ భాష. ఇక్కడ నివసించుచున్న కొన్ని ముఖ్యమైన తెగలు “కుక్కీ”, “హగ” మరియు “మిక్కిర్”.

**2. మధ్య ప్రాంతములో నివసించే గిరిజనులు:**

ఈ రకమైన ఆదిమ తెగలు వింధ్యాచల్, సత్‌పురా, కేకల్ మరియు ఆరావళి పర్వత ప్రాంతాలలో నివసించుచున్నవి. **1986-1987** నాటికి ఈ ప్రాంతములో నివసిస్తున్న ఒక్క సంతాల్ తెగ వారి జనాభా **25** లక్షలు.ఈ ప్రాంతములో నివసించుకున్న ముఖ్యమైన తెగలలో మధ్యప్రదేశ్‌లోని "గోండ్ తెగ", రాజస్థాన్‌లోని "బిల్" తెగవారు. చోటా నాగపూర్‌లోని 'సంతాల్' తెగవారు, సింగ్ భూమిలో నివసించెడి "హెూ" తెగవారు, ఒరిస్సాకు చెందిన "ఖోండ్" మరియు "లారియా" తెగవారు, గంజామ్ ప్రాంతంలో నివసించెడి "సవారా" మరియు "ముండా" తెగల వారు. భారత సమాజములోని అధిక శాతం గిరిజనులు ఈ ప్రాంతములో నివాసము చేయుచున్నారు. వీరు చాలా దట్టమైన అడవులలో, పర్వత శ్రేణులలో నివసిస్తూ సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధాలు లేకుండా ఈనాటికీ ప్రాచీన దశ జీవిత విధానమును కలిగియున్నారు.

**3. దక్షిణ భూభాగ ప్రాంతము:**

ఈ రకమైన ఆదిమ తెగలు దక్షిణ భారతదేశములో నివసించుచున్నటువంటివి. భారత సమాజములోని అతి ప్రాచీనమైన ఆదిమ తెగ "కాదిర్" అను తెగ కేరళ ప్రాంతములో నివసించుచున్నది. ఇది ముఖ్యమైన ఆదిమ తెగలు నీలగిరిలోని "తోడా", ఆంధ్రప్రదేశ్‌లోని "చెంచు", "కోయ", "కొచ్చిన్"లోని "కురోవన్" కర్ణాటకలోని "కూర్గ్" మొదలగు తెగలు.

పైన చెప్పుకున్న వివిధ భౌగోళిక ప్రాంత తెగలతో పాటుగా అండమాన్ నికోబార్ దీవులలో నివసించెడి ఆదిమ తెగలు, పశ్చిమ హిమాలయా ప్రాంతాలలో నివసించెడి ఆదిమ తెగలు, చెండా మరియు మహస్సు మరియు డెహ్రాడూన్, డార్జిలింగ్‌లలో నివసించెడి ఆదిమ తెగలు, వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదిమ తెగలలో సంస్కృతి పరమైనటువంటి విభిన్నతలు ఉన్నవని, కొన్ని పరిశోధనల ద్వారా అర్థమగుచున్నది. ఈనాటికీ కొన్ని ఆదిమ తెగలు నాగరికత సమాజముతో ఏమాత్రము సంబంధము పెట్టుకోకుండా మామూముల ప్రాంతాలలో ప్రాచీన జీవిత విధానము కలిగియున్నవి. వీటిలో ముఖ్యమైనవి "నాగా" తెగ మరియు "సంతాల్" తెగ. ఆదిమ తెగను అవగాహన చేసుకొనుటకు ఈ క్రింది నిర్వచనములను పరిశీలింపుము.

## 15.2 ఆదిమ తెగ - నిర్వచనములు:

Dr. River అభిప్రాయం ప్రకారము ఆదిమ తెగ అనగా సాధారణమైనటువంటి ఒక సామాజిక సమూహం. ఈ సమూహాలలోని సభ్యులందరూ ఒకే భాషను కలిగి యుండి ఒకే రకమైన పనులను చేస్తూ కలిసి మెలిసి జీవిస్తూ ఉంటారు.

Lewis Gillin మరియు Philip Gillin అభిప్రాయము ప్రకారముఆదిమ తెగ అనగా ఒక భౌగోళిక ప్రాంతములో ఒకే భాష, సంస్కృతిని కలిగియుండి కలిసిమెలిసి జీవించెడి స్థానిక సముదాయములతో కూడిన ఒక సమూహము.

Dr. D.N. Majumdar అభిప్రాయములో ఒకే నామధేయమును కలిగియుండి, ఖచ్చితమైన భౌగోళిక ప్రాంతమును ఆక్రమించుకొని ఒకే భాషను కలిగి యుండి వివాహము, వృత్తి, మొదలగు వాటి పరముగా ఒకే విధమైన నిషేధాలను పాటిస్తూ, ఒకరికొకరు సహకారమును అందించుకుంటూ ఐక్యతతో జీవించెడి కొన్ని కుటుంబాల సమూహము ఆదిమ తెగగా అర్థం చేసుకొనవచ్చును.

George Peter Murdock "Dictionary of Sociology" ప్రకారము ఆదిమ తెగ అనగా కొన్ని గోత్రములు, సంచారక బృందములు లేక కొన్ని కలయిక వలన నిర్మాణమైనటువంటి ఒక సామాజిక సమూహము. ఈ రకమైన సమూహము ఒక నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతములో నివసిస్తూ ఒక ప్రత్యేకమైన భాషను, సంస్కృతిని, రాజకీయ వ్యవస్థాపనను కలిగి ఉంటుంది.

పై చెప్పుకున్న నిర్వచనములే కాకుండా Bogardus మరియు Perry మొదలగు వారు కూడా ఆదిమ తెగకు నిర్వచనాలను చెప్పినారు. పై చెప్పుకున్న నిర్వచనాలను ఆధారము చేసుకుని ఆదిమ తెగ లక్షణములను ఈ క్రింది విధముగా అర్థము చేసుకొనవచ్చును.

## 15.3 ఆదిమ తెగ - లక్షణములు:

ఆదిమ తెగ ఈ క్రింది లక్షణములను కలిగియున్నది. అవి:

**1. స్థిరమైన భౌగోళిక ప్రాంతము:**

ఆదిమ తెగ యొక్క మొదటి లక్షణము స్థిరమైన భౌగోళిక ప్రాంతమును ఆక్రమించుకుని నివసించుట. ఆదిమ తెగ ఈ లక్షణమును కోల్పోయినట్లయితే ఇతర కొన్ని లక్షణములను కూడా కోల్పోవు ప్రమాదము కలదు. ఈ విధముగా స్థిరమైన భౌగోళిక ప్రాంతములో నివసించుల దీని యొక్క మొదటి లక్షణము.

**2. ఐక్యమత్య భావన:**

పై చెప్పుకున్న స్థిర భౌగోళిక ప్రాంత లక్షణమును ఆదిమ తెగ కలిగియున్నప్పటికిని తెగలో నివసిస్తున్న సభ్యుల మధ్య ఐక్య భావన లేకపోయినట్లయితే ఆ సమూహమును ఆదిమ తెగగా పిలుచుటకు వీలులేదు. ఈ విధముగా సభ్యులు స్థిర నివాసము పేరిట అక్కడే పుట్టుట, పెరుగుట, మరణించుట జరుగుతుంది. కనుక తప్పనిసరిగా ఒకరినొకరు సహకరించుకుంటూ ఐక్య భావనతో జీవించవలసి యున్నది. ఈ లక్షణము ఆదిమ తెగకు అతి ముఖ్యమైనది.

**3. ఒకే భాష:**

ఆదిమ తెగ ప్రజలందరూ ఒకే భాషను మాట్లాడతారు. ఈ లక్షణము వీరిలో సాముదాయిక ఐక్యత భావన వృద్ధి చెందుటకు సహకరిస్తుంది.

**4. అంతర్వివాహ సమూహము:**

ఆదిమ తెగ సమూహము అంతర్వివాహ సమూహము. అనగా ఏ తెగ వారు ఆ తెగలోని వారినే వివాహమాడతారు. అనగా, ఒక తెగ వారు మరియొక తెగ వారితో వివాహ సంబంధములు కలిగియుండరు.

**5. రక్త సంబంధ బాంధవ్యాలు:**

ఆదిమ తెగ ప్రజలు తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఈ పితరుడు పురాణ పురుషుడై కూడా ఉండవచ్చును. ఈ భావన కలిగియుండుట వలన తామంతా రక్త సంబంధీకులము అన్న భావనను కలిగియుండి ఐక్యతతో జీవిస్తూ ఉంటారు.

**6. రక్షణ పరమైన వ్యవస్థాపన:**

ఆదిమ తెగ ప్రజలకు నిరంతరము రక్షణ భద్రత పరమైన సమస్యలు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఆదిమ తెగ తనకంటూ ఒక ప్రత్యేకమైన రాజకీయ పరిపాలనా వ్యవస్థను కలిగిఉంటుంది. పరిపాలనా బాధ్యతలు ఒక వ్యక్తికి అప్పగించబడతాయి. ఇతడు ఆదిమ తెగ అధిపతిగా గుర్తించబడతాడు. ఇతడు తన సామర్ధ్యము, ప్రజ్ఞ ద్వారా తెగను పరిపాలిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ ఉంటాడు. సౌలభ్యకరమైన పరిపాలన కొనసాగుటకు ప్రతి ఆదిమ తెగ కొన్ని భాగములుగా విభజింపబడియుడి ఒక్కొక్క భాగమునకు ఒక అధిపతి నియమింపబడి ఉంటాడు. ఈ వివిధ భాగముల అధిపతులు ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యంలో పరిపాలన కొనసాగిస్తూ ఉంటారు.

**7. మత ప్రాముఖ్యత:**

ఆదిమ తెగ లక్షణములలో మరియొక ముఖ్యమైనది మత ప్రాముఖ్యత. ఆదిమ తెగలో మతమునకు ఎనలేని విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. ఆదిమ తెగ రాజకీయ, సామాజిక వ్యవస్థలు మత ప్రకారము మతముపై ఆధారపడి నిర్వహించబడుతుంటాయి. మతము యొక్క అంగీకారము, గుర్తింపు లేకపోయినట్లయితే ఏ అంశమునకు కూడా విలువ

ఉండదు, అవి పాటించబడవు. ఈ విధముగా మత ప్రాముఖ్యత ఆదిమ తెగలో స్పష్టముగా కనిపిస్తుంది. ఈ విధముగా మత ప్రాముఖ్యత ఆదిమ తెగ యొక్క ఒక ముఖ్యమైన లక్షణముగా చెప్పవచ్చు.

**8. ఒకే సంస్కృతి మరియు నామధేయము:**

ఒకే భాష, మతము, రాజకీయ వ్యవస్థాపన, ఐక్యమత్య భావన మొదలగు అంశాలు ఆదిమ తెగ ఒకే సంస్కృతిని కలిగి ఉండేటట్లుగా చేయుచున్నది. అదే విధముగా ప్రతి ఆదిమ తెగకు సహజముగా ఒక ప్రత్యేకమైన నామధేయము ఉంటుంది. ఆ పేరు ద్వారానే ఆ తెగ ప్రజలు వ్యవహరింపబడుతుంటారు.

**9. గోత్రముల వ్యవస్థాపన:**

ఆదిమ తెగలో కొన్ని గోత్రములు ఉండును. ప్రతి గోత్రమునకు కొన్ని నిర్దిష్టమైన ప్రకార్యాలు, లక్షణాలు ఉంటాయి. ప్రతీ గోత్రమునకు ఒక అధిపతి ఉంటాడు. ఇతనిని గోత్ర అధిపతి అని పిలుస్తారు.

## 15.4 ఆదిమ తెగ - హెూర్డ్:

హెూర్డ్ అనగా సంచారక సమూహము వంటిది. నిర్దిష్టమైన ఒక ప్రాంతము, స్థిర నివాసము లేకుండగా సంచరిస్తూ ఉండెడి ఒక చిన్న సమూహము. ఈ రకమైన చిన్న సమూహము కాలక్రమేణా తన పరిమాణమును పెంచుకుని ఆదిమ తెగగా మారుతుంది. హెూర్డ్‌లోను, ఆదిమ తెగలోను రక్త సంబంధ భావన, సాముదాయిక భావన ఉండును. కానీ, ఆ రెండింటికీ ఈ క్రింది వ్యత్యాసములు ఉన్నవని బొగార్డస్ (Bogardus) అభిప్రాయపడినాడు. అవి:

1. ఆదిమ తెగ పరిమాణము హెూర్డ్ కన్నా పెద్దది.
2. ఆదిమ తెగలో హెూర్డ్ కన్నా మత ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది.
3. హెూర్డ్ కన్నా ఆదిమ తెగలో రక్షణకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది.
4. పెద్ద పరిమాణము కలిగి ఉండుట వలన హెూర్డ్‌తో పోల్చినప్పుడు ఆదిమ తెగలో ఐక్యత తక్కువగా ఉండును.
5. ఆదిమ తెగ కొన్ని భాగములుగా విభజింపబడి యుండగా హెూర్డ్‌లో అటువంటి భాగములు ఉండవు.
6. వ్యవసాయము సహజముగా ఆదిమ తెగ వృత్తియై ఉండగా, హెూర్డ్ సంచారక జీవనము కలిగియుండుట వలన వ్యవసాయ వృత్తికి ప్రాధాన్యత లేదు.
7. ఆదిమ తెగ స్థిర నివాసము కలిగియుండి నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతములో జీవిస్తుండగా, హెూర్డ్ స్థిర నివాసము లేకుండగా సంచార జీవనము జీవిస్తూ ఉంటుంది.

## 15.5 ఆదిమ తెగ - డార్మిటరీ (Dormitory):

ఆదిమ తెగలో ఒక ముఖ్యమైన సామాజిక సంస్థ యువజన వ్యవస్థాపన సాయంకాలము కాగానే యువతీ, యువకులను ఈ డార్మిటరీలో రాత్రి సమయము గడుపునట్లుగా చేస్తారు. గిరిజనులు సామాజిక జీవనమునకు ఈ డార్మిటరీలు చాలా ముఖ్యము. వీటికి వివిధ తెగలలో రకరకాల పేర్లు ఉన్నవి. అస్సాంలోని నాగా తెగలో మగవారు నివసించెడి పడక ఇల్లును "మొరంగ్" అనియు, ఆడువారు ఉండు పడక ఇల్లును "యొ" అని అందురు. నాగా తెగలో దీని పేరు "కుంచికి", ఉత్తరప్రదేశ్‌లోని ఆదిమ తెగలో దీని పేరు "రంగ్‌భంగ్", ముండా తెగలో దీని పేరు "గితియార".

ఈ పడక ఇల్లు తాటాకులు మరియు గడ్డితో విశాలముగా నిర్మింపబడి ఉంటాయి. ఆడవారికి, మగవారికి ఇవి వేరువేరుగా ఉండును. 15 లేక 16 సంవత్సరముల వయస్సు కలిగియున్న బాలబాలికలు రాత్రి సమయాలలో వీటి యందే నిద్రించవలెను. అస్సాంలోని "మియామి" తెగలోఆడ మరియు మగ పిల్లలు ఒకే డార్మిటరీలో నిద్రిస్తారు.ఎంతో అనారోగ్యము

ఉంటేనే కాని వీరికి వారి గృహములలో నిద్రించుటకు అనుమతి ఇవ్వరు. అవివాహిత యువతీ, యువకులు రాత్రి సమయములో పాటలు పాడుచూ, నృత్యములు చేయుచూ ఇతర సామాజిక చర్యలను జరుపుచూ రాత్రి కాలమును దీనిలోనే గడుపవలెను.

కొన్ని ఆదిమ తెగలలో డార్మిటరీలు గ్రామము వెలుపల, కొన్ని తెగలలో గ్రామమునకు దగ్గరగా, మరికొన్ని తెగలలో గ్రామమునకు మధ్యలో ఇవి నిర్మాణమై ఉంటాయి. దీనిలో నివసించుటకు వయో పరిమితి తెగకు తెగకు వేరుగా ఉంటుంది. సహజముగా నాలుగు లేక అయిదు సంవత్సరాలు పైబడిన వారు వీటిలో నివసించుటకు అర్హులు. వీరికి వివాహానంతరము వీటిలో నివసించు సభ్యత్వము ఉండదు. విధవగా మారిన స్త్రీ మళ్లీ దీనిలో సభ్యత్వము పొందుతుంది. దీనిలోని సభ్యులందరూ కొన్ని సాంప్రదాయబద్ధమైన నిబంధనలను అనుసరించవలెను.

సాయంకాలం కాగానే వీరు తమ గృహములలో భోజనము ముగించుకొని డార్మిటరీ వద్దకు చేరతారు. చలి మంట వేసుకొని దాని చుట్టూ చేరి పాటలు, నృత్యములు, కథలు చెప్పుకొని తరువాత నిద్రిస్తారు. ఈ సభ్యులలో వయస్సును బట్టి సీనియర్లు జూనియర్లు అని రెండు తరగతులుగా విభజింపబడతారు. సీనియర్ విభాగములోని వారు ఒకరు నాయకునిగా వ్యవహరిస్తారు. ఇతను క్రమశిక్షణను, ప్రకార్యాలను కలిగియుంటారు. గృహ నిర్మాణము, వివాహము, పొలము పనులు మొదలగు వాటి పరముగా వీరు తమ సహాయమును అందిస్తుంటారు.

సహజముగా ఈ డార్మిటరిలకు ద్వారములు, కిటికీలు ఉండవు. లోనికి ప్రవేశించుటకు మనిషి పట్టునటువంటి రంధ్రము మాత్రము ఉండును. గోండ్ తెగలోని "గోతుల్" డార్మిటరీలో డార్మిటరీ అధజపతిని "చల్లన్" అని అందురు. ఇతని క్రింద "దివాన్", "తహసిల్‌దార్", "సుబేదార్" మరియు "కొత్వాల్" ఉంటారు. వీరు విష మరియు క్రూర జంతువుల దాడి నుండి తమ తెగను రాత్రి సమయాలలో కాపలా కాస్తూ కాపాడుతుంటారు.

పై చెప్పుకున్న విధముగా డార్మిటరీలు S.C.Roy అభిప్రాయములో ఈ క్రింది ప్రకార్యాలను కలిగియున్నది. అవి:

1. ఆర్థిక పరమైన ప్రకార్యములకు తోడ్పడుట.

2. ఆడ, మగ మరియు మగ పిల్లలకు సామాజిక పరమైన విధులను తెలియచేయుట. లైంగిక పరమైన విద్యను బోధించుట.

3. యువతీ, యువకుల ప్రవర్తనలను క్రమబద్ధము చేయుట.

కానీ, ఈనాడు సభ్యత నాగరికత ప్రంచముతో గిరిజనుల సంబంధములు పెంచుకొనుట వలన వీరి వివిధ సామాజిక సంస్థలతో పాటు డార్మిటరీలు కూడా అంతరించి పోవుచున్నవి.

## 15.6 ముగింపు:

పైన చెప్పుకొన్న విధముగా ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపన హిందూ సామాజిక వ్యవస్థాపనకు భిన్నముగా నిర్మితమై యుండి ఈనాటికీ భారత సమాజములో కొనసాగుతూనే ఉన్నది. ఈనాటికీ అనేక ఆదిమ తెగలు సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధము పెట్టుకోకుండా మారుమూల అడవులలో, కొండలలో వారి సంస్కృతిని ఏమాత్రమూ మార్చుకొనకుండా జీవిస్తూ ఉండగా, మరికొన్ని ఆదిమ తెగలు ప్రభుత్వము అందించుచున్న సంక్షేమ కార్యక్రమాల వలన కానీ, క్రైస్తవ, మరికొన్ని స్వచ్ఛంద సంస్థల సేవల వలన కానీ సభ్యత, నాగరిక ప్రపంచముతో సంబంధములు పెట్టుకుంటూ తమ సామాజిక జీవన వ్యవస్థాపనలో పరివర్తనలు తీసుకువస్తున్నాయి. ఈ పరివర్తన కొన్ని ఆదిమ తెగల వారికి వరముగాను, మరికొన్ని ఆదిమ తెగల వారికి శాపముగాను భావించబడుచున్నవి.

## 15.7 పరిభాషిక పదములు:

| | | |
|---|---|---|
| Tribe | : | ఆదిమ తెగ |
| North-Eastern Aboriginals | : | పశ్చిమ తూర్పు |

| | | |
|---|---|---|
| Central Aboriginals | : | మధ్య భూభాగము |
| The Southern Aboriginals | : | దక్షిణ భూభాగము |
| Definite Common Topography | : | నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతము |
| Sense of Unity | : | ఐక్యత భావన |
| Endogamous Group | : | అంతర్వివాహ సమూహము |
| Common Culture | : | ఒకే సంస్కృతి |
| Common Name | : | ఒకే పేరు |
| Importance of Religions | : | మత ప్రాముఖ్యత |
| Ties of Blood Relationship | : | రక్త సంబంధ బాంధవ్యము |
| Nomadic HORDE | : | సంచారక సమూహము హొర్డ్ |
| Dormitory | : | పడక ఇల్లు |
| Civilised Society | : | సభ్య నాగరిక సమాజము |

## 15.8 నమూనా ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. ఆదిమ తెగను నిర్వచించి, దాని లక్షణములను వివరింపుము.
2. ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో డార్మిటరిల ప్రాముఖ్యతను తెలుపుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

1. ఆదిమ తెగ-నిర్వచనాలు
2. ఆదిమ తెగ-హొర్డ్
3. ఆదిమ తెగ-రెండు ప్రధానమైన లక్షణములు

## 15.9 చదువదగిన గ్రంథములు:


1. Races and Culture of India : Dr. D.N. Majumdar
2. An Introduction to Social Anthropology : Dr. D.N. Majumdar and Madan
3. The Munia and Their Gotul : Verrier Elvin
4. The Gondvana and The Gonds : Inderjit Singh

పాఠం-16

# గిరిజన సామాజిక వ్యవస్థ మరియు లక్షణాలు (గోత్రము-టోటెమ్-బంధుత్వము)

**విషయక్రమం:**


16.0 లక్ష్యము

16.1 గోత్రము-రకములు-పేర్లు-ప్రకార్యాలు-లక్షణములు

16.2 టోటెమ్ వివరణ-నిషేధాలు

16.3 బంధుత్వము-వివరణ

16.4 బంధుత్వము-రకములు-బంధుత్వ సంబంధాలు

16.5 ముగింపు

16.6 పరిభాషిక పదములు

16.7 సంగ్రహ ప్రశ్నలు

16.8 చదువదగిన గ్రంథములు


## 16.0 లక్ష్యము:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో గోత్రము, బంధుత్వము మరియు టోటెమ్ ప్రాముఖ్యతను కలిగి ఉన్నవి. ఆదిమ తెగ కొన్ని గోత్రములుగా విభజింపబడి ఉంటుంది. ప్రతి గోత్రమునకు ఒక అధిపతి ఉండును. వివిధ గోత్ర అధిపతుల ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యములో పరిపాలన కొనసాగిస్తుంటారు. వివాహ పరమైన నిషేధాలకు గోత్రము ఆధారము. ఆదిమ తెగలో మతమునకు విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. టోటెమ్ భావన మతపరమైనది. ఆదిమ తెగ ప్రజలు కలిసి మెలిసి ఐక్యమత్యముతో జీవించుటకు బంధుత్వ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుచున్నది. ఈ మూడు అంశములను ఈ పాఠములో చర్చించుట లక్ష్యము.

## 16.1 గోత్రము-రకములు-పేర్లు-ప్రకార్యాలు-లక్షణము:

గోత్రము ఆదిమ తెగ వ్యవస్థాపనలో చాలా ముఖ్యమైన భాగము. గోత్రము అనగా రక్త సంబంధములతో నిర్మితమైన కొన్ని వంశానుక్రమముల సమూహము.

మజుందార్ మరియు మదన్ అభిప్రాయముల ప్రకారము ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తూ కలిసి మెలిసి జీవించెడి కొన్ని వంశానుక్రమాన సమూహమును గోత్రము అని చెప్పవచ్చును. విశ్వసించిన పితరుడు మానవుడై ఉండవచ్చును. లేక పురాణ పురుషుడై ఉండవచ్చును.

**గోత్రము రకాలు:**

గోత్రము ఏక పక్ష నిర్మాణము అయితే పూర్తిగా తల్లి తరపున గానీ లేక పూర్తిగా తండ్రి పక్షమున గానీ నిర్మితమై ఉంటుంది. ఇది రెండు రకములు. అవి:

**1. మాతృస్వామిక గోత్రము:**

ఈ రకమైన గోత్రములో తల్లి యొక్క సంతానము ఆమె సోదరిలు, వారి కుటుంబ సభ్యులు, సహోదరులు ఉంటారు. సహోదరుల పిల్లలు మాత్రము ఉండరు.

**2. పితృస్వామిక గోత్రము:**

ఈ రకమైన గోత్రములో తండ్రి, అతని సంతానము, సోదరులు, వారి సంతానము, సహోదరీలు ఉంటారు. సోదరిల సంతానము ఉండదు.

**గోత్రము-పేర్లు:**

గోత్రము యొక్క పేర్లు వివిధ అంశముల యొక్క ఆధారముగా వివిధ రకాలుగా ఉండును. అవి:

1. సత్పురుషుల పేర్ల ఆధారముగా, ఉదాహరణకు శాండిల్య, భరద్వాజ మొదలుగున్నవి.

2. టోటెమ్ పేర్లు ఆధారముగా, ఉదాహరణకు కుంజమ్, నాగపోరి మొదలుగున్నవి.

3. భౌగోళిక ప్రాంత ఆధారముగా, ఉదాహరణకు మహానదియా, జన్‌పురియా మొదలుగున్నవి.

4. ఇతర రకములైన పేర్లు ఉదాహరణకు కమ్మార్, జగత్ మొదలుగున్నవి.

**గోత్రము-ప్రకార్యాలు:**

గోత్రము ఈ క్రింది ప్రకార్యాలను కలిగిఉన్నది. అవి:

**1. ఒకరికొకరు సహాయము, భద్రత కల్పించుకొనుట:**

గోత్రములోని సభ్యులు తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఆ విధముగా వారిలో రక్త సంబంధ భావన "మేము", "మాది" అన్న భావనలు కలిగిఉంటారు. ఒకరి కొరకు ఒకరు ప్రాణ త్యాగమునకైననూ వెనుకాడరు. నా గోత్ర రక్తమే నా రక్తము. ఎవరైనా నా గోత్రమునకు హానిచేస్తే అది నాకు చేసినట్లే అన్న భావన వారిలో అధికముగా ఉంటుంది.

**2. మత ప్రకార్యాలు:**

గోత్ర సభ్యులందరూ కలిసి మత పరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఒక్కొక్క గోత్రమునకు ఒక రకమైన మతాచారము ఉంటుంది. గోండు తెగలో ఒక గోత్రము వారు ఉత్సవాలను సమిష్టిగా చేస్తారు.

**3. రాజకీయ ప్రకార్యము:**

ప్రతి గోత్రమునకు సహజముగా పెద్ద వయస్కుడు గోత్రాధిపతిగా వ్యవహరిస్తాడు. ప్రతి ఆదిమ తెగలో ఇటువంటి గోత్రములు కొన్ని ఉంటాయి. గోత్ర అధిపతి గోత్ర సభ్యులపై సంపూర్ణ అధికారమును కలిగిఉంటాడు. వివిధ గోత్ర అధిపతులు ఆదిమ తెగ అధిపతి ఆధ్వర్యంలో తెగ రాజకీయ పరిపాలనను నిర్వహిస్తూ ఉంటారు.

**4. ఆస్తి ప్రకార్యాలు:**

వ్యవసాయము ముఖ్యవృత్తిగా కల్గిన గ్రామాలలో గోత్రము వ్యవసాయ భూమిపై హక్కును కలిగిఉంటుంది. గోత్ర అధిపతి ఈ భూమిని గోత్ర సభ్యులకు పంచిపెడతాడు. సభ్యులకు ఈ భూమిపై అధికారము ఉండదు. సాధారణముగా పురుషులకు బల్లెములు, బాణాలు ఆస్తిగా పరిగణించగా, స్త్రీలకు గాజులు, పూసలు ఆస్తిగా పరిగమణింపబడతాయి.

**5. బాహ్య వివాహము:**

ఒకే గోత్ర సభ్యులకు మధ్య వివాహము జరుగకుండా నిషేధాలు విధించి బయట వారితో వివాహాములు నిశ్చయిస్తుంది. ఈ విధంగా ఇతర గోత్రముల వారితో సంబంధాలు ఏర్పరుస్తుంది.

**6. గోత్రము-లక్షణములు:**

గోత్రము ఈ క్రింది లక్షణములను కలిగియున్నది. అవి:

**ఎ. బాహ్య వివాహ సమూహము:**

గోత్రము అంతర్వివాహ సమూహము కాదు. అనగా, ఒకే గోత్రమునకు చెందిన స్త్రీ, పురుషుల మధ్య వివాహము నిషేధము. గోత్రము వెలుపలనే వివాహము జరుగవలయును.

**బి. ఒకే పితరుడు:**

గోత్రములోని సభ్యులందరూ తామంతా ఒకే పితరుని నుండి జన్మించామని విశ్వసిస్తారు. ఆ భావనలో రక్త సంబంధీకులమన్న విశ్వాసంతో కలిసి మెలిసి జీవిస్తారు.

**సి. ఏకపక్ష నిర్మాణము:**

గోత్ర వ్యవస్థ ఏకపక్షంగా నిర్మాణమవుతుంది. అనగా, పూర్తిగా తల్లి తరపున గానీ లేక తండ్రి తరపున గానీ గోత్ర వ్యవస్థ ఏర్పడుతుంది. తల్లిదండ్రి కలిసి గోత్ర నిర్మాణము జరుగదు.

గోత్రము పై చెప్పుకొన్న లక్షణములనే కాకుండా ఈ క్రింది లక్షణములను కూడా కలిగియుండును. అవి టోటెమ్‌కు దగ్గరి సంబంధము కలిగియుండటము, బంధుత్వము అనే లక్షణము, ప్రతి గోత్రానికి ఒక పేరు కలిగి ఉంటుంది.

భారత సమాజంలో ఉన్న అన్ని ఆదిమ తెగలలో గోత్ర సమూహములు ఉన్నవి. భిల్ తెగలో 24 గోత్రాలు, సంతాల్ తెగలో 100 గోత్రాలు, ముండా తెగలో 50 గోత్రాలు ఉన్నట్లు తెలియుచున్నవి.

**గోత్ర కూటమి:**

రెండు లేక అంతకు మించిన గోత్రాల కలయికను గోత్ర కూటమి అంటారు.

**ద్విశాఖ గోత్ర కూటమి:**

ఆదిమ తెగలోని సభ్యులు రెండు బంధు సమూహాలుగా ఏర్పడి ఉంటే ఆ సమూహాలను ద్విశాఖ సమూహాలు అని అంటారు. ఈ రకమైన ద్విశాఖ గోత్రము కూటమి తోడా తెగలో ఉన్నవి.

**సిబ్:**

ఒకే గోత్రానికి చెందిన వారు వేరు వేరు ప్రాంతాలలో నివసిస్తున్నప్పుడు ఆ సమూహాన్ని సిబ్ అంటారు. ఒక్క నివాసములో తప్పించి మిగిలిన లక్షణాలలో గోత్రానికి సిబ్‌కు భేదము లేదు.

## 16.2 టోటెమ్-వివరణలు-నిషేధాలు:

ఆదిమ మానవుడు ప్రకృతిలో పుట్టి, ప్రకృతిలో పెరిగి, ప్రకృతిలోనే మరణించాడు. తన చుట్టూ ఆవహించి ఉన్న ప్రకృతి మర్మాలను ఏమాత్రం అవగాహన చేసుకోలేకపోయాడు. తనపై కురియుచున్న వర్షమును, అడవిని దహించివేయుచున్న అగ్నిని, ప్రకృతిలో ఉన్న పర్వతాలను, సముద్రాలను చూసి ఈనాడు మనకు వాటిని అవగాహన చేసుకొంటున్నట్లుగా ఆదిమ మానవుడు అవగాహన చేసుకోలేక పోయాడు. ఈ విధముగా ప్రకృతి శక్తులకు భయపడి వాటికి సాగిలపడి పూజించడం మొదలు పెట్టాడు. ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ప్రకృతి అతీతమైన శక్తులు దాగి ఉన్నవని విశ్వసించారు. E.A.Hoebel అభిప్రాయములో టోటెమ్ అనగా ఒక జంతువై ఉండవచ్చును. వృక్షమై ఉండవచ్చును. ప్రకృతిలోని ఏ వస్తువైనా అయిఉండవచ్చును. దాని వెనుక ఉన్న ప్రకృతి అతీతమైన శక్తి తనను కాపాడుతుందని విశ్వసించి, పూజించెడి వస్తువు "టోటెమ్". తాను విశ్వసించిన టోటెమ్‌కు తనను లేక తమకు మధ్య భావోద్రేకమైన సంబంధము ఉన్నదని విశ్వసిస్తారు.

**టోటెమ్-లక్షణాలు:**

టోటెమ్ ఈ క్రింది లక్షణాలను కలిగి ఉన్నవి. అవి:

1. టోటెమ్ నుండి తమ సమూహము ఉద్భవించిందనెడి విశ్వాసము. టోటెమ్ సమూహ సభ్యులలో ఉంటుంది.
2. ఒకే టోటెమ్‌కు చెందిన సభ్యుల మధ్య ప్రకృతి అతీతమైన సంబంధములు ఉన్నవని విశ్వసిస్తారు.
3. కష్ట మరియు ప్రమాద సమయాలలో వారు విశ్వసిస్తున్న టోటెమ్ సమూహాలను రక్షిస్తుందని విశ్వసిస్తారు. అంతేకాకుండా జరుగబోవు సంఘటనలను కూడా ముందుగానే తెలియచేస్తుందని వారు విశ్వసిస్తారు.
4. టోటెమ్‌గా భావింపబడే జంతువు యొక్క చర్మమును పవిత్రముగా భావించి ప్రత్యేక సందర్భాలలో వాటిని ధరిస్తారు. టోటెమ్ యొక్క చిహ్నములను వరీరాలపై పచ్చబొట్లుగా పొడిపించుకుంటారు. టోటెమ్‌గా భావింపబడే జంతువు మరణించినప్పుడు శ్రద్ధాంజలి ఘటించి సకల ఖర్మకాండలతో మరణ సంస్కారాలను ఆచరిస్తారు.
5. ఒకే టోటెమ్‌కు చెందిన సభ్యులందరూ తమ మధ్య రక్త సంబంధ బాంధవ్యాలు ఉన్నవని విశ్వసించి అంతర్వివాహములు చేసుకొనక బాహ్య వివాహ పద్ధతిని ఖచ్చితముగా అమలు చేస్తారు. అనగా, ఒకే టోటెమ్‌కి చెందిన స్త్రీ, పురుషుల మధ్య వివాహము నిషేధము.
6. టోటెమ్‌గా భావించబడే జంతువును వేటాడుట గానీ, గాయపరుచుట గానీ, కాల్చుట గానీ, భుజించుట గానీ నిషేధము.
7. టోటెమ్‌కు చెందిన సమూహాన్ని ఆ టోటెమ్ పేరుతోనే వ్యవహరిస్తారు.

టోటెమ్ వాదము ఆదిమ తెగ మత వ్యవస్థాపనలో ఒక ముఖ్యమైన అంశము. టోటెమ్ వాదము ఆదిమ తెగ ప్రజలలో సౌభ్రాతృత్వమును పెంచి వారు ఐక్యముగా జీవించుటకు సహాయపడుతుంది.

Thurston అభిప్రాయము ప్రకారము భారత సమాజములోని ఆదిమ తెగల టోటెమ్ పట్టికలో దాదాపుగా భారత సమాజములోని అన్ని జంతువులు, వృక్షములు ఉన్నవి. ప్రతి ఆదిమ తెగల టోటెమ్ ఆధారముగా అనేక భాగములుగా విభజింపబడి ఉంటుంది. టోటెమ్ యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏవిధముగా ఉన్నప్పటికిని ఒక్క భారతదేశములోనే కాకుండా ప్రపంచములో అన్ని దేశాల ఆదిమ తెగలలో మత వ్యవస్థలో టోటెమ్ ప్రముఖమైన భాగముగా ఉన్నది.

## 16.3 బంధుత్వము-వివరణ:

ప్రతి సమాజ సంస్కృతిలో బంధువులను బంధుత్వమును గుర్తుంచుటకు నిర్దిష్టమైన పదములను వాడుతుంటారు. హిందూ సమాజములో భార్య యొక్క చెల్లిని మరదలు అని, భర్త యొక్క తండ్రిని మామ అనియు వ్యవహరిస్తుంటారు.

W.R.H.Rivers మరియు Kroeber అభిప్రాయం ప్రకారం సామాజిక పరమైన ప్రకార్యాలను నిర్వహించుటను బట్టి ఒకరి నుండి మరియొకరిని వేరుగా అర్థము చేసుకొనుటకు బంధుత్వము, బందుత్వ నామాలు ఉపయోగపడతాయి.

Dictionary of Anthropology ప్రకారము బంధుత్వము అనగా సామాజికముగా వివిధ వ్యక్తుల మధ్య ఏర్పడిన సంబంధములను గుర్తించుట ద్వారా నిర్మాణమగునటు వంటి ఒక వ్యవస్థ.

Dr. D.N.Majumdar అభిప్రాయం ప్రకారం సమాజములోని ప్రజలు కొన్ని బంధముల ఆధారముగా ఒకరినొకరు సంబంధాలు పెట్టుకొంటారు. ఈ రకమైన బంధాలు ప్రత్యుత్పత్తి ద్వారా గాని, దగ్గర మానవ సంబంధాల ద్వారా గాని ఏర్పడి ఉంటే దానిని బంధుత్వము అని అనవచ్చును. పిల్లలు కావాలనెడి కోర్కె రెండు బంధములను ఏర్పరుస్తుంది. భర్త, భార్య అనుబంధము, రెండవది తండ్రి తల్లి సంతానము అనెడి బంధము.

## 16.4 బంధుత్వము-రకములు-బంధుత్వ సంబంధాలు:

బంధుత్వము ప్రధానముగా రెండు విధములుగా ఏర్పడుతుంది. అవి:

**1. రక్త సంబంధ బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వము రక్త సంబంధము ద్వారా ఏర్పడుతుంది. ఈ రకమైన బంధుత్వము పటిష్టముగా ఉండి బంధుత్వ సమూహ సభ్యుల మధ్య సహకారము, ప్రేమ, అనురాగము మొదలగు అంశములను కలిగి ఉంటుంది. ఉదాహరణకు తండ్రి కుమారులు, తల్లి కుమార్తెలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు.

**2. వైవివాహి బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వము వివాహ పరముగా ఏర్పడుతుంది. స్త్రీ, పురుషుల మధ్య వివాహము జరుగుట ద్వారా స్త్రీ తరపున వారికి పురుషుని తరపున బంధుత్వము ఏర్పడుతుంది.

పై చెప్పిన బందుత్వము రకములతోపాటు ఈ క్రింది బంధుత్వము కూడా కలవు. అవి:

**1. ప్రాథమిక బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వములో భర్త, భార్య, తల్లిదండ్రులు, బిడ్డలు మొదలగు బంధుత్వములు ఉండును.

**2. గౌణ బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వములో ప్రాథమిక బంధువుతో బందుత్వము కలిగి ఉన్న వారు. ఉదాహరణకు బావ, మరిది, వదిన మొదలైన వారు.

**3. తృతీయ తరహా బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వములో ప్రాథమిక మరియు గౌణ సంబంధ బంధుత్వాల ద్వారా ఏర్పడుతున్నవి.

**4. మాతృస్వామిక బంధుత్వము:**

ఈ రకమైన బంధుత్వములో తల్లి తరపు వారందరూ లెక్కించబడతారు. తల్లి సోదరీలు, వారి కుటుంబ సభ్యులు మరియు వారి బంధువులు. సోదరుని కుటుంబ సభ్యులు ఈ బంధుత్వములోనికి రారు.

**5. పితృస్వామిక బంధుత్వము:**

ఈ రకమైన బందుత్వము పూర్తిగా తండ్రి తరపున ఏర్పడుతుంది. తండ్రి అతని సహోదరులు, వారి కుటుంబ సభ్యులు ఇందులో లెక్కించబడతారు. తండ్రి సోదరీల కుటుంబాలు లెక్కించబడరు.

పైన చెప్పుకొన్న వివిధ బంధుత్వపు రకాలను బట్టి వాటి ఆచరణలు ఉంటాయి.

**1. పరిహాస సంబంధాలు:**

కొన్ని రకాలైన బంధుత్వ సమూహాలు వ్యక్తుల మధ్య ఛలోక్తులు, అవహేళన, పరిహసించుకోవడం వంటి సంబంధాలు ఉంటాయి. ఈ అవహేళన వలన వ్యక్తులు చిన్నబుచ్చుకోవడము గాని, ఇతరులు వాటిని ఆక్షేపించుట గాని జరుగదు. ఉదామరణకు బావా మరదళ్లు, వదిన మరదళ్ల మధ్య ఉండెడి సంబంధము. ఈ సంబంధములలో సమాన హోదాలో ఉన్న ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగే పరిహాసమును సౌష్టవ పరిహాసము అని అంటారు. ఉదాహరణకు బావా, మరిది వారిరువురు ఒకరినొకరు పరిహసించుకొనవచ్చును. కానీ, మరియొక పరిహాస సంబంధములో ఒక బంధువుకి మాత్రమే పరిఃసించు స్వేచ్ఛ ఉంటుంది. రెండవ బంధువునికి ఆ స్వేచ్ఛ ఉండదు. దీనినే అసౌష్టవ పరిహాసము అని అంటారు. ఉదాహరణకు తాత, మనవడు.

**2. వైదొలగునడవడి-సంబంధము:**

ఈ రకమైన బంధుత్వము సంబంధములో ఒకరినొకరు తప్పించుకొన ప్రయత్నిస్తారు. ఈ బందుత్వము కల్గిన వారు ఒకరికొకరు ఎదురుగా కూర్చొనుట గాని, ముఖాముఖి మాట్లాడుకొనుట గాని జరుగదు. ఉదామరణఖు మామ కోడలు, అత్తా అల్లుడు ఈ రకమైన బంధువుల మధ్య చనువుతో కూడిన సంబంధమేర్పడితే అది వివిధ అనర్ధాలకు దారితీస్తుందని కొందరు అభిప్రాయపడినారు.

**3. సాంకేతిక సంబోధన సంబంధము:**

కొన్ని రకములైన బంధుత్వ సంబంధాలలో వ్యక్తుల పేర్లను వాడరు. అనగా, ఆ బంధుత్వము పేరుతోనే ఆ బంధువుని ప్రస్తావన తెస్తారు. ఉదామరణకు భార్యలు, భర్తల గురించి ప్రస్తావించదలచినప్పుడు మా వారు అనియో, బాబు గాడి నాన్న గారనియో, మీ అబ్బాయి అనియో ప్రస్తావిస్తారు. అదే విధముగా అత్త తన కుమార్తె భర్త ప్రస్తావన అల్లుడు గాని అని ప్రస్తావిస్తుంది.

**4 కుహన ప్రశూతి:**

ఈ రకమైన బంధుత్వ సంబంధ ఆచరణలో దగ్గర బంధువులు అనుభవిస్తున్న బాధను కష్టమును వారు పంచుకొనుట. ఉదాహరణకు తోడా తెగలో భార్య గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె పడుచున్న వేదనను భర్త తాను కూడా పడుతున్నట్లు నటిస్తాడు. ఆమె వాంతి చేసుకొంటే భర్త వాంతి చేసుకుంటున్నట్లుగా నటిస్తాడు. భార్య నేలపై పడుకున్నట్లయితే భర్త కూడా నేలపై పడుకుంటాడు. భార్య బాధతో మెలికలు తిరుగుతుంటే, బర్త కూడా బాధపడుతున్నట్లు మెలికలు తిరుగుతాడు. ఈ విధముగా దగ్గరి బంధువులు పడుతున్న బాధలను తాము పడుతూ తమ బంధుత్వ దగ్గరి తనమును చూపించుటనే కుహన ప్రశూతి అని అంటారు.

## 16.5 ముగింపు:

పైన చెప్పుకొన్న విధముగా గోత్ర వ్యవస్థ టోటెమ్ వాదము బంధుత్వము, గిరిజన సామాజిక వ్యవస్థాపనలో ముఖ్యమైన భాగములుగా ఉంటూ సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగుటకు తోడ్పడుతున్నవి. గోత్ర వ్యవస్థ ఆదిమ తెగ పరిపాలనకు సహకరిస్తుండగా, టోటెమ్ వాదము ఆదిమ మత వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్నవి. ఆదిమ తెగ ప్రజలలో ఐక్య భావన, ఐక్యతను పెంపొందించుటకు బంధుత్వ వ్యవస్థ దోహదము చేయుచున్నది.

## 16.6 పారిభాషిక పదములు:

| | |
|---|---|
| Clan | : గోత్రము |
| Unilateral | : ఏకపక్ష నిర్మాణము |
| Matrilineal Clan | : మాతృస్వామిక గోత్రము |

Patrilineal Clan : పితృస్వామిక గోత్రము

Saints : సత్పురుషులు

Political Functions : రాజకీయ ప్రకార్యాలు

Exogamy : బాహ్య వివాహము

Exogamous Group : బాహ్య వివాహ సమూహము

Supernatural Power : ప్రకృతి అతీతమైన శక్తి

Tatooed : పచ్చబొట్టు

Blood Relationships : రక్త సంబంధాలు

Kinship : బంధుత్వము

Consanguineous Kinship : రక్త సంబంధ బంధుత్వము

Affinial Kinship : వైవాహిక బంధుత్వము

Primary Kinship : ప్రాథమిక బంధుత్వము

Secondary Kinship : గౌణ బంధుత్వము

Tertiary Kinship : తృతియ తరహా బంధుత్వము

Matrilineal Kinship : మాతృస్వామిక బంధుత్వము

Patrilineal Kinship : పితృస్వామిక బంధుత్వము

Joking Relations : పరిహాస సంబంధాలు

Avoidence Relations : వైతొలగు నడవడి సంబంధము

Technonamy : సాంకేతిక సంబోధనా బంధము

## 16.7 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము:**

1. గోత్రమును నిర్వచించి, గోత్ర లక్షణములను, ప్రకార్యములను వివరింపుము.

2. బంధుత్వమును, బంధుత్వ రకములను, బంధుత్వ సంబంధ ఆచరణలను వివరింపుము.

**ఈ క్రింది ప్రష్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

1. టోటెమ్ 2. బంధుత్వము - రకాలు 3. గోత్రము - లక్షణములు

## 16.8 చదువదగిన గ్రంథములు:

1. "Races and Cultures of India" - Dr. D.N.Majumdar

2. "An Introduction to Social Anthropology" - Dr. D.N.Majumdar & Madan

3. "The Muria and Their Ghotul" - Verrier Elvin

4. "The Gondavana and The Goods" - J.Singh

5. "Marriage and Family" - Kapadia

# పాఠం-17

# గిరిజన సామాజిక వ్యవస్థ
# (గిరిజన కుటుంబము)

**విషయక్రమం:**


17.0 లక్ష్యము

17.1 ఆదిమ తెగ కుటుంబము-వివరణ

17.2 కుటుంబము-రకాలు

17.3 కుటుంబము-లక్షణాలు

17.4 కుటుంబము-ప్రకార్యాలు

17.5 ముగింపు

17.6 పరిభాషిక పదములు

17.7 సంగ్రహ ప్రశ్నలు

17.8 చదువదగిన గ్రంథములు


## 17.0 లక్ష్యము:

ప్రపంచములోని అన్ని సమాజాలలో కుటుంబ వ్యవస్థ ప్రాచీన కాలము నుండి ఉన్నది. సామాజిక వ్యవస్థాపనకు కుటుంబ సంస్థ చాలా ముఖ్యమైనది. తండ్రి, తల్లి వారి సంతానము లేక దత్తత చేసుకున్న సంతానము కలిసి ఒక గృహములో నివసించడాన్ని కుటుంబము అని అర్థము చేసుకొనవచ్చును. కుటుంబ వ్యవస్థ పటిష్టముగా లేకున్నట్లయితే సామాజిక వ్యవస్థాపన సజావుగా సాగలేదు.

## 17.1 ఆదిమ తెగ కుటుంబము-వివరణ:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో కుటుంబమునకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. ఆదిమ తెగ వివాహ వ్యవస్థ ఆదర్శాలలో కుటుంబ నిర్మాణము ఒకటి. స్త్రీ, పురుషులు వివాహ బంధము ద్వారా భార్యాభర్తలుగా గుర్తింపబడి, లైంగిక సంపర్కము ద్వారా సంతానమును పొంది ఆ విధముగా కుటుంబమును ఏర్పరచుకుంటారు. కుటుంబ సభ్యులకు రక్షణ, వారి అవసరములను తీర్చుట, సమాజములో వారు ఏ విధముగా జీవించవలెనో తెలియచేసి సమాజములో వారు మనుగడ సాగించుటకు వారిని తయారు చేస్తుంది. కుటుంబమును అవగామన చేసుకొనుటకు ఈ క్రింది నిర్వచనములను పరిశీలింపుము.

1. Maciver అభిప్రాయం ప్రకారము స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలను నిర్దిష్టపరిచి సంతానమును పొందుట, వారిని పెంచి పెద్ద చేయు ఒక సమూహము.

2. Eliott మరియు Merill అభిప్రాయములో కుటుంబము అనగా భర్త, భార్య మరియు పిల్లలతో నిర్మాణమై ఉన్నటువంటి ఒక జైనిక సమూహము.

3. Nimkoff అభిప్రాయములో కుటుంబము అనగా భర్త, భార్య మరియు వారి పిల్లలు లేదా భర్త, భార్య లేదా భర్త పిల్లలు లేదా భార్య పిల్లలు కలిసి ఉండెడి ఒక సమూహము.

## 17.2 కుటుంబము-రకాలు:

కుటుంబమును కొన్ని ప్రాతిపదికల ఆధారముగా ఈ క్రింది రకములుగా చెప్పవచ్చు. అవి:

**1. అధికారమును ఆధారము చేసుకొని:**

**ఎ). పితృస్వామిక కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో కుటుంబ అధికారము యావత్తు పురుషుని చేతిలో ఉంటుంది. కుటుంబ పరిపాలన, ఆస్తి ఇతని ఆధ్వర్యములో ఉండును. కుటుంబములోని సభ్యులందరు ఇతని ఆజ్ఞలకు లొంగి ఉండవలెను. ఈ రకమైన పితృస్వామిక కుటుంబాలు హెబ్రియాలలో, గ్రీకులలో, రోమన్‌లలో, ఆర్యులలో అమలులో ఉండేవి. పితృస్వామిక కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగి ఉండేది. అవి:

ఎ. వివాహ అనంతరము భార్య, భర్త గృహమునకు వచ్చి నివసించును.

బి. కుటుంబ ఆస్తికి ఏకైక అధిపతి తండ్రి.

సి. సంతానము తండ్రి ద్వారా గుర్తింపబడి, తండ్రి కుటుంబ నామధేయము ద్వారా పిలుబడుతుంది.

డి. తండ్రి ఆస్తి మాత్రమే పిల్లలు సంక్రమించుకో గలుగుతారు.

**బి). మాతృస్వామిక కుటుంబము:**

ఈ రకమైన కుటుంబాలలో తల్లి కుటుంబ అధికారమును కలిగి ఉంటుంది. కుటుంబములోని పురుషులకు ఏ ప్రాముఖ్యత ఉండదు. కుటుంబ పరిపాలన, ఆస్తి స్త్రీ ఆధీనములో ఉండును. మాతృస్వామిక కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగి ఉన్నది. అవి:

ఎ. వివాహ అనంతరము భర్త, భార్య గృహమునకు వెళ్లి నివసించును.

బి. సంతానము తల్లి ద్వారా మాత్రమే గుర్తించబడుతుంది.

సి. కుటుంబ అధికారము భార్య చేతిలో ఉంటుంది.

డి. ఆస్తి తల్లి ద్వారా కుమార్తెలకు మాత్రమే సంక్రమిస్తుంది.

**2. నిర్మాణమును ఆధారము చేసుకొని:**

కుటుంబము రెండు రకములు. అవి:

**ఎ. వ్యష్టి కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో తండ్రి, తల్లి వారి సంతానము ఉంటుంది. కుమారుల, కుమార్తెల వివాహ అనంతరము తల్లిదండ్రులను విడిచి వెళ్లవలెను.

**బి. సమిష్టి కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో తల్లి, తండ్రి వారి కుమారులు, కుమారుల సంతానము, అవివాహిక కుమార్తెలు మరియు తండ్రి దగ్గరి బంధువులు కలిసి నివసిస్తుంటారు.

**3. నివాసమును ఆధారము చేసుకొని:**

కుటుంబము రెండు రకములు. అవి:

**ఏ. మాతృస్వామిక వివాహ కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో పురుషుడు వివాహ అనంతరము తన తల్లిదండ్రుల గృహమును విడిచి భార్య నివాసమునకు వెళ్లి అక్కడ ఆమెతో నివసించును.

**బి. పితృస్వామిక నివాస కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో వివాహ అనంతరము భార్య తన తల్లిదండ్రుల నివాసమును విడిచి భర్త నివాసమునకు వెళ్లి ఆయనతో జీవించును.

**4. వివాహమును ఆధారము చేసుకొని:**

కుటుంబము మూడు రకములు. అవి:

**ఏ. బహు భార్యత్వ కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో పురుషుడు తాను వివాహమాడిన స్త్రీలతో నివసిస్తుంటాడు.

**బి. బహు భర్తృత్వ కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో భార్య తాను వివాహమాడిన బర్తలతో నివసిస్తూ ఉంటుంది.

**సి. ఏక వివాహ కుటుంబము:**

ఈ రకమైన కుటుంబములో ఒక పురుషుడు, ఒక స్త్రీ భార్యాభర్తలుగా వారి సంతానంతో నివసిస్తూ ఉంటారు.

## 17.3 కుటుంబము-లక్షణాలు:

కుటుంబము ఈ క్రింది లక్షణములను కలిగియున్నది. అవి:

**1. లైంగిక సంబంధాలు:**

స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలు ఏర్పడుట వలన కుటుంబము నిర్మాణము అవుతుంది.

**2. వివాహము యొక్క ప్రతిరూపము:**

స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధాలు వివాహ సంస్థ ద్వారా ఏర్పడుతాయి. ఆ విధముగా కుటుంబము వివాహ సంస్థ ద్వారా ఏర్పడినటువంటి సంస్థ.

**3. నామధేయము:**

ప్రతి కుటుంబమునకు ప్రత్యేకమైన ఒక పేరు ఉంటుంది. ఆ పేరుతోనే ఆ కుటుంబ సభ్యులు వ్యవహరింపబడతారు.

**4. ఆర్థిక సౌకర్యము:**

ప్రతి కుటుంబము కుటుంబ సభ్యుల యొక్క అవసరమును తీర్చు నిమిత్తము కుటుంబమునకు ఆర్థిక సదుపాయమును ఏర్పరచవలెను.

**5. ఉమ్మడి నివాసము:**

ప్రతి కుటుంబ సభ్యులు నివసించుటకు గృహము అవసరము. అనగా, నివాసము అవసరము. ఇది లేని నాడు పిల్లలను కనుట, పెంచుట కుటుంబమునకు సాధ్యము కాదు.

**6. విశ్వజనీయత:**

కుటుంబము మానవ చరిత్రలో మొదటి సంస్థ ప్రతి కాలములోను ప్రతి సమాజములోను మనము ఈ సంస్థను చూడగలము. కుటుంబ వ్యవస్థాపన లేకుండగా ఏ సమాజ సంస్కృతి అభివృద్ధి చెంది యుండలేదు.

**7. భావోద్రేక భావన:**

కుటుంబము లైంగిక సంపర్కము, సంతానము, పిల్లల యెడల తల్లిదండ్రుల ప్రేమ, అనురాగము మొదలగు భావోద్రేక భావనలతో నిర్మితమై ఉంటుంది.

**8. చిన్న పరిమాణము:**

కుటుంబ సమూహము విధిగా చిన్న పరిమాణము కలిగిఉండవలెను. ఎందుకనగా ఈ సమూమము జైనిక పరమైన నిబంధనల ద్వారా నిర్మాణమౌతుంది కాబట్టి.

**9. కేంద్ర స్థానము:**

సమాజములోని అన్ని సమూహాలకు కుటుంబము కేంద్రస్థానము వంటిది. ఇది ప్రాథమిక సంస్థ సంపూర్ణ సామాజిక నిర్మితి కుటుంబమును ఆధారముగా చేసుకొని నిర్మాణమవుతుంది.

**10. సభ్యులపై నియంత్రణా శక్తిని కలిగిఉంటుంది:**

సమాజములో వ్యక్తుల ప్రవర్తనలను, చర్యలను ఎప్పటికప్పుడు క్రమబద్ధము చేస్తూ ఉండాలి. అలాకాని పక్షములో సామాజిక క్రమతకు భగ్నము వాటిల్లి సమాజములో క్రమ రాహిత్యం ఏర్పడుతుంది. ఇటువంటివి జరుగకుండా వ్యక్తుల చర్యలను క్రమబద్ధము చేయుటకు ప్రమాణాలు, విలువలు నిర్మింపబడి ఉంటాయి. వాటి గురించి కుటుంబము, కుటుంబ సభ్యులకు తెలియజేసి తద్వారా వారిని నియంత్రణకు గురిచేస్తుంది.

## 17.4 కుటుంబము-ప్రకార్యాలు:

కుటుంబము సమాజములో అతి ముఖ్యమైన సామాజిక సంస్థగా పేన చెప్పుకొన్నాము. ప్రతి కుటుంబ సంస్థ తనకంటూ కొన్ని ప్రత్యేకమైన ప్రకార్యాలను కలిగియుండును. అవి:

**1. లైంగిక సంతృప్తిని కల్పించుట:**

కుటుంబము యొక్క మొదటి ప్రకార్యము స్త్రీ, పురుషులకు లైంగిక సంతృప్తిని కల్పించుట. మను, వాత్స్యాయన అభిప్రాయము ప్రకారము లైంగిక సంతృప్తి కుటుంబము యొక్క మొదటి ప్రకార్యము.

**2. ప్రత్యుత్పత్తి - సంతానమును పోషించుట:**

కుటుంబము యొక్క రెండవ ప్రకార్యము లైంగిక సంభోగము ద్వారా సంతానమును పొందుట. ఈ విధముగా మానవ జాతి మనుగడకు ముప్పు వాటిల్లకుండా మానవ సమాజాలు నిరంతరము వ్యక్తులతో సజావుగా ముందుకు సాగుతుంటాయి.

**3. గృహ సదుపాయము:**

మానవుడు మానసిక పరమైన సంతృప్తిని మొట్టమొదటగా కోరుకుంటాడు. ప్రేమ, మమత, వాత్సల్యము మొదలగు వాటిని పొందుటకు తహతహలాడుతుంటాడు. ఈ అంశములను పొందుటకు సభ్యుల మధ్య దగ్గర సంబంధములు ఉండుటకు తప్పనిసరిగా వారికి గృహ సదుపాయము అవసరము. ఈ సదుపాయమున కుటుంబము, కుటుంబ సభ్యులకు అందించవలెను.

**4. ఆర్థిక ప్రకార్యాలు:**

మానవునికి ఆహారము, వసతి, వస్త్రము కనీస అవసరాలు. కుటుంబము కుటుంబ సభ్యులకు వాటిని సమకూర్చి పెట్టవలెను. కుటుంబము ఆదాయమును కలిగి ఉండి కుటుంబ సభ్యులకు సౌకర్యాలను ఏర్పరుస్తూ వారి అవసరాలను తీర్చవలెను.

**5. మానసిక పరమైన ప్రకార్యాలు:**

కుటుంబ సభ్యుల మధ్య భావోద్రేక భావనలుఉంటాయి. ప్రేమ, మమత, అనురాగము ప్రతి మానవుడు కోరుకుంటాడు. కుటుంబము కుటుంబ సభ్యుల యొక్క ఈ మానసిక పరమైన కోర్కెలను తీర్చి మానసిక సంతృప్తిని వారికి కల్పించవలెను.

**6. మతపరమైన ప్రకార్యాలు:**

కుటుంబము కుటుంబ సభ్యులకు మతపరమైన బోధనలు చేయుట ద్వారా మంచి నడవడిని వారు అలవరుచుకొనుటకు దోహదము చేయవలెను. కుటుంబ అధిపతి మత గురువుగా వ్యవహరిస్తూ మతపరమైన కార్యక్రమాలను కుటుంబ సభ్యుల చేత చేయిస్తాడు.

**7. అంతస్తును ఏర్పరచుట:**

కుటుంబము తన కుటుంబ సభ్యులకు సమాజంలో వారు గుర్తింపబడుటకు ఒక అంతస్తును వారికి కల్పించవలెను.

**8. ఆస్తిని కాపాడుట మరియు పెంచుట:**

కుటుంబము యొక్క మరియొక ప్రకార్యము కుటుంబ ఆస్తిని కాపాడుట. సాధ్యమైతే శ్రమించుట ద్వారా ఆ ఆస్తిని పెంచుట చేయవలెను.

**9. సామాజిక ప్రకార్యాలు:**

కుటుంబము కుటుంబ సభ్యులకు సమాజమును గురించి తెలియజేసి, సమాజములో వారే విధముగా జీవించవలయును? సమాజము ఎడల వారి విధులు ఏమిటి? సమాజమునకు వారికి మధ్య ఉన్న సంబంధము ఏమిటి? సామాజిక నియంత్రణను ఏ విధముగా గౌరవించాలి? మొదలగు విషయాలను సభ్యులకు బాల్య దశ నుండే తెలియజేయు సాంఘీకీకరణ ప్రక్రియ జరుపవలెను. సమాజ సంస్కృతిని, సమాజములో ఉన్న ప్రమాణాలను, విలువలు కట్టుబాట్లను, సంప్రదాయాలను వారికి తెలియజేసి వాటిని గౌరవిస్తూ సమాజములో ఏవిధముగా జీవించాలో సభ్యులకు తెలియజెప్పటము కుటుంబము యొక్క ఒక ముఖ్యమైన ప్రకార్యము.

Lundberg అభిప్రాయములో కుటుంబము ఈ క్రింది ప్రకార్యాలను కలిగి ఉన్నది. అవి:

1. లైంగిక సంబంధములను, సంతానోత్పత్తిని క్రమబద్ధము చేయుట.
2. పిల్లల యెడల శ్రద్ధ వహించుట, వారికి శిక్షణ ఇచ్చుట.
3. సహకారము-శ్రమ విభజన.
4. ప్రాథమిక సమూహపు సంతృప్తిని కల్పించుట.

Ogburn & Nimkoff కుటుంబ ప్రకార్యములను ఈ క్రింది విధముగా చెప్పారు. అవి:

1. భావపూరితమైన ప్రకార్యాలు
2. ఆర్థిక ప్రకార్యాలు
3. మనో వికాస ఆహ్లాద ప్రకార్యాలు
4. భద్రత పరమైన ప్రకార్యాలు
5. మతపరమైన ప్రకార్యాలు
6. విద్యా పరమైన ప్రకార్యాలు

## 17.5 ముగింపు:

పైన చెప్పుకొన్న విధముగా కుటుంబ సంస్థ యొక్క స్వభావము ఉన్నది. కానీ, ఆధునిక సమాజములో కుటుంబము యొక్క లక్షణములు, ప్రకార్యములు పరివర్తనకు గురిఅగుచున్నవి. ముఖ్యముగా ఆదిమ తెగ కుటుంబ వ్యవస్థలో ఈనాడు మార్పులు సంభవిస్తున్నవి. కొన్ని ఆదిమ తెగలు నాగరికత ప్రపంచములో ఐక్యమగుల వలన నాగరిక సమాజములోని కుటుంబమునకు కలుగుచున్న దుష్పరిణామాలు వారి కుటుంబ వ్యవస్థపై కూడా ప్రభావమును చూపుచున్నవి. ఈనాడు కుటుంబ సంస్థ నిర్వహించవలసిన అనేక ప్రకార్యాలను వివిధ సంస్థలు నిర్వహిస్తూ కుటుంబ సంస్థను బలహీన పరచుచున్నవి.

## 17.6 పారిభాషిక పదములు:

| | |
|---|---|
| Authority | : అధికారము |
| Patrilineal Family | : పితృస్వామిక కుటుంబము |
| Matrilineal Family | : మాతృస్వామిక కుటుంబము |
| Structure | : నిర్మాణము |
| Nuclear Family | : వ్యష్టి కుటుంబము |
| Joint Family | : సమిష్టి కుటుంబము |
| Resident | : నివాసము |
| Matrilocal Family | : మాతృస్వామిక నివాస కుటుంబము |
| Partilocal Family | : పితృస్వామిక నివాస కుటుంబము |
| Polygynous Family | : బహుభార్యత్వ కుటుంబము |
| Monogamous Family | : ఏక వివాహ కుటుంబము |
| Mating Relations | : లైంగిక వివాహ కుటుంబము |
| Nomenclature | : నామధేయము |
| Universal | : విశ్వజనీయత |

| | |
|---|---|
| Small Size | : చిన్న పరిమాణము |
| Nuclear Position | : కేంద్రస్థానము |
| Social Control | : సామాజిక నియంత్రణ |
| Social Order | : సామాజిక క్రమత |
| Disorder | : క్రమరాహిత్యము |
| Functions | : ప్రకార్యాలు |
| Sexual Satisfaction | : లైంగిక సంతృప్తి |
| Reproduction | : ప్రత్యుత్పత్తి |
| Economic Functions | : ఆర్థిక ప్రకార్యాలు |
| Psychological Functions | : మానసికపరమైన ప్రకార్యాలు |
| Social Functions | : సామాజిక ప్రకార్యాలు |

## 17.7 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. వివిధ కుటుంబ రకములను గురించి తెలుపుము.

2. కుటుంబ లక్షణాలను వివరించి, కుటుంబ ప్రకార్యాలను గురించి వ్రాయుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

1. కుటుంబము-నిర్వచనములు

2. కుటుంబము-రకములు

3. కుటుంబము-ప్రకార్యములు

## 17.8 చదువదగిన గ్రంథములు:


1. "Races and Cultures of India" - Dr.D.N.Majumdar
2. "An Introduction to Social Anthropology" - Dr.D.N.Majumdar and Madan
3. "The Muria and Their Gotul" - Verrier Elvin
4. "the Gondavana and The Gonds" - J.Singh
5. "Marriage and Family" - Kapadia

పాఠం-18

# గిరిజన సామాజిక వ్యవస్థ-సంక్షేమ కార్యక్రమాలు (ఆదిమ తెగ-మతము)

విషయక్రమం:


18.0 లక్ష్యము

18.1 మతము-పుట్టుపూర్వోత్తరాలు

18.2 మతము-లక్షణాలు-ప్రకార్యాలు

18.3 ఆదిమ తెగ మతము-వివరణ

18.4 గోత్రము-కులము, గోత్రము-తెగ, తెగ-కులము

18.5 నిషేధాలు (టాబూస్)

18.6 ఆదిమ తెగ-ఆర్థిక విధానాలు

18.7 ఆదిమ తెగ సమస్యలు-సంక్షేమ కార్యక్రమాలు

18.8 ముగింపు

18.9 పారిభాషిక పదములు

18.10 సంగ్రహ ప్రశ్నలు

18.11 చదువదగిన గ్రంథములు


## 18.0 లక్ష్యము:

అన్ని మానవ సమాజాలలో మత వ్యవస్థ ప్రాముఖ్యతను సంతరించుకొనియున్నది. ప్రాచీన సమాజాలలో మతము ఒక ముఖ్యమైన సామాజిక నియంత్రణ సాధనముగా ఉండెను. ఆదిమ తెగలో మతమునకు విశిష్టమైన ప్రాధాన్యత ఉన్నది. ఏ అంశమైనను అమలు చేయబడవలెనన్న దానికి తప్పనిసరిగా మతము యొక్క అంగీకారము ఉండవలెను. ప్రాచీన మానవుడు ప్రకృతికి దగ్గరగా నివసించెడి వాడు. కనుక అతనిలో మూఢ నమ్మకాలు ప్రబలంగా ఉండేవి. మతము అనగా కనిపించనటువంటి ప్రకృతి అతీతమైన శక్తుల యెడల మానవుడు విశ్వాసము పెంచుకోవడం మరియొక విధముగా చెప్పవలెనంటే అలౌకిక శక్తుల యెడల ఉండెడి విశ్వాసమును మతముగా చెప్పవచ్చును. మతము కొన్ని ప్రత్యేకమైన సిద్ధాంతములను, సాంప్రదాయాలను ఏర్పరచి వ్యక్తులు వాటికి అనుగుణంగా నడుచుకొనునట్లు వారిని ఆదేశిస్తుంది. నాగరికత సమాజంలో మతము ప్రభావము తగ్గుతున్నప్పటికీ, ఆదిమ తెగలో ఈనాటికీ మతము విశిష్టమైన ప్రాధాన్యత కలిగియున్నది. ఇందుకు ముఖ్య కారణము ఈనాటికీ అధిక శాతము ఆదిమ తెగ ప్రజలు అడవులలో, కొండ ప్రాంతాలలో ప్రకృతికి దగ్గరగా జీవించడం. ఈ పాఠములో ఆదిమ తెగ మత విశ్వాసాలను చెప్పుకోవడం లక్ష్యం.

## 18.1 మతము-పుట్టుపూర్వోత్తరాలు:

మతము మానవ సమాజములలో ఏవిధముగా ప్రవేశించినదో చెప్పుట కష్టము. మతమును అవగాహన చేసుకొనుట నిర్వచించి చెప్పుట కూడా సాధ్యము కాదు. ఎందుకనగా మతము మానవుని విశ్వాసానికి సంబంధించిన మానసిక పరమైన అంశము. మత భావన వ్యక్తికి వ్యక్తికి, సమూహానికి సమూహానికి వేరుగా ఉంటుంది. వివిధ శాస్త్రవేత్తలు మతమును ఈ క్రింది విధముగా నిర్వచించినారు. అవి:

Gillen అభిప్రాయంలో మతము అనగా ఒక సమూహములో ప్రకృతి అతీతమైన శక్తుల యెడల ఆ సమూహపు వారు కలిగి యుండెడి భావోద్రేక విశ్వాసాలు. ఇవి కొన్ని లక్ష్యాలను, గుర్తులను కలిగిఉండి, మానవుని ప్రవర్తనను క్రమబద్దము చేస్తూ ఉండెడి వ్యవస్థ.

Maciver అభిప్రాయములో మతము అనగా వ్యక్తికి, వ్యక్తికి మధ్య సంబంధాలను ఏర్పరచుకొనుటయే కాకుండా వ్యక్తికి అతనికన్నా బలీయమైన ఒక శక్తితో కూడా అతడు సంబంధమును కలిగియుండుట. ఈ భావనను మతముగా ఇతడు వివరించాడు.

మత వ్యవస్థను ఒక్క మానవ సమాజాలలో మాత్రమే చూడగలము. ప్రాచీన మానవుడు తన చుట్టూ ఆవహించి ఉన్న ప్రకృతి మర్మాలను అవగాహన చేసుకోలేకపోవుట వలన, ప్రకృతి అంటే భయభక్తులను పెంచుకొని ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ప్రకృతి అతీతమైన శక్తులు దాగి ఉన్నవని విశ్వసించి ఆరాధించటం మతపరమైన భావనకు మూలం అని కొందరి అభిప్రాయము. మతము యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏవిధముగా ఉన్నప్పటికీ నాడు, నేడు మతము మానవ సమాజాలలో చెప్పుకోతగినంత ప్రభావమును కలిగియున్నది.

## 18.2 మతము-లక్షణాలు-ప్రకార్యాలు:

Anderson మరియు Park అభిప్రాయములో మత వ్యవస్థ ఈ క్రింది నాలుగు లక్షణములను కలిగియున్నది. అవి:

**1. ప్రకృతి అతీత శక్తుల యెడల విశ్వాసము:**

ప్రతి మతము వ్యక్తులలో వ్యక్తియేతరతో కూడినటువంటి సంబంధాలను ప్రకృతి అతీత శక్తుల యెడల కల్పిస్తుంది. ఈ శక్తులు మానవ జీవితమును, సంఘటనలను ప్రభావితము చేస్తాయని, వాటి పరముగానే మానవ జీవితాలు ఈ సమాజములో రూపుదిద్దుకుంటాయని వారి నమ్మకం. ఈ ప్రకృతి అతీత శక్తులను కొందరు "దేవుడు" అని, మరికొందరు "దేవుళ్లు" అని భావించగా, మరికొందరు ఏ పేరు పెట్టకుండానే ఈ శక్తులను విశ్వసిస్తుంటారు.

**2. ప్రకృతి అతీత శక్తులతో మానవుడు సర్దుబాటు చేసుకొనుట:**

మానవుడు ప్రకృతి శక్తులపై ఆధారపడి యుండుట వలన వాటితో సర్దుబాటు చేసుకొనుటకు తప్పక ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నములో భాగముగా కొన్ని మతపరమైన చర్యలను ప్రతి మతము కలిగి ఉంటుంది. ఉదాహరణకు ప్రార్థనలు చేయుట, కీర్తనలు పాడుట, భజనలు చేయుట, యజ్ఞములు, పూజలు నిర్వహించుట ఈ చర్యల ఉల్లంఘన పాపముగా భావించబడుతుంది.

**3. కొన్ని చర్యలు పాపముగా నిర్ధారించుట:**

ప్రతి మతము కొన్ని చర్యలను పాపపరమైన వాటిగా నిర్ణయించి వాటిని మానవుడు కలిగి యుండకూడదని ఆజ్ఞాపిస్తాయి. ఈ ఆజ్ఞలను మానవులు ఉల్లంఘిస్తే భగవంతుని యొక్క కోపమునకు, శాపమునకు గురికావలసి వస్తుంది.

**4. మోక్షము:**

ప్రతి మతము సక్రమమైన నడవడికి ప్రతిఫలముగా వ్యక్తి మరణానంతరము మోక్షమును ప్రసాదిస్తుంది. మత పరమైన సిద్ధాంతాలను చిత్తశుద్ధితో పాటించిన వారికి మోక్ష ప్రాప్తిని కల్పిస్తుంది. అలా కాని పక్షములో నరకము పాలు చేస్తుంది.

**మతము-ప్రకార్యాలు:**

సమాజములోని మత వ్యవస్థ ఈ క్రింది సామాజిక పరమైన ప్రకార్యాలను కలిగివుంది. అవి:

**1. మతము-సేవ:**

ప్రతి మతము సేవా భావమును ప్రభోదిస్తుంది. మానవ సేవ భగవంతుని సేవ అను సిద్ధాంతమును మతము ప్రభోదించి వ్యక్తులలో సేవా భావనను వృద్ధి చేసి సమాజములో వ్యక్తులు క్షేమముగా జీవించుటకు తోడ్పడుతుంది.

**2. మతము-విద్య:**

మతము మానవ సమాజాలలో విద్యా వ్యాప్తికి ఎంతగానో తోడ్పడుచున్నది. క్రైస్తవ, హిందూ, బౌద్ధ మత సంస్థలు ఆనాడు ఈనాడు విద్యా వ్యాప్తి పరముగా ప్రముఖమైన పాత్రను కలిగియుండి మానవ సమాజాలలో జ్ఞాన అభివృద్ధికి తోడ్పడుచున్నవి.

**3. మతము-దయ:**

మతము దయా గుణమును, దయా స్వభావమును వ్యక్తులు పెంచుకోవాలని ప్రభోదిస్తూ మానవ సంక్షేమమునకు కృషి సల్పుతుంది. పేదలకు, కష్టములలో ఉన్న వారికి సహాయపడుట, దయ చూపించుట భగవంతుని యెడల దయ చూపినట్లేనని మతము ప్రభోదిస్తుంది.

**4. మతము-దానము:**

దాదాపుగా ప్రపంచంలోని అన్ని మతాలు వ్యక్తులు దాన గుణము కలిగి యుండవలెనని ప్రభోదిస్తూ సమాజ సంక్షేమమును కోరుకుంటాయి.

**5. మతము-సహనము:**

ప్రతి మతము సమాజములోని ప్రతి వ్యక్తి ఇతరుల యెడల సహనముతో వ్యవహరించాలని ప్రభోదిస్తూ సమాజ సంక్షేమమును కోరుకుంటాయి.

**6. మతము-అహింస:**

ప్రపంచములోని ఏ మతము కూడా హింస ప్రభోదాన్ని కలిగియుండలేదు. అన్ని మతాలు అహింసా సూత్రాలను మాత్రమే ప్రభోదిస్తున్నాయి. భగవంతునిగా భావించబడుతున్న క్రీస్తు శిలువపై మరణిస్తూ తనను చంపుచున్న వారిని క్షమించమని ప్రార్థన చేశాడు.

పైన చెప్పుకున్నటువంటి వివిధ ప్రకార్యముల ద్వారా మతము సమాజాలలో సహోదర ప్రేమను ప్రభోదిస్తుంది. సృష్టి భగవంతుని యొక్క నిర్మాణమని, కానీ అతనిని వేరు వేరు పేర్లతో ఆరాధిస్తారని, ప్రపంచము ఒక కుటుంబమని సర్వ మాతాలు ప్రభోదిస్తూ మానవుని చర్యలను క్రమబద్దము చేస్తాయి.

## 18.3 ఆదిమ తెగ మతము-వివరణ:

నేటి ఆధునిక నాగరిక సమాజాలలో కన్నా ఆదిమ తెగలలో మతమునకు ఈనాటికీ విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. వీరి మత వ్యవస్థ అతి ప్రాచీనమైనది. మతము యొక్క అంగీకారము లేకుండా ఏ అంశము వీరు అమలు చేయరు. ఆదిమ తెగ మతమును ఈ క్రింది విధముగా అవగాహన చేసుకొనచ్చును. అవి:

**1. మన:**

మన అనునది ఒక ప్రకృతి అతీతమైన శక్తి. ఈ శక్తి రెండు రకములుగా ఉండును. మంచి మన మరియు చెడు మన. మంచి మన ప్రభావమునకు లోనైననప్పుడు వ్యక్తులు మంచి ప్రవర్తన కలిగి ఉంటారని, చెడు మన ప్రభావమునకు లోనైననప్పుడు చెడు ప్రవర్తన కలిగి ఉంటారు. ఈ విధముగా సమాజములోని వ్యక్తుల మంచి, చెడుల ప్రవర్తనలకు మన శక్తి ప్రభావమే కారణమని వీరు విశ్వసిస్తారు.

**2. బొంగ:**

ఆదిమ తెగ ప్రజలు ప్రకృతిలోని ప్రతి వస్తువు వెనుక ఉన్న ప్రకృతి అతీత శక్తిని బొంగగా భావిస్తారు. ఇది వర్షము, తుఫాను, చలి, వరదలు, అంటువ్యాధులు, క్రూర మృగాలు వాటిలో ఉండి ప్రతి సంఘటనకు బాధ్యత వహిస్తుంది. ఒక విధముగా పైన చెప్పుకున్న మన భావనకు ఇది మరో రూపము.

**3. జీవాత్మ వాదము:**

భారత సమాజములోని ఆదిమ తెగల మత వ్యవస్థ యొక్క అతి ముఖ్యమైన లక్షణము జీవాత్మ వాదము. Risley అభిప్రాయములో ఆదిమ తెగ మతము జీవాత్మ వాదము. దీని ముఖ్య భావన ప్రకృతిలోని ప్రతి అంశము ఏదో ఒక అతీతమైన శక్తిని కలిగియుంటుంది అనెడి విశ్వాసము. ఈ విశ్వాసము ఆధారముగానే "సంతాల్" తెగలో ప్రతిమలకు పూజలు చేయుట, పితృ ఆరాధన జరుపుతూ ఉంటారు.

**4. ఎనిమేటిజం:**

ఈ రకమైన మత భావనలో ప్రాణము లేని వస్తువులలో కూడా అతీత శక్తులు దాగి ఉంటాయని విశ్వసించడం. ఎముకలలో, ఈకలలో కూడా అతీత శక్తి దాగి ఉంటుందని వీటికి పూజలు చేస్తారు. సమూహ శాంతిని అభివృద్ధిని ఆకాంక్షించి వీటిని ఆరాధిస్తారు.

**5. ప్రకృతి ఆరాధన:**

ఆదిమ తెగ మతపరమైన విశ్వజనీయమైన లక్షణము ప్రకృతి ఆరాధన. అస్సాంలోని "గ్యారో" తెగ వారు సూర్యచంద్రులను పూజిస్తారు. "ముండ" తెగ వారు సూర్యదేవునిని ఆరాధిస్తారు. నదులను, నక్షత్రాలను, వృక్షాలను మొదలగు ప్రకృతి అంశాలను చాలా తెగలలో ఆరాధిస్తుంటారు.

**6. పునర్జన్మ విశ్వాసం:**

ఆదిమ తెగలో పునర్జన్మ విశ్వాసము ఎక్కువ. వ్యక్తి చనిపోయిన తరువాత రెండుసార్లు కర్మకాండలను జరుపుతారు. కొన్ని సందర్భాలలో రెండవసారి జరుపు కర్మకాండ ముఖ్యమైనదిగా భావిస్తారు. ఎందుకనగా ఆత్మ శాశ్వతము అని వీరు ననమ్ముతారు. "నాగా" తెగలో చనిపోయిన వ్యక్తి యొక్క పుఱ్ఱెను ఒక కొయ్య స్తంభమునకు అమర్చి దానిని ప్రాణిగా భావించి అన్ని సౌకర్యాలను ఏర్పరుస్తారు. దీనికి ప్రతి దినము ఆహారమును పెడుతుంటారు. వీరి విశ్వాసము ఆత్మ ఆ పుఱ్ఱె గుండా వెళు తుందని. "భిల్" తెగలో చనిపోయిన వ్యక్తి యొక్క ఆత్మ ఏ ప్రాణిలో ప్రవేశించుతుందో కూడా పరిశీలన చేస్తుంటారు.

**7. మ్యాజిక్:**

ఆదిమ తెగ మతము యొక్క మరియొక లక్షణము మ్యాజిక్ యెడల నమ్మకము.

**8. టోటెమ్:**

ఆదిమ తెగ ప్రజలు కొన్ని ప్రకృతి అతీతమైన శక్తులు తమను కాపాడుతున్నాయని విశ్వసిస్తారు. ఈ ప్రకృతి అతీత శక్తి

ఏ వస్తువులో ఉన్నదో ఆ వస్తువును ఆరాధిస్తారు. అలా ఆరాధింపబడే వస్తువును టోటెమ్ అంటారు. ఈ విధముగా టోటెమ్ జంతువు అయి ఉండవచ్చును. వృక్షమై ఉండవచ్చును లేదా ప్రకృతిలోని ఏ వస్తువైనా అయి ఉండవచ్చును.

పైన చెప్పుకున్న విధముగా ఆదిమ తెగ వ్యవస్థ అతి ప్రాచీనమైనటువంటిది. ఆదిమ తెగలో మత వ్యవస్థ ఒక భాగమని చెప్పుట కంటే వారి జీవిత విధానములో ఉంటుందని చెప్పుట సత్యము. వీరి మతపరమైన చర్యలను ఆధారము చేసుకొని సామాజిక చర్యలు ఉండేవి.

## 18.4 గోత్రము-కులము, గోత్రము-తెగ, తెగ-కులము:

ఆదిమ తెగలో గోత్రము, కులము, తెగల మధ్య ఉన్న వ్యత్యాసములను గమనించుము.

**గోత్రము-కులము:**

గోత్రములను పురాణ పురుషుడు పితరునిగా యుండగా, కులములో ఆ విధముగా ఉండదు. గోత్రము బాహ్య వివాహ సమూహమై ఉండగా, కులము అంతర్వివాహ సమూహము. గోత్రములో సభ్యులందరూ ఒకే రకమైన సామాజిక అంతస్థును కలిగి యుండగా, కులములోని వ్యక్తులలో ఒకే రకమైన అంతస్థు కనిపించదు.

**గోత్రము-తెగ:**

గోత్రమునకు, తెగకు ఈ క్రింది వ్యత్యాసములు కలవు. గోత్రమునకు స్థిరమైన భౌగోళిక ప్రాంతము అవసరము లేదు. కానీ, ఆదిమ తెగకు స్థిరమైన భౌగోళిక ప్రాంతము ఉండవలెను. గోత్రమునకు ప్రత్యేకమైన భాష ఉండదు. తెగకు ఒకే భాష ఉంటుంది. గోత్రము బాహ్య వివాహ సమూహమై యుండగా, తెగ అంతర్వివాహ సమూహము.

**ఆదిమ తెగ-కులము:**

ఆదిమ తెగ, కులము రెండూ అంతర్వివాహ సమూహములే. కానీ, ఈ రెండింటికీ ఈ క్రింది వ్యత్యాసములు ఉన్నవి. అవి:

1. కులములో, కుల పరముగా సభ్యులందరూ ఒకే అంతస్థును కలిగియుండగా, ఆదిమ తెగలో అలా లేదు.
2. ఆదిమ తెగ రాజకీయ పరిపాలన వ్యవస్థయైయుండగా, కుల వ్యవస్థ ఆ విధముగా కాదు.
3. కుల సభ్యులు కుల వృత్తులను పాటించవలసి యుండగా ఆదిమ తెగలో ఆ విధముగా కాదు.
4. రిస్లే అభిప్రాయములో ఆదిమ తెగలు కాలక్రమేణా కులములుగా మారుచున్నవి.

## 18.5 నిషేధాలు:

ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో నిషేధాలు ప్రాముఖ్యతను కలిగియున్నవి. ఆదిమ తెగలో క్రమత చెడిపోకుండా క్రమ రాహిత్యము ఏర్పడకుండా ఉండుటకు కొన్ని నిషేధాలు నిర్మాణమై ఉన్నాయి. వాస్తవమునకు వ్యక్తుల చర్యలను, ప్రవర్తనలను క్రమబద్ధము చేయుటకు ప్రతి మానవ సమాజములో నిషేధాలు తప్పనిసరిగా అమలులో ఉంటాయి. వీటి ఉల్లంఘించుట వలన దండనకు, విమర్శకు లేదా అవహేళనకు గురికావలసి వస్తుంది. సహజముగా వీటిని ఉల్లంఘించుటకు ఎవరు సాహసించరు.

**ఆదిమ తెగలోని కొన్ని నిషేధాలు:**

1. అప్పుడే పుట్టిన శిశువును, శవమును ముట్టుట నిషేధము.
2. గృహము నుండి బయటకు వచ్చునప్పుడు కాలుజారిపడుట, అపశకునపు జంతువులు ఎదురు వచ్చినప్పటికీ ప్రయాణములు చేయుట నిషేధము.

3. ఒకే గోత్రమునకు చెందిన స్త్రీ, పురుషుల మధ్య వివాహము నిషేధము.

4. టోటెముగా భావించబడే జంతువును వేటాడుట, గాయపరుచుట, భుజించుట నిషేధము.

5. చెడు మన ప్రభావము వలన చెడు చర్యలను, ప్రవర్తనలను కలిగియున్న వ్యక్తులను తెగ నుండి బహిష్కరిస్తారు. అటువంటి వారితో మాటలాడుట, వారు పెట్టిన ఆహారము భుజించుట నిషేధము.

పైన చెప్పుకున్న వివిధ నిషేధములను ఉల్లంఘించుట ద్వారా వ్యక్తులు "కాపు", "తాహు" అను శక్తుల అధీనములోకి వెళతారు. కొన్ని మతపరమైన సంస్కారాలు జరిపితేనే కానీ వీరు ఆ శక్తుల నుండి విముక్తులు కాలేరు. కనుక నిషేధముల ఉల్లంఘనకు ఎవరు సాహసించరు.

పైన చెప్పుకున్న విధముగా నిషేధాలు ఆదిమ తెగ సామాజిక వ్యవస్థాపనలో ముఖ్యమైన భాగముగా ఉండి క్రమరాహిత్యము ఏర్పడకుండా చూస్తుంది.

## 18.6 ఆదిమ తెగ-ఆర్థిక విధానాలు:

ఆదిమ తెగ ఆర్థిక విధానము ఈనాటికీ ప్రాచీన పద్ధతుల ద్వారా జరుగుచున్నది. ఈనాటికీ కొన్ని వందల ఆదిమ తెగలు అడవులలో, కొండల ప్రాంతాలలో నివశిస్తూ ప్రాచీన ఆర్థిక విధాన పద్ధతులను కలిగియున్నారు. వీరి ఆర్థిక వ్యవస్థాపనలోని అంశములను ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును. అవి:

1. వేట మరియు ఆహారమును సమకూర్చుకొనుట-"కాదర్", "చెంచు", "కార్య" తెగలు.

2. పశుపోషణ-"తోడ", "భిల్" తెగల వారు.

3. వ్యవసాయము-"కమార్", "వేగ" మొదలగు తెగలు.

4. పరిశ్రమలు-"కార్య", "నాగా" తెగలు.

ఆదిమ తెగ ఆర్థిక విధానములో కేవలము వినియోగము కొరకే ఉత్పత్తి ఉంటుంది. రేపటి కొరకు ధనార్జన, లాభములు మొదలగు భావనలకు వీరి ఆర్థిక విధానములో చోటులేదు. భౌగోళిక పరిసర కారకాలు వీరి ఆర్థిక విధానముపై ప్రభావాన్ని కలిగిఉంటాయి. వీరిలో ఆర్థిక పరమైన తిరోగమనము కల్పించుటకు ఈ క్రింది కారణములు ముఖ్యమైన వాహకాలు. అవి:

1. సాంకేతిక పరిజ్ఞాన సహాయము లేకుండగా ఉత్పత్తిని తెచ్చుటకు ప్రయత్నించుట.

2. ఆర్థిక చర్యలను మతము మరియు మ్యాజిక్‌తో ముడిపెట్టి నిర్వహించుట.

3. ఉత్పత్తి కేవలము వినియోగమునకే పరిమితమై యుండుట.

4. ద్రవ్య విలువ తెలియకపోవుట.

5. రెగ్యులర్ మార్కెట్ వసతి లేకపోవుట.

6. ఉత్పత్తి లాభదాయక పద్ధతిపై ఆధారపడి ఉండకపోవుట.

7. సాముదాయక భావనతో కూడికొనియున్న ఆర్థిక కార్యకలాపాలు

8. నైపుణ్యతకు ప్రాధాన్యత లేకపోవుట.

పైన చెప్పుకున్న వాటిని బట్టి ఈనాటికీ ఆదిమ తెగ ప్రజలు బాణములతో, బల్లెములతో వేటాడుట, పోడు వ్యవసాయ పద్ధతిని కొనసాగించుట, తాము తయారు చేసిన ఉత్పత్తికి లాభకరమైన దరను నిర్ణయించగలిగెడి ద్రవ్య విలువ తెలియకపోవుట,

ఆర్థిక కార్యకలాపాలతో మతమును జోడించుట. ఉదాహరణకు భూమి నిస్సారమైనప్పుడు దానిని సారము చేయుటకు జంతు బలులను ఇచ్చి ఆ రక్తమును భూమిపై ప్రోక్షిస్తారు. నాగరిక సమాజ సభ్యులు వీరి అమాయకత్వమును ఆసరా చేసుకొని మోసగించుట వలన కూడా వీరు ఆర్థికముగా ఎదగలేకపోవుచున్నారు. అందువలన వీరు ఆర్థికముగా చాలా వెనుకబడియున్నారు.

**18.7 ఆదిమ తెగ సమస్యలు-సంక్షేమ కార్యక్రమాలు:**

భారతదేశము స్వాతంత్ర్యము పొందిన నాటి నుండి ఆదిమ తెగల సమస్యలను గుర్తించి, ప్రభుత్వము వీరిని కూడా నాగరిక సమాజములోకి తీసుకొని రావలెనని వివిధ రకములైన కార్యక్రమాలను చేపట్టుచూ కోట్లాది రూపాయలు ఖర్చు చేయుచున్నది. ఈ సంక్షేమ కార్యక్రమాలను తెలుసుకొనుటకు ముందు వీరి సమస్యలను అవగాహన చేసుకుందాం. అవి ఈ క్రింది విధముగా ఉన్నవి.

1. మతాంధ కారణము.

2. సంస్కృతికి భద్రత లేకపోవుట.

3. వీరి భాషలకు లిపి లేకపోవుట.

4. స్వార్థపరుల దౌర్జన్యాలకు, దోపిడీకి గురియగుట.

5. నిరక్షరాస్యత, అజ్ఞానము, మూఢనమ్మకాలు అధికముగా ఉండుట.

6. విద్య, ఆరోగ్య, మంచినీటి సదుపాయములు లేకపోవుట, గృహవసతి, రవాణా సౌకర్యాలు లేకపోవుట, భూమిపై హక్కు, ఋణ సౌకర్యాలు లేకపోవుట.

**ఆదిమ తెగ-సంక్షేమ కార్యక్రమాలు:**

ఆదిమ తెగ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టుటకు జవహర్‌లాల్ నెహ్రూ కాలములో "పంచశీల" సిద్ధాంతము ప్రవేశపెట్టబడినది. భారత రాజ్యాంగము ఆర్టికల్ 335 ప్రకారము వీరికి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయవలె. వీరి సంక్షేమము కొరకు ప్రభుత్వము వివిధ ప్రణాళికలను తయారు చేసి, కోట్లాది రూపాయలు ఖర్చు చేయుచున్నది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఈ విధముగా అవగాహన చేసుకోవచ్చు. అవి:

1. ప్రభుత్వ ఉద్యోగములలో విద్యా సంస్థలలో 7.5 శాతము రిజర్వేషన్ సౌకర్యము.
2. వీరి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించుటకు కేంద్రస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ట్రైబల్ సంక్షేమ కార్యాలయాల స్థాపన.
3. చట్ట సభలలో ప్రాతినిధ్య పరముగా వీరి జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వీరికే రిజర్వేషన్ సౌకర్యము.
4. భూమి హక్కు మొదలగు వాటి పరముగా చట్టములను ప్రవేశపెట్టుట.
5. దీర్ఘకాలిక ఋణములను మంజూరు చేసి పరిశ్రమలకు చేయూతనిచ్చుట. గృహ, ఆరోగ్య, మంచినీటి, రవాణా సౌకర్యాలను కల్పించుట.
6. రెగ్యులర్ మార్కెట్ వసతిని ఏర్పరచుట. వీరి ప్రాంతాలలో ప్రత్యేకముగా వీరి కొరకు ఆశ్రమ పాఠశాలలను స్థాపించుట.
7. స్వయం సమృద్ధి పథకాల క్రింద వీరికి ఋణాలను మంజూరు చేయుట మొదలగునవి.

పైన చెప్పుకున్న సంక్షేమ కార్యక్రమాలు అనుకున్నంతగా ఫలితాలను ఇవ్వలేకపోవుచున్నవి. ఇందుకు ప్రబల కారణము నిధుల దుర్వినియోగము. అధికారులలో చిత్తశుద్ధి లేకపోవుట, రాజకీయ నాయకుల ప్రమేయము. అంతేకాకుండా వీరి సంక్షేమము కొరకు ప్రవేశపెట్టిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయకపోవుట కూడా ఇప్పుడు చెప్పుకున్న లోపాలను సవరించుకొనగలిగితే ఆదిమ తెగ ప్రజలు సంక్షేమ కార్యక్రమాలను ఆసరా చేసుకొని భారత నాగరిక సమాజములో కలిసిపోయి అభివృద్ధిని పొందగలరు.

## 18.8 ముగింపు:

ఈనాటికీ నాగరిక ప్రపంచముతో సంబంధము పెట్టుకొనకుండగా ఆదిమ తెగ ప్రజలు అడవులలో నివసించుటకు గల ప్రబలమైన కారణము వారి సంస్కృతి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వారు ఉపయోగించుకొనకుండా భయాందోళనలతో వాటిని తిరస్కరించుచున్నారు. వీటిని తొలగించి సంక్షేమ కార్యక్రమాలను వారికి దగ్గరలో ఉంచి వారు అభివృద్ధి చెందిన నాగరిక సమాజములో కలిసిపోవు రోజు అతి సమీపములో ఉన్నదని ఆశిద్దాం.

## 18.9 పారిభాషిక పదములు:

Religion : మతము

Non-Secularism : అలౌకిక భావన

Belief in Super Natural Forces : ప్రకృతి శక్తుల యెడల విశ్వాసము

Adjustment to Super Natural Power : ప్రకృతి శక్తులతో సర్దుబాటు చేసుకొనుట

Sin : పాపము

Salvation : మోక్షము

Religion-Service : మతము-సేవ

Religion-Education : మతము-విద్య

Religion-Benevolence : మతము-దయ

Religion-Almsgiving : మతము-దానము

Religion-Forbearance : మతము-సహనము

Religion-Non-Violence : మతము-అహింస

Animism : జీవాత్మ వాదము

Naturalism : ప్రకృతి ఆరాధన

Faith in Rebirth : పునర్జన్మ విశ్వాసము

Taboos : నిషేధాలు

Economic Organisation (or) Economy : ఆర్థిక విధానము

Consumption : వినియోగము

Production : ఉత్పత్తి

Specialisation : నైపుణ్యత

Food Gathering : ఆహారము సేకరించుట

Welfare Activities : సంక్షేమ కార్యక్రమాలు

Religious Conversion : మతాంతీకరణము

## 18.10 సంగ్రహ ప్రశ్నలు:

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. మతమును నిర్వచించి, లక్షణములను, ప్రకార్యములను గురించి తెలుపుము.

2. ఆదిమ తెగ మతముపై వ్యాసము వ్రాయుము.

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములు వ్రాయుము.**

1. మతము-నిర్వచనము

2. ఆదిమ తెగ-సమస్యలు

3. ప్రభుత్వము చేపట్టుచున్న వివిధ ఆదిమ తెగ సంక్షేమ కార్యక్రమాలను వివరింపుము.

## 18.11 చదువదగిన గ్రంథములు:

1. Sociology : Green,A.W.

2. Sociology : Johnson, H.M.

3. Science and Religion and Other Essays : Malinowski B., Magic